TIGHT BINGING BOOK

UNIVERSAL LIBRARY
OU_204527
UNIVERSAL LIBRARY

OSMANIA UNIVERSITY LIBRARY

Call No. T81.6/T39D Accession No. T1306

Author తిరుపతి వేంకటేశ్వరకవి

Title దేవీ భాగవతము. Pt II.

This book should be returned on or before the date last marked below.

శ్రీ

దేవీభాగవతము

(ఉత్తరార్ధము)

శ్రీ తిరుపతి వేంకటేశ్వరకవి

ప్రణీతము.

షష్టిపూర్త్యుత్సవ సంఘముచే

ప్రకటింపబడెను.

[illegible]

[illegible]

[illegible]

సర్వస్వామ్య సంకలితము.

1934

గ్రంథ పరిచయము

ఈ దేవీభాగవతోత్తరార్ధమునుగూర్చి యొండు రెండు మాటలు చెప్పవలసియున్నది. ఇందలి నవమస్కంధమును రచించిన నిశ్శంకుల కృష్ణమూర్తిగారును, ఆకొండి రామమూర్తిగారును మురుమళ్ల పోలవరగ్రామవాసులు, సహపాఠులును. కృష్ణమూర్తిగారా యూరికరణము. రామమూర్తిగారు అనాది సుప్రసిద్ధాయుర్వేద వైద్యవంశములోనివారు. వీరిరువురును చక్కని సాహితిగల కవులు.

రామమూర్తిగారు శ్రీ వేంకటశాస్త్రులవారికి బంధువులు. ఇప్పటికి సుమారు 34 సంవత్సరములనాఁడు వేంకటకవిగారు వీరింట నుండి వైద్యము చేయించుకొను సమయమున దేవీ భాగవతము రచించుచుండిరి. కాన ఆ కవిద్వయమునందలి ప్రీతిచే ఈ నవమస్కంధమును దెలిగింపుఁడని వారి కొసంగిరి.

ఈ స్కంధముననే ప్రథమమున నైదును, చిగురున రెండును నధ్యాయములు శ్రీ తిరుపతి శాస్త్రులవారి పుత్రులగు వేంకటావధానిగారిటీవల పూరించిరి. పిమ్మట వేంకటశాస్త్రులవారెన్నడు నా స్కంధమును చూచుట తటస్థింపలేదు. తక్కిన భాగములనువలెనే దీనిని గూడ శ్రీ వేలూరి శివరామశాస్త్రిగారే సరిచూచి మాకు ముద్రించుట కిచ్చిరి. ఇది నవమస్కంధ వృత్తాంతము.

ఇక నిందలి దశమస్కంధమును, శ్రీ వేంకటశాస్త్రిగారి పినతండ్రి కొమరులగు చిన వేంకటశాస్త్రిగారు రచించిరి. ఈ చిన వేంకటశాస్త్రిగారు బాల్యమున తమయొద్ద కవితాభ్యాస మొనర్చు కాలమున వేంకటశాస్త్రిగారీ స్కంధమును వారిచేఁ దెలిగింపఁ జేసిరి. ఈ చిన వేంకటశాస్త్రిగారు అవధానిగా, పండిత కవిగా పేరుగన్నవారు. కీర్తిమాత్రశేషులు. ఇది దశమస్కంధ వృత్తాంతము.

ఇట్లు
పరిచరణకార్యదర్శి,
కాటూరి వేంకటేశ్వరరావు.

ఆంధ్రజాతీయ కళాశాల,
బందరు.

విషయసూచిక

సప్తమస్కంధము

	ఫుట.
బ్రహ్మాద్యుత్పత్తి	2
సూర్యవంశ విస్తారము	5
సుకన్యా చ్యవన వివాహము	13
అశ్వినులును సుకన్యయు సంభాషించుట	17
చ్యవనునికి యౌవనప్రాప్తి	21
శర్యాతి యజ్ఞం బొనర్చుట	29
రేవతుఁడు బ్రహ్మలోకమ్మున కరుగుట	34
శశాద చరిత్ర	39
మాంధాతృ చరిత్ర	43
సత్యవ్రతోపాఖ్యానము	45
రాజనీతి	51
వసిష్ఠుండు త్రిశంకునకు శాపం బిచ్చుట	55
త్రిశంకుండు స్వర్గమ్మున కరుగుట	63
రోహితోత్పత్తి	66
హరిశ్చంద్రుఁడు నరమేధం బొనర్చుట	73
వసిష్ఠ విశ్వామిత్ర సంవాదము	81
విశ్వామిత్రుండు హరిశ్చంద్రుని వంచించుట	85
హరిశ్చంద్రుండు కాశికిఁబోవుట	91
హరిశ్చంద్రుండు భార్య నమ్ముకొనుట	96
రోహితుండు క్రీతుండగుట	101
హరిశ్చంద్రుఁడు చండాలునిచేఁ గ్రీతుండగుట	106
హరిశ్చంద్రుండు శ్మశానమ్మున నుండుట	112
శైబ్య పుత్రమృతికి శోకించుట	114
తలవరులు శైబ్యం గట్టి తీసికొనిపోవుట	119
హరిశ్చంద్రుండు తనపత్ని నెఱుంగుట	123
చంద్రమతి పుత్రుండు మృతుఁడైన చందము పతికిఁ దెల్పుట	128
బ్రహ్మాది దేవతలు ప్రత్యక్షం బగుట	130

పుట.

హరిశ్చంద్రుండు కొడుకునకు రాజ్యం బిడి పౌరులతో స్వర్గమ్మున కరుగుట 134
శతాక్షీ మహిమ 136
శతాక్షీ దుర్గముం బరిమార్చుట 140
సనకాదులకు దేవి ప్రత్యక్షం బగుట 144
దేవీస్థానమ్ములు 149
గౌరీజన్మము 153
దేవీ విశ్వరూప ప్రదర్శనము 160
మోక్షమ్మునకు జ్ఞానం బావశ్యక మనుట 167
యోగమంత్ర వివేచనము 171
ధ్యానయోగము 177
భక్తియోగము 180
దేవీ వ్రతోత్సవాదికము 185
దేవీపూజా విధానము 188

అష్టమస్కంధము

సృష్టి కావింపఁగోరి మనువు దేవిచే వరము వడయుట 199
నారాయణుండు వరాహరూపమ్మున భూమి నుద్ధరించుట 201
ప్రియవ్రతవంశ వర్ణనము 204
సప్తద్వీపోత్పత్తి క్రమము
కులపర్వత వర్ణనము
భారతాదివర్ష వర్ణనము
ప్లక్షాదిద్వీప వర్ణనము
లోకాలోకపర్వత వర్ణనము
సూర్యగమన వర్ణనము
చంద్రాదిగ్రహగతి వర్ణనము
శింశుమార వర్ణనము
అధోలోక వర్ణనము
నరకలోక వర్ణనము
జగదంబార్చనావిధానము

నవమస్కంధము

పీఠిక
కథారంభము
పంచ ప్రకృత్యాద్యుత్పత్తి
కృష్ణకృత దేవతావ్యవస్థితి
సరస్వతీ స్తోత్రము
లక్ష్మీ గంగా సరస్వతులకు జ ప్రాప్తి
గంగోత్పత్తి
గంగా విష్ణు సంబంధ కారణ నము
తులసీ సంగమ వర్ణనము

	పుట.
సావిత్రీ పూజాది కథనము	394
మంగళచండ్యుపాఖ్యానము	437
సురభ్యుపాఖ్యానము	444
రాధా దుర్గా పూజావిధానము	448

దశమస్కంధము

స్వాయంభువ మనుచరిత్రము	462
వింధ్యము గ్రహగతుల నరికట్టుట	464
అగస్త్యుఁడువింధ్యగర్వముహరించుట	472
స్వారోచిషాది మనుచరిత్రము	475
సావర్ణి మనుచరిత్రము	478
మహాకాళీ మహాలక్ష్మీ మహాసరస్వతుల యావిర్భావము	481
భ్రామరియను దేవి వృత్తాంతము	489

ఏకాదశస్కంధము

ఆచారలక్షణము	498
రుద్రాక్షధారణ విధి	507

	పుట.
రుద్రాక్షధారణ మహిమము	517
శిరోవ్రత మహిమము	521
ఊర్ధ్వపుండ్ర విధానము	531
సంధ్యోపాసనా మహాత్మ్యము	533

ద్వాదశస్కంధము

సురగర్వాపహారణము	545
అంబ ఇంద్రునకుఁ దన మహిమ దెలుపుట	551
గౌతమ కృత గోవధ	554
గౌతముఁడు బ్రాహ్మణుల శపియించుట	560
మణిద్వీపవర్ణనము	564
జనమేజయుఁడంబా మఖ మాచరించుట	575

శ్రీ తిరుపతి వేంకటేశ్వర కవులు.

శ్రీమత్పరదేవతాయై నమః

శ్రీ
దేవీభాగవతము

సప్తమస్కంధము

ప రతత్త్వాదర ! నిస్తుల
తరపాండిత్యప్రకర్ష ధర్మోత్కర్షా
భరణ ! కలుషాపహరణ ! వి
తరణగుణనిదాన ! బ్రహ్మతత్త్వధీనా !

వ. అవధరింపు మనంతరంబు శౌనకాదులు సూతుం గాంచి యవ్వలి కత నొడువు మనుడు నక్కథకుం డిట్లను నట్లు పురాణకథనోన్ముఖుండగు వ్యాసునకు జనమేజయుం డిట్లనియె. ౨

చ. హిమకరుఁడున్ దివాకరుఁడు నేరికి వంశకరుల్ క్రమమ్ముగా
నమలినకీర్తులై వెలయు నమ్మహిపాలుర యోగ్యతల్ వినం
గ మనముపుట్టె శక్తిపదకంజరతుల్ గద వీర, లిట్టి యు
త్తములచరిత్రకన్న శుభదం బిఁక నెయ్యది మౌనిసత్తమా. ౩

వ. నావుడు వ్యాసుండు ప్రీతమనస్కుండై, నరేంద్రా! సూర్యచంద్ర
వంశజులయు నన్యులయు జన్మమ్ము లాదిగ నఖిలంబును విస్త
రించెద నాకర్ణింపుము. ౪

—* బ్రహ్మాద్యుత్పత్తి *—

గీ. అబ్జలోచను నాభియం దవతరించి
మించి తపమున దేవి మెప్పించి వరము
గైకొని జగంబు సృష్టింపఁగాఁ గడంగి
మనుజుల సృజింపలేక యవ్వనజభవుఁడు. ౫

వ. మనమ్మున బహుభంగుల యోజించి మరీచ్యంగిరోఽత్రి వసిష్ఠ
పులహక్రతుపులస్త్యు లను మానసపుత్త్రుల నేడ్వురఁ బ్రథమ
మ్మున నొనరించె, నంత రోషమ్మువలన రుద్రుండును నుత్సంగ
మ్మువలన నారదుండును నంగుష్ఠమ్మున దక్షుండును నుద్భవిం
చిరి. తక్కఁగల సనకాదులును బ్రహ్మమానసపుత్త్రులకా నెఱుం
గునది, వామాంగుష్ఠమునుండి దక్షపత్నియగు వీరిణి జనియించె.

గీ. మఱియును నసిక్ని యనఁగ నిమ్మగువ కింక
నొక్క నామమ్ము గల దీపె కుద్భవించె
మరల నారదుఁ డనుడు నమ్మౌని కిట్టు
లనియె జనమేజయుఁడు సంశయంబు గదుర. ౬

క. వీరిణికి దక్షునకు న
న్నారదుఁ డేకారణమ్మునన్ జనియించెన్
ధీరుం డతనికిఁ బూర్వశ
రీరం బెటు వోయె నెట్లు మృత్యువు దొడరెన్. ౭

ఉ. నావుడు వ్యాసుఁ డిట్లను జనస్తుత! ధాతయనుజ్ఞ దక్షుఁడుం
జేవ గలట్టి పుత్త్రుల సృజించెఁ గళత్త్రమునందు నైదువే
లావిమలాత్ము లాదఱును నాత్మజులన్ సృజియించి సృష్టి నెం
తే వెలయించునయ్యెడల నిట్లనె నారదమౌని వారికిన్. ౯

వ. భూపరిమాణం బెఱుంగక మున్న ప్రజాసృష్టిం బొనర్చు బాలిశు
లగు మీర లపహాస్యత నొందుట నిక్కం బనవుడు నా హర్య
శ్వులు తమలోఁ దమరు మునివచనంబు విశ్వాసార్హంబని యెంచి
కొని భూప్రమాణం బరయ నందఱును బయలువెడలి నలుది
క్కులకుం జనినంత దక్షుండు పుత్త్రులేగుటకుఁ జింతించి మరల
గొందఱ నక్కార్యంబునకుఁ బుట్టించిన వారలు తదాజ్ఞంజేసి
సర్గంబున కుద్యమించునెడ నారదుండు యథాపూర్వమ్ముగ
వారలం జూచి పల్కుడు వారలును దద్వచనమోహితులై భూప్ర
మాణం బరయ నరిగిన దక్షుండు తత్పుత్త్రవిరహమ్మున శోకా
ర్తుండై నారదుం గాంచి, ౧౦

క. నాకొమరుల నిటు చేసిన
నీకయ్యెడి గర్భవాసనిష్ఠురదశ నా
కే కొమరుఁడ వగు మనుచున్
వే కనలి శపింపఁ బుట్టె వీరిణి కతఁడున్. ౧౧

వ. పిమ్మట దక్షుం డఱువదిమంది కన్నియల సృష్టించి యందుఁ
బదుమూఁగురఁ గశ్యపునకును బదుగుర ధర్మునకును నిరువది
యేడ్వుర సోమునకును నిరువుర భృగువునకును నల్వుర నరిష్ట
నేమికిని నిరువురఁ గృశాశ్వునకును నిరువుర నంగిరసునకును
నిచ్చిన నవ్వారల కందఱకును సంతానం బుద్భవించె. ౧౨

క. వారల కుదయించిన య
వ్వారలు నవ్వారిసుతులు బలియురు శూరుల్
ధీరులు పరస్పరమ్మును
వైరులు సుర లసురు లగుచు వర్ధిలిరి నృపా. ౧౩

క. నావుడు జనమేజయభూ
మీవిభుఁ డిట్టులను దెల్పుమీ రవికులమం
దావిర్భవించి ధర్మ
శ్రీ వెలసిన నృపవరుల చరిత్రము నాకున్. ౧౪

వ. వ్యాసుం డిట్లను, నరేంద్రా! మున్ను నారదుండు నాకెఱింగించిన తెఱంగునఁ దెల్పెద నాలింపు మొక్కనాఁ డతండు నేను దపం బొనరించు సరస్వతీతీరమ్మున కరుదెంచిన నమ్మహామహు నర్ఘ్యపాద్యాదికృత్యమ్ముల నర్చించి యాసనస్థితుఁ గావించి యిట్లంటి, ౧౫

గీ. పావితుఁడనైతి నీరాకఁబట్టి యేను
సప్తముం డగు మనువువంశమునఁ బుట్టి
జగతి పాలించురాజులచరితములను
వినవలఁతు ననుఁ గరుణించి మునివరుండు. ౧౬

వ. నన్నుం గాంచి యిట్లు చెప్పం దొడంగె. ౧౭

క. విను సత్యవతీసుత య
వ్వనజాక్షునినాభిఁ బుట్టెఁ బద్మమ్మున న
వ్వనజాసనుఁ డీజగమున
కనఘుం డాతండ కర్త యఖిలవిధములన్. ౧౮

వ. సర్వశక్తియుక్తుండును సర్వజ్ఞుండును నగు నన్నలువ పదివేల వత్సరంబులు తపం బొనర్చి పరదేవతానుగ్రహంబు వడసి శుభ

లక్షణలక్షితులగు మానసపుత్త్రుల ననేకుల సృజించె; నందు మరీచి యధికుండై సృష్టియందు నేర్పరియై మించె, నతని కొమరుండు కశ్యపుఁ డతనికి దక్షసుతలు పదుమూగురు భార్యలైరి.

—* సూర్యవంశవిస్తారము *—

గీ. కశ్యపున కుదయించి రక్కాంతలందు
సురలు నసురులు యక్షకిన్నరు లురగులు
మనుజులును బశువులుఁ బక్షులును గ్రమముగ
దాన నీ సృష్టి కాశ్యపినా నెసంగె. ౨౦

వ. అందు దేవతలలో సుప్రసిద్ధుండగు వివస్వంతుని కొమరుండు వైవస్వతమనువు, తత్పుత్త్రుం డిక్ష్వాకుం డతనికతమ్మున సూర్యవంశంబు విస్తరించె; నితనికి నెనమండ్రు తమ్ములు గలరు వీరి నామమ్ములు నాభాగుండును ధృష్టుండును శర్యాతియు నరిష్యంతుడును బ్రాంశుండును నృగోద్దిష్టుండును గరూషుండును బృషధ్రుండునని చెప్పంబడు వీరలు మానవు; లందు జ్యేష్ఠుండగు నిక్ష్వాకునకుఁ బుత్త్రశతకంబు వొడమె నందు మొదటివాఁడు వికుక్షి యనంబడు నాభాగునకుఁ బుత్త్రుం డంబరీషుండు మఱియు ధృష్టునివలన నుదయించిన క్షత్త్రంబు బ్రహ్మభూతమ్మును బ్రహ్మకర్మరతమ్మును సంగ్రామకాతరమ్మును నాయె. ౨౧

క. అనఘుండగు శర్యాతికిఁ
దనయుం డానర్తుఁ డనఁగఁ దనరుఁ దరుణీ
జనరత్నంబు సుకన్యా
వనజముఖి తనూజ యగుచు వఱలె నరేంద్రా. ౨౨

వ. శర్యాతి యక్కొమరె నంధుండగు చ్యవనున కిచ్చి వివాహం
బొనర్చిన నాపె శీలంబుకతన నశ్వినులవలన నతండు సులోచ
నుండయ్యె నన జనమేజయుం డిట్లనియె. ౨౩

చ. చ్యవనునకుఁ మునీంద్రునకు నంధుని కేగతి నిచ్చె నాన్నృపా
లవరుఁడు రూపశీలగుణలక్షణముల్ గలయట్టి కన్య ని
క్కువలయమం దరూపిణియుఁ గుత్సితశీలయు నైనపుత్రినే
ని వరున కంగహీనునకు నిక్క మొసంగెడి తండ్రు లుండిరే.

వ. అన నతం డిట్లనియె. ౨౪

క. ఆర్యుఁడు వైవస్వతసుతుఁ
డర్యమపౌత్రుండు సంపదాఢ్యుం డగునా
శర్యాతికి నాలుగు వేల్
భార్యలుగల రందఱు ననవద్యచరిత్రల్. ౨౫

క. అందఱుఁ బ్రేమము గలవా
రందఱు రూపమున మేటు లంద ఱతనికిన్
విందులు వారలకెల్లను
నందన యొక్కర్తు దగుఁ గనందగు పేర్మిన్. ౨౬

వ. అక్కన్నియ సుకన్యయనం బరఁగు నత్తలోదరియందుఁ దండ్రికిని
దల్లులకును బ్రేమం బధికం బగుటఁ జేసి యాపె యెక్కుడగు
గారాబమ్మునఁ బెరుఁగుచుండె. ౨౭

ఉ. మానససన్నిభం బనుపమానజలంబు సమస్తపక్షిసం
తాననివాసభూమి సముదంచితపంచవిధాబ్జసంగతం
బై నిఖిలాగమాకరతటానుగతంబు తటాక మొక్కఁ డిం
పౌ నలభూమిపాలు నగరాంతికమం దళిరాజసేవ్యమై. ౨౮

క. అవిరళపాదపవృతత
త్సవిధవిషయమందు విజనసంస్థితుఁడై భా
ర్గవుఁడు తప మాచరించెన్
జ్యవనుం డనుమౌని యంబ సంతసమందన్. 3౦

క. మౌనము గొని జలపానం
బేనియు నొనరింపకే జితేంద్రియుఁడై యుం
డే నేమమూని యంబన్
ధ్యానించు నతండు నాకు వయ్యెఁ గ్రమముగన్. 3౧

క. తనగాత్రం బిటు వల్మీ
కనిభృతమై మేటిమంటిగడ్డ విధమునన్
దనరి లతావేష్టితమై
పనుపడియుఁ బిపీలికాదిభాజన మగుడున్. 3౨

వ. ఒక్కింతయుఁ జలింపక యమ్మహానుభావుం డుగ్రతపమ్మున నుండెఁ; గొండొకకాలమ్మునకు శర్యాతి సుందరీబృందసహితుండై యక్కాంతారమ్మునఁ గ్రీడ లొనరింప నేతెంచి యిష్టవిహారమ్ము లొనరింపుచుండఁ దోనేగిన సుకన్యయుఁ దన నెచ్చెలులం గలసి యందంద పుష్పాపచయంబు సలుపుచుఁ జంచలయుంబోలె నవ్వనమ్మునం గ్రుమ్మరునడ యొక్కెడఁ జ్యవనునివల్మీకంబు దిలకించి క్రీడాసక్తిం జేసి తత్సమీపమ్మున కరిగి. 33

క. దానన్ దృష్టి నిగుడ్పన్
గానంబడెఁ గాంతియుగళి ; కని కంటకమున్
బూనియుఁ దానిం ద్రివ్వఁగఁ
దా నేగుడుఁ జ్యవనుఁడంత దానిం గనియెన్. 3౪

క. కని శుష్కస్వరమున "నో
వనజానన దీనిఁ ద్రివ్వ వలవదు దూరం
బున కేగుము నేఁ దాపస
జనుఁడ" నన విననికతనఁ జయ్యన నదియున్. ౩౫

వ. దగ్గఱ కరిగి దైవప్రేరణమ్మునఁ గంటకమ్ముం గాని యిదియేమి యని త్రివ్వ నతని నేత్రమ్ములకుం దగిలి భగ్నమ్ములయ్యె; నంత నత్తలోదరి యెంత చేసితినని కొండొక వగచియుఁ గ్రీడాసక్తి నెప్పటియట్ల గ్రుమ్మరుచుండెఁ; బదంపడి చ్యవనుండు భగ్నలోచనుండై వేదన సహింపక శోకించునాలో సైన్యాదిసహితమ్ముగ రాజునకు శకృన్మూత్రబంధనం బలవడిన సైనికులు రాజునకు విన్నవించుటయు శర్యాతి యిందఱకును నొక్కపెట్ట నిట్లగుట కేమి కతంబని చింతించుచు గృహంబరిగి యెవ్వఁ డీ దుష్కృతింబొనర్చె నని శంకించి సైనికుల కిట్లనియె. ౩౬

క. ఈపురి సవిధమ్మునఁ దగు
వాపికిఁ బశ్చిమమునం దపమొనర్చు మహా
తాపసుఁడు చ్యవనుఁ డమ్ముని
కేపాటియుఁ బీడఁ గొల్పిరే యెవరేనిన్. ౩౭

గీ. ఎఱిఁగి యెఱుఁగక తత్తపోవృద్ధు వృద్ధు
నెవ్వఁడేనియుఁ బీడింప హేలనంబు
సైఁప కమ్ముని మన కిట్టిశాస్తి చేసె
నెవ్వఁ డపరాధి వాఁడు మీ కెఱుఁగ రాఁడె. ౩౮

వ. అని వారల నందఱ నయమ్మున భయమ్మున నన్నరవరుం డడుగ మనోవాక్కాయకర్మమ్ముల నించుకేని దోషంబు మే మెఱుఁగ మెఱుఁగ మనుడు నవ్వారి నతండు దండింప మొదలు పెట్టిన

నయ్యాది సుకన్య విని పీడ్యమానంబగు జనంబు నీక్షించి దుఃఖితుం
డగు తండ్రి కిట్లనియె, నయ్యా! వనమ్మునఁ గ్రీడింపనేగిన నాకు
లతావృతంబై రంధ్రద్వయసమన్వితంబగు నొక్కవల్మీకంబు
గన్పట్టె. ౩౯

గీ. అందు ఖద్యోతకాంతి నింపొందు రెండు
జ్యోతు లగుపడ నేనును సూచిఁ బొడిచి
నంత నయ్యాది జలదిగ్ధ మయ్యె నదియుఁ
గాక హాహానినాద మొక్కండు వెడలె. ౪౦

క. మందమ్మగు హాహారవ
ముం దగ విని విస్మయమ్ము మొనయఁగ నే నం
తం దరలివచ్చితిని సూ
చిం దేనిం బొడిచితినో వచింప నెఱుంగన్. ౪౧

వ. నావుడు శర్యాతి యయ్యాదియ మునికి హేలనం బని యెంచి
నెట్టన నప్పుట్టకడ కరిగి తపోవృద్ధుండును దుఃఖితుండును నగు
నమ్మౌనిం గాంచి తచ్ఛరీరావృతంబగు వల్మీకంబు దెరలించి
దండప్రణామం బాచరించి వినయమ్మున నిట్లనియె. ౪౨

క. తెలియక మత్పుత్రిక ని
న్నలయించినపనికిఁ గోప మందక తగు శీ
తలదృష్టి మనుపఁగోరెద
నలమునె కోపంబు తాపసాగ్రణులందున్. ౪౩

ఉ. నావుడు మౌని వల్కు జననాథ! యొకించుకయేనిఁ గోపముల్
భావమునందుఁ జేర్ప నొకపట్టుననైన, భవత్తనూజ నా
కీవిధి నేత్రఘాత మొలయించిన దానికిఁగా లభించె నీ
కీవికలత్వ; మేను శపియించితి నంచుఁ దలంపఁబోకుమీ. ౪౪

క. అపరాధం బొందెఱుఁగక
తప మొనరుచు శక్తిభక్తతతి కెవ్వారే
నపకారం బొనరించి సు
ఖపడుట చొప్పదునె హరుఁడు కనలకయున్నే. ౪౫

క. ముదుసలిని గ్రుడ్డివాఁడ న
నద నోరాజేంద్ర! యెవరు నా కిఁకఁ బరిచ
ర్యఁ దగం జేయుదు రని దీ
నదశన్ వగఁజెందు మునికి నరపతి పలికెన్. ౪౬

క. మునివర్య! చాలినందఱ
ననిపెద సేవకుల నీకు ననుగుణముగ సే
వ నొనర్పఁగ ; నిఁకనైనన్
మనమునఁ గోపమ్ము విడిచి మన్నింపు దయన్. ౪౭

చ. అనవుడు మౌని వల్కె, నకటా కడు గ్రుడ్డికి నాకు నే గతిన్
బనుపడు నిష్ఠ యే మొనరుపం దగువా రగుదుర్ త్వదీయులా
ననుచరు; లింత యేల ? విను మాత్మజ నిమ్ము మదీయసేవకున్
దనిసి తపమ్ము చేసికొనెదన్ సుఖ మబ్బెడి దీన నీ కొగిన్. ౪౮

క. నీకొమిరె సేవ సేయ న
నాకులగతి నేఁదప మ్మొనర్చికొనెద నీ
కే కాదు నీదు సైనిక
లోకమ్మున కెల్ల సుఖములు గలుగు దీనన్. ౪౯

క. జనవర ! క్షమాపణం గో
రినవాఁడవయేని న్యాయరీతిని నీ పు
త్త్రి నొసంగి పెండ్లిసేయుము
మునినగు నా కిడఁగ శంక మొనయుట తగవే. ౫౦

క. అనవుడు శర్యాతియు న
మ్మునివాక్యము వినియు మిగుల మనుకొను చింతన్
మునిఁగి యెడతెగని యోజన
గొని యిటు నటు చెప్పఁడాయెఁ గువలయనాథా. ౨౧

చ. ముసలికి గ్రుడ్డికిన్ మిగుల మోటునకున్ సురకన్యవోని నా
దుసుత నొసంగి సౌఖ్యములఁ దూఁగఁగ నిచ్చు యొనర్చుటెట్లు? లా
త్మసుఖముగోరి యెవ్వఁడును మంచియుఁ జెడ్డయు నేర్చువాఁడు పు
త్రిసుఖము వాపి కాఁపురము ద్రెళ్లఁగఁజేయునె కీర్తి రోయునే.

గీ. అక్కటా! కడు వృద్ధుని నంధు నెడ్డి
నితనిఁ బతిగా వరించి పంచేషుబాణ
వివశయై యొప్ప మత్పుత్రి వేగునెట్లు
బ్రతికియున్నంతకాలంబు ప్రభకుఁ దక్క. ౨౩

చ. తమ కనురూపులౌ పతులు తారసమైనను మేటియందచం
దములు గలట్టి కామినులు దక్కరులన్ గవఁగూడ నెంత్రు దు
ర్గమమగుజవ్వనమ్మున నొకం డిటువంటికిఁజూపి భర్తగా
నమరినఁ జెప్ప శక్యమె యహల్య సురేశ్వరుతోడఁ గూడదే. ౨౪

క. సురపతిచే వంచితయా
తరుణిం గౌతముఁ డెఱింగి తా శపియింపన్
బరమార్తిఁ జెందె నాదుకొ
మిరె నీయంధున కొసంగ మేలెటు లబ్బున్. ౨౫

వ. కావున నననుగుణదాంపత్యమునకన్న హేయంబు వేఱొండు లేదని నిశ్చయించి యమ్మునికీబుద్ధి రాక విమనస్కుండై తన గృహమ్మున కరిగి మంత్రులం బిలిచి యిట్లను. ౨౬

క. అరయుఁడు మత్సుత నమ్ముని
వరునకు నీవలయుఁ గానిపక్షమునం దా
తురత నిషమలం బడవలె
నిరుదెలఁగుండకన్య నన్య మిం దొకఁ డున్నే. ౫౭

వ. నావుడు మంత్రిలు రాజేంద్రా! దుర్భగుండగు నమ్ముని కిక్కన్య ననన్యసామాన్యలావణ్యాగణ్యా నొసంగుట మాకును ననభిమతంబ యని చెప్ప నా సమయమ్మున వారి యింగితం బెఱిఁగి సుకన్య యట కేతెంచి యిట్లనియె. ౫౮

ఉ. నాకొఱ కింతయాపద గనందగునయ్య, నరేంద్ర! నేన య
వ్యాకులలీల నేగి మునివర్యుని మత్కృతదుష్కృతక్రియా
పాకృతనేత్రు నుద్ధురకృపాయుతుఁగా నొనరింతు నాత్మదా
నాకలనమ్మునన్ సుఖము లందుము స్వస్థత చెంది నావుడున్. ౫౯

చ. అవనిపుఁ డిట్లు పల్కు సచివానుచరుల్ వినుచుండ; నక్కటా,
శివశివ! యెట్లొనర్చెదవు సేవన మవ్వనమందు నిల్చి యా
చ్యవనున కక్షిహీనునకు సంతతకోపికి వృద్ధమూర్తికిన్
గువలయనేత్ర! మత్సుఖము గోరి నినున్ ముదిమానికిత్తునే. ౬౦

క. ధనధాన్యసమృద్ధునకున్
సునిశితమగు వయసుగల్గు సుందరునకు నం
దని నీఁదగు జనకుఁడు ని
ర్ధనునకు ముదుసలికి నిడుట ధర్మంబగునే. ౬౧

క. ఉటజమ్ముననఁట కాఁపుర
మఁట ముదుసలి కోపియునగు నంధుండఁట య
క్కట! నాతనయకుఁ బతియఁట
ఘటియించిన నాకుఁ బుట్టగతు లెట్లుండున్. ౬౨

క. అమ్మా ! విను మేనును రా
జ్యమ్మును వమ్మైనఁ గాని జంకుగొనన్ ని
న్నమ్ముదున దీనికై నే
త్రమ్ములు లేకున్న ముసలితపసికి నేనై. ౬౩

వ. అవశ్యమ్మును గాఁదగు కార్యమ్ములు కాకమాన వప్పట్ల నేను ధైర్యంబు విడువనని పల్కు తండ్రికిఁ బ్రసన్నవదనయగుచు సుకన్య యిట్లనియె. ౬౪

—* సుకన్యాచ్యవనవివాహము *—

చ. జనవర ! యిట్టులాడుటయు సమ్మత మెట్లగునయ్య లోకపా
వనుఁడు మహామహుండు మునివర్యుఁడు వృద్ధనసేల ? నిత్యసే
వన మొనరించుదాన సుఖవాంఛ యొకింతయు నాకు లేదు భూ
జనులకు నెల్ల నాకతన సౌఖ్యము గల్గుట యొండు చాలదే. ౬౫

క. వనమున నమ్మునివరు సే
వనమునఁ దగులొంది భక్తిపరవశనై యా
తనిమాట కడ్డుసెప్పక
జనవర నీకున్ యశంబు సంపాదింతున్. ౬౬

వ. అను నబ్బాల నిశ్చయమ్మునకు మంత్రులును నృపాలుండును బరమాశ్చర్యంబు నొందిరి. పదంపడి శర్యాతి యమ్మునిపాలికిం జని నమస్కరించి, మహాత్మా ! మత్పుత్రి నొసంగెద ననుగ్రహించి గ్రహింపుమని విధివిధానంబుగ వివాహంబొనరించిన నతండు సంతుష్టాంతరంగుండై పరివారంబు గ్రహింపక కేవలకన్యాపరిగ్రహం బొనరించె నంత సైనికులకును రాజునకును సౌఖ్యంబు వాటిల్లె నిట్లు మునికిఁ దన్నొసంగి జనకుండు గృహం బేతెంచు నయ్యవసరమ్మున నతనికి సుకన్య యిట్లనియె; నయ్యా ! నా యీ

భూషణంబులు గొని నాకు నజినంబును వల్కలంబును నొసంగుము. ౬౭

క. మునిపత్నీ వేషమ్మును
గొని నీకుఁ సద్యశంబు గూర్పఁ మఱి నా
కును బరముగూర్ప నిప్పా
వనునిమదికి వచ్చునట్లు వర్తింతునిటఁ. ౬౮

క. అనసూయ యత్రికి వసి
ష్ఠునకు నరుంధతియుఁబోలె సుగుణుండగు ని
మ్ముని కేను బ్రీతిగొల్పెద
ననఘా ! నీ వింకఁ జింత నందకు మాత్మఁ. ౬౯

వ. నాపుడు శర్యాతి యశ్రువులు కన్నుల నురల నక్కన్నియకు నజినంబును వల్కలంబును నొసంగె. ౭౦

గీ. భూషణములెల్ల డఁలిచి యప్పువ్వుఁబోఁడి
యంత మునివేషధారిణి యగుటఁ గాంచి
జనవరుని భృత్యులెల్ల రోదన మొనర్చి
రధిప యక్కన్నె శీల మే మనఁగ వచ్చు. ౭౧

వ. ఇట్లు మునివేషధారిణియగు తనసుతకుం జెప్పలేక చెప్పి సపరివారమ్ముగ శర్యాతి నగరంబున కరిగె, నంత నమ్మగువ పతిసేవాపరాయణ గావున, ౭౨

సీ. నలుదిక్కులకు నేగి నానావిధమ్ములౌ
ఫలమూలములు దెచ్చి పజ్జనుంచి
యగ్నుల నలరింప ననుగుణంబగు సమి
జ్జాలంబు శుష్కంబు సంతరించి

తిలలును గుశలును దెచ్చి తోమిన కమం
డలువుతో జత గూర్చి కెలన నునిచి,
యుష్ణోదకస్నాన మొనరింపఁగాఁజేసి
యజినంబు పఱచి యం దల్ల నిలిపి

గీ. యనఘ ! యిఁక నిత్యకర్మమ్ము నాచరించు
కొను మని వచించి కర్మాంతమునఁ గరమ్ము
పట్టికొని సంస్తరణమున నట్టె నిల్పి
మునికి ననుగుణమైన భోజనము వెట్టు. ౨౩

శా. నీవారాన్నముఁ గందమూలఫలముల్ నీరేజపత్రాక్షి యెం
తేవేడ్కన్ భుజియింపఁ బెట్టి తగుతృప్తిం జెందఁగాఁజేసి పైఁ
గావించున్ గరపాదశుద్ధిఁ బిదపన్ "గైకొమ్ము తాంబూల మో
దేవా" యంచు నొసంగు నాసనము పొందించున్ గరాధారమై.

క. పిమ్మటఁ దదాజ్ఞఁ గొని దే
హమ్ము న్నిలుపంగఁదగు ఫలాహార మ్మా
కొమ్మ గొని సత్వరమ్ముగ
నమ్ముని సన్నిధికి వచ్చి యతివినయమునన్. ౨౪

క. పాదమ్ము లొత్తుమనె యని
యాదర ముట్టిపడ నడిగి యమ్మునిమణి కా
మోదమ్ము సంతరింపుచు
దాఁ దడయక యట్లొనర్చుఁ దగియెడిరీతిన్ ౨౫

వ. అంత సాయాహ్నంబగుడు హోమమ్మునకుఁ దగిన సంభార
మ్ములు సంతరించి మధురమ్ములగు ఫలమ్ములం దెచ్చి భుజింపఁ
బెట్టి తద్భుక్తశేషమ్ము గుడిచి సుస్పర్శాస్తరణం బొనరించి
యందు శయనింపఁ జేసి పాదసంవాహనంబు సలుపుచుఁ గుల

స్త్రీ ధర్మమ్ముల నడిగి తెలిసికొనుచు నతఁడు నిద్రించిన తెఱంగెఱింగి తచ్చరణనికటమ్మున నల్ల నొరగి నిద్రించుచు నప్పుడప్పుడు మేల్కాంచి తగు నుపచారమ్ము లొనర్చుచుఁ బ్రేమయుక్తమ్ముగ భక్తిపరాయణయై సేవించు. ౭౭

గీ. తన్వి వేసవిఁ దాలవృంతమ్ము విసరి
నిమురపట్టెడిరీతి ననిలము గొల్పు
మగువ హేమంతమునఁ జలిమంటవైచి,
యడుగు "సుఖమగునే" యని యమ్మునీంద్రు. ౭౮

వ. బ్రాహ్మముహూర్తమ్మున మేల్కాంచి జలపాత్రమ్ముగొని శౌచార్థమ్ము నిజాశ్రమమ్మున కనతిదూరమ్మునకుఁ గొనిపోయి యట డించి తానొక్కకనుమఱుఁగగునెడ నుండి పదంపడి సన్నిధికిఁ జని కేలువట్టికొని యాశ్రమముఁ బొందించి యాసనమ్మున నుపవేశించి మృజ్జలమ్ములచే నతనిపాదమ్ములు యథావిధిగఁ గడిగి యాచమనమ్మునకు జల మ్మొసఁగి యథోక్తంబగు దంతకాష్ఠమ్ముదెచ్చి యిచ్చి యంత నుష్ణజలమ్ము సన్నద్ధం బొనర్చి యిట్లను. ౭౯

ఆ. వె. "ఏమి యాజ్ఞ తెల్పు మిఁక దంత ధావనం
బాయెనే మహాత్మ ? యమలమైన
యుష్ణజలము లివియ యొనరింపు స్నానంబు ;
హోమసమయ మింక నొక్క త్రుటికి ". ౮౦

క. ఈరీతి ననుదినమ్మును
నారాజతనూజ మౌని కాయాసేవల్
గూరిమి నొనరించు నతిథి
వారముఁ దనియించు నెల్లవారును మెచ్చన్. ౮౧

వ. అంత నొక్కనాఁడు తదాశ్రమమ్మున కనతిదూరమ్మున నున్న తటాకమ్మునఁ గృతస్నానయై యేతెంచు నయ్యాతివ నంతకుమున్నె క్రీడార్థం బట కేగుదెంచిన యశ్వినులు గనుంగొని తద్రూపమ్మున కచ్చెరువడి నికటమ్మున కరుదెంచి ప్రీతిపూర్వకముగ నిట్లనిరి.

క. ఒక్కింత నిలువు మోజల
ముక్కచ! యశ్వినుల మేము మోదమ్మున ని
న్నొక్కటి యడిగెద మిక్కడ
కెక్కతమున వచ్చి తేడ కేగెదు చెపుమా. ౨౩

గీ. పంకజాక్షిరో నీకు నెవ్వాఁడు భర్త
యెవని కాత్మజ వకట రెండవ సిరి యనఁ
గలుగు నీ మృదుపదము లిక్కర్కశంపు
నేలఁ బొరసిన మామది జాలి వొడమె. ౨౪

—* ఆశ్వినులును సుకన్యయు సంభాషించుట *—

క. కమలాక్షి! విమానమునకు
నమరెడి నీ కిట్టి యటవియం దంఘ్రిచర
త్వము వొల్చునెట్లు! దాసీ
సముదాయముతోడ నేల చనుదేరవొకో. ౨౫

గీ. రాజపుత్రికవో? యచ్చరవా? వచింపు
మేమహాభాగ నినుఁగన్న దిందువదన?
నిన్నుఁ గైకొన్న భర్త వర్ణింపఁదగఁడె
యవని నీ కల్మి దేవలోకాధికంబు. ౨౬

క. నిను నిత్యము గనుఁగొను నీ
వనమృగముల భాగ్యదశయుఁ బక్షులపుణ్యాం

బును నెన్న శక్యమే ! పా
వనమయ్యెఁ భూమి నీదు పాదరజమునన్. ౮౭

క. స్తుతిగాదు నీకు నెవ్వఁడు
పతి ? జనకుండెవఁడు ? పద్మపత్రాక్షిరో ? యా
కృతకృత్యుల దర్శింపఁగ
మతివొడమెన్ జెప్పు వారిమనికి సదయతన్. ౮౮

వ. అను నశ్వినులకు సుకన్య లజ్జాక్రాంతయై యిట్లను. ౮౯

గీ. ఏను శర్యాతికూఁతుర మానసీయుఁ
డైన చ్యవనమునీంద్రున కనుఁగుభార్య
నంధుఁడును ముదుసలి యగునట్టి భర్త
కెల్లపుడు సేవసేయుదు నిచటనుండి. ౯౦

క. నను నా యనుమతిఁగొని మ
జ్జనకుం డమ్మునికి నిచ్చె సద్వర్తనుఁ డా
యనఘుని యాశ్రమ మల్లది
చనుదేఁదగు మీరలెవరొ సచ్చారిత్రుల్. ౯౧

ఉ. నావుడు దస్రు లిట్లనిరి నాతిరో ! నిన్నెటులిచ్చెఁ దండ్రి దు
ర్భావుఁడు గ్రుడ్డియౌ ముసలివానికి ! భూషణరాజిరాజితం
బై వరవస్త్రభాజనమునై వెలయందగు మేను వల్కల
ప్రావృత మయ్యెనే విధికిఁ బాపముఁ బున్నెము లేదె యక్కటా.

ఉ. నీ సరివచ్చు లేమ సురనీరజనేత్రలయందు నేని లే
దో సరసీరుహాక్షి యెటులో మెదు గ్రుడ్డికి భార్యవై ? కటా !
నీ సొగసున్ వయస్థితియు నేర్పును వమ్ముగ నిట్టులుండ నే
లా ? సమకాంతియుక్తుఁడగు నన్యు వరింపఁగరాదె యుగ్మలీ. ౯౩

గీ. అంధు వరియించి జవ్వనం బపనయించి
జన్మమును నిష్ఫలంబుగ సల్పనేల ?
వల్కలము లేడ, నీవేడ, వనమిదేడ !
కొనఁదగదె మాయిరువురం దొకొరుని నబల. ౯౪

గీ. అట్లు వరియించి నందనమందుఁ జైత్ర
రథమునం దెల్లపుడు మనోరథము వెలయఁ
గ్రీడసల్పఁగ రాదె ? యీ పోడిదగాని
వృద్ధు నంధుని సేవించి యేమిఫలము. ౯౫

క. నరపాలపుత్రికవు నీ
కరయంగా రావె తగు విహారంబులు, సం
సరణసుఖ మిట్టివానిఁ
బొరసినఁ జెడకున్నె యెట్టిపొలఁతికి నైనన్. ౯౬

గీ. ఫలజలాహారణమ్ముల బడలి మృదుల
మైన నెమ్మేనివాసి యింతైనఁ గనక
విజనమగు నివ్వనమ్మున వృద్ధదాసి
వగుట మేలనితోఁచెనే యంబుజాక్షి. ౯౭

క. అను నాసత్యులవచనము
లను విని యకన్య లోఁదలంకుచు ధైర్య
మ్మును జెంది ధర్మ్యమగు రీ
తిని మెల్లన నిట్టులనియెఁ దేఁకువపేర్మిన్, ౯౮

ఉ. మీరలు సూర్యపుత్రులరు మీకు సమస్త మెఱుంగవచ్చు ని
ష్కారణ మన్యకాంతనగు సాధ్విని నన్నిటులాడు టొప్పున
య్యా ! రవి కశ్యపాత్మభవుఁ డారయఁగా కఖిలంబు సాక్షియై
ధీరులు మిమ్ము బోఁటులిటు తేఁకువఁదక్కుదు రయ్య యెయ్యెడన్.

క. కులకన్యఁగాని నేఁ బుం
శ్చలిఁగా నధికప్రసంగసంగతికిం బో
వలవదు మాటాడిన మి
మ్ముల శపియింపఁగల రాజపుత్రికఁ జుండీ. ౧౦౦

వ. అని సక్రోధమ్ముగఁ బల్కు నా సుకన్య వచనమ్ములకు భీతిల్లి యాపెం బ్రసన్నఁ జేయనెంచి వినయమ్మున నిట్లనిరి. ౧౦౧

క. శీలము గల బాలలలో
నే లీలావతియు నీకు నీడగునే ? యో
లోలాక్షి ! వర మొసంగెద
మోలింగై కొమ్ము సౌఖ్యమొందుము దానన్. ౧౦౨

ఉ. మమ్ముఁ గవీశ్వరుల్ మిగుల మన్ననసేయుదు రెల్లయందు నం
దమ్మున మేటులంచు విను తన్వరో ! నీ హృదయేశు నిట్టి రూ
పమ్మును బ్రాయముం గలుగువానిఁగఁ జేసెదమిందు నొక్కరున్
సమ్మతిమై వరించెదవె చాతురి మీఱఁగ నంచుఁ బల్కినన్.

వ. సుకన్య విస్మయంబంది యాశ్రమమ్మున కరిగి పతింగాంచి "మహాత్మా యశ్వినులనుసూర్యపుత్రులిరువురు తటాకంబుపొంత నున్న నన్నుంగాంచి కామాతురులై యిట్లనిరి. ౧౦౪

క. జరయును నంధత్వము స
త్వరముగ నెడఁబాపి యస్మదాకారముతో
సరియైన రూప మిప్పుడ
తరళాక్షిరో పొసఁగఁజేసెదము నీ పతికిన్. ౧౦౫

క. కోమలి యేకాకృతిఁదగు
మామూఁగురయందు నీదు మనసెవ్వరియం

దే మరగు నాతనిఁ బతిం
గా మోహింపు మని రిందుఁ గపటంబేమో. ౧౦౬

వ. ఇయ్యది నీకు నెఱింగింప వచ్చితి భవదాజ్ఞ యెట్టు లట్టు లొన రించెద " నావుడుఁ జ్యవనుండు సంతుష్టాంతరంగుండై యిట్లను.

క. దేవత లసత్యవాదులు
గా వలవదు వారియాజ్ఞఁ గావింపఁగ నెం
తే వేగ మేగి యిటకుఁ
రా వెఱ వొనరింపుమా సురభిషగ్వరులన్. ౧౦౭

వ. అనవుడు నప్పతివ్రత యాశ్వినులకడ కరిగి మీ రొనర్చిన సమ యమ్మునకు మత్పతి యంగీకరించె నయ్యెడ కేతెంచి యట్లొన ర్పుఁడనిన నయ్యిరువురును దదాశ్రమమ్మునకు వచ్చి యాపె కిట్ల నిరి ; నీపతివయఃప్రాప్తికై యుదకమ్మున మునుఁగవలయు ననుడుఁ జ్యవనుండు సమ్మతించి యట్లొనర్ప వారిరువురును నతనితో నత టాకమ్మున మునిఁగిరి. ౧౦౮

—* చ్యవనునికి యౌవనప్రాప్తి *—

ఉ. మూగురు నేకరూపులు సముజ్జ్వలభూషణు లత్యుదారతే
జోగతులై సుకన్య కడుఁ జోద్యము నందఁగ నీరు వాసి తా
రా గజయాన కిట్టులని రంబుజలోచన ! యెవ్వఁ డిందు నీ
రాగము గల్గువాఁడు ముగురన్ గని యేరికొనంగఁ జెల్లదే.

క. ఏకాకారుల నేక
శ్రీకుల నేకస్వరానుకృతులన్ ముగురన్
రాకొమిరె గాంచి యెంతే
నాకులపాటొదవ భర్తకై చింతించున్. ౧౧౧

ఉ. చక్కఁదనమ్మునన్ వయసుచందమునన్ ముగు రొక్కరూప యిం
దక్కట! భర్తయెవ్వఁడని యారయనౌ, మరణంబుఁ దక్క వే
ఱొక్కయుపాయ మియ్యెడల నున్నదె? దస్యులరాక కల్మి నీ
చిక్కు తటస్థమయ్యె నెడసేయఁగ వచ్చునె యింద్రజాలమున్.

క. పతి విడిచి యన్యునిన్ స
మ్మతి వరియించితినయేని మహి నయశము దు
ర్గతి పరలోకమునందగు
బతిరత లెల్లరును నవ్వఁ బాలగుదుఁ గదా. ౧౧౩

వ. అని బహుప్రకారమ్ములఁ జింతించి యిందుఁ జగదంబదక్క శర
ణంబు లేదని నిశ్చయించి మనమ్మున నప్పరశక్తి న్నిల్పి యిట్లు
ధ్యానించె. ౧౧౪

గీ. సరసిజోద్భవి! శంకరసాధ్వి! విష్ణు
సతి! సరస్వతి! యోగమజనని! త్రికృతి
కారిణి! త్రిమూర్తి జనని! వికారశూన్య!
ప్రకృతి! పురుషస్వరూప! నిన్ బ్రస్తుతింతు. ౧౧౫

ఉ. ఎల్లర భుక్తిముక్తు లిడి యేలెద వీ వఖిలేశి జ్ఞానులన్
జల్లఁగఁ బ్రోతు జ్ఞానమిడి సౌఖ్య మొసంగెదు సిద్ధి నిత్తువో
హల్లకపాణి! కీర్తి, జయ, మన్నియు నీ విడునట్టి వజ్ఞ లా
పల్లవమైనఁ బాయుటకుఁ బొల్పడ రంబరో? నిన్నెఱుంగమిన్.

ఆ. వె. ముగురు నొక్కరీతి మొనసి రిం దెవ్వఁడు
చ్యవనుఁ డతనిఁ దెల్పి సకలజనని
మత్పతివ్రతాత్వమహిమంబు నిల్పి కా
పాడుమమ్మ నిన్నుఁ బ్రస్తుతింతు. ౧౧౬

వ. ఇట్లు తన్ను మాటికిని సన్నుతించుచు మ్రొక్కులిడెడి యా పరమపతివ్రత ననుగ్రహించి పరాంబ తన్మనోంబుజమ్మునందు నెలకొని దివ్యజ్ఞానంబు నొసంగె; నంత రాజపుత్రియు, ౧౧౮

గీ. సమవయోరూపముల నొక్కసరణి నొప్పు
ముగుర నీక్షించి తనపతి నొగి నెఱింగి
కైకొనియె నశ్వినులు మోదకలితులైరి
రాచకన్నియ శీలమర్యాద కెలమి. ౧౧౯

వ. భగవతీప్రసాదమ్మునఁ దనకాంత తన్ను వరించినందులకుఁ జ్యవనుండు సంతుష్టాంతరంగుండై కన్నులారఁ దన నెచ్చెలిం జూచుచు గమనోన్ముఖులగు నశ్వినులకుఁ బ్రీతిపూర్వకమ్ముగ నిట్లనియె.

మ. నయనశ్రీ చెడి వార్ధకంబు గొని విన్నాణంబు లేకుంట చేఁ
బ్రియురాలిం గరఁగింప నేరక వనిన్ బెంపేది యున్నట్టి నన్
దయకల్మిన్ గని కన్నులున్ వయసు సౌందర్యంబు చేకూర్చి పె
ద్దయు సంసారసుఖాత్తుఁ జేసితిరి మిత్రత్వంబు దైవారఁగన్.

క. ఉపకారులైన మిత్రుల
కుపకారము సేయకుండు నొగి నెవ్వఁడు వాఁ
డపకీర్తికిఁ దానకము బు
ణపరీతుఁడు వానిజీవనము విఫలమగున్. ౧౨౨

వ. కావున మీకుఁ బ్రత్యుపకారం బేమియొనర్తు భవద్వాంఛితంబు వెలువరింపుఁడు నావుడు మునివరునకు నాసత్యులో మహాత్మా మాకు నస్మత్పితృప్రసాదమ్మున నఖిలమ్మును గలయదియు మామనోరథమ్ము పూరింప నిచ్చయేని యొక్కండు గలదు వినుము. ౧౨౩

గీ. అమరు లెల్లరు సోమపానావసరము
లందు బహిఃవెట్టి రనఘ మమ్మధ్వరముల
భిషజు లనునొక్క మిషమునఁ బ్రీతిగల్గె
నేని మాకది సాధింపు మిద్ధశక్తి. ౧౨౮

వ. కనకాచలమ్మునఁ జతురాననుగుఱించి శక్రుండు జన్నంబొనర్చిన తఱి మా కీయవమానంబు ఘటించె నియ్యది యెడప నీవ సమర్థుండ వనునాశ్వినేయులకుఁ జ్యవనుండు ప్రీతుండై యిట్లను.

క. మీకతన వయసుఁ గన్నులు
నాకారము గలిగె నాకు ననఘులు మీకున్
బాకారిన్ వారించి ని
రాకులగతి సోమపాన మది నేనిత్తున్. ౧౨౯

వ. ఇయ్యది మహామహుండగు శర్యాతి నృపాలు మఖమ్మవ నవశ్యమ్మను నగు ననుడు వారలు సంతుష్టాంతరంగులై స్వర్గమ్మునకు నరిగిరి. చ్యవనుండును మనోహారిణి యగుసుకన్యంగూడి యాశ్రమమ్మునకుఁ జనియె; ననుడు జనమేజయుండు, మహాత్మా! దేవబలమ్మునకును మనుష్యశక్తికినిఁ దారతమ్య ముండెడిఁగదా చ్యవనుండు దేవాధిపునెట్లు వారించి యాశ్వినేయులకు సోమం బిప్పించె ననుడు వ్యాసుం డిట్లను, నట్లు మునివరుండు సుకన్యాసహితుండై స్వాశ్రమమ్మున సకలసంసారసుఖమ్ము లనుభవించుచున్నంత నొక్కనాఁ డక్కన్నియతల్లి చింతాతురయై తనపతి కిట్లను.

క. ముని కంధునకు నొసంగితి
వనవద్యాంగి యగుకూఁతు నక్కట యదియ
వ్వనమున మృతిఁజెందెనో? జీ
వనమున నున్నదియొ చూఁపవలదె యొకింతన్. ౧౩౦

గీ. కందమూలఫలమ్ములఁ గాలమెల్లఁ
గడపు మునివేషధారిణిఁ గన్నకూఁతుఁ
బ్రాణ మవశేషముగనుండు పరమసాధ్వి
నొక్కపరి చూడకున్న నే నోర్చు టెట్లు? ౧౨౯

వ. నావుడు శర్యాతియు సంశ్రితవ్రతుండగు నమ్మానితల్లజునిఁ
గొలిచి సుఖంబున్న కొమిరెం గన మన మిరువుర మయ్యెడ కేగు
టయ కర్జంబని తత్సహితుండై రథం బెక్కి చ్యవనాశ్రమమ్ము
నకుఁ జనువాఁడు ముందట, ౧౩౦

క. కనుఁగొనియె రూపమున జ
వ్వనమున నవ్వనము శోభ వడయఁగ నొనరిం
చు నితాంతకోమలాంగుని
ననఘునిఁ జ్యవనమునిఁ దనకు నల్లునిఁ గూఁతుర్. ౧౩౧

క. కనుఁగొని విస్మితుఁడై "యే
మనఁదగు? పానివరుఁ జంపి యఘు మొసిఁగట్టన్
బనుపడితి నకట! యెంతటి
పని చేసె మదీయపుత్రి పాపాత్మికయై! ౧౩౨

గీ. మదనవేదన సైఁపక మమత పెచ్చు
పెరిఁగి మత్పుత్రి యంధుని వృద్ధు నతనిఁ
జంపి యన్యుని వరియించె, శక్యమగునె
జవ్వనంపు మదం బెట్టి సాధ్వికేని! ౧౩౩

క. మనుకులమున నేఁటికి మ
త్తనయకతనఁ గందు గలిగెఁ దద్దయు నింద్యం
బనఁదగదె పుత్రికం గను
జను జన్మము; కొమిరె బల్ దొసంగగు గృహికిన్.

గీ. ఎన్నియో పాపములు చేసినేని వాని
కుదయమందుఁ గుమారిక ; యొడ్ల ననఁగ
నేల ? వృద్ధున కంధున కెఱిఁగి యెఱిఁగి
కన్నె నిచ్చితి నాత్మసుఖంబు గోరి. ౧౩౫

క. ఏవానిపుత్రి కుత్సిత
యై వెలిఁబడు వానిజన్మ మధమాధమ మెం
తే వెదకి కొమిరె నిడఁదగుఁ
గోవిదునకు ధనికి రూపగుణసహితునకున్. ౧౩౬

గీ. ఎఱిఁగి చేసినఫల మిష్ట మెదురుకొనియె
మనుకులంబను శశికిఁ గందనువుపడియెఁ
గులమునకు హాని దెచ్చితి, సొలవ కేగి
తెంపరినిఁ గూఁతు దుర్మతిఁ దుంపవలదె". ౧౩౭

వ. అని మఱియును, ౧౩౮

గీ. "పాతకమ్ములకెల్లను బాతకంబు
స్త్రీవధము దానికన్నఁ బుత్రికవధంబు
టెక్కుడగు నింత కెక్కుడై పొక్కఁగాదె
లోకనింద యిసీ ! యెంత శోక మొదవె. ౧౩౯

గీ. స్నేహశృంఖల తెగఁద్రెంప సాహసంబు
పడయఁగానేర, లోకాపవాద కెట్టు
లోర్చి తలయెత్తికొందు ? నెట్లోర్చు దాఁడరు"
ననుచుఁ జింతించె మిగుల శర్యాతినృపుఁడు. ౧౪౦

వ. అట్టియెడ సుకన్య దాదవ్వుల జనకుంగాంచి యెదురు చని చింతా దంతురితాంతరంగుండగు నమ్మానవపతి చిత్తం బెఱింగి యతని కిట్లనుఁ. ౧౪౧

క. శతపత్రనేత్రు రూపసి
నతులితమగు జవ్వనమ్ము నంది యొలయు మ
త్పతిఁగాంచి చింత నొందక
మతి శంకఁ విడిచి వే నమస్కృతులిడుమా. ౧౪౨

వ. వైశంబ రా రమ్ము సందియం బేల యను పుత్రివచనమ్ములకు సక్రోధుండై శర్యాతి యిట్లను. ౧౪౩

క. జరఠుం డంధుఁడుఁ దాపసి
యరయఁగ నీభర్త, యాతఁ డతియావనదు
ర్భరుఁడు మదోన్మత్తుఁడు సుం
దరుఁ డేగతి నమ్మవచ్చు ధవుఁడని నీకుఁ. ౧౪౪

క. మరుబారిఁ జిక్కి యమ్ముని
వరు నెల్లనియును జంపి పాపినివై సుం
దరు నొక్కని నాథునిఁగా
వరియింపవుగా కుమారి ? వంగడ మడఁగఁ. ౧౪౫

క. అని నీక్షై శోకమ్మున
మునిఁగెద నెటఁబోయె నకట ! మునివరుఁ డీనూ
తనపురుషుండిట కేమిక
తన వచ్చెఁ దెల్పుమనుడుఁ దగునగవొలయఁ. ౧౪౬

వ. సుకన్య జనకునికరంబు పట్టికొని సత్వరమ్మునఁ దనపతియున్నె డకుఁ గొనిపోయి చూపి యిట్లను. ౧౪౭

క. అయ్యా ! నీ యల్లుం డితఁ
డియ్యెడ సందియము వలవ దించుకయును బల్
నెయ్యమ్మున నశ్విను లిటు
చయ్యనఁ గమలాయతాక్షు సలిపిరి సుమ్మా. ౧౪౮

క. నీతిధురంధరుఁడగు శ
ర్యాతికి నీ కాత్మజాతనై యే నకటా,
పాతకమున కొడిగట్టుదు
నే! తడయక మ్రొక్కు మతని కెంతయు భక్తిన్.

వ. పదంపడి నీ వశిగ దేని నీ కామూలాగ్రమ్ముగ నమ్మునివరుండె వచియించువాఁడనుడు శర్యాతి త్వరితుండై యమ్మహాభాగునకు నమస్కరించి, మహాత్మా! నీ కెట్లు నయనమ్ములు గలిగె? దివ్య సుందరంబగు నీ విగ్రహంబు సంప్రాప్తం బగుటెట్లు? వృద్ధత్వం బెటకరిగె! నున్నది యున్నట్లు వచింపుము నావుడు మామ కల్లుం డిట్లనియె. ౧౫౦

గీ. దైవవశమున నొక్కెడ దస్రులిటకు
వచ్చి కరుణించి యీ రూపమిచ్చి రెలమి
నుపకృతి నొనర్చు నవ్వారి కొకవరము
ప్రత్యుపకృతి కొసంగితిఁ బార్థివేంద్ర. ౧౫౧

క. "మారాజగు శర్యాతిమ
హారా జొనరించు మేటి యజ్ఞమ్మున మి
మ్మారాజుపంక్తి నిడి పెం
పారన్ సోమరస మొసఁగు నట్లొనరింతున్". ౧౫౨

వ. పిమ్మట మద్దత్తంబగు వరంబు గైకొని వారు స్వస్థానంబున కరిగి రిందసత్యంబు లవలేశంబును లేదు విశ్వసించి నిర్మలాంతఃకరణుండవై యీ పీఠమ్మునఁ గూర్చుండుము నావుడు రాజు సంతుష్టుండై యట్లొనర్చె. ఇట్లు భార్యయుం దాను నమ్మునినికటమ్మునఁ బుణ్యకథాశ్రవణమ్ముల నుండు నెడ శర్యాతికిఁ జ్యవనుండిట్లనియె.

—* శర్యాతి యజ్ఞంబొనర్చుట *—

చ. నరవర ! జన్న మొక్కటి యొనర్పుము నన్గొని యమ్మఖమ్మునన్
సురపతి ధిక్కరించి వెస సోమరసంబు నొసంగువాఁడ నా
వర మనివార్యమై తగ నవారణ దస్రులకున్, సురల్ మునుల్
ధరణిసురుల్ నరేంద్రులు ముదమ్మున నాదగుశక్తి మెచ్చఁగన్.

వ. నావుడు శర్యాతి యంగీకరించి తనపురమ్మున కరిగి శుభదినమ్మున మఖయత్నం బొనర్చి వసిష్ఠాదిమునులం బిలిచి చ్యవనపురస్సరమ్ముగాఁ గ్రతు వొనర్చుచుండె ; నయ్యెడ నింద్రపురోగములై సుర లమ్మఖమ్మునకు వచ్చుటయు నశ్వినులు వారిపిఱుందన వెడలి యట కరుదెంచి యొక్కెడ నుండిన వారింగాంచి శక్రుండు సురలంగూర్చి, ౧౫౫

క. అకలంకము క్రతు విది యే
మికతమ్మున భిషజు లిచట మెలఁగుట ? సోమం
బకటా, వీరికి నర్హం
బొకొ ? పిల్చినవార లెవ్వరో ? తెంపరులై. ౧౫౬

వ. నావుడు నమరులు నిరుత్తరులైరి. పదంపడి సోమపానావసరమ్మునఁ జ్యవనుం డశ్వినులభాగంబు తనకరమ్మున నిడికొనుడు నింద్రుండతని వారించి వీరలు చికిత్సకు లగుట సోమపానానర్హులు వీరల కీగ్రహం బీవలవదు నావుడుఁ జ్యవనుం డెదుర్కొని శక్రున కిట్లను. ౧౫౭

గీ. సంకరులుగా రహర్పతిసతికిఁ బుట్టి
నట్టి కొమరులు వీర లేయఘముచేసి
రనఘ యెట్లుగ్రహార్హతనంది రీమ
ఖమునఁ దెలియంగవలయు నిక్కమ్ముమాకు. ౧౫౮

క. ఈ మహీపతి నా ప్రేరణ
చే మఖ మొనరించె నిందు సిద్ధంబుగ నే
నీ మహితుల కిప్పించెద
సోమరసము నీవు నెల్ల సురలును జూడన్. ౧౫౯

క. ఈ రవిపుత్త్రులు మిగుల ను
దారులు ముదిమి నెడపి ననుఁ దరుణవయస్కున్
గా రచియించిరి ప్రత్యుప
కారము నొనరించి ఋణము గడ తేర్పవలెన్. ౧౬౦

వ. నావుడు శక్రుం డో మునీంద్రా ! వీరలు దేవతలచేఁ జికిత్సకులగు
కతన సోమపానానర్హులని నిందింపఁబడిరని నొడివితిఁగాదే యిం
తేల ? గ్రహంబు వీరికి సంతరింపకు మనుడు సక్రోధుండై చ్యవ
నుం డిట్లను. ౧౬౧

క. ఏఁ జెప్పనేర్తు వీరం
భోజాప్తుని సుతులు సోమమున కర్హు లహ
ల్యాజార ! వృత్రహార ! ని
ర్వ్యాజం బిక కోపమింక విడువందగదే. ౧౬౨

వ. అని యింద్రునకు సాకూతంబుగ నుత్తరం బొసఁగి యాశ్వినేయుల
భాగంబు తపోబలమ్మునఁ గైకొను నమ్ముని నొక్కండును వారింప
కుండెఁ, బదంబడి యింద్రుం డతికుపితుండై చ్యవనుం గాంచి సర
భసమ్ముగ నిట్లను. ౧౬౩

గీ. ఎన్నఁడును లేని మర్యాద నేర్పరించు
పాటివాఁడవె ? యోరోరి, బ్రహ్మబంధు !
విశ్వరూపుని బలె నిన్ను వేగ చంపి
శత్రుహీనుండనగుదు నిష్కంటకముగ. ౧౬౪

వ. నావుడుఁ జ్యవనుండిట్లను. ౧౬౫

గీ. తేజమున రూపమున ధనాదికమున నిరు
వురు నఖండులు నీకనాదరము వలవ
దెంతవారలుగాకున్న వృద్ధు నంధు
నమరతుల్యునిఁ జేయు నేర్పమరు టెట్లు! ౧౬౬

వ. మహానుభావులగు వీరలు తక్కఁగల దేవతలకు లోచ్చుగారని నిశ్చయించికొను మిట్టి పూజ్యుల నెడచేసి నీవును నమరులును నెట్లు సోమంబు గ్రహించెదరు నావుడుఁ గోపోద్రేకమ్మున నిం ద్రుండతని కిట్లను. ౧౬౭

క. ఎన్నివిధమ్ములు వీరలు
జన్నమున కనర్హు లీవు సాహస మమరన్
బన్నితివయేని భాగము
గ్రన్నన నీశిరము ద్రెళ్ళఁగా ఖండింతున్. ౧౬౮

వ. అను నింద్రువచనమ్ములకుఁ దలరక చ్యవనుండు సోమపాత్రిం గాశ్వినేయుల కొసఁగిన వారలును శానాసక్తులగుట నైశమ గ్రహించి రాత వాసవుండు వెండియు నిట్లను. ౧౬౯

క. ఈవలవదు స్వార్థమ్మున
కై వీరికి సోమపాత్రి మళ్లనియు నీ
పై నైచెద వజ్రమ్మును
జా వోదవెడు విశ్వరూపు చాడ్పున నీకున్. ౧౭౦

క. నావుడుఁ గోపాకులుఁడై
దేవేంద్రుని లెక్కగొనక తివిరి చ్యవనుఁ డ
శ్వావనులకు సోమమిడీ య
థావిధి గ్రహియింపఁజేసె ధార్ష్ట్యముకలిమిన్. ౧౭౧

క. కడుఁగనలి యింద్రుఁ డమ్మౌని
గడ తేర్పఁగ నెంచి సురలు గనుఁగొనుచుండన్
విడిచె శతకోటిసూర్యుల
నెడపెడి శతకోటి నృపతి కెద దిగులొదవన్. ౧౭౨

క. తనపైకి నుఱుకు వజ్ర
మ్మును జ్యవనుఁడు తపము చేవ మొగిపించి జగ
మ్మున కాశ్చర్య మొదవ స్తం
భన చేసెన్ మునుల కెంత వాసవుఁడనఁగన్. ౧౭౩

వ. అట్లు వజ్రమ్ము నాఁగి కృత్యచే నింద్రు నడంపనెంచి యగ్ని
యందు సమంత్రకమ్ముగ హోమం బొనరించుటయు, ౧౭౪

ఉ. క్రూరుఁడు ధారుణీధ్రమునకున్ సరివచ్చెడి మేనివాఁడు బల్
దారుణదంష్ట్ర లొప్పెడి యుదగ్రభుజాబలశాలి ఘోరుఁడున్
వీరుఁడు రక్కసుం డొకఁడు వెల్వడియెన్ మదనామకుండు ని
ర్ధారణ సేయ రా దతని దర్పము చిల్వలఱేని కేనియున్. ౧౭౫

సీ. నాలుగుదంష్ట్ర లున్నతములై నూఱేసి
యోజనమ్ముల నిడు పొలయ వెలయుఁ
దక్షిణ దంతముల్ దశయోజనమ్ములు
ప్రత్యంతపర్వతాభములు బాహు
లాకసం బంటు భయానకంబగు జిహ్వ
కంఠంబు గోత్రశృంగంబుఁబోలు
గాటుకకన్నను గడునల్పు దేహంబు
వక్త్రంబు భయదంబు వానికనులు

గీ. దావదవతుల్యముల్ కేశతతులు మిగుల
నక్కజము లొక్కహనువు భూమ్యంతరమునఁ

దక్కినది యంబరమ్మునఁ దనరునిట్టి
మహితరీతిఁ జెలంగు దుర్మదుఁడు మదుఁడు. ౧౭౬

క. వదనమున వజ్రి మిడికొని
కదనమ్మున కభిముఖమ్ముగాఁ దగు నా దు
ర్మదుని మదునిఁగని సురలున్
దదధిపతియు భీతభీతదశ నున్న యెడన్. ౧౭౭

ఉ. ఘోరతర దృష్టులం గొలిపి కుంభిని యంబర మొందు గాఁగ గం
భీరరవం బొనర్చి మెయి వెంచి జగత్త్రియ మొక్కపెట్ట నా
హారము చేయురీతిఁ గనన్నై సురనాథునిమీఁది కేగె నా
హారవ మాచరించి సుర లందఱు చిందఱవందరై తగన్.

వ. అట్టియెడ స్తంభితబాహుండగు నింద్రుండు కాలసన్నిభు నవ్వా
నిం గాంచి భయమ్మున బృహస్పతిం దలఁచికొన నతండు స్మరణ
మాత్రమ్మున నరుదెంచి యతని కిట్లనియె. ౧౭౯

గీ. చ్యవనుని తపోబలమ్ము దుస్సాధ మతని
కతన నుదయించె నీతఁ డఖండబలుఁడు
మదుఁ డనెడి రక్కసుఁడు వీఁ డమరులకుబలె
నాకును నజేయుఁ డెట్టి మంత్రములకేని. ౧౮౦

గీ. శక్తిభక్తుల కోపమ్ము సంహరింపఁ
దరమె యెవ్వారికేనిఁ ? దత్తఱముమాని
శరణు గొనుమయ్య చ్యవనుని ; సంహరింప
నేర్చు నాతండు దనకృత్య నెమ్మిగ్రమ్మి. ౧౮౧

వ. అను గురువచనమ్ముల వినమ్రుండై శక్రుం డత్తపోధనునికి
నమస్కరించుచు భయమ్ము పెంపున నిట్లను. ౧౮౨

క. క్షమియింపుమయ్య నీవా
క్యము దప్పనె యశ్వినులకు నయ్యెడి నిఁక సో
మము నీదు తపముశక్తి మ
హిమ సూడఁగ నాయెనర్చు టిది నిక్కముగన్. ౧౮౩

చ. అనవుడు నమ్మహాముని "భయంపడనేల" యటంచు బేర్మి న
య్యనిమిషనాథుఁ బల్కి మృగయామధుపానదురోదరాంగనా
జనములయందు నమ్మదుని సంతతసుస్థిరుఁగా నొనర్చి య
శ్వినులకు నిందు్రిసమ్మతినిఁజేసి యొసంగె గ్రహం బవార్యతన్.

వ. తపోబలసంపన్నుండగు చ్యవనుం డివ్విధమ్మున నశ్వినులఁ గృత
కృత్యుల నొనర్చె, నంత శర్యాతి సమాప్తవ్రతుండై మంత్రులం
గలసి యతని మహత్వమ్మున కద్భుతమందుచు నగరమ్మున కరిగి
రాజ్యమ్మొనర్చుచుండె. ౧౮౫

గీ. అతని కానర్తుఁ డుదయించె ననఘమూర్తి
తత్సుతుఁడు రేవతుఁడు సముద్రమ్మునందుఁ
దగ వినిర్మించెఁ బురి గుశస్థలి యనంగ
నతని కొక నూఱుగురు పుత్రు లవనినాథ. ౧౮౬

వ. అందుఁ గకుద్మి జ్యేష్ఠుండు మఱియు నా రేవతునకు రేవతియను
నొక్క కొమరితయుం బుట్టెఁ బుట్టె, ౧౮౭

—* రేవతుఁడు బ్రహ్మలోకమ్మునకరుగుట *—

క. అనుపమలక్షణలక్షిత
సునిశితమహావనవిశేషశోభాస్పదమై
తనరఁగ నకుమారుఁగని
జనపాలుఁడు పెండ్లిసేయ సమకట్టె వెసన్. ౧౮౮

వ. అతండు స్వపరిపాల్యంబులగు నానర్త దేశంబుల నెల్లెడల నన్వే షించి తగిన వరునిఁ గానక పదంపడి యొక్కనాఁడు బ్రహ్మానందుగు వాఁడై తనపుత్రిక వెంటఁబెట్టుకొని సత్యలోకమ్మున కరిగె. నావుడు జనమేజయుండు మహాత్మా! బ్రహ్మవేత్తయగు బ్రాహ్మణు నకు గమ్యంబగు సత్యలోకంబు రాజున కెట్లు పోనయ్యె, నిది యిట్లుండ మృతులకు స్వర్గం బలవడునని శాస్త్రనిర్ణయంబుకదా! మరల స్వర్గస్థులకుఁ జ్యుతి గల్గెనేని మర్త్యమ్మునం గతి యగుట కేమి నిమిత్తము? నావుడు వ్యాసుండు, నరేంద్రా! యింద్ర లోకమ్మును వహ్నిలోకమ్మును సంయమనీపురమ్మును వరుణ లోకమ్మును కైలాసమ్మును వైకుంఠమ్మును నను నీ లోకము లన్నియును మేరువునం దెసంగెడి. ౧౮౯

ఉ. నాకము మానవుల్ చనుట యబ్బురమే! విజయుండు మానవుం డేకద! శక్రసన్నిధికి నేగఁడె? యింతకుఁ బూర్వ మొందలో రాకలు పోకలుం గలుగు రాజులు దైత్యులు లేరె! వారిలో నీ కెఱిఁగింతు నొక్కరు ననింద్యచరిత్రు నృపాలశేఖరా. ౧౯౦

వ. మున్ను మహాభిషుండను రాజు బ్రహ్మలోకమ్మున కరిగి యచ్చట స్త్రీరూపధారిణియైయుఁ గించిన్నగ్నయునగు గంగం గాంచి కామా ర్తుండై స్మితం బొనర్ప నాపెయు నట్టిదయయ్యె. వారి నిరువుర బ్రహ్మ మర్త్యమ్మునఁ బుట్టుటకు శపించె నిదియిట్లుండ,

క. దానవులబాధ కోర్వక
శ్రీనాథునితోడ నెఱుఁగఁజేయ సురలు పోఁ
గా నేరరె వైకుంఠము!
దీనికి సందియము వలదు ధీరవతంసా. ౧౯౧

క. అనిమిషలోకం బాడిఁగఁ
జననగు లోకమ్ములెల్ల జనులకుఁ బుణ్యం
బునఁబొల్చు తాపసులకున్
ఘనులగు మఖకర్తలకు నగణ్యస్ఫూర్తిన్. ౧౯౩

క. అనవుడు జనమేజయుఁ డి
ట్లను రేవతుఁడిట్లు సరసిజాసనుకడకున్
దన తనయం గొని చనుమీఁ
ద నైన వృత్తాంతమేమి తత్త్వజ్ఞనిధీ. ౧౯౪

చ. అని యడుగన్ నృపాలునకు వ్యాసమునీంద్రుఁడు వల్కె, నీరజా
సనుఁ గన రేవతుండు తనుజాసహితంబుగ నేగి యంత నా
తనిసభ గానమెంతయు ముదమ్మున నొప్పుచునుండఁ గొంత ద
న్కను విని సంతసించి తదనంతర మంజలిమోడ్చి యిట్లనున్.

ఉ. దేవ! నమస్కృతిం గొని మదీయము విన్నపమాలకింపు మీ
పావనశీల నాకొమరె బహ్వవనీశుల నేతదర్థమై
భూవలయమ్మునన్ వెదకి పొందఁగ నేర సద్వృత్తు; మీఁద నిం
కేవరుఁ డీ వధూమణికి నీడగువాఁడు వచింప వేఁడెదన్. ౧౯౫

క. బలవంతునిఁ గులవంతుని
సలలితశీలుని మనోజ్ఞుఁ జాతుర్యమునన్
వెలసెడి వాని వచింపుము
సొలవక యొక్కరుని రాజసూనుఁ గుమారున్. ౧౯౬

వ. అనవుడుఁ జతురాననుండు, రాజా! నీ వెందఱ రాకొమరుల నరసి
యుంటి వింతకు వారలందఱును గాలగ్రస్తులై మృతినొంది రియ్యాది
సప్తవింశతమంబగు ద్వాపరంబు భవద్వంశజులును నట్ల నిహతు
లగుట నీపురంబును దైత్యలుంఠితం బయ్యెనని వెండియు, ౧౯౭

క. శీతకరవంశతిలకుఁడు
నీతిఖ్యాతుఁడు యయాతినృపకులజుం డు
ద్గీతయశుఁ డుగ్రసేనుఁడు
భూతలపతి మధుర యనెడిపురి నేలునొగిన్. ౧౯౯

గీ. అతనికొమరుండు గంసుఁ డత్యధికబలుఁడు
తండ్రిఁ గారాగృహమ్మునఁ దగులఁజేసి
యెల్ల లోకమ్ములకు నార్తి యొసఁగ రాజ్య
మేలె దైత్యాంశభవుఁ డెంతయేని జడుఁడు. ౨౦౦

క. ధరణియు భారంబోర్వక
త్వరపడి నను వేఁడ వేల్పుతండంబులకుం
బురికొల్పిన నాయాజ్ఞ న
మరు లంశంబులను బుట్టి మహి వెలసిరొగిన్. ౨౦౧

ఉ. ఆయతపుణ్యుఁడై బదరికాశ్రమమం దమరాపగాకన
త్తోయపవిత్రకాయుఁడయి తొల్లి దపశ్చరణం బెలంగె నా
రాయణమౌని ధర్మసుతుఁ, డమ్మహనీయుఁడ దేవకీసుతుం
డై యలరారె యాదవులయందుఁ గృతార్థుఁడు గృష్ణమూర్తి నా.

క. ఆకృష్ణమూర్తి దుష్టుని
నీకంసునిఁ జంపి రాజ్య మిచ్చెన్ గరుణా
వ్యాకులత నుగ్రసేనున,
కాకంసునిమామ యధికుఁ డఖిలవిధములన్. ౨౦3

వ. జరాసంధుండనువాఁ డల్లునిమరణమ్మునకుఁ గోపించి మధుర నరికట్టి సంగరంబొనర్చి కృష్ణునిచేఁ బరాజితుండై యరిగి కాల యవనుం బుత్తెంచిన మహాబలుండగు వానిరాక నెఱింగి శ్రీకృ

ష్ణుండు యాదవుల నందఱు ద్వారక కనిపి తానును బిఱుందన
చని యిప్పటికి నచ్చట వసింపుచున్నవాఁడు. ౨౦౬

చ. అరిమదహారి శేషఫణియంశమునన్ జనియించినట్టి యు
ద్ధురుఁడు హలాయుధుం డతనితో నెవఁడీడు! మహానుభావుఁ డా
హారికిని నగ్రజుండు విను మాత్మజ నాబలభద్రమూర్తి కా
దరమున నిచ్చి పెండిలి ముదమ్మునఁ జేయుము కీర్తిశాలివై.

వ. అట్లొనర్చి నీవు తపఃకాంక్షివై సురారామంబగు బదరికాశ్రమ
మ్మునకరుగుము, నావుడు రాజర్షి తనయం దోడ్కొని ద్వారక
కరిగి బలరామునకక్కన్నియ నిచ్చి వివాహం బొనరించి పిదపఁ
దపమ్మున కరిగి కొండొకకాలమ్మునకు నయ్యమరాపగాతట
మ్మునఁ గాయమ్ము విడిచి దివం బలంకరించె నావుడుఁ బారీక్షి
తుం డిట్లను. ౨౦౭

ఉ. ఎంతయు నక్కజంబు వచియించెద వో మునినాథ! యాధరా
కాంతుఁడు నూటయెన్మిది యుగమ్ములు సత్యమునందుఁబుచ్చెఁ దా
నంతకు నత్తలోదరికి నబ్బదె వార్ధక; మింతకాల మ
య్యెంతికి నానృపాలునకు నేగతి నాయువుగల్గెఁ బల్కుమీ.

వ. అనిన వ్యాసుం డిట్లను. ౨౦౮

క. జర లేదు క్షుత్పిపాసలు
మరణము గ్లానియును భయ మమరకుండెడి నా
సరసీజాసనపదసు
స్థిరులగు పుణ్యులకు నృపతిశేఖర యెపుడున్! ౨౦౯

వ. అని వెండియు, ౨౧౦

గీ. మేరుగతుఁడైన శర్యాతిధారుణీశు
సంతతినిఁబట్టి దానవుల్ సమయఁజేసి

రధిప ! కొందఱు భయభీతు లగుచు నరిగి
రచ్చటచ్చటి కెంతయు ననద లగుచు. ౨౧౧

గీ. మనువునకుఁ బుట్టె నిక్ష్వాకు వనెడినృపుఁడు
తుమ్ము కారణమున ; నా సుతునికతమున
సూర్యవంశంబు వర్ధిల్లె నార్యుఁ డతఁడు
నారదోపదేశమున వనమున కరిగి. ౨౧౨

వ. అనవరతదీక్షాపరుండై వంశవృద్ధికై దేవి నారాధించి తత్ప్రసాద
మ్మున నూర్వురఁ బుత్రులం గనియె. నందు వికుక్షి జ్యేష్ఠం డిట్లు
ప్రాప్తసంతానుండై యమ్మహీపాలుం డయోధ్య రాజధానిగ
రాజ్యంబేలుచు శకునిప్రభృతులగు నేఁబదుండ్రుఁ గొమరుల
నుత్తరాపథమ్మునకు నలువది యెనమండ్రు దక్షిణదేశమ్మునకును
బ్రభువులంజేసి యిరువుర నాత్మసేవనార్థంబు సన్నిధి నుంచి
కొనియె. ౨౧౩

—* శశాద చరిత్ర *—

గీ. సకలజనులకు సుఖము లెసంగ రాజ్య
పాలనం బొనరించు నప్పార్థివుండు
వనమునకుఁ బంపెఁ "బలము దె"మ్మని వికుక్షి
నష్టకాశ్రాద్ధమునకుఁ దా నంతఁ బిదప. ౨౧౪

క. జనకుని యాజ్ఞంగొని వన
మునకుఁ జని శశములను సమున్నతరీతిన్
బనుపడు సూకరముల హరి
ణనికాయములఁ బడనేసి నరవరుఁడంతన్. ౨౧౫

పరిశ్రాంతుండై యాఁకొని యష్టకావృత్తాంతమ్ము నేమఱి యం
దొక్క శశమును భక్షించి నగరమ్మున కరిగి తక్కిన మాంసంబు

తండ్రికి నొప్పఁజెప్పఁ, బిదపఁ బ్రోక్షణార్థంబు తనకడ నుంచిన దానింగాంచి కులగురుండు వసిష్ఠుండు గోపించి యిట్లను. ౨౧౬

క. ఇది భుక్తశేష మేగతి
విదితంబుగ శ్రాద్ధమున నివేదింపఁగ నొ
ప్పిదమగు నొక శశము౯ దీ
నఁ దినె న్నీకొమరుఁడనుడు నరపతి యలుక౯. ౨౧౭

వ. వికుక్షిం గని విధిలోప మ్మొనర్చిన నీ విట నుండఁదగవు పొమ్మనుడు నతం డది మొదలు శశాదుండను నామమ్మున నరణ్యమ్ములఁ గ్రుమ్మరుచుండె. ౨౧౮

క. పదపడి యిక్ష్వాకుఁడు స
ద్విదితయశుఁడు చనియె దేవవిభు నిలయం బం
తఁ దన జనకురాజ్యము స
మ్మద మలర శశాదనృపతిమణి కైకొనియె౯. ౨౧౯

వ. అతండు ధర్మంబు దప్పక యయోధ్యానగరంబు పాలించుచుఁ గొండొకకాలమ్మునకుఁ గకుత్స్థుఁ గనియె నితని కింద్రవాహుం డనియుఁ బురంజయుం డనియును నామమ్ములు గలవు, నావుడు జనమేజయుండు నామభేదం బెట్లుకలిగెననుడు వ్యాసుండిట్లనియె.

గీ. ఆ శశాదుని తనుజాతుఁ డవనిభర్త
యగుచుఁ బాలించునెడ సుర లసురవిజితు
లగుచు వైకుంఠమున కేగి యబ్జనాభు
శరణుఁ జెందిన నాతండు సదయుఁ డగుచు. ౨౨౦

చ. కలఁడు పరాంబికాచరణకంజనిరంతరభక్తిసంపదా
కలితవిశేషశక్తియు నఖండయశుండు శశాదపుత్త్రుఁ డా

సలలితు వేఁడఁగాఁ జనుఁడు సత్వరులై ధర ; కమ్మహామహుం
డెలమిని మీకుఁ దోడయి జయింపఁగలాఁ డమరారిసంఘముల్.

వ. అను నద్దేవు నానతిం గొని యమరులు వైళంబుగ నయోధ్యకుం జనిన శశాదతనుజుండు వారల నందఱఁ బూజించి వినయమ్మున నిట్లనియె. ౨౨౩

గీ. ఎంత యత్న మొనర్చినయేని దర్శ
నం బొసంగని మీరిటు నా గృహంబు
కడకు విచ్చేయుటను నగ్రిగణ్యమయ్యె
జన్మము సురేంద్రులార ! నిస్సంశయముగ. ౨౨౪

వ. దుస్సాధంబేనియు మీర లాజ్ఞాపించిన కార్యంబు నొనరించెద నావుడు వార లిట్లనిరి. ౨౨౫

క. హరి ప్రేరేపఁగ నీకడ
కరుదెంచితి మిందునకు సహాయుఁడవై ని
ర్జరవైరులఁ దునుమన్నా,
నరపతి యిట్లనియెఁ బేర్మి నాకులతోడన్. ౨౨౬

వ. మీరాజగు నింద్రుండు నాకు వాహనం బయ్యెనేని నేను దప్పక పార్ష్ణిగ్రాహుండనై సంగ్రామం బొనరింతు ననుడు, సురలు తమ పతి కెఱిఁగించిన నాతండును లజ్జితుండై హరిప్రేరణమ్మున నత నికి వాహనంబయ్యెఁ, బిమ్మట నమ్మహీపతి యుద్ధం బొనరించి దైత్యపురమ్ములజయించె;నాఁటఁగోలె నితనికి నింద్రుండు వాహనం బగుట నింద్రవాహుం డనియుఁ బురముల జయించుకతనఁ బురం జయుండనియుఁ గకుదమునఁ గూర్చుండుటం జేసి కకుత్థ్సుం డనియు నామత్రయం బన్వర్థకంబై నెగడు. ౨౨౭

గీ. దైత్యుల జయించి వారల ధనములెల్ల
సురలకు నొసంగి యన్నరవరుఁడు సురప
తికి సఖత్వము నెఱపి వర్ధిష్ణుఁడయ్యె
నతనికులజులు గాకుత్థ్సు లవనినాథ. ౨౨౯

వ. వారల వివరించెదఁ గకుత్థ్సునికిఁ గాకుత్థ్సుండును, వానికిఁ బృథువును, వానికి విశ్వరంధియు, విశ్వరంధికిఁ జంద్రుండును, జంద్రునకు యువనాశ్వుండును, నారాజునకు శావంతుండునుం గలిగిరి.

క. శావంతి యనెడి నగరం
బావిభుఁ డాత్మాభిధాన మలరఁగఁ బృథుల
శ్రీ వెలయఁగఁ గట్టించె ధ
రావలయమ్మునకు నెల్ల రత్నంబనఁగన్. ౨౩౦

వ. శావంతునకు బృహదశ్వుండును, నతనికిఁ గువలాశ్వుండును బుట్టి రీతండు ధుంధువను రక్కసు జయించినకతన ధుంధుమారుండను బిరుదనామమ్ము నొందె; నిమ్మహీపతికి దృఢాశ్వుండును, నతనికి హర్యశ్వుండును, వానికి నికుంభుండును, నయ్యలఘునకు బర్హణాశ్వుండును, నిన్నరవరునకుఁ గృశాశ్వుండును, నవ్వానికిఁ బ్రసేనజిత్తును, నతనికి యౌవనాశ్వుండును, నమ్మహామహునకు మాంధాతయు, నుదయించిరి. ౨౩౧

క. ఆ మాంధాతృమహీపతి
శ్రీమంతము లగుచు మిగులఁ జెలువొందెడి స
ద్ధామములు నూటయెనిమిది
దా మహిఁ గట్టించె శక్తితత్పరమతియై. ౨౩౨

—* మాంధాతృ చరిత్ర *—

వ. ఇమ్మహీపతి యెల్లరంబోలి మాతృగర్భమ్మునం గాక పితృద రమ్మునుండి యుద్భవించె, నావుడు జనమేజయుం డది యెట్లనుడు వ్యాసుం డిట్లను. ౨౩౩

గీ. యౌవనాశ్వునకును భార్య లనఘమతులు
నూర్వు రిందొక్కరితకైననుం జనింప
దయ్యె సంతాన, మానృపుం డాత్మజాతు
లకు మనమ్మునఁ జింతించి యొకఁడు నొకట. ౨౩౪

వ. వనమ్మున కరిగి ఋష్యాశ్రమమ్ములు సేవించుచు నచ్చట నిశ్వా సమ్ములు విడువ వారును నతని దుఃఖితుఁగా నెఱిఁగి కరుణించి రాజా ! నీ మనమ్మునఁ గల చింత యెయ్యది ? నొడువు మద్దా నికిఁ బ్రతీకారం బొనరింతము నావుడు నృపాలుం డిట్లను.

మ. ధనధాన్యమ్ములు మేటి గుఱ్ఱములు భృత్యావ్రాతముల్ నాగముల్ ఘనరాజ్యమ్ము సుఖమ్మునుం గలదు చక్కంగన్ ముదంబిచ్చు జ వ్వనులు న్నూర్వురు భార్యలొకలరు తద్భావమాత్రులం దొక్క యం గనకైనన్ సుతలబ్ధి లే దిదియ శోకం బెప్పుడు న్మామదిన్.

వ. అపుత్రునకు గతి లేమి నన్ననుగ్రహించి సంతానార్థినగు నాచే నెద్దియే నొక యిష్టిం జేయించి కృతార్థుం జేయవేఁడెద, నావుడుఁ దాపసు లింద్రదేవతాకంబగు నిష్టిం జేయించి యజ్ఞశాలయందు సంతానార్థమ్ముగా వేదమంత్రసమ్మంత్రితంబగు నొక కలశం బునిచిన నన్నరవరుం డానాఁటిరేయి తృషితుండై తద్గతంబులగు జలమ్ములం గ్రోలె, నంత మునులు మఱునాఁ డక్కలశంబున జలమ్ములు లేకున్న “ నీ భార్యకునై యునిచిన జలమ్ము నీ వుప యోగించితివే ” యనుడు నతండును బిపాసచే నట్లొనర్చితిననిమె

వారలును దైవబలమ్మునకు శంకించుచు నిష్టిని సమాప్తి చేసి తమయంతం జనిరి. ౨౩౭

గీ. అంత మంత్రిబలమ్మున నన్నృపాల
కునకు గర్భోదయంబయి ఘనతఁ జెంది
పూర్ణ మగుడు జనించె సత్పుత్రుఁ డొకఁడు
కుడికెలననుండి గర్భంబు పొడిచి చించి. ౨౩౮

వ. పిమ్మట దేవతల యనుగ్రహమ్మున నయ్యవనీపతి మృతుండు గాక జీవించెఁ బదపడి మంత్రులమాతృకుండగు నా శిశువు నుద్దేశించి *"కంధాస్యత్యయ" మ్మని విచారించుచుండ నింద్రుండేతెంచి తన తర్జనినాశిశువు నోట నిడుచు "మాం ధాతా" యని పలికె, నక్కతన నతఁడు మాంధాతృ నామమ్మునఁ బ్రసిద్ధుండయ్యె. ౨౩౯

చ. అతఁడు జయించి భూవలయ మంతయుఁ; బిమ్మటఁ జక్రవర్తియై
యతులితరీతి నేలె జగ, మయ్యవనీపతి భీతిఁజేసి ద
స్యుతతి గిరీంద్రకందరలఁ జొచ్చుట, నింద్రుఁడొసంగెఁ బేరు సా
ర్థత నలరారి యొప్పఁ ద్రసదస్యుఁ డనంగ ననుగ్రహమ్మునన్.

చ. విమలమనోహరాంగి శశిబిందుతనూభవ బిందుమత్యభి
ఖ్య మెఱయు సత్పతివ్రత నఖండయశుండు వివాహమాడి యు
త్తముఁ బురుకుత్సు భూరిగుణతత్పరునిన్ ముచికుందు నిర్వరన్
గ్రమముగఁ గాంచెఁ బుత్రుల జగద్ధితబుద్ధి నతం డతంద్రులన్.

క. పురుకుత్సున కుదయించెను
నరణ్యుఁ డతిధార్మికుఁడు మహాభాగుఁడు త

* (ధేట్ పానే, ధాతా.)

న్నరవరునకు బృహదశ్వుం,
డరయఁగ నాతనికిఁ బుట్టె హర్యశ్వుండున్. ౨౮౨

వ. ఆ హర్యశ్వునకుఁ ద్రిధన్వుండును నతనికి నరుణుండును వానికి సత్యవ్రతుండును బొడమి రితం డొక్కనాఁడు, వివాహసమయమ్మున నొక విప్రకన్య నపహరించిన నద్దురాచరణంబున కోర్వక తత్సభ్యు లొక్కమొగి నార్తులగుచుఁ జనుటయు నతని తండ్రి యగు నరుణుండు నృశంసుండగు తన కొమరుం డెద్దియేని నొక దుష్కృత్యమ్మున వీరలఁ జెనకం బోలునని శంకించి వారల కిట్లను. ౨౮౩

క. నాకొమరుఁ డెటేఁగి మొఱుఁగక
మీకేమి యొనర్చె ననుడు, మేలెంచక తా
మాకన్నియను బలాత్కృతిఁ
జేకొనియెన్ బెండ్లివేళఁ, జెనఁటివిధమునన్. ౨౮౪

—* సత్యవ్రతోపాఖ్యానము *—

ఉ. నావుడుఁ గ్రుద్ధుఁడై నృపతి నందనునిన్ గని యిట్లు పల్కు, దుష్టా! వృథ నీకునామ, మకటా! యిది పాతకకృత్య మేమిగా భావమునం దలంచితివి, పార్థివజన్మము నెత్తలేదె! నా కీవు సుతుండ వన్నయశమే? యెటకేనియుఁ బొమ్ము దుర్మతీ.

వ. సత్యవ్రతుం డే నేయెడ కేగుదు నని యెదిరించి మాటికిని బల్కుడు నతం డిట్లను. ౨౮౬

చ. శ్వపచులు నేనిఁ జేయని యసత్కృతిఁ జల్పిననీకు నా శ్వపాకపరిచయంబు న్యాయ్యమగుఁ గాన నటుల్ పొనరింపు మెంతయే నపయశమిచ్చు నీకతన నొదు నె యేను గృతార్థుఁడన్! కులంబు పతితమయ్యె నీజననమున్ గని యింతకు వంశపాంసనా. ౨౮౭

వ. ఇట్లు వసిష్ఠప్రేరితుండగు జనకునిచే నిష్కాసితుండై సత్యవ్రతుండు వనమ్మున కరిగి శ్వపాకులం గూడి ధనుర్ధరుండై వర్తించుచు వసిష్ఠునియందుఁ గ్రోధమ్ము గలిగియుండెఁ, బదంపడి నరుణుండు పుత్రార్థమ్ముగాఁ దపం బొనరింప వనమ్మున కరిగె నీ యధర్మమ్ము కారణమ్ముగ నింద్రుం డారాజుదేశమ్మునఁ బండ్రెండువత్సరమ్ములు వర్షాభావం బొనర్చె నట్టియెడ, ౨౪౮

క. ఆ నృపతిదేశమునఁ దన
సూనుల నర్ధాంగి విడిచి సొలవక తపముం
బూనఁ జనెఁ గౌశికి యనం
గా నెగడెడి యేటికడకు గాధిజుఁ డెలమిన్. ౨౪౯

క. ఆ కౌశికునర్ధాంగి క్షు
ధాకులులై శిశువు 'లన్నమన్న' మనుచుఁ ద
న్నేకడఁ బీడింపఁగ బల్
శోకముపాలై మనమ్ము స్రుక్కి కలంగన్. ౨౫౦

చ. పతి ధనహీననైన నను బాలకులన్ ద్యజియించి యేగె భూ
పతియును లేఁడు చూచుటకుఁ బట్టణమందు; క్షుధార్తులై ననుం
బ్రతుకఁగ నీరు తిండికయి బాలకు; లెవ్వఁడు రక్షకుండు? దు
ర్గతి నెటు లీఁగుదాన? బ్రతుకంగలరే సుతు లన్నహీనులై?

ఉ. ఎల్లరఁ జంపుకంటె మఱి యిందొకనిన్ దెగనమ్ముదాన నే
నుల్లము ఱాయి చేసికొని; యోమఁగ వచ్చును విక్రయాప్తసం
పల్లవ మిక్కుమారులకుఁ బ్రాణము నిల్పఁగఁ గొంతదనుక; నే
తల్లికినేనిఁ జొప్పడని ధర్మము ధాత విధించె నా కిటన్. ౨౫౧

క. అని దైవగతికిఁ జింతన్
గొనుచున్ మధ్యముని యఱుతఁ గొంకక దర్భల్

చొనిపిన రజ్జువు దగిలిచి
తనగృహమ్మున్ వీడి చనియెఁ దరుణి వగ దగన్. ౨౫౩

క. మలమల మఱుఁగుచు నమ్ముని
లలనామణి సుతులు చెఱఁగు లాగుచురా నెం
దుల కేనిఁ బోవునది యి
మ్ముల సత్యవ్రతుని మార్గమునఁ గనుఁగొనియెన్. ౨౫౪

వ. సత్యవ్రతుండును నాపె నీక్షించి యిట్లనియె. ౨౫౫

క. అకటా! యేడ్చెడి పుత్రకు
నకు నఱుతం ద్రాడుగట్టి నారీమణి! మి
న్నక యరిగెద వెందుల కే
మికతం, బెవ్వతెవు? తెల్పుమీ సత్యముగన్. ౨౫౬

క. అనవుడు నల్లలనామణి
యను, విశ్వామిత్రుఁ డనెడి యనఘాత్ముఁడు న
న్నును సుతులన్ డించి తపం
బున కరిగెన్ న న్నెఱుంగు మునివరు సతిగా. ౨౫౭

క. ధనహీననైన కతమున
నసదనగుచు సుతుల పోషణార్థముగా నం
దనులం దొక్కరుఁడగు వీ
నిని విక్రీతునిగఁ జేయ నేర్చితి ననఘా. ౨౫౮

చ. అనవుడు నా నృపాలసుతుఁ "డమ్మరో! యేమిటి కిట్లొనర్ప నే
ననుదినమున్ భవత్సుతుల యాఁకటికిన్ దగినట్టి భక్ష్యముం
గొని యరుదెంతు సత్యమునకుం జవదాఁటక తావకాశ్రమ
మ్మున నొక చెట్టునం దిడుదు మూటగఁగట్టి గృహమ్ము చేరుమా.

వ. పదంపడి నీ భర్తయును రాఁగలఁడు" నావుడు నమ్మునివనిత సంత
సించి తన యాశ్రమమ్మున కరిగె నక్కుమారుండు గళబంధమ్మె
కారణమ్ముగ గాలవుం డనఁబరఁగె. ౨౬౦

క. ఆసత్యవ్రతుఁడును వి
శ్వాసమ్మును భక్తియును గృపయుఁ గలిగి సదా
దాసుండై మునివనితకు
గ్రాసంబిడు సుతసహితముగా భుజియింపన్. ౨౬౧

గీ. మృగముల వరాహములను మహిషశశముల
ననుదినమ్మును గొట్టి సత్యవ్రతుండు
గాధిసుతు నాశ్రమముపొంతఁ గట్టుఁ జెట్టు
కొమ్మ కొకముళ్ళగాఁ జేసి కూర్చుపేర్మి. ౨౬౨

వ. విశ్వామిత్రునిభార్య తన్మాంసంబుకతన సుతులఁ బోషించుచుఁ
గాలమ్ము గడపుచుండె, నిట్లుండ నట సత్యవ్రతునితండ్రి తపమ్మున
కరిగినది మొదలుగ నతని పురమ్మును నంతఃపురమ్మును వసి
ష్ఠుండు గాపాడుచు రాజకార్యమ్ములు నెఱవేర్చుచు నయోధ్య
యం దుండె; నయ్యెడ నప్పురమ్మునకు సమీపమ్మునఁ దండ్రి
యానతిం జేసి దుర్గతిం బడియున్న సత్యవ్రతునకు నొకనాఁడు
మృగమ్ము లెవ్వియుం గానరాక వసిష్ఠుధేనువు పొడకట్టె; దానిం
గాంచి యతండు పూర్వక్రోధమ్మున వధించి తన్మాంసమ్ము
కొంత దిని తన యాఁకలిం దీర్చికొని తక్కుంగల పలలమ్ము
నప్పాదపమ్మున నెప్పటియట్ల బంధించె. ౨౬౩

క. ఆ ఋషిపత్నియుఁ దనదు కు
మారులకుం బెట్టి గోపుమాంసం బని తా

నారయ నేరక యెంతేఁ
గూరిమి భుజియించె మిగులఁ గుతుకం బెసఁగన్. ౨౬౪

వ. అంత వసిష్ఠుండు తన ధేనువు మృతి నెఱింగి కోపాకులుండై
పశుఘ్నుండగు సత్యవ్రతున కిట్లనియె. ౨౬౫

ఉ. ధేనువుఁ జంపి యెంతటికృతిన్ బొనరించితి వోరిదుష్ట ! దో
షానుగతుండవై మును ధరామరదారహరించుటన్ జగ
న్మానితుఁడైన తండ్రి యవమానము గైకొనుటన్ వృథాగతిన్
ధేనువు నిప్డు చంపుటను నిన్నుఁద్రిశంకుఁడనంగ నొప్పెడిన్.

వ. నేఁడు మొదలి నామమ్మునం బొదలి జనులకుఁ బిశాచాకారమ్ము
నం బొడకట్టుచుండుమని శాపంబిచ్చిన నతం డా రూపమ్ము
దాల్చి యయ్యాశ్రమమ్మున వసియించుచు నొక్కమునిపుత్త్రుని
కతన నుపదేశంబు వడసి జగజ్జననిం గొలిచి యఖండతప
మ్మొనరించుచుండె నావుడు జనమేజయుండు మహాత్మా ! త్రిశం
కునకు వసిష్ఠశాపం బెట్లుతొలఁగె నొడువు మన నతం డిట్లనియె.

గీ. ఆతఁడు పిశాచమై దేవి నాత్మ నిల్పి
తన్నవాక్షరమంత్రతత్పరమనస్కుఁ
డగుచుఁ దప మాచరించి హోమార్థి యగుచు
నర్థి విప్రులకడ కేగి యడిగె నిట్లు. ౨౬౭

వ. నాయొనర్చెడి నమస్కృతులంగొని మత్ప్రార్థనంబు సఫలంబొనర్పఁ
గోరెద, నేను జిరమ్మునుండి నవాక్షరమంత్రరాజంబు జపియిం
చితి నిపుడు జపదశాంశమ్ముచే హోమంబు సలుపవలయు
మీరలు ఋత్విజులరై యిక్కార్యంబు నెరవేర్చి కృతార్థుం జేయ
వేఁడెద నన్నరుణపుత్త్రుండగు సత్యవ్రతుగాఁ దెలుంగుఁడు
నావుడు వార లిట్లనిరి. ౨౬౮

క. తెలియంగ నయ్యె నీవా !
కులగురుఁడు వసిష్ఠమౌని గోపించి నిన్నుఁ
జలిపెఁ బిశాచముగా నీ
కలవడునే ? వేదవిహితమగు కృతిసేయన్‌. ౨౭౦

చ. అని తనుఁ దూలనాడుటయు నానృపనందనుఁ డేల నాదు జీ
వన ? మిఁక నేమి సేయుదు ? నపాతుఁడ రాజ్యములేమి చేసె మ
జ్జనకుఁడు దేశికుం డిడెఁ 'బిశాచమవై చెడు' మంచు శాప ; మె
ప్పనికి నవగ్రతం బూరసి పాతకినై బ్రతుకంగఁ జెల్లునే. ౨౭౧

వ. అని కృతనిశ్చయుండై శుష్కమ్ములగు కాష్ఠమ్ములు పేర్చి చితి
నేర్పఱచి యగ్నిఁ జొనిపి యందుం బ్రవేశింప నెంచి స్నానం బొన
రించి జగజ్జనని నాత్మఁ దలంచుకొంచుఁ దత్సమీపమ్మునఁ
గృతాంజలియై కూర్చుండునంత నజ్జగదంబ కరుణాశాలినియై
యాకసమ్మున నాతనికి దర్శనం బొసంగి వారించి యిట్లను.

గీ. సాహసింపఁగ నేల యోజనవరేణ్య !
వినుము నామాట నీ తండ్రి వృద్ధుఁడయ్యె
నీకు రాజ్య మ్మొసంగి యెందేనిఁ దపము
చేయఁబోనున్నవాఁడు నిశ్చింతుఁడగుచు. ౨౭3

వ. మదనుగ్రహమ్మునంజేసి రేపు నిన్నుఁ బట్టాభిషిక్తుం జేయ నీ
తండ్రి యనుమతమ్మున మంత్రు లరుదెంతురని చెప్పి దేవి యదృ
శ్యయయ్యెఁ, బదంపడి త్రిశంకుండు మరణోద్యమమ్ము విడిచి
సుఖంబుండె నంత నారదుం డరిగి వృత్తాంతమ్మెల్ల నృపాలునకుం
జెప్పిన నతండు పుత్రు మరణోద్యోగమ్మునకు దుఃఖితుండై మం
త్రులం బిలిచి యిట్లను. ౨౭౪

ఉ. పొమ్మనినంత న న్విడిచి పోయి వనమ్మున భాగ్యహీనుఁడై
గ్రిమ్మరుచుం గురుప్రవరుకోపము తన్నలయింపఁగాఁ బిశా
చమ్మయి దేవి గొల్చి విలసన్మతియై తుద కెంతయుం విరా
గమ్మున నగ్నిలోనఁ దనకాయము వైవఁగ నెంచె నక్కటా.

గీ. కృప గలిగి దేవి వారింపదేని సుతుఁడు
మృతిఁ బొరయుఁగాదె, వైళమ యేగి నాదు
జ్యేష్ఠపుత్త్రునిఁ దెండు నిశ్చింత వాని
కిచ్చి రాజ్యమ్ము తపమున కేగువాఁడ. ౨౭౬

వ. నావుడు మంత్రులు సత్యవ్రతునిపాలి కరిగి యనునయవచనమ్ముల నోదార్చి పురమ్మునకుఁ దీసికొనివచ్చి, తండ్రికిం జూపిన నతండు జటాజూటధరుండును గ్రూరుండును జింతాక్రాంతుండును నగు కొమరుం గాంచి పశ్చాత్తప్తుండై రాజ్యార్హుండును మేధావియునగు తనయు ధర్మం బెఱింగియు నిట్లొనరించితి నని సిగ్గిలుచు నాలింగనం బొనరించుకొని తనసింహాసనమ్మునఁ గూర్చుండఁబెట్టుకొని ప్రీతిపూర్వకమ్ముగ నిట్లనియె. ౨౭౭

—* రాజనీతి *—

క. తనయా! ధర్మమ్మున బు
ద్ధిని నిలుపఁ వలయు నెపుడు ద్విజవర్యుల మ
న్నన సేయవలయుఁ బ్రజలఁ
దనుజులవలెఁ బ్రోవవలయు నరనాథునకుం. ౨౭౮

గీ. ధనము న్యాయాగతంబయి తనరుటొకటి
యనృతమునఁ గాలువెట్టమియును సమార్గ
గామి గాకుంట తపసుల నోముటయును
బరమధర్మమ్ము లియ్యవి పార్థివునకు. ౨౭౯

గీ. ఇంద్రియజయంబు పూజ్యుల నెఱుఁగుటయును
మంత్రిగుప్తియు జోరుల మద మడఁచుట,
శత్రుశేషంబు సైఁపమి, సచివు నన్య
సక్తుఁ జేర్పమి పతికి యశస్కరంబు. ౨౮౦

గీ. శత్రుమిత్రుల కృత్యముల్ చారముఖము
వలన నెఱుఁగుటయును శుష్కవాది గామి
దుష్టసంగంబు దొలఁగుట యిష్టులకును
బూజ్యులకు నీఁగియును విధి భూపతులకు. ౨౮౧

క. యాగముల నొనర్చుట మృగ
యాగతి నతిరక్తి లేమి యంగనలం దు
ద్యోగముల విశ్వసింపమి
యాగమవిహితములు నృపతులగు వారలకున్. ౨౮౨

గీ. ద్యూతమున దాని నాడెడి నీతిరహితు
నందు మద్యమ్మునందు వారాంగనాజ
నమ్మునందును దఱచు గానమ్మునందు
విముఖుఁడై ప్రజ నట్లొనర్పింప వలయు. ౨౮౩

గీ, అరసి బ్రాహ్మముహూర్తమునందు లేచి
స్నాన మొనరించి నియతుఁడై శక్తిపూజ
భక్తి నొనరింపఁగావలెఁ బ్రతిదినమ్ము
జన్మసాఫల్యమును గోరు చతురమతికి. ౨౮౪

క. ఒకసారియైన నప్పర
మకృపానిధి నంబఁ గొలిచి మన్ననఁ దత్పా
దకమలజలంబు గ్రోలిన
సుకృతికి జన్మమ్ము లేదు సూ నిక్కముగన్. ౨౮౫

గీ. దృశ్యమగు జగమఖిలమ్ము దేవదేవి
జీవుఁ డీశ్వరుఁడునుగూడ దేవదేవి
యని, వినిశ్చితాత్ముండగు ననఘమతికి
నతులితానంద మెల్లప్పు డనుఘటించు ౨౮౬

శా. ప్రాతఃకృత్యములన్ యథోచితగతిం బాటించి కొల్వుండి వి
ద్యాతంత్రజ్ఞుల విప్రులన్ బిలిచి శాస్త్రార్థమ్ము లవ్వారిచేఁ
బూతుండై విని పాత్రులై తనరు నా భూదేవతాశ్రేష్ఠులన్
బ్రీతిన్ దానము లిచ్చిపుచ్చవలయున్ బృథ్వీశుఁ డెల్లప్పుడున్.

క. విను మూర్ఖులైన ద్విజులకు
ధన మీవల దిచ్చెనే నుదరపోషణకుం
గనిపెట్టి యీవలయు లం
ఘన మొనరింపంగఁ దగదుగా ధర్మములన్. ౨౮౭

చ. అనఘుల భూమిదేవతల నత్యమలాత్ముల నెన్నఁడేనియున్
జన దవమానముం గొలుప క్షత్రకులమ్మున కమ్మహామహుల్
జనకులు ; వారి యగ్నికిని, క్షత్రియజాతికి విప్రజాతి లో,
హనిధులకున్ శిలల్, జనకతాస్పదముల్ విధిచోదితమ్ముగన్.

ఉ. వారల తేజమెందును నవారితమై యలరారు భూపతుల్
వారలలోన ధీరులగు వారల నెన్ని యఖండదానస
త్కారములన్ మహావినయగౌరవసంపదలన్ మహోన్నతిం
గోరుచుఁ బూజసేయుదు రకుంఠితవైభవముల్ సెలంగఁగన్.

గీ, ధర్మశాస్త్రానుసరణంబు దప్ప కెపుడు
దండనీతి యవశ్యంబు ధరణిపతికిఁ
గోశసంగ్రహ మెల్లెడఁ గూర్పవలయు
ననుచు బోధించెఁ బృథివీంద్రుఁ డాత్మజునకు. ౨౯౧

మ. తనవాక్యమ్ములు సమ్మతించినసుతుల్ దత్తన్మహాతీర్థపా
వననీరమ్ముల చేత మంత్ర్యనుమతిన్ బౌరుల్ శ్రుతుల్ సెప్పి దీ
వనలం జేయఁగ మంచికాలమున దీవ్యద్భంగిఁ బట్టాభిషే
చనముం జేసి యతం డరణ్యము తపస్సంసక్తి నేగెన్ దగన్.

వ. అట్లు నృపాలుండు గాంతారమ్మునఁ గాంతాసహితమ్ముగఁ దపం
బొనర్చి కొండొకకాలమ్మునకు దేహంబు విడిచి దివం బరిగి
యచ్చట నింద్రాసనసమీపమ్మున రెండవయింద్రుండై యుండె
ననుడు జనమేజయుం డిట్లను. ౨౯౩

ఉ. మున్ను వసిష్ఠుధేనువును ముష్కరుఁడై వధియించి శాపముం
గొన్న త్రిశంకుఁ డేగతిని గుంభినికిన్ ధవుఁ డయ్యె ? నెందు నే
ని స్నృపతిత్వ మూనఁదగునే మునివర్య ! పిశాచముల్ ? గృపన్
దన్నృపు శాపమోక్షణకథన్ వినిపింపుము నాకు నావుడున్.

వ. వ్యాసుండిట్లనియె. ౨౯౪

చ. అతఁడు పిశాచమయ్యు జగదంబిక నాత్మఁదలంచి తత్కృపా
మృతమున దివ్యదేహము ధరించె వసిష్ఠమహామునీంద్రు స
మ్మతికి నిధానమయ్యెఁ బితృమాన్యతఁ గాంచె నృపాల ! లోకవం
దితయగు నప్పురాంబిక నుతించిన నెయ్యది గల్గకుండు నే. ౨౯౫

గీ. అనఘుఁడై పేర్మి నిట్లు సత్యవ్రతుండు
రాజ్యమును జెంది జన్నముల్ రమణఁ జేసి
యెన్నఁదగు కీర్తి గాంచి లోకోన్నతుండు
సర్వలక్షణయుతు హరిశ్చంద్రుఁ గనియె. ౨౯౬

వ. పదంపడి యనుగుణవయస్కుండగు కొమరునకు యౌవరాజ్యం
బొసంగి శరీరమ్ముతో దివమ్మున కరుగఁదలఁచి వసిష్ఠాశ్రమమ్మున
కరిగి కృతాంజలిపుటుండై యిట్లను. ౨౯౭

—* వసిష్ఠుండు త్రిశంకునకు శాపంబిచ్చుట *—

మ. అనఘా! యీతనువ్వుం ద్యజింపకయ నే నాసింతు స్వర్లోకసం
జనితానందము లప్సరోవిధుముఖీసంసర్గముల్ దివ్యనం
దనసంచారముఁ గర్ణపేయమగు గాంధర్వంబుఁ; దత్త్వాదృశా
భినవోద్యత్ఫలదాయి యాగమును సంప్రీతిం దగం దెల్పుమా.

చ. అనవుడు నవ్వసిష్ఠుఁ డను నాకనివాసము మర్త్యదుర్లభం
బనఘ! కృతాధ్వరుండు మృతుఁడై దివ మేగుట సుప్రసిద్ధ మే
మనఁదగు నీమనోరథము యాగ మొనర్చితివేని వచ్చు త
త్తనువున నప్సరస్సతులఁ దద్దయుఁ గూడి సుఖింతు విమ్ములన్.

వ. అంతియ కాని బొందితో నాకసుఖం బొడగూర్చుట నా కశక్యం
బనవుడుఁ, బూర్వరోషసంయుక్తుండగు నమ్మహామునికిఁ ద్రిశంకుం
డిట్లను, నీవు గర్వావేశమ్మున నన్నుఁ గ్రతువు చేయింపవేని
వేఱొక్క పురోహితుకతనఁ దాదృశంబగు జన్నం బొనర్చువాఁడ
ననుడుఁ గోపోద్రేకమ్మున నిట్లు శపించె. ౩౦౧

ఉ. గోవధపాపదూషితునకున్ ధరణీసురదారహర్తకున్
దేవనివాస మన్యమగు దేహము దాల్చినయేనిఁ గల్గ దా
రా! వెఱపింత లేక నను నాగ్రహయుక్తునిఁ జేయుదే? దురా
త్మా! విను మిష్ట నీకు ననువౌ శ్వపచత్వము శాపహేతువై.

చ. గురుఁ డిటు శాప మీ నతనికుండలముల్ శిల లయ్యె, నీలతన్
బొరసెను బట్టుపుట్టము, సముజ్జ్వలమైతగు దివ్యదేహముల్
గరి కెన యయ్యె, మై నలఁదుగంధము విట్సమ మయ్యె శక్తికిం
కరుల నెదిర్చి యెవ్వఁడు సుఖమ్ములఁ బొందు జగత్త్రయమ్మునన్.

శా. గాయత్రీజపతత్పరుండు సురలోకజ్యేష్ఠకల్పుండు దు
ర్జ్ఞేయుండైన వసిష్ఠుఁడిట్లు తను వంచింపన్ మహాంబేది చిం

తాయత్తుఁడయి యింటికిఁ జనఁగ నత్యంతమ్ము శంకించి యీ
కాయం బెంతయు హేయ మేలఁకని తత్కాంతారసంచారియై.

క. శ్వపచుం డగుపతిఁ గని యెం
త పతివ్రతయేని భార్య తర్కించును, మం
త్రిపురస్సరులగు బంధులు
నెప మిడి యెడ నుంతు రింత నీచత గలదే. ౩౦౫

మ. మరణంబే శరణంబు గాక యని యాత్మన్ నిశ్చయం బంది త
న్మరణం బేగతిఁ గల్గు, వహ్నివిషసంబంధమ్మునం జేసి యె
వ్వరు గోల్పుత్తురు కాయ మాపతితు లాపై జన్మమందున్ బునః
పరితాపమ్మును గాంచువార లని చెప్పన్ విందు ధర్మమ్ములన్.

వ. కావున నాత్మహత్యకన్న నింద్యం బొండు గప్పట్ట దెట్టివైనఁ గృత
శుభాశుభకర్మమ్ములు కేవలభోగ్యంబు లగుట నే నీదేహమ్మునన
యీశ్వపచత్వమ్ము నిశ్శేషముగా ననుభవించు టొప్పుఁగాదె ?
పుణ్యతీర్థమ్ములు సేవించుచుఁ బరాంబికాస్మరణమ్మును సాధు
సంసర్గమ్మును తోడుగాఁ గాననమ్మున సంచరించెద నెవ్వండేని
యొక మహానుభావుండు దొరక కుండునే ? యని నగరమ్ము
విడిచి గంగాతీరమ్మున కరిగి యట దుఃఖపరీతుండై వసియించు
చుండె. ౩౦౬

క. తనతండ్రి దుర్దశను విని
ఘనుఁడు హరిశ్చంద్రుఁ డాత్మఁగలఁగ సచివులన్
బనిచెన్ వారలు గంగా
ధుని యొద్దున కేగి నృపుని దుఃఖితుఁ గృశునిన్. ౩౦౭

వ. కాంచి వినయమ్మున మహాత్మా ! యువరాజగు నీ తనయుండు
హరిశ్చంద్రుండు నిన్ను సన్మానపూర్వకమ్ముగఁ దోడి తెండనిన

వచ్చితిమి కటాక్షించి నగరమ్మున కరుదెంచి యథాపూర్వకమ్ముగ మంత్రిలును సేవకులును సేవింప రాజ్యభారమ్ము వహింపుము గురుండెట్లు ప్రసన్నుండగు నట్లొనర్పవచ్చునని బహుభంగుల విన్నవించినను శ్వపచుండగు నా నృపాలుండు గృహంబేగుటకు సమ్మతింపక వారల కిట్లనియె. 308

చ. చనుఁడు మదాజ్ఞఁజేసి శ్వపచత్వమునన్ బురిఁ జూడనోప మ
త్తనయునితోడ బ్రాహ్మణహితమ్ముగ జన్నములాదియౌకృతుల్
పొనరుచుచున్ ధరాభరముపూని ప్రజన్ భరియింపు మంచు నా
పనుపునఁ జెప్పి మీరలును బాల్పడుఁ డాతనికిన్ సహాయులై.

వ. ఇట్లు కృతనిశ్చయుండైన త్రిశంకునకు నమస్కరించి దుఃఖావేశమ్మున నందఱును నాయాశ్రమంబు విడచి పురికరుదెంచి,

క. అనవద్యమగు దినమ్మున
ఘనుని హరిశ్చంద్రు భూమికాంతునిగా స
జ్జనహితు నభిషేకించిరి
మునిజనములతోడ మంత్రిముఖ్యులు పేర్మిన్. 302

వ. హరిశ్చంద్రుం డిట్లు కృతాభిషేకుండై మనమ్మునఁ దండ్రిం దలఁచుచు న్యాయ్యంబుగ భూపాలనం బొనరించె నాపుడు జనమేజయుండు, 303

మ. జనమాన్యుండు త్రిశంకుభూపతి హరిశ్చంద్రున్ దనూజున్ జగ
ద్వినుతుం బట్టము గట్టఁజేసి పిదపన్ దేహమ్ము చాలించెనో!
మునిచే శాపవిముక్తి చెందెనో! వనిన్ మున్నెట్లు లప్పాట మా
లనిభంగిన్ జరియించెనో నోడువు మెల్లన్ వృత్తము న్నాకొగిన్.

వ. నాపుడు వ్యాసుండు, రాజేంద్రా! త్రిశంకుం డట్లు హరిశ్చంద్రునకు రాజ్యం బొసంగి జగజ్జనని నాత్మ నిల్పి యవ్వనమ్మున గంగాతీర

మ్మునఁ దపమ్ముకలిమిఁ గాలయాపనం బొనర్చుచుండె, నంత
మున్ను తపమ్మున కరిగిన విశ్వామిత్రుండు సమాప్తవ్రతుండై
దారపుత్రాదుల నీక్షించుపొంటె నరుదెంచి సుతసహితమ్ముగ
నెదురువచ్చి నిర్వర్తితసపర్యయై యున్న భార్యంగాంచి ప్రీతి
పూర్వకమ్ముగ నిట్లనియె. ౩౧౫

క. తరుణీ ! దుర్భిక్షమ్మున
నరిగితి నేఁ దపమొనర్ప నాత్మజులను ని
న్నొరు లెవ్వరు పోషించిరి
తరమె కుటుంబమ్ము గడప ద్రవ్యము లేమిన్. ౩౧౬

గీ. కఱ వతిశయించె ననువార్తకతన మిమ్ముఁ
దలఁచి శోకించి నిర్ధనత్వమునఁ జేయు
తెరు వెఱుంగక యిటకరుదేరనైతి
నాకు నప్పటి దురవస్థ నాతి వినుము. ౩౧౭

క. ఆఁకలిఁ బట్టఁగ లేక శ్వ
పాకుని గృహ మేగి చోరభావమ్మున భాం
డాకలితపక్వశునకప
లాకాంక్ష యొనర్చునంత నా శ్వపచుండున్. ౩౧౮

వ. తత్తఱమ్మున నడిఁగట్టి మేల్కాంచి వంటింట నున్న నన్నుంజూచి
నీవెవ్వ రేకతమ్మున మద్గృహమ్మునకు వచ్చితి, భాండం బేల తడ
వెదు ? నావుడు నేను భయత్రస్తుండనయ్యు ధైర్యం బవలంబించి
వాని కిట్లంటి. ౩౧౯

ఉ. తాపసుఁడన్ క్షుధార్తిమెయిఁ దాళఁగ లేకిటు చోరభావమున్
జూపుచు నీగృహమ్మునకుఁ జొచ్చితి నే నతిథిన్ గృపన్ మదా

శాపరిపూర్తి చేయఁగ నోసంగుము మాంసమొకింత; భాండమం
దీపనికై కరం బిడితి నేటికి నాఁగెదు క్రోధమూర్తివై. ౩౨౦

వ. నావుడు శ్వపాకుండు నా కిట్లనియె. ౩౨౧

చ. ఇది శ్వపచాలయంబు విను మేను శ్వపాకుఁడ మాంసముల్ భుజిం
పఁ దగునె యగ్రజాతికిటఁ; బాతకకృత్యము చూడనేరన
య్యెద మను వేమి చెప్పె విన వే? శ్వపచుల్ మఱియేదుజాతులుల్
విధిగ నవర్ణు లెందులకు విప్రకులోత్తమ! విడ్వు భాండముల్.

గీ. వీఁడు లోభావృతుండని చూడఁబోకు
మకట! మానవజన్మ మపాప్య మందు
విప్రతయు దుర్లభం బిట్టి విధికిఁ దగుదు
వే? ద్విజన్ముఁడవై వర్ణవిధము చెడదె. ౩౨౩

వ. నావుడు వానిధర్మమ్మునకు సంతసించి యే నిట్లంటి. ౩౨౪

క. తగుగతిఁ బల్కితి విది ధ
ర్మగతికిఁ దగుభంగి సూక్ష్మమార్గము విను మె
వ్వగనైన దేహమును ని
ల్పఁగఁదగు శంకింపఁ దగదు పాపమ్మునకున్. ౩౨౫

గీ. తనువు గల్గినమీఁదఁ బాతకము నడఁచు
నిష్కృతి సేయంగ వచ్చు నేరికిని నాప
దలు ననాపదలని చూడఁదగదు దోష
మెడయుఁ జేయకయున్నఁ బొల్పడు నరకము. ౩౨౬

చ. మరణము క్షుత్తుచేఁ గనిన మానవుఁడెట్టిడునే నవశ్యముల్
నరకము చెందుఁగాన మరణమ్మునకున్ భయమంది చోరతన్

బొరసి శ్వపాకగేహమని బుద్ధి రాం దొకగింజ, కందమూ
బరయఁగ వచ్చినాఁడ వినుమాఁకల రొండు నెఱుంగ నిచ్చునే.

క. అదియునుఁగా కీ చౌర్యము
తుద కాపర్జన్యదేవు దోషాత్మునిఁ జే
యఁదగు నవర్షణ మాతం
డొదవించినకతన నింతయు న్నిజ మనుడున్. ౩౨౮

శా. ఆపర్జన్యుఁడు నేన్గుతొండములలావై ధార లొప్పార స
ర్వాపన్నాశకుఁడై పటత్పటరవంబై భూనభోభాగ మి
చ్ఛాపూర్తిన్ విలసిల్లఁగాఁ గురిసెఁ గాంచత్కాంచనోదంచితం
బై పాటిల్లెడి వృష్టి విద్యుదుదయం బాదందుఁ గన్పట్టఁగన్ ౩౨౯

చ. ధనమును గాంచి సంతసము దాల్చి తదీయగృహమ్ము వీడి ని
న్నును సుతులన్ గృహమ్మును గనుంగొన వచ్చితి నింతకాల మి
వ్వనమున క్షామమందుఁ బసిబాలుర నేగతినోమి? తెట్లు జీ
వనమున నుంటి? తెల్పుమన వారిజలోచన మౌని కిట్లనున్.

క. నీచనుట మొదలుఁ గఱవు పి
శాచముగతిఁ బ్రబలి క్షుత్తు సైఁపక సుతులున్
మై చాకచక్య మెడలిన
యాచింపఁగఁ బ్రతిగృహంబు నరిగి నయమునన్. ౩౩౧

క. అడుగుచు నీవారమ్ముల
నడవులలో నేరికొనుచు నాయీరీతిన్
గడపితిఁ గొండొకకాలము
బడలంగానీక చిఱుతపాపల నెల్లన్.

ఉ. పిమ్మట నిండ్లకుం జనిన బిచ్చము వెట్టరు గేస్తు, లేయర
ణ్యమ్మున కేగి చూచినను నారయ రాం దొకగింజ, కందమూ

లమ్ములుగాని చెట్టుల ఫలమ్ములుగాని లభింప వట్టి కా
లమ్మునఁ గుట్టలఁ గని తలంకితి నాఁకలి దీర్పరామికిన్. 333

వ. అంత నందఱుం జంపుటకంటె నిందొక్క తనయు నమ్మి తత్క్రియ ప్రాప్తంబగు ధనమ్మునఁ దక్కటిపుత్త్రులఁ బోషించుట లగ్గని యొంచి క్రిందమానుండగు కొమరు నఱుత రజ్జువుం దగిల్చి వెంటఁ బెట్టికొని యొందేనిఁ జనునయ్యెడ సత్యవ్రతుండను రాకొమరుఁడు చూచి 'యేమీ బాలకుం డేప్పుకతం' బనవుడు నేనిట్లంటి, నీశిశువు నాచే విక్రయార్థంబుగాఁ గొనిపోవంబడువాఁడు నావుడు నతండు గరుణించి 'నీవు గృహమ్మురుగుము నీకుటుంబమునకుఁ బ్రతిదినమ్ము చాలినంత యామిషముం దెచ్చి యే నిచ్చువాఁడ నద్దాన జీవింతువుగాక యిట్లు నీ పతియగు మునీంద్రుండు వచ్చుదనుక నా చేయుట' యనిన నేను ముదంబంది యింటికరిగితి నతండును బ్రతిదినమ్మును నట్లొనర్చువాఁ డస్మన్నిమిత్తమ్మున వసిష్ఠుచే శపింపంబడియె నది యెట్లంటేని, 334

క. ఒకనాఁడు మృగములెచటఁ ద
నకుఁ గానఁగరాక యీ వనము నెల్లెడ మి
న్నక తిరిగి విసివి యతఁడు తు
దకుఁ జంపె వసిష్ఠుగోవుఁ, దన్మునివరుఁడున్. 335

క. అలిగి త్రిశంకుండను పే
రలవడఁగ శపించె మాలఁడై కుందఁగ నా
వలనఁగదా యాతని కీ
కలుషము ఘటియించెనని వగచెద మునీంద్రా. 336

వ. కావున నుపకర్తయగు నన్నరవరుఁ డేగతినైనఁ దపోబలగరిష్ఠుండవగు నీకుపకార్యుం డని వేఁడిన సతికిఁ బతి యిట్లనియె.

క. నే దవ్వై యున్నప్పుడు
నీదైన యవస్థ చూచి నెఱిఁ బోషించిన దా
యాదునిఁ దన్ను ప్రపవర్యుని
సాదరమతి శాప మెడలు నట్లొనరింతున్. ౩౩౮

వ. అనిచెప్పి యతనిదుఃఖం బెట్లు విముక్తంబగునోకో! యని యెంచుచుఁ ద్రిశంకుండున్న పక్కణంబున కరుగుడు నతండు మునిరాక యెఱింగి యెదురై విస్మయంబొదవఁ బాదమ్ములంబడి నమస్కరించినఁ గరుణార్ద్రిండై కౌశికుండు లేవ నెత్తియిట్లనియె.

క. జననాథ! నీవు మిక్కిలి
యనఘుండవు నాతదర్థమై శాపంబుం
గొని చాండాలుఁడ వైతివి
చనునే నా కూరకుంట శక్తుఁడ నయ్యున్. ౩౪౦

వ. ప్రత్యుపకారం బొనర్చి ఋణవిముక్తిం జెంద నుంటి నీ యభీష్టం బేమనుడుఁ ద్రిశంకుఁడు మహాత్మా! మున్ను మత్కులగురుం డగు వసిష్ఠుని సశరీరస్వర్గదంబగు జన్నమ్మున నన్నుఁ గృతార్థుఁ జేయుమని వేఁడిన నతం డొల్లఁడాయె. ౩౪౧

క. ప్రీతి న్నా కోరిక నిడ
నేతువయేని వినుమయ్య! నియమమ్మున నా
చేత సశరీరనాకద
మై తనరెడి జన్నమును దయన్ జేయింతే. ౩౪౨

వ. కులగురుం డొల్లననిన నే నన్యు గురునిఁగాఁగొని యీ యాగంబు నిర్వర్తింపించెద, ననుడు నతండుఁ 'నన్నవమానింప నుంకించితివి గానఁ జాండాలుండవై నవయు' మనియె, నియ్యది శాపకారణంబు నావుడుఁ గౌశికుండు దచ్ఛాపంబు గ్రిమ్మరించి యుపకృతిం

బోనర్పనెంచి యజ్ఞసంభారమ్ము లార్జించి మునులం బిలిచిన వారలు మఖయాథార్థ్యంబు గుఱుతెఱింగి వసిష్ఠనివారితులై యొక్కరును రాకుండిరి. దానికిఁ గ్రుద్ధుండై కౌశికుండు త్రిశంకుకడ కరిగి వసిష్ఠుదౌర్మంత్ర్యమ్మున మును లొక్కరును నిటకు రారు. 383

మ. ద్విజు లేతేరక యున్న జన్న మెటు సంధింపంగనౌ నిన్ దివం
బజరుద్రాదులు మెచ్చ నంపెదను రాజా ! నాతపశ్శక్తిచూ
డఁ జనన్ గైకొను మిష్ట నీ కొసఁగువాఁడన్ బెద్దకాలంబు చే
యు జపం బంచును ధారవోసెఁ దప మా యుర్వీశు హస్తమ్మునన్.

క. తనగాయత్రీజపసం
జనితంబగు సుకృత మిచ్చి జనవర ! చను మిం
కను స్వర్గంబున కెవ్వం
డును నిన్నడ్డంగఁజాలఁడు జగత్త్రియిలో. 384

—* త్రిశంకుండు స్వర్గమ్మున కరుగుట *—

చ. అని యనుపన్ద్రిశంకుఁడు రయమ్మునఁ బక్షియుఁబోలె నాకసం
బునకుఁ దపోబలమ్మున సముద్గతుఁడై దివ మేగునంత న
య్యనిమిషు లంతరంబున జనాధిపతిన్ శ్వపచాకృతిం గనుం
గొని శ్వపచుండు నాకమునకుం జనుదెంచెడి దేవవల్లభా.

ఉ. నావుడు దేవనాథుఁడు మనమ్మున విస్మయ మంది యేఁగి యా
భూవిభునిన్ శ్వపాకునిఁ దపోవిభవమ్మున నాక మేగు దు
ర్భావునిఁ దాఁ ద్రిశంకునిఁగ భావనచేసియుఁ "బొమ్ము పొమ్ము నీ !
దేవనివాస మేడఁ ! జనుదేర శ్వపాకుఁడు నేడ ! దుర్మతీ."

వ. అని తోలఁగం ద్రోచినఁ ద్రిశంకుండు క్షీణపుణ్యుండగు నమరుండునుంబోలె భూమింబడువాఁడు గాధిజుంగూర్చి యిట్లాక్రోశించె.

చ. చను మునినంత నేగి సురసద్మము చేరెడి నన్ను దేవతల్
కని సురనాథుతో నుడువఁగా నతఁడీగతిఁదెచ్చె నో మునీం
ద్ర ! ననుఁ గనుంగొనందగదె ? ధారుణిపైఁ బడుచుంటి నాఁగ న
మ్ముని విని 'నిల్వు'మంచు నృపముఖ్యుని నాఁగెఁ దపమ్ము పెంపునన్.

వ. గాధిజుండట్లు త్రిశంకుని గగనమ్మున నిలువరించి పిదప నుదకంబు స్పృశించి సువిస్తరంబగు సృష్టి నొనర్చి నూతనసృష్టిగా వేఱొండు స్వర్గమ్ము నిర్మించుచునంత నింద్రుం డెఱింగి సత్వరమ్మున, నయ్యెడ కరుదెంచి వినయమ్మున నిట్లను. ౩౯౦

క. కోపించి నూత్నసృష్టిన్
బ్రాపింపఁగనేల ? మౌనివర ! భావత్కా
జ్ఞాపరిపూర్తి యొనర్చెద
నా ప్రార్థన పాటిసేయు నా మునివరుఁడున్. ౩౯౧

చ. సురపతి కిట్లు పల్కె " బలసూదన ! త్వద్భువనమ్మునుండి యీ
ధరఁబడు మా త్రిశంకుని ముదమ్మునఁ దోడ్కొని స్వర్గలోక సు
స్థిరునిగఁ జేయు మిట్లయిన సృష్టికి మాఱొనరింప నే " నన
గరము మునీంద్రుదార్ఢ్యమునఁ గంపితుఁడై సురనాథుఁ 'డో'మనెన్.

క. తప్పనివిధిచే నీగతి
నొప్పి పిదప దివ్యదేహ మొసఁగి త్రిశంకున్
గొప్పగఁ దనపార్శ్వమునన్
జొప్పడఁగాఁ జేసి యరిగె సురపతి దివికిన్. ౩౯౩

వ. ఏకవిమానసంగతులై యిట్లింద్రత్రిశంకులు దివమ్మున కరిగిన స్వస్థుండై గాధిజుం డాశ్రమమ్మున నుండె. ౩౯౪

గీ. స్వర్గగతి తండ్రి కబ్బినవార్త నెఱిఁగి
సంతసంబంది యాహరిశ్చంద్రనృపతి

పుడమినేలుచుఁ దనకూర్మి పడఁతిఁ గూడి
యిష్టభోగమ్ము లనుదిన మెనయుచుండె. ౩౫౫

క. సంతానము దవ్వగుటకుఁ
జింతించి వసిష్ఠమౌని సేవించి మహా
మంత్రిజ్ఞ ! నాకు సంతతి
యింతకు లేకుంట కేమి హేతువు చెపుమా. ౩౫౬

మ. కలవింకమ్ములు సంతతిం గని సుఖాఖండస్థితిన్ బొల్చు స
ర్వాల వీక్షింపు ముపాయశాలి వయి దైవజ్ఞుండవై మంత్రవే
త్తలకుం బ్రాపయియున్ననీదు పదపద్మమ్ముల్ దగం గొల్చువా
రలకున్ మా కిటు లౌటకుం గతము ప్రారబ్ధమ్మునాఁ జెల్లదే.

వ. అని శోకమిశ్రమ్ముగఁ బల్కు సజ్జనవరునకు వసిష్ఠుం డిట్లనియె.

చ. కనఁగ నపత్యహైన్యమునకన్నను దుఃఖము లేదు సంసృతిం
బనుపడువారికిన్ ధరణివల్లభ ! సంతతి నీఁగ నెంతయున్
ఘనుఁడని విందు నవ్వరుణు ; గ్రక్కున నాతనిఁ బూజచేసి నం
దనుఁ గొనవచ్చుఁ దత్కృతికి దైవముతోడగునాఁడు తత్కృపన్.

గీ. దైవపురుషకారమ్ములు దవిలి కార్య
సిద్ధిఁబొనరించు నుద్యమస్థితికి నరుఁడు
గడఁగ దైవంబు తోడగుఁ గాని, లేని
నాఁడు కేవలదైవ మొనర్చు టెట్లు ? ౩౬౦

వ. అని గురుం డుపదేశించి వీడ్కొల్పినఁ గృతనమస్కారుండై
యరుదెంచి హరిశ్చంద్రుండు గంగాతీరమ్మున ఘోరతపంబొనర్చె.

క. ఆతనితపమున కెడఁదఁ బ్రి
చేతుం డానంద మొంది చెచ్చెరఁ గననై

ప్రీతిఁ గోరుము వరమన
భూతలపతి కేలు మొగిచి పులకితతనుఁడై.

క. అనపత్యుఁడనై దుఃఖం
బున మునిఁగెడినాకు ఋణవిముక్తిప్రదు నం
దనుఁ గరుణింపుము నావుడు
జనపతి కతఁ డనియె దరహాసమ్ముఖుఁ డగుచున్.

ఉ. నందను నీ కొసంగెదఁ గనందగు నందము వొల్చువాని మి
న్నందెడి సద్గుణంబులకు నాకరమై తగువాని భూమిసం
క్రందన! తత్సుతుం బశువుగా నొనరించి యజించెదే? ముదా
నందము గోరి; నావుడు మనమ్మున భూపతి గొంకి యిట్లనున్.

వ. మహాత్మా! వంధ్యతకన్న నియ్యది కొంత మేలగుట నిప్పాట నొనరించువాఁడ సుతుఁ బ్రసాదింపు మనవుడు వరుణుండు నీకు నవశ్యమ్మును గొమరుండు పుట్టు గృహం బరుగుము నావుడు సంతుష్టుండై యతఁడు పురమ్మునకుఁ జని భార్యకు నొడివిన నా పెయు సంతసించెఁ దక్కుఁగల భార్యాశతమ్మును ముదమ్మునఁ బొదలె. 366

—* రోహితోత్పత్తి *—

గీ. అతని భార్యాశతమ్మునయందుఁ బట్ట
రాజ్ఞియగు శైబ్య యంత గర్భమ్ముదాల్చి
పదినెలలు నిండఁ గనియె శుభదినమందు
సుతునిఁ గందర్పసుందరుఁ బతిహితముగ. 366

వ. హరిశ్చంద్రుండు జాతకర్మం బొనరించి యఖండోత్సవం బాచరించె, నట్టియెడ వరుణుండు విప్రవేషమ్మున నట కరుదెంచి స్వస్తివచనపూర్వకముగఁ ద న్నెఱిఁగించి యిట్లనియె.

ఉ. నావరదానకారణమునం దగె వంధ్యత లేమి నీకు, స
ద్భావుఁడవేని యీసుతునిఁ బార్థివ! యజ్ఞపశుం బొనర్చి సు
శ్రీ వెలయన్ యజింపుమనఁ జింతమెయి న్నరపాలుఁడక్కటా!
యేవిధి నిక్కుమారకుని నీఁదగు నీ కెటు లోమఁగాఁదగున్.

చ. వరుణుఁ డితండు విప్రుఁడయి వచ్చె మఱొక్కట నీడఁ బోవఁ డె
వ్వరికిని దేవహేళనము భావ్యము గా దతికోమలాంగు నం
బురుహసమాననున్ మఖముపొంటె వధించినఁ బుత్రశోకముం
దరమె భరింపఁ దక్కటి విధమ్మున నీతఁడు ప్రీతిచెందునే.

క. పెక్కగు బాములఁ బడి తుద
కొక్కరుఁ గని సంపులకు సుఖోదయమునకుం
జక్కటి సదిగాకయుఁ బై
మిక్కిలి శోకింపవలసె మితిలేనివగన్. 320

వ. అని చింతించి ధైర్యం బవలంబించి వినయమ్మున నతని కిట్లను, మహాత్మా! పుత్రుండుదయించిన పదిదినమ్ములకుఁ దండ్రి కర్మయోగ్యుఁడగుఁ దల్లి మాసమ్మునకు శుచియగు యాగమ్మునకు దంపతులు ముఖ్యులగుట సర్వసమ్మతం బనవుడు వరుణుండు మాసానంతరమ్మున నరుదెంతునని చెప్పి చనియె; నంత హరిశ్చంద్రుండు పరమానందమ్మున విప్రులకుఁ గోట్లకొలఁది గోవులను దిలపర్వతమ్ములను హేమరాసులను నొసంగి యాత్మజునకు రోహితుండను నామంబిడి పుత్రవదనసందర్శనజనితానందపరవశుండై యుండునంత మాసమ్ము పూర్ణంబగుడు, వరుణుండెప్పటియట్ల విప్రుఁడై యరుదెంచి యజింపుమనుడు నృపాలుండు దుఃఖసాగరమగ్నుండై యతనికి నమస్కరించి కృతాంజలియై యిట్లనియె. 321

క. పావనమయ్యె సదనము
దేవర రాఁబట్టి మఖవిధికిఁ బసిబాలుం
డేవిధి నర్హుఁడు దంత
శ్రీ వెలయని పశువు శ్రుతినిషిద్ధము కాదే. ౩౭౨

వ. కావున దంతోదయంబుగా వేగమ క్రతు వొనర్తు ననుడు నంగీకరించి యతం డరిగెఁ; బిమ్మట సంతసమ్మునఁ గొంతకాలంబు గడపి నృపాలుం డున్నంత దంతోదయం బగుట యెఱింగి వరుణుండు యథాపూర్వమ్ముగఁ గ్రతు వొనర్పు మని వచ్చె; నంత హరిశ్చంద్రుండు నిర్వర్తితసత్కారుండై యతని కిట్లను. ౩౭౩

గీ. అకృతచౌలుండు గర్భకేశాన్వితుండు
సమ్మతుఁడు గాఁడనుట వృద్ధసమ్మతంబు
గానఁ దత్కృతి నెఱవేర్చి క్రతు వొనర్తు
నీ వెఱుంగని ధర్మ మోదేనిఁ గలదె ౩౭౪

వ. అనుటయు, ౩౭౫

క. తెలిసి వరుణుండు నన్నుం
బలుమఱు త్రిప్పెదవు కపటభావం బది నీ
కలవడియె నాత్మజుని యం
దలి మోహము నిన్నసత్యతత్పరుఁ జేసె. ౩౭౬

వ. కేశఖండానంతరమ్మునఁ గ్రతువొనర్పవేని దారుణంబగు శాపమ్ము నాచే నీ కీఁబడు నింత నిక్కువ మని చెప్పి మఱియు నిట్లనియె.

క. జనవంద్యుం డిక్ష్వాకు నృ
పుని కొలమునఁ బొడమి వ్యర్థపుం బల్కులు గ
ల్గినవాఁ డితఁడనియెడి కీ
ర్తిని జెందకు పోయివత్తు నృపతివతంసా. ౩౭౭

వ. అని చెప్పి యప్పటి కతం డరిగె. భూపాలుండును సంతుష్టాంతరం
గుండై యుండెఁ బదంపడి కొండొకకాలమ్మునకుఁ గొమరుండు
చూడాకరణయోగ్యుం డగుడుఁ దత్కర్మార్థంబు గృతప్రయ
త్నుండై. ౩౨౯

క. తానును భార్యయుఁ దొడపై
సూనుని నెలకొల్పి మిగుల శోభనలీలన్
శ్రీ నెగడ నున్నతటి వి
ప్రానుగతిన్ వరుణుఁ డచటి కరుదెంచి యనున్. ౩౩౦

వ. రాజేంద్రా! చూడాకరణంబు నిర్వర్తించుచుంటి విఁక గొఱఁత
యేమున్నయది? మఖం బొనరింపుము నావుడు హరిశ్చంద్రుండు
గృతనమస్కారుండై యతని కిట్లను. ౩౩౧

చ. ఇపుడ యొనర్చు టర్హ మని యేను నెఱుంగుదు నట్లు నట్టి యా
గపశువుగా నొనర్పఁగఁ దగం డితఁ డాగమసంస్కృతిన్ ద్విజ
త్వపదవి నొందకుండిన కతమ్మున; మూఁడగు జాతులందుఁ దా
రుపనయనంబు లేమిఁ జరణోద్భవతుల్యులు కర్మబాహ్యులున్.

వ. కావున శూద్రప్రాయుండగు నిక్కుమారుని యాగపశువుగా
నొనర్చుటకు శంకింతు నుపనీతుం డగునాఁడు నీ యభీష్టంబు నెఱ
వేర్తు రాజుల కేకాదశవర్షమ్మునను బ్రాహ్మణుల కష్టమవర్ష
మ్మునను వైశ్యులకు ద్వాదశాబ్దమ్మునను నుపనయనంబు విధి
చోదితం, బనుగ్రహించె దేనిఁ దత్కార్యానంతరమ్మున యాగంబు
విధియుతంబుగ నొనరింతు నా వచనంబు సత్యమ్ముగ నమ్మి
యిప్పటికి వేంచేయుమనుడుఁ బ్రసన్నవదనుండై వరుణుండు
దన పురమ్మున కరిగె; నంత నృపాలుండును బుత్త్రుని కతనఁ బర
మానందమ్మునఁ గాలయాపనం బొనర్చుచుండె. ౩౩౩

క. పదపడి యబ్బాలునకున్
బదియేడులు వోవుదెంచెఁ బార్థివుఁడు నె
మ్మదిఁ జింత గడలుకొనఁగాఁ
బదునొండవయేటఁ దగు శుభదినమునందున్. ౩౮౪

వ. ఉపనయనంబు యథోక్తంబుగ నొనర్చి యున్నంత వరుణుం డరు
దెంచి మఖం బొనర్పు మనుడు రా జిట్లనియె. ౩౮౫

క. దేవా కొమరుం డుపనయ
పావితుఁడై యొప్పె మఖము పచరించెదఁ గా
నీ వేఁడికొనెద నిన్ను స
మావర్తనకర్మ మొలయునంతకుఁ దాళన్. ౩౮౬

క. అప్పుడు నీ మాటకుఁ బ్రీతి
నెప్పన్ దయచేసి పాదసేవకునిన్ స
న్నిప్పాట గారవింపుమ
యప్పతి! యన నతఁడు కోపియై యిట్లనియెన్. ౩౮౭

క. వినయమున నన్ బ్రతారణ
మొనరించెదు పుత్రబాధ మొక్కింతయుఁ ద్రె
ప్పినయట్లు తోఁప దటు ద్రె
ప్పనేని నన్నిట్లు త్రిప్పఁ జెల్లునె నీకున్. ౩౮౮

వ. కానిమ్ము నీపలుకులయందలి విశ్వాసమ్మున నిప్పుడు సయిత మరిగి సమావర్తనకర్మానంతరమ్మున రాఁబోవువాఁడనని చెప్పి యతం డరిగెఁ; బిమ్మట నృపాలుండు సంతసించి యుక్తకాలమ్మునఁ దక్షిన కార్యంబు నిర్వర్తించి రాఁబోవు వరుణునకై తలంకి చింతించుచున్నఁ, గొమరుం "డిటులేల చింతసేసెద"వని యడిగి కారణం బెఱిఁగి యాత్మమరణమ్మునకు భయమంది మంత్రిపుత్రులతో

యోజించి యేకతంబ వనమ్మునకుఁ బలాయనంబొనర్చెఁ; బదం
పడి వరుణభయమ్మున దూతల నంపించి నృపాలుండు వెదకించి
కానక దుఃఖాక్రాంతుండై యుండునంత వరుణుండు జన్నంబొనర్పు
మని నిర్బంధింప నరుదెంచిన భయత్రస్తుండై యతం డతనికి మ్రొక్కి
యిట్లను. ౩౮౯

చ. భయమునఁ బాఱిపోయె జలపాలక! బాలకుఁ డేమి సేయుదున్
నయపథగామి గామియును నా కనువయ్యె వనమ్ములందుఁ ద
ద్దయు మునిపల్లెలందు వసుధాధరగహ్వరసీమలందు నా
దయిన యనుజ్ఞ భృత్యతతి యారసి కానకవచ్చి రెయ్యెడన్.

ఉ. ఏమి యొనర్పుమన్న నది యే నొనరింతు మహాత్మ! తప్పు నా
పై మొనసెన్ క్షమింపుమనఁ బాశి మహాగ్రహుఁడై నినున్ వృథా
కామునిఁగా నొనర్చితివిగా కపటమ్మున? నీకు నబ్బు దీ
ర్ఘామయమా జలోదర మిహమ్మున దీనఁ గృశింపు మెప్పుడున్.

వ. ఇట్లు శపించి యతం డరిగిన నరపతి వ్యాధిపీడితుండై పుత్రుఁ
గనరామికి మఱింత వగచుచు నుండు నెడఁ బదపడి యొక వత్సర
మునకుఁ దండ్రి దురవస్థ విని కనుఁగొన నుంకించి రోహితుండు
బయలువెడలు నంత శక్రుం డజ్ఞుండై విప్రరూపమ్మున నతని
కిట్లనియె. ౩౯౨

ఉ. పోకుము రాజపుత్ర! నృపపుంగవుఁ డెమ్మెయి నాత్మసౌఖ్యముం
జేకొన యాగము న్నెపము చేసి నినున్ వధియించు నాత్మసౌ
ఖ్యాకలనంబుఁ గోరు నృపు లాత్మజుఁ డంచుఁ దదన్యుఁ డంచు దు
ర్ధికులు సూడఁ బో రకట త్రెళ్ళఁగ నేల? యకారణమ్మగన్.

గీ. ఆమయనివృత్తి పొందె నిన్నడఁప నెంచు
తండ్రిఁ గననేగ నేల? యతండు మృతిని

జెందు పిమ్మట నరిగి యానందమెసఁగ
రాజ్యభారమ్ము వహియింపరాదె నీకు. ౩౯౪

వ. అని బహుభంగుల వాసవుండు నిషేధింప నివర్తితగమనుండై రోహితుండు మఱియు నొకవత్సరమ్మదనుక సవ్వనమ్మునన యుండి పదంపడి తండ్రి యత్యంతదుఃఖమ్మున నున్నవాఁడని విని మరణమ్మునకుఁ గృతనిశ్చయుండై గమనోన్ముఖుం డగుడు బ్రాహ్మణరూపమ్మున వాసవుండు యథాపూర్వముగా నేతెంచి యుక్తివచనమ్ముల వారించెఁ బిమ్మట, ౩౯౫

క. భూతలపతి రోగమ్మున
నాతురుఁడై గురు వసిష్ఠుఁ బ్రార్థించినఁ దా
నాతఁడు చెప్పె నుపాయము
క్రీతునిచే సుఖము చెందు కృతకృత్యుఁడవై. ౩౯౬

వ. వేదవిదులు క్రీతుని దశవిధపుత్రులలో గణియింతురుగావున వరుణుడికట్టి తనుఁబ్రీతుఁడై శాపమోక్షణంబొసఁగునని వెండియు,

క. తపములు వ్రతములు దానము
లపరిమితముగా నొసర్చి యాత్మజుఁ గని లో
భపరీతుఁడై యెవ్వఁడు
కృపలేక పావని సుఖము నెసయ పథించుఁ ! ౩౯౭

వ. పదంపడి వల్లె యని నృపాలుండు క్రియక్రీతుండగు కొమరుం డెమ్మని మంత్రిని నియోగించిన నతం డెల్లెడ నరయునంత నజీగర్తుండను బ్రాహ్మణుండు ధనహీనుం డొక్కరుండు పొడకట్టె; నతనికి శునఃపుచ్ఛ శునశ్శేఫ శునోలాంగూలు రనువారలు మూగురు కొమరులు. ౩౯౮

ఉ. ఆతనిఁ జూచి మంత్రివరుఁ "డగ్రికులోద్భవ! మానృపాలకుం
డాతురుఁడై రుజాపహృతికై నరయాగము సేయు నీతనూ
జాతులలోన నొక్కరు నొసంగెదె? గోశతముల్ గ్రహించి వి
క్రీతునిఁగాఁగ" నా; నతఁ డొగిన్ ధనహీనతఁ జేసి ప్రీతుఁడై.

వ. లోభమ్మున నొక్కరు నమ్మం దలఁచి యందుఁ గార్యాధికారి యగుకతన జ్యేష్ఠు నీనేరక కనిష్ఠు నీనొంచుమఁ దల్లి "నాకు వీని యుంమఁబ్రేమం బగ్గలం" బనియె, నంత మధ్యముండగు శునశ్శేఫు నొసంగిన మంత్రి యతనిం గొని నృపాలున కిడియె. ౪౦౧

—* హరిశ్చంద్రుఁడు నరమేధం బొనర్చుట *—

క. మునిపుత్రునిఁ బశువుంగా
నొనరిచి యూపమునఁ గట్టి యుర్వీశుఁడు యా
గనియతి నుండుడుఁ గని ముని
జనులెల్లరు కస్తిపడిరి జననాథమణీ. ౪౦౨

వ. అట్టియెడఁ బశువిశసనకర్మమ్మునకు శమిత శస్త్రదానం బొనరింపక దయాళుండగుట నిట్లను. ౪౦౩

క. దీనుని విప్రకుమారు స
నూనమ్ముగ నేడ్చువాని నూరక చంపం
గానేరఁ బాపకర్మము
గా నెఱిఁగియు నిట్టిపనికిఁ గడుకొనఁదగునే. ౪౦౪

వ. అని యతం డప్పాపకర్మమ్మువలన విముఖుండగుటయు రాజు సదస్యులంగాంచి కర్తవ్యంబేమని యడిగిన నా సభయం దొక్కపెట్టఁ గిలకిలారావం బెసంగె; శునశ్శేఫుండు నతిదీనగతి నేడ్చుచుండె నయ్యెడఁ దజ్జనకుం డజీగర్తుండు లేచి యుచ్చైస్స్వరమ్మున నిట్లను. ౪౦౫

చ. జనవర ! యాతఁ డిప్పనికి సమ్మతి నందఁడయేని నేన మ
త్తనయుఁ డటంచు సందియమెదం గనకే మఖకర్మపూర్తికై
హననమొనర్తు నిప్పుడువు ; నప్పు డొసంగినదానికన్న వే
తన ద్విగుణమ్ముగా నిడెదె ? ద్రవ్యమ చేయు మహత్తకృత్యముల్.

వ. అనవుడు నృపుడు సంతసించి వల్లె యనుటయు నజీగర్తుండు పుత్ర
హననమ్మున కుద్యుక్తుం డయ్యె, నంత సభాసదు లెల్లరు నాతని
ఘోరకృత్యమ్మునకు హాహాకారమ్ము లొనర్చుచు నిట్లనిరి. ౪౦౭

క. క్రూరుండు పిశాచమకా
కారయ నీతండు విప్రుఁ డగునె మహాపా
పారంభుఁడు లోభమునఁ గు
మారుం జంపుటకు నుద్యమం బొనరించున్. ౪౦౮

వ. అని యతని నుద్దేశించి, ౪౦౯

క. విను మోవిపాత్రధమ ! నం
దనుఁ జంపి ధనంబుఁ గొనుట దగునే ! వేదం
బునఁ "దాన పుత్రుఁడగుచున్
జనియించు" నటన్న పలుకు చదువఁగ లేదే. ౪౧౦

వ. ఇయ్యది ధనలోభమ్మున నాత్మహననం బొనరించుటయకాదే !
యని బహుభంగుల దూషించుసమయమ్మునఁ గౌశికుం డట కరు
దెంచి రోదనం బొనర్చు శునశ్శేఫునియెడఁ గరుణించి నృపతిం
గాంచి వారించి యిట్లనియె. ౪౧౧

క. అకటా ! మలమల మఱుఁగు ద్వి
జకుమారున్ జంపుటుడుగు జనవర ! నీయా
గకృతియుఁ బూర్ణంబగు నీ
కకలంకయశంబు రోగహానియు నొదవున్. ౪౧౨

మ. తన దేహమ్మున కన్యదేహమును విత్తం బిచ్చి పాపాత్ముఁ డా
జనకుం డీఁగొని వమ్ముచేసి యఘముల్ సాధింపఁగా నేల? యీ
జననింద్యమ్మగు కృత్యముల్ విడు హరిశ్చంద్రావనీపాల! యొం
దును బుణ్యం బనుకంప, హింస మిగులన్ దోషమ్ము ముమ్మాటికిన్.

గీ. సర్వభూతములందును సమత గలిగి
యింద్రియోపరమమ్మున నెసఁగువాని
కఖిలసుఖములు నొసఁగు నయ్యంతరాత్ముఁ
డిట్టి దుష్కృతి సౌఖ్యమొందేని యిడునె? ౪౧౪

చ. బ్రతుకుట యిష్టమెల్లరకుఁ బార్థివ! నీ వలె వీనికిన్ స్వకీ
యతనువునందుఁ బ్రీతియగు టబ్బురమే! సకలంబు నాత్మస
మ్మితముగఁ జూచు పూరుషుఁడు మేటి; పురాభవవైరమేని నీ
కితనికి లేదు నిక్క, మితఁడే యపకారమొనర్చె నక్కటా. ౪౧౫

క. జనుఁ డెవ్వాఁడు నిరపరా
ధుని దున్మన్ వాఁడు వాని తొల్లిటి కృత్యం
బును మఱవక రాఁబోవు జ
ననమునఁ జలపట్టి చంపు న్యాయ్యంబగుటన్. ౪౧౬

క. అకటా! యెంతటి దుష్టుం
డౌకదా! ద్రవ్యంబునన్ గడున్ లోభము పూ
ని కనినసుతుఁ గనికరము గ
నక చంపఁగ నొప్పుఁ దజ్జనకుఁడు ద్విజుండై. ౪౧౭

క. పలువురఁ బుత్రులఁ గనఁదగు
నెలమిన్ గయ కేగు నొక్కఁడేనియు యాగం
బులు సేయు, వృషము విడుచున్
సలలితమగుగతిని దనకు సంపాదింపన్. ౪౧౮

క. అను ధర్మమ్ములు వమ్ముగ
జనకుం డిటు సేయు టొప్పె ? జనవర ! దుష్టా
త్ముని నీతని శిక్షింపఁగఁ
జనదే ? పాపంబు సైప జనపతి కగునే. ౮౧౯

ఉ. ఏ నృపుదేశమందు వసియించుజనుం డొనరించుఁ బాప మ
ద్దానను షష్ఠభాగమును దన్నరనాథుఁడు పొందు; నుత్తముం
డైన త్రిశంకుభూమిపతి కాత్మభవుండవు పుత్త్రుఁ జంపు ని
వ్వానికి ద్రివ్య మిచ్చి రవివంశమునం దపకీర్తి గూర్తువే. ౮౨౦

క. మునిపుత్త్రుని విడువుము దు
ర్జనుని నజీగర్తు శిక్ష సలుపుము నాదై
న నియోగం బొనరింపుము
పనుపడు నీదేహమం దపారసుఖమ్ముల్. ౮౨౧

చ. జనవర ! నీదుతండ్రి గురుశాపము చెంది శ్వపాకుఁడయ్యె నా
పనుపున బొందితోఁ జనె దివంబున, కాయుపకారకారణ
మ్మననయినన్ ద్విజాత్మజువిముక్తుఁగఁ జేయుము బ్రాహ్మణుండయా
గనియతు నిన్ను వేఁడితిని గానుక నాకిది యీఁగఁ జెల్లదే.

ఉ. యాగ మొనర్చువాఁడు దను నగ్రిజుఁ డెయ్యది గోరు దాని "స
భ్యాగతుఁడే రమేశుఁ" డని యాదరమూని యొసంగుటొప్పు, న
త్యాగికి యాగమెట్లు ఫలదంబగు ? నేనిది గోరినాఁడ నా
కీఁగఁ దలంపు మియ్యదియ యిచ్చు నరేంద్ర ! సుఖంబు నీకొగిన్.

ఉ. నావుడు రాజు వల్కె మునినాథ ! యథార్థము పల్కితీవు స
ద్భావుఁడవయ్యు నాకుఁ గ్రతుభంగ మొనర్చెదె, వేఱుగోరు మీఁ
గావలతున్, జలోదర మఖండగతి న్నను బాధపెట్టఁగా
నా వరుణున్ యజింపఁగ ధరామరపుత్త్రకుఁ గ్రీతుఁ జేసితిన్.

వ. సకలధర్మవేత్తవగు నీ వింకు బదులు సెప్పకు మనుడుఁ గౌశికుండు కోపాకులుండై శునశ్శేఫురోదనంబు విననోల్లక కరుణారసపూర్ణుండై దుఃఖించు నజీగర్తపుత్రుపార్శ్వమ్మున కరిగి యభయం బొసంగి యిట్లను. ౭౨౫

ఉ. ఈనృపుఁ డేమి సేయు, విను మే నొకమంత్రము సెప్పువాఁడ న
ద్దానిఁ బఠింపు మయ్యది ముదం బిడు నీ కని యట్లొనర్ప, శో
కానుగతంబుగా మనమునం దది మాటికిఁ దా జపించె న
ద్దానఁ బ్రసన్నుఁ డయ్యె సుఖదాయకుఁడై వరుణుండు వానికిన్.

వ. అట్లు స్వస్వరూపమ్మున శునశ్శేఫునకుం బొడకట్టిన యద్దేవుం గాంచి యెల్లరును విస్మితు లైరి. హరిశ్చంద్రుండును బద్ధాంజలిపుటుండై నమస్కరించి యిట్లు సన్నుతించె. ౭౨౬

ఉ. దేవ ! మహానుభావ ! నను దీనుఁ గృతాగసు లబ్ధు మందుఁడన్
బావితుఁ జేయ వచ్చితి వపారకృపారసవార్ధివై భవ
త్సేవకుఁడన్ గటాక్షమునఁ జేకొనుమీ యపరాధ మెమ్మెయిన్
దేవర కాచరించితిఁ బ్రతిజ్ఞకుఁ దప్పితిఁ బుత్రకాంక్షినై. ౭౨౭

క. బెగడయ్యె నా "కపుత్ర
స్య గతి ర్నాస్తి" యను వచనసంశ్రవణమునన్
భగవంతుని నిను వంచితు
నిగఁ జేసితి దానఁ గాదె నిగమవిధిజ్ఞా. ౭౨౮

చ. తెలియనివాని హేలనము ధీవరులోప్పి సహింత్రు, దేవ ! నా
కలవడె రోగబాధ పయి నాత్మజు చేసినవంచనంబు; కా
నల కరిగెన్ సుతుండు మరణమ్మునకున్ భయమంది; జన్నమున్
సలుపఁగఁ గోరి తెచ్చితిని సద్ద్విజపుత్రకు నీదు ప్రీతికై. ౭౩౦

గీ. వీని కతమున దేవ ! నీదైన దర్శ
నంబు నా కబ్బె ననుపమానంబు మజ్జ
లోదర వ్యాధిబాధయు నుడిగినట్ల
యయ్యె నావుడుఁ బాశి యిట్లనియెఁ బతికి. ౪౩౧

క. రోదనశీలుండై న
న్నాదరమున ధైర్య మేది యనుపదమున్ స్తో
త్రాదుల నుతించు ద్విజదా
యాదు శునశ్శేఫు విడువు మామయ మెడలున్. ౪౩౨

వ. నీజన్మంబు పరిపూర్ణం బయ్యె, నీ కింక వ్యాధి వలని భయంబు
లేశంబును లేకుండు నని చెప్పి వరుణుండు శునశ్శేఫు విడిపించిన,

క. అయకారణమై జయరవ
మయమయ్యెన్ యజ్ఞశాల, మహీపతియు నిరా
మయుఁడయ్యె, శునశ్శేఫుఁడు
భయహీనుం డయ్యె మఖము పరిపూర్తిఁ దగెన్. ౪౩౪

వ. ఇట్లు విముక్తుండై శునశ్శేఫుండు సభ్యులను నుద్దేశించి కృతాం
జలియై, ౪౩౫

ఉ. ఓ కృతవిద్యులైన కరుణోదధులార ! మహాత్ములార ! శా
స్త్రికలనమ్మునన్ దగినయట్లు వచింపుఁడు మీఁద నెవ్వఁడో
నా కగుఁ దండ్రి, మీదు వచనమ్మున నాతనిఁ గొల్చువాఁడ సు
శ్లోకుని ; ధర్మనిర్ణయము సూక్ష్మమతుల్ వివరించు టొప్పగున్.

క. అనవుడు సభ్యు లజీగ
ర్తునికిం దాఁ బుట్టి పెరిఁగి తుద కీతం డా
తనికిం గా కెవ్వరికిన్
దనయుండగు నొండు రీతి ధర్మ్యంబగునే. ౪౩౬

వ. అని శంకించుచు నుండ వామదేవుండను మునివరుండు, ౪౩౮

క. కనుఁగాక యజీగర్తుఁడు
ధనలుబ్ధుం డగుచు నమ్మె, ధరణీపతికిన్
దనయుం డీతఁడు, గాదే
ననఘుఁడు వరుణునకుఁ బుత్త్రుఁడగు న్యాయ్యముగన్.

గీ. అన్నదాత భయత్రాత యాదరమున
విద్య నొసఁగినవాఁడును విత్తదాత
కనినవాఁడును నేవురు తనకుఁ దండ్రు
లండ్రు ధర్మవిధానజ్ఞులైన మునులు. ౪౪౦

వ. నావుడుఁ గొందఱు కన్నవాని కనియు మఱిఁ గొందఱు వరుణుని కనియు నింకఁ గొందఱు నృపతి కనియుఁ దమ తమ యభిప్రాయమ్ములు వెలువరించి వివరించు నయ్యెడ వసిష్ఠుం డిట్లనియె.

చ. వినుఁడు సభాసదుల్ శ్రుతిగవీపరిశీలనఁ జెప్పుచుంటి నీ
తని ధనలుబ్ధుఁడై క్రయవిధమ్మున భూపతి కిచ్చినప్పుడే
జనకత తండ్రియం దెడలి సంగత మయ్యె నృపాలునందు ; యూ
పనియతుఁగా నొనర్చుటను బాధ్యుఁ డట్టిఁడ నాఁగఁ జెల్లెడిన్.

చ. వరుణుఁడు దన్ను మాటికి స్తవంబొనరించుటఁ జేసి వీని నా
దరమునఁ గాచె నాతఁడును దండ్రియనం దగఁ, డెవ్వనిన్ నుతిం
తురు మఱి వాఁ డొసంగు ధనతోషపశుప్రభుతాదిసంపదల్
పరమును బ్రాణముల్ దన కపారముగా ముద మబ్బె నేనియున్.

గీ. ప్రాణసంకటమునఁ గృపాపరత వీర్య
వంతమగు మంత్ర మిచ్చి కాపాడె నెవ్వఁ
డతఁడు కౌశికుఁ డీతనిపిత ; సుమతుల
సమ్మతం బిది నావుడు సభ్యులెల్ల. ౪౪౪

క. ఇది ధర్మం బని నుడివిన
సదయుండై గాధిజుండు జనకుండై "ర
మ్మిది మొదలు నాగృహమ్మునఁ
బొదలుము నాపుత్రులందుఁ బుత్రుఁడ వగుచున్".

వ. నావుడు శునశ్శేఫుండు కౌశికువెంట నరిగెఁ, బదంపడి వరుణుండు తనభువనమ్మునకుఁ జనియె, ఋత్విజులును సభ్యులును దమతమ పొందుపట్లకు నేగిరి. ౨౨౬

గీ. ఆ హరిశ్చంద్రభూపాలుఁ డామయంబు
వాసి కృతకృత్యుఁడై ప్రజాపాలనం బొ
నర్చె రోహితుఁడు విని జనకునికడకు
వచ్చె దుర్గమమైన యవ్వనము విడిచి. ౨౨౭

చ. తనయుని రాక చారులు ముదమ్మునఁ జెప్పఁ ద్రిశంకుపుత్రుఁ డం
త నెదురు వచ్చె, రోహితుఁడుఁ దండ్రికి దండము వెట్టి దండరీ
తిని బదయుగ్మసన్నిధి నతిప్రతిపత్తిని లేవకున్న నం
దను నొగి లేవనెత్తి ప్రమదమ్మునఁ గౌఁగిటఁజేర్చెఁదండ్రియున్.

క. నులివెచ్చని బాష్పమ్ములఁ
దలఁదడుపుచు మూర్కొనున్ ముదమ్మున నంక
స్థలమున నిడికొని మోమున్
బలుమఱుఁగనుఁ గుశలమడుగుఁ బార్థివుఁడు సుతున్.

క. నరమేధయాగవృత్తం
బరిదిగఁ బుత్రునకుఁ జెప్పి యన్నరవరుఁ డా
దరమేదురుఁడై రాజ్య
స్థిరుఁడై జగ మేలుచుండె ధీరులు మెచ్చన్. ౨౩౦

వ. పదంపడి హరిశ్చంద్రుండు, వసిష్ఠుండు హోతగా రాజసూయం బొనర్చి యతని నెక్కుడు సత్కారమ్ముల గారవించె. ౪౫౧

ఆ. వె. యాగపరిసమాప్తి యగుమీఁద నొకనాఁడు
శక్రసదనమునకుఁ జనె నరుంధ
తీమనోహరుండు తివిరి గాధిజుఁడును
నటకు వచ్చె నింద్రు సరయుపొంతె. ౪౫౨

—* వసిష్ఠ విశ్వామిత్ర సంవాదము *—

వ. ఇట్లిరువురును నొక్కెడఁ గూర్చుండి యుండునంత విశ్వామిత్రుండు హరిశ్చంద్రదత్తబహుమానభాసురుండగు వసిష్ఠుం గాంచి విస్మయమ్మున నీకీ యబ్బురంబగు పూజ యెవ్వం డొనర్చె నొడువు మన నతండు సంతోషపూర్వకంబుగ నిట్లనియె. ౪౫౩

ఉ. చంద్రసమానసద్యశుఁడు సత్యవచోనిరతుండు నా హరి
శ్చంద్రుఁడు మాకు శిష్యుఁడు ప్రశస్తగుణుం డతిదాత యన్యరా
జేంద్రులు సాటిరా రతనియోగికి మొన్న యొనర్చె దక్షిణా
సాంద్రము రాజసూయమను సత్క్రతు నడ్డిచె నిట్టిసత్కృతుల్.

గీ. సత్యవాదుల దాతల శౌర్యపరుల
ధర్మవంతుల నెందు భూతంబు మొదలు
మూఁడుకాలమ్ములందు నీరేడుభువన
ముల హరిశ్చంద్రునకు సాటి గలరె నృపులు. ౪౫౪

వ. ఇట్లు వసిష్ఠుండు హరిశ్చంద్రు గుణాతిశయం బుగ్గడించిన నసూయాగ్రస్తుండై గాధిజుండు కోపసంరక్తలోచనుండై యిట్లనియె.

క. కపటప్రియు మిథ్యావా
దపరాయణుఁ బెద్దఁజేసి తద్దయు నుతి చే

నీ పలుకఁ దగవే యాతఁడు
నెపమున వంచింప లేదె నీరాధిపునిన్. ౪౫౭

చ. పలుకుల కేమి! యానృపునిఁ బందెము వెట్టి యసత్యవాదిగా
ఖలునిఁగ దాతగామిఁగ నికామ మొనర్పఁగలాఁడ నిట్లు నే
సలుపనయేని నాదయిన సంచితపుణ్యము రిత్తవోవు ని
ట్లలవడఁ జేయఁ జాలినపు డట్లగునే భవదీయ పుణ్యముల్? ౪౫౮

వ. ఇట్లన్యోన్యసంభృతసుకృతమ్ములు పణమ్ముగా వివదింపుచు నమ్ము
నివరులు నాకమ్ము విడిచి స్వాశ్రమమ్ములకు వచ్చి యున్నంత
నొక్కనాఁడు హరిశ్చంద్రుండు వనమ్మునఁ గ్రుమ్మరువాఁ
డొక్కెడ, ౪౫౯

క. భోరన నేడ్చెడి యొక యం
భోరుహపత్రాక్షిఁ జూచి పొడమిన కరుణన్
ఘోరవనమ్మున నిటు లే
కారణమున నునికి యెవఁడు కాంతుఁడు నీకున్. ౪౬౦

క. కూరుండు రాక్షసుండున్
నారాజ్యమునందు లేఁడు నాతిరో! నీ దుః
ఖారంభమ్మున కెవ్వఁడు
కారణము వచింపు వాని గండడఁగింతున్ ౪౬౧

చ. అను నరపాలువాక్యముల కచ్చెలి యుత్తర మిచ్చె నిట్లు రో
దనజనితాశ్రుపూర్ణ వదనతామరసమ్ము నలంకరింప "నో
జనవర! గాధిజుం డనెడి సంయమి నన్నును బాధ వెట్టు నా
తనితపముల్ మదర్థ" మనఁ దన్నరపాలుఁడు వాని కిట్లనున్.

వ. నీవు స్వస్థచిత్తవై యుండునది, యేను భవత్పీడాపారాయణుండై
తపంబొనర్చు నమ్మునిని నిప్పుడ వారించువాఁడ నని యూరార్చి

విశ్వామిత్రునాశ్రమమ్మున కరిగి నమస్కరించి వినయమ్మున నిట్లను. ౪౬౩

ఉ. ఏల తపం బొనర్చెదు మునీంద్ర! వృథాగతి దేహపీడయుం
బోలునె సంయమీంద్రులకు; బొంకక తెల్పుమునీదుకోర్కె; భూ
పాలన మే నొనర్చుతఱిఁ బాపపుబుద్ధిని లోకపీడ కీ
లీలఁ దపం బకార్య మగు లె మ్మిది పుణ్యమ, పూరుషార్థమా!

వ. హరిశ్చంద్రుం డిట్లు వారింప నచ్చోటు విడిచి విశ్వామిత్రుండు తపం బుడిగి సంభృతక్రోధుండై యొండెడ కరుగుచు, ౪౬౫

క. దినమునఁ దాను వసిష్ఠుఁడు
వివదించుటయును దపంబు విఘ్నంబును హే
తువులుగఁ గోపము హెచ్చఁగ
నవనీపాలునకు వంచనాధాయకుఁడై. ౪౬౬

వ. ఒక్కదానవుని సూకరంబుగా నొనర్చి పనిచిన నదియును హరిశ్చంద్రు నుపవనంబుఁ జొచ్చి రక్షకుల భయపెట్టి కదంబమాలతీయూథికాదులం గదలంజేయుచుఁ బుడమికి దంతాఘాతంబు దొడరఁ జంపక కేతకీమల్లికాదుల నున్మూలించుచుఁ గరవీరోశీరంబులంద్రవ్వుచు ముచుకుందాశోకతిలకవకుళంబుల రూపుమాపుచుఁ గదనం బొనర్చునంత మాలాకారులు గొండొక పోరాడి శరంబులు పఱంగించినఁ దలంక కున్కి నిది కేవలసూకరంబు గాదనియుఁ గాలరూపమ్మున నిట్లెవ్వండేని రాఁబోలు ననియు శంకించుచుఁ బలాయనం బొనర్చి శరణాగతులైన నృపాలుండు వారల కిట్లను, ౪౬౭

ఉ. ఏమి భయమ్ము చెందుటకు హేతువు? దేవతలో, సురారులో!
భూమి నెవండు నాకును రిపుండు వచింపుఁడు వాని నింతలో

నేమముమై వధించెద ననిన్ నను నొక్కఁ డెఱుఁగ్చువాఁడె ! త
న్నామము రూపుఁదావునుగుణమ్ములునున్ వివరింపుఁ డింతకున్.

వ. నావుడు మాలాకారు లిట్లనిరి. ౪౮౯

చ. దివిజుఁడు గాఁడు రక్కసుఁ డుదీర్ణబలుండనుఁ గాఁడు దేవ ! పు
ష్పవనములెల్లఁ గూల్చె నొకపంది తదీయబలంబు చెప్పఁగా
నవునె ? యెదిర్చి పై విడుచు నమ్ముల కోర్చియు నార్చి పేర్చి భీ
తి వడఁగఁజేసె మమ్ముఁ; జని తీర్పుము దానిమదంబు నావుడున్.

వ. హరిశ్చంద్రుండు వారువంబు నెక్కి సైన్యావృతుండై వనంబున
కరిగి ఘుర్ఘురించు నక్కోలంబు దాదవ్వులంగాంచి దానిచే విశీర్ణం
బులై పడియున్న లతాకుంజపుంజమ్ముల నరసి సంజాతక్రోధుండై,

క. కడుకొని ధనువున బాణము
దొడిగి యెదురు వచ్చుదాని దూడు కడఁపఁగ నె
క్కుడు రయమున విడిచిన నది
తడయక పరుగిడియె నులివు దశదిశ లలమన్. ౪౯౨

క. ఈగతి నాశుగమునకున్
లోఁగక గిరురించి వనములోఁ జొరఁబడు న
య్యాగడపుటడవిపందిన్
దాఁ గని కోపించి యేసెఁ దద్దయు శరముల్. ౪౯౩

ఉ॥ కొండొకసేపు గన్పడును గొండొకసే పెడమై యదృశ్యమై
గండునఁ గ్రుమ్మరుం దడయుఁ గ్రాలునొకానొకచోట నార్చును
ద్దండముగాఁగ నొక్కయెడ; దానిపిఱుందన వాజి నెక్కి భూ
మండలనాయకుం డరిగె మానసికోపభరంబు పెంపునన్. ౪౯౪

క. రయమునఁ బఱచెడి కోలము
నెయిదఁగ నరపాలుఁ డిట్టు లేగినఁ దత్సే

న యదాయదలు పదాపద
లయి యాభూపాలు నెయిద కటునిటు చెదరెన్. ౪౭౫

ఉ. ఆనరపాలసూతి యిటు లక్కిటి వెంట నధిజ్యచాపుఁడై
సేనకుఁ బాసి యేగి వనసీమలు పెక్కులు దాఁటి సంగత
గ్లానివిదూనమానసుఁ డఖండపిపాసకుఁ డంతఁ గాంచె న
క్కానసమధ్యమం దతులకాండమనోహరమైన యాపగన్. ౪౭౬

వ. కాంచి తత్తీరమ్మున వారువమ్ము డిగి జలమ్ములు ద్రావి త్రా
వించి యిఁకఁ గోలమ్ము నరయరాదని కృతనిశ్చయుండై దిగ్భ్ర
మంబు దొడర నగరంబున కెట్టులేగుదునని యోజించుచున్నంత
వృద్ధబ్రాహ్మణరూపమ్మున విశ్వామిత్రుఁ డటకరుదెంచిన నతనికి
నమస్కరించుటయు నతండు స్వస్తివచనపూర్వకముగ నిట్లనియె.

క. ఏమిది యొక్కఁడవై యీ
భూమికిఁ జనుదెంచితివి నృపుఁడవయ్యును నీ
కేమి పనియబ్బె నిచట న
యోమయ మివ్వనము మనుజు లుండరు దీనన్. ౪౭౭

వ. అని యడిగిన హరిశ్చంద్రుం డిట్లనియె. ౪౭౮

ఉ. కోల మొకండు వచ్చి సుమకుంజములం బడఁగొట్టె నేత్రైన్
బూలవనమ్ములోఁ దిరుగఁ బోణిమి దక్కి యెదిర్చి రక్షకుల్
దోలఁగ లేక నాకడకుఁ ద్రోరపుభీతిని నేగుదేర నే
నోలి వధింప వచ్చి శరమొందు నిగుడ్చితి నంత నద్దియున్. ౪౮౦

—* విశ్వామిత్రుండు హరిశ్చంద్రుని వంచించుట *—

వ. పరుగిడిన దానివెంటఁ బఱతెంచి యిట కరుదెంచితి సైన్యం బెట
కేగెనియుం జనియెఁ గోలం బెటకేగెనో యెఱుంగరాదు క్షుత్పి

పాస లధికంబుగ బాధించుటంజేసి నగరమ్మున కరుగ నెంచిన
దిగ్భ్రమణాం బోదవి మార్గంబుఁ దెలియదు, కరుణించి తెరు
వెఱింగింపుమని మఱియు నిట్లనియె. ४८౧

మ. అరయన్ న న్నెఱుఁగంగఁ జెప్పెద నయోధ్యానాయకుండన్ నభ
శ్చరమాన్యంబుగ రాజసూయము మొదల్ జన్నమ్ములంజేసి భా
స్వరకీర్తిన్ జగమెల్ల నేలెడి హరిశ్చందుండ నాతోడ మా
పురి కేతెంచితివేని నిస్తులధనంబుల్ నీకు నే నిచ్చెదన్. ४८౨

వ. తద్ధనంబునంజేసి జన్నంబొనరించికొందువుగాక నావుడు విశ్వా
మిత్రుండు నగి హరిశ్చందున కిట్లనియె ४८3

చ. ఇది యొక పుణ్యతీర్థము మహీశ్వర ! యిం దవగాహనం బొన
ర్చఁదగుఁ బితృప్రియం బొనరుపందగుఁ దర్పణ మాచరించి యీఁ
గఁదగు స్వశక్తి కల్మిఁ ద్రిజగంబులు మెచ్చఁగ దానధర్మముల్ ;
' నదిఁగని యీడఁబోయిన జనంబులు చెందుదు రాత్మహంతృతన్'

వ. అను మనువచనంబు వినవే ? యియ్యెడ స్నానంబు సలిపి నీకుఁ
దోఁచినయది నాకిచ్చితివేని దాన సంతుష్టుండనై కొండొకనేల
వచ్చి మార్గంబు గనఁజేయువాఁడ, ననవుడు నృపాలుం డకపట
వచనంబులఁ గల తెఱంగెఱుంగక కృతోద్యముండై య న్నదినిఁ
గ్రుంకి పితృతర్పణంబుసలిపి కపటాకారుండగు నావృద్ధునకిట్లనియె.

ఉ. దాన మొసంగువాఁడ విదితంబుగఁ గైకొనుమయ్య నీకు నే
దేని యభీష్ట మయ్యదియు యిచ్చెదఁ గాంచనమో గజాశ్వసం
తానమొ భూమిఖండమొ ధనంబులొ భూషలొ గోవులో మహా
ధ్యానములో సతీమణులొ తక్కిన వెయ్యవియేని దేయముల్.

క. మును రాజసూయమున స
న్మునిసన్నిధియందు సకలమును గోరిన లే

దన కిత్తు ననుచు వ్రతముం
గొనియుంటి మహాత్మ ! నీదు కోరిక చెప్పుమా. ౪౮౭

క. అనఘుఁడవు నీవు, తీర్థం
బును బావన మిది, యొసంగఁబోలదె నీకో
రిన కోర్కె, నాదు ప్రతినన్
మునిజను లెల్లరును సత్యముగ గణియింపన్. ౪౮౮

చ. అన మునినాథుఁ డిట్లను ధరాధిప ! యంతటివాఁడవౌదు స
జ్జననుతమైన నీ యశము చాటుదు రెల్లరు సూర్యవంశసం
జనితుఁ డుదారధీరుఁడు త్రిశంకుని పుత్రుఁడు తాదృశుండు లేఁ
డనుచు వసిష్ఠమౌనియును నాడఁగ వింటి నతండు బొంకునే.

క. దాతవు సకలధరిత్రీ
నేతవు నీ కొండు కొదయె నృప ! నాదుతనూ
జాతునకుఁ బెండ్లిసేయు మ
నేతాదృశమైన కీర్తి నెనయుము పేర్మిన్. ౪౮౯

వ. అని గాంధర్వమాయావశమ్మున దశవార్షికి యగు నొక కన్ని యను, సుకుమారుండగు నొక కుమారుని దెచ్చిచూపి వీర వధూవరు లికార్యమ్ము రాజసూయాధికపుణ్యప్రద మ్మనిచెప్పిన రాజట్ల కాక యని యంగీకృతిం దెలిపి యవ్విప్రప్రదర్శితమార్గ మ్మున స్వపురమ్మున కరిగె, మునియు నటనుండి స్వాశ్రమమ్ము నకుఁ జని కృతోద్వాహుండై వచ్చి యగ్నిహోత్రశాలాస్థితుఁ డగు హరిశ్చంద్రుంగని యియ్యది మంచిసమయ మ్మా వేదీమధ్య మ్మునన నాకు మున్నిచ్చెదనని చెప్పిన దానం బొసంగవలయు నని కోరుటయు వదాన్యశేఖరుండగు నా నృపాలుం డిట్లనియె.

ఉ. ఆరయ నీవు బ్రాహ్మణుఁడ వంతయు నేలెడిరాజ నేను సం
సారికి నెంత యుండిన యశంబునకుం గొఱగాకయున్న ని
స్సారము కాదె వానిదగు జన్మము? ద్రవ్యము శాశ్వతంబె? నీ
కోరిన దేదియేనియును గొంకక యిచ్చెదఁ గోరుకొమ్మిగన్.

మ. అన విప్రుం డను సట్టిదాతవె నరేంద్రా! నీయశం బింతక
న్నను నందంబుఁ బొగడ్త కెక్కి జగదానందంబు సంధింప నీ
ఘనరాజ్యం బఖిలంబు నేన్గులు తురంగంబుల్ మొదల్ సంపదృ
ద్ధి నొసంగం గదవయ్య నీవిటులె వేదీమధ్యమందుండఁగన్.

వ. అని కోరిన హరిశ్చంద్రుండు మాయామోహితుండై నీ యడిగి
నట్ల యిచ్చితి ననియె గాధిజుం డయ్యది గ్రహించి యిట్లను.

క. దానం బిచ్చితి దానన్
మానస ముప్పొంగె "దక్షిణారహితంబౌ
దానము వ్యర్థం" బనియెడి
మానవధర్మంబు వినవె మానవనాథా. ౪౯౫

వ. కావున దీనికిం దగియెడి దక్షిణ నొసంగి కృతార్థుండవు గమ్మనుడు
మునీంద్రా! దక్షిణామానం బది యెంత చెప్పు మనుటయు
గాధిజుం డతని కిట్లనియె. ౪౯౬

గీ. హేమభారద్వయమ్ము నాకిమ్ము సార్ధ
ముగను దక్షిణ దాన సంపూర్తిచెందు
ననుడు నొసఁగెదనని ప్రతిజ్ఞను బొనర్చె
సత్యపరిపాలకుఁడు హరిశ్చంద్రవిభుఁడు. ౪౯౭

వ. అట్లు కృతప్రతిజ్ఞుండై హరిశ్చంద్రుం డమ్మునికపటమ్మునకు విస్మ
యావిష్టుం డగు నయ్యవసరమ్మున మున్నరణ్యమ్మునఁ దన్నుం
బాసి పలుత్రోవల నరిగిన సేవకు లరుదెంచి స్తుత్యాదికమ్ముల

నలరింపుటయుఁ జింతాదంతురుండగు కతన వారల కెద్దియుం
జెప్పక యంతిపురమున కరిగి నిజాంతర్గతంబున, ౯౮

చ. ధనమును రాజ్యముం మొదల దానము చేసితి దాని కేమి య
మ్మునికపటం బెఱుంగక సముద్ధతి దక్షిణ యిత్తునంటి నిం
కను ధన మేడఁ దెత్తు నిది కాలవశం బటుగాక యున్న నెం
దును దపసుల్ ప్రతారణమునుం బొనరింతురె ద్రవ్యలుబ్ధులై

వ. అని తదేకచిత్తుండై యొండెఱుంగక యున్నపతిం గాంచి
రాజ్ఞి యిట్లనియె. ౧౦౦

ఉ. చింతకు నేమి కారణము చెప్పుము కాననసీమనుండి ధీ
మంతుఁడు వచ్చెఁ బుత్రుఁడు; క్రమంబుగఁ జేసితి రాజసూయముం
బ్రాంతమునందు దూరమునఁ బార్థివసత్తమ! లేఁ డరాతి; నీ
కెంత విచార మేల? వచియింపుము నావుడు భూపమౌళియుం.

వ. చింతాకారణమ్మును గొండొక చెప్పి భోజనాదికం బొనర్పక
యారేయి గడపునంతఁ దెల్లవాఱుటయు సంధ్యాదికృత్యంబు
లొనర్చునంతకు మున్న విశ్వామిత్రుం డరుదెంచి కృతనమస్కా
రుండగు నృపతి కిట్లనియె. ౧౦౨

క. విడువుము రాజ్యమ్మును నొం
డెడ కేగుము దక్షిణార్థ మిచ్చెద నని ము
న్నొడివిన బంగారమ్మును
గడువడి నాకిమ్ము తడయఁగా నేమిటికిఁ. ౧౦3

వ. అని ధార్ష్ట్యమ్మునం బలుకుగాధిజునకు నరేంద్రుం డిట్లనియె.

క. ఇచ్చితి సర్వస్వమ్మును
బుచ్చికొనుము, వెడలి యిపుడె పోయెద నీకుఁ బై

పెచ్చుగ నొడివినదక్షిణ
నిచ్చెదఁ గాలాంతరమున నిపు డీలేమిన్. ౧౦౭

వ. అని యమ్మునికిం జెప్పి భార్యాపుత్రుల వీక్షించి యిట్లనియె.

క. మన మూఁడుకాయములు గా
క నిఖిలరాజ్యంబు వివిధకరితురగములున్
ధనధాన్యములును నిమ్ముని
జనవరాళికి నిచ్చినాఁడ సంతోషముగన్. ౧౦౮

వ. కావున నీక మనమియ్యెడ నుండు టనుచితంబు వెడలుండని నిర్గమించు నమ్మహీపాలునివెంటఁ గొమరుండును భార్యయును చింతాదంతురులై నమ్రవదనమ్ములతో నరిగి, రట్లు కట్టుగుడ్డలతోఁ గదలు వారల యవస్థం గాంచి, ౧౦౯

ఉ. పౌరజనమ్ములెల్లరు నపారకృపారస మొల్క "నక్కటా!
ధీరుఁడవయ్యు నించుకయుఁ దేఁకువ లేక మునీంద్రమాయయన్
దారుణపాశముం దవిలి దైన్యము నొందఁగ నయ్యెనే? దురా
చారుఁడు ధూర్తుఁ డెంతపని సల్పె ధరామరుఁ" డంచు బోరనన్,

వ. అమ్మునీంద్రు నిందించుచు దుఃఖాక్రాంతులై యున్నెడ భార్యాపుత్రసహితమ్ముగఁ గదలి పురంబు వెలువడినఁ బిఱుందన చని నిలువరించి గాధిజుండు నిష్ఠురమ్ముగ నిట్లనియె. ౧౧౦

చ. జనవర! దక్షిణం దగ నొసంగు మొసంగుట కిచ్చ లేనిచో
"నన" యనిపల్కు మట్టులయినన్ నిను నేనడుగన్ సమస్తముం
గొనుటకు నిచ్చయేని యిదిగోఁ గొను మిచ్చెదఁ గానిచోఁ బ్రతి
జ్ఞను జవదాఁట కిమ్ము కనకమ్మును దక్షిణకై యథామతిన్.

వ. అని ప్రాణగొడ్డమ్ముగఁ దవిలిన యమ్మునీంద్రునకు నమస్కరించి దీనాత్ముండై యంజలి ఘటించి హరిశ్చంద్రుఁ డిట్లనియె. ౧౧౨

ఉ. వారక నీ ఋణం బది యవశ్యము నీఁదగు, నిచ్చి కాని యం
భోరుహమిత్రవంశమునఁ బుట్టియు మెచ్చుగ రాజసూయముల్
సారగతిం బొనర్చియు యశమ్మున మించిన దాతనయ్యు నే
నేరహి నన్నముం దినఁగ నిచ్చ యొనర్తు జగంబు నవ్వఁగన్.

వ. నీ ఋణంబు దీఱుదనుక నే భుజింపనొల్లమియు నిశ్చయంబు కొండొక తాళితివేని దైవానుకూల్యమ్మునం జేసి ధనంబు చేకుఱు నది దక్షిణార్థంబుగఁ బ్రతిశ్రుతం బొనర్చిన కనకమ్మ నకుఁగా నొసంగెద నావుడు ముని యిట్లను. ౫౧౪

ఉ. వెడ వెడ మాట లాడెదవు పిఱికిఁడివే నరపాల! నీకు నె
క్కడ దొరకున్ ధనంబు? ధనకారణమైన సమస్తరాజ్య మి
ప్పుడ మదధీనమయ్యె నిటు బొంకక "లే" దని చెప్పు మింక ని
న్నడిగెడివాఁడఁ గాను జను మాపయి నీమది వచ్చునట్లుగన్.

మ. వనవాసమ్మున కేగువాఁడు నృపుఁ డిప్పాటన్ బ్రయోగించు న
మ్మునివాగ్బాణములన్ సహింపక యనున్ మోఘమ్ముగాఁబల్కువాఁ
డనె? ద్రవ్యంబున కేమి శంక? యొకచోటన్ దేహమే నమ్మి నీ
కనకం బిచ్చెద నిర్ధనుండ నని నన్ గారింపఁగా నేటికిన్. ౫౧౬

ఆ. వె. తెవులు లేని మూఁడుదేహమ్ము లుండఁగ
నీ ఋణంబుదీర్ప నేరమెట్లు!
గ్రాహకుం డొకండు గల్గనే నీయయో
ధ్యాపురమ్మునందుఁ జూపు మనఘ. ౫౧౭

—* హరిశ్చంద్రుండు కాశికిఁ బోవుట *—

వ. కాదేనిఁ గాశీపురమ్మున మమ్మ విక్రయించికొని నీకు దక్షిణార్థంబు ప్రతిజ్ఞాతంబగు సార్థభారద్వయపరిమితకాంచనమ్మును నొసంగుదునని చెప్పి తత్సహితమ్ముగ నరుగువాఁడు ముందట,

ఉ. గౌరిని గూడి శంకరుఁడు కాఁపుర ముండెడిచోటు మేటిభా
గీరథియొడ్డునం దనరు కేవల పుణ్యపురాశి కాశి యిం
పారఁగఁ గాంచి యందుఁగల హర్మ్యములన్ దిలకించి ప్రోలికిన్
దూరమునుండిచేసెఁ బ్రణతుల్ కృతకృత్యుఁడనంచు నెంచుచున్.

వ. పదంపడి గంగానికటమ్మున కరిగి యందుఁ గృతస్నానుండై తర్ప
ణాదికం బొనరించి మునిఋణవిముక్తుండై మార్గమ్ము నాలోచిం
చుచు సర్వథా యిప్పుణ్యస్థలంబు శివపరిగ్రహంబ కాని మనుష్య
పాలితంబు కాదు, కావున నిట నన్న కించిత్కరుండైన నెవ్వండేని
తదనుమతమ్మునం జేసి కొని కృతకృత్యు నొనర్పవచ్చునని యెం
చుచు సుతసతీసహితమ్ముగఁ గొంతతడవేగి పార్శ్వగతుండును
దక్షిణార్థియునగు బ్రాహ్మణుం గాంచి వినయమ్మున నిట్లనియె.

క. ఈ నన్ను నాదు కొమరున్
నా నారీతిలకమును గనందగుఁ బేర్మిన్
మౌనివర ! యేమిపని మా
కానతి యిచ్చెదవు తెల్పు మర్మిలికల్మిన్. ౧.౨౧

వ. ఇందొకకరి కతన నీ ఋణంబు దీర్చికొను మనుడు నవ్వి యవ్వి
ప్రుఁడు రాజున కిట్లనియె. ౧.౨౨

క. ఒకమాసమాయె, నను మి
న్నక మాటలు సెప్పి త్రిప్పు నాయమె భూపా
లక ! దక్షిణ యిడి కదలుము
యకలంకంబైన కీర్తి నందెద వేనిన్. ౧.౨౩

వ. నావుడు హరిశ్చంద్రుండు మహాత్మా ! మాసం బిప్పటికిని
బూర్ణమ్ముగాలేదు దినార్ధంబింకను వ్యవధి యున్నయది, యించుక
ప్రతీక్షించితివేని ఋణవిముక్తుండ నయ్యెదనన నమ్ముని యిట్లను.

క. ఇపు డరిగివచ్చెదను స
త్యపరత నపు డీఁదలంపు నందకయున్నన్
శపియించెదనని యరిగెన్
గపటబ్రాహ్మణుఁడు నృపతి కళవళమందన్. ౨౨౮

ఉ. అంతఁ ద్రిశంకుపుత్త్రుఁ డకటా! యెటులిమ్మని యప్పుదీర్తు? శ్రీ
మంతులు మిత్త్రులుండినను మానముదక్కి విభుండనయ్యు నో
క్కింతకుఁ జేయిచాఁపుదునె? వృత్తులు మూఁడు విధించె క్షత్త్రతా
క్రాంతుల కెల్ల బ్రహ్మ; యవిగాక మఱొక్కటిదొక్కఁ జెల్లునే.

వ. ఇతని ఋణంబు దీర్పకమున్న మృతిచెందితినేని బ్రహ్మస్వాప
హరణజనితదోషమ్మున నధమాధమంబగు క్రిమిజన్మంబు సంప్రా
ప్తంబగుఁ, గాదేనిఁ బ్రేతత్వంబు చేకూఱు నట్లుంగాన నాత్మవిక్రి
యణం బొనర్చుటయ వరంబని యెంచి చింతాకులత్వమ్మున
నధోముఖుండై దీనుండై యున్న పతికి సతి యిట్లనియె.

ఉ. జనవర! సత్యవంతులకు సాటి మఱొక్కఁడు గాఁడు, సత్యవా
క్యనియతి దప్పి ప్రేతసముఁడై వెలిఁజెందు నరుండు; వాని స
ర్వనియమముల్ వృథా, ఋతము పాలనసేయుము స్వర్గలోకసా
ధనమగు నెట్లు సత్య; మనృతంబగు దుర్గతి కట్ల హేతువై.

వ. నాథా! యయాతి శతాశ్వమేధంబు లొనర్చి పిదప రాజసూయ
కర్త్రయై స్వర్గమ్మున కరిగి యొక్కపరి యసత్యంబాడి యధోగతికి
వచ్చెనని వింటు ననుడు రా జిట్లనియె. ౨౨౯

గీ. ఎద్దియో చెప్పఁదలఁచితి విందువదన!
పలుకుమయ్యది కొంకక బాలకుం డి
తండు వంశంబు నెగడింపఁ దగినవాఁడు
కలఁడు వెనుదీయ నెయ్యది కారణంబు. ౨౩౦

వ. నావుడు రాజపత్ని యిట్లనియె. ౫౩౧

క. నరవర ! సంతానమ్మున
కరయఁగ సతి యట్టిఫలము నందితి వీఁక న
న్నోరులకు నమ్మి ధరామరు
ని ఋణము దీర్పంగఁ జనదె నిశ్చలబుద్ధిన్. ౫౩౨

వ. అను శైబ్యావచనమ్ములకు దుఃఖాకులుండై,

చ. చెలి ! దరహాససంగతినిఁ జెన్నలరారెడి పల్కులెల్ల ని
మ్ముల విడనాడి నా హృదయముం గలఁగింపఁగ నిట్టివాక్యముల్
పలుకుట చెల్లునే ? మృదులభావము గల్గినదానవయ్యు న
న్నలయఁగఁ జేయుదే ? విధికి నన్నెముఁ బున్నెము లేకపోయెనే.

వ. అని కరుణంబుగఁబల్కి యన్నృపాలుండు దారవిక్రయమ్మున కధీరుండై దుఃఖాతిరేకమ్మున మూర్ఛంజెందినఁగాంచి యప్పతివ్రతయు. ౫౩౩

ఉ. హా నరనాథ ! దైవమున కంతగ నెల్లిద మైతిమే ? జగ
న్మాన్యులైన భూపతులు మన్ననఁజేయఁ జతుస్సముద్రము
ద్రాంకితంబు భూవలయ మంతయు నేమహనీయుఁ డేలు న
వ్వానికి నీకు స్థండిలముపై నిటు నెవ్వగఁ గూరు టొప్పునే.

ఆ. వె. కోట్లకొలది విప్రకోటులకిచ్చి య
జ్ఞములు చేసి సత్యసంధుఁ డనఁగ
నెగడు నాదుపతికి నీకు నీ దురవస్థ
యెట్లు గల్గె ? నాకు నెఱుఁగఁ జెపుమ. ౫౩౪

క. అనయము నిందార్పేందుని
కైన యాతఁ డనంగఁ బుడమి నేలెడి ధర్మా

త్తున కీదుర్దశ గూర్పఁగఁ
జనునే! దైవమున కింత శంకయు వలదే. ౧౩౮

క. అని పలుమఱుఁ గుందుచు న
వ్వనజానన మూర్ఛ గూరి భర్త దరిఁ గ్రి
న్ననఁబడియె నిట్టికష్టము
చన దింక నెవ్వానికేని శత్రుండైనన్. ౧౩౯

వ. ఇట్లిరువురును మూర్ఛం జెందియున్నయెడఁ గొమరుండు రోహితుండు క్షుధాకులుండై, ౧౪౦

క. నాలుక యెండెడి నాక
బ్బా! లలి భోజనము నిడక ప్రాణము నిలువం
జాలదు, క్షుద్బాధకు నేఁ
దాళ ననుచు మొత్తవెట్టుఁ దలిదండ్రులకున్. ౧౪౧

గీ. అంతలో నంతకుఁడు వోలె నధికకోప
మడర గాధిజుఁ డేతేర నవనిపతికి
నధికమై తగె దుఃఖ; మట్లగుచుఁగాదె
ఋణికి ఋణదాత క్రుద్ధుండై యెనయుపట్ల. ౧౪౨

వ. విశ్వామిత్రుండును మూర్ఛంగూరిన యన్నరపాలునిపై శీతలోదకంబు చిలికి, ౧౪౩

క. నరపాల! నీక కాదిది
నరులకు నెల్లరకునన్ ఋణము నీఁదెరువున్
బారయనివారికిఁ గలయది
య, రయమున్మై లెమ్ము వంచనాదృతిమేలే. ౧౪౪

వ. అని లేపిన హరిశ్చంద్రుండు శీతలోదకసేచనమ్మున లబ్ధసంజ్ఞుండై క్రోధావిష్టుండును నంతకాపరావతారుండునునగు నమ్ము

నిం జూచి మగుడ మోహాయత్తుండగుడు ద్విగుణితక్రోధుండై
తపసి నృపున కిట్లనియె. ౧౪౧

ఉ. సత్యము దప్పవేనియు నొసంగుము దక్షిణ ; సత్య హేతువా
దిత్యుని తేజ, మియ్యవని తెల్లము సత్యమునంద నిల్చు, నా
దిత్యులలోక మియ్యెడఁ బ్రతిష్ఠితమై చను, సర్వధర్మముల్
సత్యమునంద పొల్చు, నొక సత్య మగుఁ శతవాజిమేధముల్.

ఆ. వె. ఇంతయేల నాకు నినుఁ డస్తగిరి కేగు
నంతలోన దక్షిణార్థమైన
కనక మిచ్చి పుచ్చుఁగా నేరవేని శా
పం బొసంగువాఁడఁ బార్థివేంద్ర. ౧౪౨

—* హరిశ్చంద్రుండు భార్య నమ్ముకొనుట *—

వ. ఇట్లు పుయిలోడక నిష్ఠురమ్ముగఁ బల్కి యతండు సనినపిమ్మట
దుఃఖార్ణవమగ్నులై దంపతు లిరువురును గుందుచున్నంత వేద
పారగుండగు నొక బ్రాహ్మణుండు బహువిప్రసహితుండై యెట
కేనియుం బోవుచుండ రాజపత్ని యాతనిం జూపి పతి కిట్లనియె.

ఉ. ఎక్కుడు విప్రులం గలిసి యిట్లరుదెంచుచున్న వాఁడు దా
నొక్కమహీసురుం ; డతనియొద్దకు నేగి ధనంబు గోరినన్
దక్కక యిచ్చుఁ బుత్రులకుఁ దండ్రిధనంబు గ్రహించు టొప్పదే ?
తక్కినమూఁడుజాతులకుఁ దండ్రులకారె మహీసురోత్తముల్.

వ. అను సతికిఁ బతి యిట్లనియె. ౧౫౦

గీ. క్షత్రియుఁడనయ్యు నేఁబ్రతిగ్రహముకొఱకుఁ
జేయిచాఁపుట యెట్టు లిస్సీ ! ప్రతిగ్ర

హంబు విప్రులసొమ్ము వర్ణంబులకును
వారు గురువులు పూజ్యులు వారిజాక్షి. ౫౧

క. గురువుల యాచింపం దగ
దరయఁగ దానంబు యజన మధ్యయనంబుఁ
శరణాగతరక్షణముఁ
బరమంబులు క్షత్రియులకుఁ బరిపాలనముఁ. ౫౨

గీ. "దేహి' యనుమాట వలవదు దేవి నాకుఁ
గలుగుఁగాక "దదామి" యనఁ బలుకు, తెచ్చి
యెట్టులైనను నిమ్మని ఋణము దీర్తు;
నడుగుటకు నోరు గలచె యొంటైనఁ గస్తి ? ౫౩

వ. నావుడు రాజ్ఞి యిట్లను. ౫౪

క. సమవిషమకాలముల యో
గమునఁ మానంబమానకతయుఁ దాతృ
త్వము యాచకత్వమను నివి
క్రమమున నొడఁగూడుఁ గాలగతి వార్యంబే. ౫౫

క. కాదేని ధర్మలతకుఁ
బాపులు బ్రాహ్మణులు ద్రోహపరులై కస్తిఁ
దా వృద్ధుఁ ద్రోయునకే ? మ
ర్యాదాస్థాలిత్యములు సమయచోదితముల్. ౫౬

చ. అనుసతి కిట్లు "పల్కు జలజానన ! వాఁడి కరాసిఁ బూని గ్రు
క్కున రసనఁ సుఖం బలరఁ గోసికొనం దగుఁగాని యొక్కనిం
గని ధనలోభమూని యడుగంగిమకింతునె "దేహి" యంచు,రా
జునకుఁ ద్రిశంకుపుత్త్రునకు శూరున కింతటిదైన్య మొప్పునే.

వ. కావున నెట్లైన భుజవీర్యార్జితం బగుధనమ్మొరుల కీయన యభిల
షింతుంగాని యాచ్ఞాదైన్యం బొల్ల" ననుడు నప్పతివ్రతాశిరోమణి
యిట్లనియె. ౫౫౯

ఉ. అమ్మిన నార్చినన్ మఱియు నందల మెక్కఁగఁ జేసినన్ వివా
హమ్మునఁ గొన్న భార్య దగు నన్నిటికిన్ నరపాల! యాచ్ఞకున్
సమ్మతి లేనిచో నను యశమ్మునకై తెగనమ్మి వచ్చు మూ
ల్యమ్మును నిమ్మునీంద్రుని ఋణార్థముగానిడు మింత యొప్పదే ?

క. అను సతిపలుకులు విని యా
జననాథుఁ డఖండదుఃఖసాగరమునఁ గ్రు
న్నన మున్గి యింతకష్ట
మ్మునకున్ నే నొప్పు నెట్లు పూర్ణేందుముఖీ. ౫౬౦

వ. అనిన నోదార్చి యమ్మగువ మరల నిట్లనియె. ౫౬౧

గీ. ద్యూతహేతువు మద్యహేతువును రాజ్య
హేతువును భోగహేతువు నెఱుఁగ కకట!
సత్యసంరక్షణమునకు సాధ్వి నమ్మఁ
దగదె నీవంటి యుత్తమోత్తమున కధిప. ౫౬౨

క. అని మాటిమాటికిని న
వ్వనితామణి యుక్తియుక్తవచనమ్ములఁ ద
న్నును బ్రేరేపఁగఁ దుద కి
ట్లను నంగీకారమాత్మయం దిగురింపన్. ౫౬౩

ఉ. ఎవ్వరుఁ జేయరాని పని యే నొనరించెద నీదుమాటచే
జవ్వని! భార్య నమ్మెడి నృశంసులు గల్గిరె యేయుగమ్మునం,

దెవ్వగ నిట్టి దుష్కృతికి నిచ్చ యొనర్తు ? నభాగ్యమూర్తినై
నవ్వుల కాకరంబ నయి నల్వురలోఁ దలవంపు నింపఁగన్.

వ. ఇట్లు చింతించుచు నెట్టకేలకు హరిశ్చంద్రుండు రంగమ్మునఁ బత్నిని నవతరింపఁజేసి గద్గదకంఠుండై యెడనెడ నడుచు నాగరికుల కిట్లనియె. ౨౬౫

గీ. నాగరికులార ! కరుణాసనాథులార !
యీ తలోదరి నాభార్య యెవరికేని
దాసిగా విక్రయించెదఁ దగినధనము
నీఁగలుగు దాత గలఁడె యిందొకఁ జెపుఁడు. ౨౬౬

వ. నావుడు వార లందఱుఁ బరమాశ్చర్యసంభృతమానసులై మండలాకారమ్ముగఁ జుట్టువారగ నిలిచి నీవెవ్వఁడ, విట్లు పత్నివిక్రయమునకుఁ బూనవ నేమివచ్చె నావుడు వారల కతం డిట్లను. ౨౬౭

క. నగపాలు చచ్చి యీ న
ర్భగకార్యము చేయువాఁడఁ బాపాత్ముఁడ నుం
డగుఁడగు రక్కసునిన్ బో
లఁ గలుగు కఠినుండ నన్ దలంప నఘ మగున్. ౨౬౮

వ. ఇట్టి నావృత్తాంతమ్ము మీకేల, వలసిన నియ్యంగనం దగిన ధనమ్మిడి దాసిగాఁ గైకొనుఁడని యుచ్చైస్స్వరముగ నొడువు నమ్మానవపతివచనంబులు విని కౌశికుండు వృద్ధబ్రాహ్మణరూపంబు ధరియించి యయ్యెడ కరుదెంచి యిట్లనియె. ౨౬౯

చ. ధన మతులంబుగాఁ గలను తద్దయునున్ సుకుమారి యస్మదం
గన పనిసేయరామిఁ గడుఁగష్టము చెందుచునుండు నీకుఁ గో
రిన ధనమిచ్చి పుచ్చెదను బ్రేయసి నమ్ముట నిక్కువంబె నాఁ
గను బ్రతి చెప్పుఁడయ్యె క్షితికాంతుఁడు కూరినవంత పెంపునన్.

వ. అట్లు నిరుత్తరుఁడగు నన్నరపాలున కతండు మరల నిట్లను, ధర్మ శాస్త్రముల ద్వాత్రింశల్లక్షణోపేతయు శీలవతియునగు తరుణికి మూల్యంబు కోటి యనియుఁ బురుషునకు నర్బుదంబనియుఁ జెప్పంబడుఁ గావున, ౫౨౧

క. నీ తరుణి కనుగుణంబగు
నేతన్మూల్యంబు గొనుము గృహమేగెద నే
నీతన్వింగొని యనవుడు
నాతఁడు ప్రతి చెప్పఁడాయె నతిదుఃఖమునన్. ౫౨౨

గీ. అంత నావృద్ధవిప్రుఁ డహంకరించి
ధనము నృపునగ్రమునఁ బోసి "దాసివై తి
రమ్ము తడవేల" యనుచుఁ గరమునఁ గొప్పు
వట్టి యీడ్చె నారాజపత్ని నకట. ౫౨౩

వ. అట్లు కఠినుండై లాగికొని పోవుచున్న యమ్మునికి నప్పరమ సాధ్వి యిట్లను. ౫౨౪

చ. అకట! మునీంద్ర నన్ విడువుమయ్య సుతున్ విడనాడనోప నే
నకలుషనై పతివ్రత నయం బొకయించుక లేక నన్ను ము
ట్టకు మని, పుత్రుఁగూర్చి యకటా నృపపుత్రక! దాసినైన నా
వికలత చూడుమయ్య నను వీడఁగదయ్య యిఁకేటికూరుముల్.

చ. అనినను వస్త్రముల్ విడువ కన్నృపపుత్రకుఁ 'డంబ యంబ' యం
చనుగతుఁడై యఖండగతి నశ్రువు లొల్కఁగ నేడ్చుచున్ బునః
పునరుదయత్పదస్ఖలనముల్ గని యేగుచు నుండ నెంత దు
ర్జనుఁడో యతండు! పొమ్మనుచు రాజసుతున్ గరమెత్తి మొత్తెడిన్.

ఆ. వె. ఎంత తిట్టి మొట్టి యెడ చేయ నెంచినఁ
దల్లికొంగు వట్టి తత్తఱమున

వెనుక నరుగుచుండె, విడువంగ శక్యమే
బాలురకును దల్లిపట్లఁ బేర్మి ! ౫౭౭

ఉ. అటు చనుదెంచు నాత్మజుని నయ్యమగాంచి, మహాత్మ! నన్నుఁగొ
న్నటులె మదాత్మజాతుఁగొనుమయ్య ధనంబునొసంగి యిట్లొన
ర్చుట నను రక్షసేఁత యొకరుండ సుతుండగుటన్ విశేషలం
పటమయి మన్మనంబు పనిపాటలకున్ వెనుదీయుఁ గానిచో.

—* గోహితుండు క్రీతుండగుట *—

వ. ఇంక లకుం గొఅగాని నన్నుం గొని యేమిఫలంబగు ? నో
యయ్యా ! యెట్లైన దీననగు నన్ననుగ్రహించి నా కొమరునిఁ
గ్రీతుఁగా నొనర్పుమనవుడు నతండంగీకరించి పురుషునకు నర్ప
దంబు మూల్యంబని చెప్పి యమ్మహీనాథునొద్ద తద్ధనం బునిచి
మీరిరువురును వెంబడి వచ్చునది యని చెప్పి యవ్విప్రుండు
బయలువెడలె ; నంత నమ్మహాపతివ్రత భర్తకుఁ బ్రదక్షిణం
బొనర్చి పాదమ్ములపై శిరంబిడి యతిదుఃఖభరమ్మున నిట్లను.

క. దానము లీఁబడి యగ్నులు
మానింపంబడి ద్విజుల్ సమగ్రమ్ముగ స
న్మానితులై రేనియు నా
కీ నరపతి భర్తకాఁడె యెన్నిభవములన్. ౫౮౦

క. అని పాదములంబడి వా
రని భక్తియుఁ బేర్మి కూర్మి గ్రిందుకొనఁగ లే
వని భార్యం గని దుఃఖాం
బునిధింబడి యిట్లు పల్కె భూపాలకుఁడున్. ౫౮౧

క. ఈ తరుణి యాతలోదరి
యాతల కెటు లేగు? భర్తనగు నా కెడమై
యేతీరున మను? వృద్ధా
ప్రేతంబై నీడ యొలయు టెందుం గలదే! గీ౨

వ. అని నికటగతుండగు కొమరు నుద్దేశించి, గీ3

మ. అకటా! న న్విడనాడి పోయెదె కుమారా! దుర్భగుండైన తం
డ్రికి నీబోఁటి సుతుండు దక్కునె? యిఁక న్నేదుఃఖముం జెంద నో
ద్దకు నేతెంచి నిషేధవాక్యములు దద్దన్ బల్కి యోదార్చి బు
ద్ధికి ధైర్యం బిడువార లెవ్వరు నను న్దీనాత్ముఁగాఁ జేసెదే.

ఉ. ధారుణి యెల్లఁ బోయినను ధైర్యము వీడ; సుతున్ గుణాకరున్
ధీరమతున్ ద్యజించు టెటు? తెల్పఁగదయ్య ద్విజేంద్ర! యంచు నా
భూరమణుండు విప్రునని, పూతచరిత్ర! సరోజనేత్ర! స
స్మిరహిండించి దాసివయి యేగెదె? దైవబలమ్ము పెంపునన్.

క. నను నిక్ష్వాకుకులోద్భవుఁ
డనియును రాజేంద్రుఁడనియు నధినాథునిఁగాఁ
గొని నాకారణమున నో
క్కనికిన్ దాసివయి కుందఁగాఁ బనుపడెనే. గీ౬

క. ఏతాదృశగురుదుఃఖా
న్వితుఁడనై కుందునన్ను నెవ్వరు మోదా
న్వితు నొనరింతు రని య
త్యాతురుఁడై భూపుఁ డడలె ననదవిధమునన్. గీ౭

వ. అంత నవ్విప్రుం డేతెంచి క్రోధాకులుండై యారాజర్షి సమక్ష
మ్మున నారాజపత్నిం బట్టి కశాఘాతమ్ములం గొట్టి పుత్రసహిత

మ్మగ నీడ్చికొని పోవుచుండ హరిశ్చంద్రుం డేమియుం జేయునది
లేక యిట్లు దుఃఖించె. ౨౮౮

చ. తరణిశశాంకవాయువులు తక్కిసమానవులుర్ మఱెవ్వ రే
పరమపతివ్రతం గనఁగఁ బాల్పడ కుండురొ మున్ను ; నేఁడు భా
గ్యరహితమై యకారణమ యవ్వనితామణి దాసి యయ్యె దు
స్తరమగు దైవపాక మది దాఁటఁగ రాదు విరించి కేనియుర్.

ఉ. మారుని గేరువాఁడు సుకుమారుఁడు నాపు కుమారుఁ డీతఁ డం
భోరుహమిత్రవంశజుఁడు పూజ్యతఁ దక్కి యభాగ్యుఁడైన నా
నేరమికారణంబుగ ననిందితుఁ డొక్కని చేతఁ గ్రీతుఁడై
బోరన నేడ్చుచుం జనుట పోలునె ? పుత్రులు లేరె ధాతకుర్.

ఉ. హానళినాక్షి ! హాతనయ ! యక్కట ! దుష్టుఁడ నైన నాదు దు
ర్జ్ఞానము కారణంబుగఁ గ్రమంబున దైవబలమ్ము దక్కియొం
దేనియుఁ బోతిరే ? ఋణము తీఱెనె ? మీకును నాకు నేఁటితోఁ
బూనిక నింత చేసియును బోవనిప్రాణము నాకుఁ గల్గెనే. ౨౯౧

వ. అని మిన్ను మన్ను నొక్కటిగా విలపించు నాసత్యసంధుని కడకు
విశ్వామిత్రుండు సశిష్యుఁడై వచ్చి కోపమ్మున నిట్లనుు. ౨౯౨

క. అనృతం బాడక సత్య
మ్మునకుం గట్టువడెదేని ము న్నిచ్చెద నీ
కని పల్కిన దక్షిణఁ గ
న్నన నా కిడు మనుడు ధరణినాథుఁడు పేర్మిర్. ౨౯౩

వ. మునిహృదయం బెఱింగి యితండు రాజ్యదానదక్షిణయుంగాక
మున్ను నే నితనికి “ యాగార్థంబు ధనం బిచ్చెద నయోధ్యకు
ర ” మ్మని నొడివిన ధనముంగూడ దెమ్మనుచున్నవాఁడు; కాని
మిన్నధనంబున సార్థహేమభారద్వయంబ కాక మఱికొంత మిగి

లివే యుండుఁ గావున నుభయమ్మునకుం బర్యాప్తంబగుం గాకేమి యని కెలన నున్న ధనముం జూపి యిందు రాజసూయ దక్షిణయుం గలదు దీనిఁ గ్రహించి నన్నుం గృతార్థుఁ జేయుము నావుడు గాధిజుం డీధనం బెట్లుసంగ్రహించితివి నోడువు మనుడు నతం డిట్టు లను. ౫౮౪

క. మునివర ! ద్రవ్యంబును గై
కొను మంతియకాని వేఱు గోరకు మదినే
విని చిన సీకును నాకును
బనుపడు శోకంబు పట్టఁబగ్గము లేమిఁ. ౫౮౫

క. నావుడు ముని యిట్లను నో
భూవల్లభ ! ద్రవ్య మెట్టిపోఁడిమిచే నీ
తావునకు వచ్చె ? శస్త్రం
బై వెలయక యున్న మాకు నది గ్రాహ్యంబే. ౫౮౬

చ. అనవుడు రాజు వల్కు వినుమయ్య మునీంద్ర ! పతివ్రతాంగనా
జనమణియైన మత్సతిని సద్గుణశోభిత నమ్మినాఁడ ని
ష్కనిచయ మొక్క కోటిగొని ; కన్నకుమారకు నర్బుదంబు కై
కొని యిడినాఁడ నీధనము గొంకక కైకొనుమయ్య మ్రొక్కెదన్. ౫౮౭

వ. అని ప్రార్థించుటయు నమ్ముని యాధనముం జూచి యియ్యది యల్పంబు రాజసూయమ్మునకు దక్షిణ యింత స్వల్పం బెట్లు ? మఱి కొంత తెచ్చి నా కొసంగు మట్లొనరింపవేని, ౫౮౮

గీ. నాతపోవీర్య మధ్యయనంపుఁజేవ
మత్ప్రభావంబు నాదగుమహిమ మగుప
డంగఁ జేసెద విప్రు లనంగ నంత
నెల్లిదమె ? యిమ్మ తక్కిన దిపుడ నాకు. ౫౮౯

వ. అనవుడు హరిశ్చంద్రుండు కొండొక తాళితివేని మఱియుం గొంత ధనం బిత్తు ననుటయు, గాధిజుండు రాజా ! యిఁక దినమ్మున నాలవ భాగంబు మాత్ర మవశేషముగా నున్న యది యంతదనుకం దాళువాఁడఁ బిమ్మట మఱుమాట చెప్పిన నే నొప్పెడి వాఁడఁగా నని యాధనంబు గొని యరిగెఁ ; బిదప హరిశ్చంద్రుండు దీర్ఘ నిశ్వాసం బొనరించి యధోముఖుండై యుచ్చైస్స్వరమ్మున నిట్లనియె. ౬౦౦

క. నను విత్తక్రీతునిగా
నొనరిచి ప్రేతత్వ మందియుండిన నాచేఁ
జను నెవ్వని యార్తి యతం
డనుగతుఁడై యిటకు వచ్చు నర్కుండుండన్. ౬౦౧

వ. అనునంత నొక్క చాండాలుండు దుర్గంధదూషితశరీరుండు వికృతోరస్కుండు శ్మశ్రులుండు లంబోదరుండు శవమాల్యాలంకృతుండు హస్తజర్జరయష్టి యగుచు నేతెంచి యిట్లను. ౬౦౨

క. విను మేఁ జాండాలకుల
మ్మునఁ బుట్టి ప్రవీరుఁ డనఁగఁ బొల్చెడి వాఁడన్
జనవర ! నాయానతి నృత
జన చేలాపహృతి సలుపఁ జనుము కడంకన్. ౬౦౩

వ. నావుడు రా జిట్లనియె. ౬౦౪

గీ. బ్రాహ్మణక్షత్రియులఁ గూర్చి పలికియుంటిఁ
గాని తక్కొరుల గుఱించి కాదు ; జగతిఁ
దనరు నుత్తమమధ్యమాధముల కనుగు
ణంబయిన ధర్మములు విహితంబు లగుచు. ౬౦౫

వ. కావున నీవు నన్నుఁ గొన నవశ్యంబడ వన వాఁడును నరేంద్రా! నీవు సామాన్యమ్మగ నాయెనుటఁ బల్కినకతనఁ గొన నుద్య మించితి, సత్యమునకుం దప్పవేని యట్లొనరింపు మిప్డు డీనియమ మ్ములు చెప్పుట పాడి గా దని మఱియును, ౬౦౬

క. అవిచారితమతియై తా
నెవఁడును సత్యంబు దప్ప నెఱుఁగనిచో ముం
దు వచింపరా దసత్యముఁ
దవిలెడివాఁ డెట్టులేనిఁ దగుఁ బలుకంగన్. ౬౦౭

క. అను నమ్మాలని పలుకులు
విని జనపతి సత్యమునకు వెలియై నరక
మ్మునఁ బడుటకన్నఁ జాండా
లనియతి నుండుటయ కొంత లగ్గగుఁగాదే. ౬౦౮

క. అని యోజించెడి యాలో
నన గాధిజుఁ డటకువచ్చి నరవర ! నీ కో
రినధన మిచ్చెద నను మా
లనికిన్ దాసుండ వగుట లాఘవమగునే. ౬౦౯

—* హరిశ్చంద్రుండు చాండాలునిచేఁ గ్రీతుండగుట *—

వ. అట్లని నా కీఁదగు దక్షిణ యేవిధమ్మునఁ బూర్ణం బగునని క్రోధ తామ్రాక్షుండై యరుగు నమ్మునివరునకు జనవిభుం డిట్లను.

క. అనఘుండగు సూర్యుని కొల
మునఁ బొడమిన క్షత్రియుండ మునివర ! నాకుం
జను నే ? చాండాలుని సే
వనముం బొనరింప ధనమువలని దురాశన్. ౬౧౧

వ. అనిన ముని యిట్లను. ౬౧౨

ఉ. మాలని కెట్లు సేవన మమర్తు నటంచుఁ దలంకెదేని నీ
జాలినద్రవ్య మిచ్చి కొనుసత్పురుషుం గనఁ జేయు మింక నేఁ
దాళ, శపించి యేగెదను దామరసాప్తుఁడు వోవుదెంచె నా
కేల విచార మెట్లయిన నీవలె దక్షిణ కైకొనన్ వలెన్. ౬౧౩

వ. నీ వెట్లేని ధనమిచ్చుటయ నాకుఁ బ్రధానం బని ప్రాణగొడ్డ
మ్ముగ ధూంకారం బొనర్చు నమ్మునికి నంజలి ఘటియించి పాద
మ్ములం బడి నృపాలుఁ డిట్లనియె. ౬౧౪

ఉ. ఓమునినాథ! కొంత కృప యుంచి ప్రసన్నుఁడవై భవత్పదాం
బే మదినమ్మియున్న ధరణీంద్రుని దీను ననాథు నార్తు న
న్నేమఁగదయ్య! యంత్యకులయోగముకన్న నినున్ భజించి నీ
ధామమునందు సేవకపదమ్మున నేఁ బనిగొందు నమ్రతన్.

వ. నీ వేది పంచిన నయ్యది యొనర్చువాఁడ నని పదమ్ముల నుండి
లేవని యన్నరనాథున కతం డిట్లను, నీకోరినయట్ల నాకు దాసుం
డ వగుము నే నెద్ది చెప్పిన నయ్యది యొనరింతువే? నావుడు
హరిశ్చంద్రుండు కొంత సంతసించి పునర్జాతునిగాఁ దన్నెంచి
కొనుచు నమ్ముని కిట్లను. ౬౧౬

క. ఓమునిజనమణి! నన్నిఁక
నేమి యొనర్చినను మంచిదే నీపాదం
బే మదిని నమ్మి నీపను
పేమైనన్ జేయువాఁడ నెల్లపుడుఁ దగన్. ౬౧౭

వ. కావున నీకేమి యొనర్తు నిప్పుడ నా కానతిమ్మనుడు నమ్ముని
చాండాలుం బిలిచి యిట్లను. ౬౧౮

గీ. ఓరి చాండాల ! వీఁడు నాయొద్ద దాసుఁ
డయ్యె దవ్యంబు నాకు ముఖ్యంబు గాని
వీనితోఁ బనిలేదు నాయానతిని ధ
నంబు నిడి వీనిఁ గైకొ మ్మనంగ వాఁడు. ౬౧౯

వ. గాధిజుం గని మహాత్మా ! ప్రయాగమండలంబున దశయోజన విస్తీర్ణంబగు భూమిని రత్నమయమ్ముగా నొనర్చి నీకు మూల్య మ్మునకుఁగా నొసంగువాఁడ నాకు నివ్వానికతన నియ్యార్తి యడంగు నియ్యది నీ వొనర్చిన యుపకారంబని చెప్పి, ౬౨౦

క. రతనములు మౌక్తికమ్ములు
నతులితమగు పైఁడియుఁ సహస్రపు సంఖ్యన్
మితిమీఱునట్టు లమ్ముని
పతికిచ్చెఁ బ్రవీణుఁ డెంతభాగ్యము గలఁడో. ౬౨౧

చ. అటు ముని చేత విక్రియము నంది త్రిశంకుసుతుండు " నాకు ని
జ్జటిలుఁడు సేవ్యుఁ డీతని నశమ్మున నెయ్యదియేనిఁ జేసినన్
గుటిలత నన్నుఁ బొంద దనుకాలమ యిమ్మునియాజ్ఞ సేత యిం
కెటులయినం గృతార్థుఁడ మునీంద్రు ఋణమ్మును దీర్పనేర్చితిన్.

వ. అని నిర్వికారవదనుండై యానందించు నెడ నశరీరవాణి యిట్లను.

ఉ. ధన్యుఁడవైతి సత్యమును దప్పక బాములకోర్చి యెల్ల రా
జన్యులు దేవతల్ నినుఁ బ్రశంస యొనర్ప నగణ్యకీర్తిస
న్మాన్యుఁడవై మునీందునిఋణంబు తృణంబుగనిచ్చిపుచ్చి యీ
దైన్యము లెక్కపెట్టక ముదమ్మునఁ బొల్చెద వింత యొప్పునే !

ఆ. వె. మేలు మేలు నీవు మేదినికెల్లను
భూషణమవు నిన్నుఁ బోలరాదు

సత్యమున మఱొక్కజనునకు నని నుతుల్
గొలిపి సురలు పూలు గురిసి రపుడు. ౬౨౫

వ. పదంపడి హరిశ్చంద్రుండు ద్విగుణితానందుండై కౌశికునికిఁ గేలు మొగిచి యిట్లను. ౬౨౬

క. తల్లియుఁ దండ్రియు దైవం
బెల్లరు నాకీవ నన్ను ఋణముక్తునిఁగాఁ
దెల్లము చేసితి వోముని
వల్లభ! నీయాజ్ఞ నే నవశ్య మొనరుతుఁ. ౬౨౭

వ. నీవెయ్యది చెప్పినను నాశ్రేయమ్మునకుఁ గాని యొండుగాదు నిక్కమ్ముగ నేమి యొనర్తు నాన తిమ్మనుడు నమ్ముని యిది మొదలీచాండాలునిపనుపున జాగరూకుండవై వర్తింపుము, నీకు శుభమ్మగునని చెప్పి యరిగె; నావుడు జనమేజయుండు మహాత్మా! యతండు చాండాలసేవకుండై యవ్వానిగృహమ్మున నెట్లు వర్తించె ననుడు వ్యాసుం డిట్లను. ౬౨౮

గీ. అట్లు కౌశికుఁ డరుగుడు నా నృపాలుఁ
గని శ్వపచుఁడిట్లు పల్కు "దొంగవయి పాఱు
దువొ, మఱేమొకొ? యిందు బద్ధుండవగు" మ
టంచుఁ గట్టించె రజ్జుల నంటఁదీసి. ౬౨౯

వ. అట్లంటఁగట్టి యసత్యుండవై పలాయనం బొనర్పకుండువాఁడ వని దండమ్మునం దాడించుచుఁ దనపక్కణమ్మునకుఁ గొనిపోయి,

గీ. ఇష్టబంధువియోగార్తు నష్టతేజు
వ్యాకులేంద్రియు నా నృపవర్యు నిగళ
బద్ధునిఁగఁజేసి నిద్రకుఁ బడియె శ్వపచుఁ
డకట! యాతని గతి చూడఁడాయె మరల. ౬౩౧

వ. అట్లు నిగళబద్ధుండును క్షుద్వ్యాకులుండును నై భార్యాపుత్త్రులం దలంచికొని యిట్లు విలపించు. ౬౩౨

ఉ. దీనముఖుల్ సుదుఃఖితునిఁ దేజము దక్కినవాని బాలుఁ డా
నానతవక్త్రయై కని 'సుతా! బెగడొందకుమయ్య యింతలో
మానిబుణంబుఁ దీర్చి నృపమౌళి కృపన్ మన కీయవస్థ యె
ట్లేనియుఁ బాపు' నంచు స్మరియించు సతీమణి నన్ను మాటికిన్.

గీ. 'అయ్యయొద్దకు నేగెద' ననుచు నేడ్చు
సుతుని నోదార్ప నక్కటా! సుదతి 'యల్లె
యేగుదువు గాని' యనిచెప్పి యెలమి గల్గఁ
జేసి మఱపించు నేమియుఁ జేయరామి. ౬౩౪

గీ. అంతియే కాని యకట! యయ్యతివ నేను
మాలని గృహమ్మునం దసామాన్యనిగళ
బాధమున నిట్టు లున్నసంబంధ మెఱుఁగ
దెట్టిఁగనేనియు మృతిచెందు నిదియ మేలు. ౬౩౫

చ. రమణ నెసంగునట్టి ఘనరాజ్యము పోవుట బంధుమిత్త్రసం
ఘములకు దూరమేగుట జగమ్మునకెల్ల మహాపతివ్రతా
త్వముగలభార్యయున్ సుతుఁడు దాస్యమునొందుట నాకు మాలగే
హము గతియౌటయుం దొడరె నాపద లాపదలంద పైఁబడున్.

వ. ఇట్లు ప్రతికూలంబగు విధికిఁ దలంకుచు భార్యాపుత్త్రుల స్మరించికొనుచు నొక్క నాలుగుదినమ్ములు గడపునంత నా ప్రవీరుం డతని బంధనిర్ముక్తుఁ జేసి పరుషదుర్భాషణంబులఁ దర్జించుచు మృతచేలాపహరణమ్మునకై యిట్లు నియోగించె. ౬౩౭

క. ఈ నగరిదక్షిణమున శ్మ
శానము గల దచట నుండి శవవస్త్రసమా

దానము పనిగా న్యాయ్యం
బై నెగడెడివృత్తి మెలఁగు మనవరతంబున్. ౬౩౭

వ. జర్జరంబగు నీదండంబు గైకొని యియ్యది వీరబాహుం డిచ్చెనని యెల్లరకుఁ దెలియ నుద్ఘోషించునది యని చెప్పి పనిచినఁ దదాజ్ఞంగొని దండమండితకరుండై, ౬౩౮

ఉ. ఆనరనాయకుండు భయమ్మై శవమాల్యయుతంబు పూతిగం
ధానుగతంబు ధూమమయ మామిషలోలుపగృధ్రకంకదు
ర్ధ్వానము నర్ధదగ్ధశవదర్శనసంగతమై మనస్యసం
ధానమునౌ శ్మశానము సదాప్రలపచ్ఛునకంబు గన్గొనెన్.

చ. పెనిమిటి కేడ్చు భార్యలును బ్రియసి కేడ్చెడిభర్తలున్ దనూ
జున కడలొందు తల్లులును సోదరికై వగచెందునప్పలున్
మనుమల కేడ్చుతాతలును మామల కేడ్చెడిభాగినేయులై
పనుపడు నా శ్మశాన మతిభైరవశబ్దసమాకులంబునై. ౬౪౧

వ. ఇట్టి మహాఘోరాకారమ్మునఁ గల్పాంతకాలసన్నిభంబును జ్వల
న్మాంసవసామేద “ఛ్ఛాంయ్, ఘూంయ్” ధ్వనిసంకులంబును
నగు నమ్మహాశ్మశానంబున కరిగి యూహించుచుండ, ౬౪౨

చ. వెనుకటిరాజ్యమున్ సుతుఁడుభృత్యులుమంత్రులుభార్యయుందలం
పునఁ బొడకట్టఁ దన్మయతఁ బొందిధృతిం గనలేక “ప్రేయసీ!
నను విడనాడితే? కులమ, న న్నెడచేసితె? పుత్రకా, ననుం
గనుఁగొనరావుగా?” యని యఖండగతిన్ విలపించు ఖిన్నుఁడై.

క. కోపనుఁడగు నావిప్రుని
పాపున మీ రెట్టిపాట్లు వడుచుంటిరో? మీ

యాపదలు నే నెఱుఁగ నా
యాపత్తును మీకు నెఱుఁగ నయ్యెడినె కటా. ౬౪౪

—* హరిశ్చంద్రుండు శ్మశానమ్మున నుండుట *—

క. అని చింతించుచు ధర్మం
బును దప్పిన నరుఁడు శుభము వొందఁడు యత్నం
బున నది రక్షించిన స
జ్జనునకు సుఖమును యశంబు సమకూరు నొగిన్.

వ. కావున నెప్పాటనేని ధర్మరక్షణంబు కర్జంబని తనకు వీరబాహుం
డాజ్ఞాపించిన చందమ్మున వచ్చుశవమ్ములఁ గనుంగొనుచుఁ దత్త
న్మూల్యగ్రహణంబున కటు నిటు నరుగుచుఁ దత్తత్కృత్యమ్ముల
జాగరూకుండై రజోదిగ్ధసర్వాంగుండై మెలఁగుచు, ౬౪౬

ఉ. ఈ శవమూలమై మనకు నింతధనం బొడఁగూడె మీఁద నా
యా శవకారణమ్మున శతాధిక మూల్యము వచ్చు దీన భూ
మీశున కింత, యింత మనయేలిక మాలని, కింత నా కటం
చాశమెయిన్ జరించు నొకఁడై ధృతజీర్ణపటైకకంథుఁడై. ౬౪౭

క. నానాశవౌదనాదన
దూనానూనక్షుధార్తితోఁ దన్మాల్యా
ధానశిరస్కుఁడుఁ దద్భ
స్మానుగతాంగుండు నగుచు నవనిపుఁ డచటన్. ౬౪౮

చ. పవలును రాత్రియున్ నిదురఁబాసి వసాదికలిప్తపాణియై
శవములరాక చూచుచు నిషక్తవిలోచనుఁడై శ్వపాకజా
తి వలుకురీతిఁ బల్కుచు మదిన్ మఱియొండు నెఱుంగ కొక్కయేఁ
డవశత నిట్లు పుచ్చె, నదియూ శతవర్షసమంబు పార్థివా. ౬౪౯

వ. అంత నొక్కనాఁడు రోహితుండు సవయస్కులగు విప్రబాలురం
గూడి పురమ్మున కనతిదూరమ్మున కేగి యచ్చటఁ గొండొక
క్రీడించి రాఁబోవువాఁడు ముందట. ౬౫౦

గీ. అల్పమూలమ్ములును మఱి యగ్రిసహిత
ములును గోమలములును దర్భలను జూచి
యాయ్యనకు నివి యుక్తమ్ము లనుచుఁ గట్ట
కట్టి సమిధాదికమ్ములు దొట్టి భక్తి. ౬౫౧

వ. ఇట్లు తన యేలిక యగు విప్రవరుఁ గూర్చువాఁడై పాలాశాది
కాష్ఠమ్ములంతోఁ గట్టిన మోపొకటి శిరమ్మున నిడికొని భారం
బైనయెడ దింపికొని ఖేదంబు నొందుచు జలంబు సంప్రాప్తం
బైనఁ ద్రావుచు వచ్చునెడ నొక్క వల్మీకమ్మునఁ గాష్ఠభారంబు
దింపి మరల నెత్తికొనునంత విశ్వామిత్రప్రేరితంబై యొక్క
సర్పం బతిఘోరవిషదూషితం బవ్వల్మీకంబు నిర్గమించి, ౬౫౨

క. ఆ నృపసుతునిం గఱచిన
మేనెఱుఁగక పడియెఁ దోడ మొలఁగడి బాలుర్
దీనులయి వేగ చని రా
ణ్మానుజజననిఁ గాంచి కొంత శోకముఁ గదురన్. ౬౫౩

ఆ. వె. వినుము విప్రదాసి! తనయంత నీసుతుఁ
డరుగుదెంచె నాటలాడ నెంచి
యచటఁ బాము గఱచె నంతట భీతిల్లి
వచ్చినార మిటకు వార్తఁ దెలుప. ౬౫౪

క. అను పలుకు వజ్రపాతం
బున కెనయై రాజపత్ని పొరిఁబొరి మూర్ఛన్

బనుపడి నఱికిన కదళీ
ఘనతరువుంబోలెఁ బడియెఁ గష్టముపాలై. ౬౫౫

వ. అంత నవ్విప్రుం డరుదెంచి శీతలోదకంబు చల్లిన లబ్ధసంజ్ఞయై విలపించు నా శైబ్యాంగని యతం డిట్లను. ౬౫౬

ఆ. వె. ఈప్రదోషవేళ నేడ్చుట లక్ష్మీకరంబు గాదనుచుఁ గరంబు నెఱిఁగి
నా గృహమ్మునందు నాతిరో ! యేడ్చెదు
సిగ్గులేదె యిదియుఁ జెప్పవలెనె. ౬౫౭

వ. అని నిష్ఠురుండై తన్నుం దిట్టు నవ్విప్రుని కుత్తరం బీనేరక తన్మయచిత్తయై, ౬౫౮

క. కన్నీరు కాల్వగట్టఁగఁ
దన్నెఱుఁగక కరుణ మొలయఁ దగ్గియు శోకా
భ్యున్నతి నెలుఁగెత్తుచు నే
డ్చె న్నందనుఁ దలఁచి "యెంత చేసితి" వనుచున్.

—* శైబ్య పుత్రిమృతికి శోకించుట *—

వ. ఇట్లు వికీర్ణకేశియై యొడలెఱుఁగక మిన్ను మన్ను నొక్కటిగా నొఱలుచున్న రాజపత్నికి దుర్మార్గుండు పాఱుం డిట్లను. ౬౬౦

క. ధనము తగినంత యిచ్చితి
నినుఁ దెచ్చితి నింటిపనికి నీవీగతి న
న్నును మోసపుత్తె ? దాసికిఁ
జనునే యీరీతి ? నిన్నుఁ జంపెద మొండీ ! ౬౬౧

వ. అని తన్నుఁగొట్ట నుంకించు నక్కఠినాత్మున కారాజపత్ని మహాత్మా! నన్నుంగొట్టకుము నాసుతుండు సర్పదష్టుండై మృతుండయ్యె. ౬౬౨

క. కరుణించి యాజ్ఞ యిచ్చిన
నరిగెద నాపట్టి నాకులాభరణము తా
నురగవిషమ్మున నెచ్చట
మరణము గనె నటకు; నన్ను మన్నింపు మొగిన్. ౬౬౩

క. ఇఁక నీజన్మమునకుఁ బు
త్రకుమోహముం జూచు భాగ్యదశ గల్గదు నేఁ
టికి ఋణము తీఱె నొక్కిం
త కరుణ నన్నటకుఁ బాపఁ దగదె మహాత్మా. ౬౬౪

వ. అని కన్నీరు వఱ్ఱుగా రోదనంబొనర్చు నమ్మానినికిఁ గ్రుద్ధుండై వృద్ధుం డిట్లను. ౬౬౫

గీ. ఓసి దుర్మార్గురాల! నాదాసివయ్యు
నింటిపనులను డించి నీ వేగితేని
యెవఁడు నీతాత యిప్పని నెల్లఁ జేయు
స్వామికార్యవిఘాతంబు సలుపనగునె. ౬౬౬

వ. ఎవ్వండేని వేతనంబుగొని స్వామికార్యంబొనర్పఁ డవ్వాఁడు మహారౌరవనరకమ్మునం బడి యొక్కకల్పంబుండి పదంపడి కుక్కుటంబై జనియించు. ౬౬౭

గీ. ఐన నాకేల నీయెడ నఖిలధర్మ
ములును వమ్మగ వచియింప, మూర్ఖులందు
నీచులందును వ్యర్థమై నెగడు నీతి
చౌటనేలను బడ్డ బీజంబు పగిది. ౬౬౮

వ. నీ కించుకేనిఁ బరలోకభయంబు గలదేని వచ్చి యింటి కార్య
మ్ములు చక్కఁబెట్టుమని నిష్ఠురమ్ముగఁ బల్కునద్ధరాసురున
కమ్మగువ వేపమాన యగుచు నిట్లను. ౬౬౯

క. ఒకయింతలోన మృతపు
త్రికుదేహము చూచివత్తుఁ దడయక నాపై
సకరుణదృష్టిం జొనుపు ము
పకృతిం బొనరింపు మింత పాటిగ నేనిన్. ౬౭౦

వ. అని చరణమ్ములం బడి యతికరుణమ్ముగ నేడ్చు నమ్మగువం గని
కోపోద్రేకమ్మున నతం డిట్లను. ౬౭౧

గీ. కొడుకు చచ్చిన నూ కేటిగొడవ ? యింటి
పనులు తక్కక చేయుము గానము గలిగి
కానిచో మత్కశాఘాత మూని నీఁపు
బ్రద్దలగు మున్నెఱుఁగవే పడఁతి నన్ను. ౬౭౨

వ. అని పుయిలోడక పల్కునప్పాపాత్మునకు మాఱాడక ధైర్యా
బవలంబించి తత్తద్గృహకృత్యమ్ము లొనర్చి పాదసంవాహన
మ్మొనరించునంతకు నర్ధరాత్రంబు గతించెఁ, బిమ్మట నాపె కాతఁ
డిట్లను. ౬౭౩

క. ఇఁకఁ జనుము నీదుపుత్రకు
నకు దాహాదికము వే యొనర్చి గృహమునొ
ద్దకుఁ బ్రొద్దువొడుచునాయిం
తకుఁ బను లొనరింప రమ్ము తడసెదు సుమ్మీ. ౬౭౪

వ. ఇట్లు తదనుజ్ఞాతయై యేకాకినియై విలపించుచు యూథభ్రష్ట
యగు కురంగివడువున వత్సరహితయగు గోవు విధమున నరిగి

పురమ్మునకు నవ్వుల ననతిదూరమ్మున నొక్కెడ మృతుండై పడి
యున్న పుత్త్రుంగని హాహానినదమ్ము దనర దరికేగుచు, ౬౭౫

గీ. ప్రతిదినమ్మును నెదురేగువాఁడ విప్పు
డేల రా ? వింత కోపింప నేల నీకు,
"నంబ" ! యని పిల్వరాదె నాయన్న ? యనుచుఁ
దొట్రుపాటొప్ప నేగి సుతుపయిఁ బడియె. ౬౭౬

వ. అట్లు పడి మూర్ఛిల్లి కొంతవడికిఁ దెలిసి బాష్పమ్ము లొలుకుచు
నబ్బాలకుని బాహువులంబట్టి కౌఁగిలించుకొనుచు నతనిమోమున
మోమిడుచుఁ గరమ్ములచే నురమ్మును శిరమ్మును మోఁదుకొనుచు,

క. హాపుత్రా ! హాపుత్రా !
హాపుత్రా ! యనుచు మిగుల నార్తస్వనయై
యాపడఁతి యడలి యెంతయు
వాపోవఁ దొడంగెఁ దీర్చువారలు లేమిన్. ౬౭౮

వ. పదంపడి పతిం దలంచికొని, ౬౭౯

క. ఓనరపాలక ! నీసుతుఁ
డీనాఁటికి నిట్టు లాయె నిప్పుడ చనుదే
వే, నేఁడు దక్కినన్ నీ
సూనుని వక్త్రంబు మరలఁ జూడం గలవే. ౬౮౦

వ. అని వెండియుఁ బరిపూర్ణరాకాసుధాకరుం గ్రిందుపఱచు నబ్బా
లుని మొగమ్ము జీవితభ్రాంతిం జూచి యట్లుగామికి మరలఁ
బెచ్చుపెరుఁగు దుఃఖాతిరేకమ్మున మూర్ఛితయై కొంతవడికిఁ
దెలిసి యబ్బాలునిమొగమ్ము కరమ్మునం దిడికొని యిట్లను.

చ. శయనమునుండి లెమ్మిది నిశాసమయం బిటఁ బ్రేతభూతసం
చయము చరించుచుండెఁ బెలుచం గడునార్చుచునుండె నక్కలు

య్యామొ! నినువీడి మిత్రులు రయమ్మున నిండ్లకు నేగిరయ్య! ని
ర్భయమున నీకు నిట్లునికిఁ బాడియఁటయ్య! నృపాలపుత్రకా!

క. వే యనురాగమ్మున లే
వే! యను మన విప్రునింటికేగన్వలె రా
వే! యనుఁ దల్లిని విడిచెద
వే! యనుఁ బ్రీతివచన మొసఁగవే! యను నార్తిన్.

ఉ. తల్లిని గాన వేమి? ననుఁ దక్కరులంబలెఁ జూడనేల? నా
యుల్లము చల్లఁజేయుటకు నుద్భవ మంది యనాదరింతె? సం
పల్లవమేని లేక పురిఁ బాసియు నొక్కనియింట దాసినై
చెల్లియు నిన్నుఁ జూచికొని జీవము దాల్చితిఁగాదె పుత్రకా.

ఉ. ఆయువు దీర్ఘమై పృథివి కంతకు నేలిక వై నిరంతర
శ్రీయును విద్యయున్ యశముఁ జేపయు నీఁగియు విప్రపూజయున్
బాయక తల్లిదండ్రులకు భక్తుఁడవై యితఁడొప్పుఁ బుత్రపౌ
త్రాయతి నంచుఁ బుట్టినపు డగ్రజులాడుట కల్లయే సుతా.

గీ. చక్రమత్స్యాదిరేఖలు స్వస్తికధ్వ
జాదిరేఖలు నీదు కరాంబుజమున
నాయురారోగ్యదంబులై యలరు నవియు
వమ్ముచేసితె నాదుపాపమ్ము కతన. ౬౮౬

శా. నీ రాజ్యమ్మును నీ ధనంబు మఱియున్ నీ మంత్రులున్ నీదు ది
వ్యారామమ్ములు నీదుహర్మ్యములు నీదౌ నాతపత్రంబు సు
శ్రీ రంజిల్లెడి నీ హయమ్ములు కరుల్ సింహాసనంబేడ న
య్యా రాజేంద్ర! సమస్తమున్విడిచి నీవాలోకమున్ జేరితే.

వ. అని మఱియును బలి నుద్దేశించి వారని దుఃఖమ్మున, ౬౮౮

సీ. కుంకుమాదికమునఁ గొమరారు నీవక్ష
మతిబాల్యమున నెవ్వఁ డాత్మదేహ
సంగతమాలిన్యసంగతిచేఁ బంకి
లంబుగాఁ జేయు, ఫాలమ్మునందు
మృగనాభిపంకంబు మెదపితీర్చిన తిల
కంబును జూచి యంకస్థుఁడగుచు
నెవ్వఁ డద్దానిని నవ్వుచుఁ దుడుచు, నిం
కెవ్వని మొగము నా కెల్లవేళ
గీ. మృత్సమాకులమయ్యును మేల్మి ముద్దు
వచ్చు, నీ యా తనూజుఁ డివ్విధమున మృతి
చెందె నాయీ మొగం బరవిందతుల్య
మయ్యు నీఁగలకును నెలవయ్యె సధవ. ౬౮౯

గీ. దైవమా! పూర్వభవమున దారుణమగు
కృత్య మెయ్యది చేసితిఁ? గీడు లిట్టు
లే కతమ్మున నాకబ్బె? నేరికేని
గీడులును మేలు లనునవి కేవలములె! ౬౯౦

క. హా పుత్త్ర! హా కుమారక!
హా పుణ్యనిధాన! హా మహారాజతనూ
జా! పాపాత్మక యిది యని
యీ పాటన్ విడిచిపోతివే యలుకమెయిన్. ౬౯౧

—* తలవరులు శైబ్యం గట్టి తీసికొనిపోవుట *—

వ. అని సారెసారెకుఁ జింతిల్లుచు నెలుఁగెత్తి మహాఘోరమ్మగ
రోదనం బొనర్చుచున్న యా పతివ్రతకడకు నారెకు లేతెంచి
నీ వెవ్వ తెవు? పతి యెయ్యెడ కరిగె? నిట్టి నిశీథసమయమ్మున

నొంటిపాటున నిప్పాట శోకింప నేమికత? మ్మని యడిగిన దుఃఖార్ణవమగ్నయగు నా రాజపత్ని నిరుత్తరయై యెప్పటి యట్ల శోకించుచుండె నంత వారలు సంశయగ్రస్తులై, ౬౯౨

క. స్త్రీ గాదు బాలఘాతిని
నాఁగాఁదగు నెంత పిల్చినన్ బలుకమికిన్
మూగయె? యిబ్బాలకు నెం
దేఁ గొని భక్షింప నిటకు నేతెంచెనొకో. ౬౯3

వ. అని తత్తఱమ్మున దాదవ్వల కరిగి ధృతశస్త్రపాణులై యియ్యది యెద్దియేని నొకఖేచరి గావలయు నట్లగుటం జేసి మనకు వధ్య యని యందఱు నొక్కపెట్టన వచ్చి యంటంగట్టి కేశభారంబు వట్టికొని చాండాలవాటికకుఁ దీసికొనిపోయి యియ్యది బాల ఘాతినియగు ఖేచరి గావున వధింపు మన వాఁడేతెంచి కాంచి వారల కిట్లను. ౬౯౪

చ. అనయము నిప్పురిం గలుగు నర్భకులం దినుచున్న దొక్క ఘా
తిని యని విందు నెప్పుడును దీనిఁ గనుంగొనఁ నేరనైతి నే
ర్పున నిటు కట్టి తెచ్చితిరి భూరియశమ్మగు మీకుఁ బట్టణం
బునకు సుఖమ్ము గల్గు నిది పుట్టిన బాలుర నెల్లఁ జంపెడిన్.

చ. వెలుచనఁ గొంపలం దగులఁబెట్టెడివానిని దారిఁగొట్టు దు
ష్కలుషుని విప్రులన్ శిశులఁ గాంతలఁ జంపెడివాని మేటియో
గ్యుల నెదిరించువానిఁ గలుఁగొ్రలెడి దుర్మదు దేశికాంగనన్
గలసినవానిఁ జంపుట నికామమహాసుకృతప్రదంబగున్. ౬౯౬

వ. ఇట్టి కార్యమ్ము లొనర్చువాఁడు బ్రాహ్మణుం డనియు నంగన యనియుం జూడక వధ్యులని చెప్పి యతికోపమ్మునం బట్టి కొట్టి కెలననున్న తన యనుచరు హరిశ్చంద్రుం బిలిచి యిట్లను.

క. ఇయ్యది బాలురఁ జంపెడి
దయ్యము స్త్రీ యంచు లోనఁ దలఁపకు మింకన్
జయ్యనఁ గడతేర్పుము మే
లయ్యెడు లోకమున కనుడు నానరవరుఁడున్. ౯౮

గీ. వజ్రపాతోపమమ్ము నప్పలుకు విని మ
హాత్మ ! యింకెట్టియేనియు నాజ్ఞ యిమ్ము
శక్య మేనియు నయ్యది సలుప నేస్తు
నకట ! స్త్రీహత్యఁజేయఁ జేయాడు టెట్లు. ౯౯

క. అనప్పుడుఁ జాండాలుం డను
నచుచర యని కేలఁ గొని భయంపడ కిద్దా
నినిఁ దునింపుము పుణ్యంబగుఁ
జనునే ? శిశుఘాతసేయు చాన క్షమింపన్. ౨౦౦

వ. నానృపు నృపాలుం డిట్లను. ౨౦౧

క. వనితల యత్నమ్మునఁ గా
వనగున్ బురుషుండు జ్ఞానవశమున నజ్ఞా
ననియతిఁ జాపినదురాత్మ
గ్గునకున్ నరకమ్ము గల్గు సూక్ష్మిగననుడన్. ౨౦౨

క. ఒకపాపము వలనన్ జగ
మకలంకత్వమునఁ బొదలునప్పుడు లోకా
పకృతిస్వభావ దుష్టా
త్మక దీని న్నఱుక వలవదే ? సుకృతార్థుల్. ౨౦౩

వ. ఇయ్యది యనేకుల బాలుర వధియించె నిద్దానిం జంపుట యావ
శ్యకం బాయుధంబు కైకొను మనుడు నాతం డిట్లను. ౨౦౪

క. చాండాలరాజ! నాకుం
గొండికతనమాది యింతకుం బొలఁతుకలన్
ఖండింప ననుచు వ్రతమి
ట్లుండఁగ నన్నిందుఁ జొనుపు టుచితంబగునే. ౨౦౮

చ. అనవుడు స్వామికార్యమున కడ్డముచెప్పుటకన్న దోస ముం
డునె? మఱియొండు; నాపనికిటుల్ ప్రతిచెప్పెదె? యిట్టిద్రోహముం
బొనరుచు నీకు నారకసముద్ధృతి యెన్నఁటికేనిఁ గల్గ నే
ర్చునె? తగువేతనంబు గొని ద్రోహము సేసెదె దుష్టబుద్ధివై.

చ. అన నరపాలకుండను మహాత్మ! జగమ్మున నీకు శత్రుఁ డుం
డిన ననుఁ బంపు మిందుఁ గడిందిబలమ్మునఁ దోడు వచ్చినన్
దునిమెద వాని నొక్క పెనుతూపున; మేదినికెల్ల నిన్ను నా
థునిఁగ నొనర్తు నియ్యబలఁ ద్రుంచుట నాపని గాదు నావుడున్.

ఉ. 'కూలికివచ్చి పాలికిటు కూయఁగ' వచ్చునె? న్యాయమేది; చాం
డాలునియింట దాసుఁడు హుటాహుటి శూరులపల్కు లాడఁగాఁ
బోలునె? చాలుఁ జాలు నని పూని కరమ్మున నడ్డుచెప్ప కీ
బాలకహంతిశీర్షము చివాలునఁ ద్రుంపుము నిర్దయాత్మతన్.

వ. అని ఖడ్గం బొసంగుటయు స్వామికార్యార్థి గావునఁ గైకొని దగ్గఱ జని యన్యోన్యజ్ఞానంబు లేమి నాపె కిట్లను. ౨౦౯

క. ఓవనిత! నాదు హస్తము
చేవం గడలుకొను నేని శీర్షచ్ఛేదం
బేవడిఁ జేసెదనని స
ద్భావుం డవ్వనితఁ జంపఁ దత్పరుఁ డగుడున్. ౨౧౦

చ. తనమరణంబు నెమ్మదిని దద్దయుఁ గోరుచుఁ బుత్రశోక మా
ర్తి నిగుడఁజేయ నిట్టులను దీనత దోఁపగ, నో శ్వపాక! నా

తనయుఁడు ద్రెళ్ళె నక్కెలనఁ దత్తనువున్నది దానిఁదెచ్చి నీ
పనుపున నిమ్మెయిన్ జితను బన్ని దహించెదఁ దాళుమంతకున్.

వ. నావుడు హరిశ్చంద్రుండుధర్మాత్ముండు గావున "నట్ల యొనర్పుము పోయి ర" మ్మని యాజ్ఞ యిచ్చిన, హాపుత్రా! హాబాలక! హా తనూజ! యని మాటిమాటికిఁ గుందుచు నరిగి యబ్బాలకుం దెచ్చి శ్మశానమ్మున నునిచి యాక్రోశించుదానిఁ బాంసుధ్వస్త శిరోరుహ నతిమలినఁ గృశాంగి జన్మాంతరసంగతనాఁ దగుదాని నప్పరమపతివ్రత నాత్మపత్నిగాఁ జిరవిరహాసంగతుండగు కతన నెఱుఁగక యా నృపేంద్రుండు కెలని కరిగి శవమ్మున నున్న వస్త్రమ్ము లాగికొనుటయు నయ్యదియు నగ్నిమ్మున నున్న యతని నతికృశాంగు నన్యరూపు నాత్మధవునిఁగా నెఱుఁగదయ్యె.

క. అంకమున బాలు నిడికొని
కొంకుచుఁ బలుమాఱు దలఁచికొని యేడ్చుచు న
ప్పంకజముఖి దరి కరిగిన
జంకె హరిశ్చంద్రు మనము సంశయహతమై. ౭౦౩

—* హరిశ్చంద్రుండు తనపత్ని నెఱుంగుట *—

సీ. చంద్రునిఁ గాదనఁజాలు వక్త్రముసొంపు
గండముల్ దర్పణఖండములగుఁ
గుంచితాగ్రమ్ములు కోమలములు నీల
ములు దీర్ఘములు పెన్నెఱులు దలాపఁ
గనులు రాజీవముల్, ఘనబాహులున్న తాం
సములు, వక్షము విశాల, మధరంబు
బింబమ్ము, పాదముల్ పృథులము, లంగుళుల్
సూక్ష్మముల్, నాభి యసూక్ష్మబిలము

గీ. మఱియు లక్షణముల నీఁడు మానవేంద్రు
నింటఁ బుట్టినకొడుకగు నింతనిజము
కాలవశమున నిట్టి దుర్గతికిఁ బాలు
వడియె నదిదాఁట లేఁడుగా బమ్మ్రమైన. ౨౧౪

వ. అని కొండొక విచారించి పునఃపునరాలోకనం బొనర్చుచుఁ గ్రమక్రమమ్మున, ౨౧౫

చ. వెనుకటి రీతులెల్ల స్మృతివీథిఁ దగుల్కొని చేరవచ్చి నం
దనుఁ డని నిశ్చయించి పరితాపము పట్టఁగలేక పుత్రకా!
యని విలపించుఁ గన్నుఁగవ నశ్రులు కాల్వలు గట్ట "నాతనూ
జునకె తటస్థ మాయె నిటు శోకము నెట్లు భరింతు నక్కటా."

వ. అని పలుతెఱంగుల శోకించు నజ్జనపాలుని భర్తగా శంకించి శైబ్య యిట్లను, మహాత్మా! నీకియ్యెడ నిట్టిదుష్కార్యమ్మున నుండు టెట్లు కలిగె మ మ్మెట్లు మఱచితి వనుచు దుఃఖావేశమ్మున విధి నుద్దేశించి, ౨౧౭

క. ఓవిధి! యేవిధిఁ జేసితి?
భూవిభునిఁ ద్రిశంకుపుత్త్రుఁ బూతచరిత్రున్
శ్రీ వెలువరించి సుతభా
ర్యావిక్రయమునకుఁ జొనిపి యంత్యజకులుఁగాన్. ౨౧౮

వ. అను నాకె నాత్మపత్నిగా నిశ్చయించి యీదుఃఖ మంతయు విధిప్రేరితంబై నాకైవచ్చిన యది యని వగచుచు, ౨౧౯

క. ఈ తరుణి నాతలోదరి
నాతనయుం డీశవంబు నా పాపము యీ
యాతనకు హేతువని సం
జాతార్తిన్ మూర్ఛఁబొందె జనవరుఁ డంతన్. ౨౨౦

వ. రాజపత్నియుఁ దనపతిదురవస్థచే ద్విగుణితశోకయై మూర్ఛిల్లె
నంతఁ గొంతవడికిఁ దెలిసి నరపాలుండు పుత్త్రుఁజూచి యిట్లు
విలపించు. ౭౨౧

క. అన్నా! దీనంబై కడుఁ
జెన్నుదఱిఁగి యున్న నీదు చిన్నిమొగము గ
న్గొన్నంత మన్మనము పగు
ల న్నేరకయుండె నిది శిలయొ వజ్రంబో. ౭౨౨

ఉ. హా సుత! హా కుమార! తనయా! వినయాకర! "తాత తాత" యం
చాసమెయిన్ ననుం బిలుచు నస్మదదృష్టము! యేమిదోసముం
జేసితినోయి! నన్నుఁగని చెచ్చెర మున్వలె వచ్చి మేనిపై
భాసిలుపంక మంటుగతిఁ బ్రాకికొనంగదవోయి నవ్వుచున్.

మ. అకటా రాజ్యము బంధుసంతతియు ద్రవ్యౌఘముఁ జాండాలవా
టికి నే తెంచితి వల్లకాటి నిటు లొంటిన్ వాసముం జేసి సే
వకవృత్తిన్ మనుచుంటి నియ్యదియు దైవం బోర్వఁగాలేక పు
త్త్రక! పాముం గఱపించెనే నిను? ససాధ్యంబెద్ది యద్ధాతకున్.

క. ఘోరవిషవహ్నిఁ బంచత
గూరిననినుఁ గనులఁజూడఁగూడెనె నా కం
చారాజర్షి విచారా
ధీరుండై యక్కుఁ జేర్చె తెగనివగ సుతున్. ౭౨౫

క. మృతసుతుఁ గౌఁగిట నిడుకొని
సుత సుత సుత యనుచు నెగడు శోకభరమునన్
స్మృతిచెడి మూర్ఛితుఁడై పడె
సుతశోకముకన్న నొండు శోకంబున్నే. ౭౨౬

వ. ఇట్లు తేఁకువ సెడి మూర్ఛితుండై పడియున్ననరపాలు నీక్షించి
శైబ్య సర్వలక్షణమ్ముల నీతఁడు విద్వజ్జనమనశ్చంద్రుఁడగు
హరిశ్చంద్రుఁడకా నిశ్చయింప నగు నని వెండియు, ౨౨౮

ఉ. ఉన్నతమై తిలప్రసవమో ! యన నొప్పెడి నాసతీరు, సం
పన్నళినాక్షికిం దగిన వక్త్రము, చారురదాళిసౌరు, పే
రెన్నిక నొప్పు వాక్పటిమ మిన్నిటికిం బయివచ్చు నీతఁ డా
సన్నరనాథుఁ డెవ్వని యుదారయశంబు త్రిలోకపూజ్యమౌ.

గీ. ఆ హరిశ్చంద్రుఁ డీతండ యైన నీ శ్మ
శానమున నుండు టేలొకో ! సత్యసంధుఁ
డనుచు సుతశోక ముడిగి యయ్యతివ సంత
సమును విస్మయదైన్యముల్ సనఁగఁ జూచె. ౨౨౯

గీ. భర్తృపుత్త్రశోకమ్ముల భార మెక్కు
డై సహింపఁగరాని నయ్యతివమిన్న
మూర్ఛపడి కొంతవడి లేచి మొనయునంత
మరల నరనాథుపై దృష్టి మాసరముగ. ౨౩౦

చ. నిలిపి ‘ నృపాల ! యొంతకును నింద్యుఁడ కాఁడె విధాత వానికిం
గలదె జుగుప్సయుఁ దయయుఁగార్యమకార్యమునాఁగ నక్కటా!
యిల సకలంబు ధర్మగతి నేలెడి దేవసమాను నిన్ను వం
తల కెఱచేసి మాలనికి దాసునిఁ జేయునె కీర్తిరోయునే. ౨౩౧

గీ. రాజ్య మెడచేసి పుత్త్రదారక్రియంబు
నకుఁ జొనిపి యంతఁబోక యంత్యకులుఁగా నొ
నర్చియును నీడఁబోవఁడు నాథ ! యేమి
తప్పొనర్చితి వవ్విధాతయెడ నీవు. ౨౩౨

మ. అకటా ! యియ్యెడఁ గానరావుకద నీచా నాతపత్రంబు, ల
చ్చికిఁదానై రతనంపుఁ గూర్పుగల నీ సింహాసనంబుల్, యశః
ప్రకటంబైతగు చామరద్వయము, పార్శ్వస్థాయి మంత్ర్యాది సే
వక బృందమును, మంగళధ్వనులు, దివ్యద్వాజి సంఘంబులుల్.

శా. ఏ నీ వేగెడివేళ రాజమణులుల్ భృత్యత్వముంబూని ముం
దై నేర్పొప్పఁగ నాత్మవస్త్రముల రథ్యాపాంసుసంశుద్ధిసం
ధానంబుం బొనరింతు రిట్టి ధరణీనాథుండవై నీవు నీ
కౌనే దుర్భగమా శ్మశానమున నిట్లావాసముల్ జేయఁగల్ !

వ. వెండియుఁ గపాలసంకులంబును ధటీపటనిరస్తరమ్మును మృత
నిర్మాల్యసూత్రాంతర్లగ్న కేశసుదారుణమ్మును వసానిష్పంద
సంశుష్కమహాపటలమండితంబును భస్మాంగారార్ధదగ్ధాస్థిమ
జ్జాసంఘట్టభీషణంబును గృధ్రగోమాయునాదార్తమ్మును బుష్ట
క్షుద్రవిహంగమమ్మును జితాధూమాయతపటలీకృతదిగంత
రంబును గుణపాస్వాదనసంప్రకృష్టనిశాచరంబును నై దూనం
బగు నీ శ్మశానంబున దుఃఖితుండవై యొప్పుంటివని శోకపర
వశమై యతని నాలింగనంబు చేసికొని, ౨౩౧

చ. సరవరమౌళిమానితకసత్పదకీర ! మహీమహేంద్ర ! ము
క్కరణి ఘటించుటల్లఁ గల గానుగదా ? నిజమేని ధర్మత
త్పరునకు నీకు నిట్లయిన ధర్మము తోఁడిక నేరిక ? బుధా
దరు లెవ ? రెవ్వ రార్జవవిధమ్మున నుండెడివార ? లయ్యెడన్.

క. అని యెడగలుగని దుఃఖ
మ్మున నేడ్చెడిదాని కవ్విభుండు తనకు మా
లని దాస్యము గల్గిన మే
టి నిమిత్తము సెప్పె బల్ కడింది వగ దగన్. ౨౩౨

—* చంద్రమతి పుత్రుండు మృతియైన చందము పతికిఁ దెల్పుట *—

చ. ఇటు దనపాటు సెప్పి కడు హెచ్చిన శోకము పేర్మి నార్తిలం
పటుఁడగు ప్రాణనాథునకుఁ బట్టిఁ మృతింగను చందమెల్ల దు
ర్ఘటమగు వంతమొప్పునఁ బరంపరగా వచియించె నాపె యం
తట నృపుఁ డాత్మజాతు వదనమ్మున వస్త్రముఁ ద్రొచ్చి కన్గొనెన్.

వ. తన్మయుండై యేమియు నెఱుఁగక శోకించుచుండె నట్టి భర్తం
గని శైబ్య యిట్లను. ౨౩౯

క. స్వామిద్రోహము సేయకు
మో మానవనాథ! సత్యముడిగెదె? నాపైఁ
బ్రేముడి నెడచేసి శిరం
బీమెయి నఱుకుము విధాత కెదముద మొదవన్. ౨౪౦

చ. అనవిని రాజు మూర్ఛఁగొని యంతన లేచి 'మృగాక్షి! యింతమా
టనఁదగునే? యశక్యకృతి కాదునె చేతులు? నాక కాక యె
వ్వనికిని" నాఁగ నమ్మగువ వల్కెఁ "బుసర్భవమందునిన్ను నా
ఘనునిఁగ నొనర్ప దేవిక నతుల్ పచరించితి నెమ్మనమ్మునన్.

క. ఇంకఁ దడయు నేల సత్యం
బకలంకము గాఁగఁ బ్రేమ మఱఁజేసి శిరం
బొకవ్రేటునఁ దున్నుము మి
న్నక వెనుదీయంగ నేల నరనాథుఁడవై. ౨౪౨

వ. నాపుడు నరపాలుం డఖండంబగు దుఃఖావేశమ్మున మూర్ఛి
తుండై యంతన తెలిసి పుత్రుమొగంబు చుంబించుచు భార్య
కిట్లను. ౨౪౩

ఉ. ఓనలినాక్షి! యింక భువినుండఁగ నోప శరీరధారినై
కానఁ గృశానుసంగతినిఁ గ్రాఁగి పరమ్మున కేగుదెంతు నన్

ప్రాణసమంబుగాఁ గను శ్వపాకునియానతి చెంద కిప్పుడిన్
నేనయి చేయుచో నిచట నిందయు నచ్చట హానియుందగున్.

క. వచ్చియు నీపాపమ్మున
వచ్చెడిజన్మమ్మునన్ శ్వపాకునిదాస్యం
బచ్చువడఁ గాంచు టొప్పునె
విచ్చలవిడి లేనిబ్రతుకు వృథ యెవ్వారికిన్. ౨౪౫

గీ. ఏది యెట్లున, దుఃఖమ్ము నెనయుకంటె
మేనిసంబాధ మొడలుట మేలుకాదె
లేక లేకొక్క రుఁడు పుట్టి లేఁతవయసు
నంద మృతిచెందఁ బాప మేమాచరించె! ౨౪౬

క. కులము నెగడించు నీతం
డలఘుం డని నమ్మియుంటి నకటా! జగదే
కలలితుఁ బుత్రకుఁ బాసియు
నిలపై మనఁగంటినొకని భృత్యుఁడ నగుటన్. ౨౪౭

గీ. లేనిస్వాతంత్ర్యమును బూని లేమ యిప్పుడు
ప్రాణములు వాసి యేగినఁ బరమునందు
వైతరణియందు నసిపత్త్రవనమునందుఁ
గలుగు దుఃఖంబు దీనికిఁ దులయుఁ గాదె. ౨౪౮

చ. లలనరో యెట్టులైనను జ్వలజ్జ్వలనమ్మున మత్క్రమారుతోఁ
గలసి శరీరమున్ విడుతుఁ, గాదని నన్ మరలింప కాజ్ఞ నా
వలన రయమ్మునం గొనుము బ్రాహ్మణునింటికి నేగి దాసివై
యలయక యమ్మహామహునియాజ్ఞ మెలంగుముజాగరూకతన్.

క. దానములు చేసి యగ్న్యా
ధానమ్ము లొనర్చి గురులఁ దనిపితి మేనిన్

మానిని ! మన మూగురకుఁ
దా నగు సంబంధ మమరధామమునందుఁ. ౭౫౦

వ. అట్టి సంబంధ మిఁక నీలోకమున దుర్లభం బదియునుంగాక యెన్నండేని రహస్యమ్మునఁ బరిహాసమ్మునకుఁగా నిన్నవమానించి యుండుదు నయ్యది క్షమింపు మిఁకఁ బునర్దర్శనాకాంక్షిణివై ధర్మమ్మునకుఁ గట్టువడి యవ్విప్రునింట నుండి రాజపత్నినను గర్వమ్మున వారి నవమానింపక యెద్ది పంచినను సలుపుట నీకుఁ బరసాధనంబని బోధించుపతికిఁ బతివ్రత యిట్లను. ౫౭౧

క. నరనాథ నాకమైనన్
నరకం బయినన్ హితంబు నాతికిఁ బతితో
మరణంబు, నేను నిప్పుడ
యరుదెంచెద నీపిఱుంద నవహితమతినై. ౭౫౨

వ. నావుడుఁ బరమపతివ్రతాశిరోమణివగు నీకు నియ్యది యొప్పదే! యిట్లొనర్తువుగాక యని సహగమనం బంగీకరించి చిత నేర్పఱచి యందు సుతకళేబరం బమర్చి భార్యాసహితుండై యంజలి ఘటించి పరమేశ్వరియు శతాక్షియు జగదీశ్వరియుఁ బాంచకోశాంతరగతయుఁ బుచ్ఛబ్రహ్మస్వరూపిణియు రక్తాంబరపరీధానయుఁ గరుణారససాగరయు నానాయుధధరయు జగత్పాలనతత్పరయునగు జగదంబ నాత్మం దలంచుచు నగ్నిసంధానం బొనర్చునయ్యెడ, ౭౫౩

—* బ్రహ్మాది దేవతలు ప్రత్యక్షంబగుట. *—

ఉ. వాసవుఁ డాదిగాఁగల సుపర్వ లఖర్వరయం బెలర్ప న
గ్రేసరుఁగాఁగ ధర్ము నిడి ప్రీతిమెయిం బొడసూపి "మేలుమేల్

నీసరివారు లేరు ధరణీధవ! సత్యసహాయ! నాకసం
వాసుల మేము కిన్నరులు వారలు వీరలు సిద్ధచారణుల్. ౨౫౪

వ. అనునంతఁ బితామహుం డిట్లను. ౨౫౫

గీ. ధర్మరూపుఁడ నేను బితామహుండ
వీర లందఱు సురలును జారణులును
గిన్నరులు రుద్రు లశ్వినుల్ నిన్నుఁ జూడ
వచ్చినారు మహారాజ! వైభవమున. ౨౫౬

వ. ఇతండు విశ్వత్రియమైత్రీకారణుండగు విశ్వామిత్రుండు నీకుం
బ్రియం బొనరింప నరుదెంచి యున్నవాఁడు విలోకింపుము. ౨౫౭

గీ. నీ తితిక్షాదిగుణముల నెమ్మి గొలువ
వచ్చితిని ధర్ముఁడను నేను సచ్చరిత్రు
లందు నెవ్వరికెక్కుడై యనఘమూర్తి
వైతి పదునాల్గులోకములందు భూప. ౨౫౮

వ. అంత నింద్రుఁ డిట్లనియె. ౨౫౯

క. వాసవుఁడ నేను నాపైఁ
గై సేయుము కొంతదృష్టి కాంతయు నీవున్
నీసుతుఁడును సుగుణమ్ములఁ
జేసి జగత్త్రియజయమ్ము చేసితిరి నృపా. ౨౬౦

క. కొమరుఁడు నీవును భార్యయు
విమానసంగతుల రగుచు విచ్చేయుఁడు దే
హముతోడ స్వర్గమున కని
యమృతమయం బైనదృష్టి నాతఁడు గురిసెన్. ౨౬౧

గీ. దుందుభులు మ్రోయఁ, బూవులు దొలకరింప,
నచ్చరలు మెచ్చుగా నాడ, నా చితాంత

రమున శయనించియున్న భూరమణపుత్రు
పై నమృతవర్ష మప్పుడు పాదుకొనియె. ౭౬౨

క. సుకుమారంబగు దేహం
బకలంకంబైన వదన మలరఁగ నా రా
జకుమారుఁడు రోహితుఁడు మృ
తికిఁ దక్కి తనంత లేచె దెసలు వెలుంగన్. ౭౬౩

చ. నరపతి పుత్రునింగని మనం బలరం దగఁ గౌఁగిలించి సు
స్థిరుఁడయి భార్యఁజూచి సురసేవ్యములైన యలంకృతుల్ వరాం
బరములుఁ బుష్పమాలికలుఁ బట్టియు భార్యయుఁ దానుఁదాల్చి మే
దురతరమోదవారినిధిదోఁగుచుఁ బూర్ణమనస్కుఁడై తగెన్.

వ. అయ్యెడ నింద్రుం డతని కిట్లను. ౭౬౫

చ. పరమపతివ్రతామణియు భాసురశీలయునైన భార్యతో
నురుగుణుఁడైన పుత్రుకు మహాోత్తము నంకమునందుఁ జేర్చి పూ
ర్వరచితమైన పుణ్యము కరంబు తిరంబుగ నిర్వహింప నె
వ్వరికి నగమ్యమైన త్రిదివమ్మునకీ వరుదెమ్ము భూవరా. ౭౬౬

క. అన సత్యహరిశ్చంద్రుం
డను, దేవాధిప! శ్వపాకు ననుమతి గొని పైఁ
జనుదెంతు నాకు నాతం
డు నియోగము సేయఁదగు ఘనుండు విభుండున్. ౭౬౭

వ. నావుడు ధర్ముం డిట్లనియె. ౭౬౮

గీ. ఓయి నరనాథ! నాదగు మాయకలిమి
నేన చాండాలరూపమ్ము నూనినాఁడ
భావిసంగతి నెఱిఁగి నిన్ బనిగొనంగఁ
బక్కణమ్మున నుంటి నప్పాట నపుడు. ౭౬౯

వ. పిమ్మట నిందుఁ డిట్లను. ౨౨౦

క. రాజాధిరాజ! దినకర
తేజ! హరిశ్చంద్ర! పుణ్యతేజస్వులు వి
భ్రాజితతపముల దేనికి
భాజను లా నాకపదము వడయఁగ రమ్మా. ౨౨౧

చ. అన నరనాథుఁ డిట్లను సురాధిప! మత్పురవాసులెల్ల న
న్నును విడనాడి కుందరె? తనుం గని కొల్చెడివారి వీడువాఁ
డును ద్విజుఁ జంపినట్టి యతఁడుం మధుపాయియు స్త్రీనిహంత గో
హననపరాయణుండుసము లౌట వచించెడిఁగాదె ధర్మముల్.

క. వారలతో స్వర్గము కా
దారయ నరకంబయేని యది గమ్యము నా
కోరాజ! తన్నుఁగొల్చెడి
వారల నేమని త్యజింప వలనగు ననుడుం. ౨౨౩

క. జనవర! పురవాసుల కె
ల్లను స్వర్గ మొసంగుటె ట్లలవడెడి? వారల్
పొనరిచిన పాపపుణ్యము
లన వేఱుగనుండుఁ దుల్య మగునే యెందుం. ౨౨౪

వ. నావుడు రా జిట్లను. ౨౨౫

గీ. వినుము సురనాథ! సేవకజనులకతన
రాజు రాజ్యం బొనర్చు ధర్మములు సేయు
జన్మముల కియ్యకొన్న నిందు సంభవించు
సుకృతము సమంబు నృపతికిఁ బ్రకృతితతికి. ౨౨౬

వ. కావున మదనుష్ఠితంబులగు పుణ్యంబులు వారలకును ననువగు నిది
యిట్లుండ నింకొక్కటి వచింతు నాదగుసుకృతమ్మున బహుకాలో

పభోగ్యంబగు నాకపదంబ వారలం గలసి యొకదిన మనుభవిం
చినం జాలు నట్లగుట మత్సుకృతంబు విభజించి యిట్లొనరించు
టకు నిన్నుఁ బ్రార్థించెద నావుడు నింద్రుం డట్ల యగునని సమ్మ
తించి ప్రసన్నహృదయుండై ధర్మవిశ్వామిత్రాది పురస్సరమ్ముగ
నయోధ్య కరిగి హరిశ్చంద్రు సమక్షమ్మున వారల కిట్లను.

క. శర్మదమై యజ్ఞాదిసు
కర్మము లొనరించువారు గాంచెడి స్వర్గ
మ్మర్మిలి మీకెల్లరకును
ధర్మానుగ్రహముకలిమిఁ దనరారెఁ దగన్. ౨౨౮

వ. కావున నెల్లవారును నరుదెంచునది యనునెడ హరిశ్చంద్రుండు
వారల కిట్లను. ౨౨౯

క. దివమునకు వచ్చుటకు మీ
కెవరెవరికి నిచ్చ వొడము నెల్లరు నాతో
నవిరళగతి రాఁదగు నీ
దివిజాధిపుఁ డట్లు తనమదిం గరుణించెన్. ౨౩౦

—* హరిశ్చంద్రుండు కొడుకునకు రాజ్యంబిడి పౌరులతో స్వర్గమ్మున కరుగుట *—

చ. అను తమ భూపునానతి సురాధిపునానతి యొండుఁగాఁగ బౌ
రనఁ జనుదెంచిరప్డు నగరమ్మున వారలు కొంద ఱా దివం
బునకు విమానమెక్కి తమపుత్త్రులపైఁ దగ నాత్మసంస్మృతిం
జొనిపి మనమ్ము స్వర్గమును జూచెడి వేడ్కల మిన్నుముట్టఁగన్.

వ. హరిశ్చంద్రుఁడు తక్కుంగల బంధుమిత్త్రులను దగు గౌరవమ్ములఁ
దనిపి తన కొమరుండగు రోహితునకు సాధుజనసమ్మతమ్మున
విధివిధానమ్ముగఁ బట్టాభిషేకం బొనర్చి, ౨౩౧

క. తనకాంతామణియును దా
నును స్వర్గమ్మునకుఁ జనిరి నూతనఘంటా
నినదమ్మునఁ బొలుపొందెడి
యనూనపుష్పకము నెక్కి యమరులు వొగడన్. ౭౮౩

వ. అట్లు సత్యనిధియైన హరిశ్చంద్రుండు స్వర్గమ్మున కేగుచుండు నెడ నాలోకించి దివిజకవీంద్రుం డిట్టియర్థముగల శ్లోకంబు పఠియించె.

క. ఎంతటిదానం బెంతటి
శాంతిగుణం బెంతసత్యసంధత తగుఁ దా
నెంతకునైనను నీ భూ
కాంతుఁడు స్వర్గమొక హెచ్చుగా దితనియెడన్. ౭౮౪

మ. జనలోకైక విశుద్ధచర్యుఁడు హరిశ్చంద్రావనీనాథు స
ద్వర్తనముం జెప్పితి దీని భక్తిగరిమన్ దానెవ్వఁడే విన్న ని
మ్మున వాఁడెయ్యదిగోరు నయ్యది సుఖమ్మో రాజ్యమో విద్యయో
ధనమో సంతతియో సురాలయమొ సందర్భించుఁ బారిక్షితా.

క. నావుడు జనమేజయుఁ డో
దేవా! దేవతలకన్నఁ దేజమ్మునఁ బె
ద్దై వెలయు శతాక్షీపద
భావు హరిశ్చంద్రు వింటి భావంబలరన్. ౭౮౬

ఆ. వె. ఈ శతాక్షి యనఁగ నెట్లుదయించె ? నే
తన్మహత్త్వమెట్లు తనరు నాకుఁ
దెలుపు, మెద్ది వినిన యలఘుల కశ్వమే
ధశతఫలము ప్రతిపదమునఁ దొడరు. ౭౮౭

గీ. ఎంత వీటఁడియైనను నెంత పాపి
యైనఁ దానెంత నిర్భాగ్యుఁడైనఁ బావ

నమ్మ శ్రోత్రఘహారి యిహమ్ముఁ బరము
నిచ్చు దేవీచరిత్రపై నిచ్చఁగొనఁడె. ౭౮౯

క. అనవుడు వ్యాసుం డిట్లను
జనమేజయ ! నీకు దాఁపఁజన దెద్దియు స
జ్జనుఁడ వగుకతనఁ దెల్పెద
వినుము శతాక్షీ మహత్త్వవిధ మదియెల్లన్. ౭౯౦

క. దుర్గముఁడను పేర్వాఁడు ని
రర్గళ బాహాప్రతాపుఁ డతిలోకుఁడు దు
ర్మార్గుండు హిరణ్యాక్షుని
వర్గ్యుఁడు రురునికొడుకు వఱలున్ జగతిన్. ౭౯౧

వ. అతండు దేవతలకు బలంబగు వేదమ్ములు హరించిన వారును నశింతురని తలంచి హిమాలయమ్మునకుఁ జని వాయుభక్షుం డగుచు సహస్రవత్సరమ్ములు విరించి గుఱించి తపమ్ముసేయు చున్నంత, ౭౯౨

—* శతాక్షీ మహిమ *—

గీ. క్షోణి యంతయుఁ గంపించెఁ గులమహీధ
రమ్ములు చలించె నతని తేజమ్ముకతన
నంతఁ జతురాననుఁడు ప్రసన్నాననాబ్జుఁ
డగుచు హంసము నెక్కి ప్రత్యక్షుఁడయ్యె. ౭౯౩

వ. ఇట్లెదుటం బొడకట్టి సమాధిగతుండగు నా దుర్గముంగాంచి నీ తపమ్మునకు మెచ్చి భవదభీప్సితంబు నొసంగవచ్చితి నను నలువకు మ్రొక్కి, దేవా ! జగతీసురులయందును సురలయందునుగల వేదమ్ములును మంత్రమ్ములును నా సమీపమ్మున నుంటయు సురలకుఁ బరాజయంబు సేయఁగలుగుటయు నా కనుగ్ర

హింపవేయనిన వల్లెయని యవ్విరించి తననివాసమ్మునకుఁ
జనియె నంత, ౭౯౪

సీ. వేదశాస్త్రమ్ములు విప్రులు మఱచిరి,
స్నానసంధ్యాహోమ జపతపమ్ము
లన్నియు నడఁగె, హాహాకార మవనియం
తయు నిండె, సురలును నాకమందు
యజ్ఞాదికమ్ముల హవ్యమ్ము దొరకమి
సౌఖ్యమ్ము విడనాడి సజరులైరి,
దుర్గముండును రణోద్యుక్తుఁడై పెల్చన
నమరావతీపురి నాక్రమించె,

గీ. వజ్రమయదేహుఁడైన యవ్వానితోడఁ
బోరఁగాలేక యమరులు భూమిధరగు
హాంతరంబులయెడకుఁ బలాయమాను
లైరి శరణమ్ము గానక ప్రాణభీతి. ౭౯౫

వ. ఇట్లు దేవతలు గిరిగుహాంతరనిలయులగుచు జగదంబాఁ గొని
యాడుచున్నంత, ౭౯౬

గీ. జన్మములు మాసి ధర్మంబు సున్నయైన
కతన నూఱేఁడు లేకప్రకారముగ జ
గతి ననావృష్టిదోషంబు గలిగె; దాన
నేళ్ళుఁ జెఱువులు నూతులు నెండిపోయె. ౭౯౭

వ. దానంజేసి పశుపక్షిమృగాదులయందును మనుజులయందును
శవసంగ్రహంబు విస్తరించె, నిట్లు జగదుపద్రవంబు సంభవించినఁ
బదంపడి శాంతచేతస్కులగు కొందఱు విప్రులు హిమాల
యంబు పజ్జకుంజని జగదీశానింగూర్చి సమాధిధ్యానపూజా

యోగమ్ముల నిరాహారులగుచుఁ దదేకాయత్తచిత్తమ్మున నారా
ధించుచు నిట్లు వినుతించిరి. ౨౯౮

గీ. ఓమహేశాని ! యపరాధయుక్తులైన
పామరులయెడ దయలేమి పాడియగునె !
కోప ముపసంహరింపుము, పాపు మీా య
నర్థ మింకెవరు శరణమమ్మ ! మాకు. ౨౯౯

వ. అనంతకోటిబ్రహ్మాండనాయికయుఁ గూటస్థరూపిణియుఁ జిద్రూ
పయు భువనేశ్వరియునగు నీకు నమస్కారము, "నేతినే" తీతి
వాక్యమ్ములచే బోధ్యమానవగుచు సర్వకారణంబవగు నీ కంజలి
ఘటింతు, మైతత్కాలికంబగు దురవస్థంబాపి మమ్ముంగటాక్షిం
పవే! యను వారి యెలుఁగు లాకర్ణించి యప్పరాంబయు
నొక్కెడఁ బ్రత్యక్షంబయ్యె. ౩౦౦

సీ. నీలాంజనముఁ బోలఁజాలు దేహమ్మును
బీనసమోత్తుంగవృత్తకర్క
శపయోధరములును శతనయనంబులు
భాస్కరకోటిప్రభాసమృద్ధి
జగదతీతమ్మగు సౌందర్యమును లవ
ణిమయును గలదాని విమలమధుర
రసయుతక్షుత్తృడ్జరాఘ్నశాలోద్యదన
శాకఫలయుతహస్తములదానిఁ

గీ. జాప పూయుధములును హస్తములఁ దాల్చి
వెల్గుదానిని నప్పరాంబికను జూచి
స్తవ మొనర్చిన నాపినేత్రముల నుండి
వారిధారలు గురిసె నవారితముగ. ౩౦౧

వ. ఇట్లు నవరాత్రిమ్ము లోకక్షభంగి సకలౌషధీజాలసంతర్పకంబగు నేత్రజలాసారంబు వెల్లివిరిసిన దానంజేసి నదనదీనిర్ఘరమ్ము ల నూనమ్ములయ్యె; సురలు గిరిగుహాంతరమ్ములనుండి వెలువడి భూసురులంగలసి యంబిక నిట్లు సన్నుతించిరి. ౧౦౨

సీ. నిత్యసంతృప్తవు నిరుపమనిఖిలాగ
మాంతవేద్యవు భువనాధిపతివి
బ్రహ్మస్వరూపవు భక్తకల్పాగమ
మవు దేవి! నీవ యీభువనమెల్ల
మాయచే సృష్టింతు వే యవతారమై
నను నెత్తుదువు భక్తజనులకొఱకు
నమితలోచనముల నలరారు నీరూప
మంబ! నిర్జరనిమిత్తంబ కాదె

గీ. మెత్రితి శతాక్షి యనుపేర నెసఁగుమింకఁ
దివిరి మా యాగమమ్ములు తెచ్చి యిచ్చి
కరుణఁ జూడుము మమ్ము నాఁకటికిఁ దాళ
లేమి నిన్ను నుతింపఁగ లేము తల్లి. ౧౦౩

వ. అంత నప్పరాంబ తాను దెచ్చిన భోజ్యమ్ము లా సురల కిచ్చి యక్కతమ్మున శాకంభరి యనుపేర నెగడి యిట్లు వారల యుమ్మలికమ్ము వాపెఁ; బదంపడి దుర్గముండును దూతముఖమ్మున నిది యెల్ల నెఱింగి సహస్రాక్షౌహిణీపరిమితసేనాసముపేతుం డగుచు హిమాలయమ్మున కరిగి యద్దేవినికటమ్మున నున్న దేవతల నరికట్టి విప్రులఁ బీడించిన, ౧౦౪

క. ప్రోవుము ప్రోవు మనుచు భూ
దేవత లోకపెట్ట నఱవ దేవియుఁ గరుణా

భావమ్మున నొక ఛత్రము
గా వర్తిలఁజేసె మీఁదుగాఁ జక్రమ్మున్. ౧౦౫

—* శతాక్షి దుర్గముం బరిమార్చుట *—

వ. ఇట్లు బహిస్థిత యగుచు నొక్క శరంబేనియు నవ్వారిపైఁ బడ
కుండ సంరక్షించు నద్దేవికిని దుర్గమునకును శరపరిచ్ఛన్నసూర్య
మండలమ్మును బాణసంఘర్షణసముద్భూతపావకమ్మును గరో
రజ్యారణత్కారబధిరీకృతదశదిశాతటమ్మును నగు ఘోరసంగ
రమ్ము కరమ్ము ప్రవర్తిల్లుటయుఁ దచ్ఛతాక్షీదేహమ్మునుండి
కాళికయు దారిణియు బాలయుఁ ద్రిపురయు భైరవియు రమయు
బగళయు మాతంగియుఁ ద్రిపురసుందరియుఁ గామాక్షియు
జంభినియు మోహినియు మున్నగు ద్వాత్రింశచ్ఛక్తులును నను
పదంబ చతుష్షష్టిశక్తులును బొడమి యసంఖ్యాతప్రకారంబున
నడరి సాయుధహస్తలై మృదంగవీణాశంఖనాదనాదితంబగు
రణాంగణమ్మున విజృంభించి శతాక్షౌహిణీపరిమితంబగు రక్షః
సైన్యమ్ము మాపుమాపుటయు దుర్గముం డక్రోసరుఁడై శక్తు
లతోఁ బదినాళ్లు పోరొనర్చి పదునొకండవనాఁడు, ౧౦౬

సీ. అరుణచందనమును నరుణసరమ్ములు
దాలిచి గొప్ప యుత్సవము చేసి
పెంపారఁ ద్రిజగతీవీరునిగతి విక్ర
మించి శక్తుల నుక్కడంచి సోఁకు
మూఁకలతోడ వీరైకనియత మగు
తేరప్పరమశక్తి తేరి యెదుట
నిల్పిన వారి కనల్పంపుఁ బోరయ్యె
యామద్వయంబు భయప్రదముగ

గీ. రక్కసునిపైఁ బడేను నారసము లేసి
రెంట లోచనములను నాల్గింట గుఱ్ఱ
ములను నొక శరమున ధ్వజమ్మును భుజముల
రెంట సారథిఁ గొట్టె నొక్కంట దేవి. ౫౦౮

వ. తక్కంగల యేనిట నవ్వానివక్షమ్ము చీల్చిన వాఁడును నెత్తురు గ్రక్కుచు నజ్జగదంబ పురోభాగమ్మునం బడియె, నంత వాని కాయమ్మునుండి యొక తేజమ్ము వెడలి యాపెయందు సంక్రమించె.

మ. ఇటు లక్కంటకుఁ ద్రెళ్ల నేసిన జగమ్మెల్లన్ బ్రశాంతత్వసం
ఘటితంబయ్యె సమస్తదేవతలు నోంకారాత్మ! యోదేవి! య
క్కటికం బీదృశ మేరికిం గలదె! దుఃఖగ్రస్తులన్ మేల్మిఁ బ్రో
చుటకంచు న్నుతియించుచున్ గరములన్ జోడించి రొక్కుమ్మడిన్.

వ. ఇట్లు నుతించు హరిహరాదుల కాజగదంబ సంతోషకారిణియై కెలన నంజలి ఘటించియున్న విప్రుల కిట్లనియె. ౫౧౦

క. ఈ నామే నధికమ్ముగ
మానింపం దగిన దేను మాటికిఁ బూజా
గానాదికములఁ గొలిచిన
మానినులకు నిహముఁ బరము మానక యిత్తున్.

గీ. దుర్గముండను రక్కసుతోడఁ బోరఁ
బెక్కుకన్నులతో నుద్భవించి వాని
హతముచేసినకతన శతాక్షి యంచు
దుర్గయంచును నను గొల్వ దొసఁగు లడఁగు. ౫౧౨

క. అని యుపదేశం బొనరిచి
కనుమొఱఁగెన్ దేవి; యిట్టికత విన్నను బ్రా

సినఁ జదివినఁ జదివించిన
జనులకు నా దుర్గయే యొసంగును శుభముల్. ౮౧౩

వ. ఇది పరమరహస్యమ్ముగా గోపనీయంబని నుడువు వ్యాసుం గాంచి జనమేజయుండు పరశక్తిభక్తులగు చంద్రవంశ్యుల చరిత్రమ్ము వినవలతు నావుడు నాతం డిట్లనియె. ౮౧౪

క. అంబిక దయచేత మహా
త్త్వంబుం గొనినట్టి చంద్రవంశ్యుల చారి
త్రంబును వచియించెదఁ ద
త్త్వంబుఁ దగ నిశ్చయించి ధరణీనాథా. ౮౧౫

క. ఎంతయు నూర్జితమును శ్రీ
మంతమ్మును గడు విభూతిమంతమునగు నీ
యంతయు దేవీమయ మా
వంతయుఁ దదితర మొకింత యగుపడ దరయన్. ౮౧౬

వ. సంసారవృక్షమ్మున కప్పరాంబికాపాదసేవనంబు దక్క మఱియొండు కుఠారంబు గానము; ధాన్యార్థియగువాఁ డుముకం ద్యజియించుపగిది నీసర్వంబును బోవిడిచి భువనేశ్వరీపాదమూలంబు సేవించునది యని మఱియును, ౮౧౭

సీ. ప్రాఁబల్కులను నకూపారమ్ము మథియించి
యప్పరశక్తిపాదారవింద
మను రత్న మరసి నే నతిధన్యుఁడ నయితిఁ;
బంచబ్రహ్మాసనయంచు వినుతిఁ
గన్న యప్పరశక్తి కన్న నన్యము గాన,
మైదింటి కన్నను నధికమైన

వస్తు వవ్యక్త, మావస్తువునం దోత
మును బ్రోతమును జగ మనుచుఁ దెలియ

తే. గీ. వలయు, భువనేశ్వరీపదవాచ్యమైన
యప్పదార్థమ్ము దెలియని యజ్ఞు లొందు
వారు దుఃఖంబు, తజ్ఞులు దారసౌఖ్య
భాజనులటంచు నెఱుఁగు మో పార్థివేంద్ర ! ౮౧౮

వ. శ్వేతాశ్వతరశాఖీయులు స్వగుణనిగూఢయగు నాత్మశక్తిని దేవతలు ధ్యానయోగమ్మునం జేసి కాంచిరని నొడివిరి. వేయేల, జన్మసాఫల్యమ్ము కొఱకు సర్వసంగంబు పరిత్యజించి మనమ్మును హృదయమ్మున నిరోధించి లజ్జాభయభక్తులం బెద్దానిచే నైనను దన్నిష్ఠుండగుచుఁ దత్పరత్వంబు గాంచునది యని వేదాంత సిద్ధాంతంబు. ౮౧౯

క. నడుచుచు నిద్రం బోవుచుఁ
గుడుచుచుఁ గూర్చుండుచుఁ సుగుణ సద్దేవిన్
గడుభక్తిఁ గొలుచు నా మ
ర్త్యుఁడెపో ముక్తుండు తదితరుఁడు గాఁడు నృపా. ౮౨౦

వ. కావున విరాడ్రూపయు, సూత్రరూపయు, నంతర్యామిరూపిణియు, బ్రహ్మస్వరూపిణియు, సచ్చిదానందలక్ష్యార్థరూపయుఁ, బ్రపంచోల్లాసవర్జితయునగు నప్పరశక్తిని సక్రమమ్ముగ భజించి ముక్తుండవు కమ్మను వ్యాసునకు జనమేజయుం డిట్లనియె. ౮౨౧

గీ. హరిహరబ్రహ్మలకు మును పంబ రమను
గౌరిని సరస్వతి నొసంగెఁ గానఁ గాఁగ
నంచుఁ జెప్పితి వందుఁ బద్మాలయకును
గౌరికిని నన్యకన్యాత్వఘటన యెట్లు ? ౮౨౨

వ. నావుడు వ్యాసుం డిట్లనియె. ౧౨౩

క. మును హాలాహలనామక
దనుజులు వరజాతమైన దర్పముచే ను
ర్విని దేవలోకములఁ దమ
యనయమ్మున ముట్టడించు నవసర మందున్. ౧౨౪

వ. హరిహరు లిరువురును నఱువదివేల వత్సరమ్ములు సంగరంబొన
రించి రక్కసుల నుక్కడంచి, తమ తావులకుం జని, తమ తమ
శక్తులయొద్దఁ దమతమ పరాక్రమక్రమమ్ముల నుగ్గడించుకొనిన
వారును ననాదరసూచకంబుగ మందహాసం బొనరించుటయు,
నాదిమాయామోహితులగు కతనఁ గనలి వారల దురుత్తరావ
మానితలం జేసిన నాశక్తులు తత్క్షణంబ కనుమొఱఁగి చనుటయుఁ
బదంపడి హరిహరులు శక్తిశూన్యులై తత్తత్కృతులయెడ నస
మర్థులగుడు విరించి కొండొక చింతించి కారణంబరసి హరిహరుల
కార్యంబులు సైతము తాన నిర్వర్తించుచుఁ గొంత కాలమ్ము
గడపి పదపడి మన్వాదులును సనకాదులునునగు తనకొమరులం
దలఁచి మీరు దేవి నారాధించి తత్కరుణాపాత్రులరై హరి
హరులకు మరల శక్తిప్రసాదంబు సంపాదింపుఁడు, నావుడు
వారలును హిమాలయతటమ్మునకుఁ జేరి మాయాబీజంబు
జపించుచు లక్షహాయనంబులు తపమ్మొనర్చునంత, ౧౨౫

—* సనకాదులకు దేవి ప్రత్యక్షంబగుట *—

సీ. వరమిచ్చు కేలు నభయమిచ్చు హస్తంబు
పాశ మంకుశమును బట్టు పంచ
శాఖద్వయమ్మును సచ్చిదానందరూ
పంబును గరుణారసంబు దొరఁగు

లోచనత్రియమును లోనగు లక్షణం
బులు గల్గి తగు సర్వభూతజనని
సాక్షాత్కరించిన సాష్టాంగముగ నమ
స్కారంబు గావించి సకలమునులు

గీ. భక్తి చెన్నార నుతియింప భావుకప్ర
సాదసూచికటాక్షపరిసారగరిమ
జాలువాఱంగ వారి కష్టంబు దీర్పఁ
దలఁచి మధురమ్ముగా నంబ వలికె నిట్లు. ౧౨౬

గీ. మీ తపమ్మున కెద మెచ్చి మీ యభీష్ట
ముల నొసంగఁగ వచ్చితి మునులు! వలయు
వరములను గోరికొనుఁ డన హరిహరులకు
శక్తిలాభమ్ము గోరిరి సకలమునులు. ౧౨౭

వ. అందు నొక్కండగు దక్షుండు విశేషించి తనయందు దేవీజన్మలాభమ్ము సైతము గోరి యప్పురదేవినివాసమ్ములును జపధ్యానాదివిశేషమ్ములును నానతిమ్మని ప్రార్థించుటయు, జనని యిట్లను "మదంశమ్మునం గలిగిన శక్తుల కొలఁది యెఱుంగక యవమానించిన కతన హరిహరుల కీయవస్థ తటస్థించె, నయ్యాదియు భవదీయతపోబలసమాసాదితాస్మదనుగ్రహమ్ము కతన నెడలె" నని చెప్పి వెండియు, ౧౨౮

క. భవదీయగర్భమున శివ
యవతారంబెత్తు, రమ పయస్సింధువు నం
దవతారమెత్తు నిక్కము
భవునకు విష్ణునకు ధర్మపత్నులుగాఁగన్. ౧౨౯

వ. అని మాయాబీజజపమ్ము తనకుఁ బ్రీతికరమనియు, సర్వజగమ్ములును దనకు నివాసమ్మనియు విరాట్స్వరూపంబొండె నియ్యెడ మీకుం బొడకట్టెడి యాకారంబొండె ధ్యేయమ్మనియు, బోధించి యమ్మణిద్వీపవాసిని యంతర్హితయగుడు వారలును గమలాసను పాలికిం జని కలతెఱం గెఱిఁగించిరి. పదంపడి హరిహరులు స్వస్థులై జగజ్జననీకటాక్షభాజనులై రంతఁ గొంతకాలమునకు,

గీ. శక్తి తామసతేజంబు సర్వలోక
హితకరమ్ముగ దక్షుని యింటఁ బొడమె
దేవతలు సంతసించిరి దివ్యపుష్ప
వృష్టి గురిసి ప్రపంచమ్ము వెల్లి విరిసె. ౮౩౧

వ. ఒక్కండ ననేల, యయ్యంబిక యవతరించినకతన యావజ్జగమ్మును శుభమయంబయ్యె, నంత నక్కన్నియకు సతియను పేరిడి యోగ్యకాలమ్మున దక్షుండు శంకరున కిచ్చి పెండ్లిచేసినఁ బదంపడి యయ్యంబిక దైవయోగమ్మున జ్వలజ్జ్వలనదగ్ధశరీర యయ్యె నావుడు జనమేజయుం డిట్లనియె. ౮౩౨

చ. వినఁ గొఱగాని వార్త నెటు వీనులు సూడినభంగి విందు నెం
దును ననవద్యమైన గతిఁ దోఁచెడి వస్తువదేల యగ్నిలోఁ
బెనుపఱె నేజగజ్జనని పేరు స్మరించిన వారికిన్ భవా
గ్ని నిధనమబ్బ దట్టిభవనీరధిపోతము వహ్నిఁ గ్రాఁగునే. ౮౩౩

వ. ఇయ్యది యే కర్మవిపాకమ్మున ఘటించె నొడువు మనుడు వ్యాసుండు రాజేంద్రా! మున్ను దుర్వాసుం డొక్కనాఁడు జాంబూనదేశ్వరీసందర్శనమ్మున కరిగి యయ్యెడ మాయాబీజ జపంబొనరించినఁ బొడకట్టి యద్దేవియు, ౮౩౪

క. నిజకంఠస్థలగతమై
యజహత్పరిమళపరీతమై సతతాళి
వ్రజసేవితమై తగునొక
స్రజముం గరుణించి యిడెఁ బ్రసాదంబనుచున్. ౮౩౫

వ. అతండును వన్మాలిక శిరమ్మున ధరించి యంబరమార్గమ్మున నరుగువాఁడు దక్షు నికటమ్మునకుం జని, యయ్యెడ సతీదేవిం గాంచి వినయవినమితుండై మ్రొక్కెనఁ బిమ్మట దక్షుం డమ్ముని శీర్షమ్మునం దనరు మాలికం గాంచి యీ యసాధారణంబగు మాల్యంబెయ్యెడఁ జేకుఱె నావుడు మునియు నానందాశ్రు లురుల నియ్యది పరదేవీప్రసాదంబని చెప్పెఁ బిదప దక్షుం డయ్యది తన కిమ్మనుడు, ౮౩౬

క. మునివరుఁ డంగీకార
మ్మున దేవీభక్తునకు సముఁడు గాఁ డెవ్వాఁ
డును వాఁడు దేనిఁ గోరినఁ
జను నీ ననియెంచి యొసఁగె స్రజ మాతనికిన్. ౮౩౭

వ. దక్షుం డామాలికం గ్రహించి తన కేళీసదనమ్మునఁ బదిలపఱచి,

క. పదపడి రాతిరి మోహా
స్పదుఁడై తన్మాల్యగంధవర్ధితమోదా
భ్యుదయుండై క్రీడాపర
తఁ దవిలి వర్తించెఁ బేర్మి దళుకొత్తంగన్. ౮౩౮

వ. ఇయ్యపరాధమ్ము కారణమ్ముగ దక్షునికి శివునియందును గూఁతు రగు సతీదేవియందును ద్వేషమ్ము ఘటియించె నని వెండియు,

క. ఇయ్యది కారణమున న
త్తొయ్యలి తజ్జన్యమైన తొల్లిటి కాయం

బొయ్యన యోగాగ్నికి నిడి
య య్యవనీధరవరునకు నాత్మజ యయ్యెన్. ౮౪౧

క. అనవుడు జనమేజయుఁడో
మునివర ! శంభునికి బ్రాణమునకన్నను హెం
చ్చనఁనొప్పు నా సతీమణి
యనఘ మృతింగసిన మీఁద నతఁ డెట్లుండెన్ ? ౮౪౨

చ. అన మునినాథుఁ డిట్టులను నాపయివృత్త మ దిట్టిదంచుఁ జె
ప్పనలవికాదు, శంకరు నపారపుఁగ్రోధము వీరభద్రసం
జనకముగాఁగ నాతఁడు వెసన్ త్రిజగమ్ములు నీఱుచేయునం
తన జలజాసనాదులు దుఃఖతమ్ముగ శంకరు నాశ్రయించినన్. ౮౪౩

వ. శంకరుండును దద్భయార్దితులగు బ్రహ్మాదులకుఁ దనసేగి లెక్కిం
పక కరుణాకరుండు గావున నభయంబిచ్చి భాగవ త్రిమ్మున నద్ద
క్షుం బ్రతికించి పదంపడి ఖిన్నాత్ముండై యజ్ఞవాటమ్మున కరిగి
వహ్నికుండం బెల్లెడ వెదకి దహ్యామానయుఁ జిత్కళారూపిణియు
నగు సతిం గాంచి స్కంధమ్మున నిడికొని హా సతి ! హా సతి !
యని సారెసారెకు రోదనం బొనర్చుచు భ్రాంతచిత్తుండై నానా
దేశమ్ములు పరిభ్రమించుచుండె ; నంత బ్రహ్మాదులును జింతా
దంతురులైరి ; పిదప విష్ణువు బాణపాతమ్మున నా సతీదేవి యవ
యవమ్ముల ననేకఖండమ్ములుగా ఛేదించిన నయ్యవి తత్తత్స్థాన
మ్ములం బడియె. శంకరుండును నాయాచోట్ల నానారూప
ధరుండై వసియించుచు, దేవతలం గాంచి యిట్లనియె. ౮౪౪

క. ఈ యీ స్థానమ్ముల శ్రీ
ద్ధాయుతులై దేవి నెవరు తద్దయుఁ బూజల్

సేయుదు రవ్వారికి శుభ
దాయిని యగు నాపె కరుణ దైవారంగన్. ౭౪౫

వ. ఆయా చోట్లం దన యవయవమ్ముల యందు నద్దేవి నిత్యమ్మును సన్నిహితయై యుండుకతనం బురశ్చరణాదరులగు మర్త్యుల కయ్యెడ మంత్రసిద్ధి సత్వరంబుగనగు, నదియునుంగాక మాయా బీజం బయ్యెడ జపించెనేని నతిశీఘ్రకాలమ్మున సిద్ధించునని చెప్పి,

క. విరహాతురుండై యా శం
కరుండు జపధ్యానపరతం గాలక్షేపా
దరుండై యా యా చోటుల
నరయుచు వర్తించుచుండె నవనీనాథా! ౭౪౬

క నావుడు జనమేజయుం డ
ద్దేవీస్థానముల సంఖ్యం దెలిపి తదీయం
బై వెలయు నామసంఖ్యయు
వే వినుపింపంగదె ననుం బవిత్రునిం జేయన్. ౭౪౭

గీ. అనుడు వ్యాసుండు వల్కె నో జనవరేణ్య!
శక్తిపీఠమ్ములను నాదుశక్తికొలంద
తెలిపెదను విను మెవ్వానిం దెలిసి నరుండు
పాపముల నీంగు మిగుల సంపదలందోంగు. ౭౪౮

—* దేవీస్థానమ్ములు *—

వ. భూతికాములగు వార లేయే పీఠమ్ములయం దుపాసనాపరులై సిద్ధింబడయుదు రయ్యవి వివరింతు, వారణాసి యందు *విశాలాక్షియు, నైమిశమ్మున లింగధారిణియుం, బ్రయాగమ్మున

---

* ముఖము పడినచోటు వారణాసి. అట వసించు గౌరికి విశాలాక్షి యని పేరు అని వ్యాఖ్యాత.

లలితయు, గంధమాదనమ్మునఁ గాముకియు, దక్షిణమానసమ్మునఁ గుముదయు, నుత్తరమానసమ్మున విశ్వకామయు, గోమన్తమ్మున గోమతియు, మందరమ్మునఁ గామచారిణియుఁ, జైత్రరథమ్మున మదోత్కటయు, హస్తినాపురమ్మున జయంతియుఁ, గాన్యకుబ్జమ్మున గౌరియు, మలయాచలమ్మున రంభయు, నేకామ్రపీఠమ్మునఁ గీర్తిమతియు, విశ్వమ్మున విశ్వేశ్వరియుఁ, బుష్కరమ్మునఁ బురుహూతయుఁ, గేదారపీఠమ్మున సన్మార్గదాయినియు, హిమవత్పృష్ఠమ్మున మందయు, గోకర్ణమ్మున భద్రకర్ణికయు, స్థానేశ్వరమ్మున భవానియు, బిల్వకమ్మున బిల్వపత్రికయు, శ్రీశైలమ్మున మాధవియు, భద్రేశ్వరమ్మున భద్రయు, వరాహశైలమ్మున జయయుఁ, గమలాలయమ్మున గమలయు, రుద్రకోటియందు రుద్రాణియుఁ, గాలంజరమ్మునఁ గాళియు, సాలగ్రామమ్మున మహాదేవియు, శివలింగమ్మున జలప్రియయు, మహాలింగమ్మునఁ గపిలయు, మాకోటమ్మున ముకుటేశ్వరియు, మాయాపురియందుఁ గుమారియు, సన్తానమ్మున నంబికయు, గయయందు మంగళయుఁ, బురుషోత్తమంబున విమలయు, సహస్రాక్షమ్మున నుత్పలాక్షియు, హిరణ్యాక్షమ్మున మహోత్పలయు, విపాశయం దమోఘాక్షియుఁ, బుండ్రవర్ధనమ్మునఁ బాటలయు, సుపార్శ్వమ్మున నారాయణియుఁ,ద్రికూటమ్మున రుద్రసుందరియు, విపులమ్మున విపులయు, సహ్యాద్రియం దేకవీరయు, హరిశ్చంద్రమ్మునఁ జంద్రికయు, రామతీర్థమ్మున రమణయు, యమునయందు మృగావతియుఁ, గోటితీర్థమ్మునఁ గోటవియు, మాధవవనమ్మున సుగంధయు, గోదావరియందుఁ ద్రిసంధ్యయు, గంగాద్వారమ్మున రతిప్రియయు, శివకుండమ్మున శుభానందయు, దేవికాతటమ్మున నందినియు, ద్వారవతియందు రుక్మిణియు, బృందా

వనమ్మున రాధయు, మధురయందు దేవకియుఁ, పాతాళమ్మున బరమేశ్వరియుఁ, జిత్రకూటమ్మున సీతయు, వింధ్యమ్మున వింధ్యాధివాసినియుఁ, గరవీరమ్మున మహాలక్ష్మియు, వినాయకమ్మున నుమాదేవియు, వైద్యనాథమ్మున నారోగ్యయు, మహాకాలమ్మున మహేశ్వరియు, నుష్ణతీర్థమ్మున నభయయు, వింధ్యపర్వతమ్మున నితంబయు, మాండవ్యమ్మున మాండవియు, మాహేశ్వరీపురమ్మున స్వాహాయు, ఛగలండమ్మునఁ బ్రచండయు, నమరకంటకమ్మునఁ జండికయు, సోమేశ్వరమ్మున వరారోహయుఁ, బ్రభాసంబునఁ బుష్కరావతియు, సరస్వతియందు దేవమాతయు, సముద్రతటంబునఁ బారావారయు, మహాలయమ్మున మహాభాగయుఁ, బయోష్ణియందుఁ బింగళేశ్వరియుఁ, గృతశౌచమ్మున సింహికయుఁ, గార్తికమ్మున నతిశాంకరియు, నుత్పలావర్తకంబున లోలయు, శోణసంగమమ్మున సుభద్రయు, సిద్ధవనమ్మున మాతయు, భరతాశ్రమమ్మున ననంగయు, జాలంధరమ్మున విశ్వముఖియుఁ, గిష్కింధపర్వతమ్మునఁ దారయు, దారువనమ్మునఁ బుష్టియుఁ, గాశ్మీరమండలమ్మున మేధయు, హిమాద్రియందు భీమయు, విశ్వేశ్వరమ్మునఁ దుష్టియుఁ, గపాలమోచనమ్మున శుద్ధియుఁ, గాయావరోహణమ్మున మాతయు, శంఖోద్ధారమ్మున ధరయుఁ, బిండారకమ్మున ధృతియు, జంద్రభాగయందుఁ గళయు, సచ్ఛోదమ్మున శివధారిణియు, వేణయం దమృతయు, బదరియందురసియు, నుత్తర కురుక్షేత్రమ్మున నోషధియుఁ, గుశద్వీపమ్మునఁ గుశోదకయు, హేమకూటమ్మున మన్మథయుఁ, గుముదమ్మున సత్యవాదినియు, నశ్వత్థమ్మున వందనీయయు, వైశ్రవణాలయమ్మున నిధియు, వేదవదనమ్మున గాయత్రియు, శివసన్నిధియందుఁ బార్వతియు, దేవలోకమ్మున నింద్రాణియు, బ్రహ్మాస్యమ్ములయందు సర

స్వాతియు, సూర్యబింబమ్మునఁ బ్రభయు, మాతలయందు వైష్ణ
వియు, సతులయం దరుంధతియు, రామలయందుఁ దిలోత్త
మయుఁ, జిత్తమ్మున బ్రహ్మకళయు, సర్వశరీరులయందు శక్తి
యు నెగడుదు రని వెండియు, ౮౫౧

క. ఎనిమిది వందల పీఠము
లును నందఱు శక్తులును బొలుచుచుండెద రో
జనమేజయ ! యే తత్సం
ఖ్యను విన్న నఘమ్ము లడఁగుఁ గలుగు శుభమ్ముల్.

వ. సతీదేవ్యంగభూతమ్ములగు నీ పీఠమ్ములకు యాత్రార్థమ్ముగా
నరిగి పితౄదుల సంతర్పించి భగవతిం బూజించినవారు కృత
కృత్యులగుదు రని వెండియు, ౮౫౨

సీ. భక్ష్యభోజ్యాదిసంపన్నమ్ముగను విప్ర
జనులకు భోజనంబు నిడియును సు
వాసినీ జనులను వటుకాదులను గుమా
రికల నట్టుల యలరింప వలయు
నింతేల ? యయ్యెడ నెవ్వఁడేనియుఁ బూజ
నీయుండు, కులభేదనియతి వలవ ;
దయ్యెడ నుండెడి యంత్యజుఁడేనియు
దేవీస్వరూపుఁడు తెలియు మధిప

గీ. యచటఁ జేసాఁపవలదు శక్త్యనుస్మృతిగను
మంత్రము జపింపవలయు నమ్నాత ప్రీతి
కొఱకు నిష్టువ్వఁ డొనరించుఁ గుజనుఁ డేని
వాని పితరులు బ్రహ్మలోకాను గతులు. ౮౫౩

వ. వాఁడును సమస్తసుఖమ్ముల ననుభవించి దేహత్యాగానంతరమ్మున దేవీపురమ్మున ముక్తుండై వసియించు, నీ నామాష్టశతంబు జపించి సిద్ధివడసినవార లనేకులు గలరని వెండియు,

క. ఈ నామాష్టశతమ్మును
దా నెవ్వఁడు పొత్తమందుఁ దగవ్రాయు నతం
డూనఁడు గ్రహమారీభయ
మోనరవర ! వానితుల్యుఁ డొక్కరుఁ డున్నే. ౬౫౫

క. ఏ మానవుఁడైనను దా
నామాష్టశతంబు జపమునన్ బొదలిన వాఁ
డా మాన్యుఁడు దేవతలకు
భూమీశ్వర ! శక్తిరూపము నతం డొందున్. ౬౫౬

గీ. ఎవఁడు శ్రాద్ధకాలమ్మున నిది జపించు
నతని పితరులు పరగతి కరుగువారు
సిద్ధపీఠమ్ము లియ్యవి సెప్పనేల ?
ముక్తిదములని జ్ఞాన సుముఖము లనియు. ౬౫౭

క. నరవర ! ప్రశ్నంబున కు
త్తర మిచ్చితి నతిరహస్యతత్త్వము నీకుం
బరమాదరమునఁ దెలిపితి
నరసి మఱింకేద్ది యడిగె దన నృపుఁ డనియెన్. ౬౫౮

—* గౌరీజన్మము *—

చ. మునివర! మంచుఁగొండపయి మున్నుదయించెఁ బరాంబయంచు నీ
వినిచినమాట నెంతయు సవిస్తరరీతి వినంగ నెంతు, న
జ్జనని కథామృతం బెవఁడు చాలఁగఁ గ్రోలియుఁ దృప్తిచెందు దీ !
ని నెనయు వానికిన్ మృతిజనింపదు ; గల్గు సుధాశి కేనియున్.

ఉ. నావుడు వ్యాసుఁ డిట్లను మనం బిటు నీకుఁ బరాంబయందు సం
భావితమౌ నె ! ధన్యుఁడవు మాన్యుఁడవైతి నరేంద్ర ! యా సతీ
దేవి శరీరము న్విడువ దేవనతుండు శివుండు భ్రాంతిమై
నే విషయమ్ములన్ నిలువ కెల్లెడఁ ద్రిమ్మరు చుండె నొక్కఁడై.

క. మనమున దేవీరూపం
బనయము ధ్యానించుచున్ సమాధిగతుండై
తన యంతఁ గాలయాపన
మును శంభుఁ డొనర్చుచుండె భూపవతంసా. ౮౬౧

చ. జగములు శక్తిహీనత నసారములై పొలుపేదె, రోగముల్
నెగడె, గ్రహాదిబాధలు జనించె, గణింపఁగరాక చింత వృ
ద్ధిగనె నిటుల్ దురుద్ధరగతిందగు నాసమయమ్మునందు దు
ష్టగుణుఁడు తారకాసురుఁ డసాధ్యుఁడు బ్రహ్మవరంబు పెంపునన్.

గీ. మూఁడు లోకమ్ము లేలుచు నాఁడునాఁటి
కెల్లసురలను మునులను బల్లిదుఁడయి
బాధపెట్టఁ దొడంగె నప్పాపుఁ జంపఁ
దగ రొరులు శివునౌరసాత్మజుఁడు దక్క. ౮౬౩

ఉ. "అంగనలేని శూలి కెటు లాత్మజుఁ డుద్భవమందు" ? నంచుఁ జిం
తంగొని దేవతల్ తమకుఁ దారకు బాధ యపారమై శమ
మ్మంగనకున్న నెల్లరు నమోనమ యంచు హరిన్ నుతింప న
య్యంగజుఁగన్నతండ్రి యిటు లానతియిచ్చె నుపాయశాలియై.

గీ. కామకల్పద్రుమంబు లోకజనయిత్రి
గలదు చింతింపనేల ? నిక్కముగ మన య
నయమునం జేసి యాపె మిన్నకయ యుండె
మనకు నిది శిక్షయగునంచు మదిఁ దలంచి. ౮౬౫

క. లాలనమునఁ దాడనమున
నేలలనకు నైన సుతులయెడ దయయుండున్
బాలకులు సేయు తుందుడు
కేలా తల్లులకుఁగాక యితరుల కుడుపన్ ? ౧౬౬

క. కావున జగదంబికయై
భావమ్మునఁ గరుణ యెపుడు పరివేష్టింపన్
జీవులఁ బ్రోచెడి యప్పర
దేవిన్ శరణంబుఁగొన్న దీనత లున్నే ? ౧౬౭

వ. అను కమలలోచను నాజ్ఞ సురలెల్లరును హిమశైలమ్మున కరిగి యయ్యెడఁ బురశ్చరణపరాయణులై దేవీయజ్ఞం బొనరించుచుఁ దృతీయాదివ్రతమ్ముల నాచరించుచు నుండి రందుఁ గొందఱు సమాధినిష్ణాతులును, గొందఱు నామపరాయణులును, గొందఱు సూక్తాసక్తులును, గొందఱు మంత్రపారాయణపరులును, గొందఱు కృచ్ఛ్రచాంద్రాయణవ్రతనిష్ఠులును, గొందఱంతర్యాగసంస్థులును, గొందఱు న్యాససమాదరులును నై భువనేశ్వరీమంత్రమ్మునఁ బరశక్తి పూజ నొసర్చుచు బహువర్షమ్ములు గడపుచున్నంత, ౧౬౮

ఉ. మేలగు చైత్రమాసనవమీ దినమందలి శుక్రవారమం
దోలి సురాళి కట్టెనుట నొక్క మహాద్భుత తేజమున్నత
శ్రీలలితంబు కోటిశశిశీతల మర్కసహస్రకాంతిసం
కీలితమై తటిత్కలనఁ గేరుచు నుద్భవమందె శోణమై. ౧౬౯

వ. వెండియు, ౧౭౦

సీ. మూర్తిమంతమ్ములై మొనసి వేదములు నా
లుగు నాల్గు దిక్కులఁ బొగడుచుండ

నాద్యంత రహితమై యనవద్యమై యూర్ధ్వ
గతియుఁ దిర్యగ్గతి గనక కరచ
రణముఖాద్యవయవపావృతమ్మును గాక
స్త్రీపుంనపుంసకస్థితి నొలయక
దీప్తిచే నమరుల దృక్ప్రసారమ్ముల
మిఱుమిట్లు గొల్పుచు మెఱసి యంత

గీ. నా మహాతేజ మంగనయై మనోహ
రస్వరూపమ్ము తనరఁ గరమ్ము నమర
వరుల మనముల నానందవార్ధి ముంచె
నా విధం బట్టిదిట్టిది యనఁగరాదు. ౮౭౧

సీ. కమలకుట్మలముల కొమరుగాదనఁజాలు
గబ్బిగుబ్బల శీవి గలుగు దానిఁ
గలరణత్కింకిణీకాజాలశింజత్సు
మంజీరమేఖలల్ మలయుదానిఁ
గనకకేయూరకగ్రైవేయకాంగద
గళబంధముల పొల్పు గలుగుదాని
మొగలిదళముల సొబగుమీఱి వాసించు
నీలకుంతలములు నెగడుదానిఁ

గీ. గప్పురపుఁదావి నెల్లెడగుప్పు వీడి
యంపు బల్ కావి నొప్పు నాస్యమ్ముదానిఁ
బృథునితంబబింబమ్మున వెలయుదానిఁ
గనకతాటంకయుగళమ్ము నెనయుదాని. ౮౭౨

సీ. అష్టమీచంద్రబింబాభలలాటమ్ము
నాయతభ్రూవిలాసాస్పదంబు

రక్తారవిందవిరాజన్నయన మున్న
తఘ్రాణ ముద్యదధరసమేత
మఞ్జురేఖాసముద్యచ్ఛ్రీగ్రీవ మమలము
క్తాహార మిద్ధరత్నమకుటంబు
కుందకుట్మలదంతకోటీవిలాసంబు
కాశ్మీరతిలకసంకలిత మతుల

గీ. మల్లికామాలతీకసన్మాలికాభి
కీలితసుకేశపాశంబుఁ గేవలారు
ణాంబరంబును బాశాదికాయుధసము
పేతమగు దివ్యరూపంబు వెలయుదాని. ౨౭౩

చ. పొలుపగు దాడిమీకుసుమపుంజము నాఁదగు కాంతిదాని, ను
జ్జ్వలములు నాల్గుబాహువు లెసఁగెడిదాని, సమస్తకామముల్
చిలికెడుదాని, లేనగవు చెన్నలరారెడుదాని, నిత్యశీ
తలకరుణాసనాథయగు దానిఁ గనుంగొని రంబికన్ సురల్.

క. కని మ్రొక్కిడి యానందా
శ్రునిరుద్ధస్వనులు ప్రేమచుంబితనిజలో
చనులును నై తన్మయమగు
మన మొండేమియును వినమి మ్రాన్పడి పిదపన్. ౨౭౪

వ. ఎట్టకేలకు ధైర్యమ్ము దెచ్చికొని యజ్జగదంబ నిట్లు సన్నుతించిరి.

గీ. రజ్జువున మాలయందు సర్పభ్రమంబు
వడువున జగమ్ము నీయందు భ్రాంతికల్పి
తంబగు నని తెలియనికతమున నిన్నె
ఱఁగిన మీఁదట భ్రాంతి యడఁగు జగమున. ౨౭౫

క. తత్తనుట కుదాహృతి సం
విత్తును నగు నిన్ను భువనవిభ్వవటంచుం
జిత్తన్మాత్రి వటంచున్
బత్తిమెయి నమస్కరించువారము తల్లీ ! ౮౭౮

వ. అఖండానందంబును బ్రణవంబును హ్రీంకారమ్మును బ్రత్యగాత్మయును నీ స్వరూపమ్ము లాగమతాత్పర్యభూమికయు నవస్థాత్రియ సాక్షిణియుఁ బంచ కోశాతిరిక్తయు నగు నీకు నమస్కారము. త్వం పదమ్మునకు వాచ్యంబవగు నిన్ను నానామంత్రాత్మికవనుచు నుతింతుమని శ్రీసూక్తంబులఁ దన్ను నుతించు నిర్జరులం గాంచి సుధామధురస్వరంబున నజ్జగదంబ యిట్లనియె.

క. దేవతలార ! మదర్థము
మీ వచ్చిన కార్యమేమి ? మీ మొగములు శో
కావిలత నొంద నేల ? ము
దావహ యగు నేను వరదనై యుండఁగన్. ౮౮౦

క. నాయందు భక్తిగలవా
రేయెడ నాపదల నొందిరేనియు సత్యం
బాయాపద దొలఁగించి మ
దీయుల నొనరింతునను ప్రతిజ్ఞ యెఱుఁగరే. ౮౮౧

చ. అనుచు దయాసమేతముగ నానతి యిచ్చిన దేవి పల్కులన్
విని ముదమందుచున్ సురలు నిర్భయులై తమ దుఃఖ మీగతిన్
మనవి యొనర్చి “ రెందు భువనమ్మున నెచ్చట నేని నీకునుం
గన విన రాని సంగతులు కల్లలు గావె ప్రపంచమాతృకా.

క. తారకుఁడను రక్కసుఁ డే
పార సరోజాతభూదయాపాత్రింబై

కోరిన వరములు గొని దు
ష్ప్రారంభతఁ జేసి మమ్ము బాధించు నొగిన్. ౮౮౩

క. శివు వలనం బుట్టిన వాఁ
డు వధించెడి వాని, శర్వుఁడును భార్యానై
భవ మెఱుఁగనివాఁ డెటు సం
భవమందున్ గొడు కొకండు భవునకుఁ దల్లీ!" ౮౮౪

చ. అని విలపించు దేవతలయందు దయాంతరయై పరాంబ యి
ట్లనియె మదీయ శక్తియ హిమాద్రికిఁ బుత్రికయై జనించు నా
పెను బురవైరి కెల్లరును పెండిలి సేయుఁడు దానఁ జేసి యా
తనికిఁ గుమారుఁడుం బొడముఁ దారకునిన్ వధియించుఁ బొండికన్.

వ. అను పరాంబ పల్కులకు సంతసించి సురలతోడం జనుదెంచిన హిమాచలరాజం బిట్లనియె. ౮౮౬

క. ఏమీ! నా పుణ్యము త
ల్లీ! మా యింటం జనింతె లీలాకృతినై
కామితఫలదాయిని నా
నేమమ్ము ఫలింప నేర్చెనే? యిప్పటికిన్. ౮౮౭

క. జడుఁడన్ మందుఁడ నే నె
క్కడ! చిద్రూపిణి పరాంబికయు దయచే నా
కడుపున జనించుటయు నె
క్కడ! జన్మశతములకైనఁ గలుగునె తల్లీ! ౮౮౮

గీ. అశ్వమేధాదియాగమ్ము లాచరించు
సుకృతులేనియు నీరూపు చూడలేరు
తాదృశంబగు రూప మోతల్లి! నా గృ
హమున జనియించు టరిది భాగ్యంబ కాదె. ౮౮౯

శా. "మంచుంగొండ యనేక జన్మముల నేమం బింతగా నోప్పునే!"
యంచు న్ననన్నను నిన్ను భక్తకరుణాయాదఃపతింగాఁగ న
గ్గించున్ లోకము మత్పితృత్రాణము విముక్తింజెందు నోతల్లి! ని
ర్మించున్ వేఁడోక పుణ్యలోకమును బేర్మిన్ బమ్మ యవ్వారికిన్.

వ. సర్వవేదాంత సారభూతంబగు నీ విశ్వరూపం బొకమరి సాక్షాత్క
రింపం జేసి శ్రుతిసమ్మతమ్ములగు భక్తిజ్ఞానయోగమ్ము లొన
తిచ్చి కృతార్థులం జేయుము నావుడు హిమవంతునకు వికసిత
ముఖపంకజ యగుచు నప్పరాంబ శ్రుతిగూఢంబగు నా రహ
స్యంబిట్లు వక్కాణించె. ౮౯౧

—* దేవీ విశ్వరూప ప్రదర్శనము *—

క. అమలం బనుపమ మవిత
ర్క్య మనామయ మేకముం బరబ్రహ్మాభి
ఖ్యము సంవిత్తును నగు తే
జ మనఁగ విను నేనసూ రసాధరమౌళీ. ౮౯౨

గీ. తత్సహజశక్తి మాయ నాఁ దనరు, నది య
సతియు సతియును నుభయానుగతియుఁగాక
శశికిఁ జంద్రిక, యగ్ని కుష్ణతయు, భాస్క
రునకు దీధితిరీతిగాఁ దనరుచుండు. ౮౯౩

వ. స్వీయశక్తిసమాయోగమ్మునం జేసి యేన ప్రపంచమ్మునకు
బీజంబనైతి; నస్మచ్ఛక్తి యనఁగా మాయ. అది తపస్తమో
జడాదినానానామంబులు గలయది. ఆ యీ నామమ్ములెల్ల
నిగమాదిప్రసిద్ధంబులు. కాని, యన్యోపండితుల స్వకపోల కల్పి
తంబులు గావు. అమ్మాయ జీవాశ్రితయగు పట్టున నవిద్య
యనఁబడుఁగు. దానికి స్వాశ్రయవ్యామోహకృత్త్వం బొందు

దోసంగుగలదు. ఏతద్దోషమ్మునుండి రక్షించి జీవునకు మోక్షం బొసంగుటయ సృష్టికి ముఖ్యప్రయోజనంబు. మాయాప్రతిబింబితమ్మగు చైతన్యంబు సృష్టికి నిమిత్తకారణంబు, మాయ సమవాయికారణంబు. దృశ్యంబగుకతన మాయ జడంబును, జ్ఞానమువలన నశించుటంజేసి మిథ్యయునగు. చైతన్యంబు దృశ్యంబుగాదు. కాన నిప్పరవస్తువును జడమనరాదు. ఇయ్యది దీపమ్ము వడువునఁ బరప్రకాశకమ్మును స్వయంప్రకాశమానమ్మును నని యెఱుఁగునది. జాగ్రదాద్యవస్థాత్రితయమ్మునం దిది యొక్కటేగతి భాసించు. ఇయ్యది సంవిదాత్మకంబు, సుఖాత్మకంబు, పరప్రేమాస్పదంబగుకతన నానందాత్మకంబు, నిత్యంబు, సత్యంబు; దీనికన్న నితరమ్ము మిథ్య. కావున నప్పరవస్తువున కసంగత్వమును నపరిచ్ఛిన్నత్వమును స్ఫుటమ కదా! ఏవంభూతమగు పరవస్తువునేన. నేను జ్ఞానాత్మకనుగాని జ్ఞానధర్మిణినిగాను. జ్ఞానరూపమ్మును బూర్ణమ్మును ద్వైతజాలవివర్జితమ్మును నగు పరవస్తువు కామకర్మాది యుక్తయగు స్వీయమాయకతమ్మునను బూర్వానుభూతసంస్కారవశమ్మునను గాలకర్మవిపాకమ్మునను దత్త్వావివేకనిమిత్తమ్మునను సిసృక్షాభాజనం బగుచున్నయది. ఈ సర్గంబు బుద్ధిపూర్వకంబుగాదు. ఇంతదనుక నలౌకికమ్మగు నాహూపమ్ము నీకుం జెప్పఁబడినది. ఇదియ యవ్యాకృతంబును, నవ్యక్తంబును, మాయాశబలితమ్మును, సర్వకారణ కారణమ్మును, నాదితత్త్వమ్మును, సచ్చిదానంద విగ్రహమ్మును సర్వకర్మఘనీభూతమ్మును, నిచ్ఛాజ్ఞానక్రియాశ్రయమ్మును, హ్రీంకారమంత్రవాచ్యంబును నని యెఱుంగునది. ఇద్దాన శబ్దతన్మాత్రరూపకంబగు నాకాశమ్మును దానివలన స్పర్శాత్మకంబగు వాయువును, దానివలన

రూపాత్మకంబగు తేజమ్మును, దానివలన రసాత్మకంబగు జలమ్మును, దానివలన గంధాత్మికయగు భూమియుఁ బొడమె; నందాకాశమ్మునకు శబ్దమ్మును, వాయువునకు శబ్దస్పర్శమ్ములును, దేజమ్మునకు శబ్దస్పర్శరూపమ్ములును, నుదకమ్మునకు శబ్దస్పర్శరూపరసమ్ములును, భూమికి శబ్దస్పర్శరూపరసగంధమ్ములును గుణమ్ము; లీభూతపంచకమ్ము వలన వ్యాపకమ్మును వాయురూపమ్మును నగు లింగదేహ మ్ముద్భవించె. సర్వప్రాణాత్మకంబగు నియ్యదియ యాత్మకు సూక్ష్మదేహంబని తెలియఁదగు. కారణదేహంబవ్యక్తంబు, దీనియంద జగంబు బీజరూపమ్ముననుండు; నియ్యదియ లింగదేహమ్మునకు హేతుభూతంబు. ఈయది మున్ను వివరింపఁబడియె. పంచీకరణ మార్గమ్మునంజేసి పంచమహాభూతమ్ము లుద్భవించెఁ, దత్ప్రకారంబు వివరింతు.

తే. గీ. ముందుఁ బంచమహాభూతములను రెండు
భాగములుచేసి యందొండు భాగమునకు
నాల్గుభాగమ్ములను గల్పనంబొనర్చి
యవియు స్వస్వేతరద్వితీయాంశమందు, 65

వ. యోజింపవలయు, నిట్లు యోజించిన నయ్యెభూతమ్ము లొక్కొక్కటి పంచావయవమ్ములుగ నేర్పడు. దీనినే పంచీకరణమని చెప్పుదురు. పంచీకృతభూతజన్యంబగు దేహంబ నాకు స్థూలదేహమ్ము. పంచభూతసత్త్వాంశమ్ములవలన జ్ఞానేంద్రియమ్ము లైదునుం గలిగె. అవి యేకమై యంతఃకరణమ్మునాఁదగె. అది వృత్తిభేదమ్మున నాల్గుభేదమ్ములు గలయది. అది సంకల్పవికల్పాత్మకంబగు నెడ మనంబనియు, నిశ్చితంబగు నెడ బుద్ధియనియు, నిత్యానుసంధానపరమ్మగు నెడఁ జిత్తమ్మనియు, నహంభావావృతంబగు నెడ నహంకారంబనియు నుడువంబడు. రాజసాంశమ్మువలనఁ గర్మేం

ద్రియమ్ములై దునుం గలిగె ; నవియేకమై ప్రాణంబునాఁబరగు, నది ప్రాణాపానవ్యానోదానసమానభేదమ్ములనై దువిధమ్ములు గలయది యందు హృదయమ్మునఁ బ్రాణమ్మును, గుదమ్మున నపానమ్మును, నాభియందు సమానమ్మును గంఠమ్మున నుదానంబును, సర్వశరీరమ్మున వ్యానమ్మును నివసించుఁ ; ద్వక్చక్షు శ్శ్రోత్రజిహ్వాఘ్రాణమ్ములు, వాక్పాణిపాదపాయూపస్థములును ప్రాణాపానవ్యానోదానమ్ములును, బుద్ధియును, మనమ్మును, గలసి లింగం బనఁదగు నస్మదీయసూక్ష్మశరీరంబు. వెండియుఁ బ్రకృతి విశేషమ్ము లాలింపుము. మాయయనియు, నవిద్య యనియు రెండు దెఱంగు లందు * సత్త్వాత్మికమాయ † గుణమిశ్రిత యవిద్యయని యెఱుంగునది, యందు స్వాశ్రయ సంరక్షకమ్ము మాయ, యం దీశితృప్రతిబింబంబీశ్వరుం ; డతండు సర్వజ్ఞుండును, సర్వకర్తయును, సర్వానుగ్రహ కారకుండును, నాఁబడు ; నవిద్యాప్రతిబింబంబు జీవుం డనఁబరఁగు ; నీ యిరువు రకు ‡ నవిద్యానిమిత్తకంబగు పూర్వోక్తదేహత్రయాభిమాన మ్మున నామత్రితయంబుగల, దందుఁ $ బ్రాజ్ఞతైజసవిశ్వనామ మ్ములు జీవునకు, నీశసూత్రవిరాట్పుదమ్ము లీశ్వరునకుం జెల్లు; నందు జీవుండు వ్యష్టిదేహాభిమానియు, నీశ్వరుండు సమష్టిదేహాభిమా నియు నగునని వెండియు, ౮౯౬

క. జీవానుగ్రహకాముము
చే విశ్వంబెల్లఁ దానచేయును నానా

---

* సత్త్వాత్మిక = శుద్ధసత్త్వ. † గుణమిశ్రిత = మలినసత్త్వ

‡ అవిద్యయన మాయయు, నవిద్యయు నని వ్యాఖ్యాత.

$ కారణదేహాభిమాని ప్రాజ్ఞుండు, సూక్ష్మదేహాభిమాని తైజసుఁడు, స్థూల దేహాభిమాని విశ్వుండు.

భావముల నీశ్వరుఁడు మ
ద్భావుండై నాదుశక్తిఁ దగఁ బ్రేరితుఁడై. ౮౯౮

చ. సకల చరాచరమ్ములును శక్తికృతమ్ముల యట్టి నాదు మా
యకు మఱి నాకు నెన్నఁ బరమార్థత భేదము లేదు చూడ, లౌ
కికులకు భేదముండు నది కేవలమత్కృత మింకఁ దత్త్వద
ర్శకులకుఁ దత్త్వమొక్కటియ శాస్త్రనిదానము భూధరోత్తమా
ఆ. వె. అట్టి నేను జగము నఖిలమ్ము సృజియించి
ప్రాణి మగ్రిమంద పరిఢవిల్ల
నందుఁ జొచ్చియుందు ; నట్లుకాకున్న లో
కాంతరగతి ఘటనయగుటయెట్లు ? ౮౯౯

వ. ఉపాధిభేదమ్మున ఘటాకాశాదులకు భేదంబు కల్పితంబగుపగిది మాయాభేదమ్మునం జేసి నాయందును భేదమ్ము కల్పితమ్ము. భాస్కరుం డుచ్చనీచాదివస్తువుల వెలిఁగించియు దుష్టుండు గాని తెఱంగున నేనును దత్తద్వస్తుగతదోషమ్ములకు భాజనంబుగాను. బుద్ధ్యాదినిష్ఠంబగు కర్తృత్వమ్మును వివేకశూన్యులు నాయందుఁ గల్పింతురు కాని వివేకులిట్లు పొరఁబడరు. ఘటాకాశ మహాకాశమ్ముల పగిది జీవాత్మపరమాత్మలకు భేదంబు కల్పితంబు. జీవబహుత్వంబు వడువున నీశ్వరబహుత్వమ్మును, మాయాకల్పితంబయగు; నింద్రియసంఘాతవాసనాభేదభేదితయగు నవిద్య జీవబహుత్వమ్మునకును, గుణసంఘాతవాసనాభేదభేదితయగు నవిద్య యీశ్వరబహుత్వమ్మునకుఁ గారణంబగునని వెండియు, ౯౦౦

సీ. నేన యీశ్వరుఁడను నేన సూత్రాత్ముఁడ
నేన విరాడాత్మ నెఱుఁగుమయ్య
హరిహరబ్రహ్మలు నావైష్ణవియు గౌరి
యును బ్రాహ్మియును నేన ; యినుఁడు శశియు

దారకలును నేన; తస్కరవ్యాధచాం
డాలురు నేన; యన్యంబులైన
పశుపక్షులును నేన; పరమోత్తములు కర్మ
ఠులు నేన; దుష్కర్మకులును నేన;

తే. గీ. యఖిలభూతమ్ములందు నాకన్న వేఱు
లేదు, ఫణిమాలికాదివిభేదములను
నొందియును రజ్జు వేకమై యుండుపగిది
నేన వెలుఁగుదు నెందు నో హిమగిరీంద్ర! ౯౦౧

క. అని నొడువు నప్పురాంబం
గని హిమగిరి దేవి ! నీయఖండాకారం
బును గనుఁగొనఁగా నెంచెద
ననవుడు విశ్వస్వరూప మంబయుఁ జూపెన్. ౯౦౨

వ. సురలును లోచనభీకరంబగు తద్విరాడ్రూపంబుఁ గాంచి విస్మితు
లైరి; యారూపం బెట్టిదం బేని, ౯౦౩

సీ. వ్యోమంబు శిరము, సూర్యుండు చంద్రుండు లో
చనములు, చెవులు దిశలు, తొలిచదు
వులు మధురంపుఁబల్కులు, పవనంబు ప్రా
ణము, ప్రపంచము హృదయము, ధరిత్రి
కటి, ఖంబు నాభి, భగణము వక్షము, మహ
ర్లోకంబు మెడ, జనోలోక మాస్య
ము, లలాట మరయఁ దపోలోక, మింద్రాదు
లెల్లరు బాహువు, లిదియుఁగాక

తే. గీ. నాస గంధంబు, దస్రులు నాసికావి
వరములు, పవలురాత్రి ఱెప్పలు, జలంబు

కాకుదంబు, రసంబు నాల్క, కనుబొమలు
బ్రహ్మలోకమ్ము, యముడు దంష్ట్రలు, మఱియును,

వ. స్నేహంబు దంతమ్ములు, మాయ హాసంబు, నేత్రాంతపరిసారంబు సర్గమ్ము, వ్రీడ యుత్తరోష్ఠమ్ము, లోభం బధరోష్ఠంబు, ధర్మమార్గంబు పృష్ఠంబు, ప్రజాపతి మేఢ్రమ్ము, సముద్రంబులు కుక్షి, పర్వతమ్ము లస్థులు, నదులు నాడులు, వృక్షంబులు కేశంబులు, బాల్యయౌవనకౌమారవార్ధకమ్ములు గతులు, మేఘమ్ములు లోమమ్ములు, సంధ్యలు వసనంబులు, చంద్రుండు మనంబు, హరి విజ్ఞానంబు, రుద్రుఁ డంతఃకరణమ్మునుగా దంష్ట్రాకరాళంబును, నానాయుధధరంబును, బ్రహ్మక్షత్రౌదనంబును, సహస్రశీర్షమ్మును, సహస్రనయనంబును, సహస్రపాదమ్మును, గోటిసూర్యప్రకాశమ్మును, విద్యుత్కోటిసమప్రభంబును, భయంకరమ్మును, ఘోరమ్మును, హృదక్షిత్రాసకారకమ్మును నగు నమ్మహారూపమ్ముఁగాంచి కంపమానహృదయులగుచు దేవతలు మూర్ఛిల్లి పదంపడి కెలననున్న వేదమ్ములు ప్రబోధింప లేచి ముకుళితకరకమలులై, ౯౦౫

శా. నీరూపంబు జగద్భయంకరము నెంతేఁజూచి మూర్ఛ౯ భయం
బారం గొంటిమి నీదుసంస్తవము సేయన్నేర్తుమే ? త్వత్పదాం
భోరుడ్ద్వంద్వముఁ గొల్చుపామరుల మమ్ముం బ్రోవుమో దేవి ! వి
శ్వారాధంబగు నీస్వరూప ముపసంహారంబుఁ గావించుచు౯.

వ. అగ్నియు సూర్యచంద్రులును నోషధులును దేవతలును సాధ్యులును బశుపక్షిమృగాదులును మనుజులును బ్రాణాపానంబులును వ్రీహియవంబులును దపంబును శ్రద్ధయు సత్యంబును బ్రహ్మచర్యవిధియు * సప్తప్రాణార్చులును సప్తసమిధలును

* ప్రాణములు, అర్చిస్సులు, అని ద్వంద్వము.

హోమమ్ములును లోకంబులును సముద్రంబులును నదులును బర్వతంబులును సర్వరసంబులును సర్వౌషధంబులును జన్నంబులును యూపంబులును దక్షిణలును ఋగ్యజుస్సామంబులును నెందుండి జనించె నట్టి సర్వాత్మకు నీకు నమస్కరించెదమని వేఁడియు, ౯౦౭

తే. గీ. పరమమగు నీదు విశ్వరూపంబు విడిచి
మున్ను గైకొన్న యాజగన్మోహనంపు
రూపు చూపుము మాభీతి మాపుమంచుఁ
బ్రార్థనమొనర్చు నమరులయందుఁ బేర్మి. ౯౦౮

వ. పిదప నంబయు నా విశ్వరూపంబు చాలించి తొంటిరూపంబు గైకొని యమరుల కిట్లనియె. ౯౦౯

ఆ. వె. మందభాగ్యులగు నమరులు మీరేడ, నా
విశ్వరూప మేడ! భీతినొందు
టబ్బురంబె! నే దయామతి మీకు సా
క్షాత్కరింపఁజేయఁ గడఁగితిఁజూఁడి. ౯౧౦

—* మోక్షమునకు జ్ఞానం బావశ్యకమనుట *—

క. యోగంబుల దానంబుల
నాగమముల మేటితపములాదిగ నేయే
యోగములనైన నన్నుఁ
వే గనుఁగొనఁజాలు టబ్బునే? యెందేనిన్. ౯౧౧

వ. అని చెప్పి హిమగిరి నుద్దేశించి గిరీంద్రా! ప్రకృతంబాలింపుము పరమాత్మ యుపాధిభేదమ్మున జీవతత్త్వమ్ముఁ బొంది కర్తృత్వాద్యనుగతుండగుచు ధర్మాధర్మైకకారణంబులగు నానాకృతులొనర్చుచు నానాయోనుల జనించుచు సుఖదుఃఖమ్ము లనుభవించుచు మరలఁ

దత్తత్కర్మానుభవమ్మునం జేసి నానాశరీరమ్ములు తాల్చుచు సుఖ
దుఃఖానుభవంబొనర్చుచు ఘటీయంత్రంబు చందమ్మున విరామంబు
గొనక యజ్ఞానంబునంబడి పొరలుచుండు. ౯౧౨

సీ. కావున మనుజుఁ డజ్ఞానంబు నశియించు
పొంటె విద్యాభ్యాసమును నొనర్ప
వలయు ; జన్మంబుసఫలమగుటయుఁ బురు
షార్థసమాప్తియు నమృతముక్త
దశయు నజ్ఞానంబు నశియించుటయకాదె ?
యజ్ఞానజమగు నుపాస్తియొండెఁ
గర్మంబునొండె నజ్ఞాననాశనమునఁ
గారణములుకావు ; కాని రాగ

తే. గీ. దోషముఖ్యము లైనట్టి దోసఁగు లెసఁగఁ
జేయుఁగాన ననర్థంపుఁజేటుదెచ్చుఁ
గర్మములవాకఁ బోక విజ్ఞానమహిమ
చెందుపొంటెఁ బ్రయత్నమ్ముచేయవలయు. ౯౧౩

వ. కొందఱు కైవల్యమ్మునకు విజ్ఞానంబ కారణంబైనను "కుర్వన్నేవేహకర్మాణి" యను ననుశాసనంబుకలిమిఁ గర్మంబును తత్ప్రాప్తికి సహాయంబనియు హితకారియనియుం బలుకుదురు. హృద్గ్రంథిజన్యంబగు కర్మమ్మునకు హృద్గ్రంథిభేదసాధనంబగు విజ్ఞానంబునకు దమఃప్రకాశంబులకుంబలె యోగపద్యంబు సంభవింపదు. కావున వైదికంబులగు సర్వకర్మంబులును జిత్తశుద్ధికరమ్ములని యెఱింగి శమదమతితిక్షావైరాగ్యసంభవపర్యంతమ్మును గర్మమ్ములొనర్చుచుఁ బిదప సర్వసంగపరిత్యాగంబుచేసి శ్రోత్రియుండును బ్రహ్మనిష్ఠుండునునగు గురువరుఁగాంచి నిర్వ్యాజంబగు భక్తి

దళుకొత్త వేదాంతశ్రవణంబు సేయుచుఁ దత్త్వమస్యాదివాక్యమ్ముల కర్థంబు విచారించునది. ౯౧౪

తే. గీ. "తత్త్వమసి" యను వాక్య మద్వైతబోధ
కము తదర్థమెఱింగిన విమలమతియ
యేను! నేనయతండు; గిరీంద్ర! తేట
తెల్లముగను తదర్థంబు తెలియవినుము. ౯౧౫

వ. 'తత్'పదమ్మునకు సర్వజ్ఞత్వవిశిష్టచైతన్యంబును, 'త్వం' పదమ్మునకుఁ గించిద్జ్ఞత్వవిశిష్టచైతన్యంబును, వాచ్యంబు. 'అసి' పదవాచ్యంబైక్యం; బిదిపదార్థంబు. సర్వజ్ఞత్వవిశిష్ట చైతన్యంబును గించిద్జ్ఞత్వవిశిష్టచైతన్యమ్మును నొక్కటియేయని వాక్యార్థంబు. ఇట్టి యర్థంబు విరుద్ధంబు కావునఁ దత్త్వంపదమ్ములకు జహదజహల్లక్షణచేఁ జైతన్యమాత్రార్థకత్వంబు స్వీకరించి యితరార్థంబు పరిహరింపవలయు. అట్లేని చైతన్యంబు చైతన్యంబు నొక్కటియే యని యవిరుద్ధంబగు వాక్యార్థంబు లభించునని చెప్పి మఱియు నిట్లనియె. ౯౧౬

తే. గీ. స్థూలమును, గారణంబును, సూక్ష్మమనఁగ
మూఁడు దేహంబు లాత్మకు ము న్నుపాధు
లవి నశింపఁగ నంపున్న నైదుకోశ
ములను దాఁటిన నా బ్రహ్మపుచ్ఛ మరయు. ౯౧౭

వ. పంచీకృతమహాభూతసంభవంబును భోగాలయమ్మును జరావ్యాధిసంయుతమ్మును నగునది స్థూలదేహంబు. జ్ఞానకర్మేంద్రియయుతంబును ప్రాణపంచకయుతంబును నపంచీకృతభూతసంభవంబును మనోబుద్ధియుతంబును సుఖదుఃఖాద్యవబోధకంబును నగునది సూక్ష్మదేహంబు. అనాదియు ననిర్వచనీయమ్మును

22.

నగు నజ్ఞానంబ కారణదేహంబు. ఈ దేహత్రయమ్ము నశియిం
చినపిదపఁ గేవలాత్మ మిగులు; నితనికి జననమరణమ్ములు లేవు.
శాశ్వతమ్మును నిత్యమ్మును బురాణంబును నణువుకన్న నణువును
మహత్తుకన్న మహత్తును జంతు * గుహానిహితంబును నేతి
నేతీతివాక్యపరిశిష్టమ్మును హననకర్తృత్వహననకర్మత్వదూర
మ్మును నగు నాత్మవస్తువును వీతశోకులగువారు సాక్షాత్క-
రింతురు. ౯౧౮

సీ. రథి యాత్మ, దేహంబు రథము, సారథి బుద్ధి
త్రాళులు, మన మింద్రియాళి వారు
వము, లింద్రియముల మనముగూడి తద్గోచ
రములగు పలువిషయముల నాత్మ
యనుభవించునటంచు మునులందు; రయ్యవి
ద్యయు సమనస్కత్వ మశుచివిధము
గలవార లెన్నఁడుఁ గాంచరు తత్పద
మును, సంసృతినిబడి పొదలుచుంద్రు;

తే. గీ. విద్యయును సమనస్కత్వవిధియు శుచిత
యును గలుగువారు తత్పద మనుగమింతు
రజ్జువు మనంబు, తెల్వి సారథిగఁ గల్గు
వాఁడు తుదముట్టు మత్పదాధ్వమ్మునందు. ౯౧౯

వ. ఇట్లు శ్రుతిమత్యనుసారంబుగ నాత్మచే నాత్మనిశ్చయంబొనర్చి
నిధిధ్యాసనమ్మున నాత్మరూపనగు నన్నుఁదలంచునది. యోగ
వృత్తికిమున్ను దేవీప్రణవంబగు హ్రీంకారమ్మునందలి యక్షరత్ర
యార్థంబు విచారించి హకారంబు స్థూలదేహంబనియు రకారంబు

* బుద్ధి.

సూక్ష్మదేహంబనియు నీ కారంబు కారణదేహంబనియు హ్రీం కారంబు తురీయంబగు దేవీరూపంబనియు నిట్లు సమష్టివ్యష్టి దేహంబులు నిర్ణయంబొనర్చి పిదప నవ్వాని నైక్యమ్ము నిశ్చయించి నిలీనాత్ముండగుచు నాసాభ్యంతరసంచారులగు ప్రాణాపానంబుల సమంబొనర్చి వీతవిషయాకాంక్షత్వమ్మును వీతదోషత్వమ్మును విమత్సరత్వమ్మును దనర నిర్వ్యాజమ్మగు భక్తిపెంపున నీరావం బగు గుహాముఖంబుఁ బ్రవేశించి హ కారరూపుఁడగు విశ్వాత్మను ర కారరూపుఁడగు తైజసాత్మ యందును నవ్వాని నీకారరూప ప్రాజ్ఞాత్మయందును నవ్వాని హ్రీం కారమ్మునందును బ్రవిలాప మ్మొనర్చి వాచ్యవాచకతాహీనమ్మును ద్వైతభావవివర్జితమ్మును నఖండంబును నగు సచ్చిదానందమ్మును జైతన్యాగ్నిదీపశిఖాం తరమ్మున భావించుచుఁ దద్భావనంజేసి మదీయసాక్షాత్కా రంబుఁగాంచి మద్రూపుఁడగుచు మదైక్యమ్ముఁగాంచు ననిన విని హిమవంతుం డంబ కిట్లనియె. ౯౦

తే. గీ. తత్త్వదర్శనమునకు సాధనము యోగ
మంబ! సంవిత్ప్రదాయక మంచువింటిఁ
దెలియఁజెప్పుము తద్విధి తేటతెల్ల
ముగను భక్తుని ధన్యునిఁ దగఁ జేయ ? ౯౧

—* యోగమంత్రవివేచనము. *—

వ. అని వినయావనతుండగుచు నడుగుటయు నంబిక గిరీంద్రా! యోగంబన జీవాత్మైక్యంబకాని వేఱొండుగాదు. తత్ప్రకారం బెఱిఁగింతు. యోగవిఘ్నకరమ్ములగు కామక్రోధలోభమోహ మదమాత్సర్యమ్ములను యమనియమాసనప్రాణాయామప్రత్యా హారధారణాధ్యానసమాధు లనియెడి యష్టయోగాంగమ్ములచే

జయించవలయు; నహింసయు సత్యమ్మును నస్తేయమ్మును బ్రహ్మచర్యంబును దయయు నార్జవమ్మును క్షమయు ధృతియు మితాహారమ్మును శౌచమ్మును ననునీపదియు యమంబులు. తపంబును సంతోషంబును నాస్తికత్వమ్మును దానమ్మును దేవపూజయు సిద్ధాంతశ్రవణమ్మును లజ్జయు మతియు జపమ్మును హోమమ్మును నను నీపదియు నియమమ్ములు. పద్మాసనమ్మును స్వస్తికమ్మును భద్రమ్మును వజ్రాసనమ్మును వీరాసనమ్మును ననునివి యైదును నాసనమ్ములు. ౯-౨౨

గీ. చరణతలములు రెండును సక్థులందుఁ
జేర్చి బొటవ్రేళులను రెండుచేతులఁ గొన
వలయు వ్యుత్క్రమమగు గతి నలయి కెడలి
యదియ పద్మాసనము భూధరాధినాథ. ౯-౨౩

సీ. చరణతలమ్ముల జానూరుమధ్యభా
గమ్మున నిడి ఋజుకాయుఁడగుట
స్వస్తికమ్మండ్రు; 1 సీవనిపార్శ్వములయందు
గుల్ఫద్వయమ్ము దగులఁగ నిల్పి
యండకోశాధస్సమర్పిత పాదపా
ర్ష్ణి యగుచుఁ గరముల చేతఁ బట్టి
కొనుట భద్రాసనమనియండ్రు; జానుభా
గములందుఁ బ్రత్యఙ్ముఖమ్ములైన

గీ. వ్రేళ్లుగల చేతుల నిమిడ్చి కాళ్లు దొడల
యందుఁ గ్రమముగ నిడుట వజ్రాసనమగు;

1 సీవని = అండస్థాశిరా

నొకపదము క్రిందఁ దొడమీఁదనొకటి యుంచి
యమర ఋజుకాయుఁడగుట వీరాసనంబు. ౯౨౮

వ. షోడశమాత్రాప్రణవోచ్చారణకాలమ్మున నిడానాడిచే బాహ్యవాయువు నాకర్షించి చతుష్షష్టిమాత్రాప్రణవోచ్చారణకాలమున సుషుమ్నానాడిచే నద్దానినాఁగి ద్వాత్రింశన్మాత్రాప్రణవోచ్చారణకాలమ్మునఁ బింగళానాడిచే నల్లన రేచించుట ప్రాణాయామమ్మనాఁబడు. ఇయ్యది సగర్భవిగర్భ భేదమ్మున రెండు తెఱంగు; లందు జపధ్యానాదిసహితం బాద్యంబు, తదపేతంబు ద్వితీయంబు.

గీ. క్రమముగా నిట్టులభ్యాసకలన నెగడు
ధన్యునకు స్వేదకంపభూత్యాగములు ల
భించు; నం దాద్య మధమత మించు, రెండ
వయది మధ్యమమగు మూఁడవయది మేలు. ౯౨౯

వ. స్వస్వవిషయమ్ముల నిరర్గళమ్ముగ సంచరించు నింద్రియమ్ముల నరికట్టుట ప్రత్యాహారంబు. మఱియు నంగుష్ఠగుల్ఫజానూరుమూలాధారలింగనాభులయందును హృ 1 ద్గ్రీవాకంఠదేశమ్ముల యందును 2 లంబికయందును నాసయందును భ్రూమధ్యమస్తకాదులయందును యథావిధిగఁ బ్రాణమరుద్ధారణంబు ధారణ యనఁబడు; చైతన్యాంతరవర్తియును సమాహితమ్మును నగు మనమ్ముచే నాత్మయం దభీష్టదేవతాధ్యానంబు ధ్యానంబు నాఁదగు; జీవపరమాత్మలకు సమత్వభావనసమాధినాఁబరగు; నిది యష్టాంగలక్షణం బింకమంత్రయోగం బాకర్ణింపుము. చంద్రసూర్యాగ్ని తేజోయుక్తమ్మును జీవబ్రహ్మైక్యరూపకమ్మును బంచభూ

1 గ్రీవ = మెడ, కంఠము = కుత్తుక. 2 లంబిక = కొండనాలుక.

తాత్మకమ్మునగు విశ్వాంబు శరీరంబు. అందు మూఁడుకోట్ల యేఁబదిలక్షల నాడులుగలవు. అందును బది ప్రధానంబులు. అందు మూఁడు ప్రధానతమమ్ములు. వానినామమ్ము లిడాపింగళాసుషుమ్నలు. ఇం దిడానాడి చంద్రరూపిణి. పింగళ శక్తిరూపయు నమృతవిగ్రహయు పుంరూపయు సూర్యవిగ్రహయునై వెలయు. ఈరెండును మేరుదండస్థితమ్మును సూర్యచంద్రవహ్నిరూపిణియు నగు సుషుమ్నానాడికి వామదక్షిణపార్శ్వమ్ముల నొప్పెడి. సర్వతేజోమయమ్మగు నీ సుషుమ్నానాడియొక్క మధ్యమ్మునందు విచిత్రానామకంబగు నొక యవాంతరనాడియుండు. దాని మధ్యమ్మునందుఁ గోటిసూర్యసమప్రభమ్మును నిచ్ఛాజ్ఞానక్రియాత్మకంబును నగు స్వయంభూలింగమ్ము కలదు. తదూర్ధ్వమ్మున హ్రీంకారాత్మకంబగు మాయాబీజమ్ము వఱలు. తదూర్ధ్వమ్మున రక్తవిగ్రహయు దీపశిఖాకృతియునగు కుండలి చెలంగు. అదియు దేవ్యాత్మికయనం బరఁగుఁ; దద్బాహ్యమ్మున వకారాది సకారాంత చతుర్దళమ్మును బీతవర్ణమ్మును దీప్తహేమసమప్రభమ్మును నగు పద్మమ్మును తదూర్ధ్వమ్మున ననలప్రఖ్యమ్మును వజ్రకాంతమ్మును బకారాది లకారాంత షడ్దళంబును 1 స్వాధిష్ఠానమ్మునగు 2 మూలాధారంబు కలదు. తదూర్ధ్వమ్మున నాభిదేశమ్మున మేఘాభమ్మును విద్యుత్ప్రభమ్మును బహుతేజోమయమ్మును డకారాది ఫకారాంత దశవర్ణదళసంయుతమ్మును విష్ణ్వధిష్ఠితమ్మును విష్ణ్వాలోకనకారణమ్మును నగు 3 మణిపద్మమ్ము గలదు. తదూర్ధ్వదేశమ్మున ద్వాదశదళయుతంబును నుద్యదాదిత్య సన్నిభంబును నానంద నిల

---

1 స్వాధిష్ఠానమ్ము, స్వస్య=తనకు. అనగా పరలింగమునకు ఆధారము.

2 మూలాధారము=ఆధారాదిషట్కమ్మునకు మూలము. 3 మణిపద్మము=మణివలె వికసించిన పద్మము. మణిపూరమనియుం గలదు.

యంబును కకారాది ఠకారాంత వర్ణఘటితమ్మును రుద్రాధిష్ఠితమ్మునునగు 1 ననాహతపద్మంబుకలదు. తదూర్ధ్వమ్మున షోడశస్వరయుక్తమ్మును ధూమ్రవర్ణమ్మును మహాప్రభమ్మును నగు షోడశదళపద్మం బెలర్చు; నయ్యది పరమాత్మావలోకనద్వారమ్మున జీవునకు శుద్ధినొడఁగూర్చుటం జేసి విశుద్ధంబనఁబడు ; నిద్దానికి నాకాశంబనియు నామాంతరమ్ము గలదు. తదూర్ధ్వమ్మున నాజ్ఞాచక్రంబు పొసఁగు. దీనియందు జీవునకు నితికర్తవ్యతా విషయమ్మగు పరమేశ్వరాజ్ఞ సంక్రమించుకతన దీని కీనామం బన్వర్థంబగు. ఇదియాత్మాధిష్ఠానంబు. ఇయ్యది హకార క్షకారాత్మక ద్విదళయుక్తంబు. దీనిమీఁద కైలాసచక్రంబును, దానిమీఁద రోధినీచక్రంబును వఱలు. తదూర్ధ్వంబునఁ బరమాత్మస్థానంబగు సహస్రారచక్రంబు గలదు. ఇయ్యది యాధారచక్రంబుల క్రమంబు. ముందుఁ బూరకయోగంబున బాహ్యవాయువుల నాకర్షించి కుంభకంబొనరించి, యవ్వాయువుతోఁగూడఁ దనమనంబును మూలాధారమందుఁ జేర్పవలయుఁ బిమ్మట మూలాధార చక్రమునందలి 2 కుండలినీ శక్తిని మూలాధారగతవాయువుచేఁ బీడించి మేల్కొల్పవలయు. అటులొనర్చి మున్ను వివరింపఁబడిన చక్రములమొదలి తేజోమయస్వయంభూప్రముఖ లింగములను భేదించుచు సమ్మార్గంబున నక్కుండలిని సహస్రారమును బొందింపవలయును. అనంతర మ్మటనున్న శంభునితో నక్కుండలిని నైక్యంబు భావింపవలయు ; నయ్యెడ శివశక్తి సమాయోగంబునఁ బొడమిన ద్రుతలాక్షారస సమానవర్ణంబగు నానందరసాత్మకామృతంబును గుం

1 అనాహతమనగా, తాడనములేకయే ధ్వని కలిగియుండునది.

2 కుండలిని = శక్తి.

డలినిచే ద్రావించి పదపడి పూర్వోక్తషట్చక్రాధిష్ఠానదేవ తల నెల్ల నయ్యమృతమ్మునన సంతర్పించి, పిమ్మట నేమార్గమ్మునం గుండలిని సహస్రారము నందెనో, యామార్గమ్మునన మూలాధార చక్రమ్మునకు దింపవలయు. ౯ ౨౭

క. ఈరీతి ననుదినం బే
వారైన నొనర్తురేని వారు జరామృ
త్యారూఢింగాంచక సం
సారము దరియింపుదురు రసాధరమౌళీ. ౯ ౨౮

వ. వారికి ఛిన్నాదిదోషదూషితమ్ములగు మంత్రమ్ములు సైతము సిద్ధించు. వేయేల? జగన్మాతనగు నాయం దేయేగుణంబు లెసంగు నయ్యవి వారియందును వర్తించెడి. ఇయ్యది వాయుధారణప్రకారం బిట్టిధారణంజేసి దికాలాద్యనవచ్ఛిన్నమగు నాయాకృతి జిత్తమునుంచి జీవబ్రహ్మైక్యయోజనంబుకతనం దన్మయుండగు. అట్లమలినంబగు చిత్తంబు సిద్ధింపదయేని యవయవయోగమ్మున యోగాభ్యాసం బొనరించునది. మదీయంబులగు హస్తపాదాదుల మనంబు గుదిగొల్పి క్రమక్రమమ్మునం బ్రతిస్థానమ్ము గడచి విశుద్ధచిత్తుండై మదూపమ్మున మనమ్ము నిచి, చిత్తలయంబగుదనుక జపహోమాదికంబుల నిష్టమంత్రాభ్యాసంబొనర్చి జ్ఞానప్రాప్తి నందవలయు. పదపడి పూర్వోక్త యోగాభ్యాసమ్మున కర్హతగలిగెడి. యోగములేని మంత్రమ్మును మంత్రములేని యోగమ్మును లేవని యెఱుంగునది. ౯ ౨౯

తే. గీ. యోగమంత్రమ్ము లెంచు నన్యోన్యసాధ
కములగుచు బ్రహ్మసిద్ధికిం గారణములు
బ్రహ్మ మగుపడనగును మంత్రమున దివ్వె
కతనం జీకటి యింటిలోం గలశి పగిది. ౯ 30

తే. గీ. ఇట్టి యోగమంత్రమ్ముల నెఱుఁగఁబడెడి
మాయచే నావృతం బాత్మమోయగేశ!
యోగవిధి దేశికుని గొల్చి బాగుగ నెఱుఁ
గంగవలె శాస్త్రపఠనమ్ము గలుఁగలేదు. ౩౧

తే. గీ. స్వప్రకాశంబు బుద్ధినిష్ఠంబు బ్రహ్మ
మిందుఁ గల్పిత మీజగమెల్ల బ్రహ్మ
మరయ నేరికిఁ గాదు శక్యంబు దీని
నెఱుఁగువాఁడు మృగ్యుండని యెఱుఁగు మచల! ౩౨

—* ధ్యానయోగము *—

వ. వెండియు సదసద్వరేణ్యమ్మును, పరమ్మును, విజ్ఞానాగోచరమ్మును, వరిష్ఠమ్మును, లోకాధారమ్మును, సూక్ష్మమ్ముకన్న సూక్ష్మమ్మును, స్థూలమ్ముకన్న స్థూలమ్మును, నక్షరమ్మును, నమృతమ్మును, సత్యమ్మును నగు పరబ్రహ్మంబు నెఱుంగవలయు. అదియెట్లంటేని? ఔపనిషదంబగు ధనువునం దుపాసనంబుచే నిశితంబగు మనంబు శరంబు సంధించి తల్లక్ష్యంబు భేదింపవలయు. మఱియుఁ బ్రణవమ్ము ధనువును, నంతఃకరణమ్ము శరమ్మును, బ్రహ్మంబు లక్ష్యమ్మునుగాఁ జూపట్టుఁ దద్భేదనమ్మునకు నప్రమత్తచిత్తత్వం బపేక్షితంబగు. అది సమకూరినచో శరమ్మునకుంబలెఁ దన్మయత్వం బలవడునని వెండియు, ౩౩

క. దివియును నాకాశంబుఁ బృ
థివి మది ప్రాణములు నెందొదిఁగి వఱలు నదే
యవు నాత్మ దీని నెఱుఁగుము
యవితథముగ నితరవిద్య లవియేమిటికిన్. ౩౪

వ. ఇదియ మోక్షప్రాప్తికిఁ బరమసాధనంబగు మార్గము. మఱియు
రథనాభియం దరమ్ముల తెఱంగున నాడులన్నియు నెందుండు
నతండ సర్వాంతర్యామియు బహుధాజాయమానుం డనియు
నెఱింగి యప్పరవస్తువు "నో" మనుచు నజ్ఞాననాశనమ్మునకై
ధ్యానింపుము. నీకు శుభంబగు నయ్యాత్మ దివ్యంబగు వ్యోమ
రూపబ్రహ్మపురమ్మున నుండునని తెలిసికొనుము. ౯౩౫

తే. గీ. ఆతఁడు మనోమయుండయి ప్రాణదేహ
నేతయయి యన్నగతుఁడయి నెగడు నట్టి
కేవలానంద మమృత మీక్షింతురి ధీరు
లైనవారలు తమ ఘనజ్ఞానపటిమ. ౯౩౬

క. ఉడుగనికర్మమ్ముల పెం
పడఁగుఁ దన హృదయసంశయంబు లడంగుఁ
విడునొగి హృదయగ్రంథియు
నడరు పరాపరముఁజూచి నంతన యెందుఁ. ౯౩౭

క. తనరు హిరణ్మయకోశం
బున జ్యోతిర్జ్యోతి విరజమును నిష్కళముఁ
ఘనమునునగు బ్రహ్మము నెఱిఁ
గినవారలె యాత్మవిదులు గిరికులతిలకా. ౯౩౮

తే. గీ. అచట వెలుఁగడు సూర్యుఁ డబ్జారి తార
కలును మెఱుపులు వెలుఁగవు వెలుఁగ దగ్ని
యాత్మయె వెలుంగు నవ్వాని ననుసరించి
సర్వము వెలుంగుఁ దత్కాంతి జగము వెలుఁగు. ౯౩౯

తే. గీ. పార్శ్వముల ముందు వెనుక నభమ్మునందు
బ్రహ్మమ ; జగంబు సర్వంబు బ్రహ్మమనుచు

ననుభవమ్మున నెఱిఁగిన యట్టివాఁడు
ధన్యుఁడు కృతార్థుఁ డుత్తమతముఁడు గిరిప ! ౯౪౦

క. రెండవవాఁడుండిన భయ
ముండెడి నవ్వాఁడ లేకయుండిన భయమె
ట్లుండెడి ? నద్వైతంబిటు
పండిన నోకలోపము న్నె ? పర్వతమాళీ. ౯౪౧

వ. వానికిని నాకును వియోగంబు లేదు. వాఁడ నేను; నేన వాఁడని యెఱుంగుము. జ్ఞానవంతుండున్న చోటన యేనుందు. జ్ఞాని హృదయాంభోజమధ్యమ్మునందక్కఁ గైలాసవైకుంఠాదిలోకమ్ముల నే నుండుదానఁగాను. ౯౪౨

తే. గీ. నన్నుఁ బూజించుకంటె ననంతకోటి
గుణితఫలమిచ్చు మద్భక్తకోటిపూజ ;
వాఁడ ధన్యుండు కృతకృత్యు వానితల్లి
వానివంశంబు శస్తంబు వంద్య మనఘ. ౯౪౩

క. ఎవని మనమ్మునఁ జిల్లయ
మవు బ్రహ్మజ్ఞానమబ్బ నతనికతనఁ బు
ణ్యావతి ధర యింక నా చె
ప్పవలసినది నీకు లేదు పర్వతమాళీ. ౯౪౪

వ. ఇది భక్తియుక్తుండును సత్స్వభావుండుననగు జ్యేష్ఠపుత్త్రునకును దాదృశుండగు శిష్యునకుఁ దక్క వేఱొక్కని కెఱిఁగింపఁ దగదు. దేవతాగురుభక్తియుక్తుల కుపదేశించు బ్రహ్మవిద్యయ సుప్రకాశితంబు. తదుపదేష్టయ పరమేశ్వరుండు. బ్రహ్మజన్మప్రదాయకుండు; తండ్రికంటెను నధికుండు. వాని ఋణంబు తీర్చువాఁడు లేఁడని చెప్పి మఱియు నిట్లనియె. ౯౪౫

ఆ. వె. గురువు ప్రోచు శివుఁడు కోపించెనేనియు
గురువు శిష్యునెడలఁ గోపియైన
శివుఁడు ప్రోవలేఁడు ; సిద్ధమియ్యది కాన
గురువు నెడల భక్తిఁ బొరయవలయు. ౯౪౬

క. త్రికరణశుద్ధిగ గురునెడఁ
బ్రకటింపఁగవలయు భక్తి, బ్రహ్మజ్ఞానా
త్మకమగు విద్యనిడిన గురు
నకు ద్రోహమొనర్చినట్టి నరుఁ డఘమొందున్. ౯౪౭

వ. మున్నింద్రునిచే 1 నథర్వణుండు శిరశ్ఛేదమ్ము పణమ్ముగాఁ బడసిన బ్రహ్మవిద్య నశ్వుల కుపదేశించినకతమ్మున నింద్రవజ్రభిన్నశిరస్కుండై మరల నాభిషగ్వరులచే సంయోజితశిరస్కుండయ్యెఁ గావున, ౯౪౮

తే. గీ. బ్రహ్మవిద్య లభించుట బహుళకష్ట
సాధ్య మది యీఁదగ దపాత్రజనులకెందు
సుజనుల కొసంగుచును దారు సుకృతమంది
సుకృత మందింపవలయు శిష్యులనుగూడ. ౯౪౯

—* భక్తియోగము *—

వ. అని యుపదేశించిన యంబాగాంచి హిమాలయంబు మధ్యమాధికారియగు విరాగికి జ్ఞానలబ్ధికై సుఖోపాయం బానతీవేయనుడు నాపె యిట్లనియె. ౯౫౦

1 ఈయథర్వణుని పేరు దధ్యఙ్ముని. ఇతని మొదటిశిరస్సును అశ్వినులునఱికి యశ్వశిరము నతికిరి. ఇంద్రుఁ డద్దానినే ఛేదించెను. పిదప స్వశిరస్సునే యశ్వినులు సంధించిరి.

తే. గీ. కర్మయోగంబు జ్ఞానయోగంబు భక్తి
యోగమను మూఁటిలో భక్తియోగము సుక
రంబు మనుజులకెల్లఁ గరంబు కాయ
మానసాదులకును బీడలేనికతన. ౯౫౧

వ. గుణత్రయభేదమ్మునంజేసి మనుష్యులభక్తియును మూఁడు తెఱంగు లందు, ౯౫౨

క. పరపీడ చేయుటకు మ
త్సరముఁ గ్రోధంబుఁ దాల్చి దంభమ్ము పుర
స్సరముగ నడచెడి నరఘ
స్మరులకుఁ గలభక్తి తామసంబు గిరీంద్రా! ౯౫౩

క. అసమున సక్తియుఁ గోర్కుల
పసయును భేదమతి భోగపరతయుఁ గల మా
నిసులదయిన భక్తియ రా
జసియగుఁ దత్కృతులకు ఫలసక్తతకలిమిన్. ౯౫౪

క. పరమేశార్పణముగఁ గ
ర్మరతియు వేదమ్ములందు మాన్యతయును ది
వ్యరసాయనమ్ములగు మ
త్పురాణములు వినుట సత్త్వపున్ బత్తియగున్. ౯౫౫

వ. ఈ సత్త్వభక్తి యపరభక్తి ప్రాపికయగుఁగాని తక్కురెండును గానేరవు. మద్గుణశ్రవణమ్మును, మన్నామకీర్తనమ్మును, గళ్యాణగుణరత్నంబులకు నాకరంబనగు నాయందుఁ దైలధారాసమంబుగఁ జిత్తంబునిలుపుటయు, సామీప్యసాయుజ్యసాలోక్యమ్ములం దిచ్చలేకుండుటయు మత్సేవకంటె నన్యమెఱుంగమియు, సేవ్యసేవక భావమ్మునంజేసి మోక్షమ్మునం దనిచ్ఛయుఁ, బరానురక్తి

కలిమి నన్ను జింతించుటయు, స్వాభిన్నంబుగ నన్నుఁ దెలియుటయు, సర్వజంతువులయందు మద్రూపంబు భావించుటయు, స్వాత్మ యందుంబోలెఁ బరాత్మయందుఁ బ్రీతియుఁ, జైతన్యంబుల కైక్యం బెఱింగి భేదబుద్ధి లేకుండుటయు, నాచండాలాంతంబు సర్వ ప్రవర్తమానయు సర్వరూపయునుగా నన్నెఱింగి వారింబూజిం చుటయు, నమస్కరించుటయు, నెందేని ద్రోహబుద్ధి లేకుండు టయు, మదాలయసందర్శనంబునందును మద్భక్తాలోకనంబు నందును, నాసక్తియు, మచ్ఛాస్త్రమంత్రతంత్రాదిశ్రవణ శ్రద్ధయుఁ బ్రేమాకులమతియు, రోమాంచితశరీరుండును, గద్గదకంఠుండును, నానందాశ్రుజల పూర్ణలోచనుండును నగుచు ననన్యభావమ్మున సర్వకారణకారణంబ నగునన్ను యజించుటయు, మదీయంబులగు నిత్యనైమిత్తికవ్రతంబులాచరించుటయు, మదు త్సవదిదృక్షయు, నస్మదుత్సవకరణమ్మును, మన్నామంబుల యు చ్చైర్గానంబును, దదనుగుణంబగు నృత్యంబును గలిగి నహం కారరహితుండును, దేహతాదాత్మ్యవర్జితుండును నగుచుఁ, బ్రారబ్ధానుగతమ్ములగు కర్మమ్ము లనుభవించుచు నందు విచా రంబు లేకుండుటయు మున్నగు గుణంబులుగల వానిభక్తి పరభక్తి యనఁబడు. నిట్టిభక్తుండు చిన్మాత్రమ్మగు మద్రూపమ్మున లయంబుఁ జెందు. నేతాదృశమ్మగుభక్తినే జ్ఞానమ్మనియెఱుఁగఁ దగు. ఇయ్యదియ వైరాగ్యపరమావధియునని మఱియునిట్లనియె.

క. ఏతాదృశుఁడగు భక్తిస
మేతుండును బూర్వకర్మమేళనమున వి
జ్ఞాతృత్వము పొరయనిచో
నాతఁడు మద్ద్వీపమునకు నరుగు గిరీంద్రా. ౯౫౭

వ. అచట నిచ్చలేకయు సమస్తభోగమ్ము లనుభవించుచుఁ బిదపఁ జిద్రూపజ్ఞానమ్ముఁగాంచి దానంజేసి ముక్తిం బడయు. ఈ లోకమ్మునన దృఢతరజ్ఞానమ్ముకలవాఁడు బ్రహ్మతాదాత్మ్యంబు గాంచు. బ్రహ్మము నెఱింగినవాఁడ బ్రహ్మమ్మని యెఱుంగుము. భ్రాంతితిరోహితంబగు కంఠచామీకరంబు భ్రాంతినాశమ్మునం జేసి తెలియుపగిది నజ్ఞానచ్ఛన్నంబగు నాత్మను జ్ఞానమ్మునం దెలియుట లబ్ధలబ్ధియగుఁ గాని వేఱొండుగాదు. ౯౫౮

తే. గీ. జగతి వైరాగ్యవంతుఁడై జ్ఞానహీనుఁ
డగుచు మృతిఁజెందెనేని యయ్యనఘచరితుఁ
డంబుజోద్భవలోకంబునందు సౌఖ్య
మమర వసియించు నాకల్ప మద్రినాథ. ౯౫౯

తే. గీ. అట్లువసియించి శ్రీమంతులైనవారి
యింట జనియించు విజ్ఞాన మెసక మెసఁగ
ముక్తియును జెందుఁ గావున మోక్షకామి
జ్ఞాన మార్జింప యత్నంబు సలుపవలయు. ౯౬౦

వ. విజ్ఞానంబన ననేకజన్మసాధ్యంబగుట నద్దానికై ప్రతిజన్మమ్మునను బ్రయత్నంబొనర్పవలయుఁ గానినాఁడు పూర్వపదభ్రష్టుండును గాఁగలఁడు. ౯౬౧

తే. గీ. జన్మములయందు మానవజన్మ మధిక
కష్టసాధ్యంబు దాన నగజతయును శ
మాదిషట్కంబు యోగసంప్రాప్తి మంచి
గురువు దొరకుట దుర్లభ మరయనెందు. ౯౬౨

వ. ఇయ్యవి దొరకొనినను నింద్రియపాటవమ్మును 1 దను సంస్కృతత్వమును దుర్లభంబులగు. ౯౬౩

క. ఏతాదృశసాధన సము
పేతుండయ్యును సుబుద్ధిపెంపున విజ్ఞా
నాతిశయముఁ గొన నెంచని
పాతకిజన్మంబుఁ దలఁప వ్యర్థముగుఁజుమీ. ౯౬౪

క. జ్ఞానమార్జింపఁ దివిరెడి మానవుండు
ప్రతిపదమ్మును హయమేధ ఫలముచెందు
సర్వభూతములందు విజ్ఞాన ముండుఁ
బాల ఘృతమున్న భాతిగఁ బర్వతేంద్ర. ౯౬౫

వ. మనమ్మను మంథానమ్మున విజ్ఞానంబు తఱచిన దానంజేసి చిత్తైక్యంబు దొడరునని వేదాంతసిద్ధాంతంబని నొడువు నప్పరాంబికకు హిమాద్రియిట్లనియె. ౯౬౬

తే. గీ. అంబ ! చూడంగఁదగిన దేశంబులెవ్వి ?
సంతసంబిచ్చునట్టి యుత్సవములెవ్వి ?
తనరఁజేయంగఁదగిన వ్రతమ్ములెవ్వి ?
చెప్పుమీ యన నిట్లని చెప్పఁదొడఁగె. ౯౬౭

క. అన్నియు దృశ్యస్థానము
లన్నియుఁ గృత్యవ్రతమ్ము లన్నియు మత్స
ర్వోన్నతమహాకాలమ్ములు
కొన్ని వచించెదను నందుఁ గొనకొని వినుమా. ౯౬౮

---

1 వేదోక్తసంస్కారవత్త్వము.

—* దేవీవ్రతోత్సవాదికము *—

వ. లక్ష్మీనివాసంబగు కోలాపురమ్మును, రేణుకానివాసంబగు మాతృపురమ్మును హింగుళానివాసంబగు తుళజాపురమ్మును, జ్వాలాముఖీనివాసంబగు సప్తశృంగంబును, శాకంభరీ భ్రామరీ రక్తదంతికా దుర్గా స్థానమ్ములును, వింధ్యాచలనివాసినీ స్థానమ్మును, సన్నపూర్ణానివాసమ్మగు కాంచీపురమ్మును, భీమాదేవియు, విమలయు, శ్రీ చంద్రిలయుఁ, గౌశికియు నుండుచోటులును, నీలాంబానివాసంబగు నీలాచలంబును, జాంబూనదేశ్వరీ స్థానంబగు శ్రీనగరంబును, గుహ్యాకాళీస్థానంబగు నేపాళమ్మును, మీనాక్షీస్థానంబగు (1) చిదంబరంబును, సుందరీసమధిష్ఠితంబగు వేదారణ్యంబును, (2) బరశక్తి నివాసంబగు నేకాంబరంబును, దక్షిణదేశస్థితంబగు మహాలసాస్థానంబును, వరాటదేశస్థితంబగు యోగీశ్వరీస్థానంబును, చీనదేశస్థితంబగు నీలసరస్వతీస్థానంబును, వైద్యనాథక్షేత్రస్థంబగు బగళాస్థానంబును, భువనేశ్వరినగు నా స్థానంబు మణిద్వీపంబును, శ్రీమత్త్రిపురభైరవీస్థానంబగు (3) కామాఖ్యాయోనిమండలంబును, దృశ్యంబులు. ఇందుఁ దుట్టతుదిస్థానంబగు యోనిమండలంబు మహామాయాధిష్ఠితంబగుకతన భూమండలస్థితంబులగు క్షేత్రమ్ములకెల్ల రత్నంబనంబరంగు. దీనికెక్కుడుక్షేత్రం బీధరాతలమ్మునలేదు. ప్రతిమాసంబున శ్రీదేవి యెచటరజస్వలయగునో (4)తాదృశంబగు కామాఖ్యాయోనిమండలమ్మునఁ గలదేవతలందఱును బర్వతతాదాత్మ్యం

1 చిదంబరము, హాలాస్యస్థానము, 2 పరశక్తి, భువనేశ్వరి, 3 దీనిం గూర్చి విస్తరముగ యెఱుఁగఁగోరువారు కాళికాపురాణమునందగు, కామాఖ్య సతీదేవి యోని మండలము పడినచోటు. 4 ఈ రజస్వలాప్రసక్తిం గూర్చి కాళికాపురాణమున విస్తరించి కలదు.

బుచెంది వసింపుచుందురు. వేయేల ? తద్యోనిమండల క్షేత్రమ్ము నకు సంబంధించిన పృథివియెల్ల దేవీరూపంబుగా నెఱుంగఁదగు. మఱియుఁ బుష్కరమ్మున గాయత్రియు, నమరేశ్వరమ్మునఁ జండికయుఁ, బ్రభాసమ్మునఁ బుష్కరేక్షణియు, నైమిశమ్మున లింగధారిణియు, బుష్కరాక్షమ్మునఁ బురుహూతయు, నషాఢియందు రతియుఁ, జండముండి మహాస్థానమ్మునఁ బరమేశ్వరియగు దండినియు, భారభూతియందు భూతియు, నాకులమ్మున నకులేశ్వరియు, హరిశ్చంద్రమ్మునఁ జంద్రికయు, శ్రీగిరియందు శాంకరియు, జప్యేశ్వరమ్మునఁ ద్రిశూలయు, నామ్రాతకేశ్వరమ్మున సూక్ష్మయు, 1 మహాకాళమ్మున శాంకరియు, మధ్యమేశ్వరమ్మున శర్వాణియుఁ, గేదారమ్మున మార్గదాయినియు, భైరవమ్మున భైరవియు, గయయందు మంగళయుఁ, గురుక్షేత్రమ్మున స్థాణుప్రియయు, నాకులమ్మున స్వాయంభువియును, గనఖలమ్మున నుగ్రయు, విమలేశ్వరమ్మున విశ్వేశయు, నట్టహాసమ్మున మహానందయు, మహేంద్రమ్మున మహాంతకయు, భీమంబున భీమేశ్వరియు, వస్త్రాపథమ్మున భవానియు, నర్ధకోటికమ్మున రుద్రాణియు, నవిముక్తమ్మున విశాలాక్షియు, మహాలయమ్మున మహాభాగయు, గోకర్ణమ్మున భద్రకర్ణియు, భద్రకర్ణికమ్మున భద్రయు, సువర్ణాక్షమ్మున నుత్పలాక్షియు, స్థాణుసంజ్ఞకమ్మున స్థాణ్వీశయుఁ, గమలాలయమ్మునఁ గమలయు, ఛగలండమ్మునఁ బ్రచండయుఁ, గురండలమ్మునఁ ద్రిసంధ్యయు, మాకోటమ్మున ముకుటేశ్వరియు, మండలేశమ్మున శాండకియుఁ, గాళంజరమ్మునఁ గాళియు, శంకుకర్ణమ్మున ధ్వనియు, స్థూలకేశ్వరమ్మున స్థూలయు, జ్ఞానిహృదయాంభోజమ్మున హృల్లేఖయు

1 ఉజ్జయిని.

నివసింతు; రియ్యవి దేవీప్రియతమస్థానంబు లేతత్క్షేత్రమాహాత్మ్యం
బులు మునుమున్న విని తత్తత్క్షేత్రమాహాత్మ్యోక్తంబగు విధాన
మ్మున యజించునది యని మఱియు, ౯౬౯

క. ఈ నే నీకుం జెప్పిన
నానాతీర్థములు కాశినాఁ బురిఁ గల వా
స్థానమ్మున నివసించిన
వానికిఁ దత్తత్ఫలంబు వచ్చు గిరీంద్రా! ౯౭౦

ఉ. వేకువ లేచి వే హృదయవీథిక నంబికఁ బాదుకొల్పి యా
శ్రీకరినామజాలమును బ్రీతిమెయిం జపియించువాఁడు ము
క్తైకనివాసియౌ; నవియె యెవ్వఁడు శ్రాద్ధమునన్ జపించు సు
శ్లోకుఁ డతండు తత్పితరులున్ దగఁ గాంతురు పుణ్యలోకముల్.

వ. ఇవి మదీయనివాసస్థానమ్ములిఁక మద్విషయకవ్రతంబు లనంత
తృతీయావ్రతంబును, రసకల్యాణినీవ్రతంబును, దృతీయాకర్త
వ్యంబగు నార్ద్రానందకరవ్రతమ్మును, శుక్రవారవ్రతంబును,
కృష్ణచతుర్దశీవ్రతంబును, భౌమవారవ్రతంబును, ప్రదోషవ్రత
మ్మును ముఖ్యమ్ము; లందు దేవసహితుండగు మహానటుండు విష్ట
రోపవేశితయగు దేవియెదుట నృత్యంబొనరించు సమయంబగుటం
జేసి ప్రదోషవ్రతం బుత్తమోత్తమంబు. సోమవారవ్రతమ్ము
నిట్టిద యని యెఱుంగుము. ౯౭౨

క. వివిధమ్ములు వ్రతములు మఱి
నవరాత్రిద్వయము మిగులనాకుఁ బ్రియంబౌ
నవివర ? యవియును శారద
నవరాత్రమ్ములు వసంతనవరాత్రమ్ముల్. ౯౭౩

క. ఈ నా చెప్పిన వ్రతములు
పూనికమై నాచరించు పుణ్యాత్ములు స
న్మానితులై మత్సాయు
జ్యానూనసుఖానుభవము నందుదు రెలమిన్. ౯౭౪

—* దేవీపూజావిధానము *—

వ. డోలోత్సవంబును, శయనోత్సవంబును, రథోత్సవంబును, జాగరణోత్సవమ్మును, దమనోత్సవమ్మును, పవిత్రోత్సవమ్మును దక్కంగల మహోత్సవమ్ములును నొనరించుచు, విత్తశాఠ్యమ్ము లేక కన్యాసువాసినీబ్రహ్మచారుల సుమాళంబుగ సుమాదికంబులఁ బూజించియు, సంతర్పణం బొనరించియు నన్నుం గొల్చువారు మత్కరుణాపాత్రులగుచు ధన్యులుగాఁగల; రీవడిగిన ప్రశ్నమ్ములకుత్తరమ్ము లియ్యవి సంక్షేపమ్ముగాఁ జెప్పితి నెన్నండును నశిష్యునకును నభక్తునకును నుపదేశింపకు మనవుఁడు, హిమాద్రి "విధిచోదితంబగు భవత్పూజావిధానం బానతీవే"యని కోరుడు శ్రీదేవి యిట్లనియె. బాహ్యంబనియు, నాభ్యంతరంబనియు, మత్పూజ రెండు తెఱంగు లందు బాహ్యంబు వైదికంబనియు, దాంత్రికం బనియు ద్వివిధంబు. వైదికోక్తదీక్షాపరు లాచరించునది యాద్యంబు. తాంత్రికదీక్షాపరు లొనర్చునది ద్వితీయం బిందాద్యమ్మును రెండువిధమ్ములు గలయది. తత్ప్రకారంబు ముందు వివరించెద. సర్వశక్తిసమాయుక్తంబును, సర్వప్రేరకమ్మును, సహస్రమూర్ధంబును, సహస్రనయనమ్మును, సహస్రచరణమ్మును, నగు నీచూచిన నారూపంబ పరంబుకన్నఁబరంబని యెఱుంగు మద్దానిని బూజించుటయ వైదికంబగుఁ గావున సమాహితచిత్తుండవై యహంకారంబు వర్జించి శాంతిని వహించి,

క. దానిన యజనము సేయుచు
దానిన శరణమ్ము చెంది దానిన మదిలో
నూనుచు దానిన యెంచుచు
దానిన ధ్యానింపుమయ్య తత్పరతఁ దగన్. ౯౭౬

క. నను యాగములం దనుపుచు
మనమున వేఱొండు తలఁపు మాని పెనుతపం
బున దానజపములను వి
న్ననువుగ నర్పింపు లోకనాయిక నగుటన్. ౯౭౭

క. ఏరు మదాసక్తులు నే
వారలు నన్నున్ యజించి భావింతురు మ
త్కారుణ్యపాత్రులెవ్వరు
వారల సంసారబాధ వారింతునొగిన్. ౯౭౮

వ. ధ్యానమ్ముననొండె భక్తియుక్తంబగు జ్ఞానంబుననొండె నన్నుం గననగుఁగాని కేవలకర్మమ్మునఁగాదు. ధర్మమ్మువలన భక్తియు, భక్తి వలన విజ్ఞానంబును లభించు. శ్రుతిస్మృతిబోధితంబగు నదియె ధర్మం; బన్యశాస్త్రబోధితంబగునది ధర్మాభాసమ్ముగాని ధర్మంబుకాదు. సర్వజ్ఞత్వ సర్వశక్తిత్వ యుక్తనగు నావలన వేదమ్ము లుద్భవించె. నాయం దజ్ఞానమ్ము లేకుంటంజేసి యివి ప్రమాణంబు; లజ్ఞానాధీనులగు శాస్త్రకర్తలచే నొనర్పఁబడిన శాస్త్రమ్ములు ప్రమాణంబులుగానేరవు. శ్రుత్యర్థగ్రాహకము లగుకతన మన్వాదిస్మృతులును బ్రమాణంబులు. తంత్రోక్త మ్ములగు ధర్మమ్ములు వేదవిరుద్ధమ్ములగుటంజేసి వైదికగ్రాహ్య మ్ములుగావు. రాజాజ్ఞ సర్వజనమాన్యమగు పగిది నానొడువం బడిన వేదమ్ములు సర్వమాన్యమ్ములు. ముముక్షులకుఁ దదాశ్రి

యణం బవశ్యకర్తవ్యంబు. మదాజ్ఞాసంరక్షణార్థంబుగ బ్రాహ్మ క్షత్రియజాతులు మత్కల్పితంబులు. ధర్మగ్లానియగుతఱిఁ దదభ్యుత్థానార్థం బేనును నమ్మే యవతారమ్ములు ధరింతు. దేవదైత్య విభాగంబు 1 దానంజేసి కల్పింపఁబడియె. వేదోక్తధర్మాభ్యాసం బొనరింపని పాతకుల శిక్షించుపొంటె శ్రవణమాత్రభయప్రదమ్ములగు నరకమ్ములు మన్నిర్మితంబులు. వేదవిరుద్ధశాస్త్రలోడనంబొనర్చువారలు రాజుచే స్వదేశమునుండి నిష్కాసనీయులు. వీరు బ్రాహ్మణులకు సంభాష్యులును బంక్తి గ్రాహ్యులును గారు. భృగుదక్షదధీచుల శాపమ్మున దగ్ధులై వేదమార్గ బహిష్కారమ్ముగాంచిన విప్రులకొఱకు శైవవైష్ణవాద్యాగమమ్ములు శివప్రణీతమ్ములుగాఁ దెలియుము. అయ్యవి వామ కాపాలక కౌలక భైరవాది నామమ్ములఁ బ్రసిద్ధంబులు. మోహనార్థప్రణీతంబులగు నాయా యాగమంబులును సోపాన న్యాయమ్మునఁ గాలాంతరమ్మున ముక్తికారణమ్ములుగా నంగీకరింపఁదగు. వేదాధికారహీనులు, తత్పరసపాఠనాధికారులు. వైదికులకును దద్గతంబులగు వేదావిరుద్ధాంశమ్ములు గ్రాహ్యమ్ములు. వేదమ్ముల నాశ్రయించి ధర్మసహితమ్మగు విజ్ఞానంబు సంపాదించి దానంజేసి యీషణత్రయత్యాగం బొనరించి భూతదయాళుత్వమ్మును నహంకారశూన్యత్వమ్మును గలిగి నన్నె శరణుఁజెంది మద్గతప్రాణులగుచు నుండు సన్యాసులొండె బ్రహ్మచారులొండె గృహస్థులొండె వానప్రస్థులొండె నైశ్వరంబగు యోగమ్మున నన్నుపాసించునది; యని మఱియు నిట్లనియె. ౯౭౯

1 వేదములుండుటం జేసియే వేదరక్షకులు దేవతలనియును, తన్నాశకులు రాక్షసులనియు విభాగం బేర్పడినదని భావము.

క. సతతాభియుక్తులగు వా
రి తమం బజ్ఞానజము హరించెద విను మే
నతిదయ విజ్ఞానాహా
ర్యతిదివ్యతరప్రకాశపటిమ గిరీశా! ౯౮౦

వ. ఇది ప్రథమవైదికపూజాప్రకారం బింక ద్వితీయం బాలింపుము. ప్రతిమయందొండె సూర్యచంద్రమండలమ్ములయందొండె జలమ్మునందొండె యంత్రమ్మునందొండె మహాపటమ్మునందొండె బాణలింగమ్మునందొండె స్థండిలమ్మునందొండె హృదయాంభోజమ్మునందొండెఁ గరుణారసపూర్ణయు, సుగుణయు, నరుణారుణయుఁ, దరుణియు, సౌందర్యసారసీమయు, శృంగారరససంపన్నయు, భక్తార్తికాతరయుఁ, బ్రసాదసుముఖియుఁ, జంద్రఖండశిఖండినియుఁ బాశాంకుశాదిధరయు, నానందరూపిణియునగు నప్పరదేవతను ధ్యానించి తత్తదుపచారమ్ముల విత్తానుసారమ్ముగఁ బూజించునది. ఈ బాహ్యపూజ తనకు నాంతరపూజాధికారంబు వాటిల్లుదనుక ననుసరించి పదంపడి త్యజింపవలయు. ౯౮౧

క. విను మాభ్యంతరపూజన
మన సంవిల్లయము నాకు ననుపాధిక మై
తనరెడి రూపము సంవి
త్తన నెగడుఁ దుషారభూధరాధిపసుతా! ౯౮౨

వ. ఇట్టి మద్రూపమ్మున నిరాశ్రయమ్మునం జేతమ్ము నిలుపవలయు. సంవిద్రూపాతిరిక్తమ్మగు జగమ్మంతయు మాయామయంబకాఁ దెలియుము. ౯౮౩

తే. గీ. భూధరేశ్వర! సంసారమును హరించు
పొంటె నన్నాత్మరూపిణి భువననేత్రి

నిర్మనస్కంబు యోగసన్నిహితమునగు
చేతమున నెంచి భావనసేయవలయు. ౯౮౪

వ. మఱియు బాహ్యపూజాప్రకారం బెట్లంటేని, ప్రాతఃకాలమ్మున లేచి ప్రకాశమానమ్మగు సహస్రారమ్మునఁ గర్పూరమ్ముంబోలె స్వచ్ఛుండును నిజగురుసమానాకారుండును బత్నీసమాయుతుండును లసద్భూషాభూషితుండును సుప్రసన్నుండును నగు శ్రీగురువరుని సంస్మరింపవలయునొండెఁ బతిసంయుతయగు పరశక్తిని స్మరింపవలయు. ౯౮౫

తే. గీ. * కడఁగి ప్రథమమూనమునఁ బ్రకాశమాన
యయి ప్రతిప్రయాణమ్మున నమృతమయత
నలరి యంతఃపదవియందు మెలఁగు నబల
సుందరాకార నెంతు నానందరూప. ౯౮౬

వ. ఇట్లు కుండలినీమధ్యమ్మున ధ్యానించి పిదప శౌచాదిక్రియల నిర్వర్తించి మత్ప్రీతికై యగ్ని నారాధించి హోమాంతమ్మున విష్టరమ్మునఁ గూర్చుండి భూతశుద్ధిఁ జేసి మాతృకాన్యాసంబొనర్చి హృల్లేఖామాతృకాన్యాసంబు సలిపి పూజాసంకల్పంబొనర్ప వలయుఁ; దన్న్యాసక్రమంబు వినుము. మూలాధారమ్మున హకారమ్మును హృదయమ్మున రకారమ్మును భ్రూమధ్యమ్మున నీకారమ్మును మస్తకమ్మున హ్రీంకారమ్మును బొసఁగించి తత్తన్మంత్రోదితమ్ములగు నన్యన్యాసమ్ములు సయితము సలుప వలయుఁ, బదంపడి 1 ధర్మాదులచే నాత్మదేహమ్మునఁ బీఠమ్ముఁ గల్పించి ప్రాణాయామాదులచే వికాసితమ్మగు హృత్పద్మమ్మునఁ

* ఈ పద్యభావమెఱుంగఁ గోరువారు మూలగ్రంథమునఁదలి 'ప్రకాశమానాం' అను శ్లోకవ్యాఖ్యానము చూడందగు. విస్తరభయమున నిందుదాహరింపలేదు.

1 ధర్మజ్ఞాన వైరాగ్యైశ్వర్యములచే

బంచప్రేతాత్మకంబగు మదీయస్థానమ్మున నన్ను ధ్యానింప
వలయు. బ్రహ్మవిష్ణురుద్రేశ్వరసదాశివు లేగురును బంచప్రేత
పదవాచ్యులు. వీరలెల్లప్పుడును మత్పాదమూలమ్మున నుండు
దురు. మఱియును వీరు పంచభూతాత్మకులును బంచావస్థాత్మ
కులు నని యెఱుంగుము. నే నవ్యక్తచిద్రూపనగు కతన వీరల
కతీత నగుటంజేసి వీరలు నాకు విష్టరంబగుట శక్తితంత్రప్రసి
ద్ధంబు. ఇట్లు మానసికమ్ములగు నుపచారమ్ములచే నన్నుం
బూజించి జపించి యద్దాని నాకు సమర్పించి యనంతరమ్ము
బాహ్యపూజార్థం బర్ఘ్యస్థాపనంబొనర్చి పాత్రాసాదనంబు సలిపి
షణ్మంత్రపరిశోధితజలమ్ముచేఁ బూజాద్రవ్యమ్ముల శోధించి
దిగ్బంధం బొనర్చి నిర్వర్తితగురునమస్కారుండై తదనుజ్ఞవడసి
యింతకుమున్ను హృదయమ్మునఁ బాటించు మన్మూర్తిని
బ్రాణప్రతిష్ఠాపనమంత్రమ్ముచే బాహ్యపీఠమ్మున నావ
హింపఁజేసి యర్ఘ్యపాద్యాచమనస్నానవాసోభూషణగంధపుష్పా
దుల భక్తిపూర్వకమ్ముగ సమర్పించి యంత్రస్థమ్ములగు నావరణ
మ్ములఁ బూజింపవలయు. ఇట్లు ప్రతిదినమ్మును నొనరింప
నసమర్థులగు వారలకు నొక్క 1 శుక్రవారంబ నియమింపఁబడు
చున్నయది. అదియుంగాక మూలదేవీప్రభాస్వరూపిణులగు
నంగదేవతల స్మరింపవలయు. ని త్రైలోక్యమ్ము దత్ప్రభా
పటలవ్యాప్తంబని చింతింపనొప్పు. మఱియు సుగంధులగు గంధ
పుష్పాదులచేతను నైవేద్యతర్పణతాంబూలదక్షిణాదులచేతను
ద్వత్కృతమ్మగు 2 నామసహస్రమ్ముచేతను "అహంరుద్రేభిః"
అను దేవీసూక్తోక్తమ్మగు కవచమ్ముచేతను హృల్లేఖోపనిషద్భవ

1 ఇయ్యది యావరణ పూజకుమాత్రమే.

2 ఈనామ సహస్రము కూర్మపురాణమునఁ గలదు.

మ్ములగు దేవ్యథర్వశిరోమంత్రమ్ములచేతను మహావిద్యామహామంత్రమ్ములచేతను నన్ను నావరణదేవతాసహితమ్ముగ సారెకుఁ బూజించి ప్రేమార్ద్రహృదయుండై క్షమాపణం జెప్పికొని,

క. పులకాంకితసర్వాంగత
నలరారుచు బాష్పరుద్ధమగు నక్షియుగం
బొలయంగ నృత్తగీతా
దులచే మెచ్చింపవలయు దొరకొను పేర్మిన్. ౯౮౮

క. వేదములఁ బురాణమ్ముల
నాదగు నిర్ణయము దగఁగనంబడుటను న
త్యాదరమునఁ దత్పరతం
బూఁది ననుం బూజసలుపు టుత్తమహితమా. ౯౮౯

వ. పిదప తనదేహమ్మును నర్థమ్మును మదధీనంబొనర్పవలయు. ఇట్లు ప్రతిదినమ్మును నిర్వర్తించి పదంపడి నిత్యహోమమ్ము సలిపి బ్రాహ్మణులను సువాసినులను వటుకులను దక్కుంగల పామరులను దేవీబుద్ధిచే భోజనాదికమునఁ దనిపి పిదపఁ దన హృదయమ్మున నమస్కరించి సంహారముద్రచే విసర్జనం బొనర్పవలయు. ౯౯౦

గీ. లీలమై నాదుపూజ హృల్లేఖచే నొ
నర్పఁగావలె సర్వమంత్రముల కదియ
నాయిక ; తదంతరాళమునను ననుఁ బ్రతి
బింబితగ నీవెఱుంగు పృథ్వీధరేశ ! ౯౯౧

వ. దానఁజేసి హృల్లేఖాసమర్పితంబగు పూజ సర్వమంత్రసమర్పితంబ యగు ; ననంతరమ్మున భూషాదికమ్ములచే గురుపూజనం బొనర్చి కృతకృత్యత్వమ్ము వహించునది. ౯౯౨

క. ఏవఁ డీభంగిని శ్రీమ
ద్భువనేశ్వరినైన నన్నుఁ బూజించు నతం
డవనీధ్ర! మణిద్వీపము
న వసించు సుఖముల నిహామునఁగాని పిదపన్. ౯౯౩

వ. అట్టివాని నెల్లదేవతలును నమస్కరింతురు. వానికి దుర్లభం బొండుండదు. మత్పూజావిధానంబియ్యదియ. ఇదిమొదలు దీని నరసి యధికారానుసరణమ్మునఁ బూజించితివేని కృతార్థుండవు కాఁగల; వీగీతాశాస్త్రమ్ము నశిష్యునకును నభక్తునకును ధూర్తునకును దుర్వాదునకును నొసంగక గోప్యంబుగనుంచునది. దీనిం బ్రకటించుట మాతృస్తనప్రకటనంబు. వెండియు శిష్యునకును భక్తునకును జ్యేష్ఠపుత్త్రునకును నియ్యది యవశ్యం బొసంగవలయు నియ్యది శ్రాద్ధకాలమ్మున బఠించినఁ బితరులకుఁ బరమపదప్రాప్తి యలవడునని బోధించి దేవి యంతర్ధానంబునందుటయు, దేవతలు దేవీసందర్శనసంగతానందులైరి. ౯౯౪

క. ఆమీఁద గౌరియనఁబోడి
నామమునఁ దుషారగిరికి నందనియై ని
త్యామోదగరిమ వర్ధిలె
నామాతృక ; గిరియు నాపె హరునకు నొసఁగెన్. ౯౯౫

వ. వారలకు స్కందుం డుదయించి తారకు వధియించెనని మఱియును.

క. సురలు తనున్ వేఁడఁగ సా
గరమున జనియించె రమయుఁ గమలాక్షున కి
చ్చిరి వార లాపె, శక్తి
స్ఫురణమ్మున దాన హరియుఁ బొంపిరివోయెన్. ౯౬౭

క. ఇది గౌరీలక్ష్మ్యుజ
న్మదశావిషయంబు మిగులమాన్యం బత్య

భ్యుదయప్రదంబు గోప్యం
బెది నీవడిగితివో దానికిది యుత్తరమా. ౯౯౮

వ. ఇంక నెయ్యది విననిచ్చగింతువని వ్యాసుండు జనమేజయునకుఁ
జెప్పె ననుటయు, ౯౯౯

—* స్కంధాంత పద్యములు *—

ఉ. వాఙ్మనసక్రియాతులితవర్తన ! తత్త్వవిచారధోరణీ
భాఙ్మననప్రచార ! గుణవత్ప్రియశిష్యజనోపవేశితా
వాఙ్మహిమప్రకార ! బుధవర్ణితసత్యవచోవిచార ! వా
ర్మ్మఙ్మహనీయకాయ ! పరిముక్తరేషణ ! శాంతిభూషణా !

క. సరసధరారమణసభాం
తరగతబహుమానసుకవితారసవిచర
త్తిరుపతివేంకటనామ
స్ఫురదస్మద్గురువరేణ్యా ! సూరిశరణ్యా ! ౧౦౦౧

భుజం. జగద్గీతకీర్తీ ! సుశాస్త్రప్రవర్తీ !
నిగర్వప్రచారా ! ఘనీభూతసారా !
నగశ్రేష్ఠజాతాధినాథప్రభూతా
తిగణ్యాంతరాశీతదృష్ట్యంబురాశీ ! ౧౦౦౨

గద్య
ఇది శ్రీ......... తిరుపతి వేంకటేశ్వర ప్రణీ
తంబగు దేవీభాగవతంబను మహాపురాణ
మ్మునందు సప్తమస్కంధము
సంపూర్ణము.
శ్రీ. శ్రీ. శ్రీ.

శ్రీ మత్పరదేవతాయై నమః

దేవీ భాగవతము

అష్టమ స్కంధము

ప
రమోత్కృష్ట గుణాశ్రియ !
సరస్వతీ పురుషరూప ! శర్వాణీచి
త్పర హృదయ ! నిత్య సదయ ! కృ
తిరసోదయధుర్య ! బ్రహ్మదేశికవర్యా ! ౧

వ. అవధరింపు మనంతరంబు శౌనకాదులు సూతుంగాంచి యవ్వలి కత నొడువు మనుడు, సూతుం డిట్లను; నట్లు పురాణకథనోన్ముఖుండగు వ్యాసునకు జనమేజయుం డిట్లనియె. ౨

క. తెలిపితివి పుష్పవద్వం
శ్యుల చరితం బెంతయేని సుఖమగుగతి ని
మ్ముల నిఁక నజ్జగదంబిక
యలఘుతరవిరాట్స్వరూప మాకాంక్షింతుఁగ. ౩

క. ఏ యే మన్వంతరముల
నే యే రూపముల నయ్యధీశ్వరి లోకా
పాయనివారిణి తా నే
యేయెడల వసించెఁ జెప్పు మేయే కృతులన్. ౪

వ. వెండియు మన్మనంబు తత్స్వరూపంబున నెట్లు లగించు నట్టి యుపాయంబును నెఱింగింపుము నావుడు వ్యాసుండు, ౫

క. నరవర ! మును నారదుఁ డీ
క్కరణిన్ నారాయణునిఁ దగన్ గోరఁగఁ ద
త్పరుఁడై వచించె నయ్యది
పరమాదరమున వచింతుఁ బాటింపు మెదన్. ౬

వ. ఒక్కనాఁడు నారదుఁడు లోకమ్ములెల్లఁ గ్రుమ్మరుచు ధరణీతలం బరయువాఁడు నారాయణాశ్రమమ్మున కరిగి యోగాత్ముం డగు నమ్మహాత్మునికి నమస్కరించి యిట్లను. ౭

ఉ. దేవ ! మహానుభావ ! జగతీతల మెక్కతనన్ జనించు ? వృ
ద్ధ్యావహుఁడెవ్వఁ? డెవ్వఁడు లయంబొనరించెడి? నెద్దితత్త్వ? మా
యావిభవమ్ము లన్నియును నెయ్యెడఁ గల్గెడి ? మోహదాత్రి తా
నేవిధి మాయ రూపఱు ? మఱెట్లగు జ్ఞానము ? నాకుఁ దెల్పవే.

క. అనవుడుఁ బ్రాచీనుం డ
మ్మునివరుఁ డిట్టులను నోయి మునివర ! తత్త్వ
మ్మును వచియించెద నెద్దా
నిని విని నరుఁ డఖిలబంధనిర్ముక్తుఁడగున్. ౯

వ. ఇయ్యది మున్ను నానాదేవగంధర్వసహితుండనగు నే నయ్యంబిక నడిగి తెలిసికొంటిఁ దత్ప్రకారం బెట్లంటేని, ౧౦

క. విను మయ్యంబిక సృష్టిం
బొనరించును, బోషించు, విలయమ్ముఁ గొలుపును, నే
పునఁదగు గుణత్రితయ మి
ప్పనులకు నన్నిఁటికినొప్పు భాజన మగుచున్. ౧౧

వ. సిద్ధర్షిపూజితమ్మును, సర్వపాపఘ్నమ్మును, గామమోక్షప్రద
మ్మునునగు నయ్యంబిక స్వరూపమ్ము వచింతు నాలింపుము.
మున్ను శతరూపాపతియును, సర్వమన్వంతరాధినేతయును, బ్రహ్మ
పుత్రుండును నగు స్వాయంభువుండు తన తండ్రియగు ప్రజాపతికి
భక్తియుక్తుండై పరిచర్య సల్పుచుండ నతని కతం డిట్లనియె. ౧౨

క. తనయా! దేవ్యారాధన
మొనరింపుము దాన నీకు నొదఁగూడెడి సృ
ష్టిని నొనరించెడి శక్తి య
నిన స్వాయంభువుఁడు మిగుల నేమము దనరన్. ౧౩

వ. జగద్యోనియగు నయ్యంబం గుఱించి తపంబొనరించి యాద్యయు
మాయయు, సర్వశక్తియు, సర్వకారణకారణంబును నగు నాపె
నిట్లని సన్నుతించె. ౧౪

క. జగతీకారణకారణ
మగణితము ప్రశస్తమగుచు నలరారెడి నీ
దగురూపము నిగమవచ
స్సనగితంబని సన్నుతింతుఁ దత్పరమతినై. ౧౫

క. అయిదాత్రి! మహామాయీ!
భయసంహారిణి! శరణ్యపదశోభిని! స
ర్వయతీంద్రభావ్య! భవభయ
లయకారిణి! నిన్ మదిందలంచెద భక్తిన్. ౧౬

సీ. ఎద్దానికతమున నీవిశ్వ మోతంబు
ప్రోతంబునగుచును బొదలుచుండు
నాద్యంతరహితమై యనఘమై, యేకమై
యెసఁగు నెయ్యది తేజ మెసక మెసఁగ
బ్రహ్మ సృష్టియు, హరి పాలనంబును, గిరీ
శ్వరుఁడు లయమ్మును సల్పుచుండు
నేశక్తి కృపఁజేసి ; యిడయిటులుండ న
మ్మధుకైటభభయమ్ము మలయు ధాత

గీ. యార్తుఁడై యేమహాభాగ నాశ్రయించె
నట్టి స్మృత్యాదికాకృతివై, సుబుద్ధి
దాత్రివై, వేదగర్భవై తనరునిన్ను
సన్నుతించెద నాకుఁ బ్రసన్నవగుము. ౧౭

శా. అంబా ! నిన్నుఁదలంతు, నీపదముల్ ధ్యానింతు, నీనామ వ
ర్గం బేవేళ జపింతు, నీ కెద నమస్కారంబుగావింతు, ని
న్నుం బూజింతు, భజింతు, నెల్లెడలవిందుల్,గందుఁ, బేర్కొందు, న
న్యుం బాటించి యజింప, నన్ను విడువల్ దోసంబు నీకయ్యెడిన్.

వ. బ్రహ్మ వేదనిధియు, హరి లక్ష్మీనివాసంబును, బురందరుండు త్రిలోకాధిపతియు, వరుణుండు యాదోనాథుండును, గుబేరుండు నిధినాయకుండును, యముండు పరేతరాట్టును, నైఋతి రక్షస్స్వామియు, నెక్కతమ్మున నగుదు రట్టి త్రిలోకవంద్యవు, మహా మంగళరూపిణివి నగు నీకు మాటిమాటికి నమస్కారం బని సన్నుతించు స్వాయంభువునకుఁ బ్రసన్నమై, యంబ వరంబు గోరు కొమ్మనుడు నతండు నిరంతరాయమ్ముగఁ బ్రజాసృష్టి నీ యాజ్ఞఁ జేసి యలవడ వలయు నావుడు నట్లగుగునని వరంబిచ్చి వెండియు,

క. ఈ నాస్తోత్రము చదివెడి
మానవులకుఁ బ్రజయు విద్య మాన్యత ధనధా
న్యానూనతకీర్తియు విజ
యానుగతియు సుఖము శక్తి యన్నియుఁగలుగున్.

వ. అని పలికి దేవి యంతర్ధానంబు నందె. పదంపడి లబ్ధవరుండగు నమ్మనువు తండ్రికడ కరిగి, మహాత్మా ! నాకు నేకాంతంబగు స్థానం బొం డిచ్చితివేని యయ్యెడనుండి నేను సృష్టిం బొనర్చుచు దేవేశ్వరుని జన్మములచే యజించువాఁడ నావుడు విధాత తన మనమ్మున, ౨౧

క. ధర సకలాశ్రయ మది యె
వ్వరికిన్ గోచరముగాక వార్ధ్యంతర్గా
స్వరమై యెప్పిడి నిఁక నె
క్కరణిన్ సమకూర్ప నేర్తుఁ గార్యం బకటా. ౨౨

వ. అని వెండియు,

గీ. ఎవనియాదేశమున నేను నిట్టి కృత్య
మునకుఁ బూన్తి నాతఁ డమోఘశక్తి
యాదిపూరుషుఁ డిప్పట్టునందు నాకుఁ
జేయు సాహాయ్యమును జింత సేయ నేల ? ౨౩

వ. మరీచ్యాదులును మన్వాదులును బరివేష్టింపఁ గొలువుండి యిట్లు ధ్యానించు నవ్విరించి నాసాగ్రమ్మునుండి యేకాంగుళప్రమా ణమ్మున నొక వరాహంబు వొడమి యంతన గిరిమాత్రంబై యత్యద్భుతం బొదవించుటయు నతండు మరీచ్యాదులంగని యిట్లు తర్కించు. ౨౪

చ. ఇది కడునద్భుతంబగు నొకించుకయై జనియించి యంతలో
నెదిగి ధరాధరాభమయి యేపునఁబొల్చెడు నిట్టివ్యాజ ము
న్నదియె జగమ్మునం దొకటనంచు వితర్కమొనర్చునంత ను
న్మదతరసూకరాకృతిఁ గనందగు నా భగవంతుఁ డల్లనన్. ౨౪

మ. తనదా ఘుర్ఘురనిస్వనమ్మున దిశల్ తత్తన్మహాలోకముల్
మునులున్ దేవతలున్ గలంగుగతి నేపున్ జూప వారందఱున్
ఘను నయ్యజ్ఞవరాహమూర్తి నుతులన్ గావించి రత్యుత్తమ
స్వనఋక్సామయజుర్వచోవితతి దిగ్భాగమ్ములన్ ముట్టఁగన్.

ఉ. వారల సన్నుతుల్ విని కృపాపరుఁ డక్కిటిమూర్తి శీతలో
దారములైన చూపులను నయ్యమరావళి భీతి మాన్చి దు
ర్వారరయమ్మునన్ జలధివారిఁ జొరంబడు నంతఁ దత్సటా
కూరరహార్తిన్ సహింపక బుగుల్కొను భీతి సముద్రుఁ డిట్లనున్.

గీ. దేవ! దేవేశ! తావకోదీర్ణభంగి
కే సహింపంగఁజాల నన్నేలికొనుము
శరణు, శరణాగతత్రాణ! సదయహృదయ!
యను సముద్రుని మొఱ యల్లనల్ల వినుచు. ౨౫

వ. వెండియు నయ్యాదిదేవుండు,

క. జలచరజాలము నిటునటు
కలఁచుచుఁ, దజ్జలమునం దఖండరయమునన్
బొలుచుచు, నాఘ్రాణించుచుఁ
జెలఁగిచెలఁగి భూమి నొక్కచెంతన్ గాంచెన్. ౨౬

క. అంతర్జలసంగతమును
జంతుసమాశ్రయము నగు రసన్ గని తన దం

ష్ట్రాంతమున నెత్తె నక్కిటి
దంతి నళినిఁ బెఱికి పట్టు దశ దోఃపంగన్. ౩౦

వ. అయ్యెడ న య్యజ్ఞవరాహమూర్తిం గని విరించి,

చ. అలరెడి వేడ్క నీవు ధరనంతయు దంతశిరమ్మునందు ని
శ్చలగతి నిల్ప నయ్యదియు సామజపుష్కరభాగలగ్నప
త్త్రిలలితపద్మినీగతి ముదంబిడెఁ జూచెడివారి కో మహా
బలవిలసచ్ఛరీర ! నతభక్త ! నమస్కృతి నీకుఁ గొల్పెదన్. ౩౧

గీ. సృష్టిసంహారకారక ! దుష్టదాన
వమదహారక ! సర్వదేవమయ తేజ !
వెనుక ముందును నీకు నే వేలకొలఁది
మ్రొక్కు లొనరింతు నాకు సమ్మోద మిమ్ము. ౩౨

క. నీ యాజ్ఞ కల్మి సృష్టిన్
జేయఁగ నే శక్తియుక్తిఁ జెన్నొందితి, దే
వా ! యెల్ల సురలు నీదు స
హాయమ్మునఁ గాదె యమృత మందిరి మున్నున్. ౩౩

గీ. ఇంద్రుఁడు త్రిలోకరాజ్యమ్ము నేలు, వహ్ని
పావకత్వమ్ము గొని యెల్లవారలకును
నొసఁగు నాప్యాయనంబును, వెస జముండు
కలుషము లడంచు నీ నియోగమున దేవ ! ౩౪

వ. వెండియు సూర్యచంద్రవరుణవాయుప్రభృతులును భవన్ని
యోగమ్మునన తత్తత్పదమ్ములఁ గృతకృత్యులై యొప్పుదురు.
త్వదాజ్ఞాకారులలో నొక్కండగు నీశానుండు సర్వలోకైకవం
ద్యుఁడును, దక్కంగల లోకపాలురకు సేవ్యుండును, నెల్లరుద్రు
లకు విభుండునునై యెసఁగెడి; ననేతాదృశమహిమాఢ్యుండ

వగు నీకు నమస్కారం; బని సన్నుతించు విరించి ననుగ్రహించి; యయ్యెడ కటిభీషణాకారమ్మున వచ్చి, మార్గం బరికట్టు దుష్టాత్మ, హిరణ్యాక్షు గదాభగ్నశరీరుం గావించి; తదస్రక్తపంక దిగ్ధాంగుండై, యయ్యవని నయ్యుదకంబుపై నవలీలగా నిలిపి, తన నికేతనమ్మునకుం జని, యద్దేవుండు సుఖంబుండె; నియ్యాది ధరణ్యుద్ధరణం; బిక్కత వినువారలకు సకలశుభమ్ములును గలుగు నని చెప్పి యమ్మునివర్యుండు వెండియు నారదున కిట్లను. అట్లద్దేవుండు వైకుంఠం బలంకరించిన పిదప బ్రహ్మ తన కొమరున కిట్లనియె. ౩౫

మ. తనయా ! యి య్యవనిన్ వసించి ప్రజలన్ దత్తద్విశేషమ్ములో
ప్ప నయమ్మున్ దనరారఁజేయుము, సురూపంబొప్పు సత్కన్యలన్
గని యవ్వారల యోగ్యులౌ వరులకున్ గావింపుమీ పెండ్లి, య
వ్వనజాతాక్షుని యానఁ జిత్తమిడి సద్వంద్యస్థితిన్ బొల్చుమీ.

వ. ఇట్లు లేనిఁ బ్రజావృద్ధియు నీకు యశమ్మును నగునని నొడివి యతని సర్గమ్మున నియమించి విరించి తన ధామమ్మున కరిగె. అంత స్వాయంభువుండు ప్రియవ్రతోత్తానపాదులను మహాతేజస్కులగు నిరువురఁ గొమరులను, నాకూతిదేవహూతికాప్రసూతులను మూగురఁ గొమిరెలనుంగని, యందు నాకూతిని ఋచికిని, దేవహూతినిఁ గర్దమునకును, బ్రసూతిని దక్షునకును నొసంగె; నందు ఋచికి నాకూతియందు యజ్ఞుఁడను నాదిపురుషుండును, గర్దమునకు దేవహూతియందు సాంఖ్యాచారుండగు గపిలుంశు నుదయించిరి. ౩౬

గీ. దక్షునకును బ్రసూతి కుదయమునంది
రనఘమతు లెందఱేనిఁ గన్యకలు వారి

సంతతియ కాదె యీ ప్రపంచమ్ము దేవ
మనుజతిర్యగ్విశేషసమాన్వితంబు. ౩౮

వ. స్వాయంభువమన్వంతరమ్మున భగవంతుండగు యజ్ఞుండు దేవగణ పరివృతుండై రాక్షసుల నడంచి మనువు రక్షించె; మహాయోగి యగు కపిలుం డాశ్రమవాసియై తల్లియగు దేవహూతికి సకలా విద్యానివర్తకంబు జ్ఞానం బుపదేశించి తాను పులస్త్యాశ్రమమ్మున కరిగె; నయ్యుపదేశంబ కాపిలశాస్త్రంబు. ౩౯

క. ఈతఁడు సాంఖ్యాచార్యుం
డేతన్నామము దలంచు నెవ్వం డవ్వాఁ
డాతతమగు సాంఖ్యమునకు
నేతయు, యోగమున మంచి నేర్పరియు నగున్. ౪౦

వ. అట్టి మహాయోగి కపిలాచార్యునకు వందనమ్ము లొనర్తు, నమ్మహాభాగుం డిప్పటికిని జీవించియున్నవాఁ, డియ్యది మను కన్యావంశవర్ణనం; బిది వినువారికి శుభోదర్కంబగు; నిఁక మను పుత్రాన్వయంబు విను మియ్యదియు వక్తృశ్రోతృసుఖావహం బి మ్మనుపుత్రులు సర్వభూతసుఖవ్యవహారసిద్ధి పొందె ద్వీపవర్ష సముద్రాదివ్యవస్థ నొనరించిన ధన్యులు. ౪౧

ఆ. వె. మనువు పెద్దకొడుకు జనకసేవాదరుం
డనఘుఁ డతులమతి, ప్రియవ్రతుండు
విశ్వకర్మ కూఁతు వినయాదికలిత బ
ర్హిష్మతిని వివాహ మెలమి నాడె. ౪౨

వ. అతం డాపెయం దాగ్నీధ్రేధ్మజిహ్వయజ్ఞబాహుమహావీర రుక్మశుక్రఘృతపృష్ఠసవనమేధాతిథివీతిహోత్రకవులను బదుండ్ర వహ్నినామకుల గొమరులనుఁ నూర్జస్వతియను కొండిక

యగు నొక కన్నియను గనియెఁ; బుత్రులందు గవిసవనమహా
వీరులను మూగురు విరాగులై, పరమహంసాశ్రమపదస్థులై,
యూర్ధ్వరేతస్కులై యాత్మవిద్యాపరిష్ణాతులై నిస్పృహులై
చెలఁగి; ఇదియిట్లుండ, నిఁక నొక భార్యయం దుత్తమతామస
రైవతులను మూగురు సుతు లుదయించి మన్వంతరప్రభువులై
యొప్పి; రవ్యాహతబలేంద్రియుండగు నప్ప్రియవ్రతుండు పదు
నొకం డర్బుదమ్ముల కాలం బీ జగంబుఁ బాలించె. ౪౩

క. ఆతని ప్రభుత్వమునఁ గం
జాతాప్తోదయము లేని సమయములఁ దమం
బాతతమగుటకు సైఁపక
“యీ తీరే యోగబలము నెనసి యడంతున్. ౪౪

వ. మత్ప్రభుత్వమ్మునఁ జీకటియుం గలుగునే!” యని యోజించి
యోగబలమ్మున నాదిత్యసన్నిభంబగు తన యరదమ్ము నడువం
జేసి యేడుమార్లద్దాని వారించె. ౪౫

ఉ. ఆరథనేమిరేఖ లవి యంబుధులై జగతీతలోపకా
రోరుతరంబులై పొదలె, నొక్కటి కొక్కటి కంతరస్థమా
ధారుణి ద్వీపమై తగె, నదభ్రము లంబుధులేడు గానఁ ద
చ్ఛ్రీరచితంబులెందు విలసిల్లెను ద్వీపము లేడుగా మహిన్. ౪౬

వ. ఉత్తరోత్తరద్విగుణప్రమాణప్రమితంబులగు నీ ద్వీపమ్ములేడును
గ్రమమ్మున జంబుప్లక్షశాల్మలీకుశక్రౌంచశాకపుష్కరంబులను
నామంబులు గలయవి. ౪౭

క. క్షారేక్షుసురాసర్పిః
క్షీరదధివిశుద్ధరసవిశిష్టములై చె

న్నారు సముద్రములివి పరి
ఖారీతిఁ ద్వీపములను గైసేయు నొగిన్. ౪౮

వ. అందుఁ బ్రథమంబగు జంబూద్వీపంబు క్షారసముద్రవేష్టితంబు; ప్రియవ్రతుం డిద్దానికిఁ దన మొదటి కొమరు నాగ్నీధ్రు రాజు గా నొనరించె; నిక్షువాదిసముద్రపరివృతంబగు తక్కుంగల ప్లక్షాదిద్వీపషట్కమ్మునకు నిధ్మజిహ్వాదిపుత్రషట్కమ్మును నియమించి పదంపడి కొమిరె నుశనుని కిచ్చి పెండిలి యొనర్చిన నామెకు దేవయాని జనియించె; నిట్లు కొమరులకు రాజ్యంబు విభజించి యతండు యోగమార్గానుగతుండై యుండె. ౪౯

క. నారదమునివర ! భూవి
స్తారము వచియింతు వినుము జంబూద్వీపం
బారయ వర్తులము మహో
దారమునై లక్షయోజనాయతి నొప్పున్. ౫౦

వ. ఇందు నానాపర్వతానుగతమ్ములగు సప్తమహాపర్వతమ్ములు గల తొమ్మిది వర్షమ్ములు నవసహస్రయోజనపరిమితమ్ములై యలరు; నందు దక్షిణోత్తరమ్ములు రెంటను ధనురాకారమ్ములు, నాల్గు దీర్ఘమ్ములు, చతురశ్రంబగు నిలావృతవర్షంబు మధ్య వర్షంబు. ౫౧

క. భూగోళకమలకర్ణిక
నాఁగాఁ దగి లక్షయోజనపరిమితంబై
శ్రీ గలిగి కనకగిరి యొం
తేఁ గొమరునఁ బొల్చు నిందు ధీరవతంసా ! ౫౨

వ. అ గ్గిరివరంబు శిరంబున ముప్పదిరెండువేల యోజనంబుల పరిమితియు, మూలమ్మునఁ బదాఱువేల యోజనమ్ముల ప్రమా

ణంబును, నధఃప్రదేశమ్మున మఱియున్ని యోజనమ్ముల పరిమాణమ్మును గలిగియుండు. ౫౩

ఆ. వె. తనరు నీయిలావృతమ్మున కుత్తర
మందు నీలనామ మమరుగిరియు
శ్వేతమనెడి గిరియు శృంగవద్గిరియు న
వధివిశేషబోధ వఱలఁజేయు. ౫౪

వ. వెండియు నిక్కొండలు మూఁడును రమ్యకహిరణ్మయకురువర్షమ్ములఁ గ్రమమ్ముగ నొప్పి మర్యాదావ్యంజకమ్ము లగుచున్న; వియ్యవి ప్రాగాయతమ్ములును, నుభయతఃక్షారోదధ్యవధికమ్ములును, ద్విసహస్రయోజనపరిమితమ్ములును, గ్రమమ్ముగఁ బూర్వపూర్వంబుకన్న నుత్తరోత్తరంబు దశాంశాధికదీర్ఘమ్ములును, నానానదనదీయుతమ్ములును నై యొప్పు. మఱియు నీయిళావృతవర్షమ్మునకు దక్షిణమ్మున నిషధహేమకూటహిమాలయమ్ములు నయుతయోజనపరిమితమ్ములును బ్రాగ్విస్తీర్ణమ్ములునై వఱలు. ౫౫

గీ. అనఘ! హరివర్ష కింపురుషాఖ్యవర్ష
భారతాభిఖ్యవర్షముల్ పరఁగఁ జేయు
నీ గిరులు మూఁడు మర్యాద నెసఁగఁజేసి
వినుము వెండియు న య్యిళావృతమునకును. ౫౬

వ. పశ్చిమమ్మున మాల్యవంతమ్మును, బూర్వమ్మున గంధమాదనమ్మును నీలనిషధగిరులదనుక వ్యాపించి, ద్విసహస్రయోజనాయామమ్ములై, మర్యాదాకారకమ్ములై, కేతుమాలాఖ్యభద్రాఖ్యవర్షమ్ముల నలరు; మఱియు మందరమ్మును మేరుమందరమ్మును, సుపార్శ్వమ్మును, కుముదమ్మును, నను నిగ్గిరులు

మేరుపాదమ్ము లియ్యవి యోజనాయుతవిస్తారోన్నాహమ్ములై
కనకగిరికి నలుదిక్కుల నవష్టంభమ్ములై యొప్పు; నిప్పర్వతమ్ముల
యందు నేకాదశశతయోజనోచ్ఛ్రయమ్ములును, తావద్విటప
విస్తారమ్ములును, శతయోజనపరిణాహమ్ములునునగు చూత
జంబూకదంబన్యగ్రోధమ్ములు కేతుశోభ నొప్పారుచుండు. ౫౭

గీ. క్షీరమధ్విక్షునీరవిస్ఫారములగు
మడుఁగు లొక నాల్గు చెలఁగు న మ్మలల యందుఁ
దద్రసస్పర్శనము దేవతలకు నయిత
మొసఁగఁ జేసెడి నైశ్వర్య మెంత యేని. ౫౮

వ. మఱియు నగ్గిరిచతుష్కమ్మునఁ గ్రమమ్మున నందనచైత్రరథ
వైభ్రాజసర్వభద్రమ్ములను దేవోద్యానమ్ములు చెలంగు. ౫౯

క. ఉపదేవగణమ్ములు గా
నపు సోయగ మలర నతులొనర్పఁగ సుర లె
ల్లపుడు నచట విహరింత్రు సు
ఖపదవి మదిఁగోరి యాత్మకాంతానుగులై. ౬౦

వ. వెండియు నమ్మందరస్థంబగు చూతవృక్షమ్ము విపరమ్మునుండి
యేకాదశశతయోజనావధికమ్ములై, గిరిశృంగమ్ములో నాఁదగు,
ఫలమ్ము లమృతరసస్యందులై యెల్లపుడుఁ బడుచుండు. ౬౧

చ. ధరఁ బడి బ్రద్దలై యవియు తత్ఫలజాతమునుండి జాఱు మే
టిరస మదెల్లఁ గూడి ప్రకటీకృతశోణవిశేషకాంతివి
స్ఫురితదిగంతరాళమయి పొల్చెను దా 'నరుణోద' యన్న పే
ర్కరము వెలుంగునట్టి నదిగా సురదైత్యమునీంద్రసేవ్యమై. ౬౨

ఉ. ఆ నది యొడ్డునందు నరుణాఖ్య నెసంగెడి శక్తియుండు, న
మ్మానిని, నయ్యనంతగుణమండిత, నవ్వరదాత్రి నెల్లరుఁ

ధ్యానము చేసి పూజలిడి తత్కృపఁ గాంతు రరోగభావ, మ
మ్లానయశఃకలావిభవమాన్యతలాదిగ నెల్ల సంపదల్. ౬౩

వ. మఱియు నజ్జనని యాద్యయనియు నతులయనియు ననంత యనియుఁ బుష్టియనియు నీశ్వరమాలినియనియు దుష్టనాశకరియనియుఁ గాంతిదాయినియనియు స్మరింపంబడు; నేతదంబా పూజాపరిభావమ్మునన జాంబూనద ముద్భవించెఁ; దద్విధంబు మున్న వివరింతు నరుణోదాపరిభావం బింకను గొంతకలదా కర్ణింపుము. ౬౪

ఉ. మందరమందుఁబుట్టి సురమాన్యత గాంచి యిళావృతంబుఁదాఁ
బొందెడి నీనదీర్ఘురము పూర్వదిశాభిముఖంబుగాఁగఁ ద
ద్బిందువిశేషయోగమున దేవిశరీరము తత్సఖీమణీ
బృందశరీరముల్ మిగులఁబేశలమై యలరున్ సుగంధియై. ౬౫

క. వీరల శరీరములఁ జె
న్నారు పరిమళమునందు ననిలుఁడు గంధో
దారంబుగ నొనరించున్
ధారుణి దశయోజనముల దనుక ముసీందా ! ౬౬

గీ. మేరుమందరమను గిరిమీఁదనున్న
యట్టి జంబూనగమ్మున నలరు పండ్లు
దంతి తుల్యమ్ములై ధరఁ దద్దయుఁ బడి
పగిలి జంబువనెడినదిఁ బరఁగఁజేసె. ౬౭

వ. ఇగ్గిరియందుఁ బొడమిన యిన్నది దక్షిణాభిముఖమ్ముగా నిళావృతమ్మునఁ బ్రవహించుచుండు, నేతత్తీరమ్మున జంబూఫలరసాస్వాదతుష్టయగు 'జంబ్వాదిని' యను మహాశక్తిగల; దాపె తత్స మీపవర్తులగు దేవనాగర్షిరక్షఃప్రభృతులకు నెల్లఁ బూజ్యయై,

రోగనాశినియై, విఘ్నహారిణియై ; కోకిలాక్షి, కామకళ, కామ
పూజిత, కఠోరవిగ్రహ, ధన్య, నాకిమాన్య, గభస్తిని యను
నామమ్ములచే నెల్లరకు జపనీయయై యలరు. ౧౮

క. జంబూనది యొడ్డుల ప
జ్జం బెరిఁగెడి మృత్తు తద్రసప్లుతమై హే
మం బై జాంబూనద నా
మంబున భూష్యమయి యొప్పు మానవతులకున్. ౧౯

వ. ఈ మృత్తికకు వాయ్వర్కయోగమ్మున నిట్టి దశ వాటిల్లు ;
నియ్యది దేవతలు స్వస్వోచితభూషణంబు లొనరించుకొని ధరిం
తురని వెండియు, ౨౦

గీ. మహితము సుపార్శ్వ మనియెడి నుల నలరు క
దంబవృక్షంబు తత్కోటరంబులందు
పంచధారలు పుట్టి యప్పర్వతమునఁ
బడి యిళావృతపశ్చిమభాగ మొలయు. ౨౧

క. అవి మధుమయములు తదనుభ
వవిశేషము వినుము దివిజవర్గము తత్పా
నవిధిం బొదలుటఁ గాదే
యవిరళపరిమళయుతమ్ములగుఁ దన్ముఖముల్. ౨౨

వ. మఱియు నవ్వారి ముఖమ్ముల పరిమళమ్ము వహించు వాయువు
శతయోజనమ్ముల దనుక భూమిని సువాసనాయుక్తమ్ముగ నొన
ర్చుచుండు ; నయ్యెడ దేవపూజ్యయు, మహోత్సాహయుఁ,
గాలరూపయు, మహాననయుఁ, గర్మఫలదయుఁ, గాంతారగ్రహ
ణేశ్వరియు నగు 'ధారేశ్వరి' యను శక్తి వసియించు ; నాపె
కరాళదేహ యనియుఁ, గాలాంగి యనియుఁ, గామకోటిప్రవ

ర్త్రినియనియు నామతర్రియమ్మునఁ బూజించు వారలకు భుక్తి ముక్తు లొసంగు; వెండియుఁ గుముదమ్మునఁ బొడమిన శతబల నామకవటవృక్షంబు స్కంధమ్ము నుండి గోముఖనదమ్ము లప్ప ర్వతమునఁబడి పయోదధిమధుఘృతగుడాన్నాంబరాదుల చేతను శయ్యాసనాభరణాదుల చేతను, దులఁదూఁగుచుఁ దత్ప్రత్యులకుఁ గామదుఘమ్ములై యలరు నియ్యవి యుత్తరేళావృతమ్మునఁ బ్రవహించుచుండు నియ్యెడ, 23

సీ. నీలాంబరంపు వన్నెలుగుల్కు నెలనాఁగ
నీలాలకమ్ముల నెగడుచాన
స్వర్గవాసుల కెల్ల వరములిచ్చు నెలంత
రౌద్రివక్త్రింబు పరఁగెడి వెలఁది
మత్తమాతంగగమన మొప్పెడి పడంతి
యత్యంతమాన్యత నలరుకలికి
యొప్పుమీనాక్షి మదనోన్మాదినియును, మా
నప్రియాంతరయు, మానాప్రియయును

గీ. మారపూజితయును, మారమాదినియును
మారవేగధరయును, మయూరవరరు
గాఢ్య, శిఖివాహ, గర్భభు వనెడినామ
ములను నద్దేవిఁ బూజింప ముదములొదవు. 24

వ. అయ్యంబ మీనాక్షియనఁబరఁగు, వెండియు నానదమ్ముల రస మ్ముపయోగించువారలకు వలీపలితలక్షణమ్మును, గ్లమస్వేదాది దౌర్గంధ్యమ్మును, శీతోష్ణవాతవైవర్ణ్యమ్మును, జరామయ భృతియును, భ్రమంబును, ముఖోపప్లవమ్మును, దక్కంగల

యాపదలును బొరయవు ; వారలెల్లప్పుడును నవ్యాహతసుఖంబులనుభవింతురు. ౭౫

గీ. మఱియు మేరువునకుఁ బుట్టుమలలు పదియుఁ
దొమ్మిదియుఁ గల వియ్యవి తోయజంపుఁ
గర్ణికయనంగ నయ్యెడఁ గ్రాలుఁ ; బుట్టు
వెలయు పర్వతముల పేళ్ళువినుము మౌని ! ౭౬

వ. కురంగంబును, కురగంబును, కుసుంభంబును, వికంకతంబును, త్రికూటంబును, శిశిరంబును, బతంగంబును, రుచకంబును, నిషధంబును, శితీవాసంబును, కపిలంబును, శంఖంబును, వైడూర్యమ్మును, జారుధియును, హంసమ్మును, ఋషభమ్మును, నాగమ్మును, కాలంజరమ్మును, నారదమ్మును ననునివి తన్నామంబులు. వెండియు, మేరువునకుఁ దూర్పున నష్టాదశసహస్ర యోజనాయతియును, ద్విసహస్రయోజనోన్నతియును గలిగి జఠరదేవకూటమ్ములను రెండు గిరు లుత్తరదిగ్వ్యాప్తమ్ములును బశ్చిమమ్మున నతివిస్తృతమ్ములగు పవమానపరిమాత్రిమ్ములు దక్షిణదిగాయతమ్ములును, దక్షిణమ్మునఁ బ్రసిద్ధమ్ములగు కైలాసకరవీరమ్ములను మహాపర్వతమ్ములు ప్రాగ్దిక్పరిపూర్ణమ్ములును, నుత్తరమ్మునఁ ద్రిశృంగ మకరంబులు పశ్చిమదిక్సక్తంబులు నునై పొదలు. ౭౭

గీ. మేరు శీర్షమ్మున నెసంగు సారసోద్భ
వుండు నివసించెడి పురంబఖండగరిమ
నద్ది పదివేలయామడ నమరుననియు
గనకమయమనియును బుధజనుల మతము. ౭౮

వ. ఈ పురమ్ము ననుసరించి చుట్టును నష్టదిక్పాలకుల పురమ్ములుండు నయ్యవి సార్ధనేత్రసహస్రయోజనప్రమితమ్ములును, గనక మయమ్ములునునని యెఱుంగునది. మనోగతియు నమరావతియుఁ దేజోవతియు సంయమనియుఁ గృష్ణాంగనయు శ్రద్ధావతియు గంధవతియు మహోదయయు యశోవతియు నను నివి క్రమం బుగ బ్రహ్మేంద్రాదులు వసించు పురంబులపేర్లు. ౨౯

సీ. యజ్ఞసంజ్ఞుండగు హరి కాలిబొటవ్రేలి
కొనగోటి తాఁకునఁగూరినట్టి
యండోర్ధ్వరంధ్రంబునం దుదయించి ధ్రువ
మస్తకమ్మునకుఁ గ్రమమునడిగ్గి
యఖిలలోకమ్ముల నఘహారిణియటంచుఁ
గడుఁ బ్రసిద్ధివహించు గంగఁ బెద్ద
కాలమ్ముఁకు ఋషిగణమును ధ్రువుఁడును
వసియించు నవ్విష్ణుపదమునుండి

గీ. చంద్రమండలమొంది యచ్చటను వెడలి
బ్రహ్మపురమునఁ బడి నాల్గు భాగములయి
నాల్గు దెసలకు వ్యాపించి నదులకెల్ల
నాథుఁడయి యొప్పు నయ్యుదన్వంతుఁ గలసె. ౩౦

వ. అందు మొదటిదియగు సీత బ్రహ్మసదనమ్మునుండి కొన్ని గిరి వరమ్ము లతిక్రమించి గంధమాదన శిఖరమ్మునంబడి, భద్రాశ్వ వర్షమ్మునఁ బ్రవహించి తూర్పుసముద్రమ్మునను; రెండవది యగు చక్షు వటనుండి మాల్యవచ్ఛృంగమ్మునకు వచ్చి, కేతు మాల వర్షంబు జొచ్చి పడమటి సముద్రమ్మునను; మూఁడవది యగు నలకనంద నానావనగిరిదుర్గమ్ములు దొరఁగి యతిరయ

మ్మున భారతవర్షమ్ము చొచ్చి దక్షిణసముద్రమ్మునను ; నాలవదియగు భద్ర బ్రహ్మపదమ్మునుండి శృంగవద్గిరి కరిగి యుత్తర కురు దేశమ్ములు సొచ్చి, యుత్తరసముద్రమ్మునను గలయు.

గీ. మేరుమందరసంభూతి మెలపు మీఱు
విమల నదములు నదులును వేలకొలఁది
కలపు ; వెండియు నీ వర్ష గణమునందు
భారతాభిఖ్య వర్షంబు పరమమందు. ౨౨

వ. ఇయ్యది కర్మక్షేత్రంబు, తక్కంగల యెన్మిది వర్షంబులును భోగప్రధానమ్ములును భూలోకస్వర్గమ్ములును నగుట స్వర్గచ్యుతులగువారు పుణ్యశేషం బనుభవింప నయ్యెడ నుదయింతు రని వెండియు, ౨౩

ఉ. అందలి పూరుషుల్ దశసహస్రసమాయుషులై, గజాయుతం
బుం దిగఁద్రొక్క లావొలసి పుణ్యులు వజ్రశరీరులున్, మహా
నందులు, దేవతుల్యులు కనత్సుకళత్రసుపుత్రమిత్రభూ
తిందగువారునై సుఖగతిం దఁలదూఁగుచు నుందు రెప్పుడున్.

వ. ఆ యీ వర్షాష్టకమ్ముల చెప్పఁగిరఁ ద్రేతాయుగసమంబై కాలంబు వఱలుచుండునని వెండియు, ౨౫

క. ఈ వర్షమ్ముల నెల్లెడ
దేవతలతిభక్తి కలిమిఁ దివిరి త్రిజగతీ
పావనియగు జగదంబకుఁ
గావింతురు జపతపము లఖండశ్రద్ధన్. ౨౬

చ. ఋతువుల నెల్లెడన్ సుమపరీతములౌ వనముల్, గిరిప్రపా
త తతసరోవరమ్ములు పతత్రికులాకులముల్ మహోత్పలా

న్వితములు స్వచ్ఛనీరము లనింద్యములౌ దరులుఁ జెలంగు భో
రతపరవర్షముల్ మిగుల రమ్యములౌ విహరించు వారికిన్.

క. భగవంతుఁ డాదిపురుషుఁడు
జగదేకారాధ్యుఁడగుచు జగదాబాధా
దగత మనస్కుఁత నవవ
ర్షగతుండై యుండు నెపుడు సంయమివర్యా! ౮౮

గీ. అనఘ! విను మిళావృతమునయందు భవుఁడు
పద్మజాక్ష్యుద్భవుఁడు తన పడఁతి దక్క
నొక్కరు నెవ్వరు లేకుండ నుండు; నచోటు
దొక్కరెవ్వరు శాపంబు దొడరుకతన. ౮౯

వ. కొండొక కారణమ్మున భవాని యయ్యెడకువచ్చిన పురుషులకు స్త్రీత్వంబు గలుగునని శపించె; నయ్యెడ ననేకసఖీసమేతయగు భార్యతోఁగూడి వసించుచు శంకరుండు సంకర్షణు నెల్లప్పుడు తత్ప్రీతికరమ్ములగు మంత్రతంత్రమ్ముల నారాధించు. వెండియు భద్రాశ్వవర్షమ్మున ధర్మపుత్రుండగు భద్రశ్రవుండును దద్వంశ్యులును వలయగ్రీవపదాంకితమ్మగు నద్దేవుమూర్తిని ధ్యానావాహనాదికమ్ముల నర్చింతురు. మఱియు హరివర్షమ్మునఁ బ్రహ్లాదుండు యథాపూర్వంబుగ నరసింహుఁ బూజించుఁ, గేతుమాలమ్మున స్మరరూపధారియగు నద్దేవు నాయామంత్రాదికమ్ముల భగవతియుఁ దద్వర్షనాయికయు నగు లక్ష్మి కొనియాడు; రమ్యకవర్షమ్మున మత్స్యాకారమ్మగు నద్దేవుమూర్తిని మనువు స్తోత్రాదికమ్ముల జపియించు, హిరణ్మయవర్షమ్మున సూర్యుండు కూర్మాకారుండగు నద్దేవు ననేకభంగుల యజించు, నుత్తరకురుదేశంబుల

నద్దేవుండు వరాహరూపమ్మునఁబొదలు. భూమి తత్ప్రీతికరంబులగు మంత్రాదికమ్ములఁ నయ్యనఘు స్మరియించు. ౯౦

క. కింపురుషవర్షమునఁ దా
నింపారెడి దాశరథి; కపీంద్రుండెపుడున్
'మాంపాహి' యనుచుఁ గనదను
కంపాకరు నతని నుతునిఁ గావించుఁదగన్. ౯౧

క. భారతవర్షము నందున్
నారాయణుఁ డనెడిపేరున్ నేనుందున్
నారద! నీచేత ముదం
బారం గొనియాడఁబడుచు నవహితమతినై. ౯౨

క. భారతవర్షమ్మునఁ జె
న్నారెడి శైలములు నదులు నవహితమతినో
నారద! వినుమని వెండియు
నారాయణుఁ డానతిచ్చె నది యెట్లన్నన్. ౯౩

వ. మలయమ్మును, మంగళప్రస్థమ్మును, మైనాకమ్మును, త్రికూటమ్మును, ఋషభమ్మును, కూటకమ్మును, గొల్లమ్మును, సహ్యమ్మును, దేవగిరియును, ఋశ్యమూకమ్మును, శ్రీశైలమ్మును, వేంకటాద్రియు, మహేంద్రమ్మును, వారిధారమ్మును, వింధ్యమ్మును, భుక్తిమంతమ్మును, ఋక్షపర్వతమ్మును, పారియాత్రమ్మును, ద్రోణమ్మును, చిత్రకూటమ్మును, గోవర్ధనమ్మును, రైవతమ్మును, కకుభమ్మును, నీలపర్వతమ్మును, గౌరముఖమ్మును, నింద్రకీలమ్మును, కామగిరియును, మఱియుఁ గొన్ని ధరాధరమ్ములును నసంఖ్యమ్ములుగా నొప్పెడి; నా యీ పర్వతమ్ములఁ బొడమిన నదులు వేలకొలఁది గల వవి యెవ్వి యనినఁ, దామ్ర

పర్ణియుఁ, జంద్రవశయుఁ, గృతమాలయు,వటోదకయు, వైహాయ
సియుఁ, గావేరియు, వేణయుఁ, బయస్వినియుఁ, దుంగభద్రియుఁ
గృష్ణవేణియు, శర్కరావర్తకయు, గోదావరియు, భీమరథియు,
నిర్వింధ్యయుఁ, బయోష్ణియుఁ, దాపియు, రేవయు, సరసయు,
నర్మదయు, సరస్వతియుఁ, జర్మణ్వతియు, సింధువును, సంధశోణ
మ్ములను మహానదమ్ములును, ఋషికుల్యయుఁ, త్రిసామయు, వేద
స్మృతిమహానదియుఁ, గౌశికియు యమునయు, మందాకినియు,
దృషద్వతియు, గోమతియు, శరయయు, రోధవతియు, సప్త
వతియు, సుషోమయు, శతద్రువును, జంద్రభాగయు, మరుద్వృ
ధయు, వితస్తయు, నసిక్నియు, విశ్వయు నను నియ్యవి పానా
వగాహనదర్శనోత్కీర్తనమ్ములచేఁ ద్రివిధపాపమ్ముల హరించు.
ఇయ్యెడ జనించువారలకు నిహపరసుఖమ్ములు కరతలామల
కమ్ములగు ; నియ్యది యెల్లవర్షమ్ములకుఁ దలమానికంబని
వెండియు, ౯౪

ఉ. ఈ యెడ జన్మమెత్తు నరులెంత మహాత్ములో ! యాద్యుఁడైన నా
రాయణు పాదపంకజపరాగము దీన నెసంగు, నియ్యెడన్
బాయక సన్యసించి హరివాసమొకింతన పొందవచ్చు, నొం
డేయదియేని గమ్య మిట ; నెయ్యది దీనికిఁ దుల్యమైతగున్. ౯౫

క. వైకుంఠకథాసుధయును
లోకోత్తరులైన నాథులును జన్మములున్
లేకుండిన నది సాక్షా
న్నాకంబేనియును విడువనగు సుజనులకున్. ౯౬

క. ఇయ్యెడ జన్మంబందిన
యయ్యలకుఁ బునర్భవంబు నందం బనిలే ;

దయ్యాలఘు లెల్లవారికి
నెయ్యమ్మునఁ బూజ్యులగుచు నెగడుదు రెప్పుడున్. ౯౭

వ. అని బహుభంగుల నీ భారతవర్షమాహాత్మ్యమ్మును స్వర్గగతులగు దేవగంధర్వాదు లగ్గింతురు. వెండియు జంబూద్వీపంబునకు నెనిమిది యుపద్వీపములుగల; వయ్యవి హయమ్మును వెదుకం జను సగరపుత్త్రులకతనఁ గల్పితమ్ములయ్యెఁ; దన్నామమ్ములు స్వర్ణప్రస్థమ్మును, జంద్రశుక్రమ్మును, నావర్తనమ్మును, రమాణకమ్మును, మందరమ్మును, హరిణమ్మును, బాంచజన్యమ్మును, సింహళమ్మును ననఁదనరు; నిందు సింహళమ్మునకు లంకయను నామాంతరంబుగల, దిఁకఁ బ్లక్షాదిద్వీపమ్ములు వివరించెద. ఈద్వీపమ్మును బ్రియవ్రతపుత్త్రుండగు సిధ్మజిహ్వుం డేడు వర్షమ్ములుగ విభజించి తన కొమరులకిచ్చిన నివి తన్నామమ్ములఁ బ్రసిద్ధమ్ములయ్యె; శివయవసభద్రశాంతక్షేమామృతాభయ నామకమ్ములగు నీయేడు వర్షమ్ములయందును మణికూట వజ్రకూటేంద్రసేనజ్యోతిష్మత్సువర్ణహిరణ్యష్ఠీవమేఘమాలమ్ములను నేడు గిరులును; నరుణయు, నృమ్ణయు, నంగిరసియు, సావిత్రియు, సుప్రభాతయు, ఋతంభరయు, సత్యంభరయు నను నన్నియ నదులును నెసంగుచుండు. ౯౮

క. పైనదులఁ దానమాడిన
మానవులకు వానిఁజూచు మనుజులకును బా
పానుగతి సమసి యుత్తము
లై నెగడుట దొడరు వార లలఘుచరిత్రల్. ౯౯

వ. వెండియు నీ ద్వీపమ్మున హంసపతంగోర్ధ్వాయనసత్యాంగమ్ములను నాల్గు వర్ణంబులు; తత్తద్వర్ణసంభవు లందఱును సహస్రా

యుఃప్రమాణులును, సూర్యోపాసకులును, సహజాయురింద్రి యోజోబలబుద్ధులును నై నెగడుదురు; రీ ద్వీపమ్ము నావరించి యెల్లెడ నిక్షుసముద్రంబు వఱలు; నింతకు ద్విగుణప్రమాణం బగు శాల్మలీద్వీపమ్మున శాల్మలీవృక్షం బెసంగు, నీయది ప్రమా ణంబునఁ బ్లక్షవృక్షమ్మునకు సదృశం; బీద్వీపమ్మునకు సురాసము ద్రంబు పరిఖాయితంబై యొప్పు. ౧౦౦

గీ. పక్షులకునెల్ల రాజు ప్రబలుఁడు గరుడుఁ
డన్నగమున వసించుఁ; బ్రియవ్రతాత్మ
జుండు పాలించు యజ్ఞబాహుండు దీని
నిందుగల వర్షములు విను మిద్ధచరిత ! ౧౦౧

వ. సురోచనమ్మును, సౌమనస్యమ్మును, రమణమ్మును, దేవవర్షమ్మును బారిభద్రమ్మును, నాప్యాయనమ్మును, నవిజ్ఞాతమ్మును నను నీ వర్షమ్ములయందు సరస, శతశృంగ, వామదేవ, కందక, కుముద పుష్పవర్ష, సహస్రశ్రుతులను నేడు పర్వతమ్ములును, నను మతియు, సినీవాలియు, సరస్వతియుఁ, గుహువును, రజనియు, నందయు, రాకయు నను నన్నియ నదులును జెలంగు; వెండియు నీ ద్వీపమ్మున నెల్లెడ శ్రుతధర, వీర్యధర, వసుంధ, రేషుంధర నామకంబగు వర్ణచతుష్టయంబు పొల్చు, నిందలి ప్రజలు చంద్రోపాసకులు. ౧౦౨

గీ. ఈ సురోదధి కన్న మఱింతయైన
నేతి సంద్రమ్ము చేతఁ బరీతమగుచు
నేపుమైఁ జెన్నలరు కుశద్వీపమందు
సాంద్రఘనోజ్జ్వలము కుశస్తంబమొప్పు. ౧౦౩

వ. ఈ ద్వీపాధినాయకుండు ప్రియవ్రతాత్మజుండగు హిరణ్యరేతుం; డతండు వసు, వసుదాన, దృఢరుచి, నాభిగుప్త, స్తుత్యవ్రత,

వివిక్త, దేవకులను కొమరుల కేడ్వురకును నీ ద్వీపం బేడు భాగ
మ్ములుగఁ గావించి యొసఁగె; నిందు నవధినిర్ణాయకములై
చక్రి, చతుశ్శృంగ, కపిల, చిత్రకూట, దేవానీ, కోర్ధ్వరోమ,
ద్రవిణమ్ములను నేడు గిరులును; రసకుల్యయు, మధుకుల్యయు,
మిత్రవిందయు, శ్రుతవిందయు, దేవగర్భయు, ఘృతచ్యుత్తును,
మంత్రమాలికయు నను నన్నియ నదులును నలరుఁ; దద్ద్వీప
వాసు లెల్లరును నీ నదుల యుదక మ్ముపయోగించుచు సుఖమ్ము
నం బొదలుదురు; కుశల, కోవి, దాభియుక్త, కులకనామకమ్ము
లగు నాల్గు వర్ణమ్ము లయ్యెడ నెసఁగు. వారలెల్లరు నగ్నిదేవు
నారాధింతురని వెండియు, ౧౦౪

గీ. పాలసంద్రమ్ము చుట్టును బరిఘవిల్ల
మానమింతకు రెట్టియై మలయఁ గ్రౌంచ
నామకము ద్వీపమొప్పు నీ నామ మిచటఁ
గ్రౌంచపర్వత సంస్థితికతనఁ గలిగె. ౧౦౫

క. హరసుతుఁడు గుమారుండి
గ్గిరికుక్షిం బగులనేయఁ గృపమీఱఁగ న
వ్వరుణుఁడు క్షీరోదధిరస
పరిప్లుతిం జేసి ప్రోచెఁ బదపడి దీనిన్. ౧౦౬

వ. ప్రియవ్రతు కొడుకుఘృతపృష్ఠుండిద్దానిఁబాలించుచు నేడుభాగమ్ము
లొనర్చి యామ, మధురుహ, సుధామక, మేఘపృష్ఠ, భ్రాజిష్ణు
లోహితార్ణ, వనస్పతి నామకంబగు తన పుత్రసప్తకంబున కిచ్చిన
నవి తత్పుత్రనామంబుల యథాపూర్వంబుగఁ బ్రసిద్ధంబులయ్యె;
నియ్యెడ శుక్లధర్మమానభోజనోపబర్హణానందనందనసర్వతో
భద్రనామకమ్ములగు నేడు గిరులును, నభయయు నమృతౌఘయు

నాచార్యకయుఁ దీర్ఘవతియు వృత్తిరూపవతియు శుక్లయుఁ బవిత్ర వతియునను నన్నియ నదులును నలరు; వీనిజలంబు పవిత్రంబును రుచ్యంబునునై యుండు, నిందలి వర్ణమ్ములు పురుష ఋషభ ద్రవిణ దేవక నామకంబులు, తత్సంభూతులు వరుణోపాసకులు, వెండియు నీ ద్వీపమ్మున కవల దధిసముద్రపరివృతమ్మును, ద్వాత్రింశల్లక్షసంఖ్యాక యోజనాయామమ్మునునగు శాకద్వీ పమ్మురాజిల్లు; నియ్యెడ శాకమహీరుహంబుండుకతన దీనికీ నామంబు గలిగె. ౧౦౭

క. సొగసగు నీద్వీపమ్మున
కగణితగుణగణ్యుఁడగు ప్రియవ్రతజుఁడు దా
నెగడుఁ మేధాతిథి విభు
తగలిగి సుతసప్తకంబొదవె నీతనికిన్. ౧౦౮

వ. అమ్మేధాతిథి స్వపుత్రనామప్రసిద్ధమ్ములగుగతి నేడు భాగమ్ము లొనర్చి యియ్యది వారి యధీనంబొనరించి తాను యోగాశ్రితుం డయ్యెఁ; బురోజవ మనఃపూర్వ జయ పవమానక ధూమ్రానీక చిత్రరేఫ బహురూప విశ్వధృగభిఖ్యలు తత్పుత్రు; లియ్యెడను యథాపూర్వంబుగ నీశానోరుశృంగబలభద్ర శతకేసర సహస్ర స్రోతక దేవపాల మహాసనమ్ములను మర్యాదాగిరు లేడును, ననఘయుఁ బ్రథమయు నాయుర్దయు నుభయసృష్టియు నపరాజి తయుఁ బంచపదియు సహస్రస్రుతియు, నిజధృతియు నను నన్నియ నదులును గలవు. వెండియు నిందు సత్యవ్రత క్రతువ్రత దానవ్ర తానువ్రత నామకంబు వర్ణచతుష్టయంబు పొలుచు, నీ ప్రజలు వాయుదేవోపాసకులు, దీనికవల నింతకు రెట్టియగు ప్రమాణం బుగల పుష్కరద్వీపంబు శుద్ధసముద్రపరివృతంబై తనరు.

ఇయ్యెడ నగ్నిచూడానిభమ్ములగు స్వర్ణపత్రమ్ములచేఁ బొలుచు
పుష్కరమ్ముగల; దియ్యబ్జంబు భగవంతుండగు విరించికి నాసనం
బిది లోకగురునిచే సర్వలోకసిసృక్షుచేఁ గల్పింపంబడియె.
ఈద్వీపమ్మునం దర్వాచీన పరాచీన వర్షంబులకు నవధినిర్ణాయ
కంబై మానసోత్తరంబను పర్వతం బయుతయోజనసమ్మితో
చ్ఛ్రాయాయామంబు వఱలు. ౧౦౯

ఉ. ఈ నగమంద నల్దెసల నిందుఁడు లోనగునట్టి దిక్పతీ
శానుల పట్టణమ్ములు పొసంగు సుమేరువు చుట్టివచ్చు నా
భానుని వర్తనం బిచటఁ బొల్పుడు వత్సరరూపచక్రమి
చ్చో నెసఁగున్ బవల్ నిశయుఁ జొప్పడునట్లు పరిభ్రమించుచున్.

వ. ఏతత్పాలకుండగు వీతిహోత్రుండు రమణధాతకులను తన కొమ
రుల కిరువురకును దన్నామకంబగు వర్షద్వయం బొసంగి యన్న
లంబోలి తాను భగవత్పదభక్తి తత్పరత్వమ్మునందె; నీ వర్ష
మ్ములఁ బ్రజలు బ్రహ్మరూపియగు పరమేశ్వరు యజింతు; రీ ద్వీప
మ్మున కవల లోకాలోకగిరి వఱలు, నియ్యది లోకాలోకంబుల
కంతరాళమ్మునఁ గల్పింపంబడు కతన దీని కీ నామంబుగలిగె;
మేరువు మొదలు మానసోత్తరమ్ము దుదగాఁగల మధ్యప్రదేశ
మంతయు శుద్ధకాంచనమయమ్మును దర్పణతుల్యమ్మును నగు
కతన నయ్యెడ నే పదార్థమ్మును నంకురింపకుండుటంబట్టి యది
సర్వప్రాణిశూన్యంబై యుండు; వెండియు నిగ్గిరి యీశ్వరుచేఁ
ద్రిలోకాంతగతంబగునట్లు సృజింపఁబడి తన కతన సూర్యాది
ధ్రువాంతమండలదీప్తు లర్వాచీనంబు లగునపుడు త్రిలోకవ్యాప్తం
బులయ్యును బరాచీనంబులగు నెడల నట్లు కాకుండుట సంధించు
చుండు, నిద్దాని ప్రమాణంబు పంచాశత్కోటియోజనపరిమి
తంబగు భూమండలంబునఁ జతుర్థాంశంబై యుండు. ౧౧౧

గీ. కమల సంభవుఁ డిప్పర్వతమున నాల్గు
దెసల దిగ్గజముల నిల్పె నసమబలస
మేతముల, నిగ్గజమ్ముల యెల్లలోక
సంస్థితికి హేతువులు వాని సంజ్ఞ వినుము. ౧౧౨

వ. ఋషభమ్మును, ఋష్కరచూడమ్మును వామనమ్మును నపరాజితమ్మును నని చెప్పంబడు, స్వవిభూతులగు నిగ్గజంబులకు బలంబు నొసంగుచు సిద్ధవృష్టకోపేతుండును విష్వక్సేనాదిపరివృతుండును నిజాయుధోజ్జ్వలద్భుజదండమండితుండును నగు హరి సమస్తలోకసుఖకారి యగుచు స్వమాయారచితంబగు నిగ్గిరికి రక్షకుండై కల్పావసానంబు దనుక నిట్టి వేషంబున జాగరూకత మెలఁగు; నీ లోకాలోకమ్మున కవల శుద్ధాకాశంబు దక్క వేఱొండు లేదు. భూమ్యాకాశమ్ములకు మధ్యగతంబగు నండమ్మునకు నంతరమ్మున సూర్యుండు వెలుంగు, సూర్యాండగోళమ్ములకు మధ్యమ్మున నిరువదియైదుకోట్ల యోజనమ్ములుగలవు. మృతాండసముద్భూతుండగుకతన సూర్యునకు మార్తాండ నామంబలవడె, హిరణ్మయాండసముద్భూతుండగు కతన నితనికి హిరణ్యగర్భుండను నామంబును బ్రసిద్ధంబు. ౧౧౩

గీ. దెసలు స్వర్గాపవర్గముల్ వసుమతియును
నాకసంబను భేదమ్ము లఖిలజంతు
వులకు సూర్యునికతమునఁ గలిగెఁగాన
నర్కుఁడెల్లరకును నేత్రమై యెసంగు. ౧౧౪

వ. ఇయ్యది భూమండలప్రమాణంబు, దీనింబట్టి ద్యుమానంబు తజ్జ్ఞులభివర్ణింతురు. సూర్యుండీద్యుమధ్యంబున వెలుంగుచు నుత్తరాయణవశమ్మున గతిమాంద్యమ్మును దక్షిణాయన వశమ్మున

గతిశైఘ్ర్యమ్మును జెందుచుండు. నితం డుత్తరాయణదక్షిణాయనమ్ముల నారోహణావరోహణస్థానమ్ముల నలరుచుండు. విషువత్సంజ్ఞమ్మగు కాలమ్మున సమస్థానావస్థానం బలవడుకతన గతిసామ్యంబు గలుగుచుండు ; నితండు మేషతులారాశిగతుండగు నెడ నహోరాత్రమ్ములకు సామ్యమ్మును వృషాదిరాశిపంచకస్థితుండగు తఱి నహోదైర్ఘ్యమ్మును, వృశ్చికాదిరాశిపంచకస్థితుండగు తఱి నిశాదైర్ఘ్యమ్మును నలవడునని యెఱుంగునది ; యింక భానుగమనంబు విస్తరించెద. శీఘ్రమందసమభేదమ్ముల నితనిగతులు మూఁడు దెఱంగులు. సర్వగ్రహమ్ములకు జరద్గవైరావతవైశ్వానరమ్ములను మూఁడు మార్గమ్ములు విశ్రుతమ్ము, లందు నాగగజైరావతులను మూఁడు వీధు లుత్తరమార్గమ్మగు నైరావతమ్మనకును, ఋషభవీధియు గోవీధియు జారద్గవవీధియునను నవి జరద్గవంబను మధ్యమమార్గమ్మునకును, నజయు మార్గియు వైశ్వానరియు నను మూఁడు వీధులును, వైశ్వానరనామకమ్మగు దక్షిణమార్గమ్మునకును గలవు. • వెండియు నశ్వినీకృత్తికాభరణులు నాగవీధియనియు, రోహిణ్యార్ద్రామృగశీర్షమ్ములు గజవీధియనియుఁ, బుష్యాశ్లేషాపునర్వసు లైరావతవీధియనియు, ఫల్గునీద్వయమ్మును మఖయుచు ఋషభవీధియనియు, హస్తచిత్రాస్వాతులు గోవీధియనియు, జ్యేష్ఠావిశాఖానురాధలు జారద్గవవీధియనియు, మూలోత్తరాషాఢాపూర్వాషాఢ లజవీధియనియు, శ్రవణధనిష్ఠాశతభిషజమ్ములు మృగవీధియనియుఁ, బూర్వాభాద్రోత్తరాభాద్రారేవతులు వైశ్వానరవీధి యనియుం జెప్పంబడు. సూర్యుం డుత్తరాయణం బధిష్ఠించి యుగాఝాంతర్నిబద్ధమ్ములును వాయుబద్ధమ్ములును నగు పాశమ్ముల నాకర్షించుట యారోహణంబునాఁబడు, నితండీ యారోహణస్థాన

గతుండగు నెడ రథంబునకు మండలాభ్యంతరగమనం బొదవుటం జేసి మాంద్యమ్మును, దినవృద్ధియు, నిశాక్షయమ్మును దొడరు; నియ్యది సౌమ్యాయనక్రమంబు. పూర్వోక్తపాశప్రేరణం బవరోహణంబు నాఁజను; సూర్యుండీస్థానంబధిష్ఠించునెడ బహిర్మండలప్రవేశమ్మునంజేసి గమనమ్మునకు శైఘ్ర్యమ్మును రాత్రివృద్ధియు దినక్షయమ్మును గలిగెడి; వైషువమ్మునఁ బాశసామ్యంబునంజేసి రవికి సమావస్థానమ్మును, మధ్యమండలప్రవేశమ్మును గలుగు; దానంజేసి రాత్రిందివమ్ములకు సామ్యంబు తటస్థించు. మఱియుం బూర్వోక్తమ్ములగు పాశమ్ములు ధ్రువునిచే సమధిష్ఠితమ్ములై యాకర్షింపఁబడునెడల నభ్యంతరమ్మున సూర్యుండును దక్కిన మండలమ్ములును బరిభ్రమించెడి; ధ్రువుండు తత్పాశమ్ములు విడుచుచో మండలమ్ము లన్నియును బహిర్గతంబులై వెలుఁగు. ౧౧౫

క. మేరువునఁ బూర్వదిశఁ జె
న్నారెడి నైంద్రియను నగర మది సురవాసం
బై రహిఁదగు దక్షిణదిశ
నారయ సంయమనియొప్పు యమువాసంబై. ౧౧౬

వ. పశ్చిమమ్మున నిమ్లోచని యను వరుణపురమ్మును, నుత్తరమ్మున సౌమ్యయగు విభావరియును నలరు. ౧౧౭

గీ. ఇంద్రపురియందు రవి యుదయించి రెండు
జాములకు సంయమనికిఁ దాఁ జని క్రమమ్ము
గాఁగ నిమ్లోచనికి సంజకాలమునకు
నరిగి యట నస్తమితుఁడౌ నటండ్రు బుధులు. ౧౧౮

వ. మఱియు విభావరీపురమ్మున కరుగునంతకు నిశీథంబు వఱలుచుండు. ౧౧౯

క. రవి సవ్యంబగుగతి మే
రువుఁ దిరుగుచుఁ బవలు నిశి నిరూపించు నితం
డెవరి కెటఁ బొడమి కన్పడు
వ్యవధియదియ యుదయమునకు వారలకెందున్. ౧౨౦

వ. ఇతండు తిరోభూతుండగు గతిఁ దోఁచుటయ యస్తమయంబు నాఁబడు నని మఱియును,

గీ. ఎల్లపుడు నొక్కగతివెల్గు నినున కుదయ
మస్తమయమును జొప్పడ దనఘ! యతని
దర్శనాదర్శనమ్ములఁ దజ్జ్ఞులట్లు
వాడుకొండ్రు పరంపరాప్రాప్తరీతి. ౧౨౨

గీ. ఎల్లద్వీపవర్షమ్ముల కెపుడు మేరు
వుత్తరమ్మున నుండెడి నుష్ణరశ్మి
యెవరి కెటఁ గన్పడునొ వారికెల్ల నదియ
ప్రాచియని తెలియంబడుఁ బరమమౌని! ౧౨౩

వ. సూర్యుం డైంద్రియందు బయలువెడలి పదేనుగడియలు నడచునంతకు యామ్యయందు రెండుకోట్ల ముప్పదియేడులక్షల డెబ్బదియైదువేల యోజనమ్ము లతిక్రమించు, నిట్లన యామ్యమొదలుకొని వారుణియందును, వారుణిమొదలుకొని యైంద్రియందును నని యెఱుంగునది. ౧౨౪

గీ. కాలచక్రాత్మకుండగు కంజబంధుఁ
డెల్లపుడు నిట్లువర్తించు నెల్లరకును

గాలమును దెలుపఁగ నవగ్రహములును ని
టులు పొడుచుటలు క్రుంకుటల్ తెలియఁబడును. ౧౨౭

వ. ఒక్కముహూర్తమ్మునకు సూర్యునిరథంబు ముప్పదినాల్గులక్షల యెనిమిదివందల యోజనమ్ము లతిక్రమించు, నీయినుండు ప్రవహాఖ్యంబగు కాలచక్రంబుకతన దిక్చతుష్టయమ్మునందును బూర్వోక్తపురమ్ములయందును గాలపరిదర్శకుండై పరివర్తించెడి.

గీ. భువనబంధుని స్యందనమ్మునకు ద్వాద
శారము త్రినాభికమ్మునునైన యొక్క
చక్రమలరారు షణ్ణేమిసహిత మదియ
వత్సరాత్మకమని బుధవరుల మతము. ౧౨౮

వ. తదక్షంబు మేరుమూర్ధంబునందును మానసోత్తరగిరియందును గృతేతరవిభాగంబగుచు రథాంగప్రోతంబై తైలకారకయంత్రంబు పగిదిఁ బరిభ్రమించుచుండు, నీ రథప్రమాణంబు తొమ్మిదిలక్షల యోజనమ్ములును రథనీడప్రమాణంబు ముప్పదియాఱులక్షల యోజనమ్ములును, రథయుగప్రమాణంబు తొమ్మిదిలక్షల యోజనమ్ములునై యొప్పు. ఛందోభిధానమ్ములగు నేడు గుఱ్ఱమ్ములు గరుడాగ్రజుండగు ననూరునిచే యోజితమ్ములగుచు సమస్తలోకసుఖహేతుభూతుండగు నాదిత్యుని వహించుచుండు. మఱియు నంగుష్ఠపర్వప్రమాణులగు వాలఖిల్యాది మహర్షు లఱువదివేలును, దక్కంగల దేవర్షులును నచ్చరలును గ్రామణులగు యాతుధానులును, దేవతలును బురోగతులగుచు నహస్కరు నుతించుచుందు, రిట్లు నగవ్యూతిద్విసహస్రాధిక సార్ధలక్షోత్తరకోటినవకపరిమితమ్మగు భూమండలమ్మును ప్రతి

దినమ్మును బరిభ్రమించుచుండు. నింక సోమాదుల గమన
ప్రకార మెఱిఁగించెద. ౧౨౮

గీ. భ్రమణమొలయు కులాలచక్రంబుతోడ
నెనయు కీటాదులకుబలె నెపుడు కాల
చక్రసంగతరాశివశమ్ముకలిమి
వేఱుగతి గ్రహములకెల్ల వెలయునవఘ ! ౧౨౯

వ. ఎల్లగ్రహమ్ములకును నక్షత్రాంతరగామిత్వాన్యరాశిగమన
హేతుకంబయిన గతిద్వయం బవిరుద్ధంబు. సాక్షాద్భగవంతుం
డును నాదిపూరుషుఁడును లోకాధారుండును లోకభావనుండును
నగు నారాయణుండు లోకోపకారమ్మునకై కర్మశుద్ధినిమిత్తంబు
స్వాత్మను ద్రయీమయునింగాఁ బరిణమింపఁజేసి షడృతువుల
యందును దత్తదనుగుణమ్ములగు గుణమ్ములఁ బ్రకటించు
చుండు. ౧౩౦

ఉ. ఇమ్మహనీయులెల్లరు తదేకపరత్వమునన్ శ్రుతి ప్రసి
ద్ధమ్ముల మేటిజన్నములఁ దత్తదుపాసనలన్ గులానుసా
రమ్ముగఁగొల్చుచుందురు కరమ్మును నీతఁడు కాలచక్ర సం
గమ్మున రాసులం దొదిఁగి కైకొను ద్వాదశమాసభోక్తృతన్.

వ. సపాదర్క్షద్వయం బొక్క రాశియనియు, రాశ్యంతర సంక్రమణంబు
మాసంబనియు, మాసద్వయంబు ఋతువనియు, ఋతుత్రితయం
బయనంబనియు, నయనద్వితయంబు సంవత్సరంబనియుఁ బ్రాక్త
నులు వర్ణింతురు. సంవత్సరపరివత్సరేదావత్సరానువత్సరేద్వత్స
రమ్ములను భేదమ్ము లీతని మాంద్యశైఘ్ర్యసమగతులకతనం
గలిగెడి. ౧౩౨

గీ. ఉష్ణరశ్మికి నొకలక్ష యోజనముల
మీఁద శశియుండి మఱియు నమ్మిత్రవత్స

రంపు భుక్తిననుసరించి రమణఁబక్ష
ములవరుసఁదాను దద్భుక్తి నొలయుచుండు. ౧౩౩

వ. పాదయుక్తమ్మగు నక్షత్రద్వితయంబితనికి దివసప్రమాణం, బిట్టి శీఘ్రగమనమ్మున నక్షత్రచక్రమ్మునం దిరుగుచుఁ బూర్యమాణంబులగు కళలచే దేవతృప్తియు, క్షయమాణంబులగు కళలచేఁ బితృప్రీతియు నొనర్చుచు నహోరాత్ర నిర్ణాయకుండై సర్వజీవ నికాయమ్మునకును బ్రాణంబై యొప్పుచుండు. ౧౩౪

గీ. ఇతఁడు షోడశసత్కళాయుతుఁ డనాది
పురుషుఁడు మనోమయుఁడు సుధాపుంజ మన్న
మయుఁడు దేవాదులకును సమస్తవృక్ష
ములకు సంరక్షకుఁడు సర్వభూతమయుఁడు. ౧౩౫

వ. ఇతనికి మూఁడులక్షల యోజనమ్ములపై నక్షత్రచక్రంబు పరిభ్రమించు నయ్యదియు నీశ్వరాజ్ఞానుసరణమ్మున మేరువుంజుట్టి వచ్చుచుండు; నయ్యెడ నశ్విన్యాదినక్షత్రమ్ము లిరువదియేడును నభిజిత్తునుగల, వచ్చటికి రెండులక్షల యోజనమ్ములపై శుక్రుండు సూర్యునకుఁ బురఃపశ్చాద్భాగమ్ముల ననుసరించి తత్సమంబగు గతిచేఁ దిరుగుచుండు, నిమ్మహానుభావుండు వృష్టివిష్టంభశమనుండనియు లోకానుకూలుండనియు శుభావహుండనియుఁ బెద్దలు వల్కుదురు. ౧౩౬

గీ. ఉండు నీతని కొక లక్షయోజనముల
పై బుధుం డీతఁ డర్కుని వదలియున్న
తఱిని నతివాత మభ్రవాతంబు దొడరి
వృష్టిభయమాదియగు సేగి పృథివికొదవు ౧౩౭

వ. ఇతని భ్రమణంబును దలఁచు శుక్రుంబోలియుండు, నితనికి రెండు
లక్షల యోజనమ్ములపైఁ గుజుండుండు; నితండు మూఁడుమూఁడు
పక్షమ్ముల కొక్కొక్క రాశివంతునఁ దిరుగుచుండు, నీతనికి
వక్రిత్వంబు గల్గునెడ నెల్లరకు నశుభంబులొదవు. ౧౩౮

గీ. ఉండు నొక రెండులక్షల యోజనముల
నితనికి గురుం డతం డొక యేఁటి కొక్క
రాశివంతునఁ దిరుగు వక్రగతిలేని
చో జగమ్మున కీతఁడు శుభము లొసఁగు. ౧౩౯

వ. ఈ గురునకు రెండులక్షల యోజనమ్ములకు మీఁద శనైశ్చరుండు
వర్తించు, నితండు ముప్పదిమాసమ్ముల కొక్కొకరాశి వంతునఁ
దిరుగుననియు, స్వభావాశుభుండనియుఁ గార్తాంతికులు వచింతురు

గీ. ఉండు నితనికిఁ బదియునొక్కండు లక్ష
లైన యోజనముల దూరమందు సప్త
ఋషుల మండల మది సుఖమెల్లరకును
నిడుచు దక్షిణగతి దివి నెపుడు దిరుగు. ౧౪౧

వ. ఈ ఋషిమండలమ్మునకుఁ బదుమూఁడులక్షల యోజనమ్ముల
దూరమ్మునఁ బరమంబగు వైష్ణవపదంబుగల దందుఁ బరమ
భాగవతోత్తముండును, నుత్తానపాదపుత్రుండును నగు ధ్రువుం
డింద్రవహ్నికశ్యపధర్మాదులతో భగవత్పాదారాధనతత్పరుండై
యాకల్పాంతస్థాయులగు జ్యోతిర్గణంబుల కవష్టంభదారువుంబోలె
నాజీవ్యుండై తనకాంతిచే నెల్ల లోకమ్ములు వెలుంగంజేయుచు
నొప్పారు. ౧౪౨

క. ఇల మేఢిస్తంభగత
మ్ములు పశువులు కర్షణమునఁ బొదలెడి క్రియ ని

ముల్ గాలచక్రయోజిత
ములు గ్రహములు ధ్రువుని గతిన మొనసి చరించున్.

వ. ఇట్లు ధ్రువు ననుసరించి యావద్గ్రహమ్ములును కర్మసారథులై శ్యేనాది ఖగమ్ములం బోలె వాయుప్రేరితమ్ములై యాకల్ప మ్ము దిరుగుచుండును; నియ్యవి ప్రకృతిపురుషసంయోగాను గృహీతమ్ములగుకతన భూమియందుఁ బడకుండునని వెండియు,

క. భగవంతుఁడు యోగార్థం
బగు కర్మమ్మునకుఁ గాఁగ నాయీ చక్రం
బొగిఁ గల్పించె నటంచును
నిగమజ్ఞులు గొంద అందు నిగమవిధిజ్ఞా! ౧౮౫

వ. శింశుమారస్వరూపంబగు నీ చక్రమ్మునకుఁ బుచ్ఛాగ్రమ్మున ధ్రువుండును లాంగూలమ్మునఁ బ్రజాపతియు నగ్నీంద్రధర్మ్ములును ధాతయు విధాతయుఁ బుచ్ఛాంతమ్మునను, సప్తర్షులు కటియం దును, దక్షిణావర్తభోగమ్మునఁ గుండలాకారమ్ము నొందిన యీ శింశు మారమ్మునకు దక్షిణపార్శ్వమ్మున నుత్తరాయణ నక్షత్రమ్ములును సవ్యపార్శ్వమ్మున దక్షిణాయన నక్షత్రమ్ము లును గుండలాభోగవేశమ్మున నుభయపార్శ్వముల సమ సంఖ్యగా నవయవమ్ము లగుచున్న; వది యెట్లంటేని యజవీథి పృష్ఠ భాగమ్మందును, నాకాశగంగ యుదరమ్మందును పున ర్వసూపుష్యమ్ములు దక్షిణవామశ్రోణులందును, నార్ద్రా శ్లేషలు పాదమ్ములందును, నభిజిదుత్తరాషాఢలు నాసికా రంధ్రమ్ములందును, శ్రుతియు జలనక్షత్రమ్మును నేత్రమ్ము లందును, ధనిష్ఠామూలలు కర్ణమ్ములందును, దక్షిణాయనగ తమ్ములగు మఖాదినక్షత్రము లెనిమిదియును వామపార్శ్వస్థ

వంక్రులందును, నుత్తరాయణగతమ్ములగు మృగశీర్షాది నక్షత్రమ్ము లెనిమిదియు దక్షిణపార్శ్వస్థవంకి్రలందును నలరెడి; నిందు మఖాదినక్షత్రమ్ము లెనిమిదియు నానులోమ్య మ్మునను, మృగశీర్షాది నక్షత్రమ్ములు ప్రాతిలోమ్యమ్మునను నుండునని యెఱుంగునది. శతతారాజ్యేష్ఠలు దక్షిణవామ స్కంధమ్ములందును, నగిస్తి యుత్తరహనువునందును, యము డధరహనువునందును, నంగారకుండు ముఖమునందును, శని యుపస్థమ్మునందును, మూపురమ్మున బృహస్పతియు, వక్షమ్మున గ్రహాధిపతియగు సూర్యుండును, నారాయణుండు హృదయ మ్మునను, మనమ్మునఁ జందురుండును, స్తనమ్ములయం దశ్వినులును, నాభియందు శుక్రుండును, ప్రాణాపానమ్ముల బుధుండును, గళమ్మున రాహుకేతువులును, సర్వాంగమ్ములందును సర్వరోమ కూపమ్ములందును నితరతారాగణమ్ములును దనరారు, నేతత్స్వరూపంబు భగవంతుండగు నాదినారాయణుని సర్వదేవ మయంబగు నాకారంబుగా నెఱుంగవలయు, నియ్యది ప్రత్యహ మ్మును సంధ్యాకాలమ్మున నియతుండగుచు "నమో జ్యోతిర్లో కాలయ" యను మంత్రమ్మున జపించువారలకు సమస్తపాప క్షయం బగునని వెండియు, ౧౮౬

గీ. ఉష్ణరశ్మికిఁ బదివేలయోజనముల
క్రింద రాహుమండలము పెంపొందు మఱియు
నితని గమనంబు నక్షత్రగతి నెసంగు
రవికి శశికిని నితఁడు మర్దకుఁడు తలఁచు. ౧౮౭

వ. ఇతని కమరత్వఖేటత్వమ్ములు నారాయణానుగ్రహమ్మున లభి యించె; నితం డతిదూరమ్మున నుండి ననేకయోజనాయుతమ్ము లగు సూర్యాచంద్రమోబింబమ్ముల నాచ్ఛాదించుచుండ విష్ణు

వితనిపైఁ జక్రమ్ము ప్రయోగించి వారించుచుండు; నిశా-
లంబ లోకులు రాహూపరాగంబని వాడుచుండు; రీ రాహు
మండలమ్మునకుఁ గ్రిందఁ బదివేలయోజనమ్ముల దూరమ్మునఁ
బుణ్యమ్ములగు సిద్ధచారణ విద్యాధరాదుల లోకమ్ములు గల;
వీ లోకమ్ములకుఁ గ్రింద భూతప్రేతపిశాచాదివిహారాజిరంబగు
నంతరిక్షంబు గల; దెంతదనుక వాయుసంచారం బలవడు నదియ
యంతరిక్షంబు నాఁబడు, నంతదనుక మేఘమ్ములు సంచరించు
చుండు; నీ లోకంబులకు నూఱుయోజనమ్ముల క్రిందఁ బృథివి
గల దిం దుద్భవించిన సుపర్ణశ్యేనహంససారసాదిపక్షు లుత్పతన
సామర్థ్యమ్ము గలయవి. ౧౪౮

గీ. భువి కధోభాగమున మూఁడు భువనము లయు
తప్రమితయోజనములయి తనరు నొక్కఁ
డొక్కఁ డాలోకముల సుఖ మొసఁగు నఖిల
ఋతువు లందును నొకభంగి మితికి మీఱి. ౧౪౯

వ. తన్నామంబు లతలవితలసుతలతలాతలరసాతలమహాతల పాతాళం
బులని చెప్పంబడు. ౧౫౦

క. సతతోద్యానవిహారము
లతులితభోగాస్పదమ్ములగు నీలోక
ప్రతతిఁ సౌఖ్యము స్వర్గ
స్థితికన్న నొకింత హెచ్చు తెలియఁగ వినుమీ. ౧౫౧

వ. ఇం దెల్లప్పుడు నీశ్వరకరుణారససంప్రాప్తమాయావిశేషులగు
దైత్యదానవకాద్రవేయాదులు స్వకళత్రపుత్రమిత్త్రులతో గృహ
స్థులై సర్వర్తుసుఖంబు లనుభవించుచు వసించుచుందురు. ౧౫౨

క. మాయాకోవిదుఁడగు మయుఁ
డా యీ లోకములఁ జిత్రమై మణిశోభా
స్ఫాయద్గేహంబై కడు
నాయతగతి నొప్పు గోపురాళి నొనర్చెన్. ౧౫౩

క. పారావతములు శుకములు
శారికలుం గూయఁగాఁ బ్రశస్తమ్ముల న
య్యారామభూములం దమ
రారులు సురగులును మోద మందుచు రెపుడున్.

మ. హృదయామోద మొసర్చుపుష్పతతిచే నింపారు కుంజమ్ము, లు
న్మద నానావిధపక్షిశోభితనవాంభఃపూరకాసారముల్
సుదతీనర్మవిహారయోగ్యములుగాఁ జూపట్టు వేదుల్ సుఖా
స్పదముల్ సల్లడనొప్పఁ గృత్రిమవనుల్ భాసిల్లు నెల్లప్పుడున్.

వ. అచ్చట నాగశిరోరత్నప్రభలచేఁ దమంబు నామావశేషంబై యుండు; వారలకు దివ్యౌషధరసాయనంబులచేతను సరసాన్న పానస్నానాదులచేతను నాధివ్యాధిభయమ్మును వలీపలితజీర్ణత్వమ్మును వైవర్ణ్యమ్మును స్వేదదుర్గంధత్వమ్మును వార్ధకాద్యవస్థలును లేకుండు నని వెండియు, ౧౫౬

క. హరిచక్రబాధఁదక్క ని
తరబాధలచేత మృత్యుదర్శన మచటన్
బొరయ దొకప్పుడు నతలం
బరయఁగ నీ వివరములను నాద్యము సుమ్మా. ౧౫౭

వ. ఈ యతలమ్మునందు మయపుత్రుండగు బలుండు వసియించు నితండు సర్వార్థసాధకంబులగు షణ్ణవతిమాయలకుఁ గల్పకుం, డీతని యావులింతవలనఁ ద్రిలోకవిమోహనలగు కన్యకలు గొంద ఱుద

యించి కామినులును, బుంశ్చలులును, స్వైరిణులును నాఁ ప్రసిద్ధివడసి స్వవిలాసానులోకానురాగస్మితవిగూహానసంలాపవిభ్రమాదులచేఁ దగ్గతులగు వారల రంజించుచుందురు. నాగాయుతబలుండగు నీ బలుండు ' నేన యీశ్వరుండ ' నని మదాంధత్వమ్ముచేఁ బొదలుచు నెప్పుడును వర్తించుచుండు ; నియ్యాదియతలస్థితివిశేషం బిఁక ద్వితీయవివరంబగు వితలవిశేషం బాలింపుము. ౧౫౮

క. వితలమున హాటకేశ్వరుఁ
డతిలోకుఁడు పార్షదనికరావృతుఁడు సతీ
యుతుఁడునయి వసించుఁ బ్రజా
పతికృతసృష్టి కుపచయము పరఁగం జేయన్. ౧౫౯

గీ. అప్పురాణదంపతుల వీర్యమున ' హాట
కి ' యను నొకనది వుట్టె నక్కాలఁకులందు
హాటకము పేరి పుత్తడి యలరు దాని
దైత్యుల కుటుంబినులు తగఁ దాల్చుచుండ్రు. ౧౬౦

వ. మఱియు నబ్బిలమ్మునకుఁ గ్రింద సుతలమ్ము గల దయ్యెడఁ బుణ్యశ్లోకుండగు బలి వసించుచుండు. ౧౬౧

చ. సురపతిప్రీతికై హరి యశోధను నిమ్మహనీయు వంచనా
పరతఁ ద్రిలోకరాజ్యమును బాపి యిటన్ వసియింపఁ జేసె ను
త్తరగుణశాలి నీ యనఘుఁ దద్దయు నీయెడఁ బాయకుండు ని
ర్జరపతికేని లేని పలుసంపద లింపెసలార వేడుకన్. ౧౬౨

వ. ఇయ్యది పాత్రీభూతుండగు హరికిచ్చిన దానవిశేషమ్ముగా నెఱుంగు, మిమ్మహానుభావుండగు బలియు నయ్యెడనుండి యా

రమాధవు నెప్పుడు నుతియించుచు నిట్లు తనలోఁ దా ననుకొను
చుండు. ౧౬౩

ఉ. ఏ మహనీయు నామ మెవఁ డే నొకసారి పఠించి కర్మరూ
పామయముక్తుఁడౌ, యతిజనావళి దేని హరించు పొందె ని
ష్కామత సాంఖ్యయోగములుసల్పు నతండు ప్రసన్నుఁడయ్యు నా
కీమెయి నిట్టి సంపదల నిచ్చె, సిరుల్ పర మేగ నిచ్చునే. ౧౬౪

మ. అకటా! యింద్రుఁడువాని మంత్రియును మూర్ఖాగ్రేసరుల్ దేవదే
వు కటాక్షమ్మటుఁలొంది హేయమనుచుం బోనాడ కేమంచు నీ
సకలేంద్రిత్వము గోరె దేవపతి ; సంసారామయధ్వాంతదీ
పకలాహాపు హరిన్ వరించుటిదియున్ బ్రాఁతే, సిరుల్ నిల్చునే.

మ. మును మాతాత కృపాళుఁడై తనకు నిమ్ముల్లోక మీఁజాలు న
వ్వనజాతాక్షుని వేఱుగోరక, భవత్పాదాబ్జసంసక్తి ని
మ్మనుచున్ వేఁడి క్రమానుయాతమగు పిత్ర్యంబైన యైశ్వర్యమున్
గొనఁగాఁ జూడఁడ, మేలుమే లతని నాకుం బోలఁగాఁ బోలునే.

క. అని పరిపరివిధముల న
వ్వనజాక్షుని చర్యలెల్ల వర్ణించుచు న
య్యనఘుఁడు బలి యట నుండున్
దనకున్ హరి ద్వాఃస్థుఁడై ముదం బొనఁగంగన్. ౧౬౭

చ. మును పొకనాఁడు రావణుఁడు ముజ్జగముల్ విజయం బొనర్ప నెం
దును జరియించుచున్ బలిఁ గనుంగొను వేడుక నేగె, నాతఁడున్
దన బొటవ్రేలఁ దన్ను వదనంబుల రక్తము గ్రక్కుచున్ దనం
తన పదివేలయామడల దవ్వున బోరగిలంబడెన్ వెసన్. ౧౬౮

వ. బలియను నిట్టిం డీతం డిప్పటికిని సుతలరాజ్యస్థుండై దేవదేవ ప్రసాదమ్ము కలిమి సుఖమై యున్నవాఁ డీసుతలమ్మునకుఁ గ్రిందఁ దలాతలమ్ము గలదు. ౧౬౯

క. మాయావంతుల కెల్లను
నాయకుఁడు మయుండు శంభునకు భక్తుఁడు ని
త్యాయతతత్కరుణాప్త
శ్రీయుతుఁడై యచటనుండుఁ జిరయశుఁ డగుచున్.

వ. అతం డతిమాయావిశారదుండగుకతన రక్కసులెల్లఁ దత్తత్కార్యమ్ముల నతనిం బూజింతురు. దీనికిఁ గ్రింద మహాతలమ్ము గల; దయ్యెడ ననేకశిరస్కులగు కాద్రవేయు లసంఖ్యమ్ముగ నుందు రందుఁ బ్రధానులు కుహకుండును దక్షకుండును సుషేణుండును గాలయుండును నను వారలు; వీరలును దక్కంగల నాగకుమారులును నొక్క గరుడునకు భయంపడుచు సపుత్రమిత్రకళత్రమ్ముగా నచట వసియించుచుందురని వెండియు,

గీ. దానికిగ్రింద రసాతలధామ మెసఁగు
నచ్చట హిరణ్యపురవాసు లతిబలులు ని
వాతకవచులు రక్కసుల్ వఱలుదురు సు
దర్శనాహత తేజు లదభ్రరీతి. ౧౭౨

వ. వీరలకుఁ గాలేయులనియు నామంబు కలదు. వీరు శక్రదూతి యగు సరమచే మంత్రితమ్ములగు వాక్యమ్ములకతన భయపెట్టఁ బడుచుందురు. వెండియు నిద్దానికిఁ గ్రిందుగఁ బాతాళమ్ము వెలంగు నియ్యది నాగలోకాధిపులగు వాసుకిప్రముఖుల నివాసంబు. శంఖుండును, గుళికుండును, శ్వేతుఁడును, ధనంజయుండును, మహాశంఖుండును, ధృతరాష్ట్రుండును, శంఖచూడుండును,

గంబలాశ్వతరుండును దేవోపదత్తకుండునను నామమ్ములు గల వీరు మహామర్షులును, బంచఫణాకలితులును, మహాకాయులును, విషోల్బణులునునై చెలఁగుచుందు; రిందు మఱికొందఱు దశ ఫణాయుతులును గొందఱు శతశీర్షసమేతులును గొందఱు సహస్రశిరస్కులును శిరోగతమణిమరీచిజాలహతతమస్కులు నగుచు వర్తించుచుందురు. దీని మూలప్రదేశమ్మున ముప్పది వేలయోజనమ్ములపైఁ దామసియు ననంతనామికయు నగు భగవత్కళ సెలంగు, నయ్యది యహంకారమ్మునకుఁ బ్రథమలక్షణంబని సాత్వతేయులు వచింతు; రీ భూమండలంబు సర్వంబును నేతదీయసహస్రశిరోధివాసంబై తనరు. మఱియు సాంకర్షణ నామకుండగు రుద్రుం డేకాదశవ్యూహాశోభితుండగుచుఁ ద్రిశిఖంబగు శూలమ్ము నదల్పుచు నిచట నుదయించె. ౧౭౩

శా. ఏ యెవ్వాని నఖంబు దర్పణముగా నేకాంతసేవాపరుల్
శ్రీయుక్తుల్ ఫణిపుంగవుల్ స్వవదనశ్రీలన్ విలోకించుచున్
భూయఃకల్పితపూజలన్ నిరతమున్ భోగమ్ము లర్పింతు రా
ధ్యేయప్రాభవుఁ డీ య్యనంతుఁడు సురాధీశ్వర్యుండు చెన్నారెడిన్.

గీ. వైజయంతి గళమ్మున వఱల మత్త
లోకభయకారణోజ్జ్వలలోచనుండు
సత్వమూర్తి యనంతుఁ డెసంగు వాగ
మృతరసమ్మున భక్తుల కింపొసఁగుచు. ౧౭౪

వ. మఱియు నద్దేవుండు నీలవాసుండును హాలసంశోభితపీవరభుజుండును కాంచనవరత్రాశోభమానకటిభాగుండును ననేకనాగసుందరీకామ్యమానస్వరూపుండును నగుచు నలరారు నమ్మ

హాత్మ్య మహానుభావంబు సనాతనుండగు బ్రహ్మపుత్రుండు
బ్రహ్మసభయం దిట్లు సన్నుతించె. ౧౭౬

సీ. త్రికృతులొనర్చు నేదివ్యప్రభావుండు
 పాపమ్ము లడఁచు నేభవ్యు పేరు
యావత్ప్రపంచమే యనఘుని శిరమున
 నణురీతిఁ బొల్చు నిరంతరంబు
భగవంతు నీజగద్బాంధుని విడిచి యె
 వ్వఁడుఁ ముముక్షుఁ డితరోపాసనంబు
సల్పు ! భక్తులయెడ సంపూర్ణకరుణ య
 న్యుల కెవ్వరికి నిట్టు లొలయునెందు !
గీ. సురుచిరగుణాభిరాముండు సుందరుండ
నంతవీర్యుం డనంతుండు చింతితార్థ
దాత యవదాతకాయుఁ డపేతకలుషుఁ
డాశ్రయించెడిభక్తుల నరయువాఁడు. ౧౭౭

వ. ఇతం డెల్లప్పుడు నాత్మతంత్రుఁడై విహరించుచుండు నని వెండియు,

క. మనుజులకుఁ గర్మపరిపా
కనియతిఁ దనరారు నుచ్చగతియు నధోలో
కనివాసమ్మును నన న
మ్మునివరుఁడిట్టులను మౌనిముఖ్యునితోడన్. ౧౭౯

వ. మహాత్మా ! కర్మమ్ము లెల్లరకు నొక్కవిధమునఁ దనరారుచుండ నీ వైచిత్ర్యంబు భగవంతునిచే నెట్లు కల్పితంబయ్యె నావుడు నారాయణుండు, ౧౮౦

గీ. వినుము కర్మము లొనరుచు జనుల శ్రద్ధ
కనుగుణమ్ముగ ఫలములు నమరుఁ గర్మ

ములు త్రిగుణములగుకతన నొలయు వాని
ఫలము వేర్వేఱు దాఁ దొల్య మలరునెట్లు. ౧౮౧

వ. సాత్త్వికశ్రద్ధచేఁ జేయు కర్మమ్మునకు సుఖమ్మును, రాజసశ్రద్ధచే నొనర్చుపనికి దుఃఖమ్మును, దామసశ్రద్ధచే నల్పుకృతికి మూఢత్వమ్మును గలుగుచుండు ; వెండియు ననాద్యవిద్యావిహితకర్మమ్ములకుఁ బరిణామజమ్ములగు గతులు వేలకొలఁది యని యెఱుంగుము ; తద్భేదమ్ము లెట్టివనిన, ౧౮౨

చ. ధరణికిఁగ్రిందుగా నతలధామము మీఁదుగ దక్షిణమ్మునన్
బరమకృపన్ స్వగోత్రజుల భద్రములొందఁగ నెప్డుగోరుచున్
స్థిరమతిమైఁ బితృప్రతతి తేజరిలున్ బితృరాజు కర్మపుం
బరిణతి నిర్ణయించు భగవన్నియమమ్మున వారికిం గతుల్. ౧౮౩

వ. ఇతం డాజ్ఞాతత్పరులును ధర్మతత్త్వజ్ఞులునునగు తన గణమ్ములఁ దత్తత్కృతులయందు నియోగించుచుండు; వెండియు నరకమ్ములు కొంద ఱేకవింశతియనియు మఱికొంద రష్టావింశతి యనియును నొడువుదురు; వాని నామమ్ములు తామిస్రమ్మును రౌరవమ్మును మహారౌరవమ్మును కుంభీపాకమ్మును గాలసూత్రమ్మును నసిపుత్రారణ్యమ్మును సూకరముఖమ్మును నంధకూపమ్మును గ్రిమిభోజనమ్మును సందశమ్మును దప్తమూర్తియు వజ్రకంటకమ్మును శాల్మలియు వైతరణియుఁ బూయోదమ్మును బ్రాణరోధమ్మును విశసనమ్మును లాలాభక్షమ్మును సారమేయాదనమ్మును నవీచియు క్షారకర్దమమ్మును రక్షోగణమ్మును భోజమ్మును శూలప్రోతమ్మును దందశూకమ్మును వటారోధమ్మును బర్యావర్తనకమ్మును సూచీముఖమ్మును ననిచెప్పంబడు ; నీయిరువదియెనిమిదియు నరకమ్ము లనెడి యాతనా భూము ;

లియ్యవి భూతమ్ముల కర్మమ్ముల ననుసరించి గమ్యమ్ములు
నావుడు నారదుండు, ౧౮౪

క. అనఘా! కర్మమ్ముల భే
దనియతియుఁ వానిఁజేయువారలకగు యా
తనలును విస్పష్టమ్ముగ
వినిచి నన్ధన్యుఁ జేయవే వే యనుడున్. ౧౮౫

వ. నారాయణుం డిట్లను.

చ. పరధనదారచోరులను బట్టి యమానుచరుల్ పదమ్ములన్
గరముల రజ్జులం బెనిచి కట్టియుఁ గొట్టియు భీతిగొల్పుచున్
గరము ననేకభంగులను గాసిలఁజేయుచు నాద్యమైన య
న్నరకమునందుఁ ద్రోతురు స్వనాయకునానతిఁ గ్రోధదీప్తులై.

గీ. పతిని వంచించి యన్యుని సతినిఁ బొందు
నరుని నంధతామిస్రమన్నరకమందుఁ
ద్రోతు రయ్యెడఁ బడిన జంతువులు దృష్టి
బుద్ధిహైన్యంబు నందుచుఁ బుట్టిదలఁగు. ౧౮౭

క. భూతద్రోహ మొనర్చుచు
ఘాతుకుఁడై యెవఁడు తనదు కాంతన్ సుతులన్
ప్రీతిం బోషించు నతం
డాతురుఁడై రౌరవమున నడఁగు మునీంద్రా. ౧౮౮

క. తనచేఁ బీడన్ మును బొర
సిన జంతువులెల్ల రురువిశేషాకృతి నై
కొని బాధ గొల్పుటం, దా
నిని రౌరవ మండ్రు బుధులు నిగమవిధిజ్ఞుల్. ౧౮౯

వ. రురు వనఁగ సర్పమ్మునకన్నఁ గ్రూరమ్మగు నొక జంతువు; మఱియు మహారౌరవమ్మనఁబడు జంతువులఁ గ్రవ్యాదనామకమ్ములగు రురువు లిట్లన మాంసము భక్షించుచుఁ బీడించునని వెండియు, ౧౯౦

తే. గీ పసులఁ బిట్టల హింసించు పాపకర్ము
లల్ల వాని వెండ్రుక లెన్ని యన్ని వేల
సమలు సలసల మఱఁగెడి చమురులోన
నవయుచుండ్రు కుంభీపాకనరకమందు. ౧౯౧

క. పితృవిప్రబాధకుఁడు సం
తతమును దాఁ గాలసూత్రనరకమ్మున ని
గ్గతిఁగా నక వహ్న్యర్కో-
న్నతపీడల నొందు నెన్నినాళ్లే సనఘా. ౧౯౨

మ. తనవేదంపుగతిన్ త్యజించి యనిమిత్తంబొందుఁ బాషండవ
ర్తన మెవ్వాఁ డతనిన్ భటుల్ కశలచేఁ దాడించుచున్ నిత్యదుః
ఖనివాసం బసిపత్రకాననము నెక్కం జేతు రద్దాని బా
ధను లెక్కింపఁ దరమ్మగాదు తనువింతల్ కండతుండెమ్ములా.

తే. గీ. ధర్మ మెఱుఁగక శిక్షించు ధరణిపతియు
నతని యధికార మూనిన పతితుఁడును, ద్వి
జునకు శారీరదండమ్ము జొనుపు కష్టుఁ
డును బడుదురు సూకరముఖమున నరేంద్ర! ౧౯౪

వ. ఆ సూకరముఖమ్మున నిక్షుదండంబుంబలె బిండిపిండియగుచు నార్తస్వరమ్మున మూర్ఛిల్లుచు ననేకగతుల వందురుదు రని వెండియు, ౧౯౫

క. ఒరులను బాధింపని యా
త్మరతుల కెవ్వాఁడు పీడఁ దగఁజేయు నతం
డురుతరదుఃఖస్థితులను
ఘోరయుతుండై యంధకూపమునఁ బడు నధిపా. ౧౯౬

వ. అయ్యెడఁ గ్రూరమ్ములగు పశుపక్షిమృగాదులచేతను సర్పమ్ముల
చేతను మశకయూకామత్కుణమ్ములచేతను నానావిధమ్ములఁ
బీడింపఁబడునని మఱియును, ౧౯౭

గీ. పంచయజ్ఞవిహీనుఁడై పశువుపగిది
నెవఁడు భుజియించు నాదుష్టుఁ డేగెడి క్రిమి
భోజనమ్మను నరకమ్ముఁ బురువునగుచు
లక్షయోజనములు దాని కుక్షి తనరు. ౧౯౮

చ. అరయఁగ బ్రాహ్మణోత్తములదైన దదన్యులదైనఁగాని బం
గరు రతనంబు లియ్యవి పొగర్మిగుల్ హరియించెనేని య
న్నరున కయోమయమ్ములు కనద్ఘనవహ్నియుతమ్ములైన యు
ఘ్రరతరపిండముల్ చొనిపి తోరపుబాధఘటింతు రచ్చటన్.

గీ. ఎవఁడగమ్యాగమనమును నెఱిఁగి చేయు
నెవతె తాదృశపూరుషు నెఱిఁగి పొందు
వీరలకు లోహమయ మతిదారుణంబు
నైన సూర్మితో నుపగూహ మమరు నచట. ౨౦౦

గీ. మఱియు సర్వాభిగమన మ్మమరిన పురుషుఁ
బట్టి యమభటు లతిశోకభర మెసఁగఁగ
వజ్రకంటకశాల్మలీపాదపంబు
మొదలఁ దా మంటదీసి కట్టుదురు వెలుచ. ౨౦౧

వ. పాషండమతానుయాయులై ధర్మసేతువు నతిక్రమించు రాజులును దదనుగతులగు నమాత్యులును నిరయసుర్గపరిఖయగు వైతరణియందుఁబడి యాదోగణమ్ములచే భక్షింపఁబడుచుఁ జచ్చియుం జావక కర్మపరిపాకమ్మునఁ దద్గతమేదోవసాసిక్తకేశాస్థినఖమాంసవిణ్మూత్రమ్ముల బ్రుంగుడువడుచు నవయుచురని వెండియు. ౨౦౨

మ. తగు నాచారము శౌచముం ద్రపయు సంత్యక్తమ్ము లెవ్వారిచే
నగు నాయీవృషలీపతుల్ పశుకృతిప్రారంభు లత్యంతదు
ర్భగమా నీనదియంద కూలి మలమూత్రశ్లేష్మముల్ కూడుగా
నెగడంగాఁగల రెన్నినాళ్లయినఁగానీ శోకముంగాంచుచున్.

గీ. శునకగర్దభజాతుల నెనయు దుర్మ
దులును మృగయారసికులును నలఘువిశిఖ
తాడనమ్ముల నింతలింతలుగఁ గోయఁ
బడుదురు పరమ్మునను యమభటులచేత. ౨౦౪

గీ. దంభగతి జన్నములొనర్చి దారుణముగఁ
బశులఁ జంపెడి దుష్టులౌ బ్రాహ్మణులను
వైశసమ్మునఁ బడవైచి భటులు కశలు
కేలఁగొని కొట్టుదురు మేని తోలువదల. ౨౦౫

క. తనభార్య నేద్విజుండు మ
దన మోహితుఁడై యొకింత తగవెఱుఁగమి నె
క్కొని శుక్లపానమును జే
య నొనర్చునో వాని కదియ యాహారమగున్ ౨౦౬

గీ. దస్యు లగ్నిదులును విషదాతృసార్థ
ఘాతుకులును గ్రామమ్ములఁ గలుగు ధనము

దోఁచురాజులు వీరు దుర్దుఃఖదంబు
శ్వానఖాదనమును బొందఁజనెడివారు. ౨౦౭

వ. అయ్యెడ ననేకమ్ములగు సారమేయమ్ములు వీరల భక్షించు నిక్కతమ్మునఁ దీని కీ నామంబు గలిగె నని వెండియు, ౨౦౮

చ. అనృతపుసాక్ష్య మిచ్చు జనుఁ డయ్యెడఁ బొందు నవీచినామకం
బను నరకంబు దానివిధమున్ విను మొక్కగిరిం దగంగ నె
క్కునటులొనర్చి పిమ్మటను గుంభినికిన్ బడఁద్రోయుచుంద్రు; యో
జనశత మంతరమ్మున నెసంగెడు నగ్గిరికిన్ ధరిత్రికన్. ౨౦౯

వ. అగ్గిరినుండి యధోముఖమ్ముగాఁ బడు నవ్వానికి జలము లేకయు తరంగసంగతంబగుభంగి స్థలంబు గన్పడుట నయ్యది యవీచినాఁ బరఁగు ; నయ్యెడం బడుమీఁదఁ దిలలపగిది దేహంబింతింత లయ్యును మృతిఁబొప్పడకుండెడిఁ బదంపడి యథాపూర్వమ్ముగ నగ్గిరిశిఖరం బధిరోహించి యట్లన పొనర్చుచుందురు. ౨౧౦

గీ. బ్రాహ్మణుండైన రాజైన వైశ్యుఁడైన
సోమపానంబొనర్చియు సురనుగ్రోలఁ
గ్రాఁగెడి యయోరసమ్మును ద్రాగు నిరయ
మంముఁ బడి కాలుదూతలు తొందరింప. ౨౧౧

వ. వీరల కళత్రంబేనిఁ బ్రమాదమ్మున సురాపానం బొనర్చినఁ బూర్వోక్తంబగు గతియ యలవడు నని వెండియు, ౨౧౨

క. ఘనులగు విద్యానిధులన్
దనకన్నన్ గొప్పవారిఁ దాఁ గని సంభా
వనచేయని మత్తుని దు
ర్మనస్కునిన్ క్షారకర్దమమ్మున వైతుర్. ౨౧౩

వ. అయ్యెడఁ దలక్రిందుగనుండి దుఃఖ మ్మనుభవింపవలయునని వెండియు, ౨౧౪

క. నరమేధము లొనరించిన
దురాత్ములను మున్ను తారు దునిమిన పసువుల్
నిరయమ్మున సౌనికముల
కరణిన్ బీడించి పెలుచఁ గడతేర్చు మునీ. ౨౧౫

శా. హేలన్ గ్రామమునన్ వనమ్మననుగానీ యొల్లఁ బీడింపకే
కాలమ్మం దగుభంగిఁ బుచ్చు పశులన్ ఖండించి భక్షించు దు
ర్శీలుల్ కంకబకాదు లెల్లడల హింసింపన్ క్షుధార్తాత్ములై
శూలప్రోతమునందుఁ గూలి నుగులన్ శోకింతు రాశూలకున్.

గీ. సర్పములఁబోలె జనుల హింసలను గొలుపు
కఠినహృదయులు దందశూకమునఁ గూలి
సప్తముఖములు పంచాస్యసహితములును
నైన పాములచేఁ బీడనందుచుందు. ౨౧౭

వ. ఎవ్వారేని గోతులయందును బొణకలయందును గుహలయందును నొరుల నిరోధింతురో వారల నాయాయెడలన చొనిపి యందు విషయుక్తమగు వహ్ని నూంకల్పి బాధింతురని వెండియు,

చ. సమయగతాతిథిప్రతతిఁ జాలఁ గఠోరపు దృష్టిఁ జూచు దు
ష్టమనుజుఁ గాకకంకముఖజంతువు లాగ్రహమూని తీక్ష్ణవ
జ్రమయములైన చంచువులఁ జక్షువులం బెకలించి సారె దు
ర్గమమగు ఘోరశోకమునఁ గ్రాఁగఁగఁజేయు ననేకభంగులన్.

క. తానార్జించిన ద్రవ్యం
బేనియు భక్షింప కొరుల కీక గ్రహమునఁ

గా నెవఁడు గాచు విను మ
హ్వానికి సూచీముఖాభిపాతం బొలయున్. ౨౨౦

వ. ఇయ్యవి నరులకు యాతానాభూములగు నరకమ్ములింకను నిట్టివి వేలకొలఁది గలవు. ౨౨౧

క. తన ధర్మమ్మును విడువక
మనుజుం డెవ్వఁడు లోకమాన్యచరిత్రన్
దనరెడి జగదంబం దా
గొనియాడున్ వాఁడు నరకగుఁడు గాఁడనఘా. ౨౨౨

వ. నాపుడు నారదుం డిట్లను.

క. జగదంబాపూజావిధి
దగుఁ దా నెబ్భంగి దానిఁ దగ నానతి యి
మ్మొగి నెద్దాని నొనర్చిన
సుగుణులు నరకంపుఁద్రోవఁ జూడ రొకప్డున్. ౨౨౩

వ. నాపుడు నారాయణుం డిట్లనియె.

క. పారమ్ములేని యీ సం
సారమ్మున శక్తిపాదసంసక్తి మహా
ఘోరాఘామయములఁ గడు
దూరముగాఁ జిమ్మి సుఖము దొరకొనఁజేయున్. ౨౨౪

సీ. ప్రతిపత్తిథిని నేయి పాలుప కిడి దేవిఁ
బూజింప రోగముల్ వోవు, శర్క-
రను విప్రునకు ద్వితీయ నొసంగి యద్దేవి
నారాధనముసేయ నాయువొదవు,
ద్విజునకుఁ బాలుఁ దృతీయయందిడి పూజ
చేసిన దుఃఖముల్ సెదరిపోవుఁ,

బుడమి వేల్పునకు నపూపమ్ము నిడి చతు
ర్థిని గొల్వ విఘ్నముల్ జనని యడఁచుఁ
గీ. బంచమి జగజ్జననికి రంభాఫలంబు •
దగ నివేదించి యద్దాని ధరణిసురున
కిచ్చి కడుబుద్ధిమంతుఁడౌ, నెవఁడు మధువు
షష్ఠి నిటు సేయు వాని కెసంగుఁ గాంతి. ౨౨౫

వ. మఱియు సప్తమియందు గుడంబు నివేదించి బ్రాహ్మణున కొసఁగి
శోకహీనుండగు; నష్టమియందు నారికేళఫలంబుల నివేదించి
భూసురార్పణంబొనర్చి తాపమ్ములంబాయు; నవమియందు లాజల
నిట్లొనరించి యిహాముత్రసుఖాధికుండగు; దశమియందుఁ గృష్ణ
తిలల నంబార్పణంబొనర్చి పదంపడి బ్రాహ్మణాధీనంబొనర్చు
వారికి యమలోకభయంబు లేకుండు. ౨౨౬

క. ఏకాదశి నంబికఁ బా
లాకలితంజేసి పెరుగు సద్ద్విజునకుఁ దా
నేకాంతభక్తి నిడు వాఁ
డా కామవిధాయినికిఁ బ్రియతనుఁడు మాౕసీ. ౨౨౭

గీ. ద్వాదశి నెవండు పృథుకముల్ బరమభక్తి
నంబికాసన్నిధిని భూసురాగ్రగణ్యు
నకు నొసఁగు వానిమెడ దేవి కధికమునను
జెలఁగు సంప్రీతి యది యెంత సేయ దనఘ! ౨౨౮

క. సెనగలు త్రయోదశి జగ
జ్జననికి నర్పించి విప్రసత్తమునకు ని
చ్చిన వానికి సంతానం
బనూనముగ నొదవు మునికులాగ్రణి వింటే. ౨౨౯

క. సక్తు నివేదనమున పర
శక్తి చతుర్దశినిఁ బూజసలిపి యదియు బల్
రిక్తునకు విప్రునకు నిడి
వ్యక్తముగ శివప్రియత్వ మందు మునీంద్రా. ౨౩౦

గీ. పాయసము పూర్ణిమను నయ్యపర్ణ కొసఁగి
దాని బ్రాహ్మణాధీనంబుఁ దగనొనర్పఁ
బితరులకుఁ బ్రీతిగల్గు నో యతివరేణ్య !
హవన మాదినమందుఁ జేయంగవలయు. ౨౩౧

వ. హోమంబొనర్చునెడ ప్రతిపదాదిపూర్ణిమాంతతిథ్యుక్తపదార్థంబులు వలయు ; వెండియు నాదిత్యవారమ్మునఁ బాయసమ్మును సోమవారమ్మునఁ బాలును భౌమవారమ్మునఁ గదళీఫలమ్మును బుధవారమ్మున నవనీతమ్మును గురువారమ్మున ఖండశర్కరయు శుక్రవారమ్మున సితయు శనివారమ్మునఁ గోఘృతమ్మును దేవీప్రీతికరమ్ము ; లింక నక్షత్రక్రమమ్మున నైవేద్యమ్ముల వివరింతు. ఘృతమ్మును దిలలును ఖండశర్కరయు దధియు దుగ్ధమ్మును గిలాటకమ్మును దధికూర్చియు మోదకమ్మును ఫేణికయు ఘృతమండకమ్మును గంసారమ్మును వటపత్రమ్మును ఘృతపూరమ్మును వటకమ్మును గోకరసకమ్మును బూరణమ్మును మధుసూరణమ్మును గుడమ్మును పృథుకమ్మును ద్రాక్షయును ఖర్జూరమ్మును రాజకమ్మును సపూపమ్మును నవనీతమ్మును ముద్గమ్మును మోదకమ్మును మాతులుంగమ్మును ననునియ్యవి నక్షత్రనైవేద్యమ్ము ; లిఁకవిష్కంభాదియోగమ్ములకు వివరింతు ; గుడ, మధు, ఘృత, దుగ్ధ దధి, తక్రాపూప, నవనీత, కర్కటీ, కూశ్మాండ, మోదక, పనస, కదళీ, జంబూ, చూతఫల, తిల, నారంగ, దాడిమ, బదర

రీఫల, ధాత్రీఫల, పాయస, పృథుక, చణక, నారికేళ, జంబూ ఫల, కశేరుసూరణమ్ములు క్రమమ్మునఁ దెలియునది ; మఱియుఁ గరణమ్ములకు వినుము ; కంసారమ్మును మందకమ్మును ఫేణియు మోదకమ్మును వటపత్రమ్మును లడ్డుకమ్మును ఘృతపూరమ్మును దిల మ్మును దధియు ఘృతమ్మును మధువును ననునివి తత్ప్రీతికరమ్ము లగు నైవేద్యమ్ములు ; మఱియు నొండు విధానమ్ము సెప్పెద నాకర్ణింపుము. ౨౩౨

గీ. చైత్రశుద్ధతృతీయ నిచ్చలు మధూక
వృక్షము యజించి మఱియు నైవేద్యములను నొ
సంగఁదగుఁ బంచఖాద్యసుసంగతముగ
వెండియు వచింతు వినుము సవిస్తరముగ. ౨౩౩

వ. వైశాఖమాసమ్మున గుడమ్మును జ్యైష్ఠమ్మున మధువును నాషాఢమ్మున నవనీతమును శ్రావణమ్మున దధియును భాద్రపదమ్మున శర్కరయు నాశ్వయుజమ్మునఁ బాయసమ్మును గార్తికమ్మున క్షీరమ్మును మార్గశీర్షమ్మున ఫేణియుఁ బౌషమ్మున దధికూర్చికయు మాఘమ్మున గోఘృతమ్మును ఫాల్గునమ్మున నారికేళమ్మును శుద్ధతృతీయార్చితంబగు మధూకమ్మునకు నైవేద్యమ్ములు మఱియు మంగళయు వైష్ణవియు మాయయు మహామాయయుఁ గాళరాత్రియు దురత్యయయు మతంగియుఁ గాళికయుఁ గమలవాసినియు శివయు సహస్రచరణయు సర్వమంగళరూపిణియు నను నీనామమ్ములఁ గ్రమమ్ముగ నమ్మధూకమ్మున దేవి నర్చింపవలయుఁ బదంపడి వ్రతంబు సంపూర్ణంబగుపొంటె నమ్మధూకగతయగు నంబికంగూర్చి, ౨౩౪

గీ. “అంబ పుష్కరనేత్రి లోకైకజనని
మంగళాకార భక్తసమ్మాన్య పాప

హారిణి మహేశి దుర్మార్గహంత్రి పరగ
తిప్రదాత్రి ప్రజోత్పత్తి ధీవిదాత్రి. ౨౩౫

గీ. మదవిధాత్రి మదోన్మత్త మానగమ్య
పరపురుషరూప పరమేశి ప్రళయకాల
మేఘసదృశ లోకేశి యమేయ యమని
వాసహారిణి యమపూజ్య తాపసేద్య. ౨౩౬

గీ. నీరజాతాప్తసహచారిణీ మహావి
మోహనాశిని యమనిగ్రహాహప్రథిత
సర్వసంగవివర్జిత సంగనాశ
కరి యమాగ్రజ కామాక్షి కామ్యరూప. ౨౩౭

గీ. మర్మభేదిని మీనాక్షి మధురశీల
మంత్రగమ్య మహామంత్రమండితాత్మ
దేవి కంకాలఘోర సుధీజనాభి
వంద్య మధురస్వరార్చిత వందనములు. ౨౩౮

గీ. అంబ యశ్వద్ధవటకపిత్థామ్రనింబ
బదరికాలయ క్షీరార్కపనసకుజక
రీరరూపిణి దివ్యశరీర దుగ్ధ
వల్లివాసిని నీకిదె వందనంబు. ౨౩౯

వ. ఇట్లు వ్రతాంతమ్మున నుతించినవారలకు సమస్తకామపరిపూర్తి యగు; నీస్తోత్రమ్ము నెవ్వాఁడు నిత్యము పఠించు వాని కగు ఫలంబు వినుము.

సీ. బ్రాహ్మణుఁడు శ్రుతిసంపన్నుఁడౌ, రాజు వి
జయమందు వైశ్యుఁడు, సంపదగను

శూద్రుఁడు సుఖమందుఁ, జొప్పడకుండు నా
ధివ్యాధిభయమరాతిభయమేని ;
శ్రాద్ధకాలమ్మున జపియింపఁ బితరుల
కక్షయమ్మగు తృప్తి యలరు నిట్లు
పరశక్తి నర్చించు ఫక్కికఁ దెల్పితి
నిది చేసి నరుఁడు లోకేశితోడ

గీ. నైక్యమును జెందు నొక్కఁడే యనఁగ నేల
యంబ నర్చించువారల కఖిలకామ
ములును సిద్ధించు నరకమ్ము మొదలనడఁగు
స్వప్నమున నేని భయము జొప్పడదు మాని. ౨౮౧

—* స్కంధాంత పద్యములు *—

క. ఆశీర్వాదప్రాపిత
పేశలకవితాప్రభావవిస్మితశిష్యా !
దేశితసర్వత్రిమహా
రాశీకృతకీర్తిసాంద్ర ! బ్రహ్మసుధీంద్రా !

—* విచిత్రవృత్తము *—

ధరాపాలసేవాపరీతాంఘ్రిపద్మ
స్ఫురచ్ఛాత్రిలోకస్థిరాత్మప్రకర్షా !

—* రథోద్ధతము *—

పూర్వజన్మకృతపుణ్యసంచితా
ఖర్వశాస్త్రచయకల్పితప్రభా
ధూర్వహాత్వపరితుష్టశిష్యహృ
త్పర్వచంద్రనిభ ! పండితప్రభూ !

గద్య

ఇది శ్రీ......... తిరుపతి వేంకటేశ్వర ప్రణీ
తంబగు దేవీభాగవతంబను మహాపురాణమ్ము
నందు అష్టమ స్కంధము
సంపూర్ణము.

శ్రీ. శ్రీ. శ్రీ.

శ్రీమత్కామేశ్వరీ దేవతాయైనమః.

శ్రీ
దేవీ భాగవతము

నవమ స్కంధము

పీఠిక

శా. శ్రీనాథుండు సరస్వతీవిభుఁడు గౌరీభర్త యన్మువ్వురున్
దానోచుం బదునాల్గులోకముల కాధారంబుగానుండి తన్
ధ్యానింపం దలకొన్న భాగవతసంతానంబు వర్ధిల్ల వి
జ్ఞానం బిచ్చెడు నాదిశక్తిని ముముక్షుం గోరె మ్రొక్కందగున్.

చ. అతులితకావ్యనాటకరహస్యవిధిజ్ఞుఁడు వేదవేది సం
స్తుతమతి శిష్యవత్సలుఁడు సూనృతవాగ్రుచిరుండు జ్యోతిషా
ప్రతిహతుఁ డుప్పులూరికులవారిధిచంద్రుఁడు రమ్యకీర్తివి
శ్రుతుఁడగు రామజోగన గురుప్రవరున్ స్మరియింతుమెంతయున్.

వ. అని యిష్టదేవతాభివందనంబును గురునమస్కారంబును గావించి యొద్దియే నొక్క విధూతభవబంధంబగు ప్రబంధంబు నాంధ్రీక రింపం దలంచుచుండ నొక్కనాఁడు,

క. యోగీంద్రవందితము నిగ
మాగమసారార్థభూత మఖిలముముక్షు
స్వాగతమార్గము దేవీ
భాగవతము వ్యాసమౌనివరవిరచితమున్. ౪

శా. ప్రజ్ఞావంతులు శాబ్దికుల్ కవులు విద్వాంసుల్ శతాష్టావధా
నజ్ఞుల్ శ్రీపతివేంకటేశ్వరు లమందప్రీతిఁ దెల్గించుచున్
విజ్ఞానాఢ్యుల రామకృష్ణుల మమున్ వీక్షించి యస్మన్మనీ
షాజ్ఞత్వంబున నిచ్చి రందు నవమస్కంధంబు దెల్గింపగన్. ౫

వ. తత్సమావేశ ప్రకారంబెట్లనిన.

సీ. తారకమంత్రచింతకుఁడు భైషజ్యవి
ద్యాతత్త్వవేత్త రామయ్య తాత
తృష్ణావిదూరుఁ డతిప్రశాంతుఁడు తత్త్వ
వేత్తయౌ నారప్ప పిన్నతాత
ధాతుపరీక్షణదక్షుఁ డౌషధమర్మ
విదుఁడు నా కామన్న పెద్దతండ్రి
నిత్యక్రియాసక్తి నిర్మలాంతశ్శక్తి
కలుగు రామస్వామి కన్నతండ్రి
సుందరదేహుండు సుజనప్రియుండు నా
నల రాజగోపాల మనుఁగుతమ్ముఁ
డమలచిత్తులు సర్వసములు సీతారామ
సుబ్బరాయాంక భాజులు పితృవ్యు
లన్నదానాదర యగు లచ్చమాంబాభి
ధాభవ్యసాధ్వీమతల్లి తల్లి

శ్వశూ్రిపరాయణసచ్చిత్త సుబ్బమ
తతదయారసగుణోదార దార

గీ. గలుగువాఁడును నాకొండికులభవుండు
కోవిదప్రియుఁ డాత్రేయగోత్రజుండు
ప్రథితచరకాదివైద్యశాస్త్రప్రవీణుఁ
డమలమతి రామమూర్తినామాంకితుండు. ౭

క. తిరుపతివేంకటకవులం
దిరువురిలో నొకఁడు వేంకటేశ్వరకవికిన్
జరజీర్ణకృఛ్రరుజమును
సరసౌషధముల నొసంగి సాధించె వడిన్. ౮

గీ. శ్రీలలితమైనయట్టి మా పోలవరము
నందు మాసద్వయం బుండి యౌషధంబు
పుచ్చుకొనియెను వెంకటబుధుఁడు ; మాకు
మువ్వురకు నేస్తమయ్యె నప్పుడు దృఢముగ. ౯

క. నీరుజుఁడై విశ్వాసము
పేరేపన్ జెళ్ళపిళ్ళ వేంకటకవి మా
లో రామమూర్తి గుణసం
భారము వాకుృచ్చె నొక్క మత్తేభమునన్. ౧౦

వ. అది యెట్లంటేని.

మ. కవిత న్నైపుణిగాంచి చక్కఁ జతురంగం బాడఁగా మించి గా
నవిధిన్ బద్యములం బఠింపఁదగు విన్నాణంబు నార్జించి వం
శవశంబై యెడఁ బాయకున్నదగు భైషజ్యంబునం జక్రవ
ర్తివినై యొప్పితి రామమూర్తి ! శమితార్తీ ! కీర్తికిన్ మూర్తివై.

ఉ. ఈవును గృష్ణమూర్తియును నేకముగా నొకచోఁ బఠించుటన్
భావము కబ్బ మొక్కగతి భాసిలు మిత్త్రులు మీర లిర్వురన్
గావున నిచ్చవచ్చు నొకస్కంధముఁజూచి తెలుంగుఁజేయుఁడీ
దేవిచరిత్త్ర మందు భవదీయగుణోన్నతి వెల్లడిల్లెడున్. ౧౨

క. అని యనురాగాతిశయం
బున వాక్రుచ్చుటయు దీనిఁ బూరింపంగా
ననువగు నే నిహపరసా
ధన మబ్బునటంచుఁ జెప్పఁదలఁచితి మంతన్. ౧౩

సీ. శివకేశవాలయస్థిరకార్యకరుఁ డన్న
దాత వెంకనమంత్త్రి తాతగారు
అతిథిపూజాసక్తి యమరార్చనాభక్తి
బరఁగిన జనకుండు బాపిరాజు
ఆఁకలిగొన్నవా రగపడ్డ సంతృప్తి
గఱుపుమహాలక్ష్మి కన్నతల్లి
పరదారపరధననిరసనశీలుఁడై
వెలయు నెట్టెమరాజు పిన్నతండ్రి

గీ. కలుగువాఁడను నిశ్శంకకులుఁడ నన్ను
కృష్ణమూర్తి యటందు రీకృతివరంబు
దెలుఁగుసేయుచు రామమూర్తియును నేను
రామకృష్ణుల మైనవారము కలయిక. ౧౪

వ. ఇట్లని వితర్కించితిమి.

శా. నిర్లిప్తుండు సదాన్నదాత బహుళాంతేవాసి ధీరాశియౌ
చర్లబ్రహ్మయశాస్త్రి పేరఁ గృతిగా సర్వంసహామండలీ

స్వశ్లోకాఢ్యము దేవిభాగవతముఁ శ్రద్ధాసమున్నద్ధులై
నిర్లక్ష్యంబుగఁ దెల్గుసేయుఘను లెందేఁ బూజ్యతం జెందరే. ౧౫

గీ. అట్టి తిరుపతివేంకటేశాఖ్యకవులఁ
గలసి చెప్పుటకన్న భాగ్యంబు కలదె!
చందనంబుల నడుమ వృక్షంబు లెవ్వి
యున్నఁ దత్పరిమళ మబ్బకున్నె కొంత. ౧౬

వ. అని దృఢనిశ్చయులమై. ౧౭

క. ఈరామకృష్ణకవులము
ప్రారంభించితిమి దేవిభాగవతమునం
బేరగు నవమస్కంధము
నారసి తెలిఁగింపఁ బండితాహ్లాదముగన్. ౧౮

తే. గీ. తివిరి యీనవమం బేము తెలుఁగుసేయఁ
బూను టరయ నిదెల్లినఁ బూజ్య మనియు
ముక్తిదాయకమనియు నాసక్తి గాని
కవితయందలి వేడ్కచేఁ గాదుసుండు. ౧౯

—* కథారంభము *—

క. నిరతాన్నదానకృత్యా
స్ఫురదాత్మతపోవిశేషశుభాంశుకళా
పరిపాలితశిష్యయశః
పరివర్ధితకీర్తిసాంద్ర! బ్రహ్మాసుధీంద్రా! ౨౦

గీ. అవధరింపుము సృష్టిక్రమాంతరముగ
లలి గణేశాంబ దుర్గయు లక్ష్మి రాధ,

యును సరస్వతి సావిత్రి యనఁగ నైదు
విధములఁ బ్రకృతి జగాన వెలసె ననుచు ౨౧

వ. నళినగర్భుఁ డెఱింగించుటయు నారదుండు..

గీ. ఏను రూపమ్ములం దాల్ప నేల ప్రకృతి ?
యెవరి కేలక్షణమ్ముల నవతరించెఁ ?
దత్తదీయపూజావిధుల్ తత్తదీయ
మహిమమును వచింపుమనఁ, జెప్పె మధువిరోధి. ౨౨

చ. ప్రకృతికి లక్షణంబు నుడువంగ సమర్థుఁడు లేఁడొకండు నీ
సకలమహామహీస్థలిని ; జక్కఁగ ధర్మునివల్ల వింటి నే
నొకతఱి వత్స ! కొంత యది యోపినరీతిగ నీకుఁ దెల్పు పూ
నికఁ గయికొంటిఁ గాన మదినిల్పి వినందగుఁ దద్విశేషముల్. ౨౩

వ. "ప్ర" యనఁ బ్రకృష్టవాచకంబును 'గృతి' యన సృష్టివాచకంబు నగు ; సృష్టియం దేదేవి ప్రకష్టయో యామె ప్రకృతి యనంబడు. 'ప్ర' సత్వగుణాత్మకంబును 'కృ' రజోగుణాత్మకంబును 'తి' తమోగుణాత్మకంబును గావున నద్దేవియుఁ ద్రిగుణాత్మికయయ్యె. 'ప్ర' ప్రథమవాచకంబును 'కృతి' యన సృష్టివాచకంబును గావున సృష్టికి నాదికారణమైన యాదేవికిఁ బ్రకృతినామము సిద్ధించినది. సృష్ట్యాది నాత్మ రెండువిధము లయ్యె నందుఁ గుడిని బురుషుండు నెడమఁ బ్రకృతియు నుండు నదియె బ్రహ్మరూపము ; నిత్యము సనాతనమునై యలరారుఁ అగ్నిదాహికలకుఁ బోలె నాత్మశక్తులకు భేద మసదు. ౨౪

ఉ. నారద ! యందు చేతనె సనాతనులైన మును ల్తలోదరీ
పూరుషభేదముఁ గనఁగఁబూనరు బ్రహ్మమె యెల్లవారికీ

తీరునఁ బొల్చు నప్ప్రకృతి దేవియుఁ గృష్ణ సిసృక్షుచే ముదం
బారఁగఁ బుట్టె యావెనుక నందిన దీగతి నైదురూపముల్.

సీ. శివ శివప్రియ సిద్ధి శివరూప బ్రహ్మాది
విబుధవందితశీల విష్ణుమాయ
నారాయణి మహేశి నవయశోమంగళ
కీర్తిద సర్వశక్తిస్వరూప
తేజోమయి జగదధిష్ఠాత్రి దీనార్త
శరణాగతత్రాణపరచరిత్రి
బ్రహ్మస్వరూపిణి పాపవిమోచని
మోక్షదాయిని మునిపూజితాంఘ్రి

గీ. సిద్ధరూప సిద్ధేశ్వరి బుద్ధి నిద్ర
దయ పిపాసయు నాకలి దాంతి శాంతి
కాంతి తుష్టియుఁ బుష్టియు భ్రాంతి యనఁగ
నెలమిఁ జరియించుచుండు గణేశమాత. ౨౬

సీ. సర్వసంపద్రూప సత్యస్వరూపయు
సర్వమంగళ దాంతిశాంతియుక్త
భగవంతునకుఁ బ్రేమపాత్రి ప్రియంవద
ప్రాణతుల్యయుఁ బతివ్రత శుభాంగి
కామలోభములు రుషామోహములు వీడి
మమతకు దవ్వైన మంజుశీల
సర్వసస్యాత్మిక సర్వజీవనమార్గ
భక్తానురక్త సర్వప్రపూజ్య

గీ. పాపుల వివాదబీజమ్ము, ప్రభువుల ప్రభ,
వర్తకులకు వాణిజ్యమై వఱలుచుండు

సతతవేదోక్తమార్గసమ్మతి వహించి
శ్రీమహాలక్ష్మి వైకుంఠసీమయందు. ౨౮

సీ. వాగ్బుద్ధివిద్యల వఱలు నధిష్ఠాత్రి
హిమకుందచందనసమశరీర
సందేహభంజని సర్వవిద్యారూప
సంగీతకారిణి సత్వశీల
విమలయు మేధయు విద్య కవిత్వంబు
ప్రతిభయుఁ దానైయె పరఁగు దేవి
మునులకు ద్విజులకు మూకత్వ మెడలించి
ఫలము లొసంగు తపస్స్వరూప

గీ. కేల వీణెయుఁ బొత్తమ్ము లీలఁబట్టి
రత్నమాలను దాల్చి పరపరుఁడయిన
కృష్ణు యజియించుకొనుచుఁ దాఁ గెరలుచుండు
శ్రుతిశిరోమార్గముల సరస్వతి సతంబు. ౨౯

సీ. అమితతేజోవతి యానందదాయిని
శుద్ధస్ఫటికరూప శుభగుణాఢ్య
బ్రహ్మతేజోమయి బ్రహ్మస్వరూపిణి
బ్రహ్మలోకప్రద బ్రహ్మవిద్య
నాల్గువర్ణముల జననియు సనాతని
యాత్మశుద్ధిప్రద యఖిలసేవ్య
ఛందస్సులకు వేదశాస్త్రమ్ములకు మంత్ర
తంత్రావళులకు సంధ్యకును దల్లి

గీ. సర్వసంస్కారరూపిణి సత్వమూర్తి
జపతపఃఫలదాత్రి ద్విజాతికోటికు

వెలసె గాయత్రియగుచు సావిత్రి జగతి
నీమె ప్రకృతి నాల్గవరూప మోమునీంద్ర! ౨౯

ఉ. ఐదవరూపమై యలరు నామెకు రాధ సనాతనస్వరూ
పోదయభాగ్యయుక్తిమెయిఁ బొల్పగు కృష్ణుని వక్షమందు నా
మోదముఁ బొందుచుండు సతముం మునిమానసగోచరంబు నా
పాదితసర్వలోకచయపాపవినాశకరప్రభావమై. ౩౦

చ. సురలు సురేశ్వరుల్ మునులు జూడఁగలేరు తదీయరూప మం
బరమునఁ గోటిచంద్రుల ప్రభావిభవం బుదయించినట్లు సం
బరమగు వహ్నిశుద్ధమగు వల్కలరాజము భూషణావళుల్
పరఁగెడు నామెదేహము సెబాసనిపించును లక్ష్మికున్నిక్కమై.

చ. అఱువది వేల వత్సరము లామె గుఱించి తపంబొనర్చె ను
ద్ధురనియమవ్రతుండగుచుఁ దోయజగర్భుఁడు పూర్వకాల మా
హరియు వరాహమైనయపు డామె తమిన్ వృషభానుపుత్రియై
ధర నలరారెఁ దత్పరిచితంబులు పాపము లాఱిపోవఁగన్. ౩౧

సీ. పంచవిధప్రాణపరిపాలనాశీల
యఖిలభక్తజనభాగ్యానుకూల
నిఖిలలోకారాధ్య నిర్గుణ నిర్లిప్త
నిరహంకృతి నిరీహ నిత్యహర్ష
ప్రథితగోపీవేష భాగ్యవిధాయిని
గోలోకవాసిని గోపపూజ్య
రాసమండలజాత రాసేశ్వరేశ్వరి
రాసలోకనివాసరంజితాత్మ

గీ. రాసకేళీవినోదవిరాజమానుఁ
డైన కృష్ణున కేలికసాని రాధ

సుందరులలోన సుందరి బృందయందు
నాఁటివారలకెల్ల నానంద మొసఁగె. 33

వ. మఱియుఁ బ్రధానాంశ కళాంశ కాలాంశ జాతలై త్రిభువనం
బుల యందలి సర్వయోషిత్తులును దేవీరూపధారిణులై యుందు,
రందుం బూర్ణతమలు పంచవిద్యాధిదేవత లనంబడుదురు. వారి
యందుఁ బ్రకృతిప్రధానాంశరూపంబులఁ దెల్పెద నాలకింపుము.

సీ. జగములు తరియింప జలజాక్షుపదమందుఁ
బుట్టువుఁగాంచిన పూతచరిత
యందంబునకు మెచ్చి యభవుండు తనశిర
మ్మందుఁ దాల్చిన మేటి సుందరాంగి
తాఁకినమాత్రనఁ దనుకల్మష మెడల్చి
పతితులఁ బ్రోచు కృపాస్వభావ
గోలోకమునకు భక్తులు పోవ సులభమౌ
సోపానపంక్తి గానొప్పుదేవి

గీ. కలుషపూరితమౌ కలికాలమందు
మహిమ తగ్గని తటిని, సమస్తనదుల
కగ్రచారిణియైన జాహ్నవి తదీయ
మౌ ప్రధానాంశసంజాతయై యెసంగు. 34

క. ఇంకొక ముఖ్యాంశముగన్
సంకటములఁ బ్రోవ దివ్యసాధన మగుచున్
బంకేజాక్షుని వక్షో
లంకారంబై నెగడు తులసి జన్మించెన్. 35

క. నారాయణు నర్ధాంగి యు
దారంబగు వర్తనంబు తనరంగా, లో

కారాధితమై జనులకుఁ
దీఱని దుఃఖమ్ములెల్ల నఁ దీర్చు మునీంద్రా! 3౭

గీ. సర్వపుష్పసారసంభూతమై భూమి
నవతరించి జనుల యఘము ద్రోచు
కల్పవృక్షమన నసల్పమౌ తులసికి
మ్రొక్కినట్టి నరుఁడు పొందు నఘము. 3౮

ఆ. వె. ఒక్కదళము దెచ్చి యుదకంబులో నుంచి
త్రాగునెడల నెచటి తాపమైన
నడఁగిపోవు నయ్య! యల్లగంగాజలం
బేని తులసినీటి నెనయలేదు. 3౯

చ. తులసికిఁ గేలు మోడ్చి వినతుల్ పచరింపని వాని జన్మ మెం
దులకునుగాదు సుమ్ము పరితోషము నొంది సమస్తలాభము
ల్సలుపుచునుండు నాలుగుదళమ్ములుదెచ్చి యజించు వారి కా
వల ఘటియించు స్వర్గసుఖవాసము నిత్యముగాఁ గుమారకా.

క. తులసియె పరదేవత ని
ర్మలభక్తిన్ గొల్చు వారి మన్నించుచుఁ దాఁ
గలికల్మషసుపేంధన
ములఁ గాల్పఁగ దావవహ్ని పోలిక నెసఁగున్. ౪౦

వ. జ్ఞానవిశారదయు, శంకరునకుఁ బ్రియశిష్యయు, నాగేశ్వరుండగు
ననంతునకు భగినియు, నాగపూజితయు, నాగేశ్వరియు, నాగమా
తయు, నాగభూషణయునగు కశ్యపాత్మజయు దేవీప్రధానాంశ
సంజాతయై. మూఁడులక్షల వత్సరంబులు విష్ణుంగూర్చి తపం
బొనర్చి మంత్రాధిదేవతయై బ్రహ్మతేజస్వరూపిణియై జరత్కారు
నకుఁ బత్నియు మునిప్రవరుఁడైన యాస్తికాఖ్యునకుఁ దల్లియు

నగు నాపె ప్రిభావం బనన్యము. మాతృకలయందుఁ బూజ్య తమురాలైన దేవసేనయు నద్దేవీప్రధానాంశమె. జగజ్జనులకుఁ బుత్రిపౌత్రిదాయినియై షష్ఠియనుపేర నొప్పు వృద్ధయోగిని ప్రికృతి షష్ఠాంశసంజాత. సర్వకామదయై జలస్థలంబులయం దును సూతికాగారంబులయందు నధివసించి శిశుక్షేమకారిణినా నీమె ప్రిసిద్ధిఁ గాంచినది. ప్రకృతిముఖసంభూతయైన మంగళచం డికను బ్రితిమంగళవారమును బూజించు సువాసినులకుఁ బుత్రి పౌత్రాభివృద్ధియు సర్వవాంఛాపూర్తియు సిద్ధించు. కోపించిన జగములన్నియు క్షణములోఁ గూల్చుటకును రక్షింపఁదలఁచిన రక్షించుటకు నీమె సమర్థురాలు. శక్తి దేవీప్రధానాంశ సం జాత. కోటిసూర్యప్రిభాజాజ్వల్యమానవిగ్రిహయు, సర్వశక్తి ప్రిధానయు, సర్వసిద్ధిప్రదయుఁ, గృష్ణరూపిణియుఁ, గృష్ణు నకు భక్తురాలును, నిశ్వాసమాత్రిమున సర్వబ్రిహ్మాండ మండలంబును సంహరింప శక్తురాలును, ధర్మార్థకామమోక్ష చతుర్విధఫలదాయినియునై శుంభనిశుంభుల విజృంభణ మడంప నుద్భవించిన దుర్గ దేవీలలాటసంజాత. సర్వాధార భూతయు, సర్వసంపత్ప్రిదాత్రియు రత్నగర్భయు సర్వరత్నాకరా శ్రియయు బ్రిహ్మాదిసురాసురసకలమనుజలోకసంస్తూయమాన యునగు వసుంధరయును దేవీప్రధానాంశమునఁ బుట్టినది. ఇఁక దేవీకళామాత్రమున జన్మించిన చంద్రానన లెవ్వ రెవ్వరి భార్య లో వారల మాహాత్మ్య మెట్టిదో తెల్పెద నాలకింపుము. ౪౨

గీ. అఖలపూజితయై స్వాహా యన నెసంగు
నల హవిర్భుజు భార్యగా నలరు సాధ్వి
యమరులకు యజ్ఞభాగమ్ము లమరునెట్లు ?
లామె కృప సుంత లేదేని, నమరవరాసి ! ౪౩

గీ. యజ్ఞపూరుషుతరుణిగా నలరుచుండు
దక్షిణాదేవి సర్వత్ర దీక్ష పూజ్య;
వీరలిర్వురు లేకుండ వెలయు కర్మ
నిచయములు మేదినీస్థలి నిష్ఫలములు. ౪౪

గీ. ఎవతె లేకున్నఁ బితృదానమెల్ల వ్యర్థ
మా స్వధయుఁ బితృదేవుల కంబుజాక్షి;
స్వస్తి గాలికి భార్య నిష్ఫలము లీమె
విడిచి చేయు దానాదానవిధులు జగతి. ౪౫

గీ. ఏది లేకుండు నెడల నీయెల్లజగము
లందుఁ బురుషులు స్త్రీలుఁ గార్యమ్ము గాంతు
రాయమయుఁ బుష్టి గణపతి యర్ధదేహ
మన్నివిధముల సేవ్యురాలై యొసంగు. ౪౬

గీ. అయ్యనంతుని పత్నిగా నలరు నట్టి
తుష్టి లేకున్న జగములు తూలిపోవు
నీశ్వరుని లేమ సంపత్తి యీమె లేక
యెల్లయెడల నిప్పచ్చర మేడిపించు. ౪౭

గీ. సర్వలోకమ్ములకు ధైర్యసాధనమయి
గడనకెక్కిన సతి ధృతి కపిలపత్ని
సకలజనులను భాంధవ్యసరణి నుంపఁ
జాలినట్టి సతీదేవి సత్యదార. ౪౮

గీ. మోహాపత్నిగ నెగడెడు ముగ్ధయె దయ
ఆమె లేకున్న సృష్టియే యాఁగిపోవుఁ
బుణ్యదార ప్రతిష్ఠను బూజసేయ
వలయు లేనిచో జగము జీవన్మృతంబు. ౪౯

గీ. లోకులకుఁ గీర్తి మృగ్యంబు ప్రాకటముగ
సుకృతి యిల్లాలు కీర్తిని జూడకున్న
జగతి నుద్యోగభార్యయై నెగడు క్రియను
గన్నులంగిన కర్మయె గాసిఁజెందు. ౧౦

గీ. అర్ధదేహమ్ము ధర్మున కల్లమిథ్య
విధి వినిర్మితమైన యీవిశ్వ మఖిల
మీమె లేకున్న విచ్ఛిన్న మెల్లధూర్తు
లంజలిఘటింతు రీమెకు నన్వహంబు. ౧౧

గీ. కపటుఁ డీమెకు సైదోడుగాఁ జరింప
నెల్ల గృహములలో వసియించుచుండుఁ
గలుషకలికాలమందు నీకలికిసేవ
నాచరింపనివారల నరయలేము. ౧౨

చ. ఒరుల కదర్శనీయయయి యుండుఁ గృతమ్మునఁ, ద్రేతయందు ను
ర్వర నతిసూక్ష్మరూపము నెలంగఁగఁ దాఁ జరియింపసాఁగుఁ, ద్వా
పరమున నర్ధదేహమున భాసిలుచుండు, నతిప్రగల్భయై
తిరుగుఁ గలిన్ సరాసరిగ దేహబల మ్మొడివోవకుండఁగన్. ౧౩

గీ. త్రపయు శాంతి సుశీలుని ధర్మపత్ను
లవి వినా లోకు లున్మత్తులగుట నిజము
బుద్ధియును మేధ ధృతియన ముగురుకలరు
జ్ఞానదారలు మాధ్యమ్ము సదమదింప. ౧౪

గీ. కాంతి రూపమునన్ గనంగనగు మూర్తి
ధర్మునకు ధర్మపత్నియై తనరుచుండు
నామె లేక నిరాధారమై కృశించు
నఖిలలోకమ్ములుం బరమాత్మతోడ. ౧౫

ఆ. వె. మూర్తిరూపయగుచుఁ గీర్తింపఁబడియెడు
నిద్ర రుద్రదేవు నీరజాక్షి
యోగసిద్ధి యూఁతగాఁగ రాత్రులయందు
నన్నిజగము లీమె యావహించు. ౫౬

ఆ. వె. దినము రాత్రి సంధ్య యనఁగ నొప్పారుచుఁ
గాలమునకు ముగురు కలరు సతులు ;
వీరు లేనియెడల విశ్వనిర్మాతయుఁ
గాలమునకు లెక్కగట్టలేఁడు. ౫౭

గీ. ఎవరిసేవకొఱకు నీవిశ్వమఖిలంబు
చింత చేతఁజిక్కి చివుకుచుండు
నట్టి క్షుత్పిపాస లరయ లోభునిభార్య
లింతమహిమ యుండ దేరికైన. ౫౮

గీ. ప్రభయు దాహిక సతులైరి పావకునకు
వారు లేకున్న నీసృష్టి వలను పడదు
జగము లడఁగింపఁ బుట్టిన జరయు మృతియుఁ
గాలకన్యలు ప్రజ్వాలు కమలముఖులు. ౫౯

గీ. తంద్రియును బ్రీతి నిద్రకుఁ దనయలగుచు
సుఖుని వరియించి జగములఁ జుట్టుకొనిరి
శ్రద్ధయును భక్తి వైరాగ్య చానలైరి
జనులకు ముముక్షుమార్గమ్ము లనువుపడఁగ. ౬౦

వ. దేవమాతయగు నదితి దైత్యమాతయగు దితి గోమాతయైన సురభియుఁ గద్రూవినతలును బ్రకృతికళాజాతలై సృష్టి కుపయుక్తలైరి. దేవీకళాజాతలైన పూఁపుంబోఁడు లింకను జాల మంది కల ; రందుం గొందఱఁదెల్పెద నాలకింపుము. చంద్ర

పత్నియగు రోహిణి, సూర్యదారయగు సంజ్ఞ, మనువునిల్లా
లగు శతరూప, యింద్రగేహినియగు శచి, బృహస్పతి పెండ్ల
మగు తార, వసిష్ఠుని వామాక్షియగు నరుంధతి, కర్దమప్రసూ
తియు దక్షకామినియునగు దేవహూతి, పితృమానసకన్యకయు
నంబికామాతయునగు మేనక, లోపాముద్ర, కుంతి, కుబేరకామిని,
బలికిఁ జెలియగు వింధ్యావళి, దమయంతి, దేవకీయశోదలు,
గాంధారి, ద్రౌపది, శైబ్య, సత్యవతి, రాధామాతయగు వృష
భానుప్రియురాలు, మందోదరి, కౌసల్య, కౌరవి, రేవతి, సత్య
భామాకాళిందులు, లక్షణానాగ్నజితులు, లక్ష్మియే స్వయ
మ్ముగా నవతరించె నని చెప్పఁబడు సీతారుక్మిణులు, వ్యాస
మాతయగు యోజనగంధి, బాణపుత్రియగు నుష, ప్రభావతి,
భానుమతి, భార్గవజననియైన రేణుక, రామమాతయగు రోహిణి,
ఏకనన్ద, శ్రీకృష్ణ భగినియగు దుర్గ మొదలగు వారందఱును
ప్రకృతి కళాజాతలైన పావనచరిత్రలు. గ్రామదేవతలును
బ్రకృతికళాసంజాతలె. ప్రకృత్యంశమునఁ బుట్టిన భామినుల నవ
మానించుట ప్రకృతి నవమానించి నట్లయగు. ౬౧

చ. పతియు సుతు ల్గలట్టి యొక బ్రాహ్మణినైనను నెన్మిదేండ్ల సాం
ప్రతముగ నిండినట్టి యొక బాలికనైనను వస్త్రమాల్యభూ
షితగ నొనర్చి పూజలను జేసిన దేవియు సంతసించు సం
తతమగు పుణ్యలోకములు తప్పవు సు మ్మటువంటివారికిన్. ౬౨

గీ. ప్రకృతిసంభూతలైనవారలు జగాన
నుత్తమాధమమధ్యమ లొప్పుచుందు
రమితసత్త్వాంశసంజాతలౌ పతివ్ర
తలు నెగడుచుందు రెందు నుత్తమ లనంగ. ౬౩

గీ. అమితముగ భోగనిరతలై యఖిలసుఖము
లనుభవించుచు స్వీయకార్యములయందె
సక్తలగువారు మధ్యమ సరణినుండు
రల్ల ప్రకృతి రజోంశమ్మునందుఁ బుట్టి. ౬౪

గీ. దుర్ముఖులు కులనాశినుల్ ధూర్తురాండ్రు
కులట లధమనిశ్శ్రేణిక నలరువారు
స్వర్గముననుండు నప్సరస్సమితిగూడఁ
బ్రకృతికిఁ దమోంశమునఁ బుట్టువందినారు. ౬౫

చ. సురథుని పూజకుఁ మొదట సొక్కి యనంతరమందు దుర్గ భా
స్కరకులమందు రావణుని జంపఁగఁబుట్టిన రామచంద్రుచే
నురుతరపూజలం గనియె నోపికమై తరువాత నీమె నం
దఋను యజింపసాఁగిరి సనాతనియంచు నుదీరితాసులై. ౬౬

ఉ. ఆదిని దానవాంతమున కాయమ దక్షునికూఁతుగయ్యె నా
సాదితసర్వలోకశుభసాంద్రుని భర్తను బుద్ధిలేక యు
న్మాదముతోడఁ దండ్రి యవమానమొనర్పఁగ సైఁపలేక పా
దోదితయోగవహ్నిఁ దన యుత్తమదేహము వీడె నారదా !

చ. పిదప హిమాద్రికూఁతురయి పెద్దతప మ్మొనరించి యంత నా
త్మదయితుఁడైన శంకరుని మన్ననగాంచి చరించు సద్గతి
ప్రదయయి కృష్ణునంశగఁ జెలంగు గణేశుఁడు వైష్ణవాంశ యొ
ప్పిదమగునట్టి స్కందుఁడును బేరుపహించిరి తత్కుమారులై.

గీ. మొదట మంగళభూజాని పూజసేయ
లక్ష్మిసర్వభూసేవ్యమై రాణకెక్కె
నట్టులే యశ్వపతి భక్తి నాదరింప
వెలసె సావిత్రి జగముల వినుతయగుచు. ౬౯

గీ. బ్రహ్మ సేవించె నలసరస్వతిని మొదట
నంతకంతకు మాహాత్మ్య మతిశయిల్ల
నిమ్మహాదేవి సత్కృప నెనయలేని
వాని జన్మంబు చంద్రుఁడులేనిరాత్రి. ౨౦

గీ. రాధ గోలోకమందున రాణకెక్కి
కార్తికమ్మునఁ బౌర్ణమిఁ బూర్తియైన
గౌరవంబును గృష్ణునికతనఁ గాంచె
రాసకేళీ వినోదవిరాజితయయి. ౨౧

గీ. గోకులమ్మునఁ బుట్టిన గోపబాలు
రాది వృద్ధులవఱ కామె కంజలియిడి
సేవజేసిరి కృష్ణపూజితయె గనుక
నఖిలలోకమ్ము లాదేవి నాశ్రయించె. ౨౨

గీ. గ్రామదేవత మొదలుగాఁ గలుగు నఖిల
చంద్రముఖులకు సేవలు సలుపవలయు
నోపినంతగఁ దెల్పితి నొక్క కొంత
యిదియె ప్రకృతిచరిత్ర మోయీకుమార ! ౨౩

—* పం: ప్రకృత్యాద్యుత్పత్తి *—

చ. అని వినిపింప నారదుఁ డనంతర మేగతి సృష్టికాద్యయా
జనని జనించె నేగతిని స్వాంశము లైదువిధంబులయ్యె వా
రిని యజియించు మార్గముల నిర్ణయ మెట్టిదో ? విస్తరంబుగా
వినఁగఁదలంతుఁ దెల్పఁగదవే యని కోరఁగ నాతఁ డిట్లనెన్.

గీ. గగనమును విశ్వగోళము కాల మాత్మ
యఖిలదిశలు గోలోకము నలరుచుండు

శాశ్వతంబులుగాఁగ నాస్వర్గమందు
నొక్కచక్కని వైకుంఠ మొప్పుచుండు. ౭౫

గీ. బ్రహ్మలీల సనాతని ప్రకృతి నిత్య
యగ్నికిని దాహికా శక్తి, కబ్జవైరి
కమలినజ్యోత్స్న, కెండకు నబ్జహితున
కేపగిది నవినాభావ మెసఁగు నట్లె
ఆత్మకుఁ బ్రకృతికి విభేద మరయరాదు. ౭౬

గీ. స్వర్ణకారుఁడు స్వర్ణ ముపాధి లేక
కుండలములట్లె, కుండలఁ గుమ్మరియును
మన్ను లేకుండఁ జేయుట సున్న ; సృష్టి
కక్షముండఁగుఁ బరమాత్మ యామె లేక. ౭౭

గీ. జ్ఞానము సమృద్ధి సంపదైశ్వర్యములును
యశము బలము భగమ్మగు ; నది యలరెడు
దేవి భగవతి ; యామెతోఁ దేజరిల్లు
నాత్మ భగవంతుఁ డనుపేర నతిశయిల్లు. ౭౮

సీ. మాలతీమాల్యాభిమాన్యవక్షమువాని
నెమలిపింఛము మౌళినెగడువాని
శరదంబుజాతసుందరనేత్రములవాని
శ్రితజనానుగ్రహస్మితమువాని
మురళిచే శోభిల్లు కరములుగలవాని
మెయినిండ నగలచే మించువాని
కటిసీమఁ బీతాంశుకము గట్టువానిని
మంగళప్రదమైన మహిమవాని

గీ. నన్నిజగముల కాధారమైనవాని
సిద్ధికారకు సిద్ధేశు సిద్ధిరూపు
సుందరుని దేవదేవుఁ గిశోరు ధీరు
నాత్మరూపుని వైష్ణవు లాశ్రయింత్రు. ౨౯

గీ. కంటి కగుపడకుండియుఁ గాంచఁజాలు
నఖిలజగముల నాపరమాత్మ నిజము
బ్రహ్మకల్పంబు తత్పరబ్రహ్మమునకు
నిమిషమాత్రంబ కాదె, యనిమిషవాని ! ౩౦

గీ. కృషియనంగఁ దదీయభక్తివచనంబు
భక్తిదాస్యప్రదాతయై వరలుకతన
నాపరాత్పరునకుఁ గృష్ణుఁడనెడిపేరు
శాశ్వతంబుగ నలరారె జగతియందు. ౩౧

గీ. సృష్టియొనరింప మనమునఁ జింతచేసి
యతఁడు తనమేను రెండుగా నలరఁజేసెఁ
గుడిని బురుషుండు నంతఁ నెడమభాగ
మఖిలసుందరియైన వామాక్షి యయ్యె. ౩౨

సీ. శరదంబుజాతసుందరమైనదేహంపు
దీప్తులు దెసలందుఁ దేజరిల్ల
శ్రీఫలమ్ములఁ గేలిసేయు నురోజముల్
రత్నభూషలతోడ రాయిడింప
విశ్వమోహనలీల వేడుకగల్గించు
చిఱునవ్వు ముఖమునఁ జెంగలింపఁ
గటిబర్వు మోయఁగాఁగలిగినయూరువుల్
కదళీతరుస్తంభగతి వహింపఁ

గీ. గలదు లేదను నడుమున లలితమైన
వహ్నిశుద్ధాంశుకమ్మును వలువఁదాల్చి
కృష్ణముఖచంద్రకాంతులఁ గ్రేవగనుల
నానుచుఁగ నిల్చె నంతట నంబుజాక్షి. ౮౩

సీ. నొసటఁ గస్తురిబొట్టు పొసఁగించి యాక్రిందఁ
జందనసిందూరబిందువులిడి
రత్నాంగ్రిసారహారముగల్గు కొప్పున
నగవిచ్చువిరజాజి యలరులుంచి
సహజసుందరదేహసౌభాగ్య ముత్సాహ
వివశత్వమున నభివృద్ధిగాంచ
నాఁడు రాయంచలకైన వంకలదిద్దు
గమనవిలాసము గ్గానిపింప

గీ. దరికిఁ జేరినయట్టి సుందరిని గాంచి
వలచివలపించుకొనఁజాలు చెలువమలర
రాసమండలమున మహారసికుఁడైన
కృష్ణుఁడు జయిష్ణుఁ డామెతోఁ గ్రీడసల్పె. ౮౪

గీ. ఒక్కబ్రహ్మదినంబునం దుచితరీతి
నమ్మెయిం గ్రీడసల్పి యనంతరమున
శ్రాంతుఁడౌచు జగత్పిత చాన యోని
యందు సమధికమైన వీర్యమును విడిచె. ౮౫

వ. ఆమెయుఁ బరిశ్రాంతయగుచు నొక్కనిట్టూర్పు విడిచిన నయ్యాదియు మేని ఘర్మోదకంబులును జగమ్ముల నిండినవి. ఆనిశ్వాసమునుండి జగత్ప్రాణుండును దత్పత్నియు వారికుమారులగు ప్రాణాపానవ్యానోదానసమానమ్ములను పంచప్రాణములును

జన్మించినవి. ఘర్మతోయంబులనుండి తోయాధిదేవతయగు వరుణుండును దత్పత్నియగు వరుణానియు జన్మించిరి. శతమన్వంతరమ్ములు కృష్ణ గర్భమ్మును ధరించి బ్రహ్మతేజమ్ముతో నలరారుచుండఁ గృష్ణునకుఁ బ్రాణప్రియురాలును గృష్ణవక్షస్థితయునగు నా కృష్ణచిచ్ఛక్తికి స్వర్ణదేహచ్ఛాయగల్గిన విశ్వాధారుండగు కుమారుం డుదయించె. అంతట నద్దేవియుఁ జీకాకువడి యాబాలకుని మున్నీటిలో విసర్జింప నవఁ గృష్ణుం డదిచూచి హాహాకారమ్ము లొనర్చుచు, "నీయపత్యమును గోపనిష్ఠురవై త్యజించితివి గావున నిది మొదలు నీవును నీయంశచే జన్మింపఁగల సురస్త్రీలును ననపత్యలౌదు" రని శపించె. ౮౬

ఉ. అంతట నుద్భవించె నల యంబముఖాగ్రమునుండి భూషణా
త్యంతమనోహరమ్ములగునంగములుఁ సితవర్ణ మొప్ప వే
దాంతసమస్తశాస్త్రనిచయాధిపురాలగు కన్య యొర్తు హ
స్తాంతములందుఁ బుస్తకము నద్భుతమా నొకవీణె దాల్చుచుఁ.

వ. ఈమెయుఁ గొంతకాలంబునకు వామార్ధమ్మునఁ గమలయు దక్షిణార్ధమ్మున రాధికయుఁగా ద్విధారూపయయ్యె; నంతఁ గృష్ణుండును వెంటనే దక్షిణార్ధమ్మున ద్విభుజుండును వామార్ధమ్మునఁ జతుర్భుజుండునై చతుర్భుజుండగు నారాయణునకుఁ గమలారాధికల నొసంగిన నాతండును వారలం దోడ్కొని వైకుంఠమ్మున కరిగె; రాధాంశసంజాతలగు వీర లిర్వురు ననపత్యలై నందున నారాయణాంగమునుండి చతుర్భుజులైన పార్షదులును గమలాంగంబునుండి తుల్యరూపవయస్కలగు దాసీకోటులు జన్మించిరి. ఇదియిటులుండ గోలోకనాయకుని రోమకూపంబులనుండి గోపాలురు సమానతేజోబలశాలులును, రాధారోమకూపంబులనుండి రత్నభూషణభూషితురాండ్రును,

స్థిరయౌవన లనపత్యలు నగు గోపికలు నుదయించి రీసమయం
బున. ౮౮

సీ. ప్రకృతి కాధారయా పరమేశి తప్తకాం
చనవర్ణశోభిత శక్తిసేవ్య
కోటిసూర్యప్రభా కోటీర శ్రితభక్త
కల్పద్రుమంబు సంపత్ప్రదాత్రి
వహ్నిశుద్ధాంశుక వరరత్నభూషణ
భూషిత బ్రహ్మాదిపూజనీయ
మాయానవిజ్ఞేయ మహనీయశస్త్రాస్త్ర
ధారిణి సర్వవిద్యానియంత్రి

గీ. వేయిభుజములఁ దాల్చిన విశ్వమాత
మూఁడుకన్నులు గలిగిన మూలశక్తి
కృష్ణదేవత సకలసంకీర్తనీయ
యైన దుర్గ కృష్ణునిమోఁ బ్రిల నవతరించె. ౮౯

గీ. వైష్ణవులకు వైష్ణవియౌచు వరములిచ్చు
రాజులకు రాజ్యలక్ష్మియై రాణకెక్కు
స్వర్గమున స్వర్గలక్ష్మియై సంచరించు
గేహవాసుల కెల్లెడ గేహలక్ష్మి.

గీ. వహ్ని యందున దాహిక, వనజమందు
శోభయు, దివాకరునియందుఁ జూడ వెలుఁగు
చంద్రముని యందు వెన్నెల సర్వజగము
లందు శక్తియు నీవైయె యలరుచుండు. ౯౦

గీ. సంసృతికి బీజమీవెయె, శాంతిమొదలు
సకలగుణములు నీవెయె, సర్వమూల

మైన జగదంబ తా నిట్టు లవతరించి
కృష్ణు వినుతింపుచుఁ నిల్చెఁ గేలుమోడ్చి ౯౩

ఉ. ఆసతిఁ గాంచినంత దరహాస మెలర్పఁగ రాధికావిభుం
డాసనమిచ్చె నంతట నయత్నముగాఁగఁ జతుర్ముఖుండు నా
భీసరసీజమం దొదవె వేదవిదుండును బ్రాహ్మణప్రభా
భాసితుఁడై కమండలువు పావనహస్తమునం ధరింపుచుఁ.

గీ. అతనితోడనె గోటిచంద్రాతపమ్ము
లలరునట్టులు మేనికాంతులు వెలార్ప
తెల్లచీరెను దాలిచి తేజరిల్లు
నంగనయొకర్తు వినుతించు చవతరించె. ౯౪

వ. అంతటఁ గృష్ణుండు నా మిథునంబు నెదుటనున్న రత్నసింహాస
నంబులం దాసీనులంజేసి మరల దక్షిణభాగంబు యథాపూర్వ
ముగ గోపికాపతియు వామార్ధంబు మహాదేవుఁడుగను ద్విధా
రూపుఁడయ్యె. ౯౫

సీ. శతకోటిరవికాంతిసమమైన తేజంబు
భస్మభూషితదేహపటిమఁ బెనుపఁ
దప్తకాంచనసమ స్తవ్యదేహవిభూతి
భూషణమ్ముల చేతఁ బొలుపుగాంచ
జడలుగట్టిన శిరోజముల పెన్ముడియందు
నమృతమరీచి నాట్యంబుసలుప
దక్షిణమైన హస్తమునందుఁ దాల్చిన
రత్నహారంబు చక్రగతిఁ దిరుగ

గీ. జన్మమృత్యుజరారుజల్ సంహరించు
నుత్తమునిఁ దన్నుఁ గొల్చి మృత్యుంజయత్వ

మలవడినయంత రత్నసింహాసనంబు
నందుఁ గృష్ణుఁడు తమితోడ హారుని నిలిపె. ౯౬

—* కృష్ణకృత దేవతావ్యాప్తస్థితి *—

గీ. అల్ల బాలుండు మున్నీటియందు నొక్క-
బ్రహ్మదిన ముండి పిదపఁ గాలము నెఱింగి
యిర్వురుగ మార్పుజెందె నొకింతదైన
నక్షమంబున్నె కృష్ణమాయకు జగాన ! ౯౭

గీ. అణువుగతి సూక్ష్మరూపుఁడై యఖిలవిశ్వ
నాథుఁ డయ్యును బాలుఁ డనాథునిగతిఁ
దల్లిదండ్రులచేఁ బరిత్యక్తుఁ డగుటఁ
గడుపుసుత్తు తెల్పఁగ రాని గాసి వెట్టు. ౯౮

ఆ. వె. 'కాపుకావు' మనుచుఁ గాకివిధమ్మున
నడలి మింటివంక నరయఁదొడఁగెఁ
బరముఁడైన కృష్ణు పదియునాఱవపాలి
వాఁడితండుసుమ్ము భవ్యకీర్తి. ౯౯

గీ. అతని రోమకూపములందు నద్భుతముగ
నెన్ని విశ్వము లున్నవో యెన్న నేర ;
మా పరుండగు కృష్ణునకైనఁ దెలియ
దనఁగ మన మెంతవారల మయ్య వత్స ! ౧౦౦

క. ప్రతివిశ్వమ్మున నుందురు
పతగతురంగుండు బ్రహ్మ పార్వతివిభుఁడున్
జతనమొనర్చియుఁ దెలియం
డతఁడేనియు వార లెంద రట్లున్నారో ? ౧౦౧

వ. పాతాళంబు మొదలు బ్రహ్మలోకంబు వఱకును బ్రహ్మాండ మనంబడు. బ్రహ్మాండమునకుఁ బైన వైకుంఠమును దాని కూర్ధ్వముగఁ బంచాశత్కోటియోజనవిస్తీర్ణమగు గోలోకము కలదు. నిత్యసత్యస్వరూపుండగు కృష్ణునిపగిది నయ్యదియు నవ్యయమైనది. సప్తద్వీపసమ్మితయు సప్తసాగరసంయుతయు సప్తశైలసమన్వితయునగు వసుంధర కూర్ధ్వముగ స్వర్గలోకము లేడును గ్రిందఁ బాతాళము లేడునుం గలవు. భూలోకమునకుఁ బైన భువర్లోక సువర్లోక మహర్లోక జనలోక తపోలోక సత్యలోకమ్ములును వానికిఁ బైన తప్తకాంచనసన్నిభమైన బ్రహ్మలోకము నలరారు. జలబుద్బుదమురీతి నీ బ్రహ్మాండభాండము నశ్వరము. ఒక్క గోలోకవైకుంఠంబులు మాత్ర మకృత్రిమంబులు నిత్యంబులునై యలరారు. ఒక్కొక్క రోమకూపంబున నొక్కొక్క బ్రహ్మాండమండలంబును బ్రహ్మవిష్ణుశివాదిదేవతలు దిగీశదిక్పాలకనక్షత్రమ్ములు నుండు. భూమియందలి వర్ణములు నాలుగు. అధోలోకంబుల నాగులు చరింతురు. విరాడ్రూపుండగు నబ్బాలకుండును మాటిమాటికి నేడ్చుచుఁ దాదకు,

మ. నవనీలాంబుదతుల్యదేహు శ్రితసంతానాఘునిర్మాలనో
ద్భవమందస్మితుఁ బీతవస్త్రు మురళీభాస్వత్కరాంభోజు నా
దివిభుం దండ్రిని గాంచి నవ్వె నిటులార్తిం గాంచి దుఃఖించు పు
త్రు విలోకింపుచుఁ గృష్ణుఁ డిట్లనియె సంతుష్టాంతరంగమ్మునన్.

చ. జరయును మృత్యువుం భయవిచారము లాఁకలి దప్పి రోగముల్
వఱలకయుండ నావలె నపారము సాంగమునైన జ్ఞానసం
భరితుఁడవౌచు భక్తజనభాగ్యసమృద్ధి లొసంగుచుం మనో
హారమగు విశ్వమందుఁ బ్రళయావధిగా వసియింపు మర్భకా.

గీ. అని వరం బిచ్చి యంత షడక్షరమిత
మిష్టసంప్రాపకం బౌచు నెసఁగునట్టి
యొకమహామంత్ర మప్పరమోత్తముండు
బాలు చెవిలోన ముమ్మాఱు పఠనసల్పె. ౧౦౫

గీ. ప్రణవ మాదినొప్పఁగఁ జతుర్థ్యంతమలరు
'కృష్ణ' యను నక్షరద్వయకీలితమయి
వహ్నిజాయాంతమై ధర వఱలునట్టి
మంత్రరాజంబు విష్ణుము ల్మాటుపఱచు. ౧౦౬

గీ. మంత్రమును జెప్పి యాపైన మహిఁ గలట్టి
విష్ణుభక్తు లొసంగు నైవేద్యమందు
షోడశాంశ మాహారమౌఁజుమ్ము నీకు
వరము లింకేమిగావలెఁ బల్కు మనిన. ౧౦౭

శా. బాలుం డిట్లనెఁ దండ్రితో నపుడు నీపాదాంబుజమ్మందు నా
కేలాగైనను భక్తి నిశ్చలముగా నేర్పాటుగావింపు మ
య్యా! లోకేశ్వర! స్వల్పదీర్ఘతరమధ్యాయుర్విచారంబు నా
కేలా? యయ్యది నీయభీష్టగతిచే నెట్లైన సంతోషమే. ౧౦౮

క. నీవే బ్రహ్మజ్యోతివి
నీవె సనాతనుఁడ వౌదు నిఖిలమ్మునకున్
నీవే తల్లివి తండ్రివి
నీవే పూజ్యుఁడవు లేరు నీకన్నఁ బరుల్. ౧౦౯

చ. వ్రతములు తీర్థసేవయు, నుపవాసములున్ నియమంబులెన్నిసాం
ప్రతముగ సల్పినన్ నినుఁ గృపామయు వీడిన నిష్ఫలంబు సం
తతముగ నిన్నుఁ గొల్చు వినుతవ్రతుఁడే యగు సార్థజన్ముఁ డ
చ్యుత! యటుగానిచో బ్రతికియుండియుఁ జచ్చినయట్టులేసుమా.

చ. అనివినయప్రవతుండగుచు నమ్మెయి బాలుఁడు వల్కె "నుండు మీ
వును ననుఁబోలి స్థైర్యమును బొందుము క్షుద్రవిరాట్స్వరూపభా
జనుఁడవు గమ్ము విశ్వము లజస్రము సృష్టియొనర్ప బ్రహ్మయున్
జననముఁ గాంచు నీదయిన నాభిసరోజమునన్ గుమారకా.

గీ. అతని ఫాలమ్మునందు శివాంశవలనఁ
బదియునొక్కండు రుద్రులు నుదయమందు
రందులో నొక్కరుండు కాలాగ్నిరుద్రుఁ
డఖిలలోకసంహారమ్ము నాచరించు. ౧౧౨

గీ. జగములన్నియుఁ బాలించు శక్తిగలిగి
యొక్కవెన్నుండు క్షుద్రాంశ నుద్భవించు
నిశ్చలంబౌచు మద్భక్తి నెగడఁగలదు
నే నొసంగిన వరముచే నీకు వత్స! ౧౧౩

గీ. ధ్యాన మొనరించినంతఁ దక్షణమె నీకు
నెదుటఁ గాన్పించుచుందు నే నెలమితోడ
నల్లె మద్వక్షమం దలరారుచుండు
తల్లినిఁ గనంగలాఁడవు తరలు మింక." ౧౧౪

మ. అని ప్రత్యుత్తర మిచ్చి యవ్విభుఁడు స్వీయావాసముం జేరె బ్ర
హ్మాను మృత్యుంజయుఁ జేరఁజేరి సృజియింపన్ న్నాశముం జేయ మీ
ర్జనియింపన్ వలె నన్న నంతటఁ దదిచ్ఛాబద్ధులై వారలున్
వినతుల్ పల్మఱు సల్పి పోడ్కొనిరి తద్విశ్వేశ్వరున్ బ్రీతులై.

గీ. అంత నాబాలకుండు మహావిరాట్టు
రోమకూపంబులందు వెలుంగు నొక్క
విశ్వగోళంబులోపల వెలయు జలధి
నలరె క్షుద్రవిరాడ్రూప మొలయుచుండ. ౧౧౬

గీ. అంబుదశ్యామమైన దేహమ్ముతోడఁ
బట్టుపుట్టంబు మొలయందుఁ జుట్టఁబెట్టి
జలధిలో శయనించిన చక్కనయ్య
శ్రీజనార్దనుఁ డీతండె చిన్మయుండు. ౧౧౭

ఉ. అంతట నాభితామరసమందు జనింపుచు బ్రహ్మ పద్మనా
ళాంతము నారయం దిరిగె నంబుజదండము వెంటనంటి యా
నంతయు దానియంతుఁ గనఁడయ్యెను లక్షయుగంబు లేగ వి
భ్రాంతి వహించి యెప్పటి నివాసముఁ జేరెఁ దపంబొనర్పఁగన్.

గీ. ధ్యానమొనరింప జలధిశయానుఁడైన
జనకు నంతట గోలోకమునుఁ దదీశుఁ
డైన కృష్ణుని దర్శించి యంజలియిడి
వరములం గాంచి సృష్టి కుపక్రమించె. ౧౧౯

గీ. అంత మానసపుత్రులై యవతరించి
రల్ల సనకసనందనాద్యఖిలమునులు
పదియునొక్కరు రుద్రులు ఫాలభాగ
మందు జనియించినారు శివాంశవలన. ౧౨౦

గీ. వఱలు క్షుద్రవిరాణ్మూర్తి వామపార్శ్వ
మున జననమంది తెల్లదీవిని వసించె
వెన్నుఁడు చతుర్భుజుండయి విశ్వమెల్లఁ
బాలనము సేయుకొఱకుఁ గృపాళుఁ డగుచు. ౧౨౧

వ. తరువాత బ్రహ్మసంకల్పమాత్రమున సకలచరాచరజగమ్ములును స్వర్గమర్త్య పాతాళంబులు నావిర్భవించినవి. విరాట్పురుషుని ప్రతిరోమకూపంబునం దొక బ్రహ్మాండంబును బ్రతిబ్రహ్మాండంబునందును బ్రహ్మవిష్ణుశివాదిసకలదేవతలును సకల

చరాచరజగమ్ములు నలరారుచుండు; నిది కృష్ణకృతవిశ్వసృష్టి
క్రమంబని నారాయణుండు నారదున కెఱింగించె. ౧౨౨

ఉ. అంతట నారదుండు వినయావనతుండయి పల్కె- నిట్టు ల
త్యంతముదంబు గాంచితి సుధామధురోక్తుల నీవు చెప్ప వృ
త్తాంతము సర్వమున్ వినుచుఁ దామరసేక్షణ! కేలుమోడ్చి ప్రా
ర్థింతును దెల్పు మింకఁ బ్రకృతిన్ భజియించెడు మార్గమెట్టిదో?

ఉ. ఎవ్వరిపూజ నెవ్వ రొనరించిరొ తొల్లి? నతుల్బొనర్ప వా
రెవ్వరి కెవ్వ రేవరము లిచ్చిరొ? వారి ప్రభావ మెట్టిదో
యెవ్వరు వారిపేరు వెలయించిరొ? తెల్పు మనంగ నవ్వచున్
బువ్విలుకానితండ్రి మునిముఖ్యునిఁ గాంచి వచించె నీగతిన్.

చ. ప్రకృతియు నైదురూపముల భాసిలునంచుఁ దదంశగాఁగ నీ
సకలజగంబులం గలుగు చానలు నుద్భవమందిరంచు మా
నికులవతంస! తెల్పితిని నిర్దళితాఖిలపాపజాలముల్
ప్రకటితసర్వమంగళవిభావ్యములుం గద తచ్చరిత్రముల్. ౧౨౫

గీ. ప్రకృతి యంశంబువలన నుద్భవముగాంచి
నట్టి గంగాదులచరిత్ర మరయఁ గొలఁది;
రాధచరితయు, నటులె దుర్గాచరిత్ర
విస్తృతంబులు గావున వెనుకకుంచి. ౧౨౬

గీ. మూర్ఖుఁ డే దేవి కరుణాసముద్రమందు
మునిఁగి పండితుఁ డౌనొ? యేజననిపూజ
కృష్ణనిర్మితమై తొల్లి కీర్తిఁ గాంచె
నల సరస్వతిఁ దెల్పెద నయ్య వినుము. ౧౨౭

ఉ. రాధముఖమ్మునం దటు సరస్వతి జన్మముఁగాంచి తొల్లి రా
ధాధవుఁ డైన కృష్ణుముఖతామరసమ్మును గాంచుచున్ మనో

జాధికబాధ కగ్గమయి యాతనిఁ గాముకికైయె వరించె బిం
బాధరిఁ గాంచి యిట్లనియె నప్పుడు కృష్ణుఁడు ధర్మనిష్ఠుఁడై.

ఉ. ఏమి సుఖమ్ముఁ గాంచఁగలవే ననుఁ గాంతునిఁగా వరించి ? రా
ధామదిరాక్షి నిన్ననిఁ దాల్మివహింపదు, బాధవెట్టు నీ
ప్రేమ సహింపలేక పలురీతులుగా బలవంతురాలు, ని
న్నోమఁగశక్తి చాల కపుడూరక నేను తపింపఁగావలెన్. ౧౨౯

ఉ. ఈ సకలప్రపంచమున కేలికనైతినిగాని రాధ నా
శాసనమున్ సహింపక కృశానువిధమ్మున మండిపోవు నే
నై సవతిన్ ఘటించునెడ నంగన ! లాభములేనిదే రసా
భాసపు నెయ్యము న్సలిపి పాడయిపోపుట కెంచుదానవే !

ఉ. మానిని ! రూపమందు మహిమప్రచయమ్మున శీలమందు తే
జోనియతిన్ సమానయయి చూరగొనెన్ జుమి మన్మనంబు రా
ధానలినాక్షి ; యేగతిని దావకసఖ్యము నాచరింపుచున్
హానియొనర్తు నామె ? కెటు లాఅవప్రాణము వీడనేర్చెదన్ ?

గీ. కాముకుండు కోటికందర్పరూపుఁడు
నాల్గుభుజము లున్న నల్లనయ్య
నాదు నంశగన్న నారాయణుఁడు నీకుఁ
దగినవరుఁడు సుమ్ము తరళనయన ! ౧౩౨

శా. వైకుంఠమ్మున కేగు మచ్చట రమావామాక్షి సీతో సమా
నాకారమ్ముగలట్టిదే కల దసూయాలేశమే న్లేక నిన్
స్వీకన్నేర్చిన; దామెతోఁ గలసి యానారాయణుం గొల్వు మో
రాకాచంద్రనిభాననా ! సతము భద్రంబబ్బు నిర్నిద్రమై. ౧౩౩

గీ. చదువ నారంభమొనరించు సమయమందు
మాఘశుక్లపంచమినాఁడు మానివరులు

యక్షరాక్షసగంధర్వు లఖిలసురలు
మానవులు నిన్నుఁ బూజింతు రోనుతాంగి, ౧౩౪

వ. కణ్వశాఖోక్తవిధిచేతఁ గలశమందును బుస్తకమునందును సువర్ణ
గుళికను నిల్పి షోడశోపచారమ్ముల నాచరించి నీకవచమ్మును
గంఠంబునంగాని దక్షిణభుజంబునంగాని పఠింపుచు ధరింపఁగల
రని పల్కె. ౧౩౫

ఉ. తా నొనరించెఁ బూజలను దామరసేక్షణుఁడున్ సమస్తవి
ద్యానిలయాత్మ్మరాలనుచు నంతట బ్రహ్మమొద లున్సురాళియున్
మానవయక్షరాక్షసులు మానక సల్పుచునున్నవారు పూ
జానతులన్ సరస్వతికి సర్వజగమ్ముల నంచుఁదెల్పెనన్. ౧౩౬

గీ. దేవ ! పావనమైన పూజావిధాన
మెల్ల సాంగంబుగా వచియింపు మనిన
నారదున కంత సంతతానందుఁడైన
శ్రీవరుఁడు ప్రేమతోడ వచింపఁదొడఁగె. ౧౩౭

సీ. మాఘశుద్ధమ్మున మహితపంచమినాఁడు
చదువు మొదలెట్టు సమయమందు
నుదయమ్మునను లేచి యుచితక్రియ లొనర్చి
యఘమర్షణస్నాన మాచరించి
తొలుదొల్త గణపతి నలరించి యాపైన
శ్రద్ధాళువై కలశంబు నిల్పి
పిదప స్వశాఖోక్తవిధిచేతనైనను
దాంత్రికవిధినైనఁ దగఘటించి
గీ. షోడశోపచారమ్ములఁ జొక్కఁజేసి
యమ్మహాదేవి నర్చింపనగు మునీంద్ర !

భక్తి నామెను బూజించు పరమమూర్ఖుఁ
డైన విద్వచ్ఛిరోమణియై రహించు. ౧౩౮

గీ. పాలు, పెరుగు, లడ్డుకములు, పంచదార
స్వస్తికము, తెల్లబెల్లము, పాయసంబు,
చెఱకు పానకముఁ, ఘృతస్తికమగుచు
వెలయు యవగోధుమల చూర్ణపిష్టకములు. ౧౩౯

గీ. నారికేళఫలము, నవనీత, మరటిపం,
డ్లపుడుకాలమందు నలరు ఫలము,
లుప్పు నేతు లలరనొప్పు హావిష్యంబు,
శ్రీఫలమ్ములు బదరీఫలములు. ౧౪౦

గీ. ఆమెకు నివేదన మొనర్ప ననువుపడును
స్వచ్ఛమా శుక్లవస్త్రము చందనంబు
తెల్లపూవులహారము దివ్యభూష
ణావళియుఁ దెచ్చి యర్పింపనగు మునీంద్ర!

సీ. కలితవీణాపుస్తకలసత్కరాంభోజ!
సరసిజపత్రవిశాలనయన!
మణిమయసర్వభూషణభూషితశరీర!
శరదిందుకోటికాంతిరమణీయ!
మందస్మితవిలాససుందరాస్యాంబుజ!
అంబుజసంభవాద్యఖిలసేవ్య
వహ్నిశుద్ధాంశుక వాసితతనువల్లి!
మల్లికావర్ణ సమ్మాననీయ!

గీ. వందనశతంబు లొనరించువాఁడ ననుచు
ధ్యానమొనరించి మూలమంత్రము బఠించి

కవచము ధరించి సాష్టాంగ మవనియందుఁ
బడి ప్రణామమ్ము లొనరింపవలయుఁ జుమ్ము. ౧౪౨

వ. లక్ష్మీమాయాదికంబును, జతుర్థ్యంతమును వహ్నిజాయాంతమును నగు 'శ్రీంహ్రీంసరస్వత్యైస్వాహా' యను శ్రీ సరస్వత్యష్టాక్షరీమహామంత్రరాజము కల్పవృక్షసమంబై పఠించువారలకు సర్వాభీష్టంబుల నొసంగఁజాలు. ౧౪౩

సీ. జాహ్నవి యొడ్డునఁ జదివించితిఁ దీని
వాల్మీకిచేతఁ బూర్వము మునీంద్ర!
పుష్కరంబున సౌరపుణ్యపర్వమునందు
శుక్రుండు భృగుమానిఁజూచి నేర్చెఁ
జంద్రపర్వమ్మున జలజాతగర్భున
కెలమినై మారీచుఁ డిది యొసంగె
బదరికాశ్రమమున మదివుట్టి భృగుమౌని
కిది జలేజాసనుఁ డెలమి నొసఁగెఁ
గీ. గలశవారాశిసన్నిధి నలరి యాస్తి
కాఖ్యున కల జరత్కారుఁ డానతిచ్చె;
ఋష్యశృంగున కొసఁగినాఁ డిది సువర్ణ
పర్వతాగ్రంబునందు విభాండకుండు. ౧౪౪

శా. గౌరీభర్త కణాదగౌతములకుం గావించె బోధం గృపా
పారీణుండయి యాజ్ఞవల్క్యునకు సప్తాశ్వుండు కాత్యాయనుం
జేరంజీరి వచించె, సర్పవిభు వాసింగొల్చి యార్జించె నా
భారద్వాజుఁడు శాకటాయనునితోఁ బాతాళలోకమ్మునన్.

ఉ. నాలుగులక్షసార్లు మననంబొనరించిన మంత్రసిద్ధిగాఁ
జాలును, సిద్ధియౌ నరుఁడు శారద సత్కరుణార్ద్రదృష్టికిన్

బాలయి దేవతాగురునిభాతి విశారదుఁడై యెలర్చు ధీ
శాలులు పండితోత్తము లజస్రము వానికి దోయిలింపఁగన్.

గీ. జగములన్నియు సృష్టించు జలజభవుఁడు
గంధమాదనపర్వతాగ్రమ్మునందు
నానతిచ్చెను భృగువున కఖిలలోక
జయవిధాయక మీ కవచమును వత్స! ౧౪౭

వ. బ్రహ్మవిదగ్రణ్యుఁడును సర్వజనకుండును సర్వపూజితుండు నగు బ్రహ్మం గాంచి భృగుమౌని విశ్వజయప్రాపకంబగు సరస్వతీకవచంబును నాకుఁ దెల్పవే యని ప్రార్థించినంత నా దేవజ్యేష్ఠుఁ డాతని కిట్లు వచింపఁదొడంగె సావధానుఁడవై యాలింపుము.

గీ. నాకు గోలోకమందు బృందావనమునఁ
జెప్పె రాధావిభుండు హృద్వీథియందుఁ
గరుణ మొలకెత్త శ్రుతిసారకలితమైన
కవచమును వత్స! యిది సర్వకామదంబు. ౧౪౮

సీ. వాల్మీకి కవిలోకవనజోద్భవుండయ్యె
స్వాయంభువుండు యశమ్ముఁగాంచె
సురగురుండయ్యె భాస్వరుఁడై బృహస్పతి
శుక్రుఁడు దైత్యసంస్తుతుల వడసె
కాత్యాయనుఁడు స్వయంకలితదక్షతఁ గాంచెఁ
బ్రతిభ వహించెఁ బరాశరుండు
సర్వజగజ్జయసహితుఁడయ్యె యయాతి
సంవర్తుఁడు మహత్త సంతరించె

గీ. గౌతమకణాదయాజ్ఞవల్క్యప్రభృతులు
పాణినియు గ్రంథకర్తలై ప్రథితులైరి

ఆస్తికవసిష్ఠముఖమానులఖిలరాజ
సేవితులు నైరి కవచసంభావనమున. ౧౫౦

ఉ. వేదవిభాగముఁ సలిపి విశ్వజనాభ్యుదయమ్ముకోస మ
ష్టాదశసత్పురాణములు జక్కనిశైలి రచింపఁగల్గె నా
మోదముతోడ నీకవచముఁ బఠియించి ధరించెఁ గాన సా
క్షాదవతీర్ణకృష్ణుఁడగు సాత్యవతేయుఁడు మౌనిచంద్రమా.

వ. ఈకవచంబునకుఁ బ్రజాపతి ఋషి ; బృహతి ఛందము ; శారద యధిదేవత. సర్వతత్త్వవిజ్ఞాన సర్వార్థసాధనకవితాసామర్థ్యంబులు వినియోగము. 'శ్రీంహ్రీంసరస్వత్యైస్వాహా శిరోమేపాతుసర్వదా' లక్ష్మీమాయాబీజాన్వితయగు చతుర్థ్యంతసరస్వతి వహ్నిజాయం గూడి నాశిరస్సును సతతంబు రక్షించుఁగాక ! 'శ్రీం వాగ్దేవతాయైస్వాహా ఫాలంమేసర్వదావతు' లక్ష్మీబీజాన్వితయగు చతుర్థ్యంతవాగ్దేవత యగ్నిదారం గూడి నా ఫాలము రక్షించుఁగాక ! 'ఓంహ్రీంసరస్వత్యైస్వాహేతిశ్రోత్రేపాతునిరంతరమ్' ప్రణవంబును మాయాబీజంబును జతుర్థ్యంతసరస్వతియు వసలునారిం గూడి నా శ్రోత్రంబుల నిరంతరము రక్షించుఁగాక ! 'ఓంశ్రీంహ్రీం భగవత్యై సరస్వత్యైస్వాహానేత్రయుగ్మంసదావతు' ప్రణవమును లక్ష్మీమాయాబీజములాదింగల చతుర్థ్యంత భగవతీ సరస్వతీపదంబులు కృశానుపత్నింగూడి నా కనుదోయి రక్షించుఁగాక ! 'ఐంహ్రీంవాగ్వాదిన్యైస్వాహానాసాంమేసర్వదావతు' బిందుయుక్త ప్రథమవకారమంబును మాయాబీజంబును జతుర్థ్యంతవాగ్వాదినియు స్వాహాదేవింగూడి నానాసి రక్షించుఁగాక ! 'ఓంహ్రీంవిద్యాధిష్ఠాతృదేవ్యైస్వాహా చోష్ఠం సదావతు' ప్రణవంబును మాయాబీజంబును జతుర్థ్యంతవిద్యాధిష్ఠాతృదేవియు వైశ్వానరతరుణిం గూడి నాయోష్ఠంబు రక్షిం

చుఁగాక ! ' ఓం శ్రీం హ్రీం బ్రాహ్మ్యైస్వాహేతిదంతపంక్తింసదా
వతు ' ప్రణవంబును లక్ష్మీమాయాబీజమ్ములును జతుర్థ్యంత
బ్రాహ్మీపదంబు ననలునారిఁగూడి నాదంతపంక్తిని రక్షించుఁ
గాక ; ' ఐమిత్యేకాక్షరోమంత్రోమమకంఠంసదావతు ' ప్రథ
మవక్రితమంబును బిందుసంయుతంబునగు నేకాక్షరమంత్రము
నాకంఠమును సర్వదా రక్షించుఁగాక ! ' ఓం శ్రీం హ్రీం పాతు
మేగ్రీవాంస్కంధౌమే శ్రీంసదావతు ' ప్రణవమును లక్ష్మీమా
యాబీజంబులు నా గ్రీవమును లక్ష్మీబీజము నాభుజమ్ముల నెల్ల
ప్పుడు రక్షించుఁగాక ! ' ఓం హ్రీం విద్యాధిష్ఠాతృదేవ్యై స్వాహా
వక్షస్సదావతు ' ప్రణవంబును మాయాబీజంబును జతుర్థ్యంత
విద్యాధిష్ఠాతృదేవీపదంబును ననలుగృహిణిం గలసి నా వక్ష
మ్మును రక్షించుఁగాక ! ' ఓం హ్రీం విద్యాస్వరూపాయైస్వాహా మే
పాతునాభికామ్ ' ప్రణవమాయాబీజసహితయగు చతుర్థ్యంత
విద్యాస్వరూప యగ్నిపత్నిం గూడి నానాభిని రక్షించుఁగాక !
' ఓం హ్రీం క్లీం వాణ్యై స్వాహేతిమమహస్తౌసదావతు ' ప్రణవ
మును మాయాబీజమ్మును క్లీంకారమును జతుర్థ్యంతవాణీపదం
బును వీతిహోత్రాంగనంగూడి నాహస్తంబుల రక్షించుఁగాక !
' ఓం సర్వవర్ణాత్మికాయైస్వాహాపాదయుగ్మం సదావతు ' ప్రణవ
సహితయగు చతుర్థ్యంతసర్వవర్ణాత్మిక శిఖిచంద్రముఖిం గూడి నా
పాదంబుల నెల్లపుడు రక్షించుఁగాక ! ' ఓం వాగధిష్ఠాతృదేవ్యై
స్వాహాసర్వంసదావతు ' ప్రణవమును జతుర్థ్యంతవాగధిష్ఠాతృ
దేవీపదంబును వీతిహోత్రతరుణిం గూడి సర్వమును సర్వదా
రక్షించుఁగాక ! ' ఓం సర్వకంఠవాసిన్యై స్వాహా ప్రాచ్యాంసదా
వతు ' ప్రణవంబును జతుర్థ్యంతసర్వకంఠవాసినియు బావకుని
పూర్వుం బోఁడిం గూడి తూర్పున నన్ను రక్షించుఁగాక ! ' ఓం సర్వ

జిహ్వాగ్రవాసిన్యైస్వాహాగ్నిదిశిరక్షతు' ప్రణవంబును సర్వ జిహ్వాగ్రవాసినియు వైశ్వానరతరుణింగూడి యాగ్నేయంబున నన్ను రక్షించుఁగాక! 'ఓంహ్రీంశ్రీంక్లీంసరస్వత్యై బుధజనన్యై స్వాహాసతతం మన్త్రరాజోయం దక్షిణే మాంసదావతు' ప్రణవంబును మాయాలక్ష్మీబీజంబులును క్లీంకారంబును జతుర్థ్యంతసరస్వతీ బుధజననీపదంబులును నగ్నితరుణింగూడిన మంత్రరాజంబు సర్వదా నన్ను దక్షిణంబున రక్షించుఁగాక! 'ఐం హ్రీంశ్రీంత్ర్యక్షరోమంత్రో నైరృత్యాం సర్వదావతు' బిందుపూర్వకప్రథమవర్ణతమంబును మాయాలక్ష్మీబీజమ్ములునుంగల త్ర్యక్షరమంత్రరాజము నైరృతియందు నన్ను సర్వదా రక్షించుఁగాక! 'ఓంఐం జిహ్వాగ్రవాసిన్యైస్వాహా మాం వారుణేవతు' ప్రణవంబును బిందుపూర్వకవర్ణతమంబును జతుర్థ్యంతజిహ్వాగ్రవాసినీపదంబును వైశ్వానరతరుణిం గూడి నన్ను వారుణమ్మున రక్షించుఁగాక! 'ఓంసర్వాంబికాయైస్వాహావాయవ్యేమాంసదావతు' ప్రణవసహితయగు చతుర్థ్యంతసర్వాంబిక వహ్నిపత్నిం గూడి నన్ను వాయవ్యమ్మున రక్షించుఁగాక! 'ఓం ఐం శ్రీం క్లీం గద్యవాసిన్యైస్వాహామాముత్తరేవతు' ప్రణవమును బిందుసహిత ప్రథమవర్ణతమంబును లక్ష్మీబీజంబును క్లీంకారమును జతుర్థ్యంతగద్యవాసినియు శిఖితరుణింగూడి న న్నుత్తరంబున రక్షించుఁగాక! 'ఐం సర్వశాస్త్రవాసిన్యై స్వాహైశాన్యాం సదావతు' బిందుసంయుతప్రథమవర్ణతమంబును జతుర్థ్యంత సర్వశాస్త్రవాసినీపదంబును వైశ్వానరగేహినిం గలసి నన్నీశాన్యంబున రక్షించుఁగాక! 'ఓంహ్రీం సర్వపూజితాయైస్వాహాచోర్ధ్వం సదావతు' ప్రణవమాయాబీజసహితయగు చతుర్థ్యంత సర్వపూజిత కృశానుతరుణింగలసి నన్నూర్ధ్వమున రక్షించుఁగాక!

'శ్రీంపుస్తకవాసిన్యైస్వాహాఽధోమాంసదావతు' మాయాబీజ సహితయగు చతుర్థ్యంతపుస్తకవాసిని ధనంజయగేహినిం గలసి నన్నధోలోకంబులరక్షించుఁగాక! 'ఓంగ్రన్థబీజస్వరూపాయైస్వాహా మాం సర్వతోవతు' ప్రణవసహితయగు చతుర్థ్యంతగ్రంథబీజ స్వరూపస్వాహాదేవింగూడి నన్నఖిలదిక్కుల రక్షించుఁగాక!

గీ. "విశ్వజయ" మను పేరున వెలయునట్టి
కవచమిద్ది జగజ్జయకారకంబు
వసనచందనభూషణప్రతతు లొసఁగి
గురుని బూజించి దీనిఁ గైకొనఁగవలయు. ౧౫౩

చ. స్థిరతరభక్తియుక్తుఁడయి సిద్ధివహింపఁగఁ బూర్ణమోదభా
స్వరుఁడయి యైదులక్షల జపం బొనరింపఁగఁ జెల్లు, దానిచే
నురుతరబుద్ధివైభవము నుత్తమకీర్తి కవిత్వరాజ్యవి
స్ఫురణము సర్వలోకజయశోభనముల్ ఘటియించు నారదా.

గీ. కణ్వశాఖోక్తమైనట్టి కవచ మిద్ది
మున్ను యాజ్ఞవల్క్యుండు ప్రమోద మలర
పఠనసల్పిన స్తోత్రంపు ఫక్కి యెల్ల
వినుము వచియింతు నఘములు వెడలిపోవు. ౧౫౫

—* సరస్వతీ స్తోత్రము *—

గీ. యాజ్ఞవల్క్యుండు గురుశాపహతినిఁజేసి
చదువునకు నంతరాయంబు సంభవింప
నేడ్చుచుం బోయెఁ దొల్లి దినేశలోక
మున కహస్కరుఁ డనుకంపఁ బూను ననుచు. ౧౫౬

ఉ. వచ్చిన యాజ్ఞవల్క్యు ననివారితసత్కృప నాదరించి యు
ద్యచ్చరితుండు సాంగముగ నాతనిచేఁ జదివించె వేదముల్

“ హెచ్చినభక్తితోడ నుతియింపుము శారద నక్కతాన నీ
మచ్చు లడంగిపోయి జనమాన్యుఁడవౌ ” దని తెల్పి యంతటన్.

గీ. కను మొఱంగిన సూర్యున కనఘమతికి
వందనశతంబు లొనరించి డెందమందు,
స్నానమొనరించి శుచియయి శారదాంబ
నతఁడు నుతియించె నమ్రోత్తమాంగుఁడగుచు. ౧౫౮

క. గురుశాపంబున సంస్మృతి
విరహితుఁడను దుఃఖితుండ విద్యాలేశ
స్ఫురణ మెఱుంగని దీనుఁడఁ
గరుణింపుము తల్లి ! దీనకల్పకవల్లీ ! ౧౫౯

ఉ. ఇమ్మ ! యధీతవిస్ఫురణ, మిమ్మ ! సుశిష్యచయప్రబోధనా
ర్థమ్ముగ గ్రంథకర్తృకుశలత్వము, నిమ్మ ! సభాంతరాళమం
దమ్మ ! విచారసూక్షుమమహాప్రతిభాచరణంబు, నిమ్మ ! శా
పమ్మును గ్రమ్మరింపుమ ! కృపాఖని వందురు నిన్ను శారదా !

సీ. దండము నీకు విద్యాధినియంత్రిణి !
అంజలి నీకు బ్రహ్మస్వరూప !
వినతి నీకు విసర్గబిందుమాత్రానేత్రి !
కైమోడ్పు నీకు వ్యాఖ్యాస్వరూప !
శరణు నీకు సమస్తశాస్త్రాధివాసిని !
అవనతి నీకు సంఖ్యాస్వరూప !
జోహారు నీకు ! విస్ఫూర్జత్పరాజ్యోతి !
నతులు నీకు సనాతనస్వరూప !

గీ. వందనంబులు నీకుఁ గావ్యప్రపంచ
సంతతజ్ఞానరూపిణి ! సర్వసేవ్య !

భక్తజనమానసప్రీతిభాప్రదాత్రి !
అమ్మ ! శారద ! నీకు సాష్టాంగనతులు ! ౧౬౧

మ. ఘనుఁడైనట్టి సనత్కుమారుఁడు జగత్కల్యాణముం గూర్చ ధీ
ధనమున్ గోరఁగ బ్రహ్మ మూకుఁడయి సిద్ధాంతమ్మొనర్పంగఁ జా
లనిచోఁ గృష్ణుఁడువచ్చి నీపదములన్ బ్రార్థింపు మీవంచుఁ దె
ల్పిన యాతం డటుచేసె నీవును మహావిద్యన్ బ్రసాదింపవే.

ఉ. అంతములేని జ్ఞానము ననంతుని వేడెను భూమి మున్ను సి
ద్ధాంత మొనర్ప మూకుఁడయి తద్దయుఁ గశ్యపునాజ్ఞఁ జేసి నిన్
స్వాంతమునన్ దలంచిన యనంతర మేకద ! త్వత్ప్రసాదమా
ద్యంతము దెల్పె ధారుణికి నమ్మహితాత్మకుఁడో సరస్వతీ !

ఉ. నీ కరుణాకటాక్షమును నిర్మలభక్తి భజించి కాదె వా
ల్మీకి కవీంద్రుఁడయ్యె ; ననిమిత్తభవత్కరుణారసంబు న
స్తోకముగా లభించెను ద్రిశుద్ధిగఁ బుష్కరమందు వందయేం
డ్లాఁకలి దప్పి లేక నిను నర్చయొనర్చిన వ్యాసమౌనికిన్. ౧౬౪

చ. నినుఁ గరుణామయిన్ గొలువనేర్చి శివుం డొనరింపఁజాలె నిం
ద్రునకును దత్త్వబోధ, తమితో సురనేతకు వేయియేండ్లు ని
న్ననయము గొల్చియేకద బృహస్పతి చెప్పెను శబ్దశాస్త్ర మో
జనని ! నినున్ మదిన్ గొలువఁజాలిన సత్పథ మేర్పఱెంచుచున్.

మ. మతిమన్ముఖ్యులకెల్ల మూలమవు నీ మాన్యాంఘ్రిపద్మమ్ము లం
చితభక్తిన్ గొనియాడనట్టి నరు నీక్షింపంగలే మమ్మరో !
చతురాస్యుండును బంచవక్త్రుఁడు సహస్రాస్యుండు నైనన్ నినున్
స్తుతులన్ దన్పఁగనేర; రేనెటుల నేర్తున్ దేవి ! యేకాస్యుఁడన్.

గీ. అనుచుఁ గనులనీరోడ్చు నమ్మునివతంసు
నెదుట నిల్చి సరస్వతి యింకమీఁద

సుకవివై సద్యశమ్మును జూరగొందు
వని వచింపుచు వైకుంఠమునకుఁ జేరె. ౧౬౭

గీ. ఈ మహాస్తోత్రముఁ బఠించు నెడలఁ గల్గు
శారదాదేవిసత్కృపాసాంద్రవృష్టి
జడున కొకయేఁటినాఁటికి జ్ఞానమబ్బుఁ
బాడితుండుఁ గవీంద్రుఁడై ప్రతిభఁగాంచు. ౧౬౮

—* లక్ష్మీగంగా సరస్వతులకు జన్మప్రాప్తి *—

క. వైకుంఠంబున వాణి ర
మాకాంతుని యోలగమున మందాకినిచేఁ
గైకొని శాపమ్మును సరి
దాకారత భరతవర్ష మందుండెఁ గళన్. ౧౬౯

క. పుణ్యస్వరూప పుణ్యద
పుణ్యాధిక సేవ్యమాన మునిరాజతపో
గణ్యఫలభూత పాపా
రణ్యజ్వలదగ్నియగుచు రాజిలుచుండున్. ౧౭౦

క. ఆనదిలో మునుకలుగొని
మేనువిడిచినట్టిజనుల మిక్కిలిదోసఁగుల్
బోనడఁచి విష్ణుసభఁ గృప
చే నుండఁగఁ జేయు శౌరి చిరకాలంబున్. ౧౭౧

శా. చాతుర్మాస్యలఁ బూర్ణిమాతిథి గ్రహేట్చంద్రోపరాగవ్యతీ
పాతాంగారకవాసరంబులను బర్వంబందు నెవ్వాఁడు సు
స్నాతుండౌను సరస్వతీనదిని విస్నాణంబుగా వాఁడు వి
ఖ్యాతింగాంచి ధరిత్రియందు, సురలోకం బొందు నాపిమ్మటన్.

క. శ్రీసారస్వతమను వాఁక
మాసం బట జపముసేయు మనుజుఁడు మూర్ఖా
గ్రేసరుఁ డయినను సత్కవి
తాసంపదగలిగి పొలుచు ధాత్రిని బేర్మిన్. ౧౭౩

క. అనిశం బానదివారిని
మునుకాడిన నరుఁడు పురుషముఖ్యుండు పున
ర్జనిహీనుండును వైకుం
ఠనివాసుం డగునుజు మ్మనారతము మునీ. ౧౭౪

క. సారంబు కామదమునగు
భారతి గుణకీర్తనంబు పచరించితి నో
నారద! యింక నేకథ వినఁ
గోరిక మదిఁగలదొ తెలియఁ గోరెద ననుడున్. ౧౭౫

క. మనసిజజనకుని పల్కులు
విని శాపాయుధనరుండు వీణాముని నె
మ్మనమునఁ గల యనుమానము
వినిపింపఁగడంగె నిండు వేడుకతోడన్. ౧౭౬

ఉ. సారతరంగిణీకలహశాపభరంబున స్వాంశచేత నా
భారతి యట్టు లీభరతవర్షమునందుఁ దరంగిణీశుభా
కారముఁ బూని లోకుల యఘంబులు పాఱఁగఁదోలు వృత్తమెం
తే రమణీయమయ్యెనుగదే వినిపింపఁగదే దయామతిన్.

క. శ్రుతిసారశ్రవణంబునఁ
గుతుకం బెదఁ బొదలెఁ దృప్తి కుదురదు సుకథా
మృతమందుఁ దలఁప శ్రేయ
స్థితి నెవ్వండేని తృప్తిఁజెందునె ధరణిన్. ౧౭౭

ఉ. ఆరయఁ బూజనీయ యగునట్టి విధాతృనిఁ రాణి కెట్టు భా
గీరథి శాపమీయఁగడఁగెన్ శుభపుణ్యవిధాత్రి సాత్వికా
కార తలంపఁ దత్కలహకారణముల్ విన వేడ్కయయ్యెడున్
చారుపురాణదుర్లభము సత్కథకాన నెఱుంగఁబల్కుమీ ౧౭౯

వ. అనవుడు నారాయణుం డిట్లనియె. ౧౮౦

ఉ. ఏకథ విన్నమాత్రి నశియించును దోసములెల్లఁ బున్నెముల్
చేకుఱు నట్టి యీకథను జెప్పెద సన్మతి నాలకింపు; ర
త్నాకరశాయికి న్మువ్వురు దారలు భార్గవి, పల్కునాతి, మం
దాకిని నాఁగ నాహరియుఁ దన్పును మువ్వుర నొక్కపేర్మి చేన్.

క. అన్నెలఁతలు మువ్వురు హరి
సన్నిధి సేవింతు రెల్లసమయములందున్
వెన్నుని వదనం బొకతఱి
మిన్నేఱు గనెన్ సకామస్మితవదనయునై. ౧౮౨

ఉ. ఆసమయంబునందు జలజాక్షుఁడు గంగ మొగంబుగాంచి సం
తోసముతోడ నవ్వె; నది తోయజగేహిని మేకొనెన్; మఱిన్
రోసముఁబూనె భారతి కనుంగొని; భార్గవి బోధఁజేసినన్
వీసమునేని సైఁప కెదఁ బేరిచె నీసును సారెసారెకున్. ౧౮౩

చ. అరుణవిలోచనాంతయు మహారుణభాననయు న్ముహుర్ముహు
స్స్ఫురదరుణాధరాధరయు సూనశిలీముఖపాతయాతనా
భరపరికంపితాంగియయి వల్లభుఁ గన్గొని పుల్కుపుల్కునన్
గరుణము నెమ్మదిం గదురఁగాఁ బలికెం బయి కీసుఁజూపుచున్.

క. ధర్మిష్ఠవరిష్ఠులకుం
బేర్మి సమానంబు గలుగుఁ బ్రేయసులందున్

దుర్మతి కిది విపరీతపు
ధర్మంబని యెఱుఁగవలయు ధర్మజ్ఞనిధీ. ౧౮౬

గీ. గంగపై నీకుఁగల కూర్మిఁ గాంచికూడ
లచ్చి సైరించు టరయ నాలలనగూడ
నట్టి నీకూరిమికి పాత్రిమగుట ధ్రువము
నేనె మూఁగురిలోఁ గడు హీన నైతి. ౧౮౭

చ. పతి తనకాంతలందు సమభావమునం జరియించెనే జగ
ద్ధితుఁడగు నట్లుగాక నయమేది చరించిన యంత లోకగ
ర్హితుఁడగు సత్వరూపుఁడసి యెల్లరు నిన్నునుతించు టెంతయున్
జతురత లేమి నీమనసుజాడ నెఱుంగమిఁగాదె యచ్యుతా!

క. నిమిషంబైనను దుర్భగ
త మనంగా నాకు నాస దవ్వులను; నేఁ బ్రా
ణములను విడచెద, పతి నె
య్యములేని లతాంగి బ్రతుకనగునే జగతిన్. ౧౮౮

క. అని యిట్లు దీర్ఘకోపం
బునఁ బల్కుచు నున్న పల్కుబోటిం గని నె
మ్మనమున యోచించి వెసం
జనియెన్ సభనుండి వెలికి శౌరి కడంకన్. ౧౮౯

క. నారాయణుఁడు చనఁగా
నారక్తవిలోచనాంతయై నిర్భయతన్
భారతి గంగను జెవ్వులకు
పారుష్యము దోఁప నిట్లు పలికెన్ బెలుచన్. ౧౯౦

క. ఓసి గయ్యాళీ! కడువి
శ్వాసము నాయంద కూర్చు వల్లభుఁ డనుచున్

నీసౌభాగ్యము దెలియం
జేసెదు విభుతావ లేపచేష్టల గంగా. ౧౯౧

క. నానను బూనక వాగెద
నీ నలినోదరుని చెంత నిప్పుడ నీదా
మానంబుఁ గూలఁజేసెద
మానాథుఁడుగాఁడె! శౌరి మగఁడే నీకున్. ౧౯౨

గీ. ఇమ్మెయి నీసున గంగా
ధమ్మిల్లము వట్టి తివియఁదలఁచెడు పల్కుం
గొమ్మకు నడ్డముచని రమ
సమ్మతిఁ గావించె నయము సల్పుచు నంతన్. ౧౯౩

ఉ. కోపము కెంపు కన్నుగవకుం బొడమంగ విరించి బోటి వే
శాపమొసంగె నిట్లు జలజాతనికేతన కుర్వభూనదీ
రూపము లాక్రమించు మిఁక రూపఱు గర్వమటంచు నంతఁ దా
నేపలుకున్ వచింప దొకయింతయుఁ దద్విపరీత మెంచుచున్.

క. కోపముఁబూనదు క్రిమ్మఱి
శాపమ్మొసంగఁబోదు జలజజ వాణిం
జేపట్టి భూజముంబలె
ద్వీపినిబలె వెల్లుగ దురపిల్లుచు నుండెన్. ౧౯౫

క. కోపప్రస్ఫురితాధర
యై పలుకక మిన్నకున్న నంబుజనిలయన్
రూపించి పలికె నమర
ద్వీపిని శశ్వదుప్రపాప్రదీపితయగుచున్. ౧౯౬

క. ఈలలన యేమి చేయఁగఁ
జాలును నను విడుము దీని చల మడఁచెద దు

శ్శీలయు సంతతమును వా
చాలయునగు రమణి చెడుఁ బ్రశంసల కెడమై. ౧౯౭

క. ఆదరము పెద్ద పలుకుం
బైదలికిం గలహమందుఁ, బరికింపఁగ నా
తోఁ దడయనేల యిపుడే
వాదం బొనరించుఁగాత బలముకొలందిన్. ౧౯౮

క. ఈ దుర్ముఖి తనశక్తియు
నాదార్ఢ్యము మీ కిపుడ గనంజేయుంగా
లోఁదలఁచి యున్న దింకను
మాదృఢతానంతవిక్రమంబులు గనుఁడీ. ౧౯౯

చ. అని వచియించి గంగ జలజాలయఁ గన్గొని "నీకు శాప మి
చ్చిన పలుకుంబడంతుకకుఁ జెచ్చెఱ శైవలినీస్వరూప మి
ట్లొనరును గాత! కల్మషజనౌఘుని కేతసభూతలంబునం
దనిశనివాసినా" నని దురంతముగా శపియించె భారతిన్.

క. ఆశాపము విని రోషా
వేశంబునఁ బల్కె వెలఁది విబుధతటినికిన్
దా శాపమిచ్చె "ధరణి ని
వేశ మఘప్రాప్తి సంభవించు" నటంచున్. ౨౦౦

క. అచ్చదువుపొలఁతి శాపం
బిచ్చిన యవ్వేళ భార్గవీశ్వరుఁడటకున్
విచ్చేసెఁ జతుర్భుజులును
సచ్చరితులు పార్షదులు లసన్మతిఁ గొలువన్. ౨౦౧

క. అరుదెంచి సరస్వతిఁ దన
కరములతో నెత్తి చక్రికరుఁడు రహిం బే

రురమున ధరియించి పురా
చరితము బోధించెఁ బ్రీతిసతులు మువురకున్. ౨౦౩

క. కాంత లిటు శాపకలహై
కాంతముఁగావించి యెదలఁ గడు దురపిలఁగా
సంతతసామయమగు వృ
త్తాంతం బిటు లానతిచ్చె దనుజారి వెసన్. ౨౦౪

ఉ. సారసగేహ ! వాసియె విచారము బూన ? నయోనిజాతవై
ధారుణిలో వృషధ్వజసుతామణి వౌదువు పొమ్ము తన్న ప్రా
గారముఁ గూర్చి ; ధాతకృప గౌరవమొప్పఁగ శంఖచూడబృం
దారకవైరిముఖ్యునకు దారవుకాఁగల వీవు భార్గవీ. ౨౦౫

క. ఆవల దైవవశంబున
వే వృక్షత్వంబు సంభవించును బిదపన్
దేవేరివి నాక ఘ సు
మీ వచియించితిని సంశయింపకు మింకన్. ౨౦౬

క. త్రైలోక్యపావనీకర
ణాలోలంబైన తులసియన రాజిలుమీ
జాలముసేయకు మిఁకఁ బో
మ్మా, లలన ! సరిత్స్వరూప మందుము కళచేన్. ౨౦౭

క. భారతి శాపవశంబున
భారతవర్షంబునందుఁ బద్మావతినాఁ
బేరు ధరింపుము వేగ న
దీరూపముఁ దాల్చుమీ మది గనలకుమీ. ౨౦౮

వ. అని కుఱంగట మెలంగుచున్న గంగం గని నీవును భారతీశాపంబున ధారుణీజనపాపాపనోదనమునకై భగీరథతపోనీతవై ధాత్రికిం

జని భాగీరథీనామం బవధరించి నాయానతిని మదంశసంజాతుం డైన సముద్రునకును గుణసముద్రుండైన శంతనునకును భార్యవై యుండు మని యానతిచ్చి భారతిఁ గని యిట్లనియె.

క. పేరాండ్రితోడ సారెకుఁ
బోరొనరించిన ఫలంబుఁ బొందుము చనుమీ
భారతమునకుం బ్రహ్మా
గారంబున నలువచెలివి కాఁగలవు సుమీ. ౨౧౦

క. గంగాసతిచేఁ గలిగెను
భంగం బా గంగ శూలిపదముం గను నా
చెంగట నుండును భార్గవి
సంగతితోఁ గ్రోధరహిత శాంతయు నగుటన్. ౨౧౧

క. ఈచాన సుశీలయు ధ
ర్మాచారయు సత్వరూపయయి నాయెడ స
ధ్రీచీనభక్తి సలుపుట
నాచెంగట నుండుఁ గాత నయమున సతతున్. ౨౧౨

క. ఈతన్వంగులంశమున నీ
క్ష్మాతలమునఁ బుట్టి సతులు సాధ్వులు ధర్మో
పేతాచారలు శాంతి
ఖ్యాతలునై పూజనీయలై యుందురిలన్. ౨౧౩

క. మువ్వురు నెలఁతలు, భృత్యులు
మువ్వురు, బాంధవులు మువురుఁ, బొల్చు నతనికిన్
మవ్వపుయశము దొలంగును
రవ్వయు వాటిల్లు సుగుణరహితుండు నగున్. ౨౧౪

క. పైదలులు మువ్వురు గలసిన
మోదము రూపమును ఖేదమును నగు నశుభా
పాదనము గల్గు నిక్కము
వేదవిరుద్ధంబు సేయు వేయేలయిఁకన్. ౨౧౫

గీ. ఎతని గృహసీమ భామ పుంగతిని బరఁగు
సతివశంబున నెవ్వాఁడు బ్రతుకఁడివురు
నతని జన్మంబు వ్యర్థతాస్థితిని దనరు
నతులనై సంఘటిల్లు దుర్దశలవెల్లు. ౨౧౬

ఉ. తామస మోర్వలేమి యనృతంబును రాగతనంబు గల్గు నా
కామిని యబ్బెనేని కడకం జనుటొప్పును వాఁడు గాన, క
చ్చోఁ మధురంపుఁబండ్లు పరిశుద్ధజలంబు తలంబు లబ్బెడున్
గీములలో లభింప విలు కీడగుఁ గూడును లగ్గు కానలో. ౨౧౭

ఉ. మేలగు హింస్రజంతుసుసమీపనికేతనుఁడౌట, యెంతయున్
మేలగుఁ జిచ్చుఁజొచ్చుటయు, మేకొని దుర్ముఖియైన కాంతతోఁ
గాలముఁ బుచ్చుకంటెను; సుఖంబులు ఘోరహలాహలజ్వల
జ్జ్వాలలు తన్ముఖాగ్నులవి చావున కెక్కుడు సొక్కఁజేసెడున్.

గీ. మత్తకాశినీతాంత్రితమానసుండు
నిత్యమును జేయు కృత్యముల్ నిష్ఫలములు
కీర్తి దొఱఁగును బరఁగు దుష్కీర్తి వెల్లు
నైహికాముష్మికములు దుఃఖావహములు. ౨౧౯

గీ. తరుణి వెరుసైన మనుజుఁ డీధరణిలోనఁ
బరఁగు నిందల పందయై నరకమొందు
బిట్టు సౌఖ్యంబు కీర్తి లేనట్టివాఁడు
బ్రతికెనేనియుఁ జచ్చినగతిన యుండు. ౨౨౦

క. పలుపుర సవతుల కొకచో
నిలువంగాఁ గూడ దట్లు నిలిచిన యశమా,
నిలువదు ; పలుపురు చెలువలు
గలిగిన కీ, డొక్కరమణి గల్గిన లగ్గా. ౨౨౧

క. పొమ్మఁక గంగా ! శర్వప
దమ్మున, కీపల్కునాతి తాఁజను విధగే
హమ్మున, కీరము నా నిల
యమ్మున వసియించు మంజులాశయ యగుటన్. ౨౨౨

క. పతిరత యనువర్తినియును
సతతంబు సుశీలయు నగు చాన గలుగువాఁ
డతులసుఖవంతుఁడును స
ద్గతిపాత్రుం డౌను ధర్మతత్పరుఁడు నగున్. ౨౨౩

గీ. ఎవని యిల్లాలు పతిరత యెప్పుడునుండు
ముక్తుఁడును శుచి సౌఖ్యసంయుక్తుఁ డతఁడు
ఎవని యర్ధాంగి కశ్మల యెప్పుడునుండు
పాపి దుఃఖియు జీవచ్ఛవం బతండు. ౨౨౪

ఉ. ఇట్టని మిన్నకుండెఁ గమలేశ్వరుఁ ; డంగన లొక్కపెట్టఁ జ
న్గట్టుల బాష్పముల్ దొరఁగి కాల్వలు గట్ట పరస్పరంబునన్
బిట్టు కవుంగిలించుకొని మిన్నదురివన్ వెసనేడ్చె ; రాతవా
రెట్టు సహింతు రట్టి జగదీశ్వరు శాశ్వతవిప్రలంభమున్ ! ౨౨౫

ఉ. కన్నులనీరు కాల్వలయి క్రిమ్మఁ జలన్నిజగాత్రవల్లులై
మిన్నుదొఱంగి పైఁబడిన మేరను జెయ్యులు దక్కియుండి యా
యన్నులు దేఱి కొంతకు భయస్థితి గద్గదఖిన్నకంఠలై
విన్నపమాచరించి రిటు వెన్నునితోడఁ గ్రమక్రమంబునన్.

మ. "అకటా! యెట్లుభరింతు నాజననశోచ్యంబైన నీశాప ? మీ
వె కటాక్షింపుము శాపమోక్షణకథాభివ్యక్తిఁ గాదేని నీ
నికటక్ష్మాతలమందు యోగకలనం దేహంబు చాలింతుఁ బూ
నిక సాఁకందగుఁగాక వీఁకచెడి చన్నే నీ కుపేక్షింపఁగన్". ౨౨౮

వ. సరస్వతి యిట్లు వచియింప గంగ యిట్లను,

మ. "నను నిర్దోష నిటుల్ త్యజింపఁదగునే నాథా! భవత్త్యక్తనై
మనఁగాఁజాలుదునే! తలంపు మిటు లాత్మప్రేయసీత్యాగముల్
వనితన్ జంపిన దోసముల్ సుగతికిన్ బాపుంగదా! లోకనా
థునినైనన్;నిరయంబుఁజేర్చు చెడుగుల్ ద్రోవల్ ప్రియుంబాయునే!"

ఉ. అంతట లక్ష్మి నాథుఁ గని యంజలివట్టి "మహాత్మ! నీకిటుల్
పంతముఁబూనఁగాఁ దగునె? పల్కె నెలంతయు గంగయున్ రుషా
క్రాంతలు నిందలాడుకొనఁగా నలవారల జాలిమైఁ గటా
క్షింతురుగాక, తాల్మి విడఁజెల్లునె! నీకు దయాపయోనిధీ!

క. తెలిసీ తెలియక కాంతలు
సలిపెడు కజ్జములు తెలిసి సైఁచుటతగు భ
ర్తల కట్లుగాన నీయీ
చెలువల నెటులైనఁ గావఁజెల్లును నీకున్. ౨౩౦

చ. సెలవిడి నన్నుఁ బంపు మికఁ జెచ్చెర భూమి జనింప నేగఁగా
వలె, నట నెంతకాలము నివాసమొనర్తునొ ? నాజలమ్ములన్
గలిపిన పాపముల్ సయిచి క్రమ్మఱ నెప్డు భవత్పదాంబుజ
మ్ములుగొలువంగవత్తునొ? ప్రభూ! తెలుపంగదె!భీతియయ్యెడున్.

గీ. తులసి యనియెడు సన్న చేఁ గళధరించి
ధర్మకేతుధరానేత తనయ నగుచు

ధరణిఁ బరఁగుచు నెప్పుడు తావకీన
చరణయుగ మేను గనుఁగొందు శరణ మనుచు. ౨౩౨

క. ధరణీజాకృతితో నీ
ధరణిని ద్వాదధీనదేవతాత్వముఁ గనుచోఁ
గరుణామతి వగుచు మము
ద్ధరణం బొనరించు మెపుడు తడయక చెప్పుమా. ౨౩౩

క. వాణీశాపవశంబున
క్షోణికిఁ దానేగె గంగ ఘోరతరాంహః
పాణింధమమగు ముక్తినిఁ
బోణిమిమైఁ గాంచి నిన్నుఁ బొడఁగను మెపుడో. ౨౩౪

క. గంగాశాపంబునఁ బ
ల్కుంగుబ్బెత రత్నగర్భకుం జనుచో నే
భంగిని దా శాపవిము
క్తిం గొను నీచెంగటను సుఖించుటకు హరీ. ౨౩౫

గీ. నలువయింటికిఁ బలుకులకలువకంటి
గంగ యాస్మరఘుస్మరాగారమునకు
నేగుఁడంచును నానతి యిచ్చినార
లెడఁద నెనరూని యిది క్షమియింపవలయు" ౨౩౬

వ. అనిన వెన్నుండిట్లనియె.

క. నీవాక్య మాచరించెద
నావాక్యము రిత్తగాఁ దనర్చునె యెందున్
భావించి చేయు సామ్యము
నే వచియింతును జగద్వినేయము గాఁగన్. ౨౩౭

క. నలువయింటికిఁ బలుకులకలువకంటి
గంగ యాస్మరఘుస్మరాగారమునకుఁ
జనుదు రీవుంగు విచట నాచనవు గల్గి
యన్యథాగతి గలుగఁ జేయంగఁ దరమె. ౨౩౮

గీ. ఆభగీరథనీతయై యవనికిఁ దిగి
త్రిభువనంబులఁ బ్రోచి ప్రతిష్ఠఁ జెంది
గట్టువిల్కాని యౌదల మెట్టి గంగ
పూతయయ్యును దా నతిపూత యగును. ౨౩౯

గీ. కళను ధరియించి నైజసంగతిని బాసి
యవనిఁ బద్మావతి తులసి యనఁగ నొప్పి
ద్వీపినీ మేదినీరుహరూపములను
దాల్చియుండుము మదిని ఖేదంబుఁ దొఱఁగి. ౨౪౦

క. ఇంతీ! పంచసహస్రా
నంతరమునఁ గలియుగంబునం గల్గును శా
పాంతము పిమ్మట నాప
ర్యంతము నేఁ జెంతుఁ నిశ్చయంబగును జుమీ. ౨౪౧

గీ. ఎల్లదేహుల సంపత్సమృద్ధులకును
నాపదల హేతుభూతములై తనర్చు;
మహిమ గల్గునె యాపద్విరహితమగుచు
భవునకైనను సారసభవునకైన. ౨౪౨

వ. మామకమంత్రోపాసనదీక్షాదక్షమునిజనతాక్రాంతవితాయమాన
స్నానావగాహనదర్శనస్పర్శనంబులం జేసి యుష్మదీయ ఘోరాంహోజాలంబు నిర్మూలంబగు మఱియును, ౨౪౩

గీ. భూతలంబును దీర్థముల్ పూతములగు
సంతసంబున మద్భక్తజనులు స్పర్శ
దర్శనంబులు సల్పినఁ దక్షణంబ
యదియె పావన మవియు మహానదులగు. ౨౮౪

సీ. ఏకాదశీవ్రతహీనులు నాస్తికుల్
గ్రామయాజకనరఘాతకు లటు
లత్యుగ్రభాషి మిథ్యాసాక్ష్యవక్త మి
త్రఘ్నకృతఘ్నవిప్రఘ్నగోఘ్ను
గురుతల్పశయనులు పరదారగమనవి
శ్వాసఘాతుకవృషవాహకులును
పుంశ్చలీపుత్రులు పుంశ్చలీరతులును
దేవలాదీక్షితధావకులును

గీ. దల్లిదండ్రులఁ దమ్మునిఁ దనయుఁ దనయ
భార్య భగినిని దైన్యవద్బంధుజనుల
నత్తమామలఁ బోషింపనట్టి పాపు
లనఘు లగుదురు నాభక్తజనులఁ గనిన. ౨౮౫

క. శూద్రశవవాహకులు వి
ప్రద్రవ్యవినాశకరులు రసవిక్రేతల్
భద్రధ్వంసకు లిల న
త్యుద్రేకా నాదు భక్తుఁ జూచినయంతన్. ౨౮౬

వ. అనిన లక్ష్మి యిట్లనియె.

క. హరిభక్తిహీనులైనను
తరియింతురు భక్తజనుల దర్శనమున నం

చరుదుగ వచియించితి దే
వర భక్తు లనంగ నెట్టివారలు సెపుమా. ౨౮౭

గీ. అనిన భగవంతుఁ డిట్లను సతివతోడ
భక్తలక్షణ మధికగోప్యంబు పాప
నాశనంబును సౌఖ్యసంధానచణము
నైనఁ దెల్పెదఁ బ్రాణతుల్యవగు నీకు. ౨౮౮

క. గురుముఖమువలన నెవనికి
హరిమంత్రము సెప్పఁబడునో యాతఁడు చెందున్
సురలోకస్థితుఁడైనను
నరకస్థితుఁ డైనఁ దక్షణంబున ముక్తిన్. ౨౮౯

ఉ. మానిని ! మన్మంత్రశ్రవణమాత్రమునం బులకల్ జనించు నె
మ్మేన మనంబులోన మితిమీఱిన సమ్మద మావటిల్లి క
న్నోనల బాష్పముల్ గురియుఁ గ్రొంజెమట న్వెలసిల్లు దేహమె
వ్వానికి వాఁడెపో పరమభక్తుఁడు ముక్తిచతుష్టయార్హుఁడున్.

వ. నారదుఁడు కమల యిట్లను.

గీ. కలియుగం బైదువేలేండ్లు కడచనంగ
శాపమును బాపుకొని నీవు దాపునకును
నిచ్చ రమ్మని యానతి యిచ్చినారు
పిదప ధారుణి యేగతి వెలయుఁ జెపుమ. ౨౯౦

వ. అనిన నారాయణుం డిట్లనియె.

క. కలిఁ బంచసహస్రాబ్దం
బులు చన ధర్మంబు సత్యముం గర్మంబుల్
గలుగవు క్రమక్రమంబుగ
నిలలో వర్ణాశ్రమములు హీనంబులగున్. ౨౯౧

చ. అరయ మహాకలిన్ దశసహస్రశరత్తు లతిక్రమింప స
త్పురుషులు ధర్మవర్తనులు పుణ్యులు గణ్యులు వేదవేదులున్
సిరిదొరఁ గోరువారు తులసీవనసేవనపావనాత్మకుల్
విరళముగా వసింతురు వివేకవిపాకవిహీనచిత్తులై. ౨౫౩

ఉ. క్రూరులు దాంభికుల్ శఠులు క్రోధమనస్కులు హింసనత్త్వలా
చారవిదూరు లప్రియు లసత్యవచస్కు లలీకవాదులున్
జోరులు ప్రాణిహింసకులు శుంఠలు మూర్ఖులు ద్యూతకారకుల్
జారులు నీతిబాహ్యులు నసహ్యముగా భువి నుండు రెల్లెడన్.

క. తమతమ యాచారంబులు
క్రమముగ వర్జించి యర్థకాంక్ష యవనశా
స్త్రము లభ్యసింతు రిది యు
త్తమమని విప్రాదు లధమతతిఁ గూడి తగన్. ౨౫౫

సీ. సత్యముండదు సర్వజనములకడ భూమి
పండకయుండు భూమండలాధి
పతులు పరితాపహీనతనుండు రంబుసే
నంబులై నదులుండు నగరములును
నరశూన్యములు భయానకములై వర్తిల్లు
గోవులు క్షీరముల్ గురియకుండుఁ
బాలలో వెన్న స్వల్పంబేని యుండదు
వికృతాకృతిని జనవితతి వొలుచు

గీ. అన్ని వర్ణంబు లొక్కఁటౌ న్యాయ మన్న
దూరమగు సజ్జనుల మాటఁ జేరకుండు
నయ్యయో! చెప్పశక్యమే యధమమైన
కలియుగంబునఁ గల్గు దుష్కర్మములను. ౨౫౬

క. కొందఱు పొందుదు రత్తలఁ
గొందఱు భ్రాతృసతి గవయఁగోరుదు రక్కెన్
గొందఱు వేయేటికి యెటు
సందర్భం బటుల జరుగు జారత్వంబుల్. ౨౫౭

క. పదియాఱు వత్సరములకు
ముదిమి యొదవు గుజ్జువాండ్రు బొడముదు రిల ని
ర్వదియేఁడులు గతియించిన
నదియే పూర్ణాయు వందు రఖిలజనులకున్. ౨౫౮

గీ. వత్సరాంతప్రసూతలై వనితలుండ్రు
జరయు రుజయును వెంటనే సంభవించు
వంధ్యలగుదురు తఱచుగా వనితలెల్లఁ
గలియుగపుఁజర్యఁ జెప్ప శక్యంబుగాదు. ౨౫౯

క. కన్యాధనకుక్షింభరు
లన్యాయపథానుచరు లహంకృతియుక్తుల్
మాన్యక్రేతలునై సౌ
జన్యం బొకయింత లేక జనులుందురిలన్. ౨౬౦

క. పున్నమ నమవసమాపుల
నన్నముఁ గుడిచెదరు విప్రులదియొకఁడేలా
జన్నిదము లూడ్చి సంధ్యకు
సున్నయిడుదు రవని విప్రశూన్యముగాదే. ౨౬౧

గీ. బ్రాహ్మణాగారములయందుఁ బాచకాళి
మసలు భగభక్తముల నియమంబు దఱుఁగు
వ్రేలుపొడ వుండుదురు జనుల్ వృక్షతతియు
హస్తమాత్రప్రమాణంబు విస్తరిల్లు. ౨౬౨

వ. ఈ ప్రకారంబు కొంతకాలం బతిక్రమించిన యనంతరంబ. ౨౬౩

గీ. అవని యవనేశ్వరుల కెల్ల నాటపట్టు
గాఁగ నుండుటకతనఁ బంక మభివృద్ధి
జెందుటయు దాని నశియింపఁజేయ విష్ణు
వవతరించెను నొక్క విప్రాలయమున. ౨౬౪

ఉ. పాటిఁ దొఱంగి సజ్జనులఁ బట్టి తురుష్కులు ముష్కరంబునన్
బాటులఁ బెట్టుచుండ నలబ్రాహ్మణపుత్రకుఁడైన కల్కి తా
ఘోటక మెక్కి ఖేటకము క్రూరముగా ధరియించి వే నిరా
ఘాటముగా వధించు నలఘాతుకజాతి సబాంధవంబుగన్. ౨౬౫

క. ఖానుల వధించి యంత
ధ్యానమునొందంగ ధర యరాజక మగుడున్
మానవగృహములు దస్యు
స్థానములై పరఁగుచుండుఁ దాపసవర్యా. ౨౬౬

ఆ. వె. క్షోణితలము నిండ స్థూణాప్రమాణమా
సార మఖిలజంతుఘోరము గను
గురియు నాఱుదినము లరుగుగా ద్వాదశ
సూర్యు లుదయమగుదు రార్యవినుత. ౨౬౭

గీ. అంత గృహవృక్షలోకశూన్యమగు భువన
మర్కతేజంబుకతన ననంతరంబ
ఘోరకలిపోయి కల్మషదూరమైన
కృతయుగం బేగుదెంచు ధార్మికులతోడ. ౨౬౮

సీ. సకలవేదార్థవిజ్ఞానవిజ్ఞాపన
భాసురభూసురాగ్రేసరులును

బ్రాహ్మణభక్తిసంపాదితైశ్వర్యప్ర
తాపదిగ్విజయభూమీపతులును
గోకృషివాణిజ్యకులవృత్తివర్ధిత
ద్రవ్యతోషితసుమార్గణవణిజులు
బాడబక్షత్రియవైశ్యసేవాసమా
పాదితధర్మయుక్పాదజులును

గీ. మగనిమాటను దాటని మానవతులు
స్వకులధర్మంబు వీడని సకలజనులు
సర్వసస్యసమృద్ధమౌ క్ష్మాతలంబు
నగుచుఁ జెలువొందు నాకృతయుగము మౌని! ౨౬౯

క. దేవీభక్తిపరాయణు
లై వేదోక్తప్రకార మాచారంబుల్
గావించి సకలజను లి
లో వెలయుదు రఘములకును లోఁబడకుండన్. ౨౭౦

గీ. ధర్మము త్రిపాదములను ద్రేతాయుగమున
ద్వాపరంబున రెండుపాదము లఁ గలిని
నేకపాదంబునను నటించుచు నంతఁ
గొన్నిదినముల కదియును గోజ్జఁతయగును. ౨౭౧

వ. అనుటయు

గీ. భూమి దానంబుచేఁ గల్గు పుణ్యములును
ధరణిహరణంబువలని పాతకము ధాత్రి
దీప మిడుటయు మొదలు ధరాపరాధ
ములును దత్ప్రతికరణముల్ తెలుపు మీశ. ౨౭౨

వ. అనిన నారాయణుం డిట్లను.

గీ. ధరణి నిచ్చు నెవండు వితస్తిమాత్ర
మాగమజ్ఞున కతఁడు శివాంతికమున
కరుగు; నుర్వర నిచ్చిన హరిపదమున
భూమిరేణుపరిమాణాబ్దములు వసించు. ౧౨౩

క. భూగ్రామదానములు వి
ప్రాగ్రణులకు నొసంగు వాఁడు విధూతో
దగ్రాఘుండై దేవికి
నగ్రచరుం డగుచు వెలయు ననిశం బనఘా. ౧౨౪

క. తానొసఁగిన దొరు లొసఁగిన
దైనను భూసురులవృత్తి హరియించెను న
మ్మానవుఁడు కాలసూత్రమ
హానరకమునందుఁ గూలు నతికష్టమునన్. ౧౨౫

క. మఱియును నాతని సంతతి
హరియించును, భూమి హీనమగు, సంపదలున్
స్మరణీయములగు, రౌరవ
నరకంబును గలుగుఁ బిదప నారదమౌనీ. ౧౨౬

క. గోమార్గంబుల నుంచక
భూమిని సస్యంబుసేయు మూర్ఖుండును గో
సీమలఁ జెర్వుల దున్నిన
పామరుఁడును నరకమందుఁ బడకుండుదురే. ౧౨౭

గీ. కామియయి వీర్యపతనము
భూమిని గావించినట్టి పురుషుండు పయ
స్సీమల భూములు చేసిన
పామరుఁడును నరకమునకుఁ బాత్రులు కారే. ౧౨౮

గీ. పంచపిండంబు లీయఁ ద్యజించి స్నాతుఁ
డౌను బరకూపమందు నే మానవుండు
నరకసంవాసియగు వాఁ డనారతంబు
స్నానమును నిష్ఫలంబగు మానివర్య. ౨౭౯

గీ. దీపము ధారుణి నుంచిన
పాపాత్ముం డంధుఁ డగును ; బంచజనులకుఁ
క్ష్మాపతికిఁ బిండ మీయక
యే పితరుల కిచ్చి నరకమేగును వాఁడున్. ౨౮౦

గీ. రత్నమౌక్తికహీరహిరణ్యములును
శంఖయంత్రశిలాజలచందనములు
పుష్పజపసరదుగ్ధకర్పూరములును
ధరణి నిడువాఁడు నరక మొందఁగలాఁడు. ౨౮౧

గీ. యజ్ఞసూత్రము కుశలు రుద్రాక్షములును
బుస్తకంబును శివలింగమును నెవాఁడు
భూమియందు సమర్పించు మూర్ఖజనుఁడు
బ్రహ్మజన్మంబుఁ బొందఁ డెప్పటికి వాఁడు. ౨౮౨

గీ. గ్రహణకాలంబునందు భూకంపమందు
వసుధ ఖననంబు జేసిన వాఁడు ముందు
జన్మమున నంగవైకల్యసహితుఁడగుచు
దుఃఖమును బొందునన నారదుఁడు వచించు. ౨౮౩

—* గంగోత్పత్తి *—

చ. ప్రవిమలమౌచుఁ జిత్తము విభాసిలె నివ్వసుధాసుధాకథా
శ్రవణమున న్మహాత్మ ! దివిజస్థలసుస్థితిఁ గన్న గంగ యా

యవనికి నెట్టు లేయుగమునం దెపు డెవ్వని ప్రార్థనంబుచే
నవతరణం బొనర్చె నిది యానతి యీవె కృతార్థుఁ జేయవే.

క. అని విన్నపంబు సేయుట
యును నారదమౌనితోడ నొగి ననె నారా
యణుఁ డిటు మంధాత్రాదిక్షు
ద్ధనీరనిధిభంగభంగివాచాస్ఫుటితోన్. ౨౮౫

ఉ. రాజకరాంబుజాతభిదురప్రతిభాగతిశాతబాణధా
రాజితవైరిసంచయశిరస్స్థమణీముకుటీవిభాళినీ
రాజితపాదపద్ముఁడు ధరాసురరాజసమాజదానవా
రాజితనైజసద్మఁడు ధరన్ సగరుం డనురాజు రాజిలున్. ౨౮౬

గీ. ఆ సగరుఁడు వివాహముఁ జేసికొనియె
భాసమాననిజశరీరభాసమాన
లైన పడఁతుల వైదర్భి యనెడుదాని
శైబ్య యనియెడుదానిని సంతసమున. ౨౮౭

క. ఆరాజవరుఁడు స్మరసుకు
మారుని నసమంజుఁడను కుమారునిఁ గనె శై
బ్యారామాగర్భంబున;
నారాధనఁజేసె శివుని నన్యయు భక్తిన్. ౨౮౮

క. అంగజసూదనుకృపచే
తం గర్భముతో సమాశతంబు గడపి య
య్యంగన మాంసపుపిండం
బుం గనియెను దాని పూర్వపుణ్య మదేమో. ౨౮౯

క. ఆమాంసపుఁ బిండము గని
తా మనమునఁ జింతనొంది తరుణేందుధరున్

సోమునిఁ గరుణోద్దాముని
వేమాఱు నుతించుచు పనివి పనివి యేడ్వన్. ౨౯౦

గీ. సూతికాగారమున నున్న సుదతి కడకు
భూసురాకారమును బూని భూతనేత
చేరి మాంసపుఁబిండము జీల్చె నంతఁ
గ్రమత షష్టిసహస్రఖండములు గాఁగ. ౨౯౧

గీ. ఆశకలములు గ్రీష్మమధ్యాహ్నసమయ
తిగ్మభానుప్రభామృష్టతేజులయిన
రాకొమరులయ్యె రూపలక్ష్మీకుమారు
లీకొమరు లంచుఁ జూపఱు వాకొనంగ. ౨౯౨

వ. ఇట్ల య్యఱువదివేవురు పుత్త్రులు దినదినాభివృద్ధి గాంచుచున్నంత,

మ. హయమేధం బొనరింప నెంచి సగరుం డాత్మోద్భవశ్రేణి నా
హయముం రక్షయొనర్పఁబంప నది యన్యావార్యమై భూమిలో
రయమొప్పం జరియించి నాగసదనప్రాంతోర్వి నిల్చెం దపో
నియతిన్ గాలముబుచ్చు నాకపిలమౌని శ్రేష్ఠు పాశ్చాద్దిశన్.

ఉ. సాగరు లాహయంబు బరుగు జాడఁ గనుంగొనలేక పీక భూ
భాగము లెల్లెడ న్నెమకి వాహముఁ గానక ధాత్రిఁ ద్రవ్వి యా
భోగవతీపురంబు దరిఁబోవుచుఁ గన్గొని రొక్కచోటన్ సమ
స్తాగమవేదియౌ కపిలు నాతనివెన్కఁ దురంగమంబునున్. ౨౯౩

క. వైతానాశ్వహరుండగు
నీతాపసియంచుఁ జేరనేగి తపోదీ
ప్తాతత్పరుఁడగు మౌనిని
నీతి సడలి పరిభవింప నెలకొనుకతనన్. ౨౯౪

చ. అతులతపఃప్రభావుఁడగు నమ్మునికోపదవాగ్ని భస్మసా
త్కృతులయి రాకుమారు లదియెల్లను జారులు దెల్ప నాలకిం
చి తతవిషాదుఁడై యెరియుచిత్తముతో సగరుండు దాపసాం
చితమగు నొక్క పేరడవి చెంతకు నేగెఁ దపోభిలాషియై.

గీ. అతని యాత్మజుఁ డసమంజుఁ డనెడియాతఁ
డభ్రగంగను భూమికి నవతరింపఁ
జేయఁదలపోసి నిష్ఠమైఁ జేసెఁ దపము
లక్షయేఁడులు పిదప కాలగతిఁగనియె. ౨౯౮

గీ. అతని తనుజాతుఁ డంశుమదాఖ్యుఁ డభ్ర
నదిని ధరణికి నవతరణం బొనర్ప
లక్షయేఁడులు గురుతపోదీక్ష సల్పి
కాలయోగంబు కతన సద్గతిని గనియె. ౨౯౯

చ. అతనిసుతుండు దా్రిక్నఫలితార్యమనోరథుఁ డబ్జవాసినీ
పతిపదనీరజాతయుగభక్తివిహారధి శాంతిదాంతసం
స్తుతగుణరత్ననీరధి యశోనిధి యైన భగీరథుండు దీ
క్షితుఁడయి నిష్ఠమైఁ దపముసేసె వియన్నదిఁదెచ్చు బుద్ధితో.

ఆ. వె. జరయు రుజయులేక జలపర్ణమూరుతా
శనత దేహయాత్ర జరపికొనుచు
నూఱువేలయేం డ్లనూనతపంబు నొ
నర్చుచుండి యొక్కనాఁ డతండు. ౩౦౧

సీ. హరినీలమణివిభాస్వరశరీరమువాని
మురళి మ్రోయించు కెమ్మోవివాని
గ్రీష్మసహస్రోష్ణకిరణతేజమువానిఁ
బట్టుపుట్టము మొలగట్టువానిఁ

జతురాననాదినిర్జరనుతాంఘ్రిలవాని
మునిమునిసగవుల మోమువాని
భక్తసంత్రాణసంభ్రమమానసమువాని
తోయజమేలు కన్దోయివానిఁ

గీ. ప్రకృతిపరు సాక్షిరూపు గోపాలవేషు
వహ్నిశుద్ధాంశుకాధాను వరచిరత్న
రత్నభూషణభూషితుఁ బ్రణుతిపాత్రు
బాలకృష్ణునిఁ గనె నేత్రపర్వముగను. 302

క. కాంచి హరిపాదములకు స
మంచితమతి మ్రొక్కి మాటిమాటికి నుతి గా
వించుచు నిటు విన్నప మొన
రించెన్ మది భక్తిగదురఁ గృష్ణునితోడన్. 303

శా. దేవా! సాగరు లాదటన్ సగరు మేధీయాశ్వమున్ రోయ బ
ల్యావాసంబున కేగి యాకపిలురోషాగ్నిచ్ఛటం గ్రాఁగుటన్
దేవద్వపనతిన్ భువిన్ దిగిచి తద్వచీస్మృతి న్వారి నెం
తే ఫీతాఘులఁ జేయనెంచితిఁ దపోనిస్తాగరిష్ఠండనై. 304

క. నావుడు నాఫీకాఖ్యుఁడు
ద్యోవాహినిఁ గాంచి యనియెఁ దొయ్యలి! సగర
క్ష్మావరసుతులను వేగమ
పావనులను జేయఁ జనుము భారతమునకున్. 305

క. నీవాయుస్పర్శనమున
బావనతం బరిఢవిల్లి వారందఱు నా
యావాసమునకు వత్తురు
దేవస్యందనవిహారదీపితులగుచున్. 306

కం. నామూర్తిఁ దాల్చి సతతని
రామయతం దనరుచుండి యనిశము నాదా
ధామంబునందు భక్త
గ్రామణులై యుండు రెల్లకాలంబు రహిన్ ౩౦౮

క. గంగావాయుస్పర్శము
నం గోటిభవార్జితవృజినంబేని వెసన్
బ్రుంగు నటంచును వేదము
నం గానఁగనయ్యె నదియు న్యాయ్యము గాదే ౩౦౯

వ. దేవీదర్శనస్పర్శనంబునం గలుగు పుణ్యంబుకంటె సామాన్యదివ
సంబున మనుజుండు జేయు మాసలస్నానంబు పదిగుణంబు
లధికంబై యుండు. ౩౧౦

గీ. కోటిజన్మంబులందుఁ దాఁగొనినయట్టి
బ్రహ్మహత్యాది ఘోరపాపంబులైనఁ
బంచబంగాళిమై చనుఁ బర్వమందు
మాసలస్నానమును జేయుమాత్రమునను. ౩౧౧

క. అనిపలికి మిన్నకుండిన
వనజవిలోచనునిఁ గాంచి భక్తివినమితా
ననయై వినయముతోడన్
జనవున నిట్లనియె గంగ సంయమివర్యా! ౩౧౨

మ. అల రాజన్యతపఃప్రభావమున నీయాజ్ఞాప్రకారంబునం
బలుకుంగోమలి శాపకారణమునన్ బ్రహ్మలోకముం జేరి పా
పులచేఁ బ్రాప్తములైన పాపనికరమ్ముం బాపి నే నెప్డు డే
వలనం దేవరపాదము ల్గనుదు దేవా! యానతీవే కృపన్. ౩౧౩

క. నామనమునఁ గోరిక లేక
నేమేనుండిన సమస్త మెఱుఁగుదువుగదా
యేమని దెల్పుదు నాకుం
గామితముల నొసఁగి వేగఁ గావు మనవ్రుదుర్. ౩౧౩

చ. ఎఱుఁగుదు నీ మదింగల సమీహితముల్ లవణాబ్ధి నాథుఁడై
యఱిముఱి గారవించు నిను నాతఁ డనంగ మదంశజాతుఁ డ
బ్బురముగ లక్ష్మియంశమునఁ బుట్టితి వీవును గాన మీకు ని
ర్వురకును దంపతిత్వ మమరుర్ జగతీత్రియసుప్రసిద్ధమై.

క. ద్వీపవతు లెన్నియుండిన
నీపై మోహంబు మిగుల నెలకొల్పి దయర్
గాపాడుచుండు వారిధి
ప్రాపించుర్ వారికంటె బలుసిరులు నినుర్. ౩౧౫

గీ. వరభగీరథకృతనుతిఫణితిచేతఁ
గణ్వశాఖేరితధ్యానకలనచేత
భారతం బాదలి జనం బనారతంబు
పూజఁ గావింతు మది భక్తి రాజలంగ. ౩౧౬

ఆ. వె. నూఱుయోజనముల దూరమం దుండియు
"గంగ గంగ గంగ గంగ" యనుచు
నుడువు నతఁడు బాసి చెడుగులవలనను
బాయకుండు విష్ణుపదము లలన! ౩౧౭

క. పాపిసహస్రకృతస్నా
నాపాదితపాపజాల మంతయు మన్మం
త్రోపాసకదర్శనమున
రూపఱు నిక్కంబు జాతరూపనిభాంగీ. ౩౧౮

గీ. పాతకిసహస్రకుణపసంస్పర్శనమున
నీకుఁ గల్గిన కిల్బిషానీక మెల్ల
నాదు భక్తుం డొకండు స్నానంబు చేయు
నంతమాత్ర నిష్పచ్చర మగును దరుణి! ౩౧౯

గీ. ద్వీపినీ! వినుము సరస్వతీప్రముఖన
దీచయసమక్షమం దఘమోచన మనఁ
గా వసింతువు త్వద్గుణగణన మెచట
నగు నపుడ యాను నదియె పుణ్యస్థలంబు. ౩౨౦

గీ. సుదతి! నీదగు రేణువు సోఁకినట్టి
నరుఁడు పాతకియైన నాతరుణమందుఁ
బావనుండగు నిక్కంబు దేవిపదవి
భూమిరేణుప్రమాణాబ్దములు వసించు. ౩౨౧

ఉ. నాదమునంగఁ గోర్కెలు కడిందివిచారము పోవనాడి మీ
యందలి భక్తి మామకమహామనువుల్ స్మరియించుచున్ మృతిం
జెందిన మానవావళి వసించును శౌరిపదంబు సేరి యా
నందమువొంది పార్షదజనప్రభుతాప్రతిభాప్రసిద్ధమై. ౩౨౨

క. జ్ఞానవిహీనుం జేసియు
నీ నీరస్పర్శనమున నీగుణనుతితోఁ
దా నసువులు విడిచిన నా
స్థానంబున పార్షదప్రధానుని జేతున్. ౩౨౩

క. ఏమెడనైన నను నీనుతిఁ
జేయుచుఁ బ్రాణంబులను ద్యజించు నరునకున్
సాయుజ్య మిచ్చి పార్షద
నాయకుఁడై యుండఁగా నొనర్తును గొమ్మా! ౩౨౪

మ. ఇదితీర్థం బిదిగాదునాఁగఁ బనియే మెచ్చోటనే నిచ్చతో
మదిలోఁ దావకనామసంస్మరణముం బాటించుచున్ జీవమున్
వదలుం ధాత్రి నెవాఁడు వాఁడు మణిదివ్యస్యందనారూఢుఁ బా
ర్షదసంసేవితుఁడై మదీయపదవిన్ సారూప్యముం బొందెడున్.

వ. ఇట్లు గంగ నామంత్రణంబుసేసి. ౩౨౬

గీ. ఓభగీరథ ! వినుము నీ యుల్లమందు
గలుగుకోర్కెలు ఫలియించు కాలమిదియ
చిత్తమునఁ బాదుకొల్పిన బత్తితోడ
గంగఁ గీర్తింపఁ బూజింపఁ గడఁగు మింక. ౩౨౭

ఉ. నా విని యా భగీరథుఁ డనంతముదంబును బొంది యజ్ఞభు
క్త్యవలినిం గనుంగొని వెస న్నుతి సేయుచు శీర్ష మూర్విపై
మోవ నమస్కరించి యఘమోచను సారసపత్రలోచనున్
వే విధులన్నుతించెఁ దనవెంటనె గంగ చనంగ నంతటన్. ౩౨౮

వ. అనిన నారదుండు గంగాపూజావిధానం బనుగ్రహింపుఁ డన
నారాయణుం డిట్లనియె. ౩౨౯

క. స్నానమ్ముసేసి విహితవి
ధానమ్ములుఁదీర్చి సుపరిధానంబుల్ దాఁ
బూని మది దేవషట్క
ధ్యానం బొనరింపవలయు ధర్మజ్ఞుఁ డిలన్. ౩౩౦

చ. గణపతి విఘ్నశాంతి, కల కల్వలదాయ రుజాప్రశాంతికిన్,
ద్రిణయను జ్ఞానసిద్ధికి, హరిన్ సిరికి, న్శుచియుక్తి కాశుశు
క్షణిని, హిమావనీధ్రతనుజాతను ముక్తికిఁ గోరి యే రవా
రణమగు భక్తిఁ గొల్తు రల ప్రాజ్ఞుల కెల్లశుభమ్ము లయ్యెడున్.

గీ. అట్లుచేయక పూజ సేయంగడంగు
వానిపూజన మగును నిష్ఫలము గాన
దేవషట్కంబుఁ బూజించి తివిరి యిష్ట
దైవతసమర్చనము సేయఁదగునటన్న. 332

గీ. కలియుగం బైదువేలేండ్లు గడచనంగ
గంగ యెచ్చోటికేగె వినంగ మిగుల
వేడ్క పొడమెడు నెదఁ జెప్పవే యనంగ
నాతఁ డిట్లనిచెప్పె సంప్రీతితోడ. 333

ఉ. అత్తటి నవ్విలాసిను లహంకృతి లోఁ బొడమం బరస్పరో
పాత్తములైన కోపము లవశ్యము భోగ్యములౌటఁ జిత్తముల్
తత్తఱమందఁ దగ్గతులు దాలిచి యా యవధిన్ ధరించి య
త్యుత్తమమైన దేహములతోఁ జనుదెంచిరి శౌరిచక్రికిన్. 334

వ. అనిన నారదుండు, మహాత్మా! విష్ణుపాదాంబుజంబున నుద్భవంబం
దిన మందాకిని బ్రహ్మకమండలు వనియు శివప్రియ యనియుం
బేర్కొనంబడుచుండ నారాయణునకుఁ బ్రియపత్ని యగు టెట్లన
వుడు; మునీంద్రా! తొల్లి గోలోకంబున రాధాకృష్ణాంగసము
ద్భూతయయి తదంశంబయి యనన్యకన్యకాజనసామాన్యలావణ్యం
బగు ద్రవరూపం బవధరించి నిరతంబు వెన్నునికి సన్నికృష్టయై
యుండ నొక్క నాఁడు, 335

క. గోపికలు గొలువగా రా
ధాపతి కొలువుంబొనర్చుతటి గంగ హరిన్
జూపు నిలిపి కని మోహో
ద్దీపితయై యచ్చటన్ స్తుతిం గావించెన్. 336

గీ. హరిని గనులారఁ గనుఁగొన్నయంతఁ బొడమె
నెడఁదఁ గడలేనిమోహ మీపడఁతి కపుడు
లజ్జయును దోడఁ జనుదెంచె నిజ్జగమునఁ
దరుణి కెందులకేని స్వాతంత్ర్యమున్నె. ౩౩౮

ఉ. ఆదళదబ్జనేత్రి మది నాపఁగరాని తమిన్ గడంగి దా
మోదరునిం గనుంగొనుచునుండెను దువ్వలువ న్మొగంబు నా
చ్ఛాదనమాచరించి విహాసన్ముఖచారువిలాసయై ; ధరన్
మీఁదుఁ దలంప రంగనలు మిక్కిలిమోహము గల్గుపట్టునన్.

గీ. తెప్ప వేయక మదిలోన నుప్పతిల్లు
కామమును లజ్జయును సతిగౌరవంబు
వెల్తిసేయంగ మూర్ఛలోఁ బెనఁగొనంగఁ
జేష్టలఁ దొఱంగి నిల్చె రాజీవనేత్రి. ౩౩౯

సీ. ఒకచక్కి గోపికానికరమ్ము మణివేత్ర
పాణులౌచును బరాబరులు సేయ
నొకయోర కిన్నరీనికురుంబము బలసి
సాహోనినాదముల్ సల్పుచుండ
నొకచాయ నప్సరఃప్రకరంబు కవగూడి
చెలువార నాట్యముల్ సేయుచుండ
నొకవంక నిర్జరీవికచాంబుజాక్షులు
ప్రమదంబుతోఁ జామరములు వీవ

గీ. మంజులానంతరత్ననిర్మాణమైన
రథమునందు వసించి యారాధ యటకు
రమణ నేతెంచి హరిఁ గాంచి రథము డిగ్గి
నాథుకడ కేగె మందయానంబు గదుర. ౩౪౦

ఉ. శౌరిపదాంబుజంబులకు సాగిలి మ్రొక్కి తదుక్తనర్మవా
చారస మారగించుచును సంభ్రమ మొప్ప నమస్కరించు నా
భీరకులాంగనాతతిని బ్రేమ గడల్కొన సర్వపద్ధతిన్
గౌరవమాచరించి యట గద్దియఁ దా వసియించె నొయ్యనన్.

క. భయమున్ సంభ్రమము నతివి
నయము న్మిగులన్ మనమ్మునం బొదలఁగ గం
గయును వెడలి తచ్ఛరణ
ద్వయికిం బ్రణమిల్లి శౌరివలపట నిల్చెన్. ౩౪౨

చ. కలికి తదాననాంబుజవికాసములం గనుఁగొంచు నాత్మ ని
క్కిలియగు మోహభారమునఁ గీడ్వడి యాఁదలవాంచి యన్యచిం
తలు దిగఁద్రావి యుండె నటఁ దద్గతమానసయై నితాంతమున్
వలపుగలట్టిచోట ప్రతిబంధము గల్గిన నట్టులే కదా. ౩౪౩

క. అంతట రాధికయును ద
త్ప్రాంతంబున నుంటఁ జేసి యాచైదము ల
త్యంతముఁ జూచుచు మదికి
న్వింతగఁ గన్పట్టి కోపవిహ్వలమతియై. ౩౪౪

ఉ. మోవి చలింపఁ జిర్నగవు మోమున నొప్ప నితాంతశాంతవా
చావిభవంబు దోఁప హరి చక్రిని దృష్టి నిగిడ్చి పల్కె ని
ట్లావల కొల్వులోపలి వయస్యలహో యన గంగ హో యనన్
దేవతలెల్లఁ దల్లడిల దీపితరోషకషాయితాక్షియై. ౩౪౫

ఉ. దేవరపార్శ్వమందు భవదీయముఖాంబుజ మాస్థఁ జూచుచున్
భావములోనఁ బుట్టు తమి పైకి వెలార్చుచు నవ్వుమోముపై
కీవి మెసంగఁ బయ్యెద ఘటించుచుఁ గంటకితాంగియౌచు మా
ర్ఘావశయయ్యె నీయువతి సంశయమేటి కెవర్తు చెప్పుమా.

క. ఈ చేడియపై నిప్పుడు
నీచిత్తము మిగుల మోహానిచితం బనియే
సూచింపఁబడియె నికనా
లోచన యేటికి నిజము బలుకుము బిరాన్. ౩౮౭

ఉ. కాతరతాప్తి లేక దరిగా వసియించిన నన్ను గోపయో
పాతవి నేనిఁ జూడక యసంగతమంచుఁ దలంపఁబోక యీ
నాతికిఁ జిక్కఁజేసితి మనం బవురా! యిదియెంత జంతరా!
ఘాతుకవృత్తి కిట్టు లొడిఁగట్టిన నీవను సమ్మతింతువే. ౩౮౮

ఉ. ఈతటి నిద్రకొత్తయిన నేటికి నెప్పటి కష్టె యిట్టి నీ
చేఁతలు వేనవేల్ గని విశేషము నీయెడఁ గల్గునట్టి సం
ప్రీతిఁ దొలంగఁజాల కురరీకృతనై సహియించుచుంటి స్త్రీ
జాతికి మీకుఁబోలెఁ దగుసాహసముండునె నూతనప్రియా!

క. ఈకామినిఁ దోడ్కొని గో
లోకంబున నుండి యెందులోకంబులలో
నేకడకైనను బొమ్మా!
నాకడ వసియింపఁ గీడనంతము సుమ్మా. ౩౯౦

ఉ. చందనవాటియందు విరజాసతిఁ గూడి రమించునాఁటి నీ
చందముఁ గాంచు నాపలుకుజాడనె నీవు తిరోహితత్వముం
జెందిన యంత నాకుసు ప్రసిద్ధము గాదె నదీస్వరూపముం
బొంది భవద్వ్యశస్థిన్నతిఁ బ్రబోధము చేయుచునుండె నేటికిన్.

వ. కోటియోజనవిస్తీర్ణంబును, చతుష్కోటియోజనదైర్ఘ్యంబును
గలిగి విరజానదినాఁ బ్రసిద్ధంబగుట యెల్లరకుం దెల్లంబుగాదె.

చ. ఇరవున కేగు నన్నుఁగని యిర్ష్యదిసూయద నంచునెంచి చె
చ్చెలి నదిఁ జేరనేగి తమిచే 'విరజా! విరజా!' యటం చొగిన్

మొఱయిడు నీవు మొఱ్ఱ విని పూర్వపురూపము సిద్ధయోగమున్
దొరసినయంత నాచెలువతో రమియించితిగాదె యచ్చటన్.

క. ఆరమణితో రమించిన
కారణమున వార్ధిసప్తకం బాత్మజులై
ధారుణి విలసిలుచుండును
రారయఁ బ్రత్యక్షసాక్షులై యిప్పటికిన్. ౩౫౪

చ. తతకుసుమాంచితం బయిన తల్పమునం బవళించి నీవునున్
గుతుకముమీఱ శోభ యను గోపికతో రమియించుచున్ దిరో
హితుఁడవుగావె నన్నుఁ గని? యింతి తటాలున చంద్రమండల
స్థితిఁ గొనదే? మదిం గనరుఁజెందితినే? యపుడైన నచ్యుతా.

వ. శోభాసంత్యక్తంబగు శరీరం బతిస్నిగ్ధ ప్రభాన్వితంబై యుండం గాంచి డెందంబునందు వందురి యద్దేహంబు నైకంబు నైకంబుగ విభజించి రత్నంబులకును స్వర్ణంబునకును రమణీమణి ముఖంబులకును జంద్రునకును గిసలయంబులకును సుమంబులకును బక్వఫలంబులకును రాజగృహంబులకును దేవాలయంబులకును నూతనపత్రంబులకును దుగ్ధంబులకును నీవిచ్చితి. మఱియును, ౩౫౬

మ. మును బృందావనవాటిలోనఁ బ్రభయన్పాఁబోఁడితోఁగూడియుం
డినచో నచ్చటికేగుదెంచిన ననుస్వీక్షించి యంతర్ధనిం
గనవే! యాప్రభ దేహముందొఱఁగి శోకంబూరఁగాఁబోయి యా
వనజాప్తుని మండలంబుననె యావాసంబుఁ గావింపదే. ౩౫౭

వ. ప్రభావిసృష్టంబైన దేహంబు తేజస్సముజ్వలంబై తీవ్రంబై యుండుటం గాంచి యారమణి యందలి ప్రేమాతిశయంబునఁ దోడెంబుగా విభజించి కొంత హుతాశనునకును యక్షులకును దేవత

లకును విష్ణుభక్తులకును సర్పంబులకును బ్రాహ్మణులకును మును
లకును రమణులకును బంచియిచ్చుట లిప్పటి కయినను మఱవ
వచ్చునే. 3౧౮

చ. అలరు వసంతకాలమున యందు మనోజ్ఞమణీగణప్రభో
జ్జ్వలమగు హర్మ్యమం దలరుశయ్యపయిం దమి నీవు శాంతియఙ్
లలనయు ముచ్చటందవిలి నాదగు శబ్దము విన్నమాత్రి నా
వల కరుదెంచినా వెఱుఁగవా! చెలి వీడెను దేహమయ్యెడఙ్.

వ. పదంపడి యాసతి శరీరంబు విభజించి విపినంబులయందును సలువ
యందును శుద్ధసత్వస్వరూపిణియగు మహాలక్ష్మియందును దావ
కమంత్రోపాసకులయందును శాక్తేయులయందును తపోనిరతుల
యందును ధర్మతత్పరులయందును నివసింపంజేసి తిదియునుంగాక.

మ. క్షమతోడఙ్ రమియించి యాయలరుసెజ్జంజేరి యశాంతవి
శ్రములై మున్నొకనాఁడు మైమఱచి నిద్రింజెంది యున్నట్టియా
సమయంబుంగని నెచ్చెలుల్ దెలుప నిశ్శబ్దంబుగా వచ్చి నే
మియు మేల్కొల్పుట నీవెఱుంగనిదియే, మేల్మేలు నీచెయ్దముల్!

ఉ. అచ్చట నిద్రఁజెందునపు డల్లనఁ బూవులసెజ్జపజ్జకుఙ్
జొచ్చియు కౌస్తుభంబు మణిశోభితకుండలయుగ్మకంబునుఙ్
బచ్చనిమేల్మివల్వ వనమాలయు ముచ్చిలి మీరు మేల్కొనఙ్
నెచ్చెలపిందు చెల్వ గరుణించి యొసంగనె? నీ వెఱుంగవే! 3౨౦

వ. అప్పటి పాపంబును బాపికొననోపక కాదే కృష్ణవర్ణుండవైతి;
క్షమయును దేహంబుఁ ద్యజించి పుడమికిం బోయినఁ దత్తనూ
విలాసంబు లతిరమణీయంబు లగుటంజేసి వాని విభజించి వైష్ణ
వులకును దుర్బలులకును దేవతలకును బండితులకును బంచి
యొసంగితి; వింకను నీదౌష్ట్యంబులు దెలుప ననంతంబులైన గాథ

లై చను నని పలికి లజ్జావనతాననయై యున్న గంగ కభిముఖియై క్షణక్షణవివర్ధమానకోపరూక్షేక్షణయై యెద్దియే నొక్క నుడి వల్క సమయంబున. ౩౬౩

ఉ. గంగయు సిద్ధయోగమును గైకొని 'ప్రోవు మనాథనాథ' యం
చుం గమలాక్షుపాదమునఁ జొచ్చెను ; రాధయు రోసమెత్తి యు
త్తుంగమహీధరంబులును దోయధులు న్నిధు లుర్విగల్గు త
క్కుంగలచోటులున్ నెమకి కోరిక తీఱక యాగ్రహంబునన్.

క. వైకుంఠంబున ద్రుహిణుని
లోకంబున యందు స్వర్గలోకంబున నా
యాకడలన్ వెదకియు మం
దాకినిఁ గన్గొనక విసిగెఁ దత్కాలమునన్. ౩౬౫

ఉ. ఇలయెల్లన్ జల మిల్లయయ్యె ; మృతదేహివ్రాత దేహచ్ఛటా
కులమై యెల్లెడలందు మానవులయాక్రోశంబు మిన్ముట్టఁగా
జలజప్రోద్భవచంద్రశేఖరులు నాశాపాలురుం గృష్ణుతోఁ
దెలుపంగావలెనంచు వేచనిరి తద్విజ్ఞాసముత్సాహులై. ౩౬౬

క. గోలోకంబున గోపిక
లోలిన్ భజియింప రాధయు న్మణిపీఠిన్
గ్రాలఁగఁ గొలువుండిన గో
పాలుని దవుదవులఁ గని రవారితభక్తిన్. ౩౬౭

వ. కని కరకమలంబులు నిటలతటంబున ముకుళించి యనేకప్రకారంబుల వినుతించిన నమ్మహాత్ముండు వారల నీక్షించి సాదరంబున నిట్లనియె. ౩౬౮

ఉ. వ్యాళశయాన ! స్వాగతమె, వారిజసంభవ ! సేమమే, దిశా
పాలకులార ! మీకును శుభంబకదా, భయసంభ్రమంబు లి

ల్లోల మదంఘ్రియందు వసియించె భయంబున గంగ? దీనికై
చాలశ్రమంబుఁజెందితి రోసంగెదఁ దోడ్కొనిపొండు చెచ్చెరన్.

ఉ. తోకొనిపోయి దీని నకుతోభయగా నొనరింపుఁ డన్నఁ జా
మీకరగర్భుఁ డాత్మ మితిమీఱిన సంతసమంది రాధ న
స్తోకపుభక్తితో ముఖచతుష్టయనిర్గతవేదఘోష మా
శాకుహరంబుల న్వెలయ సంస్తుతిఁజేసి నతోత్తమాంగుఁడై

ఉ. శౌరియు నీవు గొల్లమెలచానలునుం గుమిగూడి రాసకే
ళీరతి నున్న వేళఁ గడలేని శ్రమాంబులు మీకు మేనులన్
సారెకు నుద్భవించి యొకచాయ సమేళనమొంది గంగయై
చారువిలాసమొప్పఁగ రసప్రకృతిం గనెఁ జుమ్ము రాధికా. ౩౭౧

గీ. యుష్మదంగంబువలన సముద్భవించెఁ
గాన నీగంగఁ గూఁతునుగా ననుగ్ర
హించు టుచితంబుగాని కోపింపఁదగదు
గర్భవైరంబు తల్లి కక్రమముగాదె. ౩౭౨

చ. నిరతము నీ పదాబ్జములు నెమ్మి భజించుచు నీదు మంత్రసం
స్మరణము చేయుచున్ లవణసాగర మూర్విఁ జరించువేళలన్
వరుఁడయి యాదరించును గృపామతితోడ జనార్దనుండు నిన్
గురువగు ప్రేమఁ జూచును వికుంఠపురంబున నీకు నాథుఁడై.

గీ. ఎచటి కేతెంచినను గంగ కీరుగారె
తల్లిదండ్రులు పతియు సద్గతియు నన్న
ధాతపలుకుల కులికి రాధాతరుణియుఁ
గృష్ణుఁ గీర్తించె నంత రోచిష్ణుఫణితి. ౩౭౪

ఉ. అంతఁ దదంతరంగమున యం దతిశాంతినిఁ బూని రాధికా
కాంత పదాగ్రభాగమునఁ గ్రాలెడుగంగను బ్రేమఁ గన్గొనన్

స్వాంతమునం దనంతమగు సంతసమంది విధాత తజ్జలం
బెంత కమండలంబున మహేశుఁ డొకింతయుఁ దాల్చి రాదలన్.

వ. మఱియు నా గంగకు రాధికవలన నేభయంబును గలుగకుండ రాధామంత్రం బుపదేశించి యామనురత్నంబునకు సామవేదోక్తంబగు పద్ధతిని స్తోత్రకవచపూజావిధానధ్యానావాహనాది సమస్తంబును దెల్పె; నంత గంగయు రాధామంత్రోపాసనంబుఁ గావించి వైకుంఠంబునకుం జనియె. తదనంతరంబ గోవిందుండు పద్మభవాదులంగని సస్మితాననుండై యిట్లను మీ రిచ్చటి కరుదెంచిన కార్యం బలవడియెఁగదా కాలగమనంబు నెఱుంగుట శక్యంబు కా దదెట్లంటేని. 328

మ. కుతలంబెల్ల జలప్లుతింగనియె వైకుంఠంబుదక్కం జగ
త్థితనానావిధజీవరాసులు నశించె న్మత్పురోభాగసం
గతిఁ గావించిన మీరు దక్క నిదియేకల్పాంతమై తోఁచె నీ
వతివేగంబున సృష్టిచేయు మిఁక బ్రహ్మాండంబుఁ బ్రాగ్వైఖరిన్.

క. గంగయును బిదప నేతే
రంగల దిఁక నన్యలోకరచనం బొనరిం
పంగడఁగుదు నే నని చని
యెం గృష్ణుం డంతిపురికి నెంతయుఁ బ్రీతిన్. 329

వ. విష్ణుపాదనిర్గతయగుట గంగ విష్ణుపది నాఁబరఁగె. 329

క. ఇది గంగోపాఖ్యానము
చదివిన వ్రాసినను వినిన సకలైశ్వర్యా
భ్యుదయములు గలిగి తుది మో
క్షదమై తగు ననిన మౌని సంతసమందెన్. 330

—* గంగా విష్ణు సంబంధ కారణ కథనము *—

క. కలిమిజవరాలు వాణీ
నలినాక్షియు గంగ తులసినాఁ జను భార్యల్
నలువురు కలరని విందును
వలమురితాల్పునకుఁ దొల్లి వారలలోనన్. ౩౮౧

క. వైకుంఠంబునకున్ మం
దాకిని యెక్కరిత చనియె నని విందును దా
నేకరణి భార్యయయ్యె హృ
షీకేశున కద్ది తెలియఁజెప్పు మహాత్మా! ౩౮౨

వ. అనిన నక్కథకుం డిట్లని చెప్పందొడంగె. ౩౮౩

క. మిన్నేరు మున్ను చనియెను
వెన్నునిపదమునకు నలువ పిదప నరిగెఁ దా
వెన్నాడి వారిజాతభవ
భ న్నెలకొనియున్న యభ్రవాహినిఁ గాంచెన్. ౩౮౪

క. కాంచి సతీయుతుఁడగుచు వి
రించి మురారికి నమస్కరించి వినుతిఁ గా
వించి నెఱి నిట్లనుచు వచి
యించుట కుత్సాహమందు నీసమయమునన్. ౩౮౫

క. తేజస్విని యతిమానో
ద్వేజితయగు రాధవలని భీతిన్ గంగాం
భోజాక్షి విష్ణుచరణాం
భోజములన్ డాఁగె నాత్మఁ బొదలెడు నార్తిన్. ౩౮౬

క. అపు డెల్లభూమిభాగము
లపగతనీరమ్ములగుట నాత్మ నెఱిఁగి త

ద్విపదపనోదార్థము నే
నపరిమితానంద మెనసి యద నిది యనుచున్. ౩౮౭

ఉ. సరసిజనేత్రు సన్నిధిని సాంతముగా వివరించిచెప్పఁ ద
చ్చరణసరోజమం దణఁగి శాంతివహించిన గంగఁ దా బహి
ష్కరణ మొనర్చి విష్ణుపదికన్యని రాధికమాత్ర మిచ్చి స
త్వరముగఁ జేసితిన్ ధరణిభాగములన్ జలపూరితంబుగన్.

క. ఈగతి సమస్తగోళక
భాగంబున నీరు నించి వనజాక్షునకున్
సాగిలి యీసతి దోడ్కొని
యేగతుఁడనునైతి నీ సమక్షమ్మునకున్. ౩౮౯

వ. అని యిట్లు పలికి కృతాంజలియై, ౩౯౦

చ. సరసుల నగ్రగణ్యుఁడవు జాణవు నీవును నీ మెయిన్ బర
స్పర మనుకూలమౌను చెలువం బనఘుం బడి యట్లులుండ నీ
తరుణిని నాదరించు మిది తద్ద మరుల్గొనివచ్చెఁ గాన నే
కరణిని గాని యీసతిని గాదన కీవు పరిగ్రహింపుమా. ౩౯౧

క. తనయంత వలచివచ్చిన
వనితామణిఁగూడి భోగపరుఁడై యుండన్
జనుఁగాని యొల్లననుచో
ఘనతరసౌఖ్యంబు లెట్లుగలుగుం జెపుమా. ౩౯౨

క. నూతనయౌవనరేఖో
పేతశుభాకారమైన యీసతిని గృపా
న్వీతుఁడవై యిపుడ జగ
త్ఖ్యాతిగ వరియింపు మీవు గాంధర్వవిధిన్. ౩౯౩

చ. అని వచియించి గంగను సమర్పణఁజేసి సరోజసూతి దాఁ
జనియె; ననంతరంబ హరి సంతసమంది ప్రఫుల్లపుష్పచం
దనసమలంకృతంబయిన తన్వికరాంబుజముల్ గ్రహించినం
తన జనియించెఁ గాంతకు నితాంతము సాత్త్వికభావముల్ మెయిన్.

చ. అది యదనంచు నెంచి యసురారి సురాపగఁ గౌఁగిటన్ ముదం
బెదఁ గదురంగఁ దార్చుచు నహీనశుభోన్నతిఁ బొందుచుండె నిం
పొదవెడు చాడ్పున న్నతత; మర్వికిఁ బోయినగంగ యీగతిన్
బదపడి పద్మనేత్రునకు భామినియై సుఖమందె నారదా! 3౯౫

గీ. తోయజాతాక్షపదనఖోద్భూతయగుట
విష్ణుపది యన్నపేర్జగద్విదితమయ్యె
సరససంభోగసౌభాగ్యగరిమ నెనసి
యురుతరానంద మొందుచుండె గంగ. 3౯౬

ఉ. ఈగతి కొన్నివాసరము లేగినపిమ్మట గంగ భర్తృసం
యోగము గల్గియుండుటకు నోర్వక పల్కువెలంది లోన నీ
ర్ష్యాగరిమంబునం గడుగయాళితనంబున నుండెఁ; గాంత లే
లాగుసహింతు రాత్మపతిలాలితమానవతీసమున్నతిన్.

క. ఇలకుం బోయిన కలుముల
చెలితోడ స్సతులు మువ్వురు శ్రీవిష్ణునకున్
దులసీసతితోఁ గడుకొని
నలువురుసతు లందు రర్వ నారదమౌనీ. 3౯౭

వ. అనిన నారదుం డిట్లనియె. 3౯౮

క. శ్రీమన్నారాయణుప్రియ
కోమలి తులసి యెటు గుట్టు? కులమెద్ది? హరిం

గామించుటకై తానే
మేమి తపమొనర్చెనో వచియింపు మహాత్మా! ౪౦౦

వ. అనవుడు నారాయణుం డిట్లనుఁ. తొల్లి భగవదంశసముద్భూతుండగు దక్షసావర్ణియను మనువు గలండు. అతనికి బ్రహ్మసావర్ణియు నతనికి ధర్మసావర్ణియు నతనికి త్రిసావర్ణియు నతనికి వృషధ్వజపాదసేవనాపరాయణుండగు వృషధ్వజుండును జన్మించిరి.

ఉ. అద్రిసమానధీరుఁడగు నావృషకేతుఁడు శర్వభక్తిని
ద్నిదప్రమనఃప్రమోదము గణించుచుఁ దత్కరుణాసమాగతా
క్షుద్రసమస్తభోగముల శోభితుఁడై భవుఁడై చెలంగుచున్
భాద్రపదంబునందు సలుపుండు రమాపదపూజనావిధిన్. ౪౦౧

ఉ. శర్వమయంబు సర్వమని స్వాంతమునం దలపోసి తత్కృపా
గర్వితచిత్తవృత్తి నొకకాలమునందును గొల్వఁబోఁడు సా
పర్వచయంబు వాణిఁ గొలువం డొనరింపఁడు జన్నముల్ సుప
ర్ణార్వనిపూజయన్నఁ బరిహాసము జేయును బుద్ధిహీనుఁడై.

క. ఒందుఁ దలపోయఁ డెద బ్ర
హ్మాండం బఖిలంబు నింద్యమంచు నతం డు
ద్దండత నుండుటఁ గని మా
ర్తాండుం డురువిలయభీకరాకారుండై. ౪౦౪

ఉ. లోకవిలోచనమ్ము మదిలోపల మాటికిఁబుట్టు కినుకమై
"నో కలుషస్వభావ! వినరోరి మదంబున సర్వదేవపూ
జాకలనంబులన్ దొఱఁగి జాల్మునికైవడి నుండుటన్ హత
శ్రీకుఁడవై చరింపు" మని చెచ్చెర శాపమొసంగె నంతటన్.

ఉ భవుఁ డశాంతవివర్ధమానగురుకోపపరిస్ఫురద్దీప్తభై
రవుఁడై శూలము కేలఁ దాల్చి నలినీపాణిసేను భంజింతునం

చు వెసంబోవుదు నేఁడుగాదె తుదియంచుం గశ్యపోపేతుఁడై
రవి వెన్నిచ్చి సరోజసూతి సభఁ జేరంబోయె ఖిన్నాత్ముఁడై.

మ. విధుజూటుండు పలాయితుండగు రవి న్వీక్షించి తర్జించుచు
న్విధిగోష్ఠీస్థలిఁ జేరె; ధాతయుఁ గడున్ భీతిల్లి తద్వీక్షణ
వ్యధితస్వాంతసమేతకశ్యపతదీయాత్మోద్భవోపేతుఁడై
మధువిద్వేషణు దర్శనంబుఁ బొనరింపంబోయి కాంచెన్ హరిన్.

మ. భయమున్ భక్తియు సంభ్రమం బెదలఁ బర్వ న్గశ్యపుండున్ హరి
ద్ధయుఁడున్ బంకజసూతియు న్మకుటరత్నాభీషులన్ దత్పద
ద్వయికిన్ హారతులిచ్చి మ్రొక్కులిడి సంత్రాసంబుతో సంహ్యాత
స్మయులై తెల్పిరి భర్గకోపగతిబీజంబెల్ల నాద్యంతమున్. ౪౦౮

ఉ. కాంచనచేలుఁ డర్యముని కాతరవృత్తినిదానమెల్ల నా
లించి యభీతిముద్రనిడి లేనగ వొప్ప వచించెనిట్లు “ చ
క్రాంచితపాణినై కడురయంబున నచ్చటికేగి నన్ను సే
వించినవారి కార్తి ప్రభవించిన పట్టునఁ బ్రోచివచ్చెదన్. ౪౦౯

మ. నలుమోముల్గలవేల్పునై జగములన్ గల్గింతు, శిక్షింతు న
య్యాళికాక్షాకృతి, సర్వలోకములు నేనై యుందు ; నాకుక్షిలో
పల డాఁతు న్జగముల్ లయాంతమున సర్వవ్యాపినె 'దు న్వని
శ్చలవృత్తిం ద్రిగుణాత్మకంబయిన తేజంబూని వర్తించెదన్.

ఉ. ఇంచుక భేదమెన్నఁ గలరే శివుఁ డన్నను నేనన్ విత
ర్కించినచో శివుండనఁగఁ గేవలుఁడే యవిషహ్యవిక్రమా
భ్యంచితతేజుఁ డెందు నొకఁడైన నసాధ్యములేదతండ సృ
ష్టించును సూర్యకోటిఁ బ్రకటించు విరించనకోటి నొక్కటన్.

చ. అతఁ డతిలోకశక్తియుతుఁడైనను నాంతరవృత్తిమగ్గుణ
స్తుతి నొనరించు మన్మనువు చూచుచు నాదృతిమై దివానిశం

బతులితభక్తిఁ బంచవదనాబ్జములన్ వచియించు వాని కే
నతులోనరింతు వాసకిని నాకును లేసు ప్రభేదమెంచినన్. ౪౧౨

క. నను సేవించెడు మనుజుల
కనుపమభోగంబు లీయ నాకాంక్షింతున్
జనుఁ డింక మద్వరంబున
వినిహతభయులగుచు వేగ స్వేచ్ఛావృత్తిన్". ౪౧౩

వ. అని బ్రహ్మాదుల నూరార్చె నట్టి సమయంబున, ౪౧౪

మ. శయకంజంబున శూలమున్ ద్రిపురరక్షఃకాల మొప్పన్ జగ
త్ప్రియసంక్షోభ్యనిలానుధావసకళాధారేయమున్ వాహమున్
రయమూరన్ దుమికించుచుం గమలినీప్రాణేశు నిర్జింపఁగా
లయకాలాకృతిఁ జొచ్చె రుద్రుఁడు మహాలక్ష్మీప్రతిష్ఠేమమున్.

ఉ. వాసుకిభూషణుండు వృషవాహనుఁ డయ్యెన డిగ్గి భక్తిసం
వాసితచిత్తుఁడై కనకవాసునకు న్నతులాచరించె వా
ణీసఖుఁ డట్లు గశ్యపుఁడు నీరజబంధుఁడు భక్తియుక్తి సం
త్రాసితులై యొనర్చిరి కృతాంతవిరోధికి వందనంబులన్. ౪౧౬

ఉ. బాలశశాంకశేఖరుఁడు వాసవరత్నచిరత్నకాంతులన్
గ్రాలెడు గద్దెయం దసురఖండనపార్శ్వదపాణిచామరాం
దోళనజాతవాతపరితోషితుఁడై వసియించియుండ నా
వ్యాళశయానుఁ డర్ఘ్యమసమాదరుఁడై హరుఁ గాంచి యిట్లనెన్.

మ. "నిటలాంతస్ఫుటదగ్నివీక్షణ ! భవానీనాథ ! నీ విప్పుడే
చ్చోటకుం బోవఁదలంచి, తేమిపని యిచ్చోనున్నదే ! రోష ము
త్కటమై మోమునఁ దోఁచుచున్నయది దైత్యశ్రేణి దర్పంబునన్
జటిలోకంబున కెగ్గుఁజేసిరొకొ రోసంబూన నీకేటికిన్". ౪౧౮

ఉ. శ్రీధరుఁ డెర్గియుండియు వచించిన పల్కులు నాలకించి యా
భూధరధన్వి యిట్లనియెఁ బూజ్యుఁడు భాగవతుండు నాకు పా్ర
ణాధికుఁడైనవాఁడు కలఁ డావృషకేతుఁడు వానిఁ గాంచి ఛా
యాధవుఁ డాదరింపక దురంతముగా శపియించెఁ గావునన్.

ఉ. వాని వధింపనెంచి యనివార్యముగా నిటువంటి కోపమున్
బూనితి నేఁడు; వాఁడు కితపుండయి తావకసన్నిధానమం
దే వసియించుటం గని వధింపఁ దలంపక యుంటిఁగాని త
న్మానము పా్రణముం గొనక మానుదునే మఱియెందు నిల్చినన్!

ఉ. ధ్యాననిరూఢినైన హృదయంబుననైనను స్తోత్రశక్తిచే
నైనను నాపద ల్గలుగునప్పుడు నిన్ శరణన్నమాత్ర ద
నైన్యనను పోయి పో్రతువు జరామరణమృత్యువివర్జితాంగులం
గా నొనరించి సన్నిధిని గల్గెడివారలఁ బ్రోవకుందువే!

క. నాభక్తుఁడు వృషకేతున
కీ భానుఁడు గడఁగి శాపమిచ్చెను "నిహత
శ్రీభాగ్యుండవు" కమ్మని
యా భూపతి కింక బ్రతుకనగునే ధరణిన్. ౪౨౨

వ. అనినఁ జిఱునవ్వెలయ నారాయణుండు హరున కిట్లనియె. ౪౨౩

క. అరగడియ యయ్యె నిచ్చట
తెరగంటులమానమున నదిం గన ధరలో
నిరువదియొక్క యుగంబులు
జరిగెను జను మింక హర! నిజనిలయమునకున్. ౪౨౪

గీ. చచ్చి చిరకాలమయ్యె వృషధ్వజుండు
నాతనికిఁ బుత్త్రుఁడగు రథకేతుఁ డీల్గెఁ

ధర్మకేతుండు మఱి కుశధ్వజుఁ డనంగఁ
గలరు పుత్రకు లిద్ద రాత్మాధవునకు. ౪౨౫

ఉ. వారును సూర్యశాపమున భాగ్యవిహీనతచే రమాతప
స్స్వారతులై సదాసుజనసంగతులై మునివృత్తులైరి త
ద్దారలలోన నొక్కతెకు ధారుణి లక్ష్మి జనించి దుఃఖని
స్తారక మాచరించు వసుధావరులం దగఁజేయు ధీరులన్. ౪౨౬

మ. మృతుఁడయ్యె న్భవదీయదాసుఁడిఁకఁబొమ్మిమ్మా! కోపమేలంచుఁ బ
ల్కి తిరోధానమొనర్చె మాధవుఁడు; పంకేజోద్భవుండుం దిరో
హితుఁడయ్యెన్; రవికశ్యపుల్ సనిరి; భూభృద్ధన్వయుల్ శాంతిపూ
ర్ణతముండై తపముం బొనర్పఁజనియెన్ గైలాసశైలంబునన్.

వ. అనిన మహాత్మా! ధర్మధ్వజకుశధ్వజుల చరిత్రంబు వినిపింపు
మనిన నారాయణుం డిట్లనియె ౪౨౮

ఉ. ధర్మకుశధ్వజాఖ్యవసుధావరు లుగ్రతపంబొనర్చి యా
భర్మమకూలు పేర్మియసికృపన్ ధనధాన్యసుతాదిలాభము
ల్పేర్మి గ్రహించి యెల్లపృథివిం బరిపాలన మొప్పఁజేసి దు
ష్కర్మవిదూరులై సకలసంపద లందుచునుండి రిర్వురున్. ౪౨౯

క. అందుఁ గుశధ్వజభూపతి
సుందరి గర్భంబుఁదాల్చి శుభదినమున న
య్యిందిరకళచేఁ దానొక
నందని సుజ్ఞానలక్షణం బ్రసవించెన్. ౪౩౦

వ. అబ్బాలామణి వేదవతినాఁ బేరొంది దినదినప్రవర్ధమానయై శ్రీ
నాథుండు తనకుం బ్రాణనాథుండు గావలయునని తలంచి, ౪౩౧

మ. ఒకమన్వంతర మంబునం దపము నత్యుగ్రంబుగా సల్పి సా
క్షాక రూపప్రతిభావయుఃకలనఁ జక్కన్మించుచున్నట్టి బా

లికతో నయ్యశరీరవాణి తగఁబల్కెఁ "నీకు శ్రీవిష్ణు విం
కొకజన్మంబున భర్తయౌ" నని వ్రతోద్యోగంబుమాన్పింపఁగన్.

క. ఆనాదము విని తపమున్
మానక ముదమంది గంధమాదనశైల
స్థానంబునందుఁ బిదప న
నూనముగాఁ దపముసేయుచుండఁగ నంతన్. ౪౩౩

క. రావణుఁ డేతెంచుటయును
భావమునం గలఁగి యర్ఘ్యపాద్యాన్వితునిం
గావించిన బాలామణి
తో వాఁ డిటుపల్కె నెదఁగుతూహలమొదవన్. ౪౩౪

చ. కలకలనవ్వు నెమ్మొగము గార్మొగులుం దులకించు పెన్నెరుల్
తళతళ లీను మేను దెలిదామరల న్నిరసించు కన్నులున్
గలిగిన ముద్దులాడి విటు కాఁడవిన్ జడదారితీరుగా
నెలకొని యొంటిమై నిలువ నీకిది యేకత మంబుజాననా. ౪౩౫

క. ఈరీతిం బలికి తిర
స్కారమునొందియును విడువఁ జాలక వేశృం
గారక్రియ కతఁడు బలా
త్కారంబున దాని కేలుఁదమ్మి గ్రహించెన్. ౪౩౬

గీ. మానవతి దానఁ గోపంబుఁబూని వాని
స్తంభితుని చేయ హస్తపాదంబు కదల
కుండుటయుఁ జేయునదిలేక యువిద కపుడు
నతులొనర్పఁగ సాఁగె నన్నరభుజుండు. ౪౩౭

ఉ. నీదుమహత్త్వ మేనెఱుఁగ నేరక యూరక తెచ్చికొంటి నీ
ఖేదము భేదమెంచక యకృత్రిమబుద్ధిఁ దలంచి కావు ము

న్మాదిని నన్నంటించుఁ బలుమాఱు నుతించెదు రాక్షసాధమున్
మోదముతోడ బంధనవిముక్తునిఁ జేసి యనుగ్రహించియున్.

క. నను స్పృశియించిన ఫలముం
గనుఁగొనుము సబాంధవంబుగాఁగ మదర్థం
బున నీవు ద్రోహివగుదువు ముం
దని యోగముకతన దేహ మప్పుడ విడిచెన్. ౪౩౯

గీ. వెలుఁడ దేహంబు గంగ కర్పించి నిజని
వాసగృహమున కేగి రావణుఁడు మిగులఁ
దా నొనర్చినపనికి సంతప్యమాన
మానసుండయి యాశ్చర్య మూనియుండె. ౪౪౦

క. ఆమగువ జనకధరణీ
స్వామితనూజయయి పూర్వజన్మకృతతప
స్సామర్థ్యంబున దశరథ
రాముని వరియించి సుఖతరంబుగ నుండెన్. ౪౪౧

ఉ. కోమలవిగ్రహుండు రసికుండు మనోహరుఁ డుత్తముండు ను
ద్దాముఁడు శాంతిదాంతిగుణధాముఁడు లోకవిభుండునైన శ్రీ
రామునితోడఁగూడి యనురాగముతో సుఖియించుచుండె నా
భూమిజ మున్ దపంబునను బొందినవంతఁ దలంప కెప్పుడున్.

సీ. జనకాజ్ఞ రామలక్ష్మణు లరణ్యమునకు
సీతతోఁగూడి వేంచేయుటయును
విప్రవేషమున హావిర్భుజుం "డెదురుగాఁ
జనుదెంచి యోరామచంద్ర! యింక
జనకజాహరణమౌ సమయ మేతెంచెను
గాన సురల్పంపఁగా రయమున

వచ్చితి నన్ను వైశ్వానరుం డందుఁ నా
యంద సీతను డాఁచి యగ్నిశుద్ధిఁ
గీ. జేయుతఱి మీకు నర్పింతు ఛాయ దీనిఁ
గొను" మనిన రఘువరుఁ డియ్యకొని తదీయ
కృత్రిమావనిపుత్రి గ్రహించి నైజ
సీత నాతనిలోఁ నివసింపఁజేసి. ౪౪౩

క. జననాథుఁ డరుగ నొకయెడఁ
గనకమృగం బొకటి యెదుటఁ గాన్పించిన దా
నిని సీత తనకుఁ దెమ్మని
కనికర మొదవంగ రాముఁ గని పల్కంగన్. ౪౪౪

చ. జనకజఁ గావ లక్ష్మణుని శ్రద్ధమెయి న్నియమించి శాంబరీ
కనకమృగంబుఁ బట్టుకొనఁగా నతిదూరము వోయి మాయగా
మనమున యోజచేసి యొకమార్గణ మేసిన దాన 'లక్ష్మణా'
యని మొఱవెట్టి చచ్చె; జనకాత్మజకున్ హృదయంబు జల్లనన్.

క. భూమిసుతాచోదితుఁడై
సౌమిత్రి రఘూద్వహుని వెసం గనుఁగొనఁబోఁ
గామాంధుఁడు రావణుఁ డ
క్కోమలి గ్రహియించి లంకకుం గొనిపోయెన్. ౪౪౬

క. చనుదెంచిన లక్ష్మణుఁ గని
మనమున శంకించి యాశ్రమస్థలికి వెసం
జని కనికర మొదవించుచు
జనకజ లేకున్న పర్ణశాలం గాంచెన్. ౪౪౭

గీ. చూచి మూర్ఛిలి యంత నచ్చోట సీతఁ
గానక విచారమంది యక్కాననమునఁ

దిరిగి తిరిగి గోదావరీతీరమందు
వానరాధిపుతో సహవాసమంది. ౪౪౮

ఉ. సేతువుఁ గట్టి వీరకపిసేనలు గొల్వఁగ లంక కేఁగి యా
ఘాతుకుని స్వబాంధవముగా ననిఁ ద్రెళ్ళఁగ నేసి లోకవి
ఖ్యాతయశస్కుఁడై జనము లచ్చెరువంద సురల్ నుతింపఁగా
సీత కృశానుకీలల వసింపఁగఁ జేసినఁ దత్క్షణంబునన్. ౪౪౯

క. అనలుఁడు నిజసీతను రా
ముని కర్పణసేయు ఛాయ మునుకొని "యే నే
పని యొనరుతు" నన దానిం
గనుఁగొని రామాగ్ను లనిరి కరుణాన్వితులై. ౪౫౦

క. దుష్కృతహరమగు దేవీ
పుష్కరమునఁ దపమొనర్చి పుణ్యఫలం బా
విష్కృతముగ స్వర్లక్ష్మివి
నిష్కర్ష న్గాఁగలవు వినిశ్చయ మనిన్. ౪౫౧

గీ. వారి వీడ్కొని ఛాయ దివ్యంబులగు త్రి
లక్షవత్సరములు తపోదీక్ష నుండి
స్వర్గలక్ష్మియై మరలఁ దపంబుసేసి
యగ్నికుండసముద్భవయయ్యె నంత. ౪౫౨

క. ద్రౌపది నాఁ బేరొంది పృ
థాపుత్రుల కేపురకును దార యగుచు ను
ద్దీపించుచుండె జనులు మ
హాపతిరత యంచు ధరణి నభినుతిసేయన్. ౪౫౩

గీ. వరుస కృతయుగమునఁ ద్రేత ద్వాపరమున
వేదవతి సీత కృష్ణనా వెలఁదులై కు

శధ్వజ జనక ద్రుపదవిశ్వంభరాధి
పుల గృహమ్ముల జన్మింపఁగల రనంగ. ౮౫౮

క. అంగన యొక్కతె పాండవ
పుంగవు లేవురకుఁ దా నపూర్వంబుగ స
ద్ధాంగ మగు టెట్టులొకో యా
సంగతి వివరింపుమనిన జటిలున కనియెన్. ౮౫౯

క. ఓమునివర ! నిజసీతన్
రాముఁడు గ్రహియింపఁ జాయ రామాగ్న్యర్జన్
గామహరు గుఱిచి తపమును
నేమముతో సల్పి యాతనిం గని పెలుచన్. ౮౬౦

క. "పతి పతి పతి పతి పతి" యని
యతికామాతురతఁ బల్కె నతివం గని స
స్మితముఖుఁడై శితికంఠుఁడు
పతిపంచక మొసఁగితి నని పలికెన్ ప్రేమన్. ౮౬౧

క. అది కారణముగ నా ద్రౌ
పది పాండవు లేవురకును భార్యామణియై
పొదలె ; నిదియెల్ల నీకుం
బదిలంబుగఁ జెప్పవలసెఁ బ్రస్తావముగన్. ౮౬౨

సీ. లంకయందలి యచలాకన్య రాముఁడు
పేర్మి గ్రహించి విభీషణునకు
లంక నొసంగి చెలంగుచుఁ దనయయో
ధ్యాపురి కేతెంచి ధారుణీశు
లెల్లరుఁ గొలువంగ నేకాదశసహస్ర
వత్సరంబులు రాజ్యవైభవమున

వఱలి సర్వాంబుతో వైకుంఠమునకేగె
నలవేదవతి లక్ష్మి యందుఁ గలసె

గీ. వేదములునాల్గు జిహ్వపై వెలయునట్టి
వేదవతి పుణ్యకథనంబు వీను లలర
వినినవారికిఁ బాపనాశనముగాదె
మంజుగానవినోద ! యోమానినాథ. ౪౫

క. అజపుత్రి ! వినుము ధర్మ
ధ్వజభూపతి న్యాయమతియు దారుణరణరం
గజితాభియాతియై తన
విజయాంకము లెల్లయెడల వెలయించె రహిన్. ౪౬

ఉ. అర్ణవమేఖలాధిపతు లందఱుఁ దా మరిగా పులొాట సం
పూర్ణమనోరథంబునను ముద్రియతోఁ జని గంధమాదనా
భ్యర్ణసమంచితోపవనవాటికలోనఁ బ్రఫుల్లపుష్పసం
కీర్ణనికుంజపుంజముల క్రేవలఁ దావులదీవులం గనెన్. ౪౭

చ. ప్రిదులని హాళితో నచటఁ బేశలకోకిలకాకలీరవా
స్పదపదము ల్గనుంగొనుచు భామినిఁగూడి రతాభిలాషముల్
మదిని దిరంబులొాచుఁ బొడమంగ సుగంధిలపుష్పశయ్యపై
ప్రిదులనివేడ్క లుప్పతిలఁ బెక్కువిధంబులఁ గేళిసల్పుచున్.

సీ. కాసారముల మరందాసారములయందు
నారజంబున నోలలాడి యాడి
పొంపిరిగాఁబూచి యింపులునింపు సం
పెఁగల మాటునఁగేళిఁ దగిలి తగిలి
మేలిమిజాళువాడాలు చేఁ గ్రాలిన
గట్టులపట్టునఁ గలసిమెలసి

చాలుగావ్రాలిన యేలాలతల లాగి
తూఁగుటుయ్యేలల నూఁగి యూఁగి

గీ. యిట్టులాదంపతులు కుసుమేషుకేలి
కీలదందహ్యమానులై కేళులందు
సంతతామోదసంభృతస్వాంతులగుచు
వెలసి రజ్ఞాతదిననిశాభేదు లగుచు. ౪౬౩

క. ఒడల నలఁది గంధము మణి
తొడవులునుం బూని హారాయలుదూఁగఁగ నచటన్
పడఁతుకలమిన్న మాధవి
కడుముదమొనరించెఁ బతికిఁ గలయికలందున్. ౪౬౪

చ. విసువొకయింతలేక యలివేణియుఁ దాను మనోజకేళి దు
ర్వ్యసనమనస్కులై తనర నామరవర్షశతంబు జాతె ; మా
నస మెరియంగ మన్మథరణంబునఁ దృప్తినిజెందె భూపుఁ ; డా
భసలసరోజకున్ రతులఁబాయనికోర్కెలు పేరె సారెకున్.

క. సరసునితోఁ జరకాలము
సురతంబున మెలఁగి తృప్తిఁ జొప్పడకుండెన్
పురుషులకన్నను మోహము
తరుణుల కష్టగుణ మన యథార్థముగాదే. ౪౬౬

క. ఈలీల నుండ సద్యః
కాలమ్మున విధివశమునఁ గాంతామణి చూ
లాలై శతవర్షమ్ములు
దాలిచె శుభలక్షితమ్ముఁ దద్గర్భమ్మున్. ౪౬౭

మ. అకలంకగ్రహబుక్తయోగశుభలగ్నాంశక్షణంబైన కా
ర్తికపుంబున్నమ శుక్రవారమునఁ బుత్రీరత్న మొక్కర్తు బో

టికి వారాశితనూభవాంశమునఁ బుట్టెన్ దుందుభిధ్వానముల్
బ్రకటంబయ్యె దివంబునందు సుమము ల్వర్షించి రద్దేవతల్. ౪౬౮

సీ. శరదిందునిభమైన చక్కనిమోముతోఁ
గంజంబులనుబోలు కనులతోడఁ
బక్వబింబప్రభాభాసురోష్ఠంబుతో
మించులఁ దులకించుమించుతోడఁ
బల్లవారుణకరపాదయుగ్మంబుతో
భాభాసమానత్రివళులతోడ
నిందిందిరంబులనీను పెన్నెరులతో
వర్తులతరనితంబంబుతోడ

గీ. సీతున సుఖోష్ణమై, సుఖశీతలంబు
తపమునంగానునై యొప్పు తనువుతోడఁ
బరిఢవిల్లుచునున్న యబ్బాల సోయ
గమ్ము నిరుపమ మనియె జగజ్జనమ్ము. ౪౬౯

క. అచ్చెలువతోడఁబోల్ప వి
యచ్చరసతులైనఁ దగరటంచు ననువుమై
నచ్చెంతనున్న మానులు
వచ్చి తులసియనుచుఁ బేరుఁ బలికి చని రొగిన్. ౪౭౦

వ. తదనంతరంబ కాంతలతలమానికంబగు తులసి భూమిఁ బడినంత స్త్రీప్రకృతిం జేసి సర్వజననిషిద్ధయై మునిజనావాసపావనంబగు బదరికావనంబునకుం జని నారాయణుండు తనకుఁ బ్రాణేశ్వరుండై మన్నించుత మని తా భావంబున భావించుచుఁ దదేకాయత్తచిత్తయై దేవమానంబున లక్షహాయనంబులు ఘోరంబగు తపంబుఁజేయం గడంగి. ౪౭౧

సీ. గ్రీష్మంబునం దతిభీష్మపంచాగ్నిమ
ధ్యస్థయై ఫలజలాహారయగుచు
వర్షర్తువునయందు వానవంగుళ్లలో
నాసీనయై దళాహార యగుచు
వడవడ వడఁకించు వలిగాడ్పులో సీతు
వందున మారుతాహారయగుచు
నేకపాదమునఁ దదేకనిష్ఠ మనోజ్ఞ
ధారిణియై నిరాహారయగుచుఁ

గీ. దివిరి పది యిర్వదియు ముప్పదియును నల్వ
దియును వేలేండ్లు వరుసగా స్థిరతఁబూని
రాత్రియు దివమ్మునాక ఘోరంపుభంగిఁ
దపమొనర్పఁగ సాఁగె సంతప్తయగుచు. ౪౭౨

క. ఈరీతి నట తపోదీ
క్షారతయై యున్న తులసిఁ గన్గొని రహి వా
గీరమణీపతి సాక్షా
త్కారముఁగావించె వరము దయ నీయంగన్. ౪౭౩

క. ఆ జేజేపెద్దం గని
తా జేజే జేయఁగా నతం డనె సతి యే
యోజను దపమొనరించెద
వే జడియక యెడఁదనున్న వితముం జెపుమా ౪౭౪

క. హరిభక్తియైన నిచ్చెద
హరిదాస్యంబైన నిత్తు నజరామరతన్
వరియించెదేని యొసఁగెద
తరుణీ! మదిలోని వాంఛితముఁ గైకొనుమా. ౪౭౫

మ. అనుచుం బల్కిన ధాత కిట్లనుఁ బులస్త్యబ్జాక్షి “ యోహంసవా
హన ! సర్వజ్ఞుఁడవయ్యు నన్నడుగ న్యాయ్యంబౌనె ! లజ్జింప నా
కనువౌనే, యిదియెల్ల నీవెఱుఁగవే యైనంగాక నీయానతిన్
వినిపింతు న్వినుమయ్య నాదగు పురావృత్తాంత మాద్యంతమున్ .

సీ. తులసి యందురు నన్ను తొల్లి గోజగమున
గోపినినాఁ గృష్ణుకూర్మిచెలిని
రాసకేళిని శౌరిరతిభుక్తను నతృప్త
మూర్ఛితనగు నన్ను మురవిరోధిఁ
గని రాధ హరిఁ దిరస్కారంబుగావించి
కోపంబు నాయందుఁ గూర్చిమిగుల
మానవయోనిసంభవవు గమ్మని శాప
మిచ్చిన హరిదయ నెడఁదఁ దాల్చి

గీ. భీతిఁ బొందకుము మదంశజాతుఁడైన
వానినిఁ జతుర్భుజు భరతవర్షమందు
బ్రహ్మవరమునఁ దపము చేఁ బతిగఁబొందఁ
గల వనుచుఁజెప్పి చనియె నాగరుడహాయుఁడు. ౪౨౭

క. ఆదేవివలన భయమున
నే దేహము విడిచి ధారుణి జనించితి న
బ్జోదరు నారాయణుఁ బతి
గాఁ దలఁచుచు నుంటి నిచటఁ గరుణింపు నన్ . ౪౨౮

క. కాంతుని సుందరవిగ్రహు
శాంతుని నారాయణుని యశస్కరుఁ బతిగా
నెంతయుఁ గోరితి వరమి
మ్మంతఃకరణంబున న్దయంగొని ” యనఁగన్ . ౪౨౯

ఉ. అండజవాహనుం డనియె నాహరివంశభవుండు మఱి సుదా
ముండను గోపకుం డొకఁడు పుట్టెను రాధికశాపయుక్తి మా
ర్తాండసమానతేజుఁడు ధరాస్థలి భారతమందు శంఖచూ
డుండన మాధవాంశభవుఁడుం ఘనుఁడుం దనువంశజుండునై.

ఉ. వాఁడు చతుర్భుజుండు మగువా! మును గోభువనంబునందు నీ
పోడిమిఁ గాంచి మారశరపుంజవిభిన్నమనస్కుఁడయ్యె నిం
కూడఁడు రాధికాసతి గనుంగొని తన్నదలింప వీని కీ
రేడుజగంబులందు సరి యెరును లేరు జనిస్మరుల్ భువిన్. ౪౮౧

క. నీవును జాతిస్మరవై
యీవృత్తాంతంబు నెఱుఁగు దిప్పు డతనికిన్
దేవేరి వగుదు పిమ్మట
గోవిందు వరింపఁగా నగు నిది ధ్రువంబౌ. ౪౮౨

ఉ. శ్రీవరుశాపయోగమునఁ జేసి మహీరుహతాప్తి నీకగున్
నీ వెలినైన పూజ కడునిష్ఫలమౌను సుమంబులందు నెం
తో వరమౌదు, ప్రాణములతోఁ దులగాఁ దలఁచు న్మురారి బృం
దావనియంచు నిన్ను బుధజనంబులు మ్రొక్కుచు రిచ్చ నిచ్చలున్.

క. నీపత్రంబులఁ జేతురు
గోపాలకదేవపూజ గోపకులు త్రిలో
కీపావనివై నెగడుదు
దీపించెదు హరికడఁ దరుదేవ్యాకృతితోన్. ౪౮౩

గీ. నావరంబున నిన్నియు గలుగు నీకు
ననుచుఁ బల్కిన సంతోష మావహిల్ల
మోముఁదమ్మిని చిఱునవ్వు మొలకలెత్త
హంసహాయునకు మ్రొక్కుచు ననియెఁ దులసి. ౪౮౪

చ. మనమునఁ దాఁకియున్న యనుమానము దెల్పక మిన్నకుండరా
దని వినిపించెదన్ ద్విభుజునందలి నెయ్యముఁబోలె నాకునే
యనుప్రసనుం జతుర్భుజునియం దొనగూడదు మున్న శప్తనై
తిని శుచిభంగమొంది యదుదేవునిఁ గూడి రమించి సారెకున్.

ఉ. నాలుగుబాహువు ల్గలిగినన్ వరియించెద శంఖచూడునిన్
బోలునె శౌరియైన తలఁబూనక యేరికినైన ; రుక్మిణీ
లోలునిఁ బెండ్లియాడుటకు లోఁగుదు నీవరయుక్తి రాధికా
భీలభయంబుఁ జేసి యది వేగమె వాయ ననుగ్రహింపుమా.

క. అనవుడు నలినోదరుఁ డి
ట్లను గపుమోదమున షోడశాక్షరయుతమై
చను రాధామంత్రము గై
కొనుమా, యనుమానమేల కొమ్మ! యొసఁగితిన్. ౪౮౮

క. రాధకు నీకుం గలుగు న
సాధారణమైనపేర్మి ; జలజాక్షునకున్
రాధాసమాన పగుదువు ;
రాధ కెఱుఁగఁబడపు మీఁదు రతిమర్మంబుల్. ౪౮౯

క. అని యానతిచ్చి రాధా
మనువు నొసంగి కవచక్రమంబును స్తోత్రం
బును బూజాదికముఁ దెలిపి
చనియెన్ మేల్దీవనల నొసంగుచు నంతన్. ౪౯౦

క. ఆ మంత్రోపాసనమున
నామానిని తులసి సిద్ధురాలయ్యెఁ గదున్
దామరసావాసినిబలెఁ
దామరసోదరునిమహిమఁ దద్దయుఁ జెలఁగెన్. ౪౯౧

మ. త్రిజగద్దుర్లభభోగభాగ్యములచే దీపించి నిర్ఘాతఘో
రజపల్లీశయుఁ బ్రాప్తయౌవనయునై రాజర్షిమృష్టాన్న మిం
పుజనింప న్భుజియించి పై మలయజమ్ముం దాల్చి మల్లీసుమ
వ్రజశయ్యాంతరమందు సౌఖ్యమున నిద్రం జెందెఁజూ, నారదా!

మ. నిదురింప న్మది రాత్రిఁగాంచి యపుడా నీరేజబాణుం డిదే
యదనంచుం బదునైనసాయకము లేయ న్శంఖచూడాఖ్యము
న్మది నెల్లప్పుడుఁ గోరుచున్నకతన న్నారీవతంసంబు స్వ
ప్నదశం గాంచెను తత్సురారివిభు రూపత్రాసితానంగునిన్.

క. కాంచినయంతన మోహ ము
దంచితగతిఁ బొడముటయు నతం డద్దానిన్
బంచాయుధకేళిని దే
లించెన్ స్వప్నగతిఁ దెలియలే రెవ్వారున్. ౮౭౮

ఉ. అంతట మేలుకాంచి హృదయాధిపుఁ గాన కొకింతవంతయున్
సంతసముం బెనంగొనఁగ సారసలోచన మాటిమాటి క
త్యంతవిషాదముంగొను 'నహా' యను మెచ్చుచునుండు; నంతలో
నింతఘటించిపోయెఁ గుసుమేషుఁ డిఁకేమనవచ్చు నారదా!

వ. అంత నక్కాంతామణి కంతుసారంతచింతాభరంబు సహింపంజా
లక పరాధీనచేతస్కయయి. ౮౭౯

సీ. ప్రాణేశుఁ డెపుడు గన్పట్టునం చూరక
గుక్కిళ్ళుమ్రింగుఁ దాఁ గొంతసేపు
అంతలో వల్లభుం డగపడెనని బయల్
కూరిమితోఁ జూచుఁ గొంతసేపు
అటుపైఁ బరీరంభ మాచరించె నటంచు
గుబ్బ లుప్పొంగించుఁ గొంతసేపు

తరువాత సంభోగదశఁ దేల్చెదనుచు నె
క్కొను పరాధీనతఁ గొంతసేపు
గీ. ఏగెదనని తాపమందు నొక్కింతసేపు
చింతగొను సంతసంబాదు కొంతసేపు
కామకల్పితమోహాంధకారమందు
సంచరించుటఁజేసి యీసారసాక్షి. ౪౯౭

ఉ. ఒంటిగనున్న నాకడ కయో! చనుదెంచునె వాఁడు? వచ్చి న
న్నంటునె? యంటెనేని మునులందఱు దూఱరె? దూఱకుండినన్
గంటికిఁదోఁచు వానిపయిఁ గల్గిన మోహము మేలె? దైన నీ
తుంటరియౌ ననంగు ననతూపుల తీపుల కోపవచ్చునే. ౪౯౮

చ. తతమృదుమల్లికాకుసుమతల్పముఁ గాంచినయేని కంటకాం
చితముగఁ దోఁచుఁ, జెందిరము చిచ్చుగఁ గన్పడు, నాలయంబు ప
ర్వతగుహపోల్కెఁగాంచుఁ, దనవస్త్రము బర్వగ నెంచు; నెద్దియున్
వితయగుఁగాదె కూర్మివిభునింగనఁ జిత్తముగల్గు చానకున్.

చ. అటు చటులాక్షి నెమ్మనము నంటిన మోహము నిల్పలేక తా
నటమటఁబొందుచుండఁగఁ దదంతికశైలచరత్సురాంగనల్
తటుకున వచ్చి కొంతపరితాపము డిందుపడంగ నాతఁ డి
చ్చోట కరుదెంచుటల్ దెలిపి సుందరిఁ దేర్చి యేగి రంతటన్.

క. యోగియయి శంఖచూడుఁడు
జైగీషవ్యాఖ్యమౌనిసత్తమువలనం
దాఁ గృష్ణమంత్రముం గొని
యేగెం బుష్కరమునకు సమాహితబుద్ధిన్. ౫౦౧

క. అచ్చట విధాత కృపచే
నిచ్చినవరములను గొని ద్రుహిణునానతి వాఁ

డచ్చోటు విడిచి ముదమునఁ
గ్రచ్చఱ విచ్చేసె బదరికావనమునకున్. ౧౦౨

వ. అంత నావనంబునఁ దులసీలలామంబు తపంబుసేయు వనాంతరంబునకుఁ జనుదెంచె నప్పుడు, ౧౦౩

ఉ. సుందరవిగ్రహుండు పరిశోభితరత్నవిభూషణుండు సం
క్రందనవైభవుండు రసికప్రవరుండు మనోహరుండు శ్రీ
చందనచర్చితాంగుఁడు హసన్ముఖుఁడై నలశంఖచూడు నా
నందముతోడఁ గాంచె లలనామణి మోహరసాబ్ధి మున్గుచున్.

క. కని ఘనలజ్జావనతా
ననయై చెలువొందుచున్న నారీమణి స
ద్ధనుజోత్తముఁ డప్పుడు గ
న్గొని యిట్లనిపల్కె లో ననూనప్రీతిన్. ౧౦౪

ఉ. వారిధరాభవేణిముఖవైభవ మొందక కంజపుంజ మె
వ్వారినిఁ గాంచ సిగ్గుపడి వారికి మధ్యమునన్ వసించియున్
వారిధిపుత్రిరాక నలవారిజనేత్రిముఖం బటంచు కో
వారితగంధమై ముకుళవైఖరిఁ బొందుచునుండు నెప్పుడున్.

చ. రమణిముఖాంబుజాతమకరందముఁ గ్రోలెడు నిచ్చ నేగి ఘ్రా
ణమను సువర్ణసూనము గనంబడ భీతిని జెంది యుత్తమాం
గమున వసించి తచ్చరణకంజములం గని వెన్కనుండి సం
భ్రమమున నేగుదెంచు భ్రమరంబులు నాఁ దగి వేణి చెల్వగున్.

ఉ. తమ్ములసూడు మోము, కుముదంబులజోడు కనుల్, మెఱుంగుట
ద్దమ్ముల కీడు చెక్కు, లడిదంబుల గోడు నడంచు నారు, చిం
దమ్ములతేఁడు కుత్తుక, పదమ్ముల కోడు ప్రవాళ, మిట్టియం
దమ్ములప్రోడ పూర్వసుకృతమ్మున నాకు లభించె నేఁడిటన్.

వ. అని యనేకభంగులం గొనియాడి తత్సమీపంబునకుం జని జిఱు నగ వంకురింప మెల్లన నిట్లనియె. ౯౦౯

ఉ. ఎక్కడిదానవీవు ? కులమెయ్యది ? నీతలిదండ్రు లెవ్వ ? రీ
వెక్కడ నొంటిమై నిలువ నేమిప్రయోజన ? మెట్టిచోటు నీ
యిక్క ? దదెం జరించు చెలు లెవ్వరు లేరదియేమి కారణం ?
బిక్కతమెల్లం దెల్లముగ నింతయు డాంపక తెల్పు మంగనా.

క. అన సాధ్వి యిట్లనియె "దను
జనాథ ! ధర్మధ్వజాఖ్యజగతీపతికిన్
దనయను నారాయణుని బ
తినిగాం దలపోసి చేసితిని దప మిచటన్. ౯౧౧

క. భూమీశుండవని పలికితి
మోమోడక యింతవట్టు పురుషులతోడన్
రామామణు లేకతమున
నేమాటలు పల్కనేర్తు రే, యిదితగు నే! ౯౧౨

ఉ. కోమలి సత్కులీనయగు కొమ్మ వివిక్తతలమ్మునన్ గుల
గ్రామణియైన పూరుషుండు గన్గొనంబోవునె ? పోయెనేని యా
భామినితోడ వేఱొక నెపంబిడి పల్కునె ? దుష్టవంశజు
ల్గాముకులైనయట్టి పలుగాకులంబోలె, సురారిసత్తమా. ౯౧౩

వ. ఇదియునుంగాక స్త్రీజనం బతిగర్హితంబు; ప్రాజ్ఞుండగువాండు స్త్రీ జనాధీనుండు కానేరండని పలికి మఱియును, ౯౧౪

ఉ. " మంతనమందు మానినుల మచ్చికసేయంగరాదు, చేసెనే
నెంతయు భీతిమాలి పతి హేళనసేయు దురాత్మకార్యము
ల్చింతనసేతు, రెప్డు నిరసింతురు కాంతులమాట, వింతలే !
యింతులకున్ మగండు చనవిచ్చినతోడనెనెత్తికెక్కుటల్ !

ఉ. కామిని పొందు లేనియెడ గ్రౌర్యముఁ గోపముఁజూపు ; విస్ఫుట
త్తామరసాక్షి సూక్ష్మసురతంబున మిక్కిలి దుఃఖమందుఁ ; గాం
తామణి గాఢమౌ నిధువనంబున సంతసమందు ; నద్దిరా !
భామల కెద్దియు న్సురతభాగ్యముకన్నను దక్కువేకదా. ౫౧౬

క. ఎలఁబ్రాయము సౌందర్యముఁ
గలిమియు రసికతయు సురతకౌశలముఁ గళల్
గలిగిన మగనిని ప్రాణం
బులతో సరిఁజూచెదరు ప్రఫుల్లాబ్జముఖుల్. ౫౧౭

క. ముదుసలి, సురతాక్షముఁ గని
ముదితలు నెపముంచి కలహమును బెంచి సదా
పదరుదురు ; నరుల కింతుల్
గద, కష్టసుఖంబులీయఁ గారణభూతల్ ! ౫౧౮

క. సారసగంధికి మిత్రులు
వైరులు గలరే ! వినూత్ననరు ననుదినముం
గోరుచునుంద్రు సతీత్వా
చారంబులు వెలికిఁదోఁప సంప్రీతిమెయిన్. ౫౧౯

ఉ. జవ్వని కాత్మలో నితఁడు చక్కనివాఁడని తోఁచెనేని తా
నెవ్విధినైన వాని వరియింపఁదలంచును గాని బంధువుల్
నవ్వుదురో, మరేమనునొ నాథుఁడు, లాఁతులుదూఱరో క్కా, యే
నెవ్వము గల్గునో ? యని గణింప దొకించుక రాక్షసోత్తమా.

క. కార్యముగలయప్పుడు పరి
చర్యలుగావించి విభుని సమ్మతిగా సౌం
దర్యము ధరించి తలఁచిన
కార్యంబగుఁబిదపఁ దృణముగాఁ గంద్రు చెలుల్".

వ. అనవుడు.

ఉ. ఇందునిభాస్య నీవు వచియించిన పల్కులవెల్లఁ గల్లగా ;
వందువిశేషముండె జనులందఱు మోహపడంగ ముద్దుశతా
నందుడు సృష్టిఁజేసె లలనాజనరూపము రెండురీతులన్
బొందుగ మంచిచెడ్డలను బోల్చి గ్రహించిన యుక్తి మిమ్మహిన్.

గీ. రాధ సావిత్రి లక్ష్మి సరస్వతియును
దుర్గ మున్నగునట్టి సతులు విధాత
చేత నిర్మింపఁబడి రాదిసృష్టియందు
అఖిలమంగళసంధాత్రులగుచుఁ దరుణి. ౫౨3

క. వీరలకళచేఁ బుట్టిన
స్త్రీరూపము మంచిదని వచింతురు విబుధుల్
వారల వేర్వేఱుగ నే
నారసి చెప్పెదను విను సమాహితబుద్ధిన్. ౫౨౪

సీ. తార మందోదరి దమయంతి మేన వే
దవతి కాళిక యరుంధతి యహల్య
శతరూప దక్షిణ స్వాహా ఛాయావతి
శచి దేవహూతి యనసూయ యదితి
వరుణాని తులసి లోపాముద్ర కోటభి
దితి రోహిణియు పతివ్రతలు ; మఱియు
గంగ ధరిత్రి మంగళ చండి స్మృతి మేధ
ప్రభ శోభ కీర్తి సంపత్తి శాంతి

గీ. క్షాంతి నిద్దుర క్షుత్పిపాసలు దినంబు
పుష్టి తామసి కాంతి సంతుష్టి శ్రద్ధ

యనెడు నివియెల్ల స్త్రీరూప మందినవయి
యుగయుగంబునఁ జరియించు నుత్తమగతి. ౧౨౬

వ. అది గావున.

ఉ. పండితుఁ డుత్తముండు పరభామను గోరునె యెన్నఁడైన నో
యండజయాన ! యానలువ యానతి వచ్చితి, నేను శంఖచూ
డుండను రాక్షసేంద్రుఁడఁ ; గడు న్ముదమారఁగ నిన్ను నిచ్చటం
బెండిలియాడఁగోరితిఁ జుమీ ! మది సంశయము ముజ్జగింపుమీ.

క. తొలిపుట్టువున న్విష్ణువు
కలచేత సుదాముఁడనఁగ గణుతింపంగా
నలరితి గోపకులంబునఁ
బొలతిండిని రాధశాపమున నిపుడైతిన్. ౧౨౭

క. మును నీవు తులసి వాకృ
ష్ణుని చే సంభుక్తవగుటఁ జూచి మనమునం
గినుక వొడమ రాధిక భువి
జనియింపఁగ శాప మపు డొసంగెను నీకున్. ౧౨౮

వ. అప్పుడు నీయందు బద్ధానురాగుండనయ్యును రాధికాభయంబున
నిన్నుఁ గలయనైతి ; నివియెల్లఁ గృష్ణమంత్రప్రభావంబ ; యే
నెఱుంగుదు నీవును జాతిస్మర వగుటం జేసి యీ వృత్తాంతం
బంతయు నెఱుంగు దనవుడు, ౧౨౯

గీ. మగువ పిన్న నవ్వు నగి యిట్లనియె దాన
వేంద్ర ! కామవశత నివ్విధమునఁ
దెలివికల్లువాఁడు స్త్రీజితుం డగునయ్య !
యైన శుద్ధుఁ డందురయ్య వాని ! ౧౩౦

చ. అమలమనస్క ! విప్రుఁడు దశాహమునన్, క్షితిభర్త ద్వాదశా
హమునను, నూరుజుండు పదునైదవప్రొద్దునఁ, బాదజుండు మా
సమునను శుద్ధిఁజెందుదురు జాతమృతమ్ముల ; నంగనాజితుం
డనులినుఁడౌఁ జితాదహనమందని పెద్దలు సెప్ప విన్బడున్

గీ. స్త్రీజితాబగు నెవ్వనిచిత్త మాతఁ
డిడిన పిండోదకంబుల నిచ్చఁగొనరు
పితరు ; లమరులు పూజాదివిధులఁ గొనరు
జపతపోజ్ఞానవిద్యాయశంబు లున్న. ౫౩౨

ఉ. హీనున కంగహీనునకు వృద్ధున కామయదుష్టదేహి క
జ్ఞానునకుం దరిద్రునకు షండున కంధునకుం బరాంగనా
ధీనునకుం బ్రకోపికిని దీనునకుం దనకన్య నిచ్చు న
మ్మానవుఁ డొందు నుర్వి నవమానము రౌరవముం బరంబునన్.

క. శాంతునకున్ వర్ణికి గుణ
వంతున కనురూపరూపవైభవునకు ధీ
మంతున కాత్మజ నిచ్చిన
సంతసమున వాఁడు గను దశక్రతుఫలమున్. ౫౩౪

మ. మనుజుం డెవ్వఁడు కూఁతు నమ్ముకొని సంపాదించు విత్తంబు వాఁ
డనిశంబున్ యమకింకరాహతుల హాహాకారముం జేయుచు
న్నెనువంతంబడు భీకరంబయిన కుంభీపాకమందుం బున
ర్జని దుస్తాపయపీడితాంగుఁడయి మాంసం బమ్మి జీవించెడున్.

వ. ఈప్రకారంబున నొండొరులు వివాదంబుచేయు చక్కటికి వేల్పు
పెద్ద విచ్చేసి వారలం గనుంగొని ౫౩౬

మ. దనుజాగ్రేసర ! వాదమేటికిఁక గాంధర్వంపుఁ జందాన నీ
వనితం బెండిలియాడు మిర్వురకు దాంపత్యంబు మేలౌ సతీ

జనరత్నంబగు నాలతాంగి పురుషశ్లాఘ్యుండ వీవున్ హాతా
జ్జనితంబైన ఫలంబుఁ బోవిడిచిరన్ సౌఖ్యంబు చేకూరునే. ౫౩౮

క. ఏల పరిక్షించెదవో
బాలామణి ! యిట్టి సుగుణవంతునిఁ బతిగా
నేలోకంబునను గనం
జాలవు వరియింపు మితనిఁ జాలమిఁ కేలా. ౫౩౯

చ. గణపతిపుష్టి, యయ్యదితి కశ్యపుఁడున్, జ్వలనుండుస్వాహ, రో
హిణి శశియున్, శచీసతి మహేంద్రుఁ, డహల్యయు గౌతముండు, ధా
రుణియు వరాహమూర్తియు, నరుంధతి మత్సుతుఁ డట్లు వీరలున్
గణనవహింతు రీకు పతి కాఁగలఁ డాహరియుం బుసజ్జనిన్.

గీ. వనిత యూఱడు మింక శోభనముగల్గు
నాదు వచనంబు వితయగు నా యటంచు
దీవనల నిచ్చి చనియె వాణీవరుండు
భావజాతార్తి దైత్యభావంబు జెందె. ౫౪౦

క. అందములపోఁడయగు తుల
సిం దానవచక్రవర్తి చిత్తములో నా
నందముమీఱఁగ నప్పుడు
గాంధర్వవిధి న్వివాహకౌతుకమొనఁగెన్. ౫౪౧

క. ఆసమయంబున నాకని
వాసులు గురిసిరి ప్రసూనవర్షము గంధ
ర్వసముదాయము నాట్యము
చేసెను దుందుభులమ్రోఁత చెలఁగెను బిట్టై. ౫౪౨

ఉ. అంతట శంఖచూడదనుజాధిపుఁ డంగనచేయిపట్టి త
త్ప్రాంతకిసాలజాలకలతాంతనితాంతవిభాసిబంభరా

శ్రాంతవితాయమానహృదయంగమగానవిలోలవృక్షవా
ట్యంతరభాసమానమగునట్టి లతాగృహసీమఁ దారిచెన్. ౧౪౩

క. తారిచి యంగాలఁ దత్పను
వారంబుల నొక్కసెజ్జ భద్రముగాఁగన్
వే రచియించి తటాలున
నారీమణిఁ జేసెఁ గురువున న్వసియింపన్. ౧౪౪

చ. కురువునఁ జేర్చి యంత నెఱికొప్పుపయి న్సవరించి కమ్మపూ
సరులు ఘటించి చెక్కులఁ బసందుగ లేనెలవంకలుంచి మో
విరసము గ్రోలి సిబ్బితిని వీడిచి మై పులకింపఁగాఁ గళల్
కరముల నాటుచుం బడఁతుకం గరగించెను మించుపల్కులన్.

ఉ. పమ్మిన కూర్మి దానవుఁడు పార్వణచంద్రముఖిం బిగాన గా
ఢమ్ముగఁ గౌఁగిలించి ప్రకటంబుగ వాతెఱ మద్దొనర్చి యా
కమ్మవిపాటివాని బలుకయ్యమున న్సుఖియించె నెడ్డకున్
సమ్మతిమైనపొల్కి నెఱజాణతనంబునఁ గోర్కి దీఱఁగన్.

ఉ. అత్తఱి నత్తపస్వి నిరతాంతమునం గనుమూసి యొంతయున్
జిత్తము రిత్తమైతనరఁ జెందెను మూర్ఛ నతండు లేచి యా
బిత్తరి తాళవృంతములవీవఁగ మెల్లన మూర్ఛఁదేఱి తాఁ
జిత్తహరుం గనుంగొని వసించె పునారతి కిచ్చగించుచున్. ౧౪౭

మ. అవునా, గాఢరతిన్ శ్రమింపడఁగఁ జేయం గాంత! నన్నించు నా
నవలారత్నము ధీరత న్మనములోన న్మెచ్చి పుంభావకే
ళి వొనర్చెన్ చలదున్నతస్తనచలల్లీలామణీహారకాం
తవదగ్నోజ్వలనేత్రకోణయయి యాత్మ న్నాథుఁ డగ్గింపఁగన్.

క. ఇటు లవ్వీరాయిత ము
క్కుటిలాలక తానొనర్చి కొండొక వడికిన్

దటుకున వా్రెలెను తామ
స్యటు పేరురమంచు మాలికాకృతి దోఁప\న్. ౧౪౯

ఉ. ఆతరుణీలలామయు సురారియు నవ్వనవాతపోతని
ర్ధూతరతిశ్రమాంబులయి తోరపుఁబ్రీతి మనంబు లూరఁగా
ద్యోత మొకింత పోఁకని మధువ్రతకోకిలమంజుగీతికా
స్వీతరసాలసాలసరణిందగు గొజ్జఁగినీటికాలువ\న్. ౧౫౦

చ. కనుఁగొని లేచి యయ్యసుర కామినికిం గయిదండ యిచ్చి మె
ల్లన నడిపించుచో వనివిలాసములెల్లను గానిపించి క
మ్మని వలిపెంపుఁదెమ్మెర సుమాళముగా శ్రమ నార్ప నాసర
మ్మును దఱియంగవచ్చి దరి బోటిని నిల్పి ముదాన నిట్లనె\న్.

క. కొమ్మా! యల్లది కాంతే
తమ్మెద యాతమ్మిలో మధువు నాని వెస\న్
గొమ్మని యళి కందిచ్చుట
జుమ్మని తా రొదనుఁజేయుచుం బ్రియమార\న్. ౧౫౧

క. అదె జక్కవఁ గనుగొంటే
పదముల నొకతమ్మిమొగడపై నిడి మోదం
బెదఁగదురఁగ నొకతమ్మిం
బదిలంబుగ మధువు నానుఁ బద్మదళాక్షీ. ౧౫౨

క. లలనా! యీసదిలోపల
జలకం బాడుదమె మధురసలిలాంతరకే
ళిలలద్భృంగీవిరచిత
కలనాదంబులు వినంగఁ గడుఁ బ్రియమయ్యె\న్. ౧౫౩

ఉ. ఆనలినాక్షి వల్లెయని యప్పుడు తామరపాకు గోరఁ బూఁ
దేనియ నించి తెచ్చి కరదీపితమంజులరత్నకంకణ

ధ్యానము వీనుదోయికి ముదంబొదవఁగ సిర సంటి యంత నె
మ్మేను సరోజపాంసువుల మెల్ల నలుంగిడి ప్రేమమీఱఁగన్.

క. జాసగు గొజ్జఁగి నీటం
దానంబాడించి నెరుల తడియొత్తి సుగం
ధానూనధూపమున నా
మానిని దా నోరసిక సుమంబులజుట్టెన్. ౧౧౬

క. శిస్తుగఁ దిలకము నుదుటను
గస్తురిచే నుంచి మేనఁ గలప మలఁది మే
ల్వస్తులు కట్టఁగ నిచ్చి ప్ర
శస్తమణీభూషణములు చక్కఁగ నునిచెన్. ౧౧౭

గీ. లలన యాగతి మగని నలంకరించి
యొక్క యెలమావిక్రిందఁ గూర్చుండఁజేసి
మజ్జన మొనర్చి తానును మరలివచ్చె,
అంగజుఁడు సానఁబట్టిన యమ్మునంగ. ౧౧౮

సీ. తడియార్చి నెఱుల క్రొమ్ముడివైచి వాసించు
మొగలిపూరేకుల ముడిచి చుట్టి
కులుకుచన్గొండలఁ గలపంబుఁ దాలిచి
జిలుఁగుపైఠాణికంచెలను దొడిగి
హారంబు మెడ నంగహారంబు మేన కే
యూరముల్ రెండు బాహువుల నుంచి
బంగారు రంగారు చెంగావిపుట్టంబు
సింగారమార వాసిగ ధరించి

గీ. తళుకుఁజెక్కుల మకరికల్ కులుకఁజేసి
కనుల కాటుకయును దిలకంబు నుదుట

నడుగుఁదమ్ముల లాక్షయు నవధరించి
సరసిదరినుండి సరసుని సరస కరిగె. ౫౫౯

చ. చని హృదయేశు సాఘ్రిలకు సాఁగిలిమ్రొక్కి ప్రియుఁ బలర్ప నీ
వనముననున్న తేనెయును బండ్లను దెచ్చెద నారగింతువే
యనపుడు వల్లెయన్న జలజాయతలోచన యవ్వనస్థలిన్
బనుపడి పూవుఁదేనియలుఁ బండ్లను దెచ్చి యొసంగెఁ జెచ్చెరన్.

క. తెచ్చియొసంగిన పండ్లను
నచ్చపుఁదేనెయును వారిజాక్షియుఁ దానున్
మచ్చికతోఁడుత నచ్చట
ముచ్చటదీఱఁగ నపుడు భుజియించి రొగిన్. ౫౬౧

వ. అనంతరంబ శంఖచూడుండు తులసీరమణీమణితో, ౫౬౨

ఉ. ఓచపలాక్షి! యింక నిట నుండఁగ నేటికటంచుఁ బల్కి వే
లేచి ముదాన డాకరము లేమభుజంబున నుంచి చూచితే
లోచనపర్వ మయ్యె వనిలోఁగల చోద్యములంచు దట్టమై
పూచిన పూవుటీరములపొంతనె పోవుచు నేర్పుమీఱఁగన్.

సీ. పరభృతత్రోటీవిపాటితపాటలీ
కోరకంబులఁ దేనె కురియునెడలఁ
గమ్మనితావులు గుమ్మరించుచు వలి
తెమ్మెరల్ వీతెంచు తెరువులఁ జని
మదముమీఱిన తేటికొదమల జిలిబిలి
రొదల నింపగు పూవుఁబొదలు దూఱి
కపురంపుటనఁటి చొక్కపుదుమారంపు మొ
క్కలపుఁదిప్పల సరాగముననెక్కి

గీ. కలువరామానికంపుఁజెక్కడపుఁబనుల
నిద్దమైయొప్పు సానడియొద్దఁ జేరి
చివురుకైదువుపాదుపా చెయ్వులందు
సుదతి నలరించె నాశంఖచూడుఁ డనఘ. ౫౬౪

క. ఇటులే దినదిన మట న
చ్చటులాలకఁ గూడి సురతసౌఖ్యాబ్ధిసము
త్కటమతితో నుండఁగ నం
తట నొక మన్వంతరంబు తటుకున దాఁటెన్. ౫౬౫

ఉ. వెండి యనంతవిక్రమము పేరిచి యాపొలదిండి దండిమై
భండనమాచరించి బుధవల్లభుఁ బాఱఁగఁదోలి మానిమా
ర్తాండవితాయమానసవనాగ్నుల నాఱిపి హవ్యముల్ సము
ద్దండగతిన్ హరించి మునితల్లజులన్ వడిఁ జెండి యార్చుచున్.

ఉ. ఆకలుషాత్ముఁ డాత్మఁ గొలయంచుఁ దలంపక క్రొవ్వి యేర్చి నా
నాకులకాంతలన్ జలమునం గొనితెచ్చి తదీయబాంధవుల్
శోకమువెల్లువన్ మునుగుచుం బఱవం జెఱసాలనుంచి చీ
కాకుపడంగఁజేసెను జగంబును బెల్లగుదుండగంబునన్. ౫౬౭

చ. మనమున నించుకేని నెఱి మాని మగంటిమి దిక్కులెల్లపన్
గనుఁగొనఁ దానయాచుఁ ద్రిజగంబుల నేచుచునుండఁగా సురల్
దనుజు జయింపలేక ధృతి తద్దయుఁదూలి హృతాధికారులై
వనరుచు ధాతఁ గన్గొన జవంబున నేగిరి పాదచారులై. ౫౬౮

చ. చని యనిమేషు లవ్విధిహజారముముంగిట ద్వారపాలురన్
గనుఁగొని ధాతయానతిని గైకొని లోనికి వేగఁబోయి ధా
తను బొడఁగాంచి తచ్చరణతామరసంబులకున్ జొహారు జే
సి నిలిచి భక్తిదోఁపఁగ వచించిరి వారు విషణ్ణచిత్తులై. ౫౬౯

మ. ప్రమదారంభుఁడు శంఖచూడుఁడను దేవద్వేషి క్రూరుండు దు
ర్దమదోర్దర్పమెలర్పఁ గయ్యములఁ గోదండోరుశింజాధ్వనిన్
సుమనస్సంఘము పీఁచమాఁచి బిడౌజున్ వీఁక నిర్జించి తా
నె మహారాజయి మాఱులేక మెలఁగు న్స్వారాజసింహాసనా.

సీ. చరియించు నొకవేళ సురరాట్తరంగిణీ
పరిసరవాలుకాపదములందు
విహరించు నొకమాఱు వివిధరత్నప్రభా
స్వరహిమశైలకందరములందుఁ
గ్రీడించు నొకతూరి బృందారకీగాన
బంధురనందనోపవనసరణిఁ
ద్రిమ్మరు నొకసారి ఋత్విగ్వషట్కార
కలనాసవనవాటికలకుఁ జెంత

గీ. అచ్చటఁ జరించువారు వెన్నిచ్చి పాఱఁ
దోలి కంటకింపగు వెలంపులను గడిమి
బట్టుకొని తెచ్చి చెఱసాలఁ బెట్టి పొందుఁ
గఱకు రక్కసి యొదఁ గనికరము మాలి. ౫౨౧

ఉ. అమ్మయి నుక్కుమీఱి సకలావనిభాగములందు హాళిమై
ద్రిమ్మరుచుండి జన్న మొనరించెడిచోటికిఁ బోయి బల్మి హ
వ్యమ్ము హరించి యడ్డపడువారల బమ్మెరవోవఁ గ్రుమ్మువాఁ;
డిమ్మెయిఁ దాళువార మిఁక నెద్ది యుపాయము పద్మసంభవా.

చ. కఱదల నెన్నియేఁ గఱచి క్రాలెడు నాపొలదిండిధాటికిన్
వెఱచి కడిందియూ నతని వేరముఁ దక్కి నినుం గనుంగొనన్
బఱచి యిటేఁగుదెంచితి మపారకృపామతిఁ బ్రోవకున్న నె
త్తెఱఁగున నుండు మింకెవరుదిక్కు మహాత్మ! వచింపు నావుడున్.

చ. చిఱునగ వాననాబ్జమునఁ జెన్నువహింపఁగ నల్వ పల్కె, నే
నెఱుఁగుదు శంఖచూడు నతఁ డేచి బుధావళి నొంచుచుంట యే
నెఱుఁగుదుఁ గాని యాదనుజునిన్ వధియింపఁగఁజాల మాయలం
గఱచినవాఁ డనేకము లఖండపరాక్రముఁ డాహవంబులన్.

చ. వెఱవకుఁ డీరు డెందముల వేరముఁ దక్కుఁ డుక్కుమీఱి యె
త్తెఱఁగుననైన వానిని వధింపఁగ నాత్రిపురాంతకుండ పో
నెఱిగలఁ డాతనిం గనిన నెవ్వగ లన్నియుఁ దీర్పఁజాలు నే
త్తెఱఁ జనుఁ డింక నేను జనుదెంచెద శంకరుపాలి కింతలో.

వ. అనవుడు,

క. "దేవరతోఁ జనుదెంతుము"
నా వల్లెయటంచుఁ బల్కి నానామణిశో
భావిభ్రాజితమగు తన
యావాసము వెడలె నిర్జరాగ్రసరుఁడై, ౧౭౬

వ. ఇట్లు కృత్తివాసోదిదృక్షాతత్పరుండై. ౧౭౭

మ. జలజప్రోద్భవుఁ డంతఁ గన్గొనియె శశ్వచ్ఛర్వపీఠాకుహూ
హాలనిస్తంద్రగతాగతాఖిలమునీంద్రావళ్యుపన్యాసమున్
ఫలితోత్ఫుల్లకిసాలితావనిజసంవాసంబు విద్యాధరీ
లలితాంగీక్రియమాణనర్తనసముల్లాసంబుఁ గైలాసమున్.

శా. నీరేజాతభవుండు తద్గిరి బుధానీకంబుతో మెల్లనన్
జేరంబోయి తదగ్రభాగమున నక్షీణప్రభాభాసుర
స్ఫారత్నోరువితర్దికాంతమున లీలం గౌరితో నర్మవా
చారంభం బొనరించు నీశ్వరుని విశ్వారాధ్యునిన్ గన్గొనెన్.

ఉ. కాంచి విరించి నిర్జరనికాయముతోఁ దనమోడ్పుకేల్నిటా
లాంచితముం ఘటించి శివు నంఘ్రియుగంబులకున్ జోహారు గా

వించి నుతించి నిర్జరుల వెగ్గలపాటును విన్నవింప నా
లించి విరించితో ననియె లేనెలదాల్పు ముదంబుమీఱఁగన్.

క. సారససంభవముఖబృం
దారకవరులార ! దనుజు దండింపంగా
నేరను ; నేనును వచ్చెద
నారాయణు దర్శనం బొనర్పఁగఁజనుఁడీ. గి౮౧

లయగ్రాహి. వార లటులేగి ముదమార హరిపత్తనపు
ద్వారమును జేరి యటఁ జారుమణిమాలా
హారులను స్మేరముఖసారసులఁ జక్రదర
ధారులను ధీరుల నుదారుల మనోజ్ఞా
కారులఁ జతుర్భుజుల మేరుధరణీధ్రసమ
ధీరులను శ్యామలశరీరులను రమ్యా
చారులను శౌరి ప్రతిహారులను జూచి విధి
జేరి తనరాకకును గారణము దెల్పెన్. గి౮౨

గీ. తొడరి వారల యనుమతి వడిసి యచట
కడమ పదియారు గవకులు గడచి చనియె ;
భూతపతిముఖ్యదేవసమేతుఁడగుచు
ధాత వారల కభయప్రదాత యగుచు. గి౮3

మ. శతపత్రప్రతిపక్షరత్నమయకక్ష్యాభాగముల్ గాంచనాం
చితసోపానపరంపరాకలితరాజీవాప్తమాణిక్యముల్
దతవిస్ఫూర్జితసిలరత్నఖచితస్తంభంబుఁ జంద్రాభముం
జతురశ్రంబును బూర్ణకుంభయుతమౌ సౌధంబునం దొక్కచో.

సీ. పొందమ్మిరుచిఁ బోలి యందమైతగు పద
ద్వంద్వంబు సిరి కేలఁ బట్టియొత్తఁ

బులుఁగురా రా కడెంబులు ఘల్లురనిమ్రోయ
వలచేత గంగ వీవనలు వీవ
నెలనవ్వు మోమున మొలకలెత్తఁగఁ బల్కు
బోఁటి కప్రింపుఁదాంబూల మొసఁగ
పదనూపురధ్వనుల్ పాదల నచ్చరబోంట్లు
నర్తనాదికములొనర్చుచుండ
గీ. నవ్యమాణిక్యసింహాసనంబునందు
వేడ్క మీఱఁగఁ గొలువున్న వేదవేద్యు
భక్తలోకసంరక్షణభద్రదీక్షు
శౌరిఁ గన్గొనె విధి బుధసహితుఁ డగుచు. ౫౮౫

చ. నలువయు వేల్పులున్ శివుఁడు నైజవినూత్నకిరీటరత్నకాం
తులు జలజాక్షునంఘ్రులకుఁ దోరపుఁ గానుకలుగా నొసంగి మై
పులకలు గ్రమ్మ బాష్పజలపూరితలోచనులై సగద్గదా
వలితశిరోధులౌచు నిలువంబడి రందఱు విన్నఁబాటుతో. ౫౮౬

క. పలుకంగ నేమి తోఁచక
నిలువంబడియున్న వేల్పునికరముఁ గని యా
జలజాతోద్భవుఁడు కృతాం
జలియై వచియించె నిట్లు శార్ఙధరునితో. ౫౮౭

శా. పాపారణ్యకుఠారదంఘ్రినలినా! భావత్కారుణ్యపి
ఝాపీయూషరసంబు మా రజము నిస్సారంబుగా నాటిపెన్;
నీపాదాబ్జనఖైందవప్రభలు ఖండించెన్ దమంబున్ సుఖం
బాపూర్ణంబగు నింక నీమధురవాచామాధ్వి విన్నంతటన్. ౫౮౮

క. అని సన్నుతించి తా మా
దనుజునిచేఁ గన్న దీనదశ నెఱిఁగింపన్

విని సర్వజ్ఞుండగు హరి
వినిపించె న్సురల కసురవిధ మతికరుణన్. ౧౮౯

క. ఉరుబాహుబలుండగు క
ర్బురనాథుఁడు చేయుకార్యముల నెఱుఁగుదు నో
సురలార ! యైన వానిం
బరిభవ మొనరింప నాదు భక్తుండగుటన్. ౧౯౦

ఉ. ఆరజనీచరేశ్వరుఁ డనన్యవిజేయుఁడు గాన వాని నీ
మారహరుండు దున్పఁదగు మామకశూలముచేతఁ గావున
న్నీరిఁక దుఃఖమందకుఁడు మేల్సమకూరు నటంచు వారిఁ దా
నూఱడిలంగఁ జేసి హరి యుగ్రగున కిచ్చెఁ ద్రిశూలమ త్తఱిన్.

గీ. ఇచ్చి సురలార ! వేగమ యేగుఁడింక
నేను బ్రాహ్మణవేషమ్ము నూని వాని
నడిగి కొని తెత్తు మున్ను నే నిడిన కవచ
మంత వధ్యుండు మీకగు నద్దనుజుఁడు. ౧౯౨

వ. అదియునుంగాక వానిభార్య కెన్నండు సతీత్వహాని సంభవించు
నప్పుడ వాని మరణంబు తటస్థించుఁ గావున మదీయంబగు తేజం
బు తద్గర్భంబున నిక్షేపింపవలయు. ౧౯౩

గీ. అనుచుఁ బల్కిన సంతోషమంది కృత్తి
వాసుఁ డాశూలముం గొని వనజసంభ
వాదిసురసంఘములతోడ నరిగె దైత్య
నాథు నాశంబుకై జతనములొనర్ప. ౧౯౪

ఉ. దానవు సంహరింపఁ బ్రమథప్రభుని న్నియమించి తా యథా
స్థానముఁ జేరె ధాత దివిజప్రవరు ల్జని రంత పుష్పభ

ద్రానదియొడ్డున న్వటధరాజముక్రింద వసించి శంభుఁడా
దానవనాథుపజ్జ కుచితంబుగఁ బంపెను దూత నొక్కనిన్.

వ. వాఁడు నతిత్వరితగమనంబునఁ దత్పట్టణంబుఁ జేరం జని. ౧౯౬

సీ. దశపంచయోజనదైర్ఘ్యవైశాల్యంబు
విపులస్ఫటికయాన వేష్టితంబు
నతిదుర్గసప్తఖేయాసమంచితమును
సముదగ్రతరవప్రసప్తకంబు
తతరత్నవీధీశతకభాసమానంబు
సద్వస్తుయుతవణిక్సౌధచయము
సిందూరసన్నిభోచితరత్నఖచితది
వ్యాశ్రమకోటిసమన్వితంబు

గీ. సతతఫలభూరుహావితానసంయుతంబు
లలితవిహగాళికూజితకలకలంబు
నయుతకింకరరక్షితం బగుచు మిగుల
డంబువిరాజిన తత్పట్టణంబు నంను. ౧౯౭

సీ. పూర్ణేందుమండలస్ఫూర్జితాకారంబు
పరిఘాచతుష్కవిభ్రాజితంబు
సుహృదావళీమహాసుముఖప్రవేశంబు
దుర్హృత్ప్రవేశసుదుర్గమంబు
రమణీయశృంగవిరాజితాభ్రతలంబు
ద్వాదశద్వారవిభాసితంబు
మాణిక్యకాంచనమండలీమండిత
సుందరతరలక్షమందిరంబు

గీ. రత్నసోపానసంచయరంజితంబు
మణిమయస్తంభశతకసమన్వితంబు
నగుచుఁ జెలువొందు నారాచనగరి కరిగి
ద్వారపాలకు నాజ్ఞ లోపలకుఁ జనియె. ౫౯౮

మ. తనరారందగు భృత్యుఁ డొక్కరుఁడు శ్వేతచ్ఛత్రముంబట్ట వీ
వనల న్వీవఁగఁ బార్శ్వదు ల్బుధులు విద్వాంసుల్ బరివేష్టింప వీ
రనికాయంబులు కేరివలం గొలువఁ దోరం బొప్పఁగా రత్నకాం
చనపీఠంబున నున్న దైత్యపతి పజ్జంబోయి వాఁడిట్లనెన్. ౫౯౯

క. దానవనాయక యే నీ
శానుని యానతి గ్రహించి చనుదెంచితి నా
పై నేరముంచ కిప్పుడు
మానుగ వినవలయు నాదు మాటలు గూర్మిన్. ౬౦౦

శా. హారిక్షేత్రాల మొసంగి రక్షణముకై యాజ్ఞప్తి నీయంగ నీ
శ్వరుఁడే తెంచెను బుష్పభద్రకడకున్ స్వారాజ్య మీ విప్పుడే
సురసంఘంబుల కిచ్చి వర్ధిలుము రక్షోనాథ ! కాదేని సం
గరరంగంబున నీయొడ ల్జిదిమి జక్కంజేయు నిక్కంబుగన్.

గీ. అనిన దూతపల్కు లాలించి నవ్వుచు
నెల్లి వేగ నే మహేశుకడకు
నరుగుదెంతుఁ జనుమి యనఁగ వాఁ డంతట
నేగె శంభుఁడున్న యేటి కడకు. ౬౦౨

వ. ఆ సమయమున

మ. అల సేనానియు వీరభద్రుఁడు విశాలాక్షుండు బాణుండుఁ బిం
గళనేత్రుండు వికంపనుండును మహాకాయుండు భద్రుండు బా

ష్కలుఁడుం దుర్జయుఁడుం గుటీచరుఁడు దుర్గమ్యాఖ్యుఁడున్మున్నగాఁ
గల యోధప్రవరుల్ వడిన్ విజయకాంక్ష న్వచ్చిరచ్చోటికిన్.

చ. స్ఫురదురుభీషణంబగు త్రిశూలము దారుణవర్తులంపు క
ర్పరము శరాసచక్రశరపద్మగదాముసలోజ్జ్వలాసిము
ద్గరములు రక్తయుక్తపరిధానముఁ దాల్చి విహారనమొక్క భీ
కరతరమూర్తియై తనర కాళిక వచ్చె ససంభ్రమంబుగన్. ౬౦౪

వ. మఱియు శస్త్రాస్త్ర సముదయంబులు వచ్చి మహాదేవు సన్నిధి
నిల్చె నంత నక్కడ, ౬౦౫

క. సంతసమున దనుజాధిపుఁ
డంతఃపురి కరిగి దూత యరుదెంచిన వృ
త్తాంతం బంతయుఁ దన ప్రియ
కాంతకు వినుపించెఁ బ్రధనకౌతుకమతియై. ౬౦౬

క. వినిచిన రణయత్నము విని
కనుఁగవ నశ్రువులు నిండఁ గంఠం బెండన్
బెనిమిటిఁ గౌఁగిటఁ జేరిచి
యనియెం దులసీవసూటి యతివినయముతోన్. ౬౦౭

శా. "ప్రాణేశా! శితికంఠుతోఁ జనునె వైరం బెన్నఁడే భక్తసం
త్రాణప్రౌఢుఁడు లోకసంహరణవిద్యాపారగుం డాతనిన్
బాణాదుల్కడు భక్తిఁ గొల్చి పిదపం ద్రైలోక్యసామ్రాజ్య మ
క్షీణప్రక్రియ నొందరే, యటుల సంసేవింప నీ కొప్పదే! ౬౦౮

వ. అదియునుంగాక,

చ. అమరవిరోధులైన త్రిపురాసురుల న్వధియించినాఁడు సం
యముల నలంచు రాక్షసచయంబుల గర్వ మడంచినాఁడు మృ

త్యుముఖము జొచ్చు బాలు నకుతోభయుఁగా నొనరించి లీలమై
జము మద మేర్చినాఁ డతని సంగరమందు జయింపవచ్చునే."

ఉ. ప్రేమదలిర్ప నయ్యనుఁగుఁబేర్యసి పల్కుల నాలకించి నె
మ్మోమున మొల్క నవ్వొలయ ముద్దియఁ గన్గొనియో వెడంగు కాం
తా! మహి కాలకర్మగతి దప్పునె యేరికినైన దీనికై
వేమఱుఁ జింతనొందెదు వివేక మెఱుంగని దాని కైవడిన్.

ఆ. వె. భూమిరుహములెల్లఁ బుష్పఫలాదికం
బులను గొంతదనుకఁ బొదలుచుండి
కాల మగ్గలింపఁ గాలిచేనైనను
చిచ్చుచేతనైనఁ జేటుఁగనవె. ౬౧౧

క. జనములచే జనసంతతి
జనియింపఁగఁజేయు నెవఁడు జనుల జనులచే
హననంబొనరుచు నెవఁ డా
తని నీ మదిలోన నెపుడుఁ దలఁపుము తరుణీ. ౬౧౨

సీ. ఎవ్వని దయచేత నీరేడు భువనముల్
నిరుపద్రవంబుగా నిలువఁబడియె
నెవ్వని యానతి నిందుసూర్యులు శీత
తిగ్మప్రభలచేతఁ దేజరిలిరి
యెవ్వనియాన వహ్నియు వేఁడిమిని జెల్గె
గాడుపు తా శీఘ్రగామియయ్యె
నెవ్వని యాజ్ఞచే నిందుఁడు వర్షించె
నెల్లజంతులమీఁద మృత్యు వేగె

గీ. అట్టి యాద్యంతరహితు సర్వానుగమ్యు
గాలకాలు నరూపము స్థూలదేహు

సతతసృష్టిస్థితిలయప్రసక్తశీలు
నామహామహుఁ దలఁపు మో కోమలాంగి. ౬౧౩

క. పొలతిండిని నేనెక్కడ !
నిలాపతి కుమారివైన యీవెక్కడ ! హా
తలపోయఁగ మన కలయిక
కలికీ ! జలకాష్ఠరీతిగాదే తలఁపఁగ. ౬౧౪

గీ. తొల్లి గోలోకమున శౌరితోడ నుండి
రాధికాశాపమున నిర్వైరము ను నింత
దనుక నుండితి మిచట, బృందావనమున
కిఁకఁ బోవుద మీదుఃఖమేల యనుచు. ౬౧౫

క. పలువిధముల బోధించినఁ
దులసి తెలియలేక వగపుతోఁ బ్రియువక్ష
స్థలిపైఁ బడి పెల్లగు ను
మ్మలికం గొన నపుడు గృష్ణమంత్రము సెప్పెన్. ౬౧౬

గీ. అఖిలదుఃఖహరంబగు నట్టి కృష్ణ
మంత్ర మాతఁడు దెల్పిన మాత్రముననె
దివ్యవిజ్ఞానబుద్ధితో ధీరయగుచు
వెలఁది సంతోషమున నుండె విభుని మ్రోల. ౬౧౭

ఉ. అత్తటి నయ్యనుంగుజెలి నాదటఁ గౌఁగిట నాదరించుచున్
మెత్తని పూలసెజ్జపయి మించిన వేడుకతోడ గాఢమా
చిత్తజుకేళిఁ దేలి సతి చీరచెఱంగున వీవఁగాఁ బరా
యత్తమనస్కుఁడై నిదురనందె సురారి విచారదూరుఁడై. ౬౧౮

శా. ప్రాతఃకాలమునందు విష్ణువినుతిప్రారంభుఁడై లేచి సు
స్నాతుండై తెలిపట్టుపుట్టములు విన్నాణంబుగాఁ దాల్చి ని

ద్ధాతామంగళహేతువై తనరు చారుస్వర్ణమాణిక్యసం
జాతంబుల్ ధరణీసుపర్వులకు నిచ్చావృత్తి నిచ్చెం దగన్. ౬౧౯

మ. గజరత్నంబుల నశ్వరత్నముల సద్గ్రామంబులన్ భూములన్
ద్విజసంఘంబులకున్ దరిద్రులకుఁ బ్రీతి న్వే సమర్పించి భూ
ప్రజఁ గావన్ సుతు రాజుఁ జేసి ప్రియభార్యా న్వాని కొప్పించి తా
విజయోత్సాహవివర్ధితాంగవితతావిఖ్యాతరోమాంచుఁడై.

ఉ. లక్ష మతంగజంబులు త్రిలక్షతురంగమముల్ రథంబు లా
గ్లక్షలు వీర్యవిక్రమబలప్రథితుల్ ప్రధనప్రసిద్ధులా
రాక్షసనాయకుల్ శతపరంపరగాఁ దనతోడఁ గూడి రా,
రాక్షసభర్త భార్గవపురస్సరుఁడై నగరంబు వెల్వడెన్. ౬౨౧

వ. ఇట్లు వెడలి పశ్చిమసముద్రప్రాంతంబునందలి భద్రవటీతటంబున
నొక్క వటవిటపిసమీపంబునకుం జేరనరిగి, ౬౨౨

శా. భక్తాభీష్టవరప్రదాయకుని శుంభద్వ్యాఘ్రచర్మాంబరున్
తిక్తాఖిలహాలాహలాసితశిరోధిన్ గోత్రనాథాత్మజా
సక్తున్ శాంతు సహస్రసూర్యనిభతేజశ్శాలి నీక్షించి స
ద్భక్తిన్ సాఁగి నమస్కరించె నల దేవద్వేషి సైన్యంబుతో.

గీ. వామభాగంబునందున్న భద్రకాళి
కగ్రమందున్న యట్టి షడాననునకు
వందనము లాచరించి దీవనలు గాంచి
నిలువఁబడియున్న నందిముఖ్యుల స్పృశించి. ౬౨౪

వ. భయభక్తుల నిలువంబడియున్న శంఖచూడుం గనుంగొని చంద్ర
చూడుం డిట్లను; నో దనుజేంద్రా! జగత్సృష్టికారణుండగు పద్మ
నాభు నాభీపద్మంబున విధాత జన్మించె నతనికి మరీచి పుట్టె నత
నికి వైష్ణవుండు నతనికి కశ్యపుండు నతనికి ధర్మిష్ఠుండు నతనికి దను

వును నతనికి విప్రచిత్తియు నతనికి దంభుండును గ్రమంబున జన్మించిరి. విష్ణుసేవాపరాయణులై బహుకాలంబు రాజ్యసుఖంబులనుభవించి పిదప వైకుంఠంబున కరిగిరి. తొల్లి నీవా దంభునకుఁ బుత్రుండవై సుదాముండను నామంబున నతిధార్మికుండవై యుండి రాధికాశాపంబున నిప్పుడు దానవేంద్రుండ వైతివి. భగవత్సేవాపరాయణులైన వారియఖిలంబుఁ దుచ్ఛంబుగాఁ దలఁచి ముక్తిచతుష్టయంబును జులకనగాఁ జూతురు. ఇదియునుంగాక,

మ. హరిభక్తుండగు నీకు నాకపతి దాయాదుండు తద్రాజ్యము౯
హరియింపందగునే ? స్వరాజ్యమున సౌఖ్యంబందఁగాఁ జాలదే !
దురితం బెద్దియుఁ దత్ప్రతిక్రియల నిర్ఘాతంబగుం గాని సు
స్థిరమై వీడకయుండు నెప్పటికి జ్ఞాతిద్రోహపాపం బిల౯. ౬౧౬

క. కావున నమరావతి నా
దేవతల కొసంగి హితమతి న్నీవెపుడీ
భూవలయంబున రాజ్య
శ్రీ వెలయఁగఁ బాలనంబు సేయఁగ రాదే. ౬౧౭

గీ. సంపదకు హాని గలదని సంశయింప
వలవ దది కాలవశమున వచ్చుఁ బోవు ;
హరిహరహిరణ్యగర్భులకైనఁ గాని
కాలమార్గంబు దాఁట శక్యంబు గాదు. ౬౧౮

సీ. కాలవశంబునఁ గాదె ధాత తిరోహి
తత్వంబు మరల నుద్భవముఁ గనుట
కాలవశంబునఁగాదె చంద్రుఁడు కలా
వంతుఁడౌటయుఁ గృశత్వంబుఁ గనుట

కాలవశంబునఁగాదె సూర్యుండు ప్ర
తాపహీనుండు సంతాపి యగుట
కాలవశంబునఁగాదె ధారుణి సర్వ
సస్యాఢ్యయగుట యూషరయు నగుట

గీ. కాలవశమున విశ్వంబు గానిపించుఁ
గాలవశమున సర్వంబుఁ గలయు నీటఁ
గాన సమరీతి నెవ్వండు గానఁబోఁడు
అక్షరుం డొక్కఁ డా పరమాత్మ దక్క. ౬౨౯

వ. నేనును దదీయధ్యానపారీణుండ నగుటం జేసి ప్రాకృతయుగంబు లనేకంబులం గనుఁగొంటి నింక ననేకయుగంబులఁ గనుఁగొందుఁ దదాజ్ఞా ప్రకారంబున బ్రహ్మవిష్ణులు సృష్టిస్థితు లొనర్చుచుండ నేను సంహారకారణుండ నై యుందు ననిన శంఖచూడుం డిట్లనియె.

గీ. శమనదమన ! భవత్కథితములలోన
నన్యథాలాపములు గల్గునయ్యెఁ నైన
నించుక యథార్థమును పచియింతు మీర
లాదరంబున వినుఁడు సమాహితముగ. ౬౩౧

శా. జ్ఞాతిద్రోహము పాప మంటి ; బలి రాజ్యభ్రష్టునిం జేసి యీ
పాతాళంబునఁ ద్రొక్కదే? యసురులన్ వంచించి వారాశిసం
జాతంబా సుధగ్రోలదే ? యెపుడు రక్షశ్శ్రేణిఁ బీడించు నీ
నీతుల్ మున్గలనైనఁ జూచెనె ! బుధానీకంబు శ్రీకంధరా.

క. కీడును మేలును వరుసం
గూడంగావలయు ధాతకును వశమగునే
వీడంగొన నీవిశ్వముఁ
క్రీడాభాండం బెకా ప్రకృతిపరున కొగిన్. ౬౩౩

వ. కావున మున్ను దేవతాపీడితుల మయ్యును కాలక్రమంబున నిపు డుద్ధతుల మైతిమి. సురలకును మాకును సహజశత్రుత్వంబున నిర్నిమిత్తంబుగా నాలంబులు జరుగుచుండు; జయాపజయంబులు మేము యనుభవింతు; మట్లుండ శత్రుమిత్రసమభావులగు మీర లరుదెంచుటయె నా కరుదుగాఁ దోఁచుచుండె; నింతియకాని మీవలన జయమొందెఁ బరాజయమొందె నాకు కీర్తి హేతుకంబ కాని వేఱొండు కాదనినఁ ద్రిలోచనుండు పరిహసితాననుం డగుచు నిట్లనియె. ౬౩౮

ఉ. రాక్షసనాథ! తొల్లిటి సురద్విషులౌ మధుకైటభుల్ హిర
ణ్యాక్షహిరణ్యదైత్యులు వినాశముఁబొందు టెఱుంగవే సరో
జాక్షుని చేత నీవటుల నాలములోఁపలఁ గూలనేల సం
రక్షణసేతు నిర్జరులరాజ్య మొసంగి సుఖంబుఁ గాంచుమీ.

వ. అది కాదేని,

క. ఆహరి యానతిచేఁ ద్రిపు
రాహితుఁడగు నేన యిప్పు డరుదెంచితి ను
త్సాహంబు నూలుకొని ర
మ్మాహవమున కోహటిలక యని పల్కుటయున్.

గీ. హరునకు వందన మొనరిచి
యరదముపై నెక్కి దానవాధీశుఁడు సం
గరధరణి ధీరుఁడై స
త్వరముగ నెలకొనియె దనుజవర్గముతోడన్. ౬౩౯

వ. అత్తఱిఁ గృత్తివాసుండును దత్తఱంబున వేల్పుమొత్తంబుల రావించి యున్నంత నుభయసైన్యంబులకుఁ దుములసమరంబు జరిగె; నట్టియెడ మహేంద్రుండు వృషపర్వుని, భాస్కరుండు

విప్రచిత్తిని, జంద్రుండు దంభుని, గాలుండు కాలస్వరుని, హుతాశనుండు గోకర్ణుని, గుబేరుండు కాలకాయుని, విశ్వకర్మ మయుని, మృత్యువు భయంకరుని, మయుండు సంహారుని, వరుణుండు వికంకణుని, హయుండు చలుని, నేకాదశరుద్రులు నేకాదశభయంకరులను, నందీశ్వరముఖ్యు లఖిలదానవగణంబులం దాఁకి యుద్ధంబు సేయ నొండొరుల సింహనాదంబులు భూనభోంతరాళంబు నిండె నంత,

ఉ. వేలుపులెల్ల దానవుల వేఁడిమి కోర్వఁగలేక భీతిచే
నాలముఁదక్కి పర్వఁగ పడాననుఁ డాగ్రహవృత్తితోడఁ దాఁ
గోలుమసంగి యద్దనుజకోటుల యేపడగించి సేన గ
గ్గోలుపడంగఁజేసె నవికుంఠితసాహసవిక్రమంబునన్. ౬౩౯

ఉ. దారుణలీలతోఁ బ్రధనధారుణి యెల్లెడఁ గాళియు స్సహా
మారియు ఘోటకంబులను మత్తగజంబుల వీరయోధులన్
బోరనఁజంపి తద్రుధిరముం దగఁ గ్రోలుచునుండ రాక్షసుల్
ధీరతఁదక్కి పర్వెడిరి దిక్కులు పిక్కటిలంగ నార్చుచున్. ౬౪౦

ఉ. అట్టి భయంకరంబయిన యాహవరంగమునందు దైత్యులి
ట్టట్టుఁ జనంగలేక వెఱపొందుచునుండ సురారిభర్త తాఁ
గట్టుపకాసియై తనదు కట్టెదుటంగల క్రౌంచభేదితో
నెట్టుకొనె న్వడిం దన యనీకము పొంగి చెలంగి యార్వఁగన్.

ఉ. వచ్చిన దానవాధిపుని వక్షమునం బలువాలుతూపులం
గ్రుచ్చి భయంబుతో రిపువరూథిని బాఱఁగ నార్చు నంత, కా
ర్చిచ్చునుబోలి మండిపడి చెచ్చెర సేనల ముట్టడించి క్రో
ధోచ్చలితాత్ముఁడై శరవణోద్భవు తే రొనరించె రూపఱన్.

మ. తెగువ న్విల్లునుమాడి ఘోరమగు శక్తి న్నుగ్గు గావించి తే
జిఁ గడుం జర్జరితంబుఁ జేసి శరవృష్టి న్ముంచి నీహారమ
ధ్యగతుండౌ దిననాథుఁ బోల్పఁదగు క్రౌంచారిన్ లలాటంబు చె
మ్మగిల న్వైచినఁ జిచ్చుటంపవిస్మృతిం బాసెన్ క్షణాం బంతలోఁ.

చ. తెలిసి మహేశనందనుఁడు దివ్యవిచిత్రమణిప్రభావ్రి
కలితరథంబు నెక్కి పటుకాండయుతంబగు నొండువిల్లు దా
ల్చి లయకృతాంతువోలిక విశేషరుషాజ్వలనార్చు లొల్కఁ ను
జ్జ్వలదనలాస్త్ర మప్పుడు నివారణఁజేసెను వారుణాంబుచేన్.

చ. దనుజుని విల్లు సారథి రథంబుఁ దురంగమముల్ సిడంబునన్
దునిమి మఱొక్క విల్గొనినఁ దుత్తుమురై చనునట్లు జేసి కాం
చనవరత్నకీలితలసన్మకుటంబును నుగ్గునూచగా
నొనరిచి యొక్క శక్తిని మహోగ్రత వైచె నురంబు వ్రయ్యఁగన్.

చ. అది యశనిప్రపాతము క్రియం బడ మూర్ఛనుజెంది యంతలో
మదమున లేచి కొండొక విమానము నెక్కి మఱొక్క విల్లు స
మ్మదమునఁ బూని ఘోరతరమార్గణపంక్తులఁ గప్పి యంత నా
రద ! మఱియేమిచెప్పుదు సురప్రముఖు ల్భయమంది చూడఁగన్.

క. అత్యుగ్రంబు సహస్రా
దిత్యసకాశంబు శౌరితేజోవృతమున్
భీత్యావహమగు శక్తిం
దైత్యుఁడు గుహు నేసెఁ గ్రోధదర్పోజ్జ్వలుఁడై. ౬౮౭

క. ప్రళయజ్వలనజ్వాలా
వళివలె నది మండిపడుచు వచ్చి మహోర
స్థలముం దాఁకుడు నతిదో
ర్బలుఁడు కుమారుండు మూర్ఛపడియెఁ గుమారా. ౬౮౮

క. పోఁడిమిచెడి కయ్యంబునఁ
గాడుపడు కుమారుఁ గాంచి కాళిక తనదో
క్రోడంబున నిడుకొని శశి
చూడుని సన్నిధికి నేగె శోకముతోడన్. ౬౮౯

గీ. తూలిన కుమారు జూచి మృత్యుంజయుండు
జ్ఞానమున జీవవంతునిగా నొనర్చి
యగ్గలంబగు బలమిచ్చి యతనితోడఁ
గాళి నంపించె యుద్ధరంగమున కపుడు. ౬౯౦

వ. అంత కార్తికేయుం డపూర్వబలసమన్వితుండై వెడలిన నందీశ్వ
రాదులును దేవగంధర్వకిన్నరకింపురుషులును బలుతెంచి సింహ
నాదంబులు సేయుచుండ శాకినీడాకిన్యుగ్రదంష్ట్రోగ్రదండలు రణ
మధ్యంబున మాధ్వీకపానంబు సేయుచున్న దైతేయులు భీతచేత
స్కులై పలాయితులైనం దానవాధిపుం డోడకుం డని యభ
యం బిచ్చి కట్టెదుట నిల్చిన, ౬౯౧

సీ. అంత కాళిక విలయాగ్నిసమానమై
పరఁగిన యాగ్నేయబాణమేయ
శంఖచూడుండు పార్జన్యశరంబుచే
దాని నడంచిన మాన కపుడు
వారుణాస్త్రం బేయ వారించె గాంధర్వ
విశిఖంబుచే జగద్విదితముగను
మాహేశ్వరంబును మంత్రించి వైచిన
వైష్ణవాస్త్రంబుచే వ్రయ్యనట్లు
చేసిన నీసుతోఁ జెచ్చెర నారాయ
ణాస్త్రంబు విడచిన నతఁడు నూచి

ఆ. వె. యాన మపుడు డిగ్గి యతివినయంబుతో
సన్నుతింప మగిడె సాధువగుచు;
మరల బ్రహ్మశిరము మంత్రపూర్వకముగ
నేయ దాని చేతనే యడంచె. ౬౫౨

క. నృపుచేత నన్నియస్త్రము
లపహృతవీర్యంబు లగుట కచ్చెరువడి పా
శుపతాస్త్రం బరివోసిన
నపుడా విభుపల్కెఁ బౌలంతి యనియె మునీంద్రా. ౬౫౩

క. "పాశుపతంబున మృత్యువు
లేశం బితని దరిఁ జేర లేదుసుమీ; యో
హో! శాంకరి! తద్భార్య గు
ణాశయ యద్దానిఁ జెఱుప నాతఁడు తెగ్గున్. ౬౫౪

క. హరిమంత్రకవచమును సు
స్థిరముగ నద్దనుజుసతి సతీత్వము గలుగన్
హరిహరుల కజేయుండును
జరామరణరోగముల కసాధ్యుండు నగున్." ౬౫౫

వ. అని యిట్లశరీరవాణి పలికిన నయ్యస్త్రంబు నివారించి ప్రళయాగ్నికల్పమానంబగు శూలంబు వైచిన దాని నశ్రమంబున వామహస్తంబునఁ బట్టుకొనుచుఁ గోపఘూర్ణమానమానసుండై యొక్క ముష్టిఘాతంబు సేసినఁ దత్క్షణంబున మూర్ఛం జెంది,

ఆ. వె. అంతఁ దెలివినొంది హర్షసమేతుఁడై
భద్రకాళి కెఱఁగి వాసరాంత
మగుడు విశ్రమింప నానతిఁ గైకొని
రథమునంద యుండె రాక్షసుండు. ౬౫౬

తరల. కదనభూపతితామరారినికాయకాయచయంబులన్
జిదిమి నెత్తురుఁ గ్రోలుచున్ హతశేషులం బరిమార్చి లోఁ
బొదలు రోసముతోడఁ బ్రేవులఁబ్రోవుల న్మెడఁ జుట్టి తా
నదయవృత్తిఁ జరించె లోకభయంకరంబగు నాకృతిన్.

వ. ఇట్లనర్గళపరాక్రమంబున విహరించియు దానవేంద్రుఁ సంహరింప
నేరక క్రమ్మఱ శంకరుపాలి కరుదెంచి యిట్లనియె. ౬౫౯

ఉ. శంకర! నీ ప్రసాదమున శత్రువులం బరిమార్చితి న్నిరా
తంకముగా నిశాచరులు తప్పిరి యింకొకనూఱువేలు ని
శ్శంకగ దైత్యనాయకుఁ డసాధ్యుఁ డహంకృతు లెన్నిఁ జూపినన్
జంకఁ డొకించుకేని యొక శస్త్రభయంబును లేదు వానికిన్.

వ. వాఁ డనన్యశస్త్రసాధ్యుం డగుటం జేసి పాశుపతం బభిమంత్రించి
వైచుసమయంబున, ౬౬౧

క. "పాశుపతంబున నితనికి
లేశంబును మృత్యుభయము లేదుసుమీ యో
హో! శాంకరి తద్భార్య గు
ణాశయ యద్దానిఁ జెఱుప నాతఁడు మ్రగ్గున్. ౬౬౨

క. హరిమంత్రకవచమును సు
స్థిరముగ నద్దనుజపతి సతీత్వము గలుగన్
హరిహరుల కేయుఁడును
జరామరణరోగముల కసాధ్యుండు నగున్". ౬౬౩

వ. అని యిట్లశరీరవాణి పల్కిన నయ్యస్త్రంబు నివారించి తనపుడు,

మ. నిటలాక్షుండు నిజం బెఱింగి ప్రమథానీకంబు గొల్వంగ ను
త్కటరోషంబున భూనభోంతరము లాక్రందింపఁగా వెల్వడెన్

బటుసంరంభ మెలర్ప సంగరధరాభాగంబుఁ జేరంగ నం
తట దైత్యోత్తముఁడున్ రథంబుడిగి యానందంబుతోఁ మ్రొక్కెడన్.

ఆ. వె. మరల వేగమున విమానంబధిష్ఠించె
నపుడు విలయసమయమునిక గణి
శౌరి గొప్ప నంత చోద్యంబుగా సంగ
రంబు నూఱునత్సరములు జరిగె. ౬౮౮.

వ. అయ్యవసరంబున,

క. వడవడ వడఁకుచుఁ బదములు
తడఁబడఁగాఁ గేల నొక్క దండముఁ గొని సం
దడిచేయుచు పాలుని కై
వడి వేసముఁ దాల్చి శౌరి వచ్చె నిజేచ్ఛన్. ౬౮౯

మ. "కులజుండ న్విబుధుండ వృద్ధుఁడను రక్షోనాథ ! పాత్రప్రియా !
చలిచే డస్సి నినుం గనుంగొనెడి యాసం జేరితింగాని యే
వలనుం బోవఁగఁజాల నింకఁ గడు స్వల్పంబైన, నీ మేని క
త్తళమున్ నాకిడి ప్రాణదాతవయి సంధానింపు మానందమున్.

ఉ. కాసనుజల్ జనించు, వడఁకందొడఁగు న్మెయియెల్ల, వీసమున్
గ్రాసము బోదు లోనికి, నర ల్గయివెట్టెడు, నెమ్మనంబునం
దీసాక కొంత పెచ్చు, తలయేరు ఘటిల్లు, ధనంబునందు పే
రాసలు గల్గు; నకట ! జరాన్వితు పాటుల నేమి చెప్పుదున్.

గీ. అధికుఁడవంచు నిన్ను నే నడిగినాఁడఁ
గాని వేవే లొసంగిన హీనమతికిఁ
జేయి చాఁతునె ! నీ వి దిచ్చినను జాలు
సున్నజుట్టిన నా కంతకన్న మేలు." ౬౯౦

మ. అన నొక్కించుక సంశయించి మది నాహా! ధారుణీదేవులన్
గనినంత న్వినయంబుతో నెపుడు సన్మానింతు నే నిట్టివృ
ద్ధున కీఁగాంచుటకన్న వేఱొకటి యెందుంగల్గునే మోద మిం
కనుమానం బడియేల మైమఱపు వే యర్పించెద న్వీనికిన్.

వ. అని తలఁచి,

క. ప్రాణసమంబయిన తను
త్రాణంబును దీసి సమ్మదంబున మహిగీ
ర్వాణున కొసంగె దివిజ
శ్రేణులు కురియఁగఁ గుసుమవృష్టి తనపయిన్. ౬౭౨

గీ. దాని గ్రహియించి యతఁడు మోదంబుతోడ
శంఖచూడుని పోల్కిఁ దజ్జాయకడకు
వచ్చి దాని పతివ్రతాత్వంబుఁ గలఁచె
చక్రధరునకుఁ గలదె యసాధ్యమొంపు. ౬౭౩

వ. అంత నక్కడ,

క. దానవనాయకు ముందటి
సేనల నన్నింటి నల్పశేషముగా నీ
శానుం డొనరిచి నిహతని
జానీకము జీవవంతమాగతిఁ జేసెన్. ౬౭౪

ఉ. కాలము వేచి యంత శితికంఠుఁడు వైచె సురారిభర్తపై
శూలము గ్రీష్మకాలశతసూర్యనిభప్రభ ముద్గతజ్వాల
జ్వాలము వజ్రతుల్యము నవార్యము లోకభయంకరమ్ము లీ
లాలులితాబ్జజాండముఁ బలాయితశాత్రవసైన్యజాలమున్.

గీ. దానిఁ గన్గొని యతఁడు శస్త్రములు విడిచి
యచ్యుతు భజించుచుండె యోగాసనమున

నపుడు శూలంబు పైఁబడి యరదమును న
తండు చూపట్టకుండ దగ్ధంబుసేసె. ౬౭౬

ఉ. అంతట శంఖచూడుఁడు నిజాకృతి వీడి కిశోరరూపుఁడై
వింతగఁ దోఁచి యప్పుడ నవీనము గోభువనాగతంబు న
త్యంతమనోహరం బయిన యానముపై వసియించి యేఁగె గృ
ష్ణాంతికమున్ ముదంబుఁగొని రచ్చట రాధయు వాసుదేవుఁడున్.

చ. ఇల నల శంఖచూడదనుజేంద్రుని యెముకలు శంఖజాతులై
వెలసి సురార్చనంబులఁ బవిత్రతఁ గాంచె ననేకభంగులన్
గలుములబోటి తద్ధ్వనులు గల్గినచోటుల నుండుఁగాన శూ
ద్రులకును స్త్రీలకున్ సుఖమునూఢిగ నెక్కుడు గూర్చుఁదధ్వనుల్.

క. హరుఁ డద్దానవపతి సం
హరణం బొనరిచి వెసన్ వృషారూఢుండై
యరిగెఁ దనలోకమునకున్
సురలు న్నిజపురికిఁ బోయి సుఖియించిరొగిన్. ౬౭౮

వ. అనిన నారదుం డిట్లను.

—* తులసీసంగమ వర్ణనము *—

ఉ. నూనుగ శంఖచూడునకు మానినియౌ సతియందు నిందిరయా
ధాన మొనర్చె నప్పు డలదానవహారి యటంచుఁ బల్కితి;
వానలినాక్షిఁ గూడు నెడ నాకృతి యెట్టిది దాల్చె ? నేకిరియన్
గానఁగఁబోయె? దాని నెఱుఁగ న్వచియింపు మహాత్మ నావుడున్.

శా. వీణాసంయమి ! యాలకింపు మల గోవిందుండు గీర్వాణసం
తాణార్థంబుగ విష్ణుశాంబరిని తద్దైత్యాకృతిం దత్తను

తాగ్రెంబుంగొని తత్సతీగృహబహిర్ద్వారంబున న్నిల్చి ని
స్వానంబేర్తెఱ మ్రోయఁజేసె జయముంజాటించు చందంబుగన్.

చ. ముగుద పతివ్రతానియమముం జెఱుపన్ రజనీచరు న్వశిం
పఁగ నొనరింప లోఁదలఁచి మాధవుఁ డాగతి దుందుభి స్వరం
బుగ నినదంబుఁజేయ సనఁబోటి మనంబున మోదమంది సౌ
ధగతగవాక్షమార్గమునఁ దప్పక కన్గొనె రాజమార్గమున్. ౬౮౨

ఉ. పైదలి వానిఁ గాంచి తనభర్త యటంచుఁ దలంచి పొంగుచున్
బీదలకున్ ద్విజావళికి భిక్షులకున్ ధనవస్త్రముఖ్యముల్
సాదరవృత్తి నిచ్చి వినయంబున నుండె; రథంబుడిగ్గి దా
మోదరుఁ డాసతీమణిసముజ్వలసౌధముఁ జేరె సంతటన్. ౬౮౩

క. దానవుఁడంచును బ్రత్యు
త్థానం బొనరించి తత్పదంబులఁ గడిగన్
సూనిని జలములఁ దనపరి
ధానము చేఁ దడియు నార్చెఁ దత్తఱపడుచున్. ౬౮౪

ఉ. ఆలలితాంగి తా మణిమయాసనమందు మురారి నుంచి తాం
బూలమొసంగి యిట్లనియె ముద్దులుగుల్కుచుఁ "ప్రాణనాథ! నేఁ
జాలఁ గృతార్థ నైతి నిఁక జన్మము సార్థకమయ్యె నాకు ని
ష్ఠాలముసేయఁగాఁ జని రయంబున వచ్చిన నిన్నుఁ గాంచుటన్."

క. స్మితవదన యగుచు సతి శ్రీ
పతిఁ గని యతిశూరుడైన బర్హిర్ముఖసం
తతితో జరిగిన యుద్ధ
స్థితి విన మతివొడమెడు న్వచింపుము కరుణన్. ౬౮౬

క. నానాసేనాయుతసే
నానియు బలవంతుఁడై తనరినట్టి శచీ

జానియుఁ దక్కంగల సే
నానికరము గల్గఁగా రణము భరముగదా. ౬౮౭

ఉ. అందఱు నొక్కయొద్ద నిటలాంతరవిస్ఫురదుగ్రహేతిరా
స్పందకృశానులోచనుఁడు శర్వుఁ డొకం డొకయొద్ద; వారితోఁ
గ్రిందెటులయ్యెఁ జెప్పుమనఁగా విని శౌరి స్మితాననాబ్జుఁడై
సుందరితోడ సద్గునుజుచొప్పునఁ బల్కెను నేర్పుమీఱఁగన్.

మ. దళదంభోజదళాక్షి! విన్ము సమరోదంతంబు వాక్రుత్తు నే
జలజాతాస్త్రవిరోధి పోరునెడ వర్షంబయ్యెఁ బూర్ణంబు సం
కులయుద్ధంబున మ్రింది రయ్యఖిలరక్షోనాయకు ల్లోక మా
కులమయ్యె న్విధి చేసె మమ్ము విగతక్రోధాత్ములం జెప్పరన్.

ఉ. ధాత యనుజ్ఞఁ బూని విబుధప్రభురాజ్య మొసంగితిన్; శివా
నేత యథేచ్ఛగాఁ జనియె, నే నరుదెంచితి నిన్నుఁ జూడ సం
ప్రీతిమెయిం బనింగొనిరి వేల్పు లటంచు లతాంతగంధని
ష్ఠ్యూతివిశాలమై తనరుచోఁ దలిమంబునఁ బండెఁ గాంతతో.

క. ఆతఱి నాతరుణీమణి
యాతనితోఁ గూడి కలయునప్డు సుఖము పూ
ర్వోత్తరముగఁ గని విచికి
త్సాతురతం బలికె నిట్లాలనుమన్ హరితో. ౬౯౧

చ. మతకరి చంద మేర్పడియె మానుగ నీయెడ నాపతివ్రతా
వ్రతమును గోలుపుచ్చితి వెవండవు నీ వెఱుగంగఁ జెప్పు మం
చతికఠినంబుగాఁ బలుక నప్పుడు శాపభయంబుచేత నై
జతనువు నూని మాధవుఁడు చానకుఱంగట నిల్చె నంతటన్.

సీ. పచ్చనివన్నెదువ్వలువపై వలెవాటు
నుదుటఁ గస్తురిబొట్టు పొదలువాని

రహిమించు కౌస్తుభరత్న మురంబున
నొడలెల్లఁ దొడవులు దొడరువాని
నల్లని మొగుళుల నుల్లసంబాడెడు
మైచాయ మిఱుమిట్లు మలయువాని
మొలకన వ్వొలసెడు మోముదమ్మియు వన
మాల గళంబునఁ గ్రాలువాని

గీ. దేవదేవునిఁ గాంచి సందేహ మెడలి
మూర్ఛఁగొని చేతనత్వంబుఁ బొంది మరల
శౌరిఁ గన్గొని పల్కె నాసారసాక్షి
కోపపరితాపములు మదిఁ గుందఁజేయ. ౬౯౩

మ. కృప యొక్కింతయు లేక యుండు టిది చన్నే! నీకు నొక్కింతయే
నపరాధంబు నొనర్పఁ డట్టిఁడు మదీయాత్మేశుఁ డన్యార్థమై
కపటోపాయముఁ బూని వాని ననిలోఁ గాఁజేసి తీ వక్కటా
యుపలప్రాయమె నీహృదంతరము? మేలోర్వంగఁ జూపోవదో!

క. దోషం బెఱుఁగని నాపతి
రోషముతోఁ జంపితీవు క్రూరుఁడవ వగుటన్
బాషాణత్వముఁ బొందుము
భాషలు వేయేల యంచుఁ బల్కెన్ బెలుచన్. ౬౯౪

క. తరుణి శపియించి యి ట్లతి
కరుణము దోఁపంగ నేడ్వఁగడఁగిన విని యా
కరుణారససాగరుఁ డగు
హరి యిట్లని యానతిచ్చె నాసతితోడన్. ౬౯౫

మ. మునుదాఁ జేసెను శంఖచూడుఁడు తపంబు న్నిన్నుఁ గామించి నీ
వును నన్గూర్చి తపంబొనర్చితివి పూర్వుంబోఁడి యద్దాన నీ

దనుకన్యాదానముఁ డిచ్చి నిన్గలసి మోదంబంది యూర్తై; న్మదంబున నీదేహామువీడి నిశ్చలసుఖంబుం బొందు నిశ్చింతతో. ౬౯౭

క. నీ వొనరించిన తపమున
కీవును ఫలమందు టొప్పు నెట్లును సతి యీ
మై వీడినంతటనె నా
దేవివి కాఁగలవు నీవు దివ్యతనువుతో. ౬౯౮

క. చిరకాలము నాతో సు
స్థిరభోగము లొందవు నీవిస్పృష్టమగు కళే
బరమది గండకి యనఁగాఁ
బరఁగును బుణ్యప్రదప్రవాహినియనఁగన్. ౬౯౯

వ. నీ పెన్నెఱిగుంపు తులసినాఁ దనరి త్రిలోకీజనతాఘనతాపత్రయలతాలవిత్రంబగు పత్త్రలతాంతంబులనొప్పి తత్పత్త్రసుమంబుల దేవతారాధనం బొనర్చినవానికి సర్వకామదంబై యొసంగు; గోలోకవిరజాతీరరాసబృందావనంబులను, చందనచంపకమాధవకేతకీమాలికామాధవీకుందకురువకవకుళముఖానేకలతాపరివేష్టితంబైనయావాసంబు నీకగుఁ; దులసీతరుమూలంబున సమస్తదేవతీర్థంబులు నెలకొనియుండుఁ; దులసీదళసంస్పర్శనమాత్ర నరుండు ఘోరదురితక్షయసిద్ధిం బొందుఁ; దులసీపత్త్రతోయసేవనంబువలనఁ గోటితీర్థంబులఁ గ్రుంకులిడిన ఫలంబు దొరకొనుఁ; దజ్జలంబుల సిష్టదేవాభిషేచనంబు లొనర్చిన సుధాఘటసహస్రాభిషేకంబున కెక్కుడు ఫలంబు నెక్కొనఁజేయు. కార్తికియందొక్కతులసీదళంబు పాత్రిన కీగి మాత్రంబున గోసహస్రదానఫలంబు లభియించు; మృతికాలంబునఁ దులసీపత్రతీర్థం బించుక సేవించు నరుఁడు నిరస్తసమస్తకిల్బిషుండై శాశ్వతవిష్ణులోకనివాసుండగు. నిరతంబుఁ దులసీతీర్థంబు సేవించువాఁడు లక్షాశ్వమేధఫలంబు

లనుభవించుఁ ; దులసీదళధారులును దత్కాండనిర్మితమాలికాధారులును నిరతవైకుంఠనివాసులై నీరోగంబులగు భోగంబు లనుభవింపంగలరు; తులసీదళంబిలపైఁ ద్రొలంగంద్రోఁచిన నరుండు కాలసూత్రంబునంబడి యాచంద్రార్కంబుగా యాతనలం బొందుచుండుఁ; దులసి ముంగల మిథ్యాశపథంబులు పలికినవాఁడు కుంభీపాకంబునఁ గూలుఁ ; బూర్ణిమామాద్వాదశీ సంక్రమణములఁ దైలాభ్యంగనం బొనర్చనేని త్రిసంధ్యలఁదులసీపూజాపరతంత్రుండగు నరుండు హరిపార్శ్వవర్తియై యుండు. నీవు ద్వీపినీరూపంబున లవణాంభోరాశికి దేవివై యుండుతటి నీ శాపంబునఁజేసి నేనును భరతవర్షంబున శైలరూపధారినై నందకీతీరంబున వసియింతునని చెప్పి యంతర్ధానంబు నొందె ననవుడు, ౨౦౦

—* సావిత్రీ పూజాది కథనము *—

క. పావనమై మీఱిన తుల
సీవృత్తాంతంబు వింటిఁ జెప్పు లలరారఁగ
సావిత్రికథను విన నెం
తే వేడుక వొడమె దానిఁ దెల్పు మహాత్మా. ౨౦౧

గీ. ఎవనిచేత సావిత్రి యుద్భవముఁజెందె
వేదమాతృక యను వార్త వెలయనేల
మొదల నెవ్వాఁడు సేసెఁ దత్పూజనంబుఁ
బిదపఁ దత్పూజనంబుఁ గావించి రెవరు. ౨౦౨

క. నా విని నారదమునికిం
దా వినుపం గడఁగె నిట్లు నారాయణుఁ డా

సావిత్రిచరితమును విను
షూ, వేదసవిత్రి యన యథార్థము వత్సా. ౭౦౩

చ. మొదలను దత్త్రిఃయూజనని పూజనముం బొనరించె భక్తిలోఁ
గుదురఁగ ధాత పాత్రిత బలుకు ల్వచియించె ; నటఁ సమస్తకో
విదులు భజించి ; రశ్వపృథివీపతికొల్చి నసంతరమ్మునన్
బదపడి నాల్గువర్ణములవారు భజించిరి ప్రేమమీరఁగన్. ౭౦౮

క. అన నారదుఁ డానారా
యణునిం గని యిట్లు లనియె నశ్వపతి యనం
గ నెవం, డతండు సావి
త్రిని బూజించుట యదెట్లు? తెలుపు మహాత్మా. ౭౦౫

వ. అనవుడు నారాయణుం డిట్లు వచించెఁ దొల్లి భద్రమండలమ్మున నశ్వపతి యనురాజు ధర్మనిరతుండును రిపుశాసకుండును నై రాజ్యంబొనరించువాఁడు, ౭౦౬

క. మాలతి యనఁగా నొప్పెడు
లీలావతిఁ దొల్లి శౌరి లిబ్బులచెలియన్
బోలి వరించెను నాసతిఁ
బోలిన పువ్వారుఁబోఁడిఁ బొడఁగన మెచటన్. ౭౦౭

క. ఆసతికి దైవయోగము
చే సంతతి గలుగదయ్యెఁ జిత్తములోనన్
దా సంతతిపొందెను నెం
తే సంతాపింపఁదొడఁగె దేహము దఱుఁగన్. ౭౦౮

ఉ. పుత్త్రులు లేరటంచు మది పొక్కుచునుండి వసిష్ఠునాజ్ఞ సా
విత్రిని భక్తిఁ గొల్చియును బిడ్డలఁ బొందఁగలేక తా నహో

రాత్రిము మానసంబున భరంబుగఁ జింతవహింపుచుండె నీ
ధాత్రిని బుత్త్రిలం గనని తన్వికిఁ జింత యనంగ నబ్రిమే. ౭౦౯

చ. నిరతము చింతచేఁ జివుకు నీరజలోచనఁ గాంచి యశ్వభూ
వరుఁ డను భీరమేది తగవా మగువా నెగు లూన ? నింక నే
వెరవున నేనియుఁ శ్రుతిసవిత్రిని గొల్చినఁ గల్గు పుత్త్రుఁ డం
చురువడి బోధచేసెను నయోన్నతి మీఱఁగ సారసాక్షికిన్.

క. సావిత్రిపూజనమును
గావింపఁదలంచి బుధనికాయంబులతో
దేవేరితోడఁ జనియెను
భూవరుఁడు తపంబుసేయఁ బుష్కరమునకున్. ౭౧౧

మ. సతితోడన్ శతవర్షము ల్నియతిమై సావిత్రిఁ బూజించియున్
సుతులం గాంచఁగ లేక యాతఁడు కడు న్శోకించుచున్నంత నీ
వతిభక్తిం బదిలక్ష లిక్కరణి గాయత్రిన్ జపింపంగ వాం
ఛితముల్ సేకుఱునంచుఁ బల్కెఁ దోఁచెన్ వ్యోమమార్గంబునన్.

క. అచ్చోట కయ్యవసరమున
విచ్చేసెఁ బరాశరుండు పృథివీపతి యా
సచ్చరితుని కర్ఘ్యాదిక
మిచ్చి శుభప్రశ్న లడిగె నేచినభక్తిన్. ౭౧౩

వ. అంత నాపరాశరుండు సంతసించి రాజున కిట్లనియె. ౭౧౪

క. రాజర్షి! వినుము నీవీ
యోజను సంకల్పసిద్ధి నొందెదు గాయ
త్రీజపముం బదిలక్షలు
గాఁ జేసిన నరున కెల్ల కామ్యము లబ్బున్. ౭౧౫

సీ. ఒకమాఱు గాయత్రి నుచ్చరించినచో న
హర్భవంబగు పాప మణఁగిపోవుఁ
బదిసార్లు గాయత్రి పఠియించినంతనే
పాపం బహర్నిశాభవ మడంచు
వేమార్లు జపియింప వృజినంబు వత్సరా
ర్జితమైన నపుడ నశించిపోవు
లక్షగాయత్రి దలంచిన జన్మకృ
తంబగు బలుదురితంబుఁ దొలఁగు

గీ. అన్యజన్యజమగు పాప మణఁగును దశ
లక్షలు స్మరింపఁగా శతలక్ష లాత్మ
నెలకొలుప సర్వజన్మసంకలితమైన
పాతకం బపనీతమౌ భూతలేంద్ర. ౨౧౬

చ. అనుదినమందు సంధ్య విడనాడక భక్తిని మూఁడువేళలం
బనిగొని చేయుమీ వది శుభంబగు సంధ్యఁ ద్యజించువాని శూ
ద్రునివలె విప్రకార్యముల దూషితుగాఁ గనుఁగొందు రట్టివాఁ
డొనరుచు పున్నె మానరుని నొందదుసూవె తురంగభూవరా.

క. యావజ్జీవంబును సం
ధ్యావందన మెవఁడుసేయు నాతం డుర్విన్
జీవన్ముక్తుండై తే
జోవంతుం డగుచు వెలయు క్షోణీనాథా. ౨౧౭

మ. హరిమంత్రాహితుఁ డస్త్రజీవియును సంధ్యాహీనుఁ డజ్ఞానియున్
హరిపూజారహితుండు క్రూరుఁడు ఋతుస్నాతాన్నవీరాన్నత
త్పరుఁడు న్వార్ధుషికుండు ధావకుఁడు విద్యాకన్యకాక్రేతయౌ
ధరణీదేవుఁడు దర్పమేది విషరిక్తంబైన సర్పం బగున్. ౨౧౮

గీ. బ్రాహ్మణుఁడయ్యు సంధ్యను వార్వఁడేని
వాఁ డొనర్చిన పిండతర్పణముఁ గొనరు
పితరు; లవ్వాఁడు పూజఁగావించెనేని
సురలు గైకొన నొల్లరు ధరణినాథ. ౭౨౦

క. ఇనుఁ డుదయంబును గాంచుట
యును నిద్దుర వీడనట్టి యుర్వీదేవుం
డనుపమకళాఢ్యుఁడై నను
విను కోఱలులేని పాము విధముగ నుండున్. ౭౨౧

క. ఈవిధి గాయత్రీపూ
జావిధి యంతయును భూమిజానికిఁ దెలియం
గా వివరించి వెసం దన
యావాసంబునకు మౌని యరిగె మునీంద్రా. ౭౨౨

ఉ. తాపసుఁ డేగునంతట ముదంబు ఘనంబుగఁ జెంది యశ్వధా
త్రీపతి మూఁడువేళల సరిత్తటమందు వసించి వేయివే
తేపలు సంజపూజనము దీక్షితుఁడై నెరవేర్చి లోనిసం
తాపము వాయఁగా నభిమతంబును బొందె జగద్ధితంబుగన్.

వ. అది యెట్లన్న,

క. మిత్రప్రభాన్వితను సా
విత్రిని భక్తిప్రపత్తి వినుతించిన యా
ధాత్రీరమణునిఁ గని సా
విత్రియు దయమీఱఁ దల్లివిధమునఁ బలికెన్. ౭౨౪

మ. క్షితిపాలోత్తమ! నేనెఱుంగుదును మీ చిత్తంబులం బొల్చు వాం
ఛితముల్ కూఁతును బొందఁగాఁదలఁచి చేసె న్నిష్ఠ నీకాంత స

త్సుతుఁ బొందం దప మీవొనర్చితివి సంతోషంబు వాటిల్లె ని
ష్ఠ తనూజాతను బొందుమా, కడపటం బుత్త్రిందునుం గల్గెడున్.

క. అని దీవించి చివాలునఁ
జనె నాసావిత్రి ధాతజగమునకు నృపుం
డును నసఁబోఁడియు నంతటఁ
జని రాత్మనివాసమునకు సంప్రీతిమెయిన్. ౭౨౬

మ. చని యాగంపతు లిద్ద్వ రత్యధికనిష్ఠం బూని సావిత్రిపూ
జనముల్ సల్పుచునుండ నొక్కతటి నాచాంద్రాస్య గర్భంబునన్
వనితారత్న మొకర్తు పుట్టె శుభలగ్నంబందు సావిత్రి సొం
పున రాజిల్లుట నట్ల నామకరణమ్మున్ జేసె రాజయ్యెడన్.

క. లాలన మొప్పఁగ దాదులు
బాలికనుం బెనుచుచుండ వర్ధిల్లె శర
త్కాలాదిపక్షశశికల
పోలిక నంతంతకు నసముజ్జ్వలకలలన్. ౭౨౭

ఉ. మానవనాథు కూఁతు రసమానవిలాసవిభాసిరూపరే
ఖానవమోహనాంగియయి గానకళ న్నెఱకల్గి సర్వధా
త్రీనరనాథమౌళిమణిదీధితిదీప్తపదాబ్జుని న్రతీ
మానవతీమనోహరసమానవిలాసు వరింప నెంచుచున్. ౭౨౮

మ. సరసాళీజనసేవ్యమానయయి యుచ్ఛ్రాగోష్ఠి నుండంగ స
ర్వరసామండలిఁ బొల్చు రాసుతులలో రమ్యుండు కారుణ్యశాం
తరసానూనమనస్కుఁ డంగభవసౌందర్యాన్వితుండౌ ధరా
వరసూనుం డెవఁడొక్కొ పేర్కొనుఁడు మీ ప్రజ్ఞల్ విచారింపుడున్.

మ. అని సావిత్రి వచింపఁగా నొక వయస్యారత్న మూహించి యి
ట్లనియె న్సర్వదిగంతరాఖిలధరాధ్యక్షాత్మజాతాళిలో

ననఘుం డాకృతిమీన కేతనుఁడు విద్యావంతుఁడు స్స్వీరుఁడున్
దిననాథప్రతిమాన తేజుఁడు ద్యుమత్సేనాత్మజుండౌ ఁ జుమీ.

చ. అతనికి సత్యవంతుఁడను సార్థకనామ మెసంగు వాని కె
వ్వతె సతియై నిరంతర మపారసుఖంబులఁ బొందనున్నదో
మతి కెఱుఁగంగరా దనిన మానవనాథతనూజ యొంతయున్
గుతుకముఁబొంది తండ్రికడకుం జని చెప్పెను దచ్చరిత్రమున్.

శా. భూమీశుండు తదీయజల్పముల కామోదించుచుం బుత్రికన్
ద్యుమత్సేనికి నిచ్చి పెండిలి శుభోదర్కంబుగాఁ జేసి యా
జామాతం గడుసత్కరించి వివిధాజానేయగాణిక్యనా
నామాణిక్యము లాదిగాఁగలుగు కానుకల్ పెక్కు లిచ్చెంగృపన్.

చ. కొమరెకు నట్లుకానుకలు కొల్లలుగాఁగ నొసంగి భర్తృదే
శమునకుఁ బంపఁగాఁదలచు సందడినుండఁగ లేకలేక య
బ్రముగను గాంచి పెంచి యచిరంబుగఁ బెద్దగఁజేసినట్టి ప్రే
మముగల తల్లి ముద్దులకుమారిక నంకముఁ జేర్చి యిట్లనున్.

ఉ. పుత్రులు లేకలేక తలఁపుల్ మునుముట్టఁగ నెట్టకేని సా
విత్రిని గొల్చి కాంచి నినుఁ బెంచియుఁ బెద్దగఁజేసి యిందిరా
పుత్రునిబోని నీమదికిఁ బోలినవానికిఁ బెండ్లిఁజేసి లో
కత్రయమాన్యుఁడై వెలసెఁగాదె భవజ్జనకుండు నేఁటికిన్. ౨౩౯

ఉ. మానితవై ఖరి న్మగనిమాటలకుం జవదాఁటకుండి యా
జ్ఞానుగుణప్రచార మది సద్వ్రత మంచుఁ దలంచి భర్తృసే
వానిరపాయవై సకలబంధుసుహృజ్జనకోటిఁ బ్రోవు మా
నౌనని లోకము ల్పొగడ నబ్బెడు దాన యశంబు పుత్రికా.

క. భావిశ్రేయఃపికకే
ళీవనములు కలుషపవనలేలిహానముల్

జీవనములు జన్మత్రియ
పావనములు ప్రాణనాథుపదసేవనముల్. 238

శా. ఏపుణ్యంబు నెఱుంగ వింతకును బ్రాణేశుండు దైవంబు సు
మ్మీ! పుట్టింటికి మెట్టినింటికిఁ గడున్మేల్పేరు దేవమ్మ! సే
వాపారీణత నత్తమామలయెడన్ బాటింపు మాయమ్మ! నిన్
జేపే క్రమ్మఱఁ దోడితెచ్చెదఁ గుమారీ! చింతిలంబోకుమీ.

చ. అని విహితప్రకారమున నాత్మజకు న్మతిచెప్పి యంత జా
ఱిన నెఱిచూచు గోట సవరించుచు ముద్దిడి వీడుకోల్పినన్
ఘనతరతూర్యరావము లఖండములై చెలఁగంగ నాథుతో
ననుదివసప్రయాణమున నాత్మపురి న్వసియించి యచ్చటన్.

ఉ. సంతత మాశుభాంగి పరిచర్యల నెంతయు నత్తమామలన్
సంతసమందఁజేసి పరిచారకులం దయఁబ్రోచి రేపగల్
కాంతునకున్ ముదం బొదవఁగా నతిభక్తిఁ జరించుచుండె ని
శ్చింతత సత్యవంతుఁడును జేడెను గూడి సుఖించెఁ బ్రేమతో.

మ. యువరాజై కవిరాజులన్ మనుపు చత్యుత్కృష్టకార్యంబులన్
భువి నిష్కంటక మాచరించి యతులాభోగంబులంబొంది కా
లవిధిన్ రాజ్యముఁ గోలుపోయి పురిసిల్వన్ సిగ్గుచేఁ దాపసా
టవికిన్ వృద్ధులు తల్లిదండ్రులకుఁ దోడ్పాటై చనెం గాంతతో.

క. వన్యాహారమొనర్చు చ
నన్యాదృశభక్తిఁ బితల నరసికొనుచు సా
మాన్యప్రక్రియ హాయరా
టకన్యామణిఁగూడి దినముఁగడపుచునుండెన్. 242

క. ఈరీతి సత్యవంతుఁడు
నీరజసఖుఁ డుదయశిఖరి నెలకొనుడుం గాం

తారమున ఫలసమిత్కు-శ
లారసి తెచ్చుటకు జనకునానతిఁ జనుచో. - ౨౮౩

చ. అరనిమిసంబు నాథువిరహంబు సహింపనిబోటఁ గాంతుతో
నరిగెఁ దదీయపత్ని ; యతఁడట్లు వనంబున కేగి యొక్క-భూ
మిరుహామునుండి జాఱిపడి మేనుదొఱంగినఁ జిత్తమందు న
త్తరుణియుఁ జింతనొంద కతిస్థైర్యమున న్వసియించె ముంగలన్.

ఉ. కాటుకకొండఁబోలి తనుకాళిమదిక్కు-లఁ జిమ్మచీఁకటుల్
దీటుకొనంగఁ బె ల్లెరగలి న్వెదఁజల్లెడు కన్నుదోయియై
మాటికి మెల్కు-వారి విషమంబగు దంష్ట్రలు దీటుకొంచు న
చ్చోటికివచ్చెఁ గాలుఁ డొకశూలము కేలధరించి యుగ్రుఁడై.

క. మృతినొందిన రాసుతు నం
చితమతి నంగుష్ఠనిభునిఁ జెచ్చెరఁగొనుచుం
బితృపతి క్రమ్మఱఁజనుచో
వెతగొనకయె తరుణి యముని వెనువెంట జనెన్. ౨౮౬

క. తనవెంబడిఁ జనుదెంచెడు
వనిత న్వీక్షించి మధురవాక్యముల యముం
డను నిట్లు పాంచభౌతిక
తనువున నీవెంబడఁబోవఁ దలఁచితి వబలా. ౨౮౭

చ. మగనిని గూడివచ్చుటకుఁ మానుషము, మానుషము పాంచభౌతికం
బగు తనువుల్ బిరాన హృదయాధిపుతోడఁ జనందలంతువే
మిగుల నశాశ్వతంబయిన మేనున నాపురి కిట్లు వచ్చుటల్
నగవగుఁగాదె నాపుర మనశ్వరమంచును నీవెఱుంగవే. ౨౮౮

క. ఆయువు నిండిన నీపతి
కాయంబుఁదొఱంగె నిఁక స్వకర్మఫలములన్

నాయింట ననుభవించుట
కై యరుదేరఁగలఁ డింకఁ గలఁగకుము సతీ. ౨౮౯

సీ. కర్మంబులను జేయఁ గల్గును జన్మంబు
మరణంబు భూరిసంపదలు గల్గు
నిషమలు సంధిల్లుఁ బొడవగుదుఃఖంబు
లడఁగును సౌఖ్యముల్ దొడరు మఱియుఁ
బౌరందరపదంబుఁ జూఱఁగాఁగొనుటబ్బు
బ్రహ్మపుత్రత్వంబు బడయనగును
హరిదాసుఁ డగును జన్మాదిహీనుండగు
నమరును సర్వకామ్యములసిద్ధి

గీ. పొసఁగు విష్ణుసాలోక్యాదిముక్తులెల్ల
విబుధముని రాజమను రాజవిప్రరాజ
రాజశేఖరతావాప్తి రాజిలంగఁ
జెలఁగు నెయ్యెడలనుజూడ జీవునకును. ౨౯౦

క. ఇమ్మహిఁ జేసిన కర్మవ
శమ్మున సుఖదుఃఖములు యశమ్మపయశముల్
బమ్మెరయగు మాపటు స
ర్వమ్మును గర్మమున ననుభవంబగుఁ దరుణీ. ౨౯౧

చ. కడమయొకండు లేదిక జగంబున జీవునికర్మమూలమై
బడిబడి సర్వభాగ్యములుఁ బ్రాప్తములౌను నశించు దాన నీ
యొడయఁడు ధాత్రిలోనఁ దదవొంది చరించి గతించె; దీనికై
యడలఁగనేల గోలవయి యంగన! యూఱడుమింక నావుడున్.

క. కాలుని వచనం బాసతి
యాలించి ముదంబుతోడ నప్పుడు తనదా

గోలతనంబున నతనికి
జాలిం బుట్టించి యొక్క సందియ మడిగెన్. ౨౫౩

వ. మహాత్మా! కర్మ మనునది యెద్దాన జనించు? దానికి హేతు వెద్ది? తత్కారణం బెవ్వాఁడు? ప్రాణంబులు బుద్ధియు జ్ఞానంబు నింద్రియంబులు ననునవి యెట్టివి? తద్దేవత లెవ్వి? జీవాత్మకుం బరమాత్మకుం గల్గిన తారతమ్య మేమి? యనుగ్రహింపవే యనుచు దండధరుండు వేఁడియు నిట్లనియె. ౨౫౪

చ. పరమపతివ్రతామణి శుభంబగు ప్రశ్నముఁ జేసి తిట్లు లె
వ్వరు ననుఁ గోరఁబోరు విను వారక కర్మఫలానుభావియై
హరిపదభక్తిఁ గల్గి తృణహాటకముల్ సరిగాఁ గఁ జూచు నే
నరుఁ డతఁ డాధిమృత్యుజననప్రతిపక్షుఁడు ముక్తుఁడుం జుమీ. ౨౫౫

గీ. వేదచోదితకర్మంబు విహితమగును
శ్రుతిరహితకర్మ మెపుడు సంగతముగాదు
హేతురహితంబు సంకల్పహీనమైన
దేవసేవయె పరమభక్తిప్రదంబు. ౨౫౬

వ. ఓసతీమణీ! భగవంతుండగు పరమాత్మయే కర్మస్వరూపుండు హేతుభూతుండునగు. సదసద్భేదరూపంబగు జ్ఞానంబు నానావిధంబై పరఁగుచుండు; బుద్ధియు జ్ఞానబీజంబు; దేహికి బలరూపంబులు ప్రాణంబులు; రూపంబును జ్ఞానభేదంబై పరఁగుచుండుఁ; బ్రకృతిపరంబు సర్వవ్యాపకంబును నిర్గుణంబు నగునదియే పరమాత్మ యనంబడుఁ; బ్రాణదేహాదుల భరించునదియే జీవాత్మ యనఁబడు; నోపతివ్రతారత్నమా! దీన నీసంశయము దొలంగెఁ గదా! యింక యథేచ్ఛం బొమ్మనుడు సావిత్రి యిట్లను. ౨౫౭

ఉ. ఎచ్చటికేగుదాన హృదయేశ్వరుఁడుం దగు జ్ఞానసింధువీ
విచ్చటనుండఁ; జెప్పఁదగునే నొకప్రశ్నకు నుత్తరంబు వా
కుచ్చి యనుగ్రహింపుము నిరూఢిగ నావుడు దానిమాటకు
న్మెచ్చి సతీమణీ! యడుగుమీ మది సంశయమంచు నిల్చినన్.

సీ. జీవుఁ డేకర్మంబు సేసి యేయేజన్మ
లందు దా నుద్భవం బందుచుండు
ఎట్టికర్మంబుచే నిందరిత్వముంగొను
నరక మెద్దాన సందర్భమగును
ఏకర్మమున ముక్తి చేకొనఁదగియుండు
గురుభక్తి యెద్దానఁ గుదురనగును
సుఖదుఃఖములఁ జేయఁజూచు నేకర్మమ్ము
లామయ మెద్దాన నావహించు

గీ. అంధుఁడును కాణుఁడును పంగు వంగహీనుఁ
డల్పజీవుఁడు దేనిచే నగుదు రిలను
పదవు లెద్దానివలన సంప్రాప్తమగును
దెల్పవే నాకు దయతోడ ధీవరేణ్య. ౭౫౯

మ. సదయుండై యంతఁ గృతాంతుఁ డిట్లనియె నోసాధ్వీశిరోరత్నమా
పదుమూఁడేడుల ప్రాయపుంగలికి విద్వత్ జ్ఞానియోగీంద్రులున్
మదినూహింపనిప్రశ్నఁ జేసె దివియానందంబు చేకూర్చె నీ
కెది యిష్టం బది దెల్పు మిచ్చెదను నీ యాత్మేశునింగాకఁ కన్.

గీ. భర్త లేఁడటంచుఁ బరితాపమందకు
మఖిలసాధ్వులందు నగ్రగణ్య
వై నుతింపఁబడుదు వా రతిపోల్కి మాంగళ్యసిద్ధి నీకుఁ గలదుసుమ్ము. ౭౬౧

వ. అనవుడు సంతసిల్లి సావిత్రి యిట్లనియె. ౭౬౨

ఆ. వె. సత్యవంతువలన సంతతి నాకును
నాదుమామకు నయనములు మఱియు
రాజ్యలాభమును దిరంబుగ నాతండ్రి
కాత్మజనులు గలుగునట్టుగాఁగ. ౭౬౩

వ. అనుగ్రహింపవలయు.

క. అనవుడు నట్లయ్యెడు నీ
మనమునఁ గలకోర్కు లని శమనుఁ డనఁగా దే
వనదులకర్మవిపాకము
వినిపింపుమటంచుఁబల్కె వినయముతోడన్. ౭౬౪

ఉ. జీవుఁడు కర్మశేషములచే సుఖదుఃఖములన్ భరించి నా
నావిధయోనులందు జననంబయి సంచితకర్మలోలతన్
దేవవిభుత్వము న్నరపతిత్వము భోగము రోగమందు రా
జీవదళాక్షి! సూక్ష్మముగఁ జెప్పితిఁ దత్క్రమమెంచి చూడమా.

వ. అనవుడు,

ఆ వె. ధర్మరాజ! యెట్టి కర్మంబు లొనరించి
త్రిదివలోకముఖ్యపదవులెల్ల
ధరణిజనులు గాంతు రయనానతీఁగదే
యనిన నతఁడువలికె నతివతోడ. ౭౬౬

క. దానంబులందు నుత్తమ
దానము లోకమున నన్నదానముసుమ్మా
దానికిఁ గాలక్రమమును
న్యూనాధికవర్ణ భేద ముండదు సుదతీ. ౭౬౭

సీ. అన్నదానంబుచే నలవిష్ణులోకంబు
వస్త్రదానంబుచే వాయుపదవి
తల్పదానమునఁ జంద్రజగన్నివాసంబు
యానదానమునఁ దోయపతిజగము
దీపదానమున స్వాహాపాలువాసంబు
ఫలదానమునఁ ద్రిదివస్థలంబు
తిలదానమున పార్వతీధవావసథంబు
దంతిదానమున నింద్రత్వమబ్బు

గీ. కన్యకాదానమునను నక్షత్రనాథు
లోకమున పదునల్గురు నాకపతులు
దనుక స్వర్వైశ్వర్యతోడ మోదమునునుండి
ప్రియసతింగూడి జన్మము ల్వోయి గడపు. ౨౬౮

గీ. ఉభయతోముఖమగు గోవు నొసగువాఁడు
హేమరత్నాదికంబుల నిచ్చువాఁడు
సప్తసంతానవిధులను సల్పువాఁడు
కోర్కె దీరంగ నిల్చు వైకుంఠమందు. ౨౬౯

గీ. అశ్వమేధంబు రాజసూయంబుఁ జేయు
నరుఁడు సురపతి యర్ధాసనమున కర్హుఁ
డేమనుజునకు నేని దేవీమఖంబు
ముఖ్య మన్నిటికన్నఁ బ్రఫుల్లనేత్ర. ౨౭౦

మ. వినుమో సుందరి! సర్వయజ్ఞముల దేవీయజ్ఞమే మేటియై
చనుఁ గాన స్సరసిజగర్భుఁడును నీశానుండు పద్మాక్షుఁడుం
మనువుం దక్షసనత్కుమారులును సన్మానించి కావించి రెం
చను దేవీమఖ ముత్తమంబనుచు నుద్ఘోషించు వేదంబులున్.

క. కావున ననుదినమందుం
దేవీపాదార్చనంబుఁ దీరిచి తగఁ ద
న్నైవేద్యము భుజియించి ని
జావాసముఁజేరి మగనియాస విడువుమా. ౭౭౨

వ. అనిన మహాత్మా ! నరకకుండంబులు నానావిధంబుల నుండు నని వింటి వాని వేర్వేఱ నెఱింగింపు మనవుడు నోసతీమణీ ! దుష్కర్మంబు లొనర్చు వారేగు నరకకుండంబులు వహ్నితప్తవిణ్మూత్రదుస్సహాదులను నలువదికుండంబులు గలవు. అచ్చట భయంకరులును శక్తిహస్తులు దయాశూన్యులు పింగలోచనులునగు మదీయకింకరు లనేకులు గలరు. అట్టి యాకుండంబులు విష్ణుభక్తులు యోగులు స్వధర్మనిరతులు మున్నగువారు గన్గొనక యుత్తమలోకంబుల కరుగుదురు. ౭౭౩

క. హరిసేవాపరతంత్రులు
వరయోగవిశుద్ధమతులు వ్రతులు తపస్విల్
ధర బ్రహ్మచారులును నీ
నరకంబునఁ బడరు వారు నాశితవృజినుల్. ౭౭౪

మ. బల మొక్కింతయులేని బాధుప్రల దుర్వ్యాపావిధి న్బాధితాత్ములగాఁ జేసిన వహ్నికుండమునయందుం దుర్రింగి మైనెన్నియుణ్ గలుగుణ్ రోమము లన్నివర్షములదాఁక న్నిల్చి యామీఁద నుచ్చలితుండై పశుయోనియందుఁబొడముణ్ జన్మంబులణ్ మూడిటణ్

ఉ. ఆతపతప్తుఁడై కడుక్షుధాతురుఁడై ద్విజుఁడేగుదెంచెనే నాతనిఁ గొంచుఁబోయి కడుపారఁగ నన్నముఁ బెట్టనట్టి యాపాతకి తప్తకుండమునఁ బొల్పడి పెక్కుయుగంబు లుండి యాభూతలమందు పక్షితనువుం గొని పొల్పలు నేడు జన్మముల్.

చ. అమవసలందు శ్రాద్ధదినమందు సహస్కరువారమందు సం
క్రమణములందు వస్త్రములు క్షారకయోగముఁజేయు మానవా
ధముఁ డలక్షారకుండమునఁ దాపముఁ జెందుచునుండి పెక్కుక
ల్పము లరుగంగ ధావకకులంబునఁ బుట్టును సప్తజన్మముల్.

చ. హరిహరహేమగర్భులఁ దదంగముల న్మతి వారిమంత్రముల్
పరిభవ మాచరించు నలపాలసుఁ డెంతయు క్షారకుండమం
దఱువదివేలయేండ్లు పెను యాతనలం బడి కుంది పిమ్మటన్
ద్విరసనమై జనించి పరివేదనఁ బొందుచునుండు నుర్విలో.

గీ. దీనిఁ బోలి పాపాత్మిదమైన కుండ
మింక నొక్కటి లేదు లే దిలను; దేవి
పరిభవించిన జనులకుఁ బాచితంబు
పాపముల కెల్ల మొదటిదై పరఁగుకతన. ౭౭౯

చ. సుతులను దల్లిదండ్రులను సోదరులన్ గురువు న్సతి న్నుపో
షితులను జేయనట్టి కొలచే గరకుండములోపలన్ శర
చ్ఛతమగునంతకు న్నిలిచి తద్గరమున్ భుజియించుచుండి యా
చితగతి భూతమై పొడమి చేష్టమచుండు నిరంతరం బిలన్.

మ. అతిథిన్ గాంచి తిరస్కరించునరుఁ డయ్యావేళలం దా నొసం
గు తిలాంబుల్ గొననొల్లకుందు పితరుల్ క్రూరవ్యథంగుందుచున్
శతవర్షంబులు దూషికాంతమునఁ బైశాచాకృతిం దాల్చియున్
శతవర్షంబులు ధాత్రి దిమ్మరి తుదిన్ ధన్యత్వముంబొందెదున్.

మ. మును దా నొండొక యర్థికిచ్చిన ధనంబుం గ్రమ్మఱన్ లాతికిన్
గొనుమం చిచ్చిన భీకరంబగు వసాకుండంబునం గూలి దు
ర్జననం బొప్ప శరచ్ఛతంబు కృకలాసత్వంబునుంబొంది పి
మ్మనటం జెందఁగ మానవుండగుఁ గడున్ దారిద్ర్య మేపారఁగన్.

క. సురభూసురమాన్యంబులు
హరియించినయట్టి మర్త్యుఁ డఱువదివేల్వ
త్సరములు మలకుండికఁ బడి
పురువై జనియించి వగలఁ బొగులుం బిదపన్. ౭౮౩

క. తనకై యన్యుని జంపిన
మనుజుఁడు వేవేలయేండ్లు మజ్జాకుండం
బునఁ బడి శశికిటికుక్కుట
తనువుల ధరియించు మూఁడుతడవలు పిదపన్. ౭౮౪

గీ. బధిరుఁ గన్గొని కడుపరిభవముఁ జేయు
నతఁడు కర్ణవిట్కుండమునందుఁ గూలి
పెక్కువేలేండ్లు పొక్కుచుఁ బిదప నంగ
హీనుఁడుం బధిరుండునై యిలను బొడము. ౭౮౫

క. వ్రతముల నుపవాసములం
బితృదినముల ముండనంబు నిధువనము నసం
గతమని పీడని మనుజుం
డతఁడల నఖకుండమందు నార్తిఁ జెందున్. ౭౮౬

చ. పడఁతిరో కేశయుక్తమగు పార్థివలింగముఁ బూజసేయువాఁ
డడలుచుఁ గేశకుండమునయందు వసించి దురంతచింతలన్
బడిపడి కూలి కోపగరిమన్ శతవర్షము లేగునంతఁ దాఁ
బొడమును మ్లేచ్ఛుఁడై పిదపఁ బుట్టును రాక్షసయోనియం దిలన్.

గీ. విష్ణుపదమునఁ బిండ మర్పించనట్టి
మానవుం డాత్మలోమపరిమాణవత్స
రమ్ము లయ్యస్థికుండనరకమునఁ బడి
కుక్కురంబయి పిమ్మటఁ గుంభజుఁ డగు. ౭౮౭

క. వేఁకటియగు తనసతి ను
ద్రేకంబున నెవఁడు రతులఁ దేల్చు నతం డ
స్తోకవ్యథ నూటేండ్లు భ
యాకరమగు తామ్రకుండమందు వసించున్. ౨౮౯

గీ. కృష్ణసర్పంబులను జంపు నెవ్వఁ డాతఁ
డయుతవర్షము లహికుండమందు సర్ప
మలము దిని మఱి సర్పజన్మంబుఁబొంది
పిదప దానవుఁడై సంభవించు ధరణి. ౨౯౦

చ. జడియక తేనెటీఁగలను జంపి తదార్జితమైన తేనె గ్రో
లెడు జను మద్భటాళి యవలీల విషహ్రదమందుఁ ద్రోయఁగా
నడలుచు దంశభక్షితుఁడు నౌచు ననేకశతాబ్దముల్ చనన్
పుడమిని మక్షికాకృతిని బొల్చి యనంతరమందు శుద్ధుఁడౌ.

ఉ. నేరము లేని వాని నవనీసురు దండ్యులఁ జేయువాఁడు ఘో
ర్వారణవజ్రదంష్ట్రికల భక్షితుఁడౌచు క్షణక్షణం బహం
కారముఁ జేయుచుం గ్రిమముగా వనసూకరకాకజన్మముల్
ధారుణి నెత్తి పిమ్మట నతండు శుచిత్వముఁ గాంచు మానినీ. ౨౯౧

చ. విసమిడి నిర్దయత్వమున విప్రనిప్రాణముఁ గొన్నయట్టి పా
లసుడు నిరంతరం బిడుములం బడుచుం గరకుండమధ్యమం
దసురుసురంచుఁ గూలి శతహాయనము ల్చన నేడుమార్లు మా
నిసియయి కుష్ఠరోగమున నెవ్వగలం బడి శుద్ధుఁడౌఁ దుదిన్.

ఆ. వె. సరము నొడ్డునందుఁ జరియించు నక్రాది
జంతువులను గడిమిఁ జంపువాఁడు
నక్రకుండమం దనంతవత్సరములు
మసలిమసలి యంత మొసలియగును. ౨౯౪

ఉ. పాపబుద్ధిఁ జేసి పరభామ చనుంగవ నెమ్మొగంబు శ్రో
ణీపటిమంబుఁ బ్రేమ మది నెక్కొనఁ గాంచినవాఁడు ఘోరసం
తాపదకాకకుండమునఁ దద్దయుఁ గుందుచుఁ గాకలోకచం
చూపుటచూర్ణితాత్ముఁడగుచున్ శుచిగా నుగ్రమక్రమంబునన్.

శా. దేవద్రవ్యము దొంగిలించునరుఁ డార్తి స్వజ్రకుండంబునన్
దా వజ్రాగ్నులఁ గ్రాఁగి మిక్కిలి క్షుధాదాహవ్యథం గుంది రో
షావేశోద్ధతకింకరోత్కరకరవ్యాలోలవేత్రాహతిన్
వేవర్షంబులు బాధనొంది పిదప న్వీతాఘుఁడై ద్రిమ్మరున్.

క. ధర మ్లేచ్ఛుల సేవించెడు
ధరణీసురుఁడెంత కేనిఁ దఱుఁగనిచింతన్
జారలును మసికుండంబున
నిరతము మద్భటుల దండనిహతులఁ బడుచున్. ౨౯౨

ఉ. ధేనుగణంబు బ్రాహ్మణుల ధిక్కృతిఁ జేసినయట్టి పాపు
న్మానిసి నరకుండమున మాన్పడియుండి దరిద్రుఁడు స్సతీ
హీనుఁడు నస్వవాయపరిహీనుఁడు నంగవిహీనుఁడు న్నువి
జ్ఞానవిహీనుఁడై మనుజజన్మముఁ గాంచును మానినీమణీ.

క. తిలజఘృతాదికముల మ్ర
చ్చిలు మనుజుఁడు జ్వాలకుండశిఖల శతాబ్దం
బులు నిలిచి పిదప మూషక
జలచరజన్మములఁ బొంది చను శుద్ధుండై. ౨౯౯

క. పరిమళమగు ద్రవ్యంబుల
హరియించిన దగ్ధకుండమందు న్వేవ
త్సరములు పడి దుర్గంధము
భరియించును మర్త్యుఁ డగుచుఁ బదిజన్మములన్. ౩౦౦

మ. దొరలం దిట్టిన నన్యుఁగొట్టిన దరిద్రు న్నిందఁగావించినన్
బరదోషంబుల మెచ్చిన న్విబుధులం గార్హింపకున్న న్నిరం
తరసూచీముఖవిగ్రహోగ్రులై త్రియుగముల్గాఁక స్వవ్యథం జెందుచు
న్ధర ముపార్జాలులు సర్పవృశ్చికములై ధన్యుఁడగుం బిమ్మటన్.

గీ. గోవు దప్పిని జలములఁ గ్రోలునపుడు
విఘ్న మొనరించు మనుజుఁడు విపులతప్త
జలముగల గోముఖంబున లులితుఁడగుచు
నొక్కమన్వంతరం బట్టులుండవలయు. ౮౦౨

వ. నరుం డిట్లు తన సుకృతదుష్కృతకర్మంబుల కెట్లును ఫలం
బనుభవింపక పోరాదుసూనె; ఇంక నీవేమి యడిగెదు? సెప్ప
మనిన సావిత్రియు, ౮౦౩

గీ. ఓ మహాభాగ! సర్వజ్ఞ! యొక్కఁడింకఁ
బ్రశ్నఁ గోరెద నానాపురాణసార
మఖిలసమ్మత మభయంబు సుఖకరంబు
కర్మవిచ్ఛేదకం బెద్ది కలదొ చెప్పుము. ౮౦౪

వ. అనవుడు,

గీ. ధర్మశాస్త్రాదికముల వేదంబులం ద
దంగములను బురాణేతిహాసములను
సారమగు పంచదేవతార్చనము మఱియు
జన్మమృత్యు జరాదినాశకరంబు. ౮౦౫

గీ. పరమపదసౌధమునకు సోపానపంక్తి
భక్తిభూజంబునకు నాలవాల మఖిల
సిద్ధులకు కారణంబు సంసృతిపయోధి
తారణము పరదేవతాతర్పణంబు. ౮౦౬

మ. పరదేవీపరిపూజనంబు మదిలోఁ బాటించువాఁడు న్నిరం
తరము న్విష్ణుపదాబ్జయుగ్మ మెదలో ధ్యానించువాఁడు న్విహా
నరకద్వారముఁ జూడకుండఁ డొకఁ డెన్నం గల్గునే ధాత్రిలో
నరసంఘంబులకు న్మదీయపురము స్వర్గాకసోవ న్సతీ! ౧౦౭

క. దేవీభక్తుల శ్రీహరి
సేవాసక్తుల గిరీశసేవకులఁ గనం
గా వైనతేయుఁగను నుర
గావళిఘోలికను మద్భటాళి యడఁగెడుర్. ౧౦౮

చ. క్షితిని దదీయభక్తుల స్పృశించిన వారల పాపజాలముల్
హతమగు దావపావకమునంటిన శుష్కతృణాళిపోల్కి సం
తతమును వారిఁగొల్చెడి జనంబులు శాశ్వతపుణ్యమండల
స్థితిఁ గొను టబ్బిమే! యది త్యజించిన మత్పురిఁ జేరకుండుగే.

క. నావిని సతి యిట్లను పితృ
దేవా! పాపాత్ము లెట్టిదేహంబులతోఁ
దావకపురి కేతెంతురి మ
రేవిధమునఁ గష్టములు సహింతురు చెపుమా. ౧౧౦

వ. అనవుడు,

చ. కృతమగు పాంచభౌతికశరీర మశాశ్వత మగ్నిభస్మ సా
త్కృతమగు జీవు డంత బొటవ్రేలు ప్రమాణముగల్గునట్టి సూ
క్ష్మతనువుతోడ నెమ్మోయిని సంక్షయమందక దుఃఖియై పురా
కృత మనుభూతిఁ గాంచు నసికీలిశరాదికబాధ్యమానుఁడై.

క. ఓసాధ్వీమణి! నీవు బ్రి
యాసంబున నింతదనుక నరుదెంచితి పా

మీన్మ, సదనమునకు నాయమా
వాసం బికఁ జేర రెట్టివా రిబ్బంగిన్. ౪౧౨

వ. అనవుడు,

గీ. భర్త యెవ్వోటి కేగిన భార్య యచటి
కరుగు టుచితంబ కాని యన్యాయమగునె
హరిహరబ్రహ్మలకు దాని నడ్డగింపఁ
దరమె నీవు నెఱుంగవె ధర్మరాజ. ౪౧౩

మ. అనుచు న్నాసధ్వ గభీరతన్ బ్రబలధైర్యంబు న్మహాసాహసం
బునుగాఁ బల్కినఁ జూచి దండధరుఁడుం బూర్ణానుకంపాధ్యుఁడై
చనుమీ నీ పతితోడ నిచ్చితినన్ సంతుష్టయై భర్తతోఁ
జనియెన్ సావిత్రిమ మత్తమామలుమహాశ్చర్యంబుతోఁ జూడఁగన్.

వ. అని వచించుటయు,

మ. అల వైకుంఠమునందు శౌరి యురమం దశ్రాంతవిశ్రాంతి నొం
దు లతాంతాయుధుతల్లి కల్మిచెలి పాథోరాశిగర్భంబునం
గలుగం గారణమేమి చెప్పుమనఁగా నారాయణుం డాదటన్
జలజప్రోద్భవసూతి కిట్లనియె నానందంబు సంధిల్లఁగన్. ౪౧౪

శా. దుర్వాసోమునిదత్తశాపమున సద్యోభ్రష్టలక్ష్మీకుఁడై
గీర్వాణాధిపుఁ బాసి లచ్చి హరిచక్రంజేరె బృందారకుల్
స్వర్వాసంబులు వీడి శోకమెదఁ బర్వన్ ధాతతో నీతిమై
సర్వంబు న్విన్నవించి రచ్యుతదిదృక్షాసక్తచిత్తాబ్జులై. ౪౧౫

ఉ. ఎల్లసురల్ విరించియు వహింప సహింపఁగరాని నెవ్వగన్
మెల్లనఁబోయి శౌరిఁగని మించినభక్తి నమస్కరించి మో
మల్లనవాంచియున్న చతురాస్యుఁడు వీసరపోనివంత లో
వెల్లియొనర్ప నిందుగతి వెన్నునకు న్విన్నవించె నయంబునన్.

ఉ. ఆవనజేక్షణుండు జనితాదరుఁడై సిరి బిల్వఁబంచి యా
దేవి నిజాంశమాత్ర జలధిం బొడమ న్నియమించి ధాత సం
భావితుఁ జేసిపుచ్చిన నమందరయంబున వార్ధిద్రచ్చి పై
త్యావళి గెల్చి లక్ష్మిఁగొని నాకమునన్ సుఖులైరి దేవతల్.

వ. అనిన నారదుండిట్లనియె. ౧౧౯

మ. చతురామ్నాయరహస్యవేది శమితస్వాంతుండు వ్యాసుఁడా
క్షితిభృద్భేదికి శాపమేమిట నొసంగ న్వేల్పులుం దైత్యులే
గతి వారాశిని ద్రచ్చి రాసిరి గొనంగా వేల్పు లెట్లోపి రా
నతియీవే వినవేడ్కయయ్యెడు నన న్నారాయణుం డిట్లనెన్.

క. జంభారి మద్యపానవి
జృంభితుఁడై వెండికొండశిఖరంబున సం
రంభము మీఱఁగ నిచ్చలు
రంభాసంభోగకేళిరతుఁడై వెలసెన్. ౧౨౧

ఉ. వాసవుఁ డంగజజ్వలనబాధితుఁడై యలరంభ గూడి వై
లాసమున స్వదారతికళాకుశలుండయి దంతినెక్కి యు
ల్లాసమెలర్పఁ దగ్గిరివిలాసములం గను నొక్కవేళ దు
ర్వాసుఁడు కృత్తివాసుఁ గను వాంఛ యెలర్పఁగఁబోవుచుండఁగన్.

ఉ. నీతిదలిర్ప నవ్విబుధనేతయు నేనుఁ గుడిగ్గి శిష్యసం
ఘాతసమేతుఁ డమ్మునికి గారవమొప్ప నమస్కరించినన్
బ్రీతినొసంగె మాని నగభేదికి ఘోరరుజాజరాంబుభృ
ద్వాతము నిత్యసంశమితపాతకజాతముఁ బారిజాతమున్. ౧౨౩

ఉ. మౌని యొసంగినట్టి కుసుమంబును దా నయమేది యాశచీ
జానియు హాస్తిమస్తమున జాఱఁగవైచె సుమప్రసక్తి న

య్యేనుఁగు తేజుచేతఁ గమలేశసమాకృతియై రయంబునన్
గానవవాటికిం జనియెఁ గానఁగరాక బలాసురారికిన్. ౧౨౪

శా. హాలాస్వాదనసంప్రమత్తుఁడగు సయ్యాఖండలుం డెంతయే
నాలోచింపక పారిజాతకుసుమం బాహస్తిమస్తంబునన్
గూలనైచినఁ జూచి లేచి మునియుం గోపస్ఫురద్భ్రూకుటి
వ్యాలోలాననుఁడౌచు నిట్లనియె జంభద్వేషిఘూర్ణిల్లఁగన్.

ఉ. కానవు వైభవాంధ్యమునఁ గావరమెత్తి సతంబు మద్యమున్
బానముజేయు చొక్కవెలభామినిగూడి రమించుచుండి దు
ర్మానముపేర్మి నన్ను నవమానితుఁ జేసితి పూవొసంగినన్
దానిని హస్తిమస్తకమునం బడవైచి తిదేమి దుర్మతీ. ౧౨౬

ఉ. వెన్నున కాదరంబుగ నివేదితమైన పదార్థ మబ్బనే
నిన్నయమూని దానిని గ్రహించి భుజించిన నెట్లునన్ శుభా
భ్యున్నతి గల్గుఁగాని కొని యూరక పాఱఁగవైచెనేని ని
ర్భిన్నసుఖస్థితుండు సవివేకియు నౌ నిల బ్రహ్మహుండగున్.

క. హరినైవేద్యాస్వాదన
నిరతుండగు నరుఁడు విష్ణునిభుఁడై వెలయున్
ధరయుఁ బవిత్రితఁ గనుఁ ద
చ్చరణాబ్జరజం బొకింత తను సోఁకినన్. ౧౨౮

క. ఏయెడ హరి నైవేద్యముఁ
జేయక భుజియింపఁ డటు భుజించినయేనిం
బాయును సిరియును సతతా
పాయంబును గల్గు రోగబాధితుఁడు నగున్. ౧౨౯

వ. వేయేల హరికి నివేదితంబయిన పదార్థంబు యథార్థంబుగ
మాంసతుల్యంబు ; పుంశ్చల్యన్నపిరాన్నశూద్రాన్నంబులును

జికిత్సకద్విజాన్నంబును దేవలాన్నంబు యోనిజీవులయన్నంబును కన్యావిక్రియులయన్నంబును నుచ్ఛిష్టాన్నంబును, శవదాహకాన్నంబును నదీక్షితాన్నంబును మంత్రద్రోహులయుఁ గృతఘ్నులయు విశ్వాసఘాతుకులయు మిథ్యాసాక్షులయు నన్నంబు హరికి నివేదితంబయినఁ బదపడి భుజింపందగు; విష్ణుసేవాపరుఁడైన వాఁడు శ్వపచుండైనను వంశశతం బుద్ధరింపఁగలండు; హరిసేవాహీనుఁడు బ్రాహ్మణుండయ్యును స్వరక్షణోపాయావాయుండగు స్నానంబున నయినవిష్ణునిర్మాల్యంబు కొండొక దాల్చినచో నిరస్తసమస్తకిల్బిషుండగు; నిది నేరక, ౧౩౦

క. సుమనోవరుఁడ వటంచును
సుమనోహరమైన యట్టి సుమనోవరముల్
బ్రమదంబున నొసఁగంగాఁ
గుమతీ! విడిచితివి కుంభికుంభమునందున్. ౧౩౧

మ. నయమొప్పన్ హరిపూజఁ జేసి హరికి న్నైవేద్య మర్పించి స
న్నియతిం గాలముఁ బుచ్చువాఁడను నను న్వీక్షించినన్ మిత్తియున్
భయముం జెందు జరారుజ ల్వెఱచు నానైవస్వతుండున్ గత
స్మయుఁడై పాఱెడు నన్యు నేల గణియింప న్నాకు నో దుర్మతీ.

క. నీతాత కశ్యపుండని
ఖ్యాతచరిత్రుఁడు గురుఁడు బృహస్పతి యనియున్
బోతరమునఁ జరియించెద
వే తాపసినంచు నెఱుఁగవే దుశ్చ్యవనా. ౧౩౩

ఉ. ఎందఱు నీకుఁ బ్రాపయిన నింతయు లేదు భయంబు నాకు న
న్నింద నవజ్ఞఁ జేసితి వహీనతపోబలశాలినంచు నా
యందు నయంబుఁ జేర్ప కటులాటను మిమ్ములఁ జేరదింక నా
యిందిరయుం దిరంబ కమలేశ్వరు మందిరమందు నిల్చెడున్.

ఉ. సారెకుఁ గోప మేపుగని శాపమొసంగిన యట్టి యానిరా
బారులరాయనిం గని యపారభయంబున మైఁజెమర్ప లోఁ
గూరిన వంతలం బొగిలి కుందుచుఁ దాళఁగఁజాల కప్డు దు
శ్చెచ్చరవమొప్ప మొఱ్ఱయిడె శైలవిహారులు తత్తఱింపఁగన్.

క. దొందము వగులఁగ నాసం
క్రందనుఁ డామహానిశాప రచనాగతి నా
క్రందన మొనరించుచు సుర
వందితుఁడయ్యును మునీంద్రు పదములఁ బడియెన్.

ఉ. పోయినకల్మిఁ గోరుటలు బోలదు నాకిఁకఁ గల్మి బుద్బుద
ప్రాయము దానిచేఁ గడు నపాయము గల్గుచునుండుఁ గాన నే
నీయెడ నిష్టశాపము సహించితి నెంచితి బంధమోక్షమున్
జేయఁగ నామొఱం గరుణఁ జేయుము చేయుము జ్ఞానదానమున్.

వ. మహాత్మా! సమస్తవిపత్పరంపరాకారణంబై యపవర్గమార్గకంటకంబై భక్తిలతామూలచ్ఛేదంబై జ్ఞానవినాశననిదానంబైన వైభవంబున నొక్కింత ప్రయోజనంబు గాన ననిన, మునీంద్రుండు సురేంద్రుంగాంచి సంపన్మత్తుండు సురాపానమత్తునిం బోలి బంధుపరివేష్టితుండయ్యును నవిశ్వసనీయుండగు; సంపన్మత్తుండు విషయాంధుండై రాజసతామసగుణోపేతుండై సత్వమార్గంబుం గనుంగొననేరండు; జనలోకంబు ప్రకృతి పరంబయి దుఃఖార్ణవంబుల కర్మగతి మునుఁగుచుఁ దేలుచు నిర్వాణంబుం బొందనేరక మృత్యుశోకామయకారణంబులయిన జన్మంబుల ననేకయోనులందు మరలమరలఁ బుట్టుచు గిట్టుచు భక్తిమార్గంబున హరికరుణ వడసి కొండొకకాలంబునకు సద్గతిం బడయు శతసహస్రంబుల గణియింప నొక్కరుండు సంసారార్ణవతారణైకదక్షుం డగపడు సజ్జనుండు సత్వప్రధానుండై ముక్తి

మార్గనిరోధంబైన రాజసతామసంబుల బారింబడక యనుదిన
సేవ్యమానకురతత్త్వుండై యనశ్వరంబైన యపవర్గసుఖంబుం
బొందఁగలండు; జీవుండెన్నివిధంబులను సంసారబంధమోక్షణోపా
యంబుఁ జింతించుట లెస్సయగు; జన్మయోగంబునం జేసి యనళ
నుండై నిర్విఘ్నంబైన తపం బొనర్చినచో ముక్తిగలుగు ననిన
సంతసించి మునీంద్రుఁ డీడాక్షని వర్ధితవైరాగ్యుండై వృత్రవైరి
యమరావతికిం జని యందు నెల్లకడలు దైత్యావృతంబులై విష
మోపప్లవంబులై దుష్ప్రవేశంబులై యుండుట వెరఁగుపడి
భాషాకాంతున కయ్యుదంతం బంతయు నివేదింతునని పయనంబై
చనుచుండి మందాకినియం దస్పందహృదయారవిందుండై యర
విందబాంధవున కభిముఖుండై సమాధినిష్ఠుండై యున్న బృహ
స్పతిం గని కొంతవడి నిలిచిన. ౧౩౮

ఉ. ఆసురుఁ డబ్జబాంధవున కర్ఘ్య మొసంగి ప్రతీరభూమికిన్
రాఁగనె వాసవుం డతను ధరాస్థలి ఫాలము సోక మ్రొక్కి త
త్స్వాగత మాలకించి తనశాపవిధంబును దెల్పినన్ రుషా
వేగమనస్కుఁడై గురుఁడు వేలుపురాయని గాంచి యిట్లనెన్.

ఉ. అంతయు నే నెఱుంగుదు సురాధిప ! యింతగఁ జెప్పనేల జ
న్మాంతరకర్మభాజనములై రథచక్రము వోవుభంగి న
త్యంతము చంచలంబులు శుభాశుభము ల్వరవేది దీనికై
చింతిలనేటి కీఁగలిని చిత్తము చేష్టపడఁ గాతరుండవై. ౧౪౦

క. క్షితి నెల్లభూతములకుం
గృతమనుభోక్తవ్య మని త్రయిం గన నొప్పున్
గతజన్మభుక్తశేషము
వితయగునా దాని ననుభవింపఁగ వలదా.

క. జీవుఁ డొనరించు కర్మమే చేయఁజాలుఁ
గష్టసుఖములు దైన్యంబు కలిమి చెలిమి
స్వర్గలోకాధిపత్యంబు క్ష్మావిభుత్వ
ములును ; దానికి నడలంగవలదు జనుఁడు. ౮౪౨

క. దానము పాత్రున కీనలెఁ
గాని యపాత్రునకు నీయఁగా నశుభంబుల్
గానఁగ నగు దాత కదుర్
న్యూనాధిక భేదములు గనుంగొనవలయున్. ౮౪౩

వ. నరుండు దేశకాలపాత్రానుసారంబుగా దానంబు లాచరింప వలయుఁ; దత్తదనురూపంబులగు ఫలంబులుం బొందుచుండు చవుటినేలం జల్లిన బీజంబులు మంచివైనను గేదారంబునుంబోలె సస్యాభివృద్ధిని గొననేరనట్లు లపాత్రున కొసంగిన యీఁగియును ఫలహీనంబగుఁ గర్షకుండు సుక్షేత్రంబునుంబోలె దాతయు పాత్రు నన్వేషింపవలయు; సామాన్యదివసంబుల నొసంగెడు దానంబున నగు ఫలంబుకంటె నమవసలందును రవిసంక్రమణంబునందు నొసంగిన దానంబున ఫలంబు నూఱుమడుంగు లధికంబు; చాతుర్మాస్యలఁ బౌర్ణముల నొనర్చిన దానంబున ఫలం బనంతంబు ; సూర్యచంద్రగ్రహణంబులఁ జేసిన దానఫలంబు గణింప నలవి కాదు; కుంభకారుండు మంటిచేఁ గడవలం జేయు గతి ధాతయు జీవుల కర్మసూత్రంబున ఫలంబు లొసంగుచుండు ; సృష్టిస్థితిలయ కారణంబులయిన విధిహరిహరాకారంబులఁ బ్రకృతిపరుండై పరమాత్మ వెలుంగుచుండు. ౮౪౪

క. ఆపద గలిగినయెడ ల
క్ష్మీపతి సేవించెనేని మేలగు భవసం

తాపము వాయు నటంచును
రూపించి వచించె తొల్లి రుద్రుఁడు నాతో. ౮౪౫

క. అని పలికి శక్రు నాలిం
గన మొనరిచి సర్వసౌఖ్యకలితుఁడ వగుచున్
మనుమని దీవన లిడిన
స్మనమున హరిఁ బ్రణుతిఁ జేసి మానితభక్తిన్. ౮౪౬

క. పురుహూతుండును కమలా
వరునకు వందనముఁ జేసి భక్తి గురుపుర
స్సరుఁడై వెడలెను వాణీ
శ్వరునిం దర్శింప విబుధసహితుం డగుచున్. ౮౪౭

చ. గురువు విధాతలోకమునకుం జని కాంచనగర్భుఁ గాంచి త
చ్చరణరజం బొకింత తనశంఖతలంబునఁ దాల్చి గోత్రభి
చ్చరితము విన్నవింపఁగ హసన్ముఖుఁడౌచు వినంచి వల్కె నా
సురవరుతోడ నిర్మలవచోగరిమంబు తదార్తి నాఱఁగన్. ౮౪౮

శా. నావంశంబున జన్మమంది యమృతాంధస్స్వామివై యుండి యెం
తే వైదుష్యము నాబృహస్పతికి నంతేవాసివై కాంచి యి
చ్ఛావృత్తిన్ జరియించు నీకిటుల రోషం బూనఁగా నేల కో
పావిష్టుండు విపత్పరంపరలచే నశ్రాంతముం గుందఁడే. ౮౪౯

క. జనని పతివ్రత జననీ
జనకుండు న్నాతులుండు శాంతులు జనకుం
డును విజితేంద్రియుఁ డగుచో
మనుజుం డెటు క్రోధి యగును మదిలోనైనన్. ౮౫౦

వ. నరుండు పైతృకంబయిన దోషంబునను మాతామహదోషంబు
నను గురుదోషంబునను నిజంబుగ హరికి దోషియగు; సచ్చిదా

నందస్వరూపియగు పరమాత్మ భూతదేహంబునందుండి వెడలు నప్పుడు తత్కళేబరంబు శవంబునాఁ బరఁగు; జ్ఞానరూపుండగు శివుండును పరమాత్మకుఁ బ్రతిబింబంబు; జీవుండును విష్ణుప్రాణం బయిన ప్రకృతియగు; నింద్రాదులు శక్తులు; పరమాత్మ జీవిశరీ రంబు దొరంగునప్పు డన్నియును జవుని దొలంగు; శివుండును శేషుండును నేనును విరాట్స్వరూపుఁడగు విష్ణువునకు ననువర్తుల మయి యుండుదుము; మీరలు విష్ణుభక్తులయ్యును బరమభక్తుం డగు దుర్వాసుం డొసంగిన కృష్ణపాదచ్యుతంబయిన పుష్పంబును కరిమస్తకంబున నైచితివి. దైవోపహతుండ వగుట నాగజంబు ననుదినంబును బూజింపవలయు; భాగ్యహీనుండగు జనుండెవ్వరి కిని రక్షింప నసమర్థుండు. ౧౯౧

క. హరినిర్మాల్యము దొఱఁగిన
దురితంబున కల్మిబోటి దొలఁగెను జనుఁడి
సరగున వైకుంఠమునకు
హరి సందర్శింపఁగా బృహస్పతితోడన్. ౧౯౨

చ. అని సురనాథుఁ డూఱడిల నంబుజగర్భుఁడు పల్కి తానునున్
జని జలజాక్షుఁ గాంచి యవిశంకటవృత్తి నమస్కరించినన్
వనజవిలోచనుండు హతభాగ్యుల శోకవిభిన్నచిత్తులన్
వినయవిచారుల న్విబుధవీరులఁ గాంచి కడంక నిట్లనెన్. ౧౯౩

ఉ. వేఁగలుగంగ మీకు భయమేటికి దేవతలార సర్వసౌ
ఖ్యాగతి హేతుకంబయిన యట్టి సిరిం గడుబ్రీతి నిత్తు ని
చ్ఛాగతి నుండుఁ డింకఁ బురుషార్థనిదానము సారభూతమౌ
లాగువహింతు నొక్కముదలన్ వినుఁ డీరలు శోభనంబగున్.

చ. ఇలఁ గల రెందఱేని మదధీనులు భక్తిపరాయణుల్ స్వతం
త్రులు సకలార్థసాధకులు దూషిగ వారిఁ దిరస్కరించినన్
గలుగవు భోగము ; ల్గలుగుఁ గాని దరిద్రత ; నేను లక్ష్మితో
నిలువను వానియింట నతనిం గని రోయుదు రెల్లసజ్జనుల్.

శా. దుర్వాసుండు హిమాంశుశేఖరకళోద్భూతుండు మద్భక్తిచే
హర్షన్ మున్ముసుబొందువాఁడతనికే నశ్రాంతముం గూర్చెదన్
గర్వాభ్యున్నతిఁజేసి యాతనిఁ దిరస్కారంబుఁ గావింప నే
నోర్వంజాలక యిల్లు సేరితి రమాయుక్తుండనై యీ గతిన్.

సీ. మంగళాస్పదమైన మధురశంఖధ్వని
వఱలుచునుండ దెవ్వానియింట
హరివాసరమునందు నన్నంబు భుజియించు
మానవులుండు రెవ్వానియింట
నాభక్తులను గాంచి నయమేది దూషించు
వారు వసింతు రెవ్వానియింట
అభ్యాగతబ్రాహ్మణాభ్యవహారముల్
మాని భుజింతు రెవ్వానియింట

గీ. బాలికను విక్రయించిన వానియింట
నిముసమయినను లచ్చి తా నిలువనొల్ల
దాత్మకిరవైనయెడకుఁ దా నరుగుఁ గాని
కలిమిచెలి నెఱుఁగవె బహుచ్ఛల యనంగ. ౧౫౭

క. కరజములఁ దృణముఁ దుంపినఁ
బోరిఁబోరిఁ దత్కరజములను బుడమిని రాయన్
సిరిపడఁతి వాని యింటన్
జరణంబుల నిలుప దోకక్షణకాలంబున్. ౧౫౮

చ. ఇనుఁ డుదయించువేళ భుజియించుఁ బవల్ మరులూను నెమ్మి మై
థునరతిఁబూను వస్త్రరహితుండును స్నిగ్ధపదుండునై ముదం
బున శయనించుఁ దా ననృతముం బచరించును నవ్వు మాటికిం
గొనకొని పల్కు నానరుని గొబ్బునఁ బాయును కల్మి వాసవా.

క. తైలవిలిప్తాంగుండై
తా లాఁతుల యొడ లోకింత తాఁకినయేనిం
బోలదు సిరినిలువంగా
వాలాయం బాపదలకు వాఁడే యిరవగుం. ౧౬౦

క. తనయొడలందున వాద్యము
లొనరించినవాని, భక్తు నుర్వీసురునిం
గని నిందింపఁగఁ దివిరెడు
మనుజునిఁ గని దొలఁగు సిరి యమాన్యుఁ డటంచుం.

క. చింతిల్లుట యభియాతుల
కెంతయు నెల్లిదముగాన నీరలు ధైర్య
స్వాంతులరై త్వసరదీ
కాంతుని వెసఁద్రిచ్చుఁ బొందుఁ గమల వొడమొపం.

క. జలనిధిఁ ద్రచ్చినచో నటఁ
గలుములచెలి వొడము మి మ్మఖండవిభవసం
కలితులఁ జేయును బొందని
పలికి సనెం శౌరి లోనిభవసంబునకుం. ౧౬౩

మ. అమరు లొక్కండొకవాసరంబులకు బాహాగర్వ మేపార సం
భ్రమ మొప్పంగఁ బయఃపయోనిధిని జేరంబోయి మంథాద్రిక
వ్వము నాగాధిపు రజ్జుఁజేసి తరువ న్వారాశిఁ జూపట్టె సం
దమృతం బశ్వము గోరు లచ్చి వనమాలామల్ శుభాభ్యున్నతిం.

క. వనమాల నిచ్చి రమరులు
వనజాతాక్షునకుఁ గల్మిపడఁతుక సనియెన్
ఘనపఘకేశుని ముదలం
గొని నాకంబునకు సురలకోరిక దీరన్. ౧౬౫

మ. మును గోలోకమయినలక్ష్మి గ్రమ్మఱఁగ వేల్పులోకంబుదియానందులై
చని నాకంబున సౌఖ్యమందిరి యథేచ్ఛన్; లక్ష్మివృత్తాంతమున్
ఘనపాపాంతము దీని విన్న జనము ల్కల్యాణము ల్గాంతు రిం
కను నివెద్ది వినంగఁ గోరితి వసంగా నారదుం డిట్లనెన్. ౧౬౬

మ. సకలామ్నాయరహస్యవేదివగు నీచంచత్కృపాలబ్ధిచే
నకలంకంబగునట్టి పెక్కులు నుపాఖ్యానంబుల న్వింటి నే
నిఁక నామ్నాయపురాణగూఢముగ నేయేసత్కథల్గల్గు మా
మకచిత్తంబు ప్రమోదమంద వచియింపం జెల్లదే నావుడున్.

చ. కలవు శ్రుతిస్మృతిప్రథితగాథ లనేకము లప్రకాశ్యముల్
కలుషనివారకంబు లటుగావున నెద్ది వినంగ నీమనం
బలవడుఁ జెప్పు మద్దియె రహస్యమునైనను నానతిత్తు నా
జలజభవాత్మజుండనెఁ బ్రశంస యొనర్చుచు నమ్మునీంద్రుతో.

క. దేవా ! యగ్నికి దారలు
మూవురు గలరనుచు వింటి ము న్నలస్వాహా
దేవియు స్వధ దక్షిణ యనఁ
గా వారి చరిత్రఁ జెప్పఁగాఁదగుఁ గరుణన్. ౧౬౯

క. ఖ్యాతచరిత్రుఁడగు నా
సూతుఁడు నారదుని గాంచి శ్రుతిసంకలితం
బై తగు స్వాహోదంతముఁ
గౌతుకమునఁ బలికె నిట్లు గౌరవమొప్పన్. ౧౭౦

క. అజుఁడు జగత్త్రయమును మును
సృజియించిన పిదప నెల్లజేజేలు క్షుధన్
గజిబిజిఁబొందుచు రహి నం
బుజగర్భుని గనుఁగొనంగఁబోయిరి కడఁకన్. ౮౭౧

క. పోయి విధాతృని యడుగుం
దోయికిఁ బ్రణమిల్లి నయముతో క్షుద్బాధా
పాయముఁ జేయు మటంచును
వేయోజల నుతులుసేయ విధ్యుక్తముగాన్. ౮౭౨

క. లోకేశుఁడు విబుధులతో
వైకుంఠునికడకుఁబోయి పల్కెను విబుధా
నీకము నాఁకలి యుడుపఁగ
దే కరుణామయి యనన్ రమేశుం డనియెన్. ౮౭౩

గీ. అబ్జసంభవ! వినుము బ్రాహ్మణులు మఱియు
క్షత్రియులు సంతతముఁ జేయు జన్నములను
వేల్చు హవ్యంబుఁ గొనఁగ నీవేల్పులకును
జనదె యడియాస లేటికిఁ జనుఁడు వేగ. ౮౭౪

వ. అనిన విని వాణీకాంతుండు హరిని శరణంబు వేఁడి తదాజ్ఞానుసారంబునఁ దన్మాయాస్వరూపిణియగు ప్రకృతిని ధ్యానపూర్వకంబుగా సాక్షాత్కారంబుఁగావించి వైశ్వానరునకు దాహకశక్తివి కమ్మని "నినుఁదొలంగి యతండు హవ్యంబు దహియింపఁజాలఁడు; నరులు నీనామం బుచ్చరించుచు నగ్నియందు హవ్యంబు వేల్చుచుందురు; నీవా హవ్యంబు సురలకుఁ గొననగు నట్లనుగ్రహింపుము. ఇది మొదలు సమస్తదేవతలచేఁ బూజింపఁబడుచుందు"వనిన విని ప్రకృతి విషణ్ణచిత్తయై నలువం గని మహాత్మా!

నేనెట్లును వీతిహోత్రునకు దాహకశక్తినై యుండనేరఁ బ్రకృతి పరుండగు పరమాత్మంగూర్చి తపంబొనర్చెద, దానికంటెఁ బ్రయోజనం బొక్కండునుగాన నని చెప్పి యద్దేవి శ్రీమహావిష్ణువుంగూర్చి లక్షహాయనంబులు తపంబు సల్పుటయు, నారాయణుం డొకనాఁడు ప్రత్యక్షంబగుడు నోడ లెఱుంగక మూర్ఛితయై యున్నఁ దదభిప్రాయంబు నెఱింగి తపోదీక్షాక్షీణాంగియగు నాలతాంగిఁ గరంబుల నెత్తి యూరుభాగంబున వసియింపఁజేసి కనికరంబుతోఁప నిట్లనియె. ౮౭౫

మ. పువుఁబోఁడీ! చిరకాల మీగతి తపోముద్రావినిర్నిద్రవై
పవలున్ రేలును బెక్కుకష్టములకుం బాల్సేయఁగా నీయెడల్
దప్పునే! నగ్నిభిన్నస్వామునకు మోదంబొప్పఁగా నాత్మసం
భవవై నాకును బత్నివౌదువు సుమీ వారాహకల్పంబునన్.

క. స్వాహా యనఁగ నగ్నికి వరారోహవగుచు
'దాహికా' శక్తివగుచు నుత్సాహి వగుచు
మోహపరవశుఁ డగుచు నారోహితాశ్వుఁ
డహరహంబును నినుఁగూడి యలరుచుండు. ౮౭౭

ఉ. నీరజలోచనుం డిటు లనేకవిధంబులఁ గొంత యుమ్మలం
బాఱఁగ నూఱడించి చనె; నగ్నియు ధాతయనుజ్ఞ వంత లోఁ
గూర సతీసమీపమునకుం జని ప్రీతిఁ దదీయపాణిపం
కేరుహముం గ్రహించెఁ గడుఁ గేవలమర్త్యగతిన్ యథావిధిన్.

ఉ. దాఁపగరాని మోహపరితాపముచే ననిలాప్తుఁ డొక్కర
మ్యోపవనస్థలంబునకు నుగ్మలితోఁ జని యంగజాతకే
ళీపరతంత్రుఁడై తనర లేఖశరచ్యుతమయ్యె నంత ను
ద్దీపితమయ్యెఁ జూలు సుదతీమణికిం గడు నబ్బురంబుగన్. ౮౭౯

వ. అంత ద్వాదశాబ్దంబులు గడచిన నొక్కనాఁడు ఆహవనీయము
గార్హపత్యము దక్షిణాగ్నియు జన్మించిరి. ౮౮౦

క. భూమిఁ గల నృపులు మహాసు
త్రాములు నతిభక్తి హవ్యదానంబులు స్వా
హామంత్రంబుల వ్రేల్చిరి
కామితసంసిద్ధి గలుగుఁగాత మటంచున్. ౮౮౧

క. పతిసేవ లేని మానిని
గతి ఫలములులేని మ్రానికైవడి స్వాహా
యుతమంత్రహీనమగు నా
హుతియును విఫలంబు సుమ్మి యూహింపంగన్. ౮౮౨

క. స్వాహాకరుణాభరమున
నాహారము గలిగెనంచు నఖిలవిబుధులు
త్సాహముతోడను ద్విజద
త్తాహుతులను బొంది స్వస్థులైరి మునీంద్రా. ౮౮౩

వ. అంత నాపితృసప్తకంబు తర్పణసహితంబైన శ్రాద్ధంబు నాహారంబుగా విధిచేఁ ఒడసియును బ్రాహ్మణులవలన నలవడక క్షుధాతురులై బ్రహ్మసభకుం బోయి ధాతకు నివేదించిన వాణీకాంతుండు కరుణాంతరంగుండై యనన్యసాధారణలావణ్యరేఖామాన్యయగు నొక కన్యను మానసజన్యం గావించి పితృసప్తకంబున కొసంగి వారల భార్యగాఁ గైకొన నియమించి పుచ్చి స్వధాంతమంత్రపూర్వకంబుగా శ్రాద్ధంబు దాతవ్యంబని బ్రాహ్మణుల కాజ్ఞాపించె ; నంత బ్రాహ్మణులు స్వధామంత్రోచ్చారణపూర్వకంబుగఁ బితృసప్తకంబునకు శ్రాద్ధదానంబుఁ జేయుచుండిరి ; దేవ

దానంబున స్వాహాదేవియుఁ బితృదానంబున స్వధాదేవియు
నన్నింట దక్షిణయును బ్రధానదేవతలై యుందురు. ౧౧౪

క. పితృసప్తకంబు దేవ
ప్రతతియు మనువులును మానిరాజులు కుతుకా
న్వితులై స్వధాసపర్యా
మతులై రది మొదలు తుష్టిమానితు లగుచున్. ౧౧౫

మ. అవధానంబున వింటివే ప్రకృతిషష్ఠాంశంబె యీషష్ఠినాఁ
దవి సేనాని కనుంగుఁబోటియయి పోతత్రాణధౌరేయయై
చవగండంబుల మాపుమాపి శిశుపార్శ్వస్థాయియై వాని కా
యువు పెంపొంద నొసంగు మాతృకలలో నొక్కర్తుజుమ్మీ మునీ.

గీ. తత్సపర్యావిధానంబు ధర్మవక్త్ర
గదితమై తొల్లి యెయ్యది విదితమయ్యె
నద్ది వినుపింతు మిగుల సౌఖ్యదము పుత్ర
పౌత్రసంవర్ధనంబు సంపత్ప్రదంబు. ౧౧౭

క. వినియుండుదువు స్వాయంభువ
మనువనఁగా వెలయు విబుధమానితయశు నా
తనికిం గాదిలికొడుకై
యనఘుఁడు జనియించె తాఁ బ్రియవ్రతుఁ డనఁగన్.

మ. అతఁ డన్వర్థతనావహించుచును రాజ్యత్రాణసంరక్తి మా
ని తపస్యానిరక్తిఁ బూని మనము న్నిత్యంబు నాత్మైకసం
గతి యోగైకవిచార మూని మునిమార్గ మ్మూని యొందే ననా
హతభోగైకనిదాన మిద్దియని యన్యం బొల్లఁ డావంతయున్.

క. యోగరతి నైహికమ్ముల
లోఁగక పరమాత్మ నెడఁదలోఁ గొని కాంతా

యోగం బాముష్మికమున
కాగడమని మానెఁ బరిణయముఁ జేసికొనఁగ. ౨౯౦

క. భవ ముజ్జగించి గురువై
భవము న్మది సేవగించి పరమతపోని
ష్ఠ వహించియున్న ధరణీ
ధవుపైఁ గనికరముగల్గి తడయక యటకున్. ౨౯౧

క. వేంచేసె నలువ నృపతియు
నంచితగతి లేచి కరము లాదలపై జో
డించి ప్రణమిల్లుటయును వి
రించియుఁ గృప యంకురింప నృపుతో ననియెన్. ౨౯౨

గీ. ఎందుఁజూచిన సర్వసమృద్ధి నొప్పు
రాజ్యరమ గల్గె నింత కొఱంతలేక
యేమి తలపోసి యొడలింత యింకఁజేయు
తపము జేయఁగడంగితి ధరణినాథ. ౨౯౩

వ. అనిన నాతం డిట్లను. ౨౯౪

మ. అవధారయ్య, విధాత! తొల్లిటి ధరాధ్యక్షులు లక్షలున్ దుర్దశా
వ్యవగీతంబగు నీభవాబ్ధిఁ బడి మోహభ్రాంతులై రాజ్యవై
భవలోభంబున దుష్క్రియల్ సలుపఁగాఁ బ్రాలైరి గాకొక్కఁడే
నవినాశంబును గాంచనేరఁ డిహసౌఖ్యం బెట్లు నమ్మందగున్.

మ. అపవర్గంబున కంతరాయమగు జాయాపుత్రమిత్రాది ల
న్యపదార్థంబులయం దహర్నిశము మోహభ్రాంతిచే నున్నచో
నెపుడో కాలముసెల్లి కాలుపురిలో నిక్కట్టులం గుందుచు
న్నపు డందొక్కఁడుఁగూడ నాపదుశ్రమం బాలింపఁగా వత్తురే.

క. ఎంత శ్రమమొందినను 'రా
జ్యాంతే నరకం ధ్రువం' బటందురు పెద్దల్
వంతలకు నాలయంబు దు
రంతంబగు భవము నొల్ల రాజీవాక్షా. ౮౯౭

మ. అతిమోహంబున మానసంబు విషయవ్యాసక్తమై నిశ్చలా
మృతసంధాయకమైన యాత్మ మనిశధ్యేయం బటంచు న్సమా
హితవృత్తిం జరియింపదిట్లు మది నెంతేనిఁ వితర్కించినఁ
వితయేకా కొకయింత సత్యమగునే నీరేజసింహాసనా. ౮౯౮

చ. నలినదళాంతరోదకకణంబు లనందగు నెల్లప్రాణముల్
జలధర చక్రవాళవిలసచ్చపలానుగుణంబు లీసిరుల్
లలితవయస్సమాగతవిలాసము లన్నఁ దరంగచంచలం
బులు క్షణభంగురంబు తనువు న్మది నమ్మి చరింపనేటికిఁ.

వ. అనిన మందహాససుందరవదనారవిందుండై యరవిందోదరుం
డిట్లనియె. ౯౦౦

శా. ధీరోదాత్తులు తొల్లి రాసుతులు ధాత్రీపాలనోల్లాసులై
నారీరత్నముల న్వరించి విపులానందంబుతోఁ గీర్తివి
స్తారోదారత పుత్రులంగాంచి దుదిరాజ్యంబుంచి నిశ్చింతులై
స్వారాజ్యంబును గొల్లవెట్టరె మహీశా సత్తపోనిష్ఠమై. ౯౦౧

ఉ. ఆరయ నెల్లభోగముల కాస్పదమై తగునట్టి నిండుసం
సారసుఖంబు నొల్ల కిటు మానిసుదుర్లభమైన ముక్తికిఁ
బారలుసాచుటెల్లఁ గన మబ్బులలో నుదకంబు నమ్మి కే
దారము గట్టుద్రెంచిన విధంబుగదా వివరించినఁ నృపా. ౯౦౨

మ. తలిరుం బ్రాయపు ముద్దుగుమ్మలను మోదంబొప్పఁ బెండ్లాడఁ గా
వలె నిష్కంటక మట్లు సర్వధరణీభాగంబు పాలింపఁగా

వలె సత్కీర్తిని దిక్కులెల్లెడల నింపంగావలెంగాని నీ
వలె నే రెంటికిఁ జెడ్డ రేవడక్రియం బాటింపఁగా నొప్పునే. ౯౦౩

ఉ. ప్రాయము రిత్తవుచ్చుచు జపంబు నెపంబునఁ బూజ్యరాజ్యముల్
సేయక వైరుల న్వధము సేయక వైదికకర్మనిష్ఠలన్
గాయము సుక్కఁగా నిహసుఖంబుల నింతగ రోయనేల తే
జోయుతమూర్తివై ఘనయశోధవళంబుగఁ జేయు ముర్వరన్.

ఉ. నీవును వారి కైవడి ననింద్యగుణోత్తరవైన యట్టి లీ
లావతి నొక్కతెం బ్రియమెలర్పఁగఁ బెండిలియాడి సాగర
వ్యావృతభూతలం బవనిపాలురు ప్రోవనిబంటులౌచు నీ
కైవసమొందఁ బాలన మఖండపరాక్రమ మొప్పఁ జేయుమా.

క. అని యానతిచ్చి యాతని
మనమునఁ గల సందియంబు మానిపి దీవిం
చి నలినభవుఁడు యథేచ్ఛన్
జనియెం గలహంస నెక్కి సత్వరగతితో. ౯౦౪

ఉ. సారససూతియేగ మది సందియ మంతయు నుజ్జగించి యా
భూరమణుండు చక్కఁదనమున్ గులమున్ గల మాలతి స్మరో
దారగుణాఢ్య నొక్కరిత దారనుగా వరియించి రాజ్యల
క్ష్మీరతుఁ డయ్యె నెల్లరును మేలని సంతస మందుచుండఁగన్.

మ. చతురంభోనిధివేష్టితోర్వీశలరక్షాదక్షత న్మాలతీ
రతిసామ్రాజ్యరమాధురంధరత ధూర్తవ్రాతవిధ్వంసనో
ద్ధతశౌర్యోన్నతిఁ బండితావనకళాధౌరేయతన్ ధర్మస
మ్మతి గావించుచునుండె నెందును నధర్మం బింత లేకుండఁగన్.

క. కృతదారుం డయ్యుఁ బ్రియ
వ్రతుఁ డొకపుత్రకుని నైనఁ బడయఁగ లేమిన్

హితమతి కశ్యపసంప్రే
రితుఁడై పుత్రేష్టియాచరింపఁగ నందున్. ౯౦౯

క. క్రతుచరు వొక్కటియు కశ్యప
యతి యొసఁగ మహాప్రసాద మని కొంచుఁ బ్రియ
వ్రతుఁ డయ్యది సతి కిచ్చిన
సతియున్ భుజియించి చూలు చయ్యనఁ దాల్చెన్.

ఉ. సౌరశరచ్ఛతంబు నొకచాడ్పునఁ జూలు ధరించి యొక్కనాఁ
డారమణీలలామ సకలాంగమనోహరుఁ బుత్రుఁ గాంచె ను
త్తారకలోచనున్ మృతుఁ బదంపడి దుఃఖితులైరి బాంధవుల్
బోరన బాష్పవారిపరిపూర్ణవిలోచనులైరి చూపఱుల్. ౯౧౧

ఉ. మాలతియు స్వనంబునను మల్లడిఁగొన్న తనూజశోక
ముద్వేలముగాఁగ మూర్ఛిలె మృతించిన పుత్రునిఁ జేడుమూపునం
దాలిచి దుఃఖవేగమున దైవము దూఱుచు నేగ భూతబే
తాళపిశాచఘోరనినదప్రతధాటికి నల్లకాటికిన్. ౯౧౨

వ. అట్టి సమయంబున, ౯౧౩

ఉ. కానఁబడెన్ విచిత్రరుచిగంధమనోహరపుష్పమాలికా
నూనము శశ్వదుచ్ఛలితనూతనరత్ననిదాన మచ్ఛనా
సోనిచయప్రధానమయి సొంపులునింపు విమాన మందు భ
క్తానుగుణాఖిలార్థఘటనైకసమాదరయా లతాంగియున్. ౯౧౪

వ. ఇట్లు గనుంగొని రాజతనయుం డప్రతిహతనయుండు గావున,

క. క్షోణిని డించి కుమారుని
శ్రాణిద్వయ మాత్మశిరముపై నిల్పి నమ
త్ప్రాణపరాయణయగు గుహు
రాణికిఁ బ్రణమిల్లి భక్తిరంజిలఁ బలికెన్. ౯౧౫

ఉ. మానినులందు ధన్య వతిమాన్యము నీమహాత్త్వ మెన్న నె
వ్వానికి భార్య ? వీవెవనిపట్టివి ? నిర్జనమైన యివ్వన
స్థానములో విహారమును సల్పఁగ నేల యనంగ నామరు
త్సేనయు నిట్లు బల్కెను శ్రుతిప్రియసుంగని యొప్పి దీనఁగన్.

ఉ. ధాత సమర్థ సృజించి యల దానవబాధితులైన నిర్జర
వ్రాతము బ్రోచుపొంటె శిఖివాహను దారను జేసె మాతృకా
ఖ్యాతిని జెందిరిక్ష ప్రకృతికందను షష్ఠియనంగఁ బొల్తు నో
భూతలనాథ ! నాచరితము న్వివరించితి నింతవట్టునున్. ౯౧౮

క. ధనహీనున కర్థంబును
వనితాహీనునకు ముద్దుపడఁతుల ననప
త్యునకుం బుత్రి నొసంగుచు
మనుజులమెడఁ గొంగుపసిఁడిమాడ్కిఁ జరింతున్. ౯౧౯

గీ. కర్మమూలంబు లెల్లసుఖములు దుఃఖ
ములును గర్మమె శ్రుతిముఖంబునను మేటి
యంచు వినఁబడుచుండ ధరాధినాథ !
జ్ఞానినైన యిట్లు చింతింపఁ గర్జమగునె. ౯౨౦

ఉ. ఈ నిసువుంగుఱించి యిటులేటికి వాపుర నాచుఁ బల్కి ని
జ్ఞానముపేర్మి నానృపతినందనునిం గయిదాల్చి జీవితుం
గా నొనరించికొంచు నరుగం గని గద్గదఖిన్నకంధరుం
డై నుతియించుచుండఁగఁ బ్రియవ్రతుతో దయతోడ నిట్లనెన్.

ఉ. భక్తిదలిర్ప నియ్యవనిపైఁ గల మానవకోటితోడ వే
దోక్తవిధి న్మదర్చనము నోలి నొనర్పుము నీవు యోగసం
రక్తుని సద్గుణాన్వితుఁ బురందరసన్నిభు సువ్రతాభిధా
వ్యక్తుని బాలు నిచ్చెద నుపాయముఁ జెప్పితి భూమిపాలకా.

శా. ఏకచ్ఛత్రముగాఁగ భూమివలయం బీతండ పాలించు సు
శ్లోకుండై చెలయించుఁ బండితులఁ బ్రోర్మెన్ ద్రవ్యమర్పించి యు
ల్లోకోదగ్రనిజప్రతాపమునఁ గూల్చున్ శాత్రవశ్రేణి నా
కౌకస్సంచయముల్ ముదంబుఁగనఁజేయు న్నాలు జన్నంబులన్.

క. వీనిఁ గుమారునిఁగాఁ గనుఁ
గో నోఁచితి వితఁడె నీదు కొమరుఁడు గొనుమం
చూనిన నెనరున సుతు ధా
త్రీనేతకు నిచ్చి షష్ఠి దివికిం జనియెన్. ౯౨౮

ఉ. ఆసుతుతోడఁ గూడి ప్రియమందు చమాత్యులు వెంటరా నిజా
వాసముఁ జేరి పుత్రసముపార్జనరీతిని జెప్పుచున్ సమా
శ్వాసితబంధుమిత్రజనసంచయుఁడై పురివారిఁ గూడి కాం
తాసముపేతుఁడై చు జతనంబున సల్పెను షష్ఠి కర్చనల్. ౯౨౯

మ. తనయోత్పత్తిమహోత్సవంబున సమస్తబ్రాహ్మణశ్రేణికిన్
ధన మర్పించెను మాసమాసమున శుద్ధంబౌదు షష్ఠీదినం
బున షష్ఠ్యర్చన మాచరించి విపులామోదంబుతో రాజ్యపా
లనముం జేయుచునుండెఁ గీర్తిఘనుఁడై శ్లాఘ్యాత్మశీలుండునై.

వ. మఱియు నాఁడాదిగా బాలుర సూతికాగారంబుల నాఱవనాఁ
డును నేకవింశతివాసరంబునను అన్నప్రాశనసమయంబునను షష్ఠీ
పూజనంబు సేయుండని నగరంబున నెల్లెడఁ గట్టడిఁగావించెఁ దా
నును దదర్చనాపరుండై యుండెఁ; దత్పూజావాహనాదివిధానంబు
కామమోక్షంబై యున్న యది యద్దానంజేసి వటమూలంబున
నొండె ఘటకుడ్యసాలగ్రామంబుననొండె షష్ఠీప్రతిమం గావించి
యర్చింపవలయు. ౯౩౧

మ. ఇదిషష్ఠీచరితంబు పుణ్యభరితం బేవాఁడు పుత్రార్థియై
పదిలంబొప్పఁ బఠించెనేని సుతుఁ డొప్పంబుట్టెడి న్వంధ్యకే
నుదయించున్వినుమాత్రఁ బుత్రుఁడు చిరాయుష్మంతుఁ డేఁడాదికిం
త దురాపార్థములున్ సులబ్ధములగున్ షష్ఠీప్రసాదంబునన్.

క. బాలురకు రోగ మడరిన
వేళం దలిదండ్రు లిద్ది వినఁగలిగినచో
బాలగ్రహపీడలుడిగి
నూలుకొను న్నెలకు దేవ్యనుగ్రహగరిమన్. ౨౯

—* మంగళచండ్యుపాఖ్యానము *—

చ. అమరమునీంద్ర! వింటివికదా! దురితాపహమైన షష్ఠ్యుదం
తము నిఁక నాలకింపు మవధానత మంగళచండికాచరి
త్ర మఘలతాలవిత్రమును దక్షతగన్నదేవి చండినా
నమునరుమంగళార్థఘటనానిపుణాత్మికయై ధరిత్రిలో. ౩౦

గీ. మనుకులోద్భవుఁడైనట్టి మంగళాఖ్య
భూవరుం డిల చండికాదేవి భక్తి
నిష్ఠనై వాఁబుగా భజియించుకతన
నామె మంగళచండిక యనఁగఁబరఁగె.

గీ. మూర్తిభేదము దుర్గకు మూలప్రకృతి
తరుణులకునెల్లఁ బ్రత్యక్షదైవతంబు
అధికకరుణాతరంగితాపాంగ నామెఁ
దొలుతఁ బూజించె నీశ్వరుం డలఘుమతిని. ౩౨

మ. త్రిపురంబు ల్దహియించునాఁడు రథధాత్రీచక్ర ముద్వృత్తదై
త్యపసంపాతితమై వియన్నిగడితంబైన న్వితర్కించి హ

ర్యుపదిష్టుండయి చండికం గొలిచె నయ్యుగ్రుండు మున్ చండి భ
క్తపరాధీనమనస్క గావున సమక్షంబంద ప్రత్యక్షమై. ౯౩౩

ఉ. ఓయి మహానుభావ! యిటు లూరక భీతిలనేల యిప్పుడే
బాయక యుద్ధశక్తినటు బాసటనై నెలకొందు నిందిరా
నాయకు మాయఁ జేకొని రణస్థలిలోన దురాత్ముఁడైన దై
తేయుని ద్రుంచి వేల్పుల కతిప్రమదం బొనరింపుమీ వెసన్.

మ. ప్రతిఘాటోప మెలర్ప శైలతనయాప్రాణేశుఁ డబ్జాక్షభా
వితమా శస్త్రముఁ గేలఁ దాల్చి నిజగంభీరాట్టహాసప్రఘూ
ర్ణితదిక్కందరుఁడై సురారి తల ఖండించె న్మునుల్ శంకరున్
స్తుతిఁ గావించిరి పుష్పవర్షము సుధాంధుల్ ప్రీతి వర్షింపఁగన్.

ఉ. మానితరీతి శంకరుఁడు మాధవపద్మభవోపదిష్టుఁడై
స్నానమొనర్చి తాల్చి పులిచర్మము మంగళచండికార్చనా
ధీనమనస్కుఁడై శ్రీవిధిఁ గృతసర్వవిధోపచారుఁడై
మానసవీధి నిల్పె సతమంగళదాయిని చండికాసతిన్. ౯౩౬

గీ. కడఁగి మాధ్యందినోక్తమాగతి శివుండు
ధ్యానమొనరించి భక్తిపూర్ణాత్ముఁ డగుచు
వాద్యసంగీతనర్తనోపక్రమముల
నామసంకీర్తనంబు లొనర్చె మిగుల. ౯౩౭

ఉ. ఆది శివుండు పిమ్మట గ్రహంబగుమంగళుఁ డంత మంగళో
ర్వీదయితుండు కన్య లటుపిమ్మట మంగళవారమందు నా
పై దిగధీశు లిద్ధరణిపైఁ గలవార లభీప్సితార్థసం
పాదనశక్తిఁ గొల్చి రలమంగళచండిక భక్తిమీఱఁగన్. ౯౩౮

మ. మును ధాత్రీవలయంబునం గల జనంబు ల్నిత్యముక్తిశ్రియో
జనితోపప్లవబాధ్యమానలగు యోషాబంధుమిత్రాదులన్

గని యీయాపదఁ బాపలేక యతిశోకవ్యాకులస్వాంతులై
చని నిష్ఠానిధియైన కశ్యపుసమక్షంబుం బాం దెలింగించిరన్. ౯౩౯

క. మానియు భీతిలి స్తుతిచే
సానుగుణంబయిన మనువు లల్లన వెలయం
గా నొసరించెను బద్మజు
నానతిచే నృపుఁడు తత్సమన్వితుఁ డగుచున్. ౯౪౦

వ. అమ్మంత్రమ్మున కధిష్ఠాన దైవతంబుగా మనసయును నొక్క
రమణింగూడ సృజియించెఁ బదంపడి, ౯౪౧

శా. ఆలీలావతి జన్మమందఁగనె దివ్యజ్ఞానసంపన్నయై
కైలాసంబున కేగి యాదఁ గడు దీక్షంబూని వేయేఁడు లా
శైలాధీశశయానుఁ గూర్చి తపమున్సల్ప న్నమత్పాలన
వ్యాలోలుండగు శంభుఁ డారమణికిం బ్రత్యక్షుఁడై ప్రీతితో.

వ. అష్టాక్షరసమ్మితంబయిన కృష్ణమంత్రంబును సాంగంబుగ నొసంగి
తదుపాసనావిధానం బెల్ల తెల్లంబుగ నానతిచ్చి కనుమొఱంగు
టయు నా రమణియుఁ దదాజ్ఞాప్రకారంబునఁ దపంబుఁ జేయం
గడఁగి పుష్కరంబున కేతెంచి యథాపూర్వంబగు నియమంబున
నారాయణు డెందంబున నిల్పి తపంబు సేయుచున్నంత నారాయ
ణుండు ప్రీతుండై దుస్తరతపశ్చర్యాకృశాంగియగు నా లతాంగిం
గాంచి వరంబు లొసంగి యథేచ్ఛం జనియె. ౯౪౩

ఉ. సారసగర్భునాజ్ఞ మనస న్వరియించి ముదంబునన్ జర
త్కారుఁడు స్వాశ్రమంబున సదా తన కాసతి యాచరించు న
య్యో రుచిరోపచారముల కచ్చెరువొందుచు నైష్ఠికత్వ మే
పార సమస్తసంయమిసమన్వితుఁడై తపమాచరించుచున్. ౯౪౪

వ. ఒక్కనాఁడు, ౯౪౫

క. మనసాఘనజఘనస్థల
మున తనశీర్షమ్ము నుంచి ముని గాఢసుషు
ప్తిని జెందియుండ నంతట
నినుఁ డపరపయోధిఁ జేరె హీనస్ఫురణన్. ౯౪౬

వ. కని యక్కాంత యిట్లని వితర్కించె. ౯౪౭

ఉ. కాంతుఁడు నేఁడు మైమఱచి గాఢసుషుప్తిని జెందియుండె భా
స్వంతుఁడు నిప్పుడే చరమశైలము వెన్కకు నేగుచుండె సా
యంతనకృత్యము ల్సలుపఁడయ్యెను బ్రాకృతునట్లు దీనిచే
నెంతయు బ్రహ్మఘాతియను హీనతపౌ విభవుండు నేఁగదా.

వ. కావున నిమ్మునివరేణ్యుఁ బ్రబోధితుం జేయకున్న సంధ్యోపాసనాహీనతచేఁ బ్రాపించుపాపం బగణ్యంబని విందు; మేల్కొల్పిన నిద్రాభంగంబునకుఁ గోపంబు గదుర శపియించునో కో! మునుల మనంబులు నవనీతప్రాయంబులుగదా! యేమిచేయుదు? నెవ్వరు దిక్కని కొండొకవడి యోచించి యెట్లయినం గానిమ్ము నిద్రాభంగంబునకు శాంతుం జేయుట సుకరంబ; సంధ్యాహానికిఁ బ్రాయశ్చిత్తంబు లేకునికి తెల్లంబని నిశ్చయించి మెల్లన మెయి తట్టి మేల్కొల్పిన నమ్ముని కోపోద్దీపితమానసుండయి యమ్మదవతిం గనుంగొని, ౯౪౯

ఉ. ఓసి యిదేమె నిద్రఁగొనియున్న నను౦ గొఱమాలి మేల్కొనన్
జేసితి వింతయూగడము జెల్లునఁటే మగనాలికిం దను
గ్రాసముఁ జేసి చేసిన యఖండతపంబును బుణ్యతీర్థసం
వాసములున్ ఫలంబిడునె భర్త నవజ్ఞ నొనర్చియుండినన్. ౯౫౦

క. విసయువివేకము లొదవఁగఁ
దనమగనికి సేవచేసి తనిపినచో దే

వనికరమెల్ల ముదంబుం
గనునంచు బుధు ల్వచింపఁగా వినలేదే. ౯౧౧

క. అంగనచే సుఖనిద్రా
భంగంబుం గన్నయతడపావృతలక్ష్మీ
సంగుఁడయి కాలసూత్రము
నం గూలునటంచు ము న్విసంబడదొకో. ౯౧౨

వ. అని కోపాటోపంబున సమ్మునిపుంగవుండు ప్రస్ఫురితాధరుం
డగుటయు, ౯౧౩

చ. గడగడలాడుచు న్మగనిఁ గన్గొని పల్కె, మహానుభావ! నీ
వెడపక నిద్రఁజెందుటయు నిప్పుడె భాస్కరుఁడస్తమించుటన్
బొడఁగని సంధ్యవార్చుఁదగు ప్రొద్దది మెల్లఁగ దాఁటిపోవ నే
గొడవలు వచ్చునో యనుచుఁగొంకుచు నిన్నిటు మేలుకొల్పితిన్.

క. ఏ దుష్టనయితి నాకిఁక
లే దొక పాచిత మటంచు లేమయు బాష్పాం
భోదూషితాక్షియై ముని
పాదంబులఁ బడియె శోకపరవశయగుచున్. ౯౧౫

ఉ. పాయని దుఃఖ మాఁపికొనఁబాటి యెఱుంగక యేడ్చుచుండఁగా
నాయెలనాఁగఁ గన్గొని దయామతిఁ గాఁగిట గుచ్చియెత్తి యా
తోయజమిత్రుపై నలుకతో శపియింపఁ గడంగునంత సం
ధ్యాయుతుఁడై పతంగుఁడు మహర్షికుఱంగట నిల్చి యిట్లనున్.

శా. ఈపద్మేక్షణ సంజవేళ యని తానీక్షించి ధర్మక్రియా
లోపం బౌనను భీతిచేత నిను మేల్కొల్పంగ నీ వీగతిన్
నాపైఁ గోపముఁబూని పిచ్చుకపయిం బ్రహ్మాస్త్రముంబోలఁగా
శాపంబీఁదగునయ్య! యోర్వఁగలనా? శాపాయుధాగ్రేసరా!

మ. సరసీసంభవసంభవు ల్ప్రథితతేజశ్శాలు రుద్యత్తపో
నిరతుల్ విప్రులు వారలల్గినయెడ న్నిష్ఠామధామంబుఁ జే
తురు కారుణ్యముగల్గి క్రిమ్మఱ సృజింతు ర్వారు లోకంబులన్
ధరణీదేవుల మానసంబు నవనీతప్రాయ మానేకదా. ౯౫౯

ఉ. ఎంచకు నేర మీవు భజియింపుము కృష్ణుని పాపమెల్ల మా
యించు నతండు మ్రొక్కెద నిదే శరణం బను పద్మబంధు సై
రించి శపించకే విడిచి రేఁచిన కోపమునన్ వడి న్విస
ర్జించెను గశ్యపాత్మజ; వచించెడి దేమిఁక మాని చిత్తమున్!

వ. అంత నక్కాంతామణి చేయునదిలేక యిట్లని విలపించె. ౯౬౦

చ. కటకట! యట్టికశ్యపుని కన్నియనై తపమాచరించి యీ
జటివరు నాలినై మిగుల సన్నుతులంగొని భాగ్యహీననై
పటుతరశోకవార్ధిఁబడఁ బాల్పడితిం దుద కేను నన్ను నేఁ
డెటువలెఁ గాతువో యనుచు నింతి విచారముతోడ వేఁడుచున్.

క. ననుఁ గన్నతండ్రి రారా!
వినుసిగదయ్యంబ రార! విధి రారా! నే
మనసను నాథవిసృష్టను
ననుఁ గాచెడి భరము మీ దనాథనుజుండీ. ౯౬౨

వ. అని యెలుంగెత్తి యేడ్వం దొడంగిన, ౯౬౩

ఉ. ఆయెలుఁ గాలకించి గుహునయ్యయుఁ గశ్యపమాని యంచతే
జీ యొడయుండు నత్తపసి వెంగట కేగినయంత మాని చే
దోయిని దోయిలించి ప్రణతుల్ వినుతుల్ ఘొనరించి యింపు వేం
చేయుట కేమిహేతువు వచింపుఁడు మీరు మహాత్ములారయన్.

వ. అని యిట్లు ముని పల్కిన సరోజసంభవుండు సమయానుకూలం
బుగాఁ గొన్నివాక్యంబు లుగ్గడించి వెండియు నిట్లనియె. ౯౬౫

ఉ. తొల్లి కృశానుసాక్షిగ వధూమణి నీవె వరించి ప్రేమ లో
వెల్లిగొనంగ నేలి తగవే! యనపత్యను నేరమెంచ కే
నొల్లను బొమ్మనంగ; నిటు లుగ్మలిని న్విడనాడువారికిన్
జల్లెడలోని నీరు దిగఁజాఱినకైవడిఁ గావె పుణ్యముల్. ౯౬౬

మ. కమలప్రోద్భవుఁ డిట్టులాడ, మనసా గంభీరనాభిప్రదే
శము డాచేత సమంత్రకంబుగను సంస్పర్శించి యమ్మౌని "యో
రమణీ! గర్భముగల్గు నీకఖిలశాస్త్రజ్ఞానసంపన్నుఁ డు
త్తమతేజస్కుఁడు ధార్మికుండును సముత్పన్నుం డగున్ బుత్రుఁడై.

చ. ఇతఁ డుదయించుమాత్ర సవితృప్రకరంబు ముదంబుగాంచు ని
ర్జితరుజుఁడై సదా తపముజేయును గోలతనంబు మాన కీ
గతి విలపింపనేల? చలిగట్టుపయిం దొలిమాడ్కి నే ధృతా
మృతకరు శంకరుం గొలువ నేగుము నెవ్వగలెల్లఁ దీఱెడిన్.

ఉ. ఏనును బుష్కరంబునకు నేగి తపంబొనరింతు నం దజ
ధ్యాననిరూఢి నోజలరుహానన! యోగవియోగముల్ వ్యవ
స్థానుభవైకభాజనము లారయ నీవనితానుషంగముల్
కానలనుండి యాకలముల న్భుజియించెడు మాకు నర్హమే".

చ. జటివరుఁ డిట్టు లాడ మది ఝల్లనఁ గన్నుల వేఁడిబాష్పముల్
జొటజొటరాలఁగా వగచుచు న్ననఁబోఁడి మునీంద్రుఁ జూచి తొ
ల్లిటి తపమెల్ల నీగతి ఫలించె నిఁకెట్లు సుఖంబు లబ్బు నె
ప్పటి కొకలాగు నానుదుట వ్రాసెనుబో విధి మూఁడుపంక్తులన్.

ఉ. జారిణి కాముకాళిని, బ్రసాదము నాఁకలిగొన్నవాఁడునున్,
నీరములం దృషార్దితుఁడు, నేత్రము నంధుఁడు, నన్యవిత్తముం
జోరుఁడు, కాముకుండు రతిసూక్తుల సంగముఁ గోరుభంగి నీ
ధారుణిలోఁ బతివ్రతలు తద్దయుఁ గోరుదు రాత్మనాథునిన్.

చ. అని మునినాథుఁ గాంచి వినయంబున నిట్లను బ్రాణనాథ! నే
మనమున నెప్డు నిన్ దలఁతు మానక దర్శన మిప్పు డిత్తు నం
చును వరమీయఁగావలయుఁ జూ యనిపెద్దయెలుంగు రాల్పదన్
వనరుచుఁ గాళ్ళపైఁబడియెఁ; బైదలు లోర్తురె నాథు పీడఁగన్.

వ. అనిన వల్లెయని యమ్మునివల్లభుండు నిజవల్లభ మెల్లనఁ దనకరంబుల లేవనెత్తి యుల్లంబునఁ జేర్చుకొని సమయానుకూలంబులగు కొన్ని యనునయాలాపంబుల డెందంబునందలి కొందలం బుడిపి కొని ధైర్యం బవలంబించి శ్రీకృష్ణుఁగీర్తించుచు నాజరత్కారుండు తపంబునకుం జనియె. ౯౭౩

ఉ. పిమ్మట ముమ్మరంబయిన బిమ్మిటిచే శితికంఠురాణివా
సమ్మున కేగి యందు దివసంబు యుగంబుగనుండి యొక్కనాఁ
డమ్మునికొమ్మ మంచిసమయమ్మునఁ గాంచె మృగాంకమౌళియం
శమ్మునఁ దేజరిల్లు నొక చక్కని పుత్రుని ప్రసపాత్రునిన్.

క. ఇది మనసోపాఖ్యానము
చదివిన వ్రాసినను వినిన సకలైశ్వర్యా
భ్యుదయములు కల్గి దేవీ
పదమందు వసింతు రెపుడు పదపడి మానీ. ౯౭౫

—* సురభ్యుపాఖ్యానము *—

క. మనసోపాఖ్యానము విని
మనమున నానందరసనిమగ్నుఁడ నైతిన్
వినిపింపుము సురభియనన్
జను దేవిచరిత్ర మింక సత్కృపతోడన్. ౯౭౬

వ. అని ప్రార్థించిన నారదునకు నారాయణుఁ డిట్లు వచించె. ౯౭౭

ఉ. గోవులలోఁ బ్రధానయయి గోవులకున్ జనయిత్రియై సదా
గోవులఁ బ్రోచుదేవియయి గోభువనమ్మున జన్మమొందె బృం
దావనపుణ్యభూముల వినందగుఁ బాపవినాశకంబు మో
దావహమైన తచ్చరిత మంతయుఁ దెల్పెద నీకు నారదా. ౯౭౮

ఉ. కేవల గోపిక ల్గొలువఁ గేళివిలాసమనస్కుఁడౌచు రా
ధావిభుఁ డామెతోఁ గలిసి తా నొకనాఁడు చరింపనేగె బృం
దావనభూమి కంత విజనమ్మునఁ బ్రేయసితో రమించుచోఁ
బావనమూర్తి కాతనికిఁ బాలనుద్రావఁగఁ గోర్కెపుట్టఁగన్.

గీ. వామపార్శ్వమ్మునుండి విశ్వప్రభుండు
సృజనమొనరించె నంతటఁ జిన్నదూడ
పొదుఁగులో నోరువెట్టి సమ్మోదముగాంచు
నట్టి సురభిని గోమాత నఖిలపూజ్య. ౭౮౦

గీ. జన్మమృత్యుజరావ్యాధిసంహరముల
క్షీరధారలఁ గుండ నిండారఁ బితికి
త్రావినన్నియుఁ ద్రావి రాధావిభుండు
భాండమును బాలతో భూమిఁ బాఱవైచె. ౯౮౧

ఉ. అచ్చట నూరుయోజనము లాయతిగల్గి కనుంగొనంగఁ బె
న్మచ్చటగొల్పు చేర్పడియెఁ బొల్పయి క్షీరసరమ్ము చుట్టునున్
బచ్చలు కెంపులున్ మెదిపి బాగుగఁగట్టిన మెట్లతోడఁ దా
నెచ్చెలిపిండుతోఁ గలిసి నిత్యము రాధయుఁ గేళిసల్పఁగన్.

గీ. కామధేనుసహస్రంబు రోమకూప
ముల జనించెను సురభికి మోదమలరఁ
బరదినంబున దీపము ల్వరగుచుండ
నామెఁ బూజించె శ్రీకృష్ణుఁ డంచితముగ. ౯౮౩

వ. సురభీధ్యానస్తోత్రంబులును మూలమంత్రంబును బూర్వము ధర్ముని వలన వింటి. 'ఓంసురభ్యైనమః' అను నీ మంత్రము లక్షజపంబున సిద్ధిమై భక్తులకు బుద్ధివృద్ధిముక్తుల నొసంగి సర్వ కామంబుల నొడఁగూర్చు. ౯౮౪

క. శ్రీరూపిణి రాధాసహ
చారిణి గోమాత సర్వసంచితపాపా
పారారణ్యదవానల
మై రహి నలరారు సురభి నర్చింతు మదిన్. ౯౮౫

గీ. కలశమునఁగాని ధేనువు తలను గాని
ఆవులం గట్టు స్తంభంబులందుఁ గాని
సాలశిలఁగాని శిఖిఁగాని జలమునందుఁ
గాని సురభిఁ గొలువఁజెల్లుఁ గడఁగి ద్విజుఁడు. ౯౮౬

గీ. పరదినంబున దీపము ల్వరఁగుచుండ
నతిధృఢంబగుభక్తిఁ బూర్వాహ్ణమందు
సురభిఁ బూజించునరుఁడు విశ్వరమణీయ
మైన సంపదఁగాంచి పూజ్యత వహించు. ౯౮౭

ఉ. పాఁడి యడంగె మాధవు నభంగురమాయకు నొక్కయప్పుడీ
మూఁడుజగమ్ములన్ సురలు పొక్కుచుఁ బద్మజునొద్ద కేగి యీ
కీడు దొలంచుమా యనుచుఁ గేల్మొడుపన్ సురభిన్ భజింపుచో
మూఁడిన యాపద ల్తొలఁగిపోవు నటుం చతఁ డానతిచ్చుటన్.

ఉ. పాకనియంత పద్మజుని పల్కులు నెమ్మనమందు నూని య
స్తోకవినమ్రశీర్షుఁడయి దోయిలొవట్టి సురస్రవంతికా
శ్రీకమనీయవాక్యములఁ జిత్తము మెత్తపడంగఁజేయుచున్
వీఁకమెయిన్ నుతించె సురభిన్ సురలోకము బాగుకోసమై.

సీ. పద్మాంశవలన నుద్భవము గాంచినయట్టి
రాధికాసాహచర్యకు నమస్సు
శ్రీకృష్ణదేవుని చెల్మి నార్జించిన
వితతగోమాతృదేవికి జోహారు
క్షీరధారలచేత సిరియు బుద్ధి యశమ్ము
జేయు గోలోకవాసినికిఁ బ్రణతి
ఆశ్రయించిన వారి కమరవృక్షంబౌచుఁ
బాలించునట్టి యంబకుఁ బ్రణామ

గీ. మనిన యింద్రుని స్తోత్రంబు నాలకించి
నంత బ్రహ్మలోకమ్మున నవతరించి
కోరికొన్న వరంబులఁ గూర్మి నొసఁగి
మోదమునఁ బోయె స్వస్థానమునకు సురభి. ౯౯౦

ఉ. నారద ! క్షీరపూర్ణమయి నాలుగుమూలల విశ్వమెల్ల శో
భారమణీయమయ్యెఁ బిదపన్ జనియించెను నేయి యజ్ఞసం
భారములందు ముఖ్యమగు వస్తువు తత్క్రతుభుక్కులెల్ల రా
హారము గల్గుటన్ హరుస మందిరి డెందములందుఁ బిమ్మటన్.

గీ. ఈ సురభి స్తోత్రరాజంబు నెవ్వరేని
బఠనసల్పినఁ జేకుఱు బహుళధనము
గోసమృద్ధియు శాశ్వతగురుయశస్సు
పుత్రపౌత్రాభివృద్ధి సంపూర్ణసుఖము. ౯౯౧

క. సర్వనదీస్నానమ్మును
సర్వక్రతుదీక్ష గొన్న సత్ఫల మలరున్
నిర్వాణ మబ్బు పిమ్మట
ముర్వగ బహ్మాత్మజత్వమును ఘటియించున్. ౯౯౩

—* రాధా దుర్గా పూజావిధానము *—

క. ప్రకృతుల చరితమ్ములనీ
వకలుషమగా ప్రేమఁ దెల్ప నాలించితి మా
మకకిల్బిషసంఘమ్ములు
వికలములై చెదరిపోయె విశ్వేశానా ! ౯౯౮

క. నాకున్ రాధా దుర్గల
ప్రాకటశుభపూజనంపు పద్ధతి వినంగన్
లోకోత్తర ! మనసయ్యెడు
నీకమెయిన్ దెల్పు మింక వినతులోనర్తున్. ౯౯౯

చ. అతితరమంచు వారల మహామహిమమ్మును దెల్పియుంటి వా
యతమగు నీజగమ్మున నియంత్రిణు లంటివి వారిఁ గొల్వ సం
గతమగుఁ బుణ్యలోకములఁ గాంపురమంచు వచించినావు నా
కుతుక మడంగునట్లుగ యదిగూడ నెఱుంగకయున్నచోఁ బ్రభూ!

క. అను వీణామునిప్రార్థన
మునకున్ మనసొగ్గినట్టి మురహరుఁడు కృపా
ఖనియై తెల్పంగడఁగెను
వినుమంచు మరందధార వీఁగు మృదూక్తిన్. ౯౯౦

గీ. మూలప్రకృతిరూపిణులౌచుఁ బుట్టినారు
వారలిర్వురు నల విరాట్ప్రముఖసకల
దేవతలుగూడ వారియధీనులగుట
వారి పదపద్మములసేవ వలయు. ౯౯౧

గీ. అందు రాధామహామంత్ర మాదియందుఁ
దెల్పెద రహస్యమియ్యది దీనిమహిమ

వేయి నాలుక లుండియు వినుతిసేయఁ
దరముగాదయ్యె యెట్టి తత్పురుషునకైన. ౯౯౯

గీ. శ్రీయుతంబు చతుర్థ్యంతచిహ్నితమయి
రాధపావననామము రాణకెక్కె
ననలు నారినిగూడి షడక్షరముగ
నర్థిజనవాంఛితప్రదమై సతంబు. ౧౦౦౦

ఉ. మూలసనాతనప్రకృతిమూలమునన్ గొనెఁగృష్ణదేవుఁ డు
ద్వేలసుభక్తిపూర్ణుఁడయి దీనిని గోభువనంబునందు గో
పాలునిచేత విష్ణునకుఁ బావనుఁ డాతనివల్ల బ్రహ్మకున్
గిలితమయ్యె బ్రహ్మ పలికించెను ధర్మునిచేతఁ బిమ్మటన్.

ఉ. ధర్మునివల్ల నేనును బదంపడి గాంచి పరంపరాగతా
యుర్మహనీయభాగ్యవిభవోదయకారకమైన మంత్రమున్
మర్మ మెఱింగి పల్కెదసుమా! నిరతంబును దానిచేతనే
శర్మముగల్గెఁ దజ్జపముశక్తినె నే ఋషినైతి నారదా. ౧౦౦౨

చ. జలజభవాదిదేవత లజస్రము దీని జపించుచుందు ర
గ్గలమగు భక్తితోడ నధికారము సుంతయుఁ గృష్ణపూజకున్
గలుగదు రాధ నేమరినఁ గావున వైష్ణవులైన ధీవరుల్
సలుపఁగఁజెల్లు రాధ కనిశమ్మును బూజల నమ్రభావులై.

వ. కృష్ణున కామె ప్రాణాధిదేవియు నామెకుఁ గృష్ణుఁ డధీనుండునై యుందురు. సకలకామంబులను రాధించుటంబట్టి రాధానామ మామెకుఁ బ్రసిద్ధమైనది. రాధామహామంత్రంబునకు నేను ఋషిని; గాయత్రి ఛందము; రాధ యధిదేవత; తారమును శక్తియు బీజంబులు; శక్తిమూలావృత్తిచే షడంగంబులు సేయవలయు; సామవేదోక్తరీతి నమ్మహాదేవిని ధ్యానింపఁజెల్లు.

సీ. మల్లికామాలతీమహితకైశ్యముదాని
నవరత్నమయభూషణములదాని
తెల్లసంపెఁగపూలఁ దెగడు దేహముదాని
శరదిందుసుందరాస్యంబుదాని
కోటిచంద్రులకాంతి గోట మీటెడుదాని
రక్తాంబుజాతనేత్రములదాని
కుందసన్నిభదంతకుట్మలంబుల దాని
రమణీయబింబాధరమ్ముదాని

ఆ. వె. కుంభికుంభసదృశగురుకుచంబులదాని
పృథునితంబయుగళమునకు శోభ
గలుగఁజేయునట్టి కాంచి గల్గినదాని
స్థిరవయఃప్రసిద్ధి జెలఁగుదాని ౧౦౦౫

సీ. ఏవేళఁ బదియురెండేండ్ల ప్రాయముగల్గి
శృంగారలహరియై చెలఁగుదాని
వహ్నిశుద్ధంబైన వసనంబు దాల్చిన
లావణ్యయుతదేహలతికదాని
వేదవేద్యంబైన విభవంబుతోఁ గృష్ణు
నసువుల కసువుగా నలరుదాని
దాస్యలేశముచేత దయగల్గి భక్తుల
సకలేష్టపూర్తిని సలుపుదాని

గీ. రాసమండలమందున రత్నసింహ
పీఠమున నున్నదానిని విశ్వమాత
యైన దేవిని సేవింతు ననుచుఁ బల్కి-
ధ్యానమొనరింపవలయు నయ్యా! మునీంద్ర! ౧౦౦౬

గీ. ధ్యాన మొనరించుచున్ బహిస్థలమునందు
నైన సాలశిలాపుటమందు నైన
నష్టదళపద్మయంత్రంబునందు నైన
దేవి నావాహన మొనర్చి త్రిపురఁ జేసి. ౧౦౦౮

ఉ. ఆసన మిచ్చి యంత ముఖమందుఁ ద్రివారము మూలవిద్యచే
నాసకలేశ్వరేశ్వరికి నాచమనీయ మొసంగి పాద్యముం
బోసి పదంబులందు శిరమున్ సరిదర్ఘ్యముచే స్పృశించి యా
పై సవరింపఁ జెల్లు మధుపర్కము తర్కములేని భక్తితో.

ఉ. స్నానవిధానమున్ సలిపి చందన మిచ్చి విభూషణంబులన్
గానుకవెట్టి వస్త్రములు గామితసుందరపారిజాతనా
నానవపుష్పదామములు నాల్గు విదిక్కుల మధ్యయందు నా
పైనొనరింపఁగావలయుఁ బావనురాలికి సంగపూజలన్. ౧౦౦౯

గీ. అంతటఁ బ్రదక్షిణంబుగ నగ్రదళము
నష్టదళపద్మమునఁ బూని యధికభక్తి
నామె పరివారమునుగూడ నర్చసేయ
వలయు మునివర్య! తత్క్రమం బలవరింతు. ౧౦౧౦

సీ. ప్రాగ్దిశయందు మాలావతిం బూజించి
దహనుకోణమున మాధవిని గొల్చి
కాలుదిక్కున రత్నమాలను సేవించి
నైరృతిని సుశీల నతులుసల్పి
పడమట శశికళఁ బ్రస్తుతిఁగావించి
శ్వసనుదిక్కునఁ బారిజాత మ్రొక్కి
రాజరాజాశఁ బరావతి భజియించి
హరకాష్ఠమందు సుందరిని దలఁచి

గీ. బ్రాహ్మ్యాసీమఁ జతుర్ముఖప్రముఖదేవ
తలకు దిక్పాలురకుఁగూడ నెలమిఁగొల్పి
శంఖచక్రాయుధమ్ముల సంతరించి
సకలరాజోపచారము ల్సలుపవలయు. ౧౦౧౧

గీ. పావనాఖ్యాసహస్రంబు బల్కుచుండి
మంత్రమును వేయిసారులు మననసేయుఁ
బ్రతిదినం బెవ్వఁ డాతఁడు పాపమెడలి
యొనయు గోలోకమును విష్ణువనఁ బరంగి. ౧౦౧౨

గీ. కార్తికమ్మునఁ బూర్ణిమఁ గడఁగి యెవఁడు
రాధజన్మోత్సవమొనర్చు రహిఁయెలర్ప
నతనిమోల రాసేశ్వరి యనుదినంబు
నిలిచి వాంఛాపరిపూర్తిని గలుగఁజేయు. ౧౦౧౩

వ. మఱియు గోలోకవాసినియగు నమ్మహాదేవి యేదేనొకకారణం
బున వృషభానుసుతయై బృందావనమ్మున జన్మించినది. ఇందు
జెప్పఁబడిన మంత్రంబుల వర్ణసంఖ్యావిధానంబులు చెడనీయక
పురశ్చరణక్రియాయోగ్యంబగు దశాంశంబు హోమముఁగావించి
తిలలచే వేల్చునది; నావుడు రాధాస్తోత్రవిధానం బానతిమ్మనిన
నారదునకు నారాయణుం డిట్లనియె. ౧౦౧౪

క. భాసితమహా గోలోకని
వాసిని ! కరుణాపరిపూరవాసితహృదయా
ఖ్యాసితభక్తజనావని !
రాసేశ్వరి ! మమ్ముఁ బ్రోవు రాధాదేవీ ! ౧౦౧౫

క. శ్రీకృష్ణప్రాణప్రియ
కాకలితసమస్తసృష్టి కాదిజననికిఁ

లోకేశ్వరికిఁ జతుర్ముఖ
పాకారిప్రముఖవంద్యపాదకు జేజే ! ౧౦౧౬

క. నీవే గౌరివి మనసవు
నీవే భారతివి లక్ష్మి నీవే మఱి ప
ద్మావతియును సావిత్రియు
నీవె తులసివియును నీవె నీకు నమస్సుల్. ౧౦౧౭

క. మంగళచండిక షష్ఠియ
నంగన జను దుర్గ వీవె నాకప్రచల
ద్గంగవు గంగవు నీవే
సంగతమగు మమ్ముఁ బ్రోవఁ జయ్యన రమ్మా ! ౧౦౧౮

క. మూలప్రకృతివి నీవే
జాల మొనర్పంగ నేల ? సంసారమహా
భీలాంభోనిధిమగ్నుల
మేలంజను మమ్ము నుద్ధరింపుము దల్లీ ! ౧౦౧౯

క. అను నీ రాధాస్తోత్రం
బనుదినమును బఠనసల్పు ననఘుండు పున
ర్జనిహీనత గోలోకం
బునఁ గాఁపురముండు నిత్యమోదంబలరన్. ౧౦౨౦

క. సరిగానము దీనికి సం
స్మరణీయ మనంతమోక్షసాధనమును నీ
వొరులకుఁ దెల్పందగ దిది
పరమరహస్యంబుగానఁ బాలింపు మునీ. ౧౦౨౧

సీ. ఏదేవినామంబు నెలమిమై వినుమాత్ర
నఖిలాపదలుఁగూడ నంతరించు

నేమాత కరుణతో నీ సర్వలోకము
లందు నంతర్లీనయై వసించు
నేతల్లి శైవుల కేని వైష్ణవులకు
నేని సంసేవ్యయై యొసఁగుచుండు
నేరాజ్ఞి శక్తుల కేలికసానియై
ప్రకృతిరూపంబునఁ బరిఢవిల్లు

గీ. దుర్గములు సంకటములఁ దొలఁగఁజేయు
కతన నేదేవి దుర్గాఖ్య గాంచిమించె
నామె పూజావిధానంబు నధికభక్తి
నింక వచియింతు నీకు మునీంద్ర! వినుము. ౧౦౨౨

వ. వాగ్భవంబును శంభువనితయుఁ గామబీజంబును బిదపఁ 'చా ముండాయై' పదంబును 'నమః' పదంబునుంగూడి దుర్గానవాక్షరమంత్రరాజంబయ్యె; నియ్యది భక్తులపాలిటి కల్పపాదపము; దీనికి ఋషులు బ్రహ్మవిష్ణుమహేశ్వరులు; ఛందంబులు గాయత్ర్యుష్ణిగనుష్టుప్పులు. అధిదేవతలు మహాకాళీ మహాలక్ష్మీ మహాసరస్వతులు. బీజంబులు రక్తదంతికాదుర్గాభ్రామరులు. శక్తులు నందాశాకంభరీ భీమాదేవులు. వినియోగము చతుర్విధ పురుషార్థములు. మాళియందు ఋషులను, వక్త్రంబున ఛందములను, హృదయంబున నధిదేవతలను స్తనంబుల శక్తిబీజంబులను న్యసింపవలయు. బీజత్రయంబుచేతను బీజచతుష్టయంబుచేతను బీజద్వయంబుచేతను షడంగంబుల జాతియుక్తంబులఁ గావించి శిఖాలోచనద్వంద్వశ్రుతినాసాననగుదంబుల విన్యాసమొనర్చి మంత్రవర్ణంబుల సర్వవ్యాపకంబు గావించునది. ౧౦౨౩

క. అసితోమరచక్రగదా
ముసలమ్ములు శంఖశూలముద్గరములు పా
శసుదర్శనచాపమ్ములు
నెసలారిన యట్టి దుర్గ నెంతుఁ మదిలో. ౧౦౨౪

క. నానాభూషణభూషిత
యై నీలాంజనసమానమగు సుప్రఖ్యా
మానితయగుచుఁ దశపా
దాననములు గల్గు దేవిఁ దలఁతుఁ మదిలో. ౧౦౨౫

క. మధుకైటభులను నసురుల
వధియించు నిమిత్తమై విపన్నుం డగుచుఁ
విధి యేకాళి నుతించెనో
ప్రథితాత్మకురాలి నామెఁ బ్రార్థింతు మదిఁ. ౧౦౨౬

క. ఒకచేత సురాపాత్రియు
నొకచేతను నక్షమాల యొప్పెడుదానిఁ
బ్రకటితమాయాబీజఁ
సకలేశ్వరియైనయట్టి శక్తిఁ దలఁతుఁ. ౧౦౨౭

క. అరుణాంబుజవాసినియై
యరుణంబగు దేహకాంతి యలరఁగ మహిషా
సురదైత్యనిహంత్రిణియై
పరఁగు మహాలక్ష్మి నెంతు భావమునందుఁ. ౧౦౨౮

క. శుంభనిశుంభుల యధికో
జ్జృంభణము నడంపఁ బుట్టి శోభిలుదానిఁ
జంభారిప్రముఖనుతఁ
శాంభవినిఁ ద్రినేత్రి నెంతుఁ జక్కఁగ మదిలో. ౧౦౨౯

క. వాణీబీజాత్మికయా
నేణాక్షిని సర్వవిద్య లేలెడు సర్వ
ప్రాణాధికమైన సరస్వతి
నాణెంబగు భక్తితో మనమ్మునఁ దలఁతుక్. ౧౦౩౦

వ. అని ధ్యానించి షట్కోణసంయుతంబగు యంత్రంబును నిర్మించి చతుర్వింశతిపత్రకంబగు నష్టదళపద్మంబును భూగృహంబున నిర్మించునది. సాలగ్రామంబునగాని ఘటంబునంగాని యంత్రంబునంగాని బాణమునఁగాని లింగంబునంగాని సూర్యునందుంగాని దేవిని యజింపవలయు. పూర్వకోణంబున సరస్వతీసహితుండగు పద్మజుని, నైరృతంబున లక్ష్మీసహితుండగు శ్రీహరిని, వాయుకోణంబునఁ బార్వతీసహితుండగు శంభుదేవు, నుత్తరంబున సింహమును, వామంబున మహిషమును బూజింపవలయు. నందజా రక్తదంతా శాకంభరీశివాదుర్గాభీమాభ్రామరులను షట్కోణంబులఁ బూజించి వసుదళంబుల బ్రాహ్మి మాహేశ్వరి కౌమారి వైష్ణవి నారసింహి ఐంద్రి చాముండికల శక్తులను దత్త్వపత్రంబులఁ బూర్వక్రమంబుగ విష్ణుమాయ చేతన, బుద్ధి, నిద్ర, క్షుధ, చ్ఛాయ, శక్తి, తృష్ణ, క్షాంతి, జాతి, లజ్జ, శాంతి, శ్రద్ధ, కీర్తి, లక్ష్మి, వృత్తి, శృతి, స్మృతి, దయ, తుష్టి, పుష్టి, భ్రాంతి మొదలగు వానిం బూజింపవలయు. పిదప భూపుర కోణంబులయందు గణేశుని క్షేత్రపాలుని వటుకుని యోగినులను నర్చింపవలయు; నాపిమ్మట సాయుధులగు నింద్రాది దిక్పాలుర యజింపఁజెల్లు; నిట్లు సావరణయగు దేవిం బూజించి సమస్తరాజోపచారంబులఁ గావించి నవాక్షరమంత్రమును జపించి సప్తశతీస్తోత్రంబును దేవ్యగ్రంబునఁ బఠించునది. ౧౦౩౧

క. సప్తశతిం బోలినయది
ప్రాప్తించుట దుర్లభంబు పావనము శుభా
వాప్తికి హేతువు దేవియు
నాప్తునిగతిఁ గాంచుఁ జనువుననఘుని మాసీ. ౧౦౩౨

క. ఏవిధిఁ గృతకృత్యత్వము
భావింపఁగఁగల్గు నరుఁడు ; పావనమా నా
దేవీపూజాప్రక్రియ
మావంతయు మిగులకుండ నంటె మునీంద్రా ! ౧౦౩౩

చ. సురలు మునీశ్వరుల్ నరులు సూరులు రాక్షసయక్షకిన్నరే
శ్వరులుఁ ద్రిమూర్తులున్ సిరియు శాంకరి భారతియున్ సమస్తది
గ్వరులును మంగళప్రదను గామితదాత్రిని లోకపూజ్య నెం
తురు మదులందు నిత్యమును దుర్గను దుర్గతిలేమికోసమై.

గీ. తచ్చరణపద్మసేవావిధానమందు
నాటి తేరుట నా భాగ్య మందినారు
పదియునల్గురు మనువులు నదితిసుతులు
నిశ్చలముగ స్వస్థలముల నిల్చినారు. ౧౦౩౪

ఉ. ఐదువిధంబులం బరఁగు నాప్రకృతిన్ వివరించియుంటి సు
శ్రీదము తచ్చరిత్రము నెఱింగితి పూర్తిగ నామె యంశదే
హోదయమైన దేవతల యుత్తమవృత్తములన్ వచించితిన్
గాదనఁబోక గోప్యమును గాంచిన నీదగు పుణ్య మేమిరో.

క. ఇది విను పుణ్యచరిత్రుల
కుదయంబగు భాగ్యవృద్ధియున్ సకలవిధా
భ్యుదయంబులు నంతమునన్
సదమలమైనట్టి మోక్షసంపద యనఘా ! ౧౦౩౬

మ. ఒకయధ్యాయము చొప్పునన్ బ్రతిదినం బుత్సాహియైగాని పూ
నికతోడన్ నవరాత్రిహంబులనుగానీ చేయఁగానేర్చు నే
యకలంకాత్మకుఁ డీచరిత్రపఠనం బాద్యంతముంగూడ వా
నికి నాదేవియు దాసియై యలరు మౌనీ! సానురాగంబునన్.

ఉ. పుత్రులఁగోరు మానవుఁడు పుత్రుల, విద్యలఁగోరునట్టి స
చ్ఛాత్రుకుఁ డన్నివిద్యలను, సాంగవివృద్ధియుఁ గాంచనేర్చు నే
మాత్రము లోటు గల్గదు సుమా! యెది గోరిన నద్ది కల్గు స
ర్వత్ర శుభావహం బిదియుఁ బాపవిమోచకముం గుమారకా.

చ. శకునపరీక్ష సేయనగు స్నానమొనర్చుచుఁ జేయిమోడ్చి దే
వికి నొకపీటఁ బొత్తమును బెట్టి తమిన్ శిరసంటికొన్న బా
లిక కరమందొ, స్నానమొనరించి కడున్ శుచియైన బ్రహ్మచా
రి కరమునందొ భక్తి నలరించిన భర్మశలాక చే మునీ! ౧౦౪౦

క. బంగారు శలాకన్ జొ
న్పంగను విడివడినయట్టి పత్రమునందున్
సంగతమగు నంశముచే
తం గలుగు శుభాశుభములు తర్కింపవలెన్. ౧౦౪౧

—* స్కంధాంతపద్యములు. *—

క. ఆరామదామిడకుల
వారాన్నిధి పూర్ణచంద్ర! వరగుణసాంద్రా!
సూరిజనస్తవనీయ యశః
పూరితభువనాంతరాళ! బుధజనలోలా! ౧౦౪౨

క. అకపటహృదయాంతర్ని
త్యకలితవిద్యాస్వరూప! దాతృత్వశ్రీ

ప్రకటితనిజగేహోత్సవ !
సకలజగద్వంద్యకీర్తి ! సత్పథవర్తీ ! ౧౦౪౩

క. వైయాకరణ శిరోమణి !
సాయంనటదీశమౌళిసంభృతగంగా
స్థాయచ్ఛలదూర్మినిభ
శ్రీయుతకవితాగురుత్వచిహ్నితనామా ! ౧౦౪౪

గద్య

ఇది శ్రీ......తిరుపతి వేంకటేశ్వర కరుణాప్రసాదిత
రామకృష్ణాంధ్రీకృతమ్మగు దేవీభాగవతమ్ము
నందు నవమస్కంధము
సంపూర్ణము.

శా. సాకల్యం బొనరింప నేర్చియును విశ్వశ్రేయముం గూర్చు సు
శ్రీకల్యాణదమైన కృత్యముల వాసిం బున్నెముం బంచఁగా
నాకాంక్షించియు ఆదినైదు తుది రెండధ్యాయముల్ పేర్మిమై
నార్కుం బీడిన రామకృష్ణులకు సంధానింతుఁగై మోడ్పులన్.

క. తిరుపతి వేంకట కవిగురు
చరణాంబురుహప్రభావసంజనితకవి
త్వరమాయుతుఁడను నన్నుం
దఱుఁ బిల్తురు వేంకటావధాని సమాఖ్యన్

శ్రీ శ్రీ శ్రీ.

శ్రీమత్పరదేవతాయై నమః

శ్రీ
దేవీ భాగవతము

దశమ స్కంధము

తిరుపతి వేంకటవిద్వ
ద్వరకవితారసవిశేషవర్ధితకీర్తి!
పరమార్థనియతమూర్తి!
స్వరచితధర్మపరిపూర్తి! బ్రహ్మాయశాస్త్రీ! ౧

వ. అవధరింపు మట్లు పురాణకథనోన్ముఖుండగు వ్యాసునకు జనమేజయుం డిట్లను. ౨

క. పైకతవచియింపుము సు
శ్లోకం బఘహరము సకలశోకహరణమా
నేకత దాని వినఁగ నే
నేకతమున నింతమాత్రిఁ దృప్తింగాంతున్. 3

వ. నావుడు వ్యాసుం డిట్లను నట్లు నారదుండు, ౪

క. ఓ నారాయణ ! పాపా
జ్ఞానహారంబయిన దేవిచరితము వింటిఁ
గానీ మన్వంతరముల
నా నిఖిలేశ్వరి స్వరూప మది యెటులుండున్. ౫

గీ. ఎట్టి యాకారమునఁ బుట్టె, నెట్టు లేరి
చేతఁ బూజింపఁబడియె నమ్మాత యెవరి
కోర్కెలెటు తీర్చె ? నది వినఁ గోరుచుంటిఁ
గానఁ గరుణించి తెల్పు మక్కథల ననుడు. ౬

ఉ. నారద ! యాలకింపు మఘనాశకము న్నిఖిలేష్టసిద్ధి కా
ధారమునైన దేవిచరితంబు, జగమ్ములతాత ధాతయై
త్వాదికి నాభిపద్మమునఁ దయం దుదయించెను మానసేచ్ఛచేఁ
బూరుషు నొక్కరుఁ దలిరుబోణి నొకర్తు నతండు చేసినన్. ౭

క. ఆయిరువురును దంపతు
లై యలరిరి లోకవిదితమైన యభిఖ్యన్
స్వాయంభువమనువన నతఁ
డా యెఁ శతరూపయనఁగ నామె తనర్చున్. ౮

గీ. ఆ మనువు క్షీరసాగరప్రాంతమందు
జగదధీశ్వరిఁ గొల్చె నచలితభక్తి
నెద్దియును లేమి మృత్తుచే నెసకమెసఁగ
నప్పరాంబిక రూపంబు ననువుపఱిచి. ౯

సీ. వాగ్భవమంత్రం బవాగ్భవంబుగఁ జేసి
యాహారమం దిచ్చు నాహరించి

శ్వాసద్వయస్థవిశ్వాసమ్ము విడనాడి
కామపరిసక్తి నికామమడఁచి
యతిరమ్యకాంత్యలంకృతమైన దేహమ్ము
సతతోపవాసకర్శితము చేసి
స్థిరయంద నిరతమ్ము స్థిరుఁడయి యొక్కపా
దమ్ముచే నిలిచి క్రోధమ్ము గెలిచి

గీ. స్థావరతఁదాల్చి నూఱువత్సరము లతుల
తప మొనర్చిన నతని కాతల్లిదర్శ
న మ్మొసఁగి 'రాజ! కోరు వరమ్ము' లనఁగ
నమ్మహాదేవి నీగతి నతఁడు వొగడె. ౧౦

ఉ. నీ కరుణారసమ్మునన నీరజసూతి సృజించుచుండు ర
క్షాకరుఁడౌఁ జతుర్భుజుఁడు శంభుఁడు నాశనముం బొనర్చు స్వ
ర్లోకము నిందిరుఁడేలు ననలుం డనిలుండును నాదిగాఁగలా
రో కరుణాస్వరూపిణీ! త్వదుద్భవులుం ద్వదుపాసకుల్ గదా.

గీ. తల్లి! వరము లొసంగెడి దానవేని
నాయొనర్చెడి సృష్టి విఘ్నమ్ము లేక
ప్రబలునటు లొనర్పుము వాగ్భవమ్ము జపము
సేయు వారలకు హితమ్ము సేయుమెపుడు. ౧౨

గీ. ఎవ్వ రివ్వాదముం బఠియింతురో మ
ఱెవ్వ రిది విందురో వారి కెల్లరకును
భుక్తిముక్తులు వక్తృత్వము దయసేయు
మమ్మ! నినువేఁడెద నటంచు నతఁడు పలుక. ౧౩

క. మనుజాధిప! వాగ్భవజప
మునకుఁ మెచ్చితిని రాజ్యము నకంటకముఁ

బొనరించి వంశకరులగు
తనయులఁగని పిదప మత్పదము చేరనగుఁ. ౧౪

గీ. అనుచు నవ్వింధ్యవాసిని యరిగె వింధ్య
గిరికి నెయ్యెడి ముని పల తరణిమార్గ
మునకు నడ్డగి కలశోద్భవుని కతమునఁ
గ్రుంగె; నన మునిజనము లకుంఠభక్తి. ౧౫

చ. జననిమహాత్వముం దెలుపు సద్బుధ! సూత! భవద్వచోమృతం
బును గొనఁగాఁ గొనంగ రుచిపుట్టుచునున్నది, వింధ్యపర్వతం
బననెది? యద్ది సూర్యునకు నడ్డుగ నేగతివచ్చె? నెవ్విధ
మ్మునఁ గలశోద్భవుండు నగముఁ బ్రకృతిస్థముచేసె? నావుడుఁ.

చ. వివిధలతావితానపరివేల్లితమై బహుచిత్రపుష్పజా
తివిలసితమ్మునై నదనదీహృదయంగమమై సుధాశనా
దివిహరణోచితంబయి ప్రహృష్టమృగాకులమై మహీధర
ప్రవర మొకండు వింధ్యమన రాజిలు సర్వమహీధ్రపూజ్యమై.

గీ. అన్నగము కడ కొక్కెడ నమరమౌని
యరుగ నదియును నర్ఘ్యపాద్యాదులిచ్చి
యతని నొక యుచితాసనమందు నిలిపి
యిట్లులు వచించె గౌరవం బెసకమెసఁగ. ౧౭

ఉ. ఎచ్చటనుండిరాక, మఱి యేమివిశేషములో వచింపుమో
సచ్చరితాగ్రగణ్య! యనిశమ్ము దివాకరురీతి సర్వలో
కోచ్చయలోలతన్ దిరుగుచుండు మహాత్ముఁడ వీవకావె నీ
వచ్చుట యెల్లవేల్పులును వచ్చుట నావుడు నాతఁ డల్లనన్.

గీ. హేమగిరినుండి వచ్చితి నామహీధ్ర
మందుఁగల లోకముల నాలయములఁ గంటి

నవి యఖిలభోగముల నిచ్చు నవియటంచుఁ
బలికి యొకయూర్పు నిగిడించెఁ గలహభోజి. ౨౦

వ. అంత నప్పర్వతంబు నిట్టూర్పునకేమి కతంబు వచింపు మనుటయు,

చ. శివునకు మామగారగుటచే హిమవంతుఁడు పూజ్యుఁడయ్యె; న
ట్లవసథమౌటఁ దానధికమై కొలువంబడు వెండికొండ; య
న్యవివృతి సేయనేల? నిషధాద్రియు నీలము గంధమాదనం
బవియును బేరుగాంచినవియే యవిరాజ! యిదిట్టులుండఁగన్.

ఉ. నాకు దివాకరుం డనుదినంబు ప్రదక్షిణ మాచరించు నే
నేకద పేరు గాంచితి నిఁ కే నగముల్ ననుఁబోలఁజాలు? ము
ల్లోకములందు నంచు మదిలోఁ గనకాద్రి యఖండగర్వమున్
జేకొని దేనిఁజెప్పినను జేయ దొకించుకయేని లక్ష్యమున్. ౨౩

క. అన్నగము పొగరు దలఁచి కొ
న న్నాకుచ్ఛ్వాస మడరె; నగ్గర్వ మ్ము
చ్ఛిన్నము సేయఁ దపంబున
నన్నియు విడనెంచు మా కనగ్రమకాదే. ౨౪

వ. ప్రసంగవశమ్మున నింతవట్టుఁ జెప్పవలసివచ్చె నిఁక నేగుదునే
యనుడు వింధ్య మాత్మఁ జింతించి, ౨౫

క. అందఱు నాబల మధికం
బందురు మేరువు జయించి యీయాయశమున్
బొందకయుండిన నాకీ
బొంది మఱెందులకు విడువఁబోలదె యింకన్. ౨౬

చ. తనకు దినాధినాథుఁడు ప్రదక్షిణమున్ బొనరించునంచుఁగా
కనకనగ మ్మఖర్వమగు గర్వము దాల్చుట మత్కరమ్మలం

దినకరమార్గరోధము విధించిన నాతఁడు తత్ప్రదక్షిణం
బొనరుపనేరఁ డగ్గిరికి నుండెడి గర్వము తప్పె నప్పుడున్. ౨౭

క. అని తన భుజముల నాకస
మును ముట్టుచు దీర్ఘశృంగములు గలయదియై
యినుఁడెపు డుదయించునో యా
తని నెపు డడ్డుదునో యనుచుఁ ద్వరపడుచుండన్. ౨౮

ఉ. రాతిరి పోవునంతఁ దిమిరంబు గనంబడదయ్యె వేగఁ బ్రి
ద్యోతుకరమ్ముల న్నభము ద్యోతితమయ్యెఁ గుముద్వతుల్ వికా
సాతిశయమ్ముఁ బద్మినుల కర్పణసేయుటకై స్వీయకా
ర్యాతురులై జనుల్ మసలుటబ్బెఁ బ్రపంచకమందు నెల్లెడన్.

గీ. అంతఁ బ్రాహ్ణాపరాహ్ణమధ్యాహ్న భేద
ములఁదెలిపి హవ్యకవ్యముల్ భూతబలులు
దేవతల కీ నొనర్చుచు దినకరుండు
ప్రాచి నాగ్నేయి విడిచి సత్వరతదనర. 30

సీ. యామ్యదిక్కునకుఁ బ్రయాణంబుగా ననూ
రుండు 'మార్తాండ ! మేరువుజయింప
మీ ప్రదక్షిణము గామించి వింధ్యాద్రి యా
కస మావరించి ముంగల నిలిచెను
గాన నీఁకేగ శక్యముగా' దనినవిని
భానుఁ డాశ్చర్యమ్ము వడుచు గొప్ప
పదవి చెందిన శౌర్యవంతునకుం జేయ
రాని కార్యము లెవ్వియేని గలవె

గీ. అనుచు నొనరించు పనిలేక యట్టెయుండె ;
రాహు వరికట్ట క్షణము పర్యంతమేని

యొఁగని యినుండు వింధ్యరుద్ధాత్ముఁడగుచుఁ
జిర మటుండె విధి బలవత్తరము కాదె. 3౧

గీ. ద్యుమణి యటులైన కతన లోకములు లోక
పతులు తల్లడమంది విఫలతఁగనిరి
యలరు స్వాహాస్వధాకారములు నశించె
నష్టతుల్యంబ యగుచుఁ గన్పట్టె జగము. 3౨

క. పడమట దక్షిణమున నుం
డెడివా రది రాత్రియనుచు నిద్రింగొని ర
ప్పుడ ప్రాచ్యోత్తరావాలు
కడుఁ గడుఁ బీడింపఁబడిరి ఖరకిరణములన్. 33

గీ. ప్రజలు కొందఱు మడిసిరి బాధపడుచుఁ
గొందఱుండిరి జగములయందు, బయలు
వెడలె 'హాహా' రవంబు దివిషదు లిందుఁ
జేరి 'కింకరణీయ' మన్వారలైరి. 3౪

క. అంతట వారెల్ల శచీ
కాంతుఁ బాకాంతు ముందుగా నిడికొని య
త్యంతార్తులగుచు గౌరీ
కాంతుని గనుఁగొని నుతింపఁగాఁ దొడఁగిరిటుల్. 3౫

సీ. ఆర్తార్తిహారణార్తకీర్తివిశేష! కై
లాసపర్వతకృతావాస! విష్ణు
హృత్కంజవాస! సంపత్కరా! కరుణార
సాలయా! జగదీశ! కాలకాల!
కాలస్వరూప! మాయాలవాలా! మహా
దేవ! వృషధ్వజ! దీనరక్ష

అక్షీణవిభవ! వశక్ష! విరూపాక్ష!
యోగగమ్యా! మహాయోగనిరత!

గీ. యనుచు నొకమాటగా నెల్లరును నుతింప
విని మహేశుండు నగుచు 'దివిషదులార!
స్తుతిం బ్రసన్నుండ నైతి మీహితము సేయు
వాఁడఁ దెల్పుండు' నాఁగ దేవతలు ననిరి. 3౬

గీ. దేవ! వింధ్యాద్రి మేరువిద్వేషియగుచు
భాను నరికట్టఁ గాల మేర్పడకయుండెఁ
గ్రియలు సేయుట తప్పె; నీ కీడుమాపి
ప్రోవుమీ మమ్మనుచుఁ గ్రతుభుజులు వేఁడ. 3౭

చ. క్రతుభుజులార! మీ నుడువు కార్య మశక్యము నాకుఁజేయ; న
చ్యుతుఁ డఖిలక్రియాకృతిఁ బ్రయోజకుఁ డస్మదధీశుఁడాటచే
నతనికి దెల్పిరేని మనకు నబ్బిన సేగి తొలంగునంచు మా
పతి యనఁ దత్సమేతులయి బ్రహ్మముఖుల్ సని రచ్యుతుం గనన్. 3౮

క. చని దేవదేవు భువనా
వనదీక్షితు వనరుహాక్షు వైకుంఠవిభున్
గని గద్గదస్వరము పెం
పున నిట్లు నుతించి రధికమోదం బలరన్. 3౯

క. జలచరమ వగుచు సోమకు
జలనిధ్యంతర్విలీనుఁ జంపియు వేద
మ్ములు నుద్ధరించితివిగా
జలజాక్షా! భక్తపక్ష! శక్తకటాక్షా! ౪౦

క. కూర్మంబవై పయోధ్యం
తర్మగ్నము నగము నెత్తి త్రావించి సుధన్

నిర్మృతుల మమ్ముఁ జేయవె
ధర్మావనపక్షపాతి ! దైత్యారాతీ ! ౪౧

క. ధర నుద్ధరించుటకు సూ
కరరూపము స్వీకరించి గర్వబలాను
త్తరుఁడైన హిరణ్యాక్షు న
సురహితు సలుపవె ? మురారి ! శోకవిదారీ ! ౪౨

క. నరసింహరూపమున్ గొని
ఖరనఖరమ్ముల హిరణ్యకశిపున్ లోకాం
తరగతుఁ జేయవె ? జగదు
ద్ధరణసమాసక్తచిత్త ! దాసాయత్తా ! ౪౩

క. వామనుఁడవై బలి న్నిజ
ధామము లీగంగఁజేసి తద్ధామముఁ సు
త్రామున కొసంగవే ? యు
ద్దామపరాక్రమవిశిష్ట ! తాడితముష్టా ! ౪౪

క. జమదగ్నిసుతుఁడవై శౌ
ర్యమదసముత్కృష్టదుష్టరాజావళి నా
శము పొనరించి యమేయయ
శము గొనవె ? మహానుభావ ! జగతీదేవా ! ౪౫

క. దశరథునకుఁ దనయుఁడవై
దశముఖముఖదితితనూజతతిఁ దుంచి విప
ద్దశ మాకుం దొలఁగింపవె ?
విశదబలాత్యనుపమాన ! విష్వక్సేనా ! ౪౬

క. నందతనూజుఁడవై కం
సుం దునిమి యధర్మ మెందుఁ జొరనీక మహా

నందమ్ము ధరణి కీవే ? వం
దారార్వానందదాయి ! ఫణిపతిశాయీ ! ౪౭

క. పశుహింస మాన్పుటకు బౌ
ద్ధశరీరము దాల్చి గర్వితమఖవిఘాతా
తిశితవచనములు సెప్పవె ?
నిశితప్రజ్ఞావిచిత్ర ! నిఖిలచరిత్రా ! ౪౮

క. జగమెల్లఁ దుచ్ఛరాజ వ
శగమై మ్లేచ్ఛానుకారిజనయుతమై పా
డుగనుండఁ గల్కివై బా
గుగఁ జేయవొకో ? ముకుంద ! గుణగణకందా ! ౪౯

గీ. ఎట్టి గర్వాల్స్వరూపమ్ము లేని దాల్చు
టార్తులగు భక్తుల భరింప, సహశదులగు
దైత్యుల హరింపఁగద ! యిట్టిదయ మఱేరి
కైనఁ గల్గునె ? దేవదేవా ! యనంత ! ౫౦

వ. అని ప్రార్థించుటయు,

సీ. దేవతలార ! నుతిం బ్రసన్నుఁడ నైతి
దుస్సహంబైన మీ దుఃఖమిపుడ
పోనొనర్చెదఁ దాపముం బొందవలదు దు
ర్లభమైనదేని వరంబు ప్రీతి
నిచ్చెదఁ గొనుఁ డెవ్వ రీ స్తోత్రమును భక్తిఁ
బెంచి ప్రొద్దుటఁ బఠియించువారొ
వారికి దుఃఖసంబంధంబు గలుగదు
గ్రహబాధ మొదలగు కష్టములు మ

గీ. తెవ్వియుం గల్గవు సుఖమ్ము లెన్నియేని
గల్గు సంతతిగల్గు నకాలమరణ
మనుట పుట్టదు రోగముల్ గనుటయేని
సంభవింపదు లక్ష్మీప్రసాద మొదవు. ౯౨

గీ. పలుపలుకులేల భుక్తిముక్తుల నొసంగు
నట్టి దీ స్తోత్రమే మీకు నడరు దుఃఖ
మును వచింపుఁడు పరిహరింతు నన ముదిత
హృదయులై దేవతలు హరి కిట్టు లనిరి. ౯3

క. దినకరమార్గనిరోధ
మ్మును వింధ్య మొనర్చె దాన భోగమ్ములు వొం
దనివారమై నినుం గనుఁ
గొన నేతెంచితిమి రక్షకుఁడ వీవగుటన్. ౯౪

చ. అనుటయు లోకకర్త్రియగు నంబికఁ గొల్చుచుఁ గాశికాపురిన్
దనరు నగస్త్యుఁడ న్మునివతంసుఁడు వానిన వేఁడికొండు విం
ధ్యనగమువృద్ధివంచన యొనర్ప సమర్థుఁ డతండనన్ క్షణ
మ్మున సురలెల్లఁ గాశికకుఁ బోయి యటన్ మణికర్ణికన్ దగన్.

క. స్నానప్రముఖసమస్తవి
ధానములం దీర్చికొని మదకలితమృగన్ృ
పానీక శ్రీరమ్యం
బైన యగస్త్యాశ్రమమున కరిగియు నచటన్. ౯౬

వ. లోపాముద్రాన్వితుండై యున్న యమ్మునికి సాష్టాంగం బెఱఁగి,

సీ. కుంభసంభూత ! విశ్వంభరాసురనేత !
వాతాపిహననవిఖ్యాతచరిత !

మిత్రావరుణపుత్ర ! స్మృతిపురాణాదివి
ద్యానవద్యప్రతిభానిరూప్య !
నహుషసముత్పాటనక్రియాదక్షహుం
కరణ ప్రభావ ! సత్కార్యనిరత !
ఉదయమాత్రవినిర్మలోదకీకృతసమ
స్తనదీక ! ఋషివరిష్ఠా ! యగస్త్య !

గీ. శైలకృతశోకవహ్ని జాజ్వల్యమాన
హృదయులమగుచు నీవు గాచెదవటంచు
వచ్చినారము మమ్ముఁ గాపాడుమయ్య
యనుడు నమ్మౌని మందహాసాన్వితుఁడయి. ౯౮

సీ. నిగ్రహానుగ్రహోదగ్రశక్తులగు మీ
రొనరింపలేకుండు పనియుఁగలదె
వజ్రాయుధముదాల్చు స్వర్నాథునకుఁ జేయ
శక్యమ్ముగాని కర్జమ్ము గలదె
క్రతుభుగావళికి ముఖమ్ము గదా ! వహ్ని
యతనిచేఁ గాని కార్యమ్ము గలదె !
దర్పితమశక్యప్రతాపశాలియగు భా
స్కరదేవునకును దుష్కరము గలదె !

గీ. దండహస్తునకును నసాధ్యంబు కలదె !
యైన నాచేతనగు కార్య మబ్బెనేనిఁ
జెపుడు నిస్సంశయమ్ముగఁ జేయువాఁడ
ననుడు సంతసమంది యిట్లనిరి సురలు. ౯౯

క. అంబరమణిమార్గము విం
ధ్యం బరికట్టెఁగ జగమ్ములన్నియుఁ గడుఁ గీ

డుం బొందినయవి యవివృ
ద్ధిం బోఁగొట్టుము తపఃప్రదీపితశక్తిన్. ౬౦

గీ. నిజముగ నగమ్ము నమ్రమౌ నీదుమహిమ
నీవు సేయంగఁదగు కార్య మిదియ యనుచు
ఋషి యొనర్చుట కంగీకరింప సురలు
చని రతం డిట్టు లనెఁ దనచాన గుఱిచి. ౬౧

మ. నృపపుత్రీ! యిచటన్ వసించుటకు నిర్దేతెంచె విఘ్నమ్ము విం
ధ్యపరిస్తంభన చేయు నక్కతన, మోక్షాపేక్షకుల్ గాశి నొ
క్కపుడున్ వీడఁగఁ గూడదంచు మఱిఁ గాశ్యావాసులౌ వారికే
యెపుడున్ విఘ్నము గల్గునంచు ననరే! యిందిందిరాభాలకా!

క. అని యమ్మణికర్ణిక న
మ్మని స్నానము చేసి కుతుకమున విశ్వేశుం
గని దండపాణికిం బూ
జన మొనరిచి కాలరాజసమ్ముఖమునకున్. ౬౩

మ. చని కాశీపురవాసివిఘ్నహర! దాసస్వాంతవాసా! ననున్
జను లీ దుష్కృతి చేసినాఁడనుచు నెంచన్ బో, ఇఁకే కర్మవా
సనచేఁ గాశిని వీడఁజేసెదవు దోసం బెద్దియో నుండెనే!
యనుచుం బ్రార్థనచేసి సాక్షిగణపత్యభ్యర్చనల్ సేసియున్.

గీ. దక్షిణపు దెసవట్టి యతండు సారె
సారెకుం గాశిఁ దలఁచుచు క్షణములోనఁ
దన తపమ్మను రథము నెక్కిన విధానఁ
జనియె సస్త్రీకుఁడై వింధ్యసవిధమునకు. ౬౪

శా. అంతన్ వింధ్యనగమ్ము గన్గొని స్వకీయౌద్ధత్యమున్ వీడి య
త్యంతాల్పంబయి దండరీతిఁబడి సాష్టాంగప్రణామంబు శు

ద్ధాంతర్వృత్తి నొనర్పఁగా నతఁడు వత్సా ! గండశైలమ్ములం
దెంతేఁ గష్టము గల్గు నెక్కుటకునై యే దుర్బలుండేన్ జుమీ.

గీ. కాన నే వచ్చు నందనుకను నిటులనె
యుండుమని చెప్పి యయ్యగస్త్యుండు దాని
శిఖరములఁ గ్రమముగ నధిష్ఠించి దక్షి
ణగతిగాఁ జని శ్రీశైలము గనుఁగొనియు. ౬౭

క. మలయాద్రిఁ గృతాశ్రముఁడై
నిలిచెన్ ; వింధ్యాద్రి యట్టనిలిచెన్ ; మనుపూ
జలఁగొని దేవియు దానన
నిలిచెన్ దా వింధ్యవాసినియనఁ దనరుచున్. ౬౮

సీ. శత్రునాశకము పవిత్రంబునగు నీ య
గస్త్యవింధ్యాద్ర్యుపాఖ్యానము విన
విప్రులకును జ్ఞానవృద్ధి నిచ్చెడు రాజు
లకు నిరాహతజయలక్ష్మి నొసఁగు
ధనధాన్యముఖసమస్తపదార్థవృద్ధి వై
శ్యులకుఁ గల్గించు శూద్రులకుఁ బాడి
పంటల సుఖముల భద్రమ్ములం గూర్చు
నర్థకాంక్షుల కధికార్థ మిచ్చుఁ

గీ. గామికి హితమ్ములిచ్చు నిక్కరణిదేవిఁ
గొలిచి స్వాయంభువమనువు గొనియె రాజ్య
మిదియ మన్వంతరాశ్రయవిదితమౌ ప
రాంబిక చరిత్ర మిఁక నేమి యడుగుదురని. ౬౯

వ. సూతుం డనుటయు శౌనకాదులు మహాత్మా! యాద్యుండగు
స్వాయంభువుని చరిత వింటిమి. క్రమమ్ముగఁ దక్కంగల మను

వుల చరిత్రంబులు వినఁ కుతూహలాయమానమానసులమై
యుంటిమి తెలుపుమనుడు నతఁడు నిట్లు వలుకు నట్లు నారాయ
ణుఁడు నారదుంగాంచి, ౨౦

గీ. ప్రథమమనువగు స్వాయంభువవిభునకు సు
తులు ప్రియవ్రతోత్తానపాదు లనఁగలరు
వారు భూపాలనం బనిర్వారణగతి
గా నొనర్చి యఖండ విఖ్యాతిగనిరి. ౨౧

సీ. రెండవ మనువు ప్రచండబలుఁడు ప్రి
యవ్రతసుతుఁడు సత్యవ్రతుఁడు
స్వారోచిషాఖ్యుఁడవ్వాఁడు కాళిందీత
టమ్మున సర్వసత్త్వమ్ములకుఁ బ్రి
యమ్ము సేయుచు నివాసమ్ము చేసికొని శీ
ర్ణమ్ములై తనరు పర్ణములు తినుచు
దేవిరూపమ్ము మృత్తికచే నొనర్చి త
త్పూజ సేయుచు భక్తితోఁ దపమ్ము

గీ. ద్వాదశాబ్దమ్ము లొనరింప దశశతార్క
సమనిజద్యుతియయి జగజ్జనని దర్శ
నమ్మొసఁగి నుతిచేఁ బ్రసన్నయయి యాద
రమున మన్వంతరాశ్రయ రాజ్యమిచ్చి. ౨౨

క. తారణియనఁ దాఁ బరఁగెన్
స్వారోచిషమనువు తత్కృపన్ బుత్రిలతో
ధారుణి నేలి సుఖాప్తి
శ్రీరాజిలి స్వర్గమునకుఁ జేరెన్ బిదపన్. ౨3

గీ. మూఁడవ యతని పేరుత్తముఁడు ప్రియవ్ర
తతనయుఁ డతండు మూఁడు వత్సరము లుపవ
సించి గంగాంతికమున జపించె నంత
దేవి ప్రత్యక్షముగ నరుదెంచుటయును. ౭౪

క. స్తుతిఁదనిపి రాజ్య మప్రతి
హతగతిఁగొని సుతులఁ గని సుఖాన్వితుఁడై సం
గతధర్మవర్తనుండయి
యతఁడున్ రాజర్షి సేవ్యమగు పదమందెన్. ౭౫

సీ. తామసుండను పేరఁ దనరు ప్రియవ్రత
తనయుండు నాల్గవ మను వతండు
నర్మదానది దక్షిణపుఁ దీరమునఁ గామ
రాజకూటజపపరాయణుఁడయి
చైత్రమ్మునందు నాశ్వయుజమ్ము నందును
నవరాత్రిపూజ యొనర్చుచుఁ బర
మేశ్వరికిఁ బ్రీతి నెంతేఁ గలుగఁ జేసి
తదతిపూర్ణప్రసాదమ్ము కలిమి

గీ. శత్రువిరహితమైన రాజ్యమ్ము నొంది
యధిక సుఖమంది శౌర్యబలాధికులగు
పుత్రులఁ బదుండ్రఁ గని యంత భూమి విడిచి
యంబరమ్మును బొందె ననంతరమున. ౭౬

గీ. అతని యనుజుండు రైవతుఁ డైదవమను
వతఁడు కాళిందితటిని గామాఖ్యబీజ
మును జపించి స్వారాజ్యార్థమునకు నధిపుఁ
డయి సుతులఁగాంచి పొందె లోకాంతరంబు ౭౭

క. చాక్షుషుఁ డాఱవ మను వం
గక్షోణీనాథు సుతుఁ డతఁ డఖండతరతపో
ధ్యక్షుఁ బులహు బ్రహ్మర్షి౯
వీక్షించి మహాత్మ! నిన్ను నే శరణంటి౯. ౭౮

గీ. నీకుఁ గింకరుఁడను ధరణీపరిభుత్వ
మడ్డులేని భుజబల మ్మనంతసంత
తియుఁ జిరంజీవితయును ముక్తియు లభింప
నెద్దియే నుపదేశింపవే యనవుడు. ౭౯

క. పులహుండు దేవదేవి౯
గొలువుము తత్కృపను నీదు కోరుకులెల్ల౯
ఫలియించు ననుటయును నె
ట్టులు గొలువఁగ వలయు ననవుడు నతఁడనియె౯. ౮౦

సీ. దేని జపించుటచే నంబుజభవుండు
జగముల సృజియించు జాణయయ్యె
దేని జపించుటచే నుపేంద్రుఁడు రక్ష
కత్వమ్మునందుఁ బ్రకాశతగనె
దేని జపించుటచే నుమాప్రియుఁడు ల
యమ్ము సేయఁగ శక్తినంది మించె
దేని జపించుటచే నెల్ల దిక్పతుల్
రక్షింప శిక్షింప దక్షులైరి

గీ. దేని జపియించు వారి కెందేని హాని
పుట్టదో యట్టి వాగ్భవమును జపింపు
మదియ నీకోర్కె లొనఁగూర్చు నన నతండు
తత్క్షణమ విరజానదీతటికిఁ బోయి. ౮౧

వ. పల్లవాహారుండై యొక్కయేఁడును జలాహారుండై మఱియొక
వత్సరమ్మును బవనభక్షకుండై యిఁక నొక యబ్దంబును నిరా
హారుండై స్థాణువుంబోలెఁ దొమ్మిది వత్సరమ్ములును వాగ్భవ
మంత్రంబు జపించుటయు నజ్జగజ్జనని యెదుటం గన్పట్టి 'నీకోర్కి
చెప్పు' మనుడు, ౮౨

గీ. తల్లి! యెల్లర కంతరాత్మవగు నీవె
ఱుఁగని నాకోర్కి గలదె యైనఁ గృప! దర్శ
నం బొసఁగి యడిగితివిగాన వచియింతు
నఖిల మన్వంతరవిభుత్వ మభిలషింతు. ౮౩

చ. అనవుడు నట్ల యిచ్చితి మహామహులౌ సుతు లుద్భవింతు రీ
వొనరుచు రాజ్యమం దెపుడు నుండదు లోపము మోక్షమబ్బు నం
చును వరమిచ్చి యంబ చనె; శూరులఁ బుత్రులఁ గాంచి సార్వభౌ
మనియతసౌఖ్యమం దిమనుమాన్యుఁడునై యతఁడొందె ముక్తియున్

క. వైవస్వతుఁ డేడవ వాఁ
డై వఱలున్ శ్రాద్ధదేవుఁడనఁ బరమాసం
దావహుఁడన నాతండున్
దేవీకృప రాజ్యమున్ దుదిన్ ముక్తిగొనెన్. ౮౪

గీ. ఎనిమిదవవాఁడు సావర్ణియనఁగఁ దనరు
నతఁడు జన్మాంతరమునఁ బరాంబఁ గొలిచి
యాపె కృపకల్మి మన్వంతరాశ్రియాధి
నాథుఁడయ్యె ననంగ నన్నారదుండు. ౮౫

వ. సావర్ణి జన్మాంతరమున నెట్లు పూజించెఁ దెలుపుమనుటయు,

ఉ. యాచకులన్ గణించెడి మహాత్ముఁడుఁ జైత్రకులోద్భవుం డసం
కోచపరాక్రమక్రముఁడు గోవిదుఁడుం గవియున్ నయాస్త్రవి

ద్యాచతురుండునైన సురథాఖ్యుఁడు మానధనుం డొకండు స్వా
రోచిషకాలమందుఁ దనరున్ ధనధాన్యసమృద్ధిమంతుఁడై. ౮౮

గీ. అతని నగరమ్ము నరికట్టి యరులు ధనము
పుచ్చికొని యప్పురమునుండి పోఁదఱుమఁగ
వాజినెక్కి యొక్కండయై భ్రాంతచిత్త
వృత్తి నాతం డరణ్యమ్ములెల్లఁ దిరిగి. ౮౯

క. అతిశాంతం బతిరమ్యము
యతియుతమగు దీర్ఘదృష్టి యాశ్రమముం గాం
చి తదభిమతహృదయతఁ గొం
త తడ వటన్ గడపి కృతవిధాను మునీంద్రున్. ౯౦

ఉ. కాంచి నమస్కరించి తన కష్టములెల్ల వచించి పూర్వమం
దించుక జ్ఞానముండె నది యిప్పుడు రాజ్యమునన్ హరించి నన్
వంచితుఁ జేసినట్టి నరపాలురచేత హరింపఁగాఁబడెన్
గొంచెమ యేనియున్ మమతగ్రుంగదు పోయినరాజ్యలక్ష్మిపై.

గీ. ఏమిసేయుదు నాదుఃఖ మెట్లుతప్పుఁ
జెప్పుమయ్య నీదయ నపేక్షించువాఁడ
ననఁగ ముని యను దేవిమాహాత్మ్య మద్భు
తకరము సకలాభీష్టప్రదమ్ము సుమ్ము. ౯౧

సీ. బ్రహ్మవిష్ణుశివోద్భవయు జగన్మయియు నై
మాయ మోహమ్ము సమస్తజాతు
ములకును గలిగించుఁ దలఁప నద్దియ సృష్టి
సేయుఁ బాలించు నశింపఁజేయు
నదె కాళరాత్రి దురత్యయ కాళి మ
హాలక్ష్మి కామద యనఁగనొప్పు

దానియంద జగముద్భవమౌఁ బ్రతిష్ఠిత
మౌ లయమ్మునుబొందు నక్కతమున

గీ. నది పరముకన్నఁ బరమగు నట్టి దేవి
కరుణ యెవ్వనిమీఁదఁ గలుగునో య
తండు మోహమ్మువొందఁ డన్యుండు తాదృ
శుండు గానేరఁడనఁగ రాజు ముని కనియె. ౯౩

గీ. అమ్మహాదేవి యెవ్వరో యామెరూప
మెట్టులుండునో పుట్టుట కేమికార
ణంబు జంతుసంతతికి మోహంబు గలుగఁ
జేయఁగాఁ గారణంబేమి చెప్పుమయ్య. ౯౪

గీ. అనుటయు ముని వచించు నారాయణుండు
విశ్వము హరించి యోగరాడ్వృత్తి శేషు
నాస్తరణసేసికొని సంద్రమందు నిదుర
నొందఁ దత్కర్ణమలమున నుద్భవించి. ౯౫

క. మధుకైటభులను దానవు
లధికభయంకరశరీరులగుచు విధాతన్
వధియింపఁగడఁగ నాతం
డధిగతనిద్రు హరిఁ గాంచి యత్యార్తుండై. ౯౬

శా. నాకెంతెంతటికష్టముల్ గలిగినన్ దానే నివారించు ల
క్ష్మీకాంతుండు సుషుప్తిఁ జిక్కువడె నక్షీణప్రతాపోగ్రులీ
రాకాసుల్ నిలువంగనీ రెటులహో ప్రాణంబులిప్డాఁగునో
యీకష్టం బెటుదాఁటునో యనుచు నెంతేఁజింతమై నంతటన్.

క. ఏనిద్రాధిష్ఠాత్రికి
శ్రీనాయకుఁడు వశముపడి చెందె న్నిదురన్

దానిఁ బరాంబ శరణుఁ గొన
నౌను హితాప్తియని నిశ్చయముగొని పిదపన్. ౯౮

గీ. దేవి నీగతిఁ బ్రార్థించె దేవదేవి !
దాసశివదాయినీ ! జగత్కారి ! పరాత్మ
శయన ! నీయాజ్ఞకు వశపడియకద తమ
కృత్యములఁ దీర్చికొనియెద రెల్లవారు. ౯౯

వ. మఱియుం గాళరాత్రి మోహరాత్రి ప్రముఖనానాస్వరూప ములనొప్పు నీకు నమస్కారమ్ము; నీచే గృహీతుండగు భగ వంతు రమేశు మేలుకొల్పుము. నన్నిదురాత్ములగు రక్కసులు పీడించుచున్నవారని వేఁడుటయు నయ్యంబ దయార్ద్రయై హరిని విడిచి రాక్షసుల మోహమయుల నొనర్చె; నంత హరియును నవ్వారలఁ బూర్వోక్తక్రమమ్మున వధియించె; నారక్కసుల మెదడు భూమియయ్యె; నియ్యది మహాకాళీజన్మప్రకారం బింక మహాలక్ష్మ్యుత్పత్తి నాకర్ణింపుము. ౧౦౦

క. మహిషీగర్భోద్భూతుఁడు
మహాబలపరాక్రముండు మదగర్వితుఁడౌ
మహిషాసురుండు దేవని
వహముగెలిచి లోకములకుఁ బ్రభువై యుండెన్.

గీ. తత్పరాజితులయి దేవతలు పురముల
విడిచి బ్రహ్మను ముందుగా నిడికొని హరి
హరులుగల లోకమున కేగి యతితరార్తి
కలితవచనులై వారితోఁ బలికిరిట్లు. ౧౦౨

సీ. అస్మత్ప్రభువులార ! యసురశిక్షకులార !
యవధరింపుఁడు మహిషాసురుండు

బలపరాక్రమగర్వకలితుఁడై మమ్ము జ
యించి మా స్థానమ్ములెల్ల ననుభ
వించుచున్నాఁడు వేగవాని వధింప
వలను యోజింపఁగావలయు ననుడుఁ
గోపమ్ము గలిగిన శ్రీపతి మొగమున
నుండి సహస్రసూర్యోపమాన

గీ. మైన తేజమ్ము పుట్టెఁ గ్రమానుగతిని
గోపదీపితరుద్రవాణీపతిముఖ
దేవతల దేహములనుండి తేజము లుద
యించె నెల్లర కానంద మెసక మెసఁగ. ౧౦౩

వ. అందు శంభుసంభూతమ్మగు తేజమ్మున మొగమ్మును, యామ్య
తేజమ్మునఁ గేశమ్ములును, వైష్ణవమ్మున బాహువులును, సౌమ్య
మ్మున స్తనమ్ములును, మాహేంద్రమ్మున మధ్యమ్మును, వారుణ
మ్మున జంఘోరువులును, భౌమ్యమ్మున నితంబంబులును, బ్రాహ్మ
మ్మునఁ బాదమ్ములును, సౌరమ్మునఁ బాదాంగుళులును, వాసవ
మ్మునఁ గరాంగుళులును, కౌబేరమ్మున నాసికయుఁ, బ్రాజాపత్య
మున దంతమ్ములును, పావకమ్మున నేత్రత్రయమ్మును, సాంధ్య
మ్మున బొమముడియును, వాయువ్యమ్మునఁ గర్ణమ్ములునుగా
నెల్లర తేజఃపుంజమ్మున మహిషాసుర మర్దని యను సంబ
పుట్టుటయు, ౧౦౪

సీ. శివుఁడు శూలమ్ము విష్ణువు చక్రమును వరు
ణుండు శంఖము ననలుండు శక్తి
ననిలుండు చాపసాయకముల నిందుఁడై
రావతఘంట వజ్రమ్ము జముఁడు

వ. కావున మహామాయయు మోహనివారిణియునగు నయ్యంబ
నారాధించితివయేని మోహమ్ము నిన్నంటదు రాజ్యంబు వొందెద
వని పులహుండు దెల్పుటయు నప్పార్థివుండు విసృష్టాహారుండై
తనరక్తము బలియిచ్చుచు మృణ్మయంబగు దేవీమూర్తిని యథో
చితమ్ముగఁ బూజించుటయు నయ్యంబ ప్రత్యక్షంబై. ౧౨౭

క. వర మడుగుమనుడు మోహము
హరియింపఁగ మరలరాజ్యమందఁగ నిడు మీ
శ్వరి ! యన నట్లగు నీకనొక
వర మిచ్చెద దాన దీనిపైపుట్టువునన్. ౧౨౮

గీ. ప్రభుఁడవగుదువు మన్వంతరమున కఖిల
సంపదలు గల్గునని జగజ్జనని చనియె
నతఁడు మన్వంతరప్రభువయ్యె నీచ
రితముఁ జదివిన వినిన నీప్సితములబ్బు. ౧౨౯

క. వినుమిఁక మిగిలిన మనువుల
జననముల స్మరించు మాత్ర జగదీశ్వరిపై
జనియించుఁ బత్తి చిత్త
మ్మునఁ దన కెఱుఁగంగ రాని ముదము జనించున్. ౧౩౦

వ. వైవస్వతునకుఁ గరూష పృషధ్ర నాభాగ దిష్ట శర్యాతి త్రిశం
కులను నార్వురు తనయు లుద్భవించి రవ్వారు. ౧౩౧

సీ. కాళింది తటికేగి కలితమృణ్మయమూర్తి
భ్రామర్యభిధదేవి బహువిధోప
చారమ్ములిడుచు వేర్వేఱఁ గొల్చుచుఁ బర్ణ
పవనభక్షకులు శ్వాసవిరహితులు

నుదకధూమాగ్రింశుకృతోదరపోషణు
లై యుపాసనబల్మి నాత్మయంద
జగముగాంచుచు నెక్కుడగు తపమ్ముఁ బదిరెం
డేండ్లు సేయఁగ దేవి యెదుటఁ గాన

గీ. వచ్చుటయు "వాగ్భవప్రీత! వాగ్భవోక్త!
యీశి! క్లీంకారవిగ్రహ! హృదయదుఃఖ
హారిణి! కృపార్ద్రదృష్టిప్రసారిణి! యప
రోక్షకారిణి! యనుచు నార్గురు నుతింప. ౧౩౨

క. భూపతిసుతులార! తపో
దీపితులార! మదికోర్కి దెల్పుఁడనుడు ను
ర్వీపాలకత్వముం దను
జోపేతశ్రీయు మాకు నొసఁగుము తల్లీ! ౧౩౩

వ. అనుటయు ౧౩౪

క. మీ కోర్కి దీరు నింతియు
కాక క్రమమ్ముగ మనువులు కాఁగల రధిక
శ్రీకీర్తిసంతతులనున్
గైకొనియెద రని పరాంబ కను మొఱఁగె వెసన్.

వ. అట్లయ్యార్వురు నప్పుట్టువున రాజ్యసంతత్యాదివైభవమ్ము లనుభవించి పైపుట్టువునఁ గ్రమమ్ముగఁ గరూషుండు తొమ్మిదవ మనువగు దక్షసావర్ణియు, నాభాగుండు పదునొకండవ మనువగు సూర్యసావర్ణియు, ధృష్టుండు పదిరెండవ మనువగు చంద్రసావర్ణియు, శర్యాతి పదుమూఁడవ మనువగు రుద్రసావర్ణియుఁ, ద్రిశంకువు పదునాల్గవ మనువగు విష్ణుసావర్ణియునై భ్రామరి

యనుగ్రహమ్మున నెల్లభోగమ్ముల నంది లోకవంద్యులై రను
టయు నారదుండు. ౧౩౬

క. దేవీకథామృతమ్మున్
ద్రావఁగ ద్రావఁగ దలంతు భ్రామరి యను న
ద్దేవి యెటు పుట్టె రూపం
బే విధమున నుండుఁ దెలుపు మిక్కుత యనుడున్.

వ. నారాయణుండును, ౧౩౭

గీ. తల్లులకుఁ బ్రీతి యేరీతిఁ బిల్లలపయి
నుండు జగదంబకును నట్లయుండు జగము
నందు నిర్వ్యాజమగు ప్రేమ యతివిచిత్ర
మంబ చారిత్ర మెఱుఁగ శక్యంబు గాదు. ౧౩౮

సీ. అరుణుం డనఁగ నొక్క యమరారి యమరుల
గెలువ నలువఁగూర్చి వలిమలదరిఁ
బండుటాకులు దిని పదివేల వత్సర
మ్ములు, జలశీకరమ్ములుగొని పది
వేల వర్షమ్ములు, పిదప మారుతభుక్తుఁ
బదివేల యేఁడులు శ్వాసబంధ
నమ్ము గాయత్రి జపమ్ము సేయుచుఁ దామ
సమ్ము గ్రమ్మకొనఁ దపమ్మునర్చు

గీ. నంత వాని శరీరమ్ము నందు నుండి
పుట్టె యగ్గి జగమ్మెల్ల ముట్ట భయము
నంది యెల్లరు విధి శరణొంది తెలుప
నతఁడు గాయత్రితో సేగె నంచ నెక్కి. ౧౪౦

గీ. ఏగి ప్రాణావశిష్టు నాడీగరిష్ఠు
నక్షిమీలనపూర్వకధ్యాననిష్ఠు
నగ్నితేజోవిశిష్టు గాత్రాపకృష్టు
నతికృతతపస్సముత్కృష్టు నరుణుఁ గాంచి. ౧౪౧

క. వినినంత సంతసింపఁగ
ననియె "వరమ్మడుగు" మని సుధాధికమధురం
బనఁదగు నప్పలుకున్ విని
కనులన్ విప్పి విధిఁ గాంచి కడు వినయమునన్. ౧౪౨

గీ. నతి నుతి నొనర్చి "మృత్యువు నాకు లేక
పోవు నటు సేయు" మన మృత్యువు హరిహరుల
కేని దప్ప దొరుల మాటయేల! యే నొ
సంగఁ దగునది యడుగు మనంగ నతఁడు. ౧౪౩

వ. యుద్ధమ్ముననొండె నన్యనిమిత్తమ్ములనొండె నాకు మృత్యువు లేమిఁ గటాక్షింపుము. మఱియు దేవతల జయించు నంతటి బలమ్ము నా కలవడవలయు నావుడు నతండట్లు కాక యని చనుటయు నతండును, ౧౪౪

సీ. దనుజులఁ బలిపింపఁ దమకు నాతని బ్రభు
వుగఁ జేసికొని వాండ్రపు నగవిరోధి
కడకు యుద్ధ మొనర్పఁగా దూత నంప నా
తఁడు భీతుఁడై ధాత కడకుఁ జనుడు
నతఁడు శ్రీపతిఁ బురోగతుఁ జేసికొని శూలిఁ
గనుఁగొని యెల్లరుఁ గలిసి యరుణుఁ
జంపఁగ యోజించు సమయమునన వాఁడు
సర్వాధికారముల్ సంగ్రహించి

గీ. తాన నానాస్వరూపముల్ దాల్చి యేలు
చుండ సూర్యేందుయమవహ్ని లొక్క పెట్ట
వచ్చి తమపాటు చెప్ప నప్పట్టునందు
గొప్ప యాలోచనము సేయఁ గుంకునాత. ౧౪౫

క. అంబా గొలువుఁడు మీకా
ర్యంబుం బొనరించు నాపె యరుణుఁడు గాయ
త్రిం బెడబుద్ధి విడిచిన న్మ
తిం బొందున్ దజ్జపంబ దృఢబలుఁ జేసెన్. ౧౪౬

వ. అనుచు నశరీరిణి వలుకుటయు నింద్రుండు బృహస్పతిం బిలిచి యే
మెల్లర మంబ నారాధించెద మాపె నీకుసాహాయ్యకం బాచరించు
నీ వరిగి యరుణుండు గాయత్రి విడుచు నట్లొనర్పు మని యెల్ల
రం గలిసి పరమేశ్వరిం గొలువ నరుగుడు బృహస్పతియు, ౧౪౭

గీ. అరుణు సన్నిధి కరుగ "సమరగురూ! య
రాతినైతి యుష్మత్పక్షపాతి నిపుడు
గానుగద ; యిట్లు రానేమి కారణ"మ్మ
నంగ మనకు సంబాధ మున్నయది కాదె. ౧౪౮

క. ఏదేవి నేము గొలిచెద
మాదేవి న్నీవు గొలుచుటది లేదె యనం
గా ; దానిఁ గొలువనని మా
నాదానమ్మునఁ ద్యజించె న మ్మంత్రంబున్. ౧౪౯

క. గాయత్రీప్రతిపాదక
మై యొప్పెడు మంత్ర మెప్పు డతఁడు విడిచెనో
పోయెం దేజ మ్మప్పుడ
గాయత్రిదికాక తేజు కాయజమగునే. ౧౫౦

క. అతఁ డట్లుగా, బృహస్పతి
కృతకృత్యుం డగుచు వచ్చి యిందు్రిన కాసం
గతి దెల్పఁగ నతి కుతుకా
న్వితులై నుతియించి రంబ నెల్లరుఁ బిదపన్. ౧౫౧

వ. మఱియు బహుకాలమ్ము మాయాబీజ జపం బొనర్చునంత,

సీ. చిత్రవస్త్రద్వయాంచితయుఁ జితా్రినులే
పసపుష్పమాలికాపరిలసితయు
హ్రీంకారతుల్యశబ్దాంకితభ్రమరసం
వృతయుఁ గోటితపనద్యుతిసహితయు
నతిసుందరాతిశాంతాకారకలితయుఁ
గరుణార్ద్రదృక్ప్రసంగతయునై ప
రాంబ గన్పడ సంభ్రమంబున నెల్లరు
"సృష్టిస్థితిలయకారిణి ! మహోగ్రి !

గీ. యుగ్రితార ! యనుగ్రహోదగ్రి ! సర్వ
జనని ! సర్వజ్ఞ ! సర్వాత్మిక ! నిగమప్ర
శంసిత ! దురాత్మసత్త్వనాశకరి ! 'నేతి
నేతి' వాక్యబోధ్య !" యని యొంతే నుతించి. ౧౫౩

వ. మఱియుఁ దదవతారభేదమ్ములఁ దత్తదాశ్రితసచ్ఛేదమ్ములఁ బ్రశంసించి, "యీవ గాయత్ర్యాదిరూపమ్ములఁ దాల్తు, నీ రూపమ్ము యెల్లరూపమ్ముల నెసంగు, విశ్వతైజసప్రాజ్ఞవిరాట్సూత్రాత్మిక వీవ" యని యెల్ల భాగమ్ముల నమస్కరించి "యో తల్లీ ! మమ్ము రక్షింపు" మనుటయు, ౧౫౪

గీ. "చేయఁదగు కార్య మెయ్యది చెప్పుఁ" డన న
రుణుఁడు శ్రుతిదేవవిప్రవిరోధియై క
డుంగడుఁ గీడు సేయుఁ జంపంగవలయు
ననుడుఁ బుట్టించెఁ దుమ్మెదల నధికముగ. ౧౫౫

క. తనచుట్టుఁ దనరు తుమ్మెద
లనువానిన్ బంప నద్రులఁ ద్రుమంబుల నిం
గిని మిడుతలదండు విధ
మ్మున నవి గ్రమ్మఁగఁ దమంబు వొడమెన్ బుడమిన్.

ఆ. వె. తేనెఁ దీయువానిఁ దేనెటీఁగలు కుట్టు
నట్లు కోపమున సురార్యురోవి
దారణమ్ము తుమ్మెద లొనర్ప వారించు
కొనఁగఁ జాలరైరి దనుజులెల్ల. ౧౫౭

గీ. అస్త్రములఁ బట్టుటేని, యాహవము సేయు
టేని, యొకని దాస్థితి నొకఁ డెఱుఁగుటేని
గలుగకయె యెవ్వఁ డెచ్చోటఁ గలఁడొ యాతఁ
డచ్చటన చచ్చె; నంతఁ గార్యమ్ము తీర. ౧౫౮

క. తుమ్మెద లంబికసామీ
ప్యమ్మున కరుగంగ విస్మయమ్మందిరి లో
కమ్మునఁ గల వారెల్లరు
"నిమ్మాయ యదీయ" యంచు నెంచు మనములన్.

గీ. అంత బ్రహ్మాదిదేవతల్ హర్షమొంది
యంబ కఖిలోపచారమ్ము లాచరించి
కాన్కలిడి జయశబ్దసంకలితులై సు
మములు గురిసిరి మఱియు స్వర్గమున నపుడ. ౧౬౦

వ. దుందుభిధ్వానమ్మొందికొనియె; నచ్చర లిచ్చవచ్చిన కొలందిని నృత్యమ్మొనర్చిరి. గంధర్వాదులు గానంబులఁ బ్రశంసించిరి. మృదంగాదివిరావంబు భూనభోంతరాళమ్మునఁ గరాళమ్ముగ నావరించె నంత. ౧౬౧

క. శిరములఁ గరము లలర " జయ
పరమేశ్వరి " యనుచు నెల్లవారు నుతింపన్
వరము లొసఁగి " త్వద్భక్తిన్
గరమి " మ్మనుడు నిడి యంబ కనుమొఱఁగె వెసన్.

గీ. పాపతాపహరము మనుబ్రాహ్మరీచ
రిత్రి మియ్యది చదివినఁ బ్రీతి వినిన
నభిమతార్థసిద్ధియగు భవాబ్ధి భీతి
నొందుగతి తప్పు నంబ సాయుజ్య మొదవు. ౧౬౩

శ్రీ. శ్రీ. శ్రీ.

—* స్కంధాంతపద్యములు *—

క. విద్యావైశద్యాప్రితి
పాద్యా వేద్యాతిశాంతభావవిభావా
భిద్యోతితచరితాప్రితి
వాద్యార్జితకీర్తిసాంద్రా! బ్రహ్మసుధీంద్రా! ౧౬౪

క. భాష్యాంతపారకత్వా
దూష్యకవిత్వప్రశస్తిదుస్సాధలస
చ్ఛిష్యప్రశిష్యకలితమ
నీష్యన్వేష్యాత్మశక్తి! నిరుపహతోక్తీ! ౧౬౫

—* పంచచామరము *—

నిరంతరాన్నదానమానిత ! క్షుదన్వితప్రజా
పరంపరాకృతస్తుతిప్రసిద్ధ ! శుద్ధబుద్ధి బ
ద్ధరమ్యసౌమ్యసౌమ్యవర్తనా ! ధనాఢ్యనాదరా !
ధరాధరాలయీకృతార్థతత్త్వవిత్త్వ ! సత్త్వగా ! ౧౬

సమస్తసన్మంగళానిభవంతు.

గద్య

ఇది శ్రీచర్లబ్రహ్మాంతర్వాణిమణిప్రశిష్య తిరుపతివేంకటేశ్వర
కవిశిష్య వేంకటేశ్వరకనిష్ఠపితృవ్య శ్రీవేంకయార్యపుత్ర
సుబ్బమాంబాగర్భశుక్తిముక్తాయమాన సుకవి
విధేయ వెంకన నామధేయ ప్రణీతంబైన
శ్రీదేవీభాగవతంబను మహాపురాణ
మ్మునందు దశమస్కంధము
శ్రీమత్పరదేవతా
ర్పణమస్తు.



శ్రీ మత్పర దేవతాయై నమః

శ్రీ
దేవీ భాగవతము

ఏకాదశస్కంధము

అతివిమలచరిత ! నిత్య
స్తుతవిద్యాప్రదాన ! సుగుణమణీసం
తతిభాస్వదన్నపూర్ణా
పతివ్రతానాథ ! బ్రహ్మపాదిత వేధా. ౧

వ. అవధరింపుము నారదుండు నారాయణుం గాంచి, ౨

గీ. దేవకార్యార్థ మమ్మహాదేవి వాడము
టాదిగాఁగల యఖిలమ్ము నానతిచ్చి
తనఘ ! యెద్దానికతన నయ్యంబ ప్రీతి
చెందు నట్టి యాచారమ్ము చెప్పుమ నాకు. 3

క. అనవుడు నారాయణుఁ డి
ట్లను నోమునివర్య! యే సదాచారము చే
యు నరుల కంబాకృప గ
ల్గునో దాని వచింతు వినుము గుణరత్ననిధీ! ౪

గీ. ఉదయమున లేచినది మొద లుత్తమద్వి
జులు సదాచారమునఁ బుచ్చవలయుఁ బ్రొద్దు
ధర్మ మొక్కఁడు దక్క నాత్మకు సహాయ
మాచరింపఁగ లేదు దారాదికంబు. ౫

క. కావున ధర్మవిధానం
బేవిధిఁ జేయఁగవలయు నెల్లరుఁ; దమముం
బోవిడువ నింతకన్నను
జేవగల విశేష మొండు చిక్కదు జగతిన్. ౬

గీ. ధర్మముల కెల్ల నుత్తమధర్మ మొకటి
నరయ నాచార మదియుఁ జెన్నారు రెండు
తెఱఁగులుగ శ్రుతివాక్యకథితము స్మృతి
విహితమును నయి ద్విజు లందు వెలయవలయు. ౭

గీ. ఆయువును సంతతియు శుభ మన్న సుఖవి
ముక్తియును గల్గు నాచారసక్తులకు ని
హంబు పరమును మేలగు సజ్ఞులనును
ముక్తి నొడఁగూర్చు నిది నిక్కముగ మునీంద్ర. ౮

క. ఆచారమ్మున శ్రైష్ఠ్యం
బాచారమ్మునన గర్మ మలవడు మఱి త
త్ప్రాచుర్యమ్మున జ్ఞాన
శ్రీ చెలఁగున్ దాన ముక్తి చెందు నరుఁ డొగిన్. ౯

క. ఆచారము పరమ తపం
బాచారము జ్ఞానదాయి యది లేని ద్విజున్
ధీచతురులు శూద్రునిఁగాఁ
జూచుదు బహివెట్టవలయు సుగుణాభరణా. ౧౦

వ. అదియును శాస్త్రీయలౌకికభేదమ్మున రెండు దెఱఁగు లుభయమును శుభార్థుల కావశ్యకంబ దేశాదిధర్మములును నిట్లకా నెఱుఁగునది. ౧౧

క. ఎవఁడు దురాచారుఁడు వాఁ
డు వడయు నిందన్ సదా గదన్ దుఃఖంబున్
దేవులున్ వానిన్ వదలక
పవలని నిశియనక పట్టి పాలార్చు మునీ. ౧౨

గీ. ధర్మవర్జితమైన యర్థమును కామ
మును విసర్జింపవలె సుఖమ్మునకుఁ గాక
యన్యవిద్వేష మొనరించునట్టి ధర్మ
మునకు నోడఁబడవలదన మునియుఁ బలుకు. ౧౩

క. వివరింప నశక్యంబు బ
హువిధము శాస్త్రంబు దాని యుక్తు లెఱుఁగం
గ వశమె దేనికితన ధ
ర్మపు నిర్ణయ మెఱుకపడు నరులకు మహాత్మా. ౧౪

వ. నావుడు నారాయణుం డిట్లను. ౧౫

చ. వినుము పురాణముల్ హృదయవీధి శ్రుతిస్మృతిలక్ష్ము లేతదీ
యనియతి ధర్మ మీత్రితయమందు విరోధము గల్గెనేనిఁ గైకొన
వలయుఁ శ్రుతిన్ మఱియుఁ గొండొకచోట శ్రుతిస్మృతుల్విరో
ధినులగు నేని రెంటను శ్రుతిన్ గొనఁగాఁదగుఁ బూర్వరీతిగన్.

గీ. శ్రుతి ద్విధాబోధకత్వ మెచ్చోటను జెందు
నుభయము ప్రమాణమని యట నొప్పవలయు
స్మృతియు నిట్లయ్యె నేని నయ్యెడఁ బృథగ్వి
షయిత గల్పించు టది ధర్మసమ్మతంబు. ౧౭

గీ. మఱి పురాణతంత్రోక్తధర్మములు శ్రుతివి
రుద్ధములు గాకయుండిన రూఢిగను గ్ర
హింపఁదగు వేదము ననుసరింపదేని
యదియు ధర్మంబె! తత్కర్త యనఘుఁడగునె! ౧౮

క. స్మృతియుఁ బురాణముఁ దంత్రం
బితరములగు శాస్త్రములు మఱెయ్యవియేనిన్
మతము లగునె ప్రత్యక్ష
శ్రుతిరుద్ధము లయ్యెనేని శుద్ధమనస్కా. ౧౯

గీ. ఎన్నితెఱఁగుల వేదంబ యెయ్యెడలఁ బ్ర
మాణ మది చెప్ప బహుధర్మమార్గములఁ ద
దుక్తధర్మవిహీనుల కొలయుచుండు
జముని లోకమునందుఁ గుండముల గములు. ౨౦

చ. పలువచనమ్ము లేల శ్రుతిపద్ధతికిన్ వెలిగాని ధర్మముల్
సలలితముల్ స్మృతిప్రభృతిశాస్త్రము లాగమమూలకమ్ములై
చెలఁగనిచోఁ బ్రమాణగతి చెందవు; దుర్వచనోక్తధర్మక
ర్తలు నరకమ్మునం బడి కరమ్ము భరమ్ముగ నుందు రంహులన్.

గీ. అనఘ! వైఖానసమతానుయాయు లగుచుఁ
దప్తముద్రాంకనమ్ములఁ దాల్చు జడులు
లింగధారులు దుర్గతికిం గడంగు
వారు వీ రుభయులు వేదబాహ్యు లగుట. ౨౧

క. ప్రతిదినమును బ్రతిపదమును
గృతమగునో కాయించుకేని గిల్బిష మనుచున్
మతి జంకుచు ధర్మమును సు
కృతు లొనరింపుదురు పుణ్యకీర్తులు వడయన్. ౨౩

వ. రాత్రి యామంబు కడచినమీఁద యథోచితమ్ముగఁ బ్రాణాయామం బొనరించి యద్దేవిని యథోక్తమ్ముగ ధ్యానించి పదపడి గురువుం గూర్చి, ౨౪

క. గురువే బ్రహ్మయు విష్ణువు
గురువే దైవమగు శివుఁడు గురువె పరుండున్
బరమామ్నాయము చెప్పిన
గురువునకే భక్తి మ్రొక్కు గొల్పెద నెడఁదన్. ౨౫

క. అని చెప్పి మఱియు నారా
యణుఁ డిట్లను వేదములు తదంగము లాచా
రనియతిశూన్యుఁ బవిత్రిం
బొనరుప వీమాట నిక్కముగఁ దెలియనగున్. ౨౬

క. తనచదివిన వేదమ్ములు
తనకున్ మరణంబు దొడరుతఱి తెక్కలు వ
చ్చిన గూడు విడుచు పక్షుల
యనువునఁ దన్నున్ద్యజించు నని యెఱుఁగు మునీ. ౨౭

వ. అని వెండియు,

తే. గీ. అనఘ! బ్రాహ్మముహూర్తమ్మునందు లేచి
సకలమును విధియుతముగ సలుపవలయు
నాచరించుట యొప్పు వేదాభ్యసనము
రాత్రి నాల్గవజామున రమణమెఱయ. ౨౮

తే. గీ. పిదప నిష్టదేవస్తుతి మదినొనర్ప
వలయు; మఱి యోగియేని యయ్యలఘుఁ డాత్మఁ
బూర్వమార్గానుగతిఁ బరపురుషు ధ్యాన
మాచరించుట యొప్పగు ననఘచరిత. ౨౯

క. తగ బ్రహ్మధ్యానం బీ
వగ నాసమయమ్మునం దెవఁడు సల్పు నతం
డగు జీవన్ముక్తుఁడు సుక
రగతిఁ బ్రహ్మైక్య మపుడు రంజిలుకతనన్. ౩౦

వ. ప్రాతఃకాలమ్మున లేచి యథోచితమ్ముగఁ గృత్యమ్ములు దీర్చి కొనఁదగు, ౩౧

క. తల కొక వస్త్రము చుట్టి కు
తలమునఁ దృణమువిడి వా కొదవనీక సుని
శ్చలనిశ్వాసుండై తా
నొలయఁగవలె నుమియుఁబడిగి యొగి నవ్వేళన్. ౩౨

సీ. జలమునఁ జిత మఱి శాద్వలమ్మునఁ బుట్టఁ
బాడు దేవళమునఁ బథమునందు
జంతుగర్తములందుఁ జనదు విణ్మూత్రవి
సర్జనం బొగి రెండు సంజలందు
జపదంతశుద్ధిభోజనపితృదైవకా
ర్యముల విణ్మూత్రనిర్గమనిధువన
కృతుల యాగమ్మున వితరణబ్రహ్మయ
జ్ఞమ్ముల దేశికసన్నిధాన

తే. గీ. మందు మౌనమ్ము వహియించు టభిమతంబు
మఱియు దేవర్షిముఖుల సమగ్రవినయ

కలన నచ్చోటు విడుచు నట్లలవరించి
శౌచమొనరించు టది వేదసమ్మతంబు. 33

క. అనలానిలారుణద్విజ
వనముల నాలఁ గనుఁగొంచు వలవదు విణ్మూ
త్రనిపాతన మొనరించుట
ఘనమగు శ్రీయమ్ము గోరు కర్మరమణికిన్. 34

తే. గీ. పవ లుదఙ్ముఖతయు రాత్రిభాగమందు
దక్షిణాభిముఖత్వంబు దప్పులుటొప్పు
పర్ణలోష్ఠతృణాదులు పైచి కప్ప
వలయు విణ్మూత్రములు బయల్వడకయుండ. 35

చ. పదపడి కేల లింగమును బట్టి జలమ్ములు గల్గు నయ్యెడన్
గదిసి జలంబు పాత్రమునఁ గైకొని కొండొక నేల నేగి తె
ల్లొదవెడి కూలమృత్తికను నొయ్యన శుద్ధియొనర్చు టొప్పు న
య్యది సమకూరకున్నఁ గొనునా నెదియేని ద్విజుండు మృత్తికన్.

వ. మఱియుఁ దదితరులు గ్రమమ్ముగ రక్తపీతకృష్ణమృత్తికలు గ్రహింపనగు, దేవగృహవల్మీకాదులందు మృత్తిక గ్రహింపు టొప్పు; దన్యశౌచశిష్టమ్మును నగ్రాహ్యంబ, మూత్రమ్మున కన్న శౌచమ్మున ద్విగుణమ్మును నంతకన్న మైథునమ్మునఁ ద్విగుణమ్మును మృత్తిక వలయు. ఇదియంతయు గృహస్థున; కింతకు ద్విగుణంబు బ్రహ్మచారికిని నంతకు ద్విగుణంబు వానప్రస్థునకుఁ జతుర్గుణంబు యతికి నని యెఱుంగునది. శౌచకర్మమ్మున నొక్కొకసారి కొక్కొక యుసిరికకాయయంతమృత్తిక గ్రహించుట విధివిహితం; బీయది యెల్ల దివాశౌచమ్మునకు, రాత్రియేనియేతర్ధమ్మును,

నాతురునకుఁ దదర్ధమ్మునుఁ, మార్గస్థునకు దాన సగమ్మును జాలెడి. ౩౭

క. స్త్రీలకును శూద్రజనులకు
బాలురకు నశక్తులకును బరమావధి నే
లీలనగు దుష్టగంధం
బోలిక లేకుంట యంత యొనరుపవలయున్. ౩౮

క. గంధలేపక్షయావధికంబు శౌచ
మఖిలవర్ణమ్ములకు నొప్పు ననియె మనువు
మఱియు దక్షిణకరము వామకరమున వి
శుద్ధముగఁ జేయవలయు నోసుగుణరాశి. ౩౯

తే. గీ. నాభి కూర్ధ్వప్రదేశమ్మునఁ గుడిచేయి
క్రింద దేశమ్మున నెడమకేలు శౌచ
కర్మమున సమ్మతమ్ములు కర్మపు లిటు
దక్క వేఱొక్కగతి నల్పుఁదగదు మౌని. ౪౦

క. విను విణ్మూత్రోత్సర్జన
మున జలపాత్రమ్ము విప్రముఖ్యులు గొనఁగాఁ
జన దజ్ఞానమ్మునఁ గొను
జనులకుఁ బాచితము సర్వసమ్మత మనఘా. ౪౧

క. అలసత్వాజ్ఞానమ్ముల
వలనన్ శౌచంబు మానువాఁడు త్రిరాత్రం
బులు నిరాహారుండై
సలుపవలెన్ జపము పిదప సంశుద్ధికినై. ౪౨

తే. గీ. దేశకాలోపపత్తి శక్తిప్రసక్తి
ననుసరించి శౌచం బిటు లాచరింప

వలయు విట్ఛౌచమున నొకపదియురెండు
సార్లు గండూషము లొనర్పఁ జను మునీంద్ర. ౪౩

క. నాలుగు గండూషమ్ములు
పోలున్ మూత్రింపుశౌచమునఁ దన్నీరం
బోలి నధోముఖుఁడై తా
వాలాయము విడువవలయు వామంపుదెసన్. ౪౪

క. పదపడి కృతాచమనుఁడై
రదనమ్ములు దోమవలయు రహిఁ గంటకసం
పదయున్ క్షీరస్రుతియున్
బొదలెడి కాష్ఠమున నేమమున మునిచంద్రా. ౪౫

క. పదపడి సద్యాదికమున
సదమలతాసిద్ధిపొంచె సలుపఁగవలెఁ గో
విమలౌవారలు స్నాన
మ్మిద్ది ప్రాతఃకాలమంద యేర్పడియె మునీ. ౪౬

క. మలినమ్మగు దేహమునకుఁ
గలవు నవద్వారములు నికామస్రావం
బొలయించు వీని శుద్ధికి
వలయు నుషస్స్నాన మెట్టివారికి నేసిన్. ౪౭

తే. గీ. తెగు నగమ్యాగమనదుష్ప్రతిగ్రహాభవ
దోషములు చాటునందగు దోసఁగు లెవ్వి
యేనిఁ బ్రాతఃకృతస్నానులైన వారి
కన్యు లెయ్యది చేసిన నగు విఫలము. ౪౮

తే. గీ. ఏడు దినము లుషస్స్నాన మొనయఁడేని
మూఁడు దినములు సంజకు మొనయఁడేని

బదియురెండు దినము లగ్నిఁ బడయఁడేని
నగ్రిజుఁడు శూద్రభావమ్ము నధిగమించు. ౪౯

క. విను స్నానము సంధ్యావం
దనమును బొనరించు నరుఁడు దర్భయుతుండై
చను నొలయఁగఁ దద్విరహం
బున నొనరిచెనేని నదియుఁ బొలివోవు మునీ. ౫౦

తే. గీ. స్నానకర్మం బనూనమై చనెడి హోమ
కాల మత్యల్పమై యొప్పఁ గానఁ బొద్దు
టను యథోక్తమ్ముగను స్నానమును మొదలిడ
కప్పటికిఁ దగుగతి సల్పు టభిమతంబు. ౫౧

తే. గీ. వ్యాహృతిత్రయసంయుతమై ప్రణవస
హితమగుచు నొప్పు గాయత్రి నెనసి ప్రాణ
వాయుసంయమనం బొనర్పవలె మూఁడు
మార్లు; గాయత్రి కెనయగు మంత్రమున్నె ! ౫౨

క. స్తుతిసేయు భక్తునకుఁ బర
గతిదాయకమగుచు సర్వకాలమ్మును ర
క్ష తగన్ సల్పుట దీనికి
సతమగు గాయత్రి యనెడి సదభిఖ్య మునీ. ౫౩

తే. గీ. ఆత్మధర్మనిరతుఁ డైన యగ్రజుండు
వైదికమ్మగు మంత్రమ్ము వదలక జప
మొనరుపన్ వలె లౌకిక మూన వలవ
దుభయపక్ష సముద్ధృతి యొలయు దీన. ౫౪

వ. పదపడి దేవర్షిపితృతోషకంబగు స్నానాంగతర్పణం బాచరించి జలమ్ము వెడలి శుద్ధవస్త్రధారణపూర్వకముగ విభూతి బూయవలయు. ౫౫

తే. గీ. జపమునకు సాధకములుగ సతతమును న
నంతభక్తిపరిపూర్తి రుద్రాక్షమాల
లేనరుఁడు దాల్చు వాఁడు మహానుభావుఁ
డపరనీలకంఠుండని జపిత లండ్రు. ౫౬

క. కనకమునఁ గొండె రజత
మ్మునఁ గొండెఁ ఖచితములుగఁ బొసఁగించి సికఁ
జనుఁ గర్ణములును ధారణ
మనయము రుద్రాక్షలకు సమాహితచిత్తా. ౫౭

తే. గీ. జందెమున హస్తమున గళమందుఁ దుంద
మందుఁ బ్రణవమంత్రమ్మునన్నైనఁ దాల్ప
వలయుఁ బంచాక్షరీమంత్రకలనన్నైన
నతులితమ్మగు భక్తిసంతతము చెలఁగ. ౫౮

క. విను రుద్రాక్ష ధరించుట
చను శివవిజ్ఞానమునకు సాధనమై వి
స్ననువుగ సిగఁ దాల్చిన దా
ని నెఱుంగుము పారతత్త్వనియతి నృపాలా. ౫౯

తే. గీ. కర్ణములయందు జగదంబగాఁగ జందె
మందు వేదమ్ములుగ హస్తమందు దెసలు
గాఁగ గళమున వాగ్దేవిగా ధనంజ
యునిఁగ స్మరియింపఁదగు దాని నూనునెడల. ౬౦

తే. గీ. అఖిలవర్ణమ్ములకును రుద్రాక్షధార
ణంబు విహితమ్ము ద్విజులు మంత్రంబుతో ధ
రింపవలెఁ దక్కొరుల కట్టిరీతి చనదు
దీని ధరియించువాఁడె యీశానుఁ డధిప. ౬౧

క. ఇన్ని యననేల మఱి తా
నెన్నని యకృత్యములను నెఱిఁగి యెఱుఁగ కు
ద్యన్నియతి విడిచి సలిపియుఁ
బన్నుగ నిది దాల్చువాఁడు పాపరహితుఁడౌ. ౬౨

తే. గీ. ఎవఁడు రుద్రాక్షలను ధరియించు వాఁడు
తినుట భర్గుని దినుట, యయ్యనఘు పాన
కృతియు నట్టిద ; మఱి ధరియింప సిగ్గు
నెవఁడు గను వాఁడు గనఁ డెన్నఁడేని ముక్తి. ౬౩

క. మునివర ! రుద్రాక్షలఁ దా
ల్చినవారిం గాంచి వాదు చేసెడి వానిన్
మనమున నూహింపుము జన
కునికిన్ బొడమని యపాత్రుండని యెపుడున్. ౬౪

తే. గీ. రుద్రుఁ డెద్దానఁ గైకొనె రుద్రతను గ్ర
హించె బ్రహ్మ బ్రహ్మత్వమ్ము నెక్కతమున
మునులు సత్యసంకల్పు లేమూలమున న
యిరో వచింపఁదరమె తన్మహిమ మొరులకు ! ౬౫

క. రుద్రాక్షధారిఁ గని శుం
భద్రక్తిన్ ద్రవ్యధాన్యవస్త్రాదులఁ దా
భద్రార్థి యగుచు నిడి యా
రుద్రుని లోకమ్ము గను నరుఁడు మునితిలకా. ౬౬

తే. గీ. మఱియు రుద్రాక్షధరియించు మహితు శ్రాద్ధ
మందు భుజియింపఁజేసిన యనఘుఁడు పితృ
లోకమున కేగు సతిభక్తిలోలుఁ డగుచుఁ
గాళ్ళు గడిగి త్రావినవాఁడు గాంచు ముక్తి. ౬౮

క. హారాదికమును రుద్రా
క్షారూఢముగాఁగఁ దాల్చు ననఘుఁడు రుద్రుం
డై రాజిలు నెల్లనియు
ధారణ మొనరించు వారు ధన్యులు మౌనీ. ౬౯

ఉ. హారము లేల భూషణము లన్యము లేటికిఁ దోడు గేవలం
బై రహిమీఱ నియ్యది మహామహుఁ డెవ్వఁడు దాల్చు మంత్రసు
శ్రీరుచిరంబుగా నయినఁ జెన్నుగ మిన్నకయైన లజ్జ నో
ప్పారియునైన వాఁ డఘము నందఁడు జ్ఞాని యగుం గ్రమమ్మగన్

క. నారద ! వేయేటికి నా
కారసి రుద్రాక్షమహిమ మంతయుఁ జెప్పం
గారాదు యత్నమునఁ ద
ద్ధారణ మొనరించువాఁడు ధన్యుం డెందున్. ౭౦

క. అనవుడు ముని యిట్లను నో
యనఘా రుద్రాక్ష యిట్టిదై పూజ్యత్వ
మ్మును గొనిన కారణమ్మును
వినిచి ననున్ ధన్యుఁ జేయవే నా నతఁడున్. ౭౧

క. పలికె నిటు లో మునీశ్వర !
యల షణ్ముఖుఁ డిట్లు మున్ను హరు నడిగినఁ దాఁ
దెలిపె నతఁ డయ్యదియె నీ
పలుకున కుత్తరమొనర్తుఁ బరమప్రీతిన్. ౭౨

వ. శివుండు కుమారుం గాంచి పుత్రా! త్రిపురుండను నొక్క రక్కసుండు బ్రహ్మాదుల నుక్కడంచి దుర్జయుండై నెగడు నెడ నమరులు నాకుం గుయివెట్టిన నేను నఘోరనామకంబగు నొక్క దివ్యాస్త్రమ్మును దివ్యవర్ష సహస్రపరిమితమ్మగు కాలమ్ము చక్షురున్మీలనంబొనర్చి చింతించితి ; నయ్యెడ నాకులమ్ములగు మన్నేత్రములనుండి బిందువు లుత్పన్నములై యయ్యవి రుద్రాక్షవృక్షజనకమ్ములయ్యెఁ ; బదపడి యయ్యవి ముప్పదియెన్మిది భేదమ్ముల లోకహితార్థంబు వ్యవహృతమ్ములయ్యె ; నందుఁబది రెండు సూర్యనేత్రసముద్భూతమ్ములు కపిలవర్ణమ్ములు, సోమనేత్రోద్ధితమ్ములు పదాఱు శ్వేతవర్ణమ్ములు, వహ్ని నేత్రసంభవమ్ములు పది కృష్ణవర్ణమ్ములు, మఱియు నిందు శ్వేతంబు బ్రాహ్మణజాతియు రక్తంబు క్షాత్రంబును మిశ్రంబు వైశ్యజాతియుఁ గృష్ణవర్ణంబు శూద్రజాతియు నగు ; నిం దేకముఖము సాక్షాద్రుద్రస్వరూపమ్మును బ్రహ్మహత్యాతారకంబును నగు; ద్విముఖంబు దేవీ మహాదేవాకారమ్మై ద్వివిధాఘనాశకం బగుఁ; త్రిముఖం బనలాత్మకంబై స్త్రీహత్య నడంచుఁ ; జతుర్వక్త్రంబు బ్రహ్మస్వరూపంబును నరహత్యామారకంబును నై తగుఁ బంచాననంబు రుద్రాత్మకంబును గాలాగ్నినామకంబును నై యగమ్యాగమనాభక్ష్యాభక్షణసంభవమ్ములగు ననేకదోషమ్ముల వారించు; షణ్ముఖంబు భవత్స్వరూపంబు దక్షిణకరమ్మునఁ దాల్పనియ్యది బ్రహ్మహత్యాద్యఘమ్ముల నడఁచు; సప్తముఖం బనంగాత్మకం బది స్వర్ణస్తేయాద్యఘమ్ముల రూపుమాపు ; నష్టవదనంబు వినాయకస్వరూపం బియ్యది గురుతల్పగత్వాద్యనేకపాపమ్ముల సమయించుచు విఘ్నమ్ముల వారించి సర్వకార్యమ్ములు నెగడించుటయ కాక తుదకుఁ బరమపదం బొడఁగూర్చు; నవము

ఖంబు భైరవాత్మకం బియ్యది వామభుజమ్మున ధరించు వారలకు
భుక్తిముక్తులును మత్తుల్యబలమ్మును బ్రహ్మహత్యాదిమహా
పాతకనివృత్తియు నొడఁగూర్చు ; దశముఖంబు జనార్దనస్వరూ
పమ్ము భూతబేతాళబ్రహ్మరాక్షసపన్నగాద్యుపద్రవమ్ము లిద్దాని
బూనువారల కుపశమించు నని వెండియు. ౨౩

క. ఏకాదశవక్త్రం బది
యేకాదశరుద్రరూప మిది సిగఁ గొను సు
శ్లోకులకు నశ్వమేధస
మాకలనన్ గలుగు పుణ్య మబ్బుఁ గుమారా. ౨౪

తే.గీ. కడఁగి ద్వాదశవక్త్రంబు కర్ణమందు
దాల్చువాఁ డశ్వమేధవిధానఫలము
నంది ద్వాదశాదిత్యుల డెందమునకుఁ
బ్రీతిదాయకుఁ డగు భీతివిముఖుఁ డగుచు. ౨౫

వ. మఱియు నిది ధరించువారలకు హస్త్యశ్వాదిజంతుహననజన్యం
బగు పాతకం బొకింతన సమయు. ౨౬

సీ. పదుమూఁడు మొగముల భాసిలు రుద్రాక్ష
లభ్యంబుగా నది లభ్యమయ్యె
నేని భవత్తుల్యమై నెగడెడి సర్వ
కామార్థసిద్ధియుఁ గలుగు దాన;
నది ధరించెడివాని కఖిలభోగమ్ములు
చేకూరుఁ బాపముల్ చెంద వెందుఁ
బదునాల్గు ముఖములఁ బరఁగెడి రుద్రాక్ష
దొరకదు దొరకుట దొడరెనేని
తే. గీ. దాని శిరమున నెప్పుడుఁ దాల్పవలయు
నింత వర్ణింపనేల వాఁడెవఁడు గాని

యెలమి రుద్రాక్షులను ధరియించెనేనిఁ
బొందుఁ బరగతి గీర్వాణపూజ్యుఁ డగుచు. ౭౭

క. జపమాలాలక్షణమును
విపులగతి వచింతు వినుము విధిముఖ్యులు భూ
తపతియు బిందువు విష్ణుం
డు పుచ్ఛమగు మాలికకుఁ గొడుక ! నిక్కముగన్.

వ. రుద్రాక్ష లెట్టివియేనియు నిరువదియైదు సంగ్రహించి గోపుచ్ఛవలయాకారమ్ముగ మాలిక చేయనగు; గ్రుచ్చు నెడలఁ బుచ్ఛమ్ము పుచ్ఛమ్ముతోడను వక్త్రము వక్త్రమ్ముతోడను గూర్పవలయు; నీసంఖ్య కధికం బయ్యేనేని నయ్యది నాగపాశనామంబునఁ బొదలు; నీక్రమంబునఁ గూర్చిన మాలిక మంత్రసిద్ధి నిచ్చు.

తే. గీ. కంఠమునఁ గాని శిరమునఁగాని కర్ణ
మునను గాని ధరించి యమునద్రభక్తి
జప మొనర్చెడి వారికి సంభవించు
భుక్తియును ముక్తియును గురుశక్తియుక్తి. ౮౦

తే. గీ. స్నానమున దానమున హోమజపసురార్చ
నముల వైశ్వదేవాదికసమయముల న
రుండు రుద్రాక్షధారణం బొందు విడిచె
నేని నరకమ్మునకు నేగు నింత నిజము. ౮౧

సీ. రుద్రాక్షభూజాతరూఢవాతోద్ధూత
తృణజాతమేని యొకింత మేను
సోఁకినవారు సుశ్లోకులై పుణ్యలో
కమ్ములు గాంతురు; కడఁగి యెవఁడు

దాల్పు రుద్రాక్ష నాతఁడు పాతకము లెన్ని
యే నొనర్చియు శుద్ధి నెనయు ననుచు
జాబాలశ్రుతి పల్కు ; జ్ఞానశూన్యంబగు
పసువేని రుద్రాక్ష పరఁగఁ దాల్చి

తే. గీ. రుద్రతను గాంచు ననిన నరుఁడు ధరించి
భద్రములు గాంచకున్నె ! పల్పలుకు లేల
యొక్క రుద్రాక్ష శిరమున నూనువాఁడు
పాపరహితుండు చిరపుణ్యభాజనుండు. ౮౨

తే. గీ. ఎవఁడు మన్నామములు జపియించు మఱియు
నెవఁడు రుద్రాక్షలను ధరియించు వాఁడ
పరమభాగవతుఁడు శుభపరత గలుగు
వారు రుద్రాక్ష ధరియింపవలెఁ గుమార. ౮౩

క. సరసిజసంభవముఖసుర
వరులును దేవర్షులును శివద మగుటను దా
మరసి ధరియించి శుచులై
చరియింతురు దీనిమహిమ శక్యమె పొగడన్. ౮౪

తే. గీ ఎన్నియో జన్మముల నెత్తనేని నరుఁడు
వానిపై మత్కృపాలేశమై భవంబు
వఱలు నద్దాన రుద్రాక్షవాంఛ యొదవు
నంతియే కాని సహజమై యలవడ దది. ౮౫

క. కరమున గళమున నురమున
శిరమునఁ గర్ణముల నెవఁడు శివపదయుగభ
క్తిరతిఁ రుద్రాక్షలఁ దా
ధరియించునో శివుఁ డతండు తథ్యము తనయా. ౮౬

క. గళమున రుద్రాక్షన్ దా
నెలమిన్ ధరియించి కుక్క యేనియుఁ బ్రాణం
బులు వీడి ముక్తిఁ బొరయు న
రుల కయ్యది గల్గు టెట్లరుదు షడ్వదనా. ౮౭

క. జపమును ధ్యానమ్మును లే
క పశువుచందానఁ దిరుగుఁ గాక నరుఁడు ము
క్తిపదంబు గాంచు రుద్రా
క్షపూస ధరియించు మాత్ర జ్ఞానియుఁ బోలెన్. ౮౮

తే. గీ. కాన రుద్రాక్ష యొండైన మానవుండు
యత్నమునఁ దాల్పనగు వాని కఖిలపాప
ముక్తి యట్లుండ వంశసముద్ధరణము
కృతమునుం గల్గుఁ బరగతి యొసఁగుఁ దనయ. ౮౯

తే. గీ. ఫాలమున భూతి రుద్రాక్షమాల గళము
నందు లేకున్నఁ జండాలుఁ డన్నరుండు
వాని కించుకయునుఁ బూజ వఱల దమ్మ
హేశ్వరుని లోకమున విను మింత నిజము. ౮౦

క. సురఁ ద్రావియుఁ బలలం బా
దరమునఁ దిని యంత్యజాతిఁ దవిలియు నఘముం
బొరయఁడు రుద్రాక్ష యొకటి
శిరమునఁ గల మానవుండు సిద్ధం బిదియున్. ౯౧

తే. గీ. యజ్ఞదానతపోనియమాధ్యయనస
ముద్భవంబగు నాఫలము లభియించు
భక్తి రుద్రాక్ష ధరియించు పావనులకు
నహహ! వర్ణింపఁదరమె రుద్రాక్షమహిమ. ౯౨

తే. గీ. నాల్గు వేదమ్ములును బురాణములు చదివి
తీర్థసేవ లొనర్చి విద్యలు పఠించి
యెట్టి సుకృతంబు మహనీయు లెనయుదురో కు
మార! రుద్రాక్షవలనఁ జేకూరు నదియు. ౯౩

క. నరుఁ డంత్యకాలమున నా
దరమున రుద్రాక్ష యొకటి ధరియించిన మా
త్రి రహిన్ రుద్రత గను న
ప్పరమునకున్ బుట్టు వెపుడు వఱలదు తనయా. ౯౪

తే. గీ. కంఠమునఁగాని బాహుయుగ్మమునఁ గాని
యెవఁడు రుద్రాక్ష తా ధరియించి ప్రాణ
ములఁ ద్యజించునో వాఁడు బాములకుఁ దక్కి
తన కొలముతోడ శివలోకమునకు నరుగు. ౯౫

తే. గీ. పాఱుఁ డైనను లేక శ్వపాకుఁ డైన
గుణయుతుం డైన లేక నిర్గుణుఁడు నైన
శుచియు నైన నశుచి యైన సాబ గెసంగ
భస్మరుద్రాక్షధారి శివత్వ మొందు. ౯౬

క. విను తన్మాలిక కంఠ
మ్మున భక్తియు లేక తాల్చి మొగిఁ బాపకృతుల్
పొనరించు నెవఁడు ముక్తిం
గను నవ్వాఁడు నన వేఱొకనికిం గలవే. ౯౭

క. అనయము రుద్రాక్షార్పిత
మనస్కుఁ డగు నెవ్వఁ డట్టి మహనీయుఁడు తా
ల్చినవాఁడె యాతఁ డెల్లర
కు నమస్యుం డగుచు రుచుఁ గొల్చుచు నెగడున్. ౯౮

తే. గీ. వినుము విద్యావిదుండని విద్యలేని
వాఁ డనవలవ దెవ్వఁడు భక్తి దీని
ధారణమ్మునఁదగు వాఁడు తప్ప కేగు
భవుపదము కీకటగగర్దభంబుభాతి. ౯౯

చ. అనినఁ గుమారుఁ డిట్టులను నక్కట ! కీకటమందు గర్దభం
బున కేవఁడిద్ది తానొసఁగె ? మున్నది తానెటుతాల్చె? మన్మనం
బున కొగివచ్చునట్లుగఁ బ్రమోదమెలర్ప వచింపుమయ్య నాఁ
గ నతఁడు వల్కె నాదరవికాసవిభాసురవక్త్రుఁడై తగఁ.

వ. కుమారా ! వింధ్యమ్మున నొకగాడిద యొకపథికునిచే రుద్రాక్ష
భారమ్ము వహింపఁబడుచు నత్యాయాసమ్మున నసమర్థంబై
యయ్యది మాయాజాలక భువింబడి యసువులవీడి త్రినేత్ర
మ్మును శూలపాణియునై మత్ప్రసాదమ్మునఁజేసి మదంతికమ్ము
నకు వచ్చెనని వెండియు, ౧౦౧

తే. గీ. అనఘ ! తా ధరియించు రుద్రాక్ష కన్ని
మొగములుండునో వాఁ డన్నియుగములయు స
హస్రములు నాదులోకమునందు భోగ
భాగ్యములు పొందు నిరపాయమై భవమున. ౧౦౨

వ. ఇయ్యది ముఖ్యశిష్యునకును భక్తునకును దక్క నితరులకుఁ బ్రకా
శింపఁ దగనిదని వెండియు, ౧౦౩

తే. గీ. భక్తుఁడు నభక్తుఁడని యెంచి పలుకనేల
నీచుఁడని నీచతరుఁడని నిర్ణయింప
నేల రుద్రాక్ష తాధరియించు నెవఁడు
వాఁడు పాతకములు వీడు వడయు ముక్తి. ౧౦౪

—* రుద్రాక్షధారణ మహిమము *—

క. తనయా ! రుద్రాక్షులఁ బ్రీతి
దినమున్ ధరియించువాఁ డతిశ్రీకుం డ
మ్మనుజుని సుకృతమ్మున కీ
డను గల్గునె యిదియసూ కదన్ వ్రతమొందన్. ౧౦౫

సీ. వేయిరుద్రాక్షుల నేయనఘుఁడు తాల్చు
వాఁడెల్ల సురలకు వంద్యుఁడగుచు
రుద్రునియట్టిఁడై భద్రమ్ములనుగొను ;
నన్నియు రుద్రాక్ష లబ్బవేని
పదియాఱు పదియాఱు బాహుయుగ్మమ్మున
సికయం దొకండును జేతులందుఁ
బండ్రెండు పండ్రెండు పరఁగఁ గంఠమ్మున
ముప్పదిరెండు నిమ్ముగ శిరమ్మ
నందు నాలుగుపదు లట్ల కర్ణమ్ముల
నాఱాఱు వక్షమ్మునందు నూట

గీ. యెనిమిదియుఁ దాల్చెనేని వాఁ డెల్లయెడల
రుద్రునింబోలెఁ బూజ్యతారూఢి మెఱయు ;
ముత్తెము ప్రవాళమును రౌప్యమును మొదలగు
నవి యమర్చి ధరించువాఁ డగు శివుండు. ౧౦౬

క. అలసతచే నైనను గే
వలముగ రుద్రాక్షలే నెవఁడు దాలుచు నే
కలుషములు వానిఁ బొరయవు
తలమె విభావసునిఁ జెనక తమమున కెందున్ ! ౧౦౭

గీ. పేర్మి రుద్రాక్షమాల జపించువాని
కబ్బు పుణ్యం బదింతయు నంతగాదు

ఒక్క పూసేని నెమ్మేన నూనఁడేని
వాని జన్మంబు వ్యర్థంబు వాఁడు పశువు. ౧౦౮

క. శిరమున రుద్రాక్షల్ దా
ధరియించి యెవండు పేర్మి దానము సల్పున్
సురనద్యుదకస్నాన
స్ఫురణంబునన్నైన ఫలమువొందు నతఁ డొగిన్. ౧౦౯

వ. మఱియు నేకముఖపంచముఖదశముఖచతుర్దశముఖమ్ములు విశే
షించి యభ్యర్హితమ్ము; లింతయేల యెద్దియేని రుద్రాక్ష మదాత్మ
కం; బియ్యది దరిద్రునేని రాజుం జేయఁజాలు నియ్యర్థమున నొక
కత కలదు వినుము. ౧౧౦

క. కోసలదేశమ్మున నొక
భూసురుఁ డతిధార్మికుండు పూతుఁడు నిగమ
వ్యాసంగి దర్పవంతుఁడు
భాసిలు గిరినాథనామభాస్వరుఁ డగుచున్. ౧౧౧

గీ. అపరమన్మథుఁ డతినూత్నయౌవనుండు
గుణనిధిసమాఖ్యుఁ డాతని కొమరుఁడు సుధీ
షణుఁ డనెడి తన గురువరుసతిని మదము
కలిమి ముక్తావళిని మోహకలితఁ జేసె. ౧౧౨

ఉ. ఏమని చెప్పువాఁడ ! నిటు లిచ్చమెయిన్ గురునింతిఁ బొంది తా
నామెయి దేశికోత్తముని యడ్డొకయించుక లేక యుండ దు
ష్కామతఁ బిమ్మటన్ వెస విషమ్మిడి నిర్భయుఁడై నిరంతరం
బామధురోష్ఠిఁ గూడి మదనాగమచర్చ యొనర్చు షణ్ముఖా.

తే. గీ. అంతఁ దలిదండ్రు లిదియేమి యనుడు వారి
కింత విషమిడి కాఁజేసి యెల్లవేళ

భోగపరుఁడయి ద్రవ్యమ్ము పుచ్చివైచి
పిదపఁ జౌర్యమ్మునకు డిగి పేదయయ్యె. ౧౧౪

తే. గీ. అంత నాయూరి బ్రాహ్మణు లరసి వీఁ డ
పాత్రుఁడని బహివెట్టి యప్పల్లె వెడలఁ
గొట్టటయు నవ్వేలందుకఁ గూడి వాఁడు
వనమునకుఁ బోయి బోయ నాఁగను జరించె. ౧౧౫

క. నిరతమ్ము సురాపానా
దరుఁడై పథికులను జంపి ద్రవ్యమ్మును దా
గర మార్జించు నకట! చ
చ్చిరి యెందఱో విప్రు లట్టి చెనఁటి కతమునన్. ౧౧౬

గీ. ఇవ్విధమ్మున బహుకాల మేగునంత
నంతమునఁగనె నయ్యధమాధముండు
వానిఁ గైకొన యమభటవర్గ మొకట
నొకట మద్భక్తులును మూఁగి రొకమూర. ౧౧౭

ఉ. వారికి వాదుగల్గె నది వారక తెల్పెద నాలకింపు మం
భోరుహమిత్రపుత్రభటపుంజము వీరలఁ జూచి "యక్కటా!
ధీరహితుం డపాత్రుఁడు దేశికదారహరుండు మీర లె
క్కారణ మాత్మ నెంచి యిటు కైకొనవచ్చినవారు" నావుడున్.

తే. గీ. వీఁడు దేహమ్ము విడిచిన పృథివి త్రవ్వఁ
డచట దశహస్తములలోఁతు నందు లోక
పూజ్యమైయొప్పు రుద్రాక్షపూస యొక్క
డుండెఁ దన్మహిమం బిది యొందుగాదు. ౧౧౮

వ. ఇక్కతమ్మున వీఁడు మహానుభావుం డని చెప్పి విమానసంగతుగ
నొనర్చి మత్సన్నిధిం బొందించి రియ్యది రుద్రాక్షమాహాత్మ్యం

బిది వినువారికి సర్వపాపక్షయమ్మును నఖిలశ్రేయోభివృద్ధియును గలిగెడి; నని తండ్రి యానతిచ్చిన విని కుమారుండు కృతార్థుం డయ్యె. ౧౨౦

క. పనిగొని గీటు నిడినచోఁ
గనకమ్మున కీడువచ్చు కాంతి నెగడు దా
నిని వరమండ్రు బుధులు నె
క్కొని శైవులు దాల్తు రదియ కుతుకమున మునీ. ౧౨౧

తే. గీ. వేయి ధరియించు టుత్తమవిధి తదర్ధ
ధారణము మధ్యమంబు నధమము మూఁడు
పదులు ధరియించు టో మునివర! సమస్త
కాలములఁ దాల్పవలె పీడఁగా వలవను. ౧౨౨

గీ. ఏకవక్త్రంబు పరతత్వ మింత నిజము
దాని ధరియింపఁగల్గు దద్జ్ఞాన మనఘ!
ద్విముఖ మర్ధనారీశ్వర తేజ మది ధ
రింప నద్దేవునకుఁ గల్గుఁ బ్రీతి మఱియు. ౧౨౩

గీ. గ్రహణమున విషువమున సంక్రమమున నయ
నమున దర్శమ్మునందుఁ బూర్ణిమను బుణ్య
దివసములయందు రుద్రాక్ష తివిరి ధార
ణం బొనర్చెడి వారి కఘంబు లడఁగు. ౧౨౪

వ. యథోక్తమ్ముగ భూతశుద్ధి నొనర్చి మూలాధారగతయగు నయ్యంబిక ధ్యానించి సమస్తకర్మకరణాధికారకంబగు భస్మోద్ధూళనం బొనర్పనగు; నేతద్ధారణంబ శిరోవ్రతంబని శ్రుతిస్మృతులు సెప్పెడి నీవ్రతంబు విద్యాదాయకంబును నవిద్యాభంజకంబునుగా నెఱుంగుము. ౧౨౫

—* శిరోవ్రత మహిమము *—

ఆ. వె. తగిన శ్రద్ధ గలిగి ధన్యత నీశిరో
వ్రత మెవం డొనర్చు మతి దలఁపఁడో
వాని కెల్లకృతులు వమ్మగు బ్రహ్మము
లిక్కతమునఁ గాదె యేపు గనిరి. ౧౨౬

గీ. అగ్నియను మంత్రి మాదిగా నలరు నాఱు
మంత్రముల శుద్ధమైన భస్మమ్ము దేహ
మెల్లఁ బూయంగవలయు మునీంద్ర! యిది శి
రోవ్రతం బని వచియింతురు మునివరులు. ౧౨౭

క. వినుమీ శిరోవ్రతము ప్రతి
దినమును సజల నొనర్చు ధీరుఁడు విద్యం
గను విద్యోదయ మొదవెడి
దనుక నిది యొనర్పవలయుఁ దత్త్వజ్ఞనిధీ. ౧౨౮

గీ. అనఘ! ద్వాదశాబ్దము లొండె నబ్ద మొండె
నాఱు నెలలొండె మఱియునం దర్ధ మొండెఁ
బదియు రెండు దినములొండెఁ బరమభక్తి
నీ శిరోవ్రత మొనరింప నెసఁగు విద్య. ౧౨౯

గీ. విను శిరోవ్రతమున స్నానమును బొనర్చి
పూతుఁడగువాని కుపదేశమును బొనర్చు
కుండు నెవ్వఁడు వాఁడు దుష్టుండు వాని
విద్య నశియించునని తత్త్వవేత్త లండ్రు. ౧౩౦

గీ. భస్మము పవిత్రనీరసంపర్కశుద్ధ
ముగ నలిపి నిత్యము లలాటమునను దివ్య
గంచితమ్ముగ ధరియించు టభిమతంబు
బ్రహ్మజాత్యుద్భవున కని పలుకు శ్రుతులు. ౧౩౧

క. శ్రుతిసిద్ధభస్మధారణ
మతులితశివలింగపూజ యను నియ్యవి తా
మతిమంతుఁ డెప్పుడును మా
ని తగన్ మానితవిభూతి నెగడఁడు మానీ. ౧౩౨

క. తెలుపగు భస్మమ్మున నొడ
లలమిన మనుజుండు వేగ మఘ మెడలి రజః
కలసంబు వీడి శుద్ధిన్
జెలఁగున్ సంశయ మొకింత చేయకు మిచటన్. ౧౩౩

వ. అగ్నిహోత్రాగ్నిజమ్మును విరజానలజమ్మును నౌపాసనసముత్ప
న్నమ్మును బచనాగ్నిసముద్భూతమ్మును దావానలసముద్భవ
మ్మును, సమిదగ్నిసంజనితమ్మును నై భస్మమ్ము లాఱుదెఱఁగులు
గలయది. ఇందుఁ ద్రైవర్ణికులకు మొదటి రెండును ధార్యంబులు,
గృహస్థు లౌపాసనసముద్భవంబగు భస్మంబు ధరియించు టభిమ
తంబు, సమిదగ్నిసంజనితంబు భస్మంబు బ్రహ్మచారులు ధరియిం
చుట సమ్మతంబు, శ్రోత్రియాగారపచనాగ్నిసముద్భూతంబగు
భస్మంబు శూద్రులకు ధరింప నర్హంబు, తదితరులకు దావాన
లోద్భవంబు శాస్త్రచోదితంబని వెండియు, ౧౩౪

గీ. అనఘ ! పూర్వత్రయోదశి యందు స్నాతుఁ
డగుచు సుకృతాహ్నికుండయి యార్యుఁడైన
గురుని పూజించి యీవ్రతము రహిఁ జేయు
వాఁడ నంచు సంకల్పింపవలయు వినుము. ౧౩౫

సీ. తను వుండునంతకంచును నొండెఁ బదియురెం
డేఁడు లనియు నొండె నెలమి నాఱు

సంవత్సరము లొండె సగమొండె నద్దాన
వత్సరంబొండెఁ దద్వత్సరమున
సగమొండె నొక్క మాసంబొండెఁ బదియురెం
డహములు నొండె నాఱహము లొండె
నద్దాన సగమొండె నహమొక్కఁ డొండెను
సంకల్పమున కవసానముగను

గీ. నిశ్చయించియు మఱియు నగ్ని నతిభక్తి
వఱల విరజాహవనమున వలయుఁ దృప్తిఁ
జేయ నాహోమసత్కృతి సేయు నపుడు
మూలమంత్రస్మరణ మతిముఖ్య మనఘ. ౧౩౬

గీ. మఱియు నయ్యగ్నియందు గోమయము నుంచి
నాఁటికి హవిష్యభోక్తయై నవసి తాఁ జ
తుర్దశిని నుదయమ్మునఁ దొల్లిటి కృతు
లాచరించి నిరాహారుఁడయి పదపడి. ౧౩౭

వ. పూర్ణిమయందు నిర్వర్తితకృత్యుండై యగ్ని నుపశమింపఁజేసి యందలి భస్మమ్ము గ్రహియించి నియతుండై తత్తదవయవమ్ముల యథావిధి భస్మోద్ధూళనం బొనర్చి జపియింపవలయు.

గీ. మూఁడు సంజల నీగతి మూఁడుఁ జేని
పాశుపతమగు వ్రతమును భక్తి జేసి
తనపశుత్వమ్ము విడనాడి గనెడి భుక్తి
ముక్తులను నిక్క మియ్యది మునివరేణ్య. ౧౩౮

ఉ. ఆయువొసంగు సౌఖ్యముల నంద నొనర్చు బలమ్ము నిచ్చు సు
శ్రీయును బుష్టియుఁ శుభసమృద్ధియు రోగనివృత్తియుఁ సదా

చేయు మఱింత యేమిటికిఁ జెందదు మాఱిభయమ్ము భక్తిమై
నే యనఘుల్ ధరింతు రిటు లెప్డును భస్మము వారి కెయ్యెడన్.

క. స్నానంబొనర్చి భస్మ
మ్మూనంగా వలయు శక్తి యొలయని మనుజుం
డీ నియతి విడిచి కరచర
ణాననములు గడిగియైన నది గొను టొప్పన్. ౧౪౧

క. కరచరణాధావనానం
తరమునఁ దగ నాచమించి తాల్చిన యయ్యం
బరము విడిచి పరిశుద్ధాం
బరమున్ ధరియింపవలయు పరమమునీంద్రా. ౧౪౨

క. శిరము లలాటమ్మును గం
ధరమును గర్ణమ్ములును హృదయమును బాహుల్
ధరియింపందగు చోట్లని
పరమమునీంద్రులు వచింతురు భస్మమ్మునకున్. ౧౪౩

క. సరసిజభవసరసిజనయ
నరుద్రులై మూఁడునుం దనర్చును రేఖల్
ధరియించునెడ నిగమము
చ్చరించుటతిగర్హితము ద్విజన్ములు దక్కన్. ౧౪౪

క. పదివేలు సెప్ప నేటికి
సదమలమగు భస్మ మెవఁడు స్నాతుండై తా
ను ధరించు నమ్మహాత్ముఁడు
మదనాంతకుఁ బోలఁజాలు మహిమము కలిమిన్. ౧౪౫

గీ. వైదికోత్తములొండె శైవవరులొండె
నొసఁగు భస్మమ్ము భక్తి పెంపెసఁగఁ గొనఁద

గును దదితరు లిడిన దాని గొనఁగఁ దగ ద
టంచుఁ బెద్దలు వచియింతు రమలచరిత. ౧౪౬

క. కరణమ్ము లెన్నియే శం
కరుపూజకు సంగ్రహించుఁగాక నరుఁడు భ
స్మరహితుఁ డగు నెడ నన్నియుఁ
బరమమునీ ! వ్యర్థములయి పాడరుఁజుమ్మా. ౧౪౭

చ. జపము తపమ్ము హోమమును శ్రాద్ధము నన్యము సర్వమున్ వృథా
త్వపదవిఁ గాంచు భస్మమును దాల్పని చో నది తాల్చు విప్రు లె
ట్టిపను లొనర్చి రేనియుఁ గడింది పవిత్రత గాకరమ్ములై
యపగతరోగులై విగళితైనసులై చరియింతు రెప్పుడున్. ౧౪౮

గీ. సర్వవర్ణమ్ములకును భస్మము ధరించు
టతిహితమ్మని చెప్పుట యనవసరము
హరిహరాదులు దేవత లఖిలమునులు
దీని ధరియింతు రెల్లప్డు దేవమాని. ౧౪౯

క. ఎవని లలాటమ్మున భ
స్మవిలేపన మొప్పు వాఁడు చతురాస్యుని దు
ర్వ్యవసాయాక్షరపంక్తుల
నవలకుఁ బోఁద్రోచి సుఖము లందు మునీంద్రా !

క. వాతము శ్లేష్మము పైత్యము
హేతువుగాఁ గల్గు వ్యాధు లెల్లను భస్మో
పేతశరీరులఁ జెనకం
గా తరతం జెందు హరినిఁ గను కరులగుచున్. ౧౫౦

క. విను భస్మస్నానమ్మున
కనఘా ! వేఱొండు తుల్య మనుకొనకుము భు

క్తి నిడున్ ముక్తి నిడున్ బా
వనతం గలిగించు నెట్టి పాపాత్ములకున్. ౧౫౨

క. మణికన్న నెక్కుడుగ బ్రా
హ్మణుఁ డెవ్వఁడు భస్మసంగ్రహము సేయు ద్విజా
గ్రణి! యాతం; డితరుఁడు బ్రా
హ్మణేతరుఁడు పాపకర్ముఁ డపవిత్రుండున్. ౧౫౩

క. జందెములు లేక సంధ్యా
వందనము లొనర్ప నెట్టి ఫలమబ్బునొ భూ
తిం దాల్పని యాక్రియ యా
చందమ్మున వమ్మగున్ ద్విజప్రవరులకున్. ౧౫౪

క. దానమ్ములొండె భోజన
పానాదికమొండె నెవఁడు భస్మరహితుఁడై
తా నొనరుచు నింద్యుం డ
మ్మానవుఁ డవ్వానికంటె మాలఁడు లగ్గా. ౧౫౫

గీ. శ్రౌతభస్మమ్ము స్మార్తభస్మమ్ము నేని
లౌకికంబేని మేన నలందవలయు
జపము వేళల భస్మనిష్ఠాగరిష్ఠుఁ
జేరఁగారావు ఘోరవృజినచయములు. ౧౫౬

వ. ఇయ్యెడ నొకపురాతనేతిహాసమ్ము గలదు వినుము.

మ. అనువై యొప్పు విభూతితోడ ధృతరుద్రాక్షసూత్రమ్ముతో
ముని దుర్వాసుఁ డొకప్డు పైతృకజగమ్ము న్గాన నేగెన్ జగ
జ్జననీ! శాంకరి! శంకరా! త్రిజగదీశా! శర్వ! యంచున్ మహా
నినదం బొప్పఁగఁ గల్యవాలముఖమాని శ్రేష్ఠులున్ దవ్వులన్.

క. వచ్చెడి మౌనికి నెదురుగఁ
జెచ్చెరఁ జని వందనములు చేసి విడిదికిన్
దెచ్చి రహి నర్ఘ్యపాద్యము
లిచ్చి మహార్హాసనమ్ము లిచ్చిరి భక్తిన్. ౧౫౮

క. ఆకాలమ్మునఁ గుంభీ
పాకనరకవాసులైన పాపాత్ముల హా
హాకారంబులు పెల్లుగ
నాకాశము వ్రయ్యలైన యటులు వినఁబడెన్. ౧౫౯

క. మునిమణియును నాకరుణా
నినదంబుల నాలకించి నెగులొందవ మనం
బున నూఁటడిల్లి పితరుల
కనియె నిదెవ్వారి రోదనారావమొకో. ౧౬౦

చ. అనవుడు మౌని కిట్టులని రయ్యెడి సంయమనీపురంబు దు
ర్జనులను శిక్షసేయు యమరాజట భీకరరూపు లెందఱో
యనుచరవర్గముల్ దను నిరంతరము న్గొలువంగ నుండు యా
తన బహుభంగులన్ గొలుపు తావులటన్ మడశేతి చొప్పడన్.

క. ఆకుండమ్ములఁ గుంభీ
పాక మ్మతిదుస్సహం బపారం బచటన్
వ్యాకులత దానఁ గలిగెడి
శోకం బిదమిద్ధమనఁగఁ జొప్పడ దనఘా! ౧౬౧

సీ. విష్ణునిందకులును వేదదూషకులును
గణపతిద్రోహులు గమలబాంధ
వద్వేషులును విప్రవంచకులును దప్త
ముద్రాంకితులు శూలమునుధరించు

వామకామాచారపరులు స్మృతిపురాణ
ధిక్కారకులును పితృగురువైరు
లును ధర్మవిరహితులును భ్రాతృగర్హకు
లును మాతృపూజానులోమమతులు

గీ. కూలుదురు వీరలెల్ల నక్కుండమందు
శ్రవణదారుణమైన యాశబ్దజాల
మనఘ ! యవ్వారలొనరించు నట్టి దెద్ది
వినినమాత్రన వైరాగ్య మనుఘటించు. ౧౬౩

క. అనవిని దుర్వాసుఁడు కుం
డనికటమున కరిగి కటకటా యను నాలో
నన వారికెల్ల స్వర్లో
కనివాసముగల్గె నతని కారుణ్యమునన్. ౧౬౪

క. కొందఱు నగుదురు నాట్యము
కొందఱు సల్పుదురు వీణ కొందఱు వాయిం
పం దలకొందు రమందా
నందమ్మది మానసమ్మునన్ వెలివిరియన్. ౧౬౫

చ. అదిగని మౌని యక్కజమునందె యమానుచరుల్ మహాద్భుతా
స్పదులయి వేగ మయ్యమునిసన్నిధికేగి యుదంతమంతయున్
విదితముచేయ నవ్విభుఁడు విస్మయమంది లులాయవాహుఁడై
ముదమలరంగ నయ్యెడకుఁబోయి కనుంగొని శంకితాత్ముఁడై.

క. అవ్వార్త దూతముఖమున
నవ్వాసవున కెఱిఁగింప నయ్యనఘుండున్
దవ్వనక చిత్తమెంతయు
నువ్విళ్ళూరంగ నచటి కొయ్యనఁ జనియెన్. ౧౬౬

క. హరియు విరించియు దిక్పా
లురు నట కరుదెంచి యచటిలోకుల సౌఖ్యం
బరసి నిమిత్తాన్వేషణ
పరతన్ హృదయంబు మిగులఁ బరువులు వారన్. ౧౬౮

క. ఈ కుంభీపాకం బతి
శోకదమై పాప పరవశుల కొఱ కేర్పా
టైకద! యున్నది దీనన్
నాకాధిక సుఖము గల్గు టత్యద్భుతమా. ౧౬౯

క. ఇఁకఁ బాపమ్ముకతన భయ
ము కలదె యకటకట! వేదపున్ మర్యాదల్
వికలమ్ములయ్యెఁ బరమే
శకృతమగు వ్యవస్థకీ దశయుఁ గల్గెడినే. ౧౭౦

క. తన చేసిన సంకల్ప
మ్మునకు ముధాత్వమ్మొనర్ప మోదించునె య
య్యనఘాత్ముఁడంచు నెల్లరు
మనమున యోజించుచుండ మాధవుఁడంతన్. ౧౭౧

చ. రయమునఁ బార్వతీశ్వరు పురమ్మునకేగి గిరీశుఁగాంచి మ్రొ
క్కి యనఘ! యిట్టి చిత్రమునొగిన్ గనుఁగొంటిమి నేఁడటంచుఁ బ
ల్కి యఖిలవృత్తముం దెలుప లీలమెయిన్ నగి యవ్విభుండు సం
శయహరణమ్ముగాఁ బలికె సారసలోచనుతోడ నీగతిన్.

సీ. అనఘ! దుర్వాసుఁడొక్క నిమిత్తమున దారిఁ
జనుచుఁ గుంభీపాక సంగతులగు
జీవుల నీక్షింపఁ జెచ్చెర భస్మావ
కుంఠితమగు మోము కొంతవంచె

నయ్యెడ వాయుదేవాధూతమై భస్మ
మొక్కింత వడియోఁ గుండోదరమున
నక్కతమ్మునఁ బాపులయ్యును గతపాపు
లై వారలట్టి సుఖాతిశయము

గీ. నెనసి రియ్యది భస్మమహిమము నేఁడు
మొదలుగా నద్ది పితృలోకమున వసించు
వారలకునెల్లఁ దీర్థమై వఱలు నచట
స్నానమొనరింప నత్యంత సౌఖ్య మొదవు. ౧౭౩

క. పితృతీర్థనామమున న
ద్ది తనరు నిదిమొదలు నన్ను దేవిని నట స్థా
పితులుగఁ జేయందగుఁ ద
త్పితృలోకనివాసులెల్లఁ దివిరి యజింపన్.

వ. ఇయ్యది త్రిలోకమ్ముల నుత్తమతీర్థమ్ము నావుఁడు హరి యమ్మ
హేశు ననుజ్ఞవడసి మున్నందునెడ కరిగి కడచిన వృత్తాంతమ్ము
నొడువుటయు వారలెల్ల శిరఃకంపమ్ము లొనర్చుచు భస్మమహి
మమ్ము ప్రశంసించిరి. పితరులును దీర్థలాభమ్మునకతన సంతుష్టు
లైరి. పదపడి యయ్యెడఁ బరమేశు నాజ్ఞవడసి వారి నిరువుర
స్థాపించి యమరులు యజించుచుండిరని మఱియును, ౧౭౪

క. ఏపాపాత్ము లచట మును
పాపానుభవమున నిడుమ వడుచుండిరొ వా
రే పూతులగుచు హరుని స
మీపమ్మున నిత్యపదవి మేకొని రనఘా. ౧౭౬

వ. వార లిప్పుడును గైలాసమ్మున భద్రగణనామమ్మున నొప్పుదు
రని వెండియు, ౧౭౭

క. ఆకారణమునఁ గుంభీ
పాకము మఱియొక్కచోటఁ బాపాత్ముల కా
లోకమున నేర్పరుపఁబడె
నీకతమున శైవు లచటి కేగరు మరలన్. ౧౭౮

క. ఇది భస్మవిశేషం బి
ట్టిదియని యెవ్వాఁడు చెప్పెడిన్ భస్మం బె
ట్టిదియైనను నగు దానికి
సదృశముగ వచింప నొండు జగమునఁగలదే. ౧౭౯

వ. ఇంక నూర్ధ్వపుండ్రవిధానం బాలింపుము. ౧౮౦

గీ. శ్యామమిడుఁ గాంతి, యెఱుపు వశ్యమ్మొసర్చుఁ
బీతవర్ణంబు శ్రీకరమై తనర్చు
ధర్మవృద్ధికరమ్ము శ్వేతమ్మటంచు
మును లనుటఁ గోర్కె కనుగుణముగఁ గొనఁదగు. ౧౮౧

వ. పవిత్రతరస్థలమ్ములందలి మృత్తు గ్రాహ్యంబని యెఱుంగునది
యని వెండియు, ౧౮౨

గీ. వర్తి వెలిగించినట్టి దీపమ్ముపగిది
వెదురుటాకుకరణి శంఖవిధమున సర
సిజముకుళభంగి మత్స్యంపు సిరినిఁ గూర్మ
సామ్యమున నూర్ధ్వపుండ్రమ్ము సలుపవలయు. ౧౮౩

సీ. ఇమ్మగుగతి లలాటమ్మునఁ గేశవు
రహి నుదరమున నారాయణు హృద
యమున మాధవుని గళమున గోవిందునిఁ
గుడిప్రక్క విష్ణుని నెడమప్రక్క

వామను దక్షిణవామబాహుల మధు
సూదను శ్రీధరు నాదికర్ణ
మునను రెండవకర్ణమునఁ ద్రివిక్రము హృషీ
కేశు నళిననాభుఁ బృష్ఠమునఁ గ

గీ. కుత్తునందు దామోదరు నెత్తి వాసు
దేవుని స్మరించి పుండ్రముల్ దీర్పవలయు
వీనిఁదాల్చిన నశుచియునేని శుచియ
వానికి మదీయలోకమ్ము వచ్చు నిజము. ౧౮౪

చ. ఇడఁదగు నూర్ధ్వపుండ్రముల నించుక యంతర ముండునట్టు లె
వ్వఁ డెడనిడండో దుర్గతికి భాజనమాతఁడు పుండ్రమధ్యమం
దెడపక లచ్చియున్ హరియు నెప్పుడు నొప్పుదు రంతరాలమున్
విడువని మూఢమానవుఁడు విష్ణునికిన్ మఱి శ్రీకి ద్రోహియగున్.

క. సిగయు నుపవీతమును నె
వ్వగ ముఖ్యములౌను విప్రవర్యుల కట్టు లో
ప్పగుఁ బుండ్రధారణము దీ
నిఁ గడచి కర్మమ్ము సేఁతనిష్ఫలమనఘా. ౧౮౬

గీ. అర్ధచంద్రాది చిహ్నము లాగమజ్ఞు
లైనవారలు ధరియించు టనభిమతము
గానఁ బూర్వోక్తపుండ్రముల్ గాక యెట్టి
దేని మఱియొండు దాల్చుట హితముగాదు. ౧౮౭

గీ. వేదసిద్ధదేవతలకు వేదవిహిత
చిహ్నములు న్యాయ్యములుగాన శ్రీపతిపశు
పతులు తత్సిద్ధులగుటఁ దత్పద్ధతిరహి
తములు వారెట్లు ధరియింతురు మునినాథ ! ౧౮౮

క. తత్త్వద్భక్తజనములకుఁ
దత్తచ్చిహ్నములు ముక్తిదమ్ము లగుట వా
రిత్తెఱఁగు తెలిసి తాల్చుట
యుత్తమగతి నొసఁగు నన్యమొందుగతి నిడుర్. ౧౮౯

—* సంధ్యోపాసనా మహాత్మ్యము *—

వ. ఇంక సంధ్యోపాసనమ్ము వినుము. ౧౯౦

గీ. అక్కడక్కడ నొలసెడి రిక్కగముల
నగు మొదటిసంధ్య రెండవయది యహస్క
రుండు గగన మధ్యమ్మున నుండు వేళ
మూఁడు సూర్యాస్తమయకాలముగ నెఱుఁగు. ౧౯౧

గీ. తారకోపేతమైన నుత్తమము తద్వి
రహితమైన మధ్యమము సూర్యయుతమైన
నధమ మీరీతిఁ ద్రివిధమై యలరుఁ గల్య
సంధ్య యీమూఁటికిని దాఁటఁ జనదుమౌని! ౧౯౨

క. తరణియుత ముత్తమము త
ద్వరహితమగు మధ్యమమ్ము విస్ఫురదుడుకం
బరయ నది యధమ మీగతి
నరయుము సాయంపుసంజ యనఘవిచారా! ౧౯3

గీ. ద్విజుఁడు వృక్షము, సంజ వే, ర్వేదములు వి
టపము, లాకులు ధర్మకర్మపటలములు;
మూలవిరహితమగు చెట్టు నేలఁగూలుఁ
గాన నతియత్నమున సంజఁ గావవలెడె. ౧౯౪

క. తెలియమియుఁ దెలిసిసలుపమి
యలవడు ద్విజుఁడెట్టిఁడేనియగు శూద్రుం డ
మ్మలినుండు చచ్చి శ్వాన
మ్ములలోఁ బడుఁగాన సంజ ముఖ్యమ్మనఘా ! ౧౯౫

గీ. ఉదయమున క స్తమయమున కూర్ధ్వ మొక్క-
మూఁడుగడెలలోఁ దదుపా స్తి కూడు నట్టి
కాలము నతిక్రమించి యర్ఘ్యమ్మొకఁ డధి
కముగ నీఁదగుఁ దత్పాతకము హరింప. ౧౯౬

క. కాలాతిక్రమ మొసరుచు
బాలిశులకు నింక నొక్క- ప్రాయశ్చిత్తం
బాలింపు మెన్మిదియు నూ
ఱోలిన్ మొదలన మనుజప మొనరింపవలెన్. ౧౯౭

క. ఏకాలమ్మున మనుజుం
డేకర్మము సేయఁ బూను నేకాగ్రతఁ దా
నాకాలమున కధీశ్వరి
నాకర్మమునకు మొదల నుపాసింపఁదగున్. ౧౯౮

గీ. ఇంట సామాన్యమగు గోష్ఠమేని మధ్య
మమగు నదియొడ్డునం దు త్తమము విశేష
మంతకన్నను దేవాలయమ్మునందు
బ్రాహ్మణుల కింతకన్న దైవమ్ము లేదు. ౧౯౯

క. గాయత్రికన్న నన్యం
బేమెడ విప్రులకులే దిదే బ్రహ్మాదుల్
సేయుదురు జపము శ్రుతులున్
గాయత్రిజపించు సాటిగలదే మాసీ ! ౨౦౦

క. శివవిష్ణూపాసన ల
య్యావి గాయత్రీవిధమున నియతములుగామిఁక
భువినెల్లరు శాక్తులుకా
రెవరుఁ వైష్ణవులుశైవు లెఱుఁగుము మానీ ! ౨౦౧

వ. గాయత్రిం జపించి ముద్రాప్రదర్శనంబు గావించి పదపడి హోమాదికంబు నిర్వర్తించి పంచాయతన పూజగావింపవలయు.

గీ. మొదల శ్రీదేవి నర్చించి పిదపఁదక్క
దేవతల కర్చలిడఁదగు దేవిపూజ
కన్న నెక్కుడు పుణ్యముగాన మక్క
తఁగదా! సంజలనది నిత్యమును నోలయు. ౨౦౩

గీ. భుక్తిముక్తిప్రదము దుఃఖమూలహరము
శక్తిపూజన మది యనురక్తి విస్త
రించి వచియింతు వినుమెవ్వరేని వినిన
సల్పినను నెల్లయాపదల్ సమయు దాన. ౨౦౪

క. ఆచమనమ్మును సంక
ల్పాచరణము భూతశుద్ధి యామీఁదను న్యా
సాచరణము శంఖస్థితి
యాచార్యనతియును సల్పి యవహితమతివై. ౨౦౫

వ. సామాన్యార్ఘ్యమ్మిడి పూజాద్రవ్యమ్ములు ప్రోక్షించి పీఠమ్ము నర్చించి దేవిని ధ్యానించి నామోపచారమ్ము లర్పించి పంచామృతస్నానమ్ము సమర్పించి, ౨౦౬

సీ. పుండ్రేక్షురసపరిపూర్ణకుంభములను
గోస్తనీరసలసత్కుంభములను

కర్పూరకాశ్మీరకస్తూరికాగురు
పంకిలాంభఃకుంభపటలములను
బాలకుండలఁ బెర్గు భాండమ్ములను మధు
ఘృతశర్కరాఘటతతుల నెవ్వ
రంబకు స్నానమ్ము ననుఘటింతురు వారు
స్వకృతార్చనకు సదృశమగు ఫలము

గీ. గందు రిహమునఁ బరమున క్షౌమవస్త్ర
యుగ్మమిడి వాయులోకమ్ము నొందుదురు సు
రత్నభూషల నిడి నిధిరాజు లగుదు
రిందు లగుదురు గంధమ్ములిడి మునీంద్ర! ౨౦౭

క. వివిధములగు పుష్పములిడి
శివలోకము వడయుదురు మసృణబిల్వదళ
ప్రవర ప్రదాత దుఃఖం
బెవఁడెన్నం డెచటనొందు టెఱుఁగ మునీంద్రా! ౨౦౮

క. ఎవఁ డొక కోటిదళమ్ములు
భవాని కర్పించు నధికభక్తిరతుండా
సువిమలశీలుఁడు బ్రహ్మం
డవిభుండై నెగడు లోకనాయకి కరుణన్. ౨౦౯

గీ. కోటిమాలతీసుమములఁగొని పరాంబ
పూజసలుపు నరుఁడు చతుర్ముఖుఁడగు దశ
కోటి తత్సుమముల పూజఁగొలిపి విష్ణు
వై నెగడు సర్వదేవతావంద్యుఁడగుచు. ౨౧౦

క. ఒకఁ డనఁగనేల నానా
వికచసుమమ్ములను భక్తివివశుండై యం

బికఁ బూజసేయనగుఁ ద
త్సుకృతము వర్ణింపఁ దరమె శూలికినేనిన్. ౨౧౧

గీ. అగురు కర్పూర ధూపమ్ము లధికనియతి
నంబ కిడఁదగు ; దాన నత్యధిక మోద
మంది భువనేశి భువనత్రయంబు నర్చ
కునకుఁ బ్రీతిఫల మిచ్చు నో మునివరేణ్య ! ౨౧౨

క. కర్పూరఖండముల దీ
పార్పణసేయంగ నంబ యవ్వాని మన
స్తర్పణ మొనరుచు నిక్క మ
హార్పతిలోకమున వాస మమరించి మునీ. ౨౧౩

వ. పదపడి భక్ష్యభోజ్యాదియుతమ్ముగ నైవేద్యమ్ము సమర్పించి,

గీ. పిదపఁ బానీయమిడి మది ముదము బొదలఁ
జేయు తాంబూలమిడి మహాగాయకులును
గాయనులు నాలపించెడి గానములును
వేదపారాయణములును విస్తరించి. ౨౧౪

గీ. ఛత్రచామరముల నిడి సకలరాజ
సదృశగతి నుపచారముల్ సంతరించి
చేరువఁ బ్రదక్షిణము నమస్కారము నిడి
తన్ను క్షమియించుమంచు నెంతయు నుతించి. ౨౧౫

క. ఏతాదృశోపచారము
లేతం డొనరించు వాని నీశ్వరి ప్రోచున్
మాత స్వతస్సిద్ధకృపా
న్వితగదా ! పూజసేయు నెడఁ గొదువేలా. ౨౧౬

సీ. ఇయ్యెడ నొక పురావృత్తము వచియింతుఁ
          గలదొక చక్రవాకము హిమగిరి
నది దేశములయందు నటునిటుఁ దిరుగుచుఁ
          గాశికి నేగి యొక్కెటను నన్న
పూర్ణ గుడికిఁజని భుక్తికై యేదని
          దొరకునే యని కొంత త్రొట్రుపాటు
దనర నొక్కింత ప్రదక్షిణ మొనరిచి
          తనయంతఁ జని పిమ్మటను భవాంత

గీ. రమున స్వర్గము జనియు భోగములు రెండు
కల్పములు గాంచి పిదప భూఖండమందు
క్షత్రియకులమునఁ బొడమి జన్మ సంస్మృ
తి విడక ప్రజాధిపత్యమ్ము దీర్చుచుండె. ౨౧౮

క. నృపతి యొకఁడు పూర్వజ్ఞా
నపకేతుఁడు గలఁడటంచు నానామునిరా
జ పటలి విని చని కని పూ
జపడసి కూర్చుండి పలికె జననాథునితో. ౨౧౯

క. ఓ నృపవర ! పూర్వజ్ఞా
నానుభవము నీకుఁ గలిగెనని విని కనఁగా
మానుల మే మరుదెంచుట
గానఁ దెలుపు మదియు నీకుఁ గలిగినవలనున్. ౨౨౦

గీ. అన నృపుఁడు సెప్పె బూర్వమం దన్నపూర్ణ
కొనరిచితిఁ బ్రదక్షిణము పక్షినయి తప్ప్రి
భావమున స్వర్గమందుఁ గల్పద్వయంబు
నిలుచు, టిప్పు డీ జ్ఞానమ్ము గలుగు టబ్బె. ౨౨౧

క. జగదంబచరిత మెవ్వఁ డె
ఱుఁగును బదస్మృతిఫలమ్మెఱుఁగువాఁ డున్నే
యగణితమది దానిం దల
పగ నాకానందబిందుపతనము గల్గున్. ౧౧౧

చ. పలుకులు వేయునేల జనిపావనకారణమైన యంబికన్
గొలువక విష్ణునిన్ శివునిఁ గొల్చెదమంచు వృథా భ్రమించువా
రల జననమ్ము వమ్మఘకరమ్ము పరమ్ము నిహమ్ము లేక చం
చల మయిపోవు నిక్కమిట సంశయమందకుఁ డించుకేనియున్.

క. అను పల్కులు విని మును లా
ననములు తెలివొందఁ జనిరి నారద! యే నెం
తని యాదేవిని వర్ణిం
తును నుతియింతును నతులిడుదును వినుమొకటన్.

క. జననము సఫలమ్మగ నె
వ్వనికిన్ గానుండు గల్గు వానికిఁ దద్భ
క్తినిదానమ్మగు శ్రద్ధ త
దనిచ్ఛ జనిసంకరతకు నగుఁ గారణమై. ౧౧౪

వ. అయ్యాదియు సంధ్యాత్రియమ్మున నయ్యంబ నర్చించుట పరమ తపంబై యొప్పెడి, ౧౧౫

క. తపమున దేహమ్మును దా
పపరీతముసేయనగుఁ దపమ్మునఁ బిత్రున
త్కృప గననగుఁ దపమిడు స్వ
ర్గపదవి ముక్తియును దపము గనఁజేయు మునీ! ౧౧౬

క. నృపతికి భుజబలమును ద్రి
వ్యపటిమ వైశ్యాంఘ్రిజులకు నాపత్తరణం

బు పొనరుచు నుపాయమ్ములు
జపహోమాదికము విప్రజాతికిఁజుమ్మీ. ౨౨౮

క. తపములలో నుత్తమమగు
తప మంగతనుత్వ మది యొదవఁదగుఁ గృచ్ఛ్రా
దిపరిశ్రమమున వేఱొం
డుపనులఁ దనుశోషణము గడుఁ గర్హితమా. ౨౨౯

గీ. బిచ్చమెత్తి యన్నమ్మును దెచ్చి నాల్గు
భాగములుచేసి యందొక భాగము ద్విజు
లకు నిఁకొక్కటి యాలకు నొకటి యతిథు
లకు నొకటి తనకుఁ దన భార్యకును దగును. ౨౩౦

క. ఒక లికుచమంత గ్రాసము
నకు మాన; మ్మవియు గేస్తునకు నెన్మిది, వ
ర్ణికగు యథేష్టం, బార
ణ్యకునకు గ్రాసములు నాలుగనిరి మునీంద్రుల్. ౨౩౧

వ. ఇట్లు నియమితాహారుండై గాయత్రీపురశ్చర్యం బొనర్పవలయు నయ్యది ప్రారంభించుటకు యథోక్తకాలంబు వెదుకఁదగునని వెండియు, ౨౩౨

క. అనఘాత్ములు విప్రులు మం
త్రనిధులు స్వస్తిని వచింప నాందిశ్రాద్ధ
మ్మును సలుపవలయు భోజన
మున వస్త్రమ్ములను ద్విజులు ముదమందఁగన్. ౨౩౩

వ. పదపడి శివక్షేత్రమ్ముల నయ్యది గుర్వానుజ్ఞానుసరణమ్ముగ జపింపనగునని వెండియు, ౨౩౪

క. ప్రారంభదినము మొదలుగ
నైరంతర్యముగఁ దుదిదినముదనుక నొక్కం
డారీతి హెచ్చుతగ్గులుఁ
గూరనిగతి జపముసేయఁ గూరెడి సిద్ధుల్. ౨౩౫

క. ప్రాతఃకాలము మొదలు ని
రాతంకుండగుచు రెండు యామములు జపం
బేతద్రీతిఁ బ్రతిదినము
చేతము నిశ్చలము చేసి చేయఁగవలయున్. ౨౩౬

ఆ. వె. పాలవంటకమ్ము పత్రసుమమ్ములు
యవలు తిలలు గొనియు నధిక నియతి
తసరఁ దద్దశాంశమున హోమ మొనరింప
మంత్రసిద్ధి యశ్రమమునఁ గలుగు. ౨౩౭

చ. అకుటిలబుద్ధి నిమ్మనువు నాత్మ మహాద్యుతిగోరి చేసినన్
వికలముగాక కోర్కె యది వేగమె వానికిఁ జేకుఱున్ సమ
స్తకృతులు సిద్ధినొందు నిది సారె జపించెడి వారి; కిట్టి దిం
కొకఁడు జగత్త్రయిన్ దొరక దొప్పెడి దీన నశేషసౌఖ్యముల్.

క. ప్రతిదినము సహస్రము పరి
మితిగా జపియించు నరుఁడు మేలున్ ధనమున్
సుతులన్ బరమాయు వరో
గతయున్ గని సుఖ మిహామునఁ గాంచుఁ బరమునన్.

క. వినినంతమాత్ర దారి
ద్ర్యనివారకమైన దీనిఁ దత్పరుఁడై యే
మనుజుఁడు జపించు వానికి
ధనకనకసమృద్ధి యెందుఁ దఱుఁగుట కలదే. ౨౪౦

వ. ఇంక వైశ్వదేవప్రకారమ్ము వినుము. ౨౮౧

గీ. వైశ్వదేవమ్ము సలుపక బ్రాహ్మణుండు
భోజనము సేయునేని యమ్మూర్ఖు కాల
సూత్రమనియెడి నరకముఁ జొచ్చెడిఁ దల
క్రిందుగాఁ గాళ్ళుమీఁదుగాఁ గ్లేశమొలయ. ౨౮౨

క. తానెయ్యది దిను జనుఁ డ
ద్దానిని వేల్చంగనగు విధానమ్మున నో
మానిజనవర్య! శాకం
బేని ఫలమ్మేని పత్రమేనియు హితమా. ౨౮౩

గీ. వైశ్వదేవమ్మునకుమున్న వచ్చెనేని
భిక్షు వయ్యెడ నతనికిఁ బెట్టి పంప
వలయు వైశ్వదేవమునకు వలసినంత
వేఱుగాఁ దీసికొని యని ధీరులంద్రు. ౨౮౪

ఆ. వె. వైశ్వదేవమందు వచ్చెడి దోషమ్ము
నడఁప భిక్షువగు సమర్థుఁ డట్టి
భిక్షుకులను గారవింపమినగు కలి
దీర్ప లేదు వైశ్వదేవ మనఘ. ౨౮౫

క. యతియును వర్ణియు వీ రధి
పతులగుదురు సిద్ధమైన వంటకమునకే
పతితుఁడు వీరి నెడపి తిను
నతఁడగుఁ జాంద్రాయణమున కర్హుఁడు మానీ! ౨౮౬

వ. పదపడి గోగ్రాస మొసంగఁదగునని మఱియును, ౨౮౭

క. అతిథి మఱి యెవని గృహమును
గతాశుఁడై విడుచు నతని కాలుష్యము త

తృప్తిఁ దాత్మ జట్టికొను దు
ర్గతి దాటఁదరంబె నతిథిఁ గడచినయేనిన్. ౨౮౮

క. తల్లియుఁ దండ్రియు గురువును
బిల్లలు నన్నయును శ్రోతులు భృత్యు లతిథులా
నెల్లను నభ్యాగతులును
జెల్లుదురు గృహస్థపోష్యజీవనులగుచున్. ౨౮౯

గీ. సోమయాగ మొనర్చు భూసురుల కెట్టి
ఫలము లభియించుఁ దాదృశఫలము పంచ
యజ్ఞములొనర్చు రిత్తులు నందఁగలరు
గృహికి నింతకు ముఖ్య మెందేనిఁగలదె. ౨౯౦

క. ఇదియెల్ల నెఱిఁగియును బె
స్మదమున నేగేస్తుఁ దాఁ బ్రమాదముగను న
య్యథమునకు నిహపరములం
దొందవదు సుఖ మతఁడు నింద్యుఁడో మునిచంద్రా!

క. ఇది యాచారక్రమ మి
య్యది సంక్షేపముగ నారదా! తెల్పితి భు
క్తిదమును ముక్తిదమును ని
య్యది దీని నెఱుంగువారి నంబిక ప్రోచున్. ౨౯౨

క. ఆచారమిచ్చు సుఖముల
నాచారము పూతుఁజేయు నసఘు నొనర్చున్
శ్రీచేర్చు విద్య నొసఁగెడి
నాచారమ్మునకు రాజ్ఞ యాయంబ జుమీ. ౨౯౩

—* స్కంధాంత పద్యములు *—

ఇంద్రవజ్ర.

నిత్యాన్నదానోన్నత ! నిర్వికారా !
నిత్యాశ్రయా ! సర్వమనీషిముఖ్యా !
సత్యాదరా ! ధర్మవిశాలశీలా !
మత్యున్నతా ! సూరిసమాజనుత్యా ! ౨౫౪

క. అస్మదవధానవిద్యా
విస్మితపండితసమాజవివిధస్తోత్రా
నుస్మృతచిరకీర్తి ! శ్రీ
తస్మార్తపథప్రవర్తి ! దర్శనమూర్తీ ! ౨౫౫

మాలిని. సుకృతమయచరిత్రా ! సూరిసంస్తోత్రపాత్రా !
అకలుషపథవర్తీ ! అన్నదానప్రపూర్తీ !
ప్రకటమృదుతరోక్తీ ! భావితానూనభక్తీ !
సకలనిగమచారీ ! సద్గురుబ్రహ్మసూరీ ! ౨౫౬

గద్య

ఇది శ్రీ……..తిరుపతి వేంకటేశ్వరప్రణీతంబగు దేవీభాగవతంబను మహాపురాణమ్మునందు ఏకాదశ స్కంధము సంపూర్ణము.

శ్రీ. శ్రీ. శ్రీ.

శ్రీమత్పరదేవతాయై నమః

శ్రీ

దేవీ భాగవతము

ద్వాదశ స్కంధము

పూర్ణకీర్తితేజ
స్ఫురితాష్టదిగంతరాళ! పుణ్యసుశీలా!
కరుణాకర! సాక్షాద్బ్ర
హ్మరసాదర! బ్రహ్మలోకమాన్యచరిత్రా!

వ. అవధరింపు మట్లు పురాణకథనోన్ముఖుండగు వ్యాసునకు జనమేజయుం డిట్లను. ౨

—* సుర గర్వాపహరణము *—

క. మునినాథ! ద్విజుల కెల్లర
కును శక్తి యుపాస్యయంటి కొంకక యాశ
క్తిని విడిచి యితరులను గొ
ల్వ నేల మఱికొంద ఱిదియు వచియింపఁదగున్. 3

వ. వైష్ణవులమనియు, గాణపత్యుల మనియుఁ గాపాలికులమనియు, బౌద్ధులమనియు, ననేకు లనేకవిధమ్ములఁ బ్రవర్తింతురని వెండియు, ౪

తే. గీ. బుద్ధిమంతులు పండితుల్ శ్రద్ధగలుగు
వారలే తర్కతత్పరత్వము వహించి
వేదముల నాస్థవిడిచి పల్విధములైన
మతముల మెలంగఁ గతమేమి? మౌనివర్య! ౫

వ. ఇది యిట్లుండ మణిద్వీపమహిమంబు విశేషించి వినవలతుఁ బ్రసన్నులగు గురువులకు శ్రద్ధగలుగు శిష్యులయెడ డాఁపఁదగు రహస్యముండఁ గదా యన రాజునకు ముని యిట్లను. ౬

తే. గీ. శ్రద్ధగలవాఁడ వెక్కుడు బుద్ధి గలుగు
వాఁడ వగుటను నీకుఁ జెప్పని దొక విష
యమ్ము గలుగదు వచియింతు సమ్మదమున
వినుము రాజేంద్ర! యద్దానఁ గనుము శుభము. ౭

క. మును రక్కసులును సురలును
బెనఁగిరి నూఱేడు లందు విజయ మ్మమరుల్
గొనిరి పరశక్తికరుణన్;
జని రసురులు దివము డిగి రసాతలమునకున్. ౮

చ. పిదపసురల్ మనమ్మున వివేకము దక్కి "పరాక్రమమ్ము లే
మి దనుజులెల్ల దీనత గమించిరి స్వర్గము వీడి సర్వసం
పదలును నస్మదీయఘనబాహుపరాక్రమమే గడించె" నం
చుఁ దరతమత్వమున్ మఱచి సొక్కుచు సోలుచు విఱ్ఱవీఁగుచున్.

క. పరశక్తి శక్తి కలిమిని
స్వరీశత లభించెనంచు స్వాంతమున నొకిం

తరయక మైమఱచి యిటుల్
దిరిగెడి తఱి నంబయుఁ మదిం దలపోసెన్. ౧౦

క. అకటా! వీరలు ముచ్చ
క్తికతన స్వర్భోగమంది తేఁకువసెడి యి
ష్ఠాక కొంతయోని ననుఁ దలఁ
పక చెడిపోవంగ నున్నవారు వివశులై. ౧౧

క. అని యెంచి సహజకరుణా
ఖనియగు నయ్యంబ వారిఁ గరుణింప నొకిం
తనరాసి యక్షమును పే
రునఁ బొల్చెడి తేజమై నిహాఢి మెఱయుచున్. ౧౨

క. కనుపట్టిన సత్యాగ్భుత
మును గరచరణాదిరహితమును విద్యుత్కో
టినిభమ్మ సదృష్టచర
మ్మును నగు నత్తేజు సురసముదయము గనియెన్. ౧౩

క. కని విస్మయ మెంతయు మన
మున మొనయఁగ నేమియొకో మున్నెన్నఁడుఁ జూ
చిన యదియున్ వినినట్టిది
యును గాదని యొకరిమొగము లోకళులు గనుచున్.

క. ఇది దైత్యుల చైదమొ, లే
క దురుద్ధరమైన మాయ గావలయునో, యి
య్యది యెవరు పంపవచ్చిన
యదియో! యని యెల్లరును మహాశ్చర్యమునన్. ౧౫

వ. కొండొక విచారించి నికటమ్మున కరిగి యడిగినంగాని నిర్ణయింప
నశక్యమ్మని యింద్రుండు వహ్నిం బిలిచి, ౧౬

క. మాకెల్ల రకును మొగ మీ
వేకద, యటుగాన నీవయేగి యిదియుఁ దా
నేకతన నిటకు వచ్చెనో
వే కనుఁగొని రమ్ము నాఁగ వేగ నతండున్. ౧౭

క. చని యెదుట నిలువఁబడు నం
తన యక్షుం బతనిఁగాంచి తగనిట్లను, నో
యనఘా ! నీవెవ్వఁడ వే
పని నీయది తెల్పు నాఁగఁ బలుకు ననలుఁడున్. ౧౮

క. "ఏ నగ్నిని సర్వదహన
మే నాపని" నాఁగ, నొక్క తృణ మటనిడి "యి
ద్దాని దహింపుము చూతము
కానీ నీశక్తి" యనఁగఁ గనలుచు నతఁడున్. ౧౯

క. తన యావచ్ఛక్తియు నట
వినియోగముచేసి తుదకు విముఖుండై, ల
జ్జను గొని సురేంద్రు సన్నిధి
కిని జని వృత్తాంత మతనికి నొడివె నెల్లన్. ౨౦

వ. ఇంద్రుండును విస్మయాకులుండై, వాయువుంగని నీవరిగి తత్తేజో నిర్ధారణం బొనరింపుమనుడు, నరిగిన, యక్షం 'బేలవచ్చితి ? వే శక్తి నీయది ?' నావుడు, ౨౧

క. ఏ నఖిలచాలనమ్మును
బూని యొనర్పంగ నేర్తు భూతమ్ములు న
న్నూనియె వ్యాపారమ్ముల
లో నోలనెడి నేన సర్వలోకహితుండన్. ౨౨

క. అనుచుఁ దృణం బయ్యదియే
యనిలుని యగ్రిమున నిడియు యక్షుం బపు "డో
యనఘా ! యిది చలియింపం
గ నోసర్పుము నీదుశక్తి గన్పట్టు" నన౯. ౨౩

క. తనయావచ్ఛక్తియు నట
వినియోగము చేసి తుదకు విముఖుండై, ల
జ్జను గొని సురేంద్రు సన్నిధి
కిని జని వృత్తాంతమతనికి నొడివెనెల్ల౯. ౨౪

గీ. అంత సురలెల్ల "నీవు దేవాధిపతివి
గాన వీరిని వారినిఁ గనుఁగొనుఁడని
పంపనేటికి నీవేగి పరమచిత్ర
మైన యా తేజమెట్టిదో యరయుఁగొప్పు." ౨౫

క. అనునంత నింద్రుఁ డయ్యెడ
ఘనగర్వాంధత్వ మొలయఁగాఁ జని కనులో
నన యా తేజం బంత
ర్ధనిగనె వాసవుని మది విఱిగె లజ్జితమై. ౨౬

క. ఏ నేమని వెలవెలమను
నాననమున సురలఁజూడ నర్హంబగు నె
వ్వానికిఁ బ్రాణముకన్నఁ
మానం బధికంబు దాని మానుట మృతియా. ౨౭

క. అని గర్వముడిగి చిత్త
మ్మున 'నియ్యది దేనికతన మొనసెనో, మఱి నా
కును శరణ మదియె యగుఁగా'
కను నాలో నభ్రవాణి యాతని కనియె౯. ౨౮

క. మాయాబీజ జపమ్మును
చేయుము సుఖమబ్బు జగదజేయుఁడవై సు
శ్రీయుతుఁడవగుచు నెగడెద
వో యమరాధీశ ! యనఁగ నోగి సతఁడంతన్. ౨౯

గీ. ధ్యానమీలితలోచనుఁడయి నిరశనుఁ
డగుచు నొక లక్ష వర్షమ్ము లా జపమ్ము
సలుప నయ్యంబ కరుణావిశాలయగుచు
మధునవమినాఁడు రెండు యామముల వేళ. ౩౦

క. వెనుకటి తేజోరూప
మ్ముననే పూర్వప్రదేశముననే కన్ప
ట్టిన నంత వాసవుం డ
శ్రునయనుఁడై కాంచి కలితరోమాంచుండై. ౩౧

గీ. బాలశీతాంశురేఖావిశాలముకుట
శాలకోటీరవిప్రభ బాల దివ్య
శీల నవయౌవనోద్ధతఁ జిత్రతరవి
భూషణాంచిత మసృణకపోలయుగళ. ౩౨

క. చేలాంతర్వ్యంజితకుచ
నాలోలకృపావిశాల నంచితఫాలన్
మాలాభిరామ వేద
స్త్రీలాలితనిరుపమానశృంగారాఢ్యన్. ౩౩

క. తనదంతకాంతు లోలయు క
తన భూమిన్ బద్మరాగధామమ్ముగఁ జే
యు నొయారిన్ భక్తులు గో
రిన వరముల నొసఁగు కల్పవృక్షము నంబన్. ౩౪

క. తత్తేజోమధ్యమ్మునఁ
జిత్తమ్ము వశమ్ముదప్పఁ జెచ్చెరఁగని యు
ద్యత్తరభక్తి నమస్కృతు
లత్తల్లికి నొసఁగి నుతుల నలరించి యనున్. ౩౫

క. "ఆతేజం బెక్కడిది? య
నేతాదృశమహిమ గలుగు నెక్కతమునఁ దా
నేతెండు వంపె దానిఁ గృ
పాతత్పరవగుచుఁ దెలియఁ బలుకుము తల్లీ." ౩౬

—* అంబ యింద్రునకుఁ దన మహిమ దెలుపుట *—

క. అన నంబ వల్కు "నది లో
కనిదానము బ్రహ్మము సనఘము మాయకునుం
గని సర్వసాక్షియును నై
తనరెడి మద్రూప మిది యథార్థం బింద్రా! ౩౭

గీ. దేని వేదమ్ము లెప్పుడుఁ దెలియఁదివురుఁ
దపము లెద్దాని వచియించుఁ దపసు లెద్ది
గోరి బ్రహ్మచర్యమ్మునఁ గోర్కెనింతు
రప్పదము సంగ్రహమ్ముగఁ జెప్పెదవిను. ౩౮

గీ. బీజములు రెండు మన్మంత్రరాజమునకు
రెండు భాగములుగల నాసృష్టి యెల్ల
జగమగుటఁ గల్గె ద్వైవిధ్య మగణితప్ర
భావమునఁ బొల్చు నారెండు భాగములను. ౩౯

క. ఒకఁ డలరు సచ్చినానం
దకందమై ప్రకృతి సంజ్ఞఁదగు నొక్కఁడు చం
ద్రికకుం జంద్రునకుంబలెఁ
బ్రకృతికి నాకైక్యమొలయు వాసవ! యెపుడున్. ౪౦

ఆ. వె. శక్తి మత్తుకన్న శక్తి వేఱుగ లభ్య
మగుట యననుభూత, మకృతమునఁ
దగు నభేద మెల్ల జగమును బ్రహ్మమ్ము
నందు నేన యగుచు నలరుదాన. ౪౧

క. అవ్యక్తమైన రూపమె
సువ్యక్తంబగుచుఁ దోఁచు సురనాథ! సదా
భావ్యమగుఁ బ్రాణి బహు క
ర్మవ్యాపారమ్ము కతనఁ గ్రమపరిపాటిన్. ౪౨

వ. అంతర్ముఖ బహిర్ముఖ భేదమ్మున మాయకును ద్వైవిధ్యంబొలయు, నందు రెండవది తమ శ్శబ్దంబున వాడంబడు, దానికతనఁద్రిగుణమ్ములుపుట్టి, బ్రహ్మాదులెల్లరును దదాత్మకులని దెలియుము.

క. అజునకు గుణత్రితయమున
రజమెక్కుడు, హరునకుం బరఁగుఁ దమ, మ య్యం
బుజనయనునకున్ సత్వం
బు జగత్త్రయనాథ! యధికముగఁ బొల్చుఁ జుమీ. ౪౪

క. స్థూలమజుఁడు సూక్ష్మము హరి
శూలియుఁ గారణము నేన సూ! తుర్యావ
స్థాలీల నాదు రూపం
బాలింపుము రెండు దెఱఁగులై యొప్పారున్. ౪౫

గీ. అందు సగుణంబు మాయతో నంటియుండు
నిర్గుణంబు తద్రహితమై నెగడు వినుము
సర్వజగ మేర్పఱచి తదంతర్విలసిత
నగుచుఁ బ్రేరేపుదాన జీవగణమేన. ౪౬

గీ. కాలకర్మములను బట్టి కంజజాదు
లను దదుచితకార్యమ్ములకు నియమింతు;
వీచు ననిలుఁడు, ననలుఁడు వేచు, రవియుఁ
దోఁచు, హరి ప్రోచు, మద్భయోద్భూతిగరిమ. ౪౭

క. సురనాథ! కల్పబ్రహ్మల
కరణిన్ మిముఁ ద్రిప్పుచుందుఁ గనుమీ జయమున్
బరఁగింతు మీకొకప్పుడ
సురులకు నది యొక్కవేళఁ జొప్పడ నిడుదున్. ౪౮

గీ. కాలకర్మానుసరణమ్ముగా సమస్త
కార్యముల నే స్వతంత్రినై గడపుచుందు
నట్టి సకలాత్మనగు నను నఱయఁజాల
కిపు డహంకారమున మీర లెసఁగఁజూచి. ౪౯

క. కరుణింప నెంచి మీమీ
శరీరముల నుండి యక్షసంజ్ఞ దనర నే
నరయంగ నైతి, నిదియు ని
తర తేజముగాదు, దానిఁ దరమే తెలియన్. ౫౦

క. ఇదిమొదలు గర్వమెల్లను
గుదియించి విశేషభక్తి కొనసాఁగఁగ మీ
హృదయముల నన్ను శరణము
గఁ దలఁపనగు వేఱుతలఁపు గాఁదగదింకన్. ౫౧

క. అని పలికి యంబ యంత
ర్ధినిగనె సురలదియు మొదలు తేఁకువ గాయ
త్రిని మూఁడు సంజలను భ
క్తిని జపియింతురు నియతవిధిన్ శుభఫణితిన్. ౫౨

గీ. ఆదియుగమున నీగతి నఖిలసేవ్య
యగుచు గాయత్రి యొప్పారె నంతకన్న
విప్రునకు ముఖ్యమెందును వెనుక దొరక
దది విడుచువారలకుఁగల్గు నధమగతులు. ౫౩

—* గౌతమకృత గోవధ *—

వ. రాజా ! వినుము. మున్ను పదునేను వత్సరమ్ము లేకరీతి ననావృష్టిదోషమ్ము కతన క్షామంబొండు గలిగె, నప్పటి యుపద్రవమ్మిట్టిది యని చెప్పనలవికా ; దేగృహమ్మునఁ జూచిన శవమ్ముల సంఖ్య యపారమ్ము; కొందఱాకలిపట్టఁజాలమిఁ దద్భక్షణమ్మునన పొట్టలు నించికొందురు, కొందఱశ్వమహిషవరాహాది మృగమ్ములను, మఱికొందఱు మఱికొన్ని వస్తువులను యథాప్రాప్తమ్ముగ భుజించుచుఁ బ్రాణమాత్రావశేషమ్ముగ నుండిరి. ౫౪

గీ. ఇంత చెప్పఁగనేల తానెంత ఱాతి
గుండెకల తల్లియేనియుఁ గుక్షిఁబొంచెఁ
బదినెలలు మోచికన్నట్టి బాలుఁ దినుట
వింటిమే ! నాఁడుదక్క నో విభువతంస ! ౫౫

క. పురుషులు తరుణులఁ దిందురు
తరుణులు నిసువులను దినఁగదలఁతురు క్షుత్తె
వ్వరి నెప్పని సేయింపదు !
మరియాద యెఱుఁగునె, యదియు మనుజాధీశా ! ౫౬

గీ. అట్టి యిక్కట్టునందు బ్రాహ్మణులు గొంద
ఱెంతయేని యుపాయము నెందు వెదకి
తుదకు గౌతమముని మహాత్ముఁడు సుభిక్షు
మతని యాశ్రమమున నున్నదనుచుఁ దెలిసి. ౫౭

క. గాయత్రీజపతత్పరుఁ
డై యేవేళఁ గృతదీక్షుఁడగు నతనిఁగనన్
దోయము వారును దారు న
తీయుతులై యరిగి రట కతిథులై యొకటన్. ౫౮

గీ. దెసలు నాల్గిటినుండి యతిథులు వేన
వేలు స్వకుటుంబగోధనభృత్యసహితు
లై యరుగుదేర దవ్వులనరసి యా ఘ
నుండు సంతోషమంది 'రారం' డటంచు. ౫౯

క. తగఁ గుశలం బడిగియుఁ గా
ళ్లు గడిగి యవ్వారినెల్ల లోకోత్తరరీ
తిగ గారవించి "యిటరాఁ
గఁ గతముదెల్పుఁ" డని ఘటితకరకమలుండై. ౬౦

క. అనుగుటయు వారు తమపను
నినుములు తుదముట్టఁజెప్ప "నిది మీ గృహం, మీ
రొడయులు నాకిఁక నూరక
తడఁబడఁగా నేల యిట్టిదాసుం డుండన్. ౬౧

క. మీరాకకతన ధన్యత
గూరెన్ నాకింతకన్నఁ గొండొకసుకృతం
బేరును జేయరు మజ్జన
నారంభము సార్థమయ్యె నధికుఁడనైతిన్". ౬౨

క. అని యనునయపూర్వకముగ
ఘను లవ్విప్రులకు నభయకారకుఁడై, యొ
య్యన గాయత్రిని దాఁ బ్రా
ర్థనసేయఁగ నంబ యిడియె దర్శనమెలమిన్. ౬౩

గీ. అట్లు ప్రత్యక్షమై సకలాతిథులను
దనుపఁదగునట్టి పూర్ణపాత్రమ్ము నొసఁగి
'యెద్దిగోరిన నియ్యది యిచ్చు నీ' క
టంచు వచియించి యంతర్ధి ననుగమించె. ౬౪

క. ఎచటం జూచిన నన్నం
బెచటంగనుఁగొన్న సూప మెటఁగన్న నని
ర్వచనీయషడ్రసమ్ముల
రుచులుం గను పట్టెఁ దన్నిరూఢప్రౌఢిన్. ౬౫

క. నగలఁట, వస్త్రములఁట! యె
న్నఁగలమె, యావస్తుసంఖ్య నగములనఁగఁది
న్నఁగ నెచటఁ గనినఁగనఁదగు
నగణితమనఁదగదె తన్మహామహిమమ్మున్! ౬౬.

గీ. గౌతముఁడు భూమిసురులను గాంచి యివియ
యన్నరాసులు, కూరలయ్యవియ, యాజ్య
మల్లదిగో! తక్రమియ్యది, యదియ దధి, య
భీష్టముఁగ నారగించి సంతృప్తిఁగనుఁడి. ౬౭

క. పదపడి వారెల్లరు నె
మ్మదు లానందరససింధుమగ్నమ్ములుగా
నది సుఖమున భుజియించుచుఁ
గదలక యచ్చోటన యుండి కడుశ్రద్ధమెయిన్. ౬౮

గీ. ఎన్నియో జన్మములు మఱి యెన్నియేని
బ్రాహ్మణారాధనమ్ములు వ్రతములును బొ
నర్చుచును దీర్ఘకాల మన్నమ్ము వస్త్ర
ములును సంపూర్ణగతినొప్పఁజెలఁగిరచట. ౬౯

క. వారివలన వీరును మఱి
వీరివలన వారును విని వేలును లక్షల్
గా రా మొదలిడిరఁట! సం
సారమ్ములతోడ నెల్లజనులయ్యెడకున్. ౨౦

గీ. రత్నభూషలు దొడుగని రమణి, పట్టు
పుట్టములు దాల్పని సతి యప్పుడమి నెందు
వెదకినను గానరాదఁట! కొదువయొకఁడు
గలుగనేర్చునె యదియ స్వర్గముగనుండ. ౨౧

క. మునిజనులెల్లరు సచ్ఛం
దసభూషితులగుచు దేవతలఁ గాదన, స
మ్మునిసతులు దివ్యభూషా
ఖనులై సురసతుల గేలిగావింపరొకో! ౨౨

గీ. అమ్మహేంద్రుని యాశ్రమమంత నూఱు
యోజనమ్ముల విస్తృతి నొందె నచట
నెప్పు డుత్సవములకల్మి యెసఁగు, రోగ
భయము దైత్యాదిభయము నెప్పటికిలేదు. ౨౩

క. ఆయాశ్రమమున విప్రులు
సేయు మహాయజ్ఞముల నశేషసురలు మో
దాయత్తులగుచుఁ దనిసి మ
హాయశుఁ డొక గౌతముండె యని పొగడిరొగిన్. ౨౪

గీ. అహహా, యేనుండు! దేవేంద్రునంతవాఁడు
తనకుఁ గల్పనగమ్ము గౌతముఁ డటంచు
నొక్క యెన్నెనిసార్లు పేరెక్కినట్టి
యల సుధర్మను గొలువుండి సలిపె నుతుల. ౨౫

క. ఈగతిఁ బండ్రెండేం డ్లను
రాగముమెయి గర్వగంధరహితుండై స్వ
ర్గోభోగం బొసఁగుచు గాయ
త్రీగాయకుఁ డమ్మునిమణి దేల్చెన్ వారిన్. ౨౬

గీ. అప్పు డయ్యెడ మునియు గాయత్రి కొక్క
యాలయముఁ గట్టె మునివరు లచట నెపుడు
సలుపుచుండ్రు పురశ్చర్య ; సదృశ మొండు
గాదు తత్స్థానమునకు నిక్కము నృపాల. ౨౭

క. అటఁగన్పడు నంబిక యి
ప్పటికిని బాలికయుఁ దా యువతి వృద్ధయు నై
జటిమాడలికిఁ ద్రిసంధ్యల
నటనము గావించు చున్ గనద్భూషణయై. ౨౮

గీ. అంతనొక్కెడ నారదుం డటకువచ్చి
యర్చితుండయి "గౌతమ ! యహాహా ! నీయ
శమ్ము నేమని పొగడుదు సత్యలోక
మందు స్వర్గమ్మునందుఁ దానెందు నిండె. ౨౯

క. మొన్న సురేంద్రుఁడు సభ ని
న్నెన్నిన నేనాలకించి యిటకు నినుఁగనన్
గ్రన్న నరుదెంచితిని నీ
కన్నన్ గలఁడే యొకండు గౌరవమునకున్". ౩౦

క. అని పొగడి పిదప గాయ
త్రి నికేతమ్మునకు నరిగి దేవికి హర్షా
శ్రునయనుఁడై మ్రొక్కిడి నుతు
లొనరిచి దివమేగె నంత నొక్కెడ విప్రుల్. ౩౧

గీ. గౌతముని నారదుండింతగా నుతింపఁ
జనునె యనుసీర్ష్య నెమ్మనమును గలంప
నతని కపయశమును గూర్ప నాత్మనెంచి
రకట ! యేమనవచ్చు బ్రాహ్మణుల చెయ్దు. ౮౨

గీ. అంతఁ గొంతకాలమునకు నఖిలలోక
సౌఖ్యదాయకమగుచు వర్షమ్ముగురిసె
దానఁ గఱవు వెల్లదేశముల్ తాన విడిచె;
నట్టి వార్తను వినిరి బ్రాహ్మణజనములు. ౮3

మ. విని యేదేని నిమిత్త మేర్పఱచి యవ్విప్రేంద్రునిన్ శాపద
గ్ధుని జేయన్ సమకట్టిరక్కట ! మహాత్ముల్ గారె ! తాదృఙ్మహా
జనులన్ గాంచిన తల్లిదండ్రు; లిదియున్ సామాన్యమే ! తిన్నయిం
టను వాసమ్ములు లెక్కపెట్టుట నిరూఢం బెందు విప్రాళికిన్.

గీ. అంత నొక వృద్ధగోవు మాయ నొనరించి
గౌతముని యజ్ఞశాల వంకకును దఱుమ
నది యతఁడు తపమొనరించు నట్టియెడకుఁ
జన నతఁడు దానిఁదోలె 'హు' మ్మనుచు; నదియు.

క. ప్రాణమ్ములు త్యజియించిన
మానులు గుమిగూడి గౌతమ మునికిఁ దగునే
యీ నియతి నెట్టపంటగ
ధేనువు నిటుచంపె నకట ! తేఁకువ వలదే. ౮౬

క. అను పలుకులు విని గౌతముఁ
డనుకంపాకంపితాంతరంగుండై క్రి
న్నన దపము విడిచి మృతగో
వునుగని యొంతయును నశ్రుపూర్ణాక్షుండై. ౮౭

గీ. గతమునకుఁ జింతచేసినఁ గలదె ఫలము
కారణం బేమొ యూహింపఁ గడఁగు టొప్పు
టంచు యోజించి నేత్రమ్ము లట్టె మూసి
జ్ఞానదృష్టిని గాంచె నిక్కమ్ము నెల్ల. ౮౮

క. కనుఁగొని యిది విప్రులు చే
సిన పని యని మనమునందుఁ జింతించి కటా !
యని లోనఁ గనలు గదురఁగఁ
గనుల ననలకణము లురులఁ గలుషితమతియై. ౮౯

—* గౌతముఁడు బ్రాహ్మణుల శపియించుట *—

గీ. బ్రాహ్మణాధములార ! యిప్పట్టునందు
నెట్టిపంటగ నయశంబుఁ గట్టనెంచి
నట్టి మిమ్మేమిచేసిన నఘముగలదె
యైన క్షమియించితిని మిమ్ము నతిథులగుట. ౯౦

ఆ. వె. వేదమాత యగుచు వెలసిన గాయత్రి
జపము మీకు నింక సఫల మగుచుఁ
బొదలకుండుఁగాక ! పొసఁగదు వేదమ్ము
లందు శ్రద్ధ, పొసఁగ వధ్వరములు. ౯౧

క. శివునియెడ శివమనువునెడ
శివశాస్త్రమునెడల మీకు సేవకభావం
బు వృథా యగు మీరిక నె
ల్ల విధమ్ములఁ గం డధము లిలన్ శూన్యులరై. ౯౨

గీ. దేవియందుఁ దత్కథలను దేవి నిలుచు
చోటులను దేవి సద్భక్తకోటులందు

దేవి యుత్సవములు సూడఁ దివురు నెడల
మీకు నధికార మీమీఁద లేకపోవు. ౯౩

క. శివకల్యాణదిదృక్షయు
శివభక్తార్చనయు మఱియు శివభక్తులు దా
ల్చు విభూతిఁ రుద్రాక్షల
ను విముఖులై మీ రధమత నూల్కొనుఁ డింకన్. ౯౪

గీ. జ్ఞానమున శాంతి దాంతిని జన్నములను
నగ్నిహోత్రమ్మునను నిగమాధ్యయనము
నందు నుత్తమదానమ్ములందుఁ బితృసు
కర్మముల మీరు విరతిని గాంతురింక. ౯౫

క. శ్రీదేవీతరులగు నా
యాదేవతలందు భక్తి నంది యుదరచ
క్రాదికచిహ్నితులై పోలు
పేది యధమభావ మందుఁ డెల్లరు విప్రుల్. ౯౬

క. కొందఱు కాపాలికులై
కొందఱు పాషండులగుచుఁ గొందఱు భౌద్ధా
నందులయి వేదవిద్యా
మందతగని చెడుఁడు నాదు మాటకతమునన్. ౯౭

క. పితృమాతృసుతభ్రాతృ
త్మతనూజాభార్యలను వృథాద్రవ్యాస
క్తతఁజేసి వేదముల ధ
ర్మతతుల విక్రియమొనర్చు మతి మీకబ్బున్. ౯౮

గీ. మాతృకన్యానుగాములై మందమతులు
భగినుల రమించునట్టి దుర్భగులు బరయు

వతులఁ జెఱవట్టు దుర్మార్గవర్తనులును
గాఁగలరు మీకోలమ్ములఁ గలుగు జనులు. ౯౯

క. ఏనిడిన శాపమిది మీ
కీనాఁటనకాక మఱియు నెల్లయపుడు మీ
మీ నామరూపముల వం
శానుసరణ మొలయ నాశమందఁగఁ జేయున్. ౧౦౦

క. పలుమాట లేల మీకుఁ గ
నలి గాయత్రి యెడనుండు, నరకము మీవా
రల కెల్ల వాసమగు'' నని
పలికి యతం డంబ గుడికిఁ బయనము సేసెన్. ౧౦౧

క. చనియంబకు మ్రొక్కెడ న
జ్జననియు ద్విజగణ మొనర్చు చర్యకు నాశ్చ
ర్యనిమగ్నచిత్త యయ్యెన్
గనఁదగు నిప్పటికి నట్టికళ యామెయెడన్. ౧౦౨

క. జనని యిటు నవ్వుచును నా
తనిఁగని శాంతింపు మొందుఁ దగిదే భుజగ
మ్మునకిడు పా ల్విషమగుట, సు
జనత తదన్యతయుఁ గర్మజన్యము లనఘా. ౧౦౩

వ. అనుటయు,

గీ. గౌతముఁడు శాంతిఁ జెందె; ద్విజాతులెల్ల
శాపమున శ్రుత్యపేతత సంభవింప
నెంతయేనిఁ బశ్చాత్తాప మినుమడింప
సిగ్గుగొని గౌతముని నతుఁ జేసి పిదప. ౧౦౪

క. కరుణింపుము కరుణింపుము
కరుణింపుమటంచు నైకకంఠ్యమ్ముగ నె
ల్లరు వేడిరి; తత్క్షణమునఁ
గరుణార్ద్రస్వాంతుఁడయ్యె నధిప! గౌతమమునియున్. ౧౦౫

క. హరి కృష్ణుండై యెప్పు డవ
తరించు నందాఁక మీరుఁ దప్పక నరక
స్థిరవాస మ్మటుపైఁ గలి
ధరపై జనియించి శాపదగ్ధుల రగుఁడీ. ౧౦౬

క. నా శాపము ద్రిప్ప కోనెడి
యాశ మదిం గలదయేని యర్చన గాయ
త్రీశక్తికిఁ గావింపుఁడు
నాశక్యమె క్రమ్మరింప నాశాపమ్మున్! ౧౦౭

క. అని వారి విడిచి గౌతమ
ముని యిది ప్రారబ్ధమని సుముఖుఁడై శాంతిం
గనెఁ దత్కారణమున భువి
జనియించిరి నరకగులు ద్విజాత్యాకృతులన్. ౧౦౮

సీ. పండితులయ్యును బరదారలంపటుల్
గాయత్రి నెఱుఁగని కష్టమతులు
తప్తముద్రాంకితుల్ ధర్మవిహీనులు
పాషండవర్తనుల్ పరమపాత్రు
లాచారశూన్యు లనూచానవృత్తవ
ర్జితులు తలోదరీజితు లహితులు
కాపాలికరతులు కౌలాచరణమతుల్
భక్తిశూన్యులు పరశక్తి నెఱుఁగ

గీ. నేరని కుమతులగుచు ననేకదుర్వి
దగ్ధమార్గముల మెలఁగి తరణమునకుఁ
గాక తిరిగియు నరకానుగతికిఁ బాలు
పడుదు రెన్నటికిని వీరు పరము గనరు. ౧౦౯

క. అదిగాన సర్వజనులకు
ముదమిడు జగదంబ సేవ్య భూవర ! యాయం
బ దగు మణిద్వీపమ్మున
నది యిదమిద్ధమని తెలుప నలవియెయెందుఁ. ౧౧౦

—* మణిద్వీప వర్ణనము *—

క. ఐనను వచించెదను విను
నా నేరుచు కొలఁది లోకనాయకిచే స
న్మానింపం బడియెడి త
ద్ధ్యానము విధిలోకమునకుఁ దగు నూర్ధ్వమునన్.

చ. అదిదగు సర్వలోకమును నాఖ్యను దానికి నీడు చూడ నీ
పదియును నాల్గు లోకములఁ బొల్పడ దొందఁను; సృష్టికాది సం
బ దనకుఁగా యదృచ్ఛమెయి మాధవుఁడాదిగ వేల్పులుండు నా
స్పదముల కన్న మిన్నయగు భాతిని దాని సృజించె భూపతీ !

క. కైలాసము కన్నను మఱి
గోలోకముకన్న నదియు గొప్పయగుటఁ గా
దే ! లోకప ! సర్వమనం
గా లోకులు దానివాడఁగాఁ దివ్రుటయున్. ౧౧౩

గీ. అదియు బ్రహ్మాండముల కెల్ల నాతపత్రి
మన నలరు దానిచుట్టును నమృతజలధి
పరిఖ, యయ్యెడ గల రత్నవాలుకలును
దక్కఁగల వస్తువులు దెల్పఁ దరమె నృపతి ! ౧౧౪

గీ. ఒలయు నట నొక్కకోట యయోమయముగ
నెత్తె మొడామడ యనంగ నింత దాని
విస్తృతి యటంచు వచియింప వెట్టినే! నృ
పాల! యెల్లెడ నట ద్వారపాలు రుండ్రు. ౧౧౫

క. నలుదెసల ద్వారముల బురు
జుల నలరెడి రక్షకులను జూడఁగవలెఁ గా
కిల నొకని శక్యమే! ల
క్షలు కోటులు ననుచుఁ జెప్పఁగా విని తెలియన్. ౧౧౬

క. జననీదర్శనమునకని
చను వేల్పులతోఁడు లచట సంఘమ్ములుగా
ననిశము నిల్తురు తద్వా
హానఘోరాస్వనము దిక్కులన్నియు నిండన్. ౧౧౭

క. అట నొప్పెడి రత్నద్రుమ
పటలసమావృతములైన వనములును సము
త్కటమధురవారిపూరిత
తటాకములు ముద మొసంగఁ దగు నెవ్వరికిన్. ౧౧౮

గీ. మితి నతిశయించి కాంస్యనిర్మితమయి గగ
నము స్పృశించుచు నాపైని నమరు నింక
నొక్క ప్రాకార మయ్యెడఁ బెక్కు గోపు
రములు వనములు నిరుపమానములు గలవు. ౧౧౯

క. అట నొలసెడు పూలును ఫల
పటలములును గోకిలాది పక్షులును మృగీ
నటనములును మదికింపుగ
ఘటియించున్ వానిఁ బొగడఁగా నాతరమే. ౧౨౦

వ. ఇయ్యది వెనుకటిదానికన్న శతగుణతేజంబు గలిగియుండు నిద్దాని కవలఁ దామ్రసాలమ్ము వొల్చు; నియ్యది చతురస్రమ్మును సప్తయోజనోన్నతమ్మును నై యభేద్యగతి నలరు. ౧౨౧

క. ఈ సాలములకు నడుమన్
భాసిల్లున్ గల్పవాటి బంగరుకన్నన్
భాసురములైన పూవుల
రాసులు చివురులును నచట రాజిలు నెపుడున్. ౧౨౨

క. ఫలముల నెల్లెడ బీజ
మ్ములు రత్నములై తనర్చు భూమీశ! పరి
మళ మేతదీయ మెల్లెడ
సలుపున్ బదియోజనముల యంతటిమేరన్. ౧౨౩

గీ. పుష్పసింహాసనమ్మును బూలగొడుగు
బూలతొడవులుగలిగి యెప్పుడు వసంతుఁ
డవ్వనమునందుఁ బుష్పసవాతిఘూర్ణి
తాత్ముఁడై భార్యలనుగూడి యాడుచుండు. ౧౨౪

వ. మధుశ్రీయని మాధవశ్రీయని యతనికి నిర్వురుభార్య లవ్వారల సౌందర్యం బనుపమము; మఱియు నయ్యెడ, ౧౨౫

క. అంగనలు దండమెఱయ మృ
దంగధ్వని లొలయఁగా నుపాంగాది రవం
బంగములఁ బరవశత్వం
బుం గొలుపన్ బాడికొం డ్రెపుడు గంధర్వుల్. ౧౨౬

వ. దీని కవల సీససాలంబు వఱలు; నియ్యదియు నెత్తున నట్టిదియ. మఱియు నీరెంటికినడుమ సంతానవృక్షవాటిక యలరు. ౧౨౭

క. ఆయెడఁ గాంతలు పీవన
లే యెడలఁ బీవఁ దనకు నిరుదెసల శుక
శ్రీయు శుచిశ్రీయును దగ
నాయకుఁడై గ్రీష్మఋతువు నరవర! పొల్చున్. ౧౨౮

వ. దీని కవ్వల నిత్తడికోట యలరు; నియ్యదియు నున్నతి స్ఫూడియు. ఈరెంటి నడుమ హరిచందనవనంబు పొల్చు; దీనికి నాథుండు వర్షర్తువు నభశ్రీ మొదలుగాఁగల పండ్రెండుగురు భార్య లతో నలరెడి. ౧౨౯

క. నవపల్లవముల నెప్పుడు
నవనిజములు లతలు నలరు హరితతృణసమా
జవృతమై ధర యొలయు న
దవిశేష నదీతటాకతతు లొప్పు నటన్. ౧౩౦

వ. సతులతో నియ్యెడ దేవత లెప్పుడును విహరింతు; రిద్దాని కవలఁ బంచలోహమయమ్మగు సాలమ్ము వెలయు; నిట మందారవృక్ష వాటిక తనరు; నియ్యెడ నిషలక్ష్మియు నూర్జలక్ష్మియు నను తనసతులతో శరదృతువు వర్తించు; నిమీఁద వెండికోట యొక్కఁడు సప్తయోజనోన్నతంబయి యొప్పు. ౧౩౧

గీ. పారిజాతవనం బిట వెలుఁగుఁ దత్సు
మముల గంధమ్ము దశయోజనములు చెలఁగు
సగణుఁడై, సాయుధుండయి సర్వరాగి
హితకరుం డట హేమంతఋతువు పొల్చు. ౧౩౨

వ. ఇతనికి సహశ్రీయును, సహస్యశ్రీయును భార్య; లీకోట కనంతరమున బంగారుకోట కలదు. ౧౩౩

క. కలవు కదంబతరువు లటఁ
గలుగుఁ మదిరారసమ్ము కడవలకొలఁదిన్
తలమే తత్పానమ్మునఁ
గలిగెడి యానందమదియు గణుతింపంగన్. ౧౩౪

వ. అటఁ దపశ్శ్రీ తపస్యశ్రీలతో శిశిరర్తువు నిలుచు; మఱియు సిద్ధుల నేకులు సకుటుంబసపరివారులై సుఖం బనుభవింతు రిద్దాని కవలఁ బుష్యరాగమయమ్మగు ప్రాకారమ్మువొల్చు; నయ్యెడ నుండు భూమియుఁ దక్కంగల పదార్థమ్ములును దన్మణిమయమ్ములు కానెఱుంగునది. ఇయ్యది తేజమ్మునఁ బూర్వసాలమ్ముకన్న లక్షగుణితంబగు; నియ్యెడ నష్టదిక్కులను నింద్రాది దిక్పాలురు వసింతురు. ఈమీఁదఁ గుంకుమారుణంబగు పద్మరాగప్రాకారంబుగల దయ్యది పదియామడ పొడవుగలిగియుండు. ఇచ్చట భూమియును దత్తత్పదార్థమ్ములును బద్మరాగమణిమయంబులై యొప్పు; నిట గోపురమ్ములును మండపమ్ములును ననేకమ్ములు తనరు; మఱియుఁ బింగళాక్ష్యాదినామప్రసిద్ధచతుష్షష్టికళల కీయది నెల; వక్కళలు, ౧౩౫

క. అనలము గ్రక్కుచు సంద్రము
లను మ్రింగుదుమో జగత్తులను ద్రుంతుమొ సూ
ర్యు నడంతుమొ వాయుస్తం
భన మొనరుతుమో యటంచుఁ బలికెడి నెపుడున్. ౧౩౬

క. ఏకైకాక్షౌహిణి త
మ్మేకాలము చుట్టుఁ గొలువ నేపనియేనిన్
జేకొని యొనరుతు మనుచున్
గేకలు వేసెడిని సమరకేళీరతిమై. ౧౩౭

క. ఒకలక్షబ్రహ్మాండము
లోకత్రుటిలో సమయఁజేయ నొకశక్తియు శ
క్తి కలిగి యొప్పెడి భూపా
లక ! సర్వైశ్వర్యంబు గల్గ లక్ష్యమె యొందున్. ౧౩౮

వ. దీని కవుల గోమేదమణిమయమగు సాలమ్ము గల దయ్యాదియును నౌన్నత్యమ్మున నిట్టిదియ ; భూమ్యాది తత్త్వపదార్థమ్ములును యథాపూర్వమ్మునం దన్మణిమయమ్ములు. మఱియు నీ యెడఁ బిశాచవదనలును యుద్ధోత్సుకలును నిరుపమబలసంపన్నలును నగు విద్యాదిశక్తులు ముప్పదియిరువురు ప్రత్యేకముగఁ బదేసి యక్షౌహిణులు సేనలు గొలువ వసింతురు. ౧౩౯

క. దీనికవుల వజ్రమయ
మ్మై నెగడెడి భిత్తికలను నలరెడి దుర్గం
బానందదాయకంబై
భూనాయక ! పొలుచు వజ్రభూములతోడన్. ౧౪౦

వ. ఔన్నత్యాదికంబు సర్వమును యథాపూర్వంబ; యీ యెడ ననంగ రూపాదిక భువనేశ్వరీ పరిచారికలు కొందఱు ప్రత్యేకంబుగ నొక్కొక్కరి నొక్కొక లక్షచేటికలు గొలువ వసింతురు. ౧౪౧

క. ఈసాలమ్మున కావల
భాసిలు వైడూర్యజాలభాసురమై యొం
తే సొగసగు ప్రాకారము
కాసారములును వనులును గల వయ్యెడలన్. ౧౪౨

వ. ఔన్నత్యాదికంబు యథాపూర్వంబ; యీ యెడ బ్రాహ్మ్యాది మాతృకలు స్వస్వసేనాపరివృతలై జగత్కల్యాణదాయినులై యొలయుదురు. ౧౪౩

గీ. అమరు నయ్యెడ నాల్గు ద్వారములయందు
నేనుఁగులు గుఱ్ఱములును ననేకములగు
వాహనమ్ములు సింగముల్ సాహసమునఁ
బొల్చెడి పదాతులు నగణ్యముగ నృపాల. ౧౪౪

వ. దీని యనంతరమ్మున నింద్రనీలమణిమయమ్మగు ప్రాకారంబుండు
నియ్యదియు యథాపూర్వోన్నత్యాదిభాసురంబ యని యెఱుంగు
నది. ౧౪౫

క. నానాయోజనవిస్తృత
మై నెగడుఁ షోడశారమగు పద్మ మొకం
డానెలవున శక్తులు మఱి
దానఁ బదియాఱుగురు సదా యుండు నృపా. ౧౪౬

వ. ఈ కరాళ్యాదిశక్తులు దేవీసైన్యములు నడుపువారిలో నెల్ల
ముఖ్యమగు వారలు; దీని కవుల ముక్తామయమ్మును దశయోజన
పరిమితమ్మును నగు సాలంబు పూర్వోక్తలక్షణలక్షితంబై
యొప్పు; నీయెడ దేవీసదృశాకారిణులగు ననంగకుసుమాదు
లెనమండ్రు మాతృకలు గలరు. ౧౪౭

క. జ్ఞానవతులు సుందరులు స
దానందలు నెల్లవార్త లరసెడి జాణల్
శ్రీనిధు లనూనభోగని
దానలు తచ్ఛక్తి పొగడఁ దర మేరి కగున్. ౧౪౮

వ. వీర లెల్లపుడు నంబకుఁ బ్రపంచవార్తలఁ దెలుపుచుందు; రిద్దాని
కవుల మరకతసాల మ్మలరు; నియ్యదియుఁ బూర్వోక్తలక్షణ
లక్షితంబ. ఇట షట్కోణయంత్రంబుగల దద్దాన గాయత్రీసావి
త్రులు బ్రహ్మ విష్ణు రుద్రాగ్ని కుబేర వరుణ మదన విఘ్నేశా

దులు స్వపరివార సహితమ్ముగ నా యాకోణమ్ముల నివసింతు రీయెడలన వేదమ్ములును స్మృతులును బురాణమ్ములును మూర్తిమంతమ్ములై వెలింగెడి; నిద్దాని కవ్వల శతయోజనోన్నతమ్మగు ప్రవాళసాలమ్ము వఱలు. నియ్యదియుం దక్కంగల లక్షణమ్ములం బూర్వోక్తసాలతుల్యంబ. ౧౪౯

గీ. అచటం బంచభూతములకు నాధిపత్య
మలరు నొకమైయెదుగురు శక్తు లలరుచుండ్రి
తనరు హృల్లేఖగగనరక్తయుఁ గరాళి
కయు మహోచ్ఛుష్మ యనియు నాఖ్యలు నృపాల. ౧౫౦

వ. వీర లందఱును దేవీతుల్యవేషమ్ములు గలవారు; దీని కవ్వల బహుయోజనవిస్తీర్ణమ్మగు నొకరత్నమహాసాలమ్ము కల; దియ్యదియుఁ బూర్వోక్తలక్షణలక్షితం, బీయెడ నామ్నాయదేవులు వసింతురు.

క. శ్రీదేవ్యవతారమ్ముల
నాదిమహావిద్యలును మహాతేజఃపుం
జాదీప్యమానముగ న
చ్చోఁ దనరారెడు నృపాల! సొంపులగుంపై. ౧౫౨

వ. సప్తకోటిమహామంత్రమ్ము లిటఁ దనర్చు; నీసాలమ్మున కావలఁ జింతామణిగృహమ్ము గల; దిట నుండు వస్తువులన్నియుఁ దన్మయమ్ములుగా నెఱుంగఁదగు. ౧౫౩

క. ఇందూద్గారోపలముల
మందారోద్గారశిలల మఱి విద్యుత్కాం
తిం దన్నెడి ఱాలును జెలు
వొందం దగుఁ గంబము లట నున్నతదీప్తిన్. ౧౫౪

గీ. అదియ దేవీసదనమన నందు వేయి
కంబములఁబొల్చు చెక్కడు కాంతిగలిగి
మండపము లొక్కనాలుగు మఱియు వాని
యందచందములను దెల్ప నలవికాదు. ౧౫౫

వ. అయ్యవి క్రమమ్ముగ శృంగారముక్తిజ్ఞానైకాంతనామమ్ములఁ బ్రసిద్ధమ్ము; లాయామండపమ్ములఁ గాశ్మీరవనమ్ములాదిగ ననేక వనమ్ము లలరు. ౧౫౬

క. ఆయావనముల తావుల
నేయెడలన్ గ్రీడసల్పి యేతెంచెడు య
వ్వాయువుచే నాద్వీపం
బేయెడ గమ్మరను తావి నెసఁగు నృపాలా! ౧౫౭

క. శృంగార మండపమ్మునఁ
బొంగారెడి వేడ్కఁ దామెపుడు దేవు లహో!
సంగీతమ్ములు పాడుదు
రంగీకారమున నంబ యట సభ దీర్పన్. ౧౫౮

గీ. ముక్తిమండపమున నంబ ముక్తి నొసఁగు
జ్ఞానమండపమందు విజ్ఞాన మొసఁగు
నరయ నేకాంతమండపమందుఁ గార్య
తంత్రములు మంత్రిణులు చుట్టుఁ దనరుఁ దనర. ౧౫౯

వ. మఱియు నియ్యెడ శక్తి తత్త్వాత్మకమ్ములగు పదితొట్లుగల వద్దాన బ్రహ్మయు విష్ణుండును రుద్రుండును ఖురమ్ములై సదాశివుండు పలకయునై యొప్పుదురు. దీనిపైఁ గోటికందర్పసుందరుం డగు భువనేశుండు షోడశహాయనుండు మహాదేవుండు విలసిల్లు.

క. ఆయనఘు వామసక్థి
స్థాయినియై పొల్చు నంబ సంతతభూషా
శ్రీయుతయై వర్ణింపఁగ
నే యయ్యల కేనిఁగాని యెసకంబెసఁగన్. ౧౬౧

క. చెలికత్తియ లెందఱో తన్
గొలువఁగ నిచ్ఛాదిశక్తికూటసహితయై
వెలలేని విలాసమ్ముల
నలరు జగన్నేత్రిఁ బొగడు నట్టిరు గలరే! ౧౬౨

వ. మఱియు లజ్జాది పీఠశక్తులును, శంఖాది నిధులును నయ్యంబి
కకు సన్నిధియం దలరెడి. ౧౬౩

క. ఆనిధులవలనఁ బొడమి మ
హానదు లొకవేఁడు కలియు నమృతాబ్ధిని నా
యా నదులు కాంచనమ్మును
నీరున్ రతనముల నెల్లయెడ నరనాథా. ౧౬౪

గీ. ఆగృహమ్మున నద్దేవి నంతికమున
వామభాగమ్మునం దిట్లు వఱలు నంబ
యతఁడు సర్వేశుఁడగుట కీసతియ చుమ్ము
కారణం బొండు లేదు నిక్కముగ వినుము. ౧౬౫

వ. ఈ గృహమ్ము సహస్రయోజనాయామమ్ముగలిగి యంతరిక్ష
మ్మున నిరాధారమ్ముగనుండు; నిద్దానికిఁ బ్రళయమ్మున సంకో
చమ్మును సర్గమ్మున వికాసమ్మును గలుగుచుండు. ౧౬౬

క. మనుజుల దనుజుల నాగుల
ననిమిషులం దెవ్వ రెవ్వ రధికోపాస్తిన్

మును సలిపి సిద్ధిగాంచిరో
యనఘులు వారిచట నుందు రారీతి దగన్. ౧౬౭

క. ఘృతకుల్యాలు, మధుకుల్యాలు
సతతము దధికుల్యాలును బ్రశస్తగతి నటన్
శతములకొలఁదిగఁ బాలు న
మృతకుల్యాలు నొక్కఁడే లనేకములుండన్. ౧౬

క. సక్షోరికఁ గోరిన నిడు
లోకాతీతమగు తరువులున్ గల వెపుడున్
శోకము రోగము జరయును
నాకమునందేని గలుగు నట లేవు నృపా. ౧౬౯

క. అందఱు యౌవనవంతులు
నందఱు కాంతాసమేతు లందఱు మిగులన్
సుందరులు నచటఁగలవా
రిం దరమే యెన్న నెంత కృతిపతి కేనిన్. ౧౭౦

వ. కొందఱు సాలోక్యముక్తులును, గొందఱు సామీప్యముక్తులును, గొందఱు సారూప్యముక్తులును, గొందఱు సాయుజ్యముక్తులును నై యుందురని వెండియు, ౧౭౧

గీ. మూర్తిమంతమ్ములగుచు నెప్పుడును సప్త
కోటిమంత్రమ్ము లగ్గుణపేటి నంబ
నుతులు సల్పుచునుండు నున్నతుల కతుల
గతులు గల్గు నెయ్యాని తగుగతి జపింప. ౧౭౨

గీ. ఇది మణిద్వీప వర్ణన మెవ్వఁడేని
దీని స్మరియింపఁ బాపముల్ మానుఁ బ్రాణ

మొదలునెడ స్మృతికిఁ దగుల నిది గతియగు
సకలశుభములు నిద్దాన సంభవించు. ౧౭౩

వ. ఈమణిద్వీపవర్ణనమ్మును నిత్యమ్ము పఠింపనగు; విశేషించి యియ్యది నూతనగృహనిర్మాణమ్ములఁ బఠించిన నట వసించు వారలకు భూతాది బాధలు దగులక కల్యాణసమృద్ధి సులభం బగునని వెండియు, ౧౭౪

—* జనమేజయుఁ డంబామఖ మాచరించుట *—

క. నారాయణముని మున్నల
నారదునకుఁ జెప్పెనిట్లు నరనాయక! యీ
ధోరణి వచించితిని నీ
కారయ ధన్యుండవైతి వఖిలవిధములన్.   ౧౭౫

క. అంబామఖమొనరించి సు
ఖంబున్ నీ జనకున కిఁకఁ గావింపుము సా
రంబైన యంబికామం
త్రంబుం గొను మిచ్చెదను యథావిధిగ నృపా!   ౧౭౬

క. అని యాతఁ డొసఁగు మంత్రం
బును దీక్షాపూర్వకముగ భూపతి గొని ధౌ
మ్యుని నన్యులైన మునులను
బనిగొని పిలిపించి మఖము ప్రారంభించెన్.   ౧౭౭

క. నవరాత్రకాల మందిటు
లవనీసురవరులు జపము నదిగా కీ భా
గవతము పఠియింపఁగ నై
భవమున మఖ మాచరించె భాగ్యాన్వితుఁడై   ౧౭౮

క. ఎందఱు నేనియు బ్రాహ్మణు
లం దనియించెన్ మఖమున లక్షల కొలఁదిన్
విందులగు దక్షిణల నిడి
యుం దగుగతి భోజన మిడియుం దత్పరుఁడై. ౧౭౯

గీ. అంత నారదుఁ డరుదెంచి యధిపుచే స
మర్చితుండయి వలుకు నోమానవేంద్ర!
నరకగతుఁడైన నీతండ్రి సురలుగొలువఁ
జనె మణిద్వీప మంబికాసదనమునకు. ౧౮౦

క. కృతకృత్యుఁడవై తివి నీ
కతనఁ గులంబెల్ల సుకృతఖని యయ్యె యశ
మ్ము తతంబై స్వర్గమ్మునఁ
బ్రతిలేని వికాసమునకు భాజనమయ్యెన్. ౧౮౧

గీ. అనెడి నారదు వచనమ్ము లాలకించి
వ్యాసు పదములఁ బడి గద్గదారవముగఁ
బలికె జనమేజయుండు నీవలన నింత
సుకృత మలవడెఁ దండ్రి సుగతికిఁ జనియె. ౧౮౨

క. సతియొకటి దక్కఁ బ్రత్యుప
కృతి నే నేమాచరింతుఁ గృపఁజూడుఁమటం
చతివినయమ్మున వేఁడు నృ
పతికిన్ వ్యాసుండు వల్కు బహుకృపమెసఁగన్. ౧౮౩

క. విను మంబామఖ మెల్లపు
డొనరింపుము దేవిగొలువు మొండొకచింతన్
గన కీభాగవతమ్మున
మనమిడు మిది సర్వలోకమాన్యం బధిపా! ౧౮౪

శూద్రులు మాత్ర మిది పఠింపక ద్విజముఖమ్మున వినుట లగ్గగు;
నిది వేదసారమ్మును బుణ్యమ్మునునగు పురాణంబు. ౧౯౫

గీ. సచ్చిదానందరూపిణి సకలజనని
హ్రీంమయి మహానుభావ లోకేశి యఖిల
శుభవిధాయిని బుద్ధిప్రచోదనకరి
నాశ్రయింతు నుతింతు నే నహరహంబు. ౧౯౬

క. అని సూతుఁడు చెప్పిన విని
మును లెల్ల రతని విశేషముగఁ బూజలచేఁ
దనియించి నతులు సల్పియు
వినయం బలరార నిట్లు వినుతించి రొగిన్. ౧౯౭

క. ధీరుఁడవై సంసృతియను
వారిధికిం దెప్పవై శివప్రదుఁడవునై
సారంబగు భాగవతం
బారసి వినిపించితివి కృతార్థత గలిగెన్. ౧౯౮

క. అను మునుల యాదరమ్మునఁ
దనిసి చనియె సూతుఁ డంబఁ దన హృదయమునం
దనుపదముం దలఁచుచు; నిది
వినినన్ సుఖమబ్బుఁ గడు వివేకము గలుగున్. ౧౯౯

క. నిరుపమసాహిత్యరసా
భరణా! దోషజ్ఞమౌళివందితచరణా!
శరణాగతశిష్యజనో
ద్ధరణైకవిలాసలోల! ధార్మికశీలా!

ఇంద్రవజ్రా. ధీరాగ్రగణ్యార్చితధీవిలాసా !
వారాశిగంభీర ! కృపాప్రచారా !
శ్రీరాజితోర్వీధవశీర్ష రోచి
ర్నీరాజితాంఘ్రిద్వయ ! నిర్వికారా !

క. అసదృశశర్వాణీపద
కిసలయభసలాయితాత్మ ! కిల్బిషహరణ
ప్రసితానవద్యవర్తన !
కుసుమితసంతోష ! బ్రహ్మగురుపరమేశా !

ఇది శ్రీకింకవీంద్రఘటాపంచానన విద్వత్కవి బాలకలానిధి బాలసరస్వతీత్యాది బిరుదాంకితులగు శ్రీతిరుపతి వేంకటేశ్వరులచే రచింపబడిన శ్రీదేవీభాగవతమను మహాపురాణమ్మునందు ద్వాదశస్కంధము సర్వమును సమాప్తము.

సమస్త సన్మంగళాని భవంతు.

శ్రీ. శ్రీ. శ్రీ.

శుద్ధపత్రిక

పుట	పంక్తి	తప్పు	ఒప్పు
22	9	యిందుఁ	యిందు
34	5	యటంచు	యటంచుఁ
42	3	వర్థి	వర్ధి
59	7	విథి	విధి
74	15	దానపుత్రు	దా నపుత్రు
77	3	పార్శ	పార్శ్వ
106	18	ఫూర్ణం	ఘూర్ణం
253	18	శిష్యా !	శిష్యా
256	23	పాధ్వ	సాధ్వ
257	22	భైష	భైషి
260	20	యలరారుఁ	యలరారు
281	21	తీర్థసేవయుఁ	తీర్థసేవ
285	21	స్వాఁక	సాక
287	5	ఘృతస్తిక	ఘృతసిక్త
290	22	నానాసి	నానావిక
292	14	ర్వ్యామ్బ	ర్వ్యామ్బి
295	7	వేడెను	వేఁడెను
308	21	పొల్చు	బొల్చు
332	1	౪౦౪ !	౪౦౪ ;
348	5	తాకు	తాపా
348	9	పడఁతుక	బడఁతుక

348	17	పురు	బురు
350	23	గౌద	గౌదఁ
350	24	తరు	దరు
365	6	జుట్టైన్	ఁజుట్టైన్
368	1	క్ర్యారుండు దుఁ	క్ర్యారుండు దు
375	6	రకాళిక	రఁగాళిక
395	4	తబలుకు	తపలుకు
399	19	గోష్టి	గోష్ఠి
405	18	ద్వత్	ద్వద్
409	10	దేవి	దేవిఁ
409	11	పరి	బరి
419	20	ల కర్మ	లఁ గర్మ
425	15	నర	రన
442	5	పాప	బాప
443	23	సూక్పు	సూక్తు
476	9	వత్రి	వ్రిత
503	23	తర్ధ	తదర్ధ
550	13	మూకుట	మకుట

ఇంకను, ధ, థ; ఱ, ర; వ్యత్యయములు పడి యుండవచ్చును.

దేవీభాగవతము పూర్వార్ధమున 300 పుటలో రెండవ పంక్తిలో లోకైకాగ్రిణ్యుఁడు అనుచోట లోకైకగ్రామణి అని సవరించుకోవలెను.